# ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వము మరియు రాజకీయాలు

**బి.ఏ. రాజనీతి శాస్త్రము, మూడవ సంవత్సరము, పేపరు - 4 (సి)**


**రచయితలు**

**ఆచార్య ఐ. దోసగిరిరావు**
రాజనీతి మరియు ప్రభుత్వ పాలనాశాస్త్ర విభాగము
ఏ.యు.యం.యస్.యన్. పి.జి. సెంటర్, కాకినాడ

**డా॥ యం. పాండురంగారావు**
ఉపన్యాసకులు, రాజనీతిశాస్త్ర విభాగము (పి.జి.)
సర్. సి.ఆర్.ఆర్. కళాశాల, ఏలూరు

**డా॥ బి.వి. బాలకృష్ణ**
ఉపన్యాసకులు, రాజనీతిశాస్త్ర విభాగము,
సర్. సి.ఆర్.ఆర్. కళాశాల, ఏలూరు

**డా॥ యం.వి.యస్. కోటేశ్వరరావు**
అసోసియేట్ ప్రొఫెసర్
రాజనీతిశాస్త్రము మరియు ప్రభుత్వ పాలనా శాస్త్ర విభాగం
ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం

**డా॥ పి.వి.వి. సుబ్రహ్మణ్యం**
రాజనీతి మరియు ప్రభుత్వపాలనాశాస్త్ర విభాగము
ఎ.యు.యం.యస్.యన్. పి.జి. సెంటర్, తిమ్మాపురం, కాకినాడ

**డా॥ బి. ఉదయ ప్రకాష్**
అసోసియేట్ ప్రొఫెసర్
హిందూ కళాశాల (పి.జి.), అమరావతి రోడ్, గుంటూరు

**డా॥ ఎ. వెంకటరావు**
అసోసియేట్ ప్రొఫెసర్, రాజనీతి మరియు ప్రభుత్వ పాలనాశాస్త్ర విభాగము
ఏ.యు.యం.యస్.యన్. పి.జి. సెంటర్, కాకినాడ

**డా॥ కె. రామచంద్రమూర్తి**
రీడరు, రాజనీతి శాస్త్ర విభాగము (పి.జి.)
సర్. సి.ఆర్.ఆర్. కళాశాల, ఏలూరు

**డా॥ డి. వెంకటేశ్వరరావు**
ఉపన్యాసకులు,
ప్రభుత్వ పాలనాశాస్త్ర విభాగము (పి.జి.)
శ్రీ వై.యన్. కళాశాల, నర్సాపూర్

సంపాదకులు

**ఆచార్య ఐ. దోసగిరిరావు**
రాజనీతి మరియు ప్రభుత్వ పాలనాశాస్త్ర విభాగము, ఏ.యు.యం.యస్.యన్. పి.జి. సెంటర్, కాకినాడ

సమన్వయకర్త :

**డా. యం. రవిశేఖర్**, ఎం.ఎ.,యల్.యల్.బి.పిహెచ్.డి
రాజనీతి శాస్త్రము మరియు ప్రభుత్వపాలనా శాస్త్ర విభాగము, ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయము

**డైరెక్టరు**

**ఆచార్య పి. వరప్రసాదమూర్తి**
M.A., Sahitya Acharya, Visarada (Hindi), Vidya Varidhi (Ph.D.)



**దూరవిద్యా కేంద్రము**

ఆచార్య నాగార్జున విశ్వ విద్యాలయం, నాగార్జున నగర్
Ph: 0863-2293299, 2293356, 08645-211023, Cell:98482 855
08645 - 211024 ( Study Material )
Website : www.anucde.ac.in or www.anucde.info
e-mail : info@ anucde.ac.in

B.A. Government and Politics of A.P.

First Edition : 2005

Second Edition : 2006

Third Editon : 2007

Fourth Edition : 2010

**Fifth Edition : 2019**
**Copies : 1500**

**(C) Acharya Nagarjuna University**

This book is exclusively prepared for the use of students of Centre for Distance Education, Acharya Nagarjuna University and this book is meant for limited circulation only.

*Published by*
**Prof. P. Varaprasada Murthy**
*Director,*
Centre for Distance Education,
Acharya Nagarjuna University

*Printed at :*
**Don Bosco Technical School Press**, Guntur-7, Ph : 2350832

# ముందుమాట

ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం 1976లో స్థాపించినది మొదలు నేటి వరకు ప్రగతి పథంలో పయనిస్తూ వివిధ కోర్సులు, పరిశోధనలు అందిస్తూ 2016 నాటికి NAAC చే A గ్రేడును సంపాదించుకొని దేశంలోనే ఒక ప్రముఖ విశ్వవిద్యాలయంగా గుర్తింపు సాధించుకొన్నదని తెలియజేయటానికి సంతోషిస్తున్నాను. ప్రస్తుతం గుంటూరు, ప్రకాశం జిల్లాలోని 447 అనుబంధ కళాశాలల విద్యార్థులకు డిగ్రీ, పి.జి. స్థాయి విద్యాబోధనను ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం అందిస్తోంది.

ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం ఉన్నత విద్యను అందరికి అందించాలన్న లక్ష్యంతో 2003-04లో దూర విద్యా కేంద్రాన్ని స్థాపించింది. పూర్తి స్థాయిలో కళాశాలకు వెళ్ళి విద్యనభ్యసించలేనివారికి, వ్యయ భరితమైన ఫీజులు చెల్లించలేని వారికి, ఉన్నత విద్య చదవాలన్న కోరికవున్న గృహిణులకు ఈ దూర కేంద్రం ఎంతో ఉపయోగపడుతుంది. ఇప్పటికే డిగ్రీ స్థాయిలో బి.ఏ., బి.కాం., బి.ఎస్.సి., పి.జి. స్థాయిలో ఎం.ఏ., ఎం.కాం., ఎం.ఎస్.సి., ఎం.బి.ఏ., ఎల్.ఎల్.యమ్ కోర్సులను ప్రారంభించిన విశ్వవిద్యాలయం ఈ సంవత్సరం కొత్తగా 'జీవన నైపుణ్యాలు' అనే సర్టిఫికేట్ కోర్సును కూడా ప్రారంభించింది.

ఈ దూర విద్యా విధానం ద్వారా విద్యనభ్యసించే విద్యార్థుల కొరకు రూపొందించే పాఠ్యాంశాలు, సులభంగాను, సరళంగాను, విద్యార్థి తనంతట తానుగా అర్థం చేసుకొనేలా ఉండాలనే ఉద్దేశ్యంతో విశేష బోధనానుభవం కలిగి రచనా వ్యాసంగంలో అనుభవంగల అధ్యాపకులతో పాఠ్యాంశాలను వ్రాయించడం జరిగింది. వీరు ఎంతో నేర్పుతో, నైపుణ్యంతో, నిర్ణీత సమయంలో పాఠ్యాంశాలను తయారుచేశారు. ఈ పాఠ్యాంశాలపై విద్యార్థినీ విద్యార్థులు, ఉపాధ్యాయులు నిష్ణాతులైన వారు ఇచ్చే సలహాలు, సూచనలు సహృదయంతో స్వీకరించబడతాయి. నిర్మాణాత్మకమైన సూచనలను గ్రహించి మున్ముందు మరింత నిర్దిష్టంగా, అర్థమయ్యే రీతిలో ప్రచురణ చేయగలం. ఈ పాఠ్యాంశాల అవగాహన కోసం, సంశయాల నివృత్తి కోసం వారాంతపు తరగతులు, కాంటాక్టు క్లాసులు ఏర్పాటు చేయటం జరిగింది.

దూర విద్యా కేంద్రం ద్వారా విజ్ఞాన సముపార్జన చేస్తున్న విద్యార్థులు, ఉన్నత విద్యార్హతలు సంపాదించి జీవనయాత్ర సుగమం చేసుకోవడమేగాక, చక్కటి ఉద్యోగావకాశాలు పొంది, ఉద్యోగాలలో ఉన్నత స్థాయికి చేరాలని, తద్వారా దేశ పురోగతికి దోహదపడాలని కోరుకుంటున్నాను. రాబోయే సంవత్సరాలలో దూర విద్యా కేంద్రం మరిన్ని కొత్త కోర్సులతో దిన దినాభివృద్ధి చెంది ప్రజలందరికి అందుబాటులో ఉండాలని ఆకాంక్షిస్తున్నాను. ఈ ఆశయసాధనకు సహకరిస్తున్న, సహకరించిన దూర విద్యా కేంద్రం డైరెక్టర్లకు, సంపాదకులకు, రచయితలకు, ఎకడమిక్ కోఆర్డినేటర్లకు, ఎకడమిక్ కౌన్సిలర్లకు మరియు అధ్యాపకేతర సిబ్బందికి నా అభినందనలు.

**ఆచార్య కూన రామ్‌జీ**
I/c కులపతి
ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం

B.A. Public Administration

## Paper - IV C : Government and Politics of A.P.

### Syllabus

1. Indian Federation : Constitutional position of the State
2. Political History of the State since Independence, formation of the State of A.P., Socio economic frame work.
3. State Executive : Position of the Governor, Council of Ministries, Chief Minister and his relation with Ministers.
4. State Legislature : Committee system, changing role of Legislature.
5. State Judiciary : Organization, powers and functions
6. Political parties : National, Regional
7. Pressre groups
8. Political Participation : Elections and voting behaviour
9. Regionalism & Telangana and Andhra Agitations
10. Panchayat Raj System : Amis and objectives-Structure-Functions, critical estimation.
11. Peasant and Tribal Movement in A.P.

Note : As per the guidelines of the Common Core Committee for Political Science, the Colleges must compulsorily offer teaching in the paper "Public Administration Concepts and Theories" for study as paper IV in III BA Political science for the students who do not have Public Administration as one of the group subjects.

# విషయ సూచిక


| | | |
|---|---|---|
| 1. | భారత సమాఖ్య : రాష్ట్ర రాజ్యాంగ విహిత స్థాయి | 1.1 - 1.8 |
| 2. | ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అవతరణ - సామాజిక, ఆర్థిక నేపధ్యం | 2.1 - 2.10 |
| 3. | రాష్ట్ర కార్యనిర్వాహక శాఖ - గవర్నరు | 3.1 - 3.11 |
| 4. | రాష్ట్ర ముఖ్యమంత్రి మరియు మంత్రి మండలి | 4.1 - 4.11 |
| 5. | ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర శాసనసభ - విధాన పరిషత్ | 5.1 - 5.8 |
| 6. | విధాన సభ - మారుతున్న శాసనసభ పాత్ర | 6.1 - 6.12 |
| 7. | కమిటీ వ్యవస్థ | 7.1 - 7.11 |
| 8. | రాష్ట్ర న్యాయవ్యవస్థ | 8.1 - 8.9 |
| 9. | రాజకీయ పార్టీలు | 9.1 - 9.12 |
| 10. | కులం - రాజకీయ నాయకత్వం | 10.1 - 10.7 |
| 11. | ప్రభావ వర్గాలు | 11.1 - 11.8 |
| 12. | రాజకీయ భాగస్వామ్యం, ఎన్నికలు మరియు ఓటింగ్ ప్రవర్తన | 12.1 - 12.14 |
| 13. | ప్రాంతీయ వాదం : తెలంగాణా ఉద్యమం | 13.1 - 13.13 |
| 14. | ఆంధ్ర ఉద్యమం | 14.1 - 14.7 |
| 15. | ఆంధ్రప్రదేశ్‌లో పంచాయితీరాజ్ సంస్థలు | 15.1 - 15.10 |
| 16. | ఆంధ్రప్రదేశ్ పంచాయితీరాజ్ వ్యవస్థలో వచ్చిన మార్పులు | 16.1 - 16.11 |
| 17 | ఆంధ్రప్రదేశ్‌లో రైతాంగ మరియు ఇతర నిరసనోద్యమాలు | 17.1 - 1713 |

పాఠం - 1

# భారత సమాఖ్య : రాష్ట్ర రాజ్యాంగ విహిత స్థాయి

## 1.0 లక్ష్యం

భారత సమాఖ్య బలమైన కేంద్రప్రభుత్వాన్ని ఏర్పరచింది. సాధారణ పరిస్థితుల్లో రాష్ట్ర ప్రభుత్వం రాజ్యాంగం సంక్రమింపచేసిన అధికారాలకు విధులను నిర్వహిస్తుంది. కొన్ని ప్రత్యేక పరిస్థితులలో కేంద్రప్రభుత్వం రాష్ట్రపాలనా వ్యవహారాలపై అధికారాన్ని చెలాయిస్తుంది. ఇది రాష్ట్ర ప్రభుత్వ పనితీరును, సమర్థతను ప్రభావితం చేస్తుంది. పాల్‌బ్రాస్ పేర్కొన్నట్లు, కొంతమంది విశ్లేషకులు భారతసమాఖ్యలోరాష్ట్రాల స్వయంప్రతిపత్తి రోజురోజుకు తగ్గిపోతుందని, రాష్ట్రాలపై కేంద్రం పెత్తనం పెరిగిపోతోందని భావించగా, మరి కొంతమంది దీనికి భిన్నంగా భారతసమాఖ్యలో రాష్ట్రస్వయంప్రతిపత్తి అనేది స్పష్టంగా కనపడే విషయం అని పేర్కొన్నారు. ఈ కారణంగా భారతసమాఖ్యలో రాష్ట్ర రాజ్యాంగ విహిత స్థాయి పరిశీలనకు అత్యంత ప్రాధాన్యత ఉంది. కాబట్టి భారతసమాఖ్యలో రాష్ట్రాల రాజ్యాంగవిహిత స్థాయిని, వాటి స్వయంప్రతిపత్తికి గల అవకాశాన్ని వివరించటం ఈ పాఠం యొక్క లక్ష్యం

**విషయసూచిక:**


1.1 భారత సమాఖ్య: రాష్ట్రరాజ్యాంగవిహిత స్థాయి - పరిచయం

1.2 భారత సమాఖ్య - పూర్వరంగం

1.3 భారత సమాఖ్య - రాష్ట్రాల సంయోగం/ యూనియన్

1.4 భారతసమాఖ్య లక్షణాలు

- 1.4.1 రెండు ప్రభుత్వ స్థాయిలు
- 1.4.2 లిఖిత రాజ్యాంగం
- 1.4.3 అధికారాల విభజన
- 1.4.4 స్వతంత్ర న్యాయశాఖ
- 1.4.5 రెండు శాసన సభలు

1.5 భారత సమాఖ్య విశిష్టత

- 1.5.1 శక్తివంతమైన కేంద్ర ప్రభుత్వం
- 1.5.2 కేంద్ర శాసన నియంత్రణ అధికారం
- 1.5.3 అఖిల భారత సర్వీసులు
- 1.5.4 కేంద్రం ఆదేశాలు
- 1.5.5 వీటో అధికారం
- 1.5.6 రాష్ట్ర గవర్నర్లు: కేంద్ర అధికారం
- 1.5.7 జాతీయ అత్యవసర పరిస్థితి

1.5.8 రాష్ట్రపతి పాలన
1.5.9 రాష్ట్రాల గుర్తింపు
1.6 భారత సమాఖ్య : ప్రాంతీయతత్వం
1.7 భారత సమాఖ్య : బహుపార్టీ వ్యవస్థ
1.8 భారత సమాఖ్య : అంతర్గత ప్రయోగాలు
1.9 రాష్ట్రస్థాయి
1.10 సారాంశం
1.11 నమూనా ప్రశ్నలు
1.12 చదువదగిన గ్రంథాలు

## 1.1 భారతసమాఖ్య - పరిచయం:

భారతరాజ్యాంగం భారతదేశాన్ని ఒక సమాఖ్య రాజ్యంగా రూపొందించింది. ఈ సమాఖ్యదేశాన్ని వివిధరాష్ట్రాలుగా విభజించటం ద్వారా ఏర్పాటు చేయబడింది. ఇది రాజ్యాంగ నిర్మాతల నిశితదృష్టికి ప్రతిఫలంగా రూపొంది, సమకాలీన పరిస్థితులకు అనుగుణంగా పరిణిత చెందుతున్న వ్యవస్థ. వాస్తవానికి, భారతసమాఖ్య అమెరికా సంయుక్త రాష్ట్రాలు, స్విట్జర్లాండ్, ఆస్ట్రేలియా వంటి సాంప్రదాయక సమాఖ్యలకు భిన్నంగా ఉంటుంది. కేంద్ర, రాష్ట్రప్రభుత్వాలు ఒకే భారతరాజ్యాంగ నిర్మాణ పరిధిలో పని చేస్తాయి.

రాజ్యాంగం మొదటి నిబంధన భారతదేశాన్ని 'రాష్ట్రాల సంయోగం' (Union of States) అని పేర్కొంది. కేంద్ర, రాష్ట్రాలకు అధికార పరిధులను నిర్దేశించింది. జమ్మూ- కాశ్మీర్ రాష్ట్రాన్ని మినహాయిస్తే, అన్ని రాష్ట్రాలకు ఒకేవిధమైన నిర్మాణాన్ని (Structure), విధి (Function) విధానాలను రాజ్యాంగ చట్రం సమకూ ర్చింది. దానిలో బలమైన కేంద్రప్రభుత్వం రాష్ట్రప్రభుత్వాలతో సంధానించబడింది. రాష్ట్రాల ప్రయోజనాలకు భంగం కలగకుండా బలమెన కేంద్రప్రభుత్వం రాష్ట్రప్రభుత్వాలతో సంధానించబడింది. రాష్ట్రాల ప్రయోజనాలకు భంగం కలగకుండా బలమైనా కేంద్రప్రభుత్వాన్ని కలిగి ఉండటం భారతసమాఖ్య విశిష్టత. ఇది అత్యవసర పరిస్థితుల్లో ఏక కేంద్ర వ్యవస్థగాను, సాధారణ పరిస్థితుల్లో సమాఖ్యవ్యవస్థగాను వ్యవహరిస్తుంది. ఈ కారణంగా భారతసమాఖ్యను ప్రముఖ విశ్లేషకులు వివిధ సంధర్భాలలో, ఆయా సందర్భాన్ని బట్టి ' అర్ధసమాఖ్య', "మితిమీరిన సమాఖ్య" " బేరసారాల సమఖ్య" బలమైన కేంద్రీకృత ధోరణిగల సమాఖ్య", సహకార సమాఖ్య" గా పేర్కొన్నారు.

## 1.2 భారతసమాఖ్య - పూర్వరంగం:

1935 భారత ప్రభుత్వ చట్టం ద్వారా బ్రిటిష్ ప్రభుత్వం భారతదేశంలో సమాఖ్య ప్రభుత్వాన్ని ఏర్పాటుచేసే ప్రయత్నం చేసింది. ఆగష్టు 15, 1947న స్వాతంత్రం సిద్ధంచిన తర్వాత సుమారు 600 సంస్థానాలను భారతదేశంలో విలీనం చేసి ఆ పిదప వాటిని రాష్ట్రాలుగా వ్యవస్థీకరించడం జరిగింది. ఈ విధంగా భారత సమాఖ్య ఏర్పడింది. 26 జనవరి 1950 నుంచి అమలులోనికి వచ్చిన భారతరాజ్యాంగం సమాఖ్యవ్యవస్థను ఏర్పాటు చేసింది.

## 1.3 భారతసమాఖ్య - రాష్ట్రాల యూనియన్:

భారతరాజ్య వ్యవస్థను సలక్షణమైన పద్ధతిలో సమాఖ్య అని చెప్పటానికి అన్ని అర్హతలు ఉన్నప్పటికి, రాజ్యాంగంలోని 365 నిబంధనలతో ఎక్కడా సమాఖ్య అనే పదప్రయోగం జరగలేదు. భారతదేశం "రాష్ట్రాల యూనియన్" ( Union of States) అనే పదసముచ్ఛయం వాడటం జరిగింది. దీని ప్రయోజనమేమంటే అమెరికా, స్విట్జర్లాండ్, రష్యాలలో వలె భారతదేశంలో గల రాష్ట్రాలు సమాఖ్యనుంచి విడిపోయి స్వతంత్రం కావటాన్ని రాజ్యాంగం అనుమతించదు.

భారతదేశంలో కులపరంగా, మతపరంగా, భాషాపరంగా, ఆచారాలపరంగా, సాంప్రదాయాలపరంగా అనేక భిన్నత్వాలున్నాయి. కాబట్టి దేశ దీర్ఘకాల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకొని రాజ్యాంగ నిర్మాతలు భారతసమాఖ్యలో కేంద్ర ప్రభుత్వానికి రాష్ట్రప్రభుత్వాలపై కొన్ని సందర్భాలలో ఆధిక్యతను కల్పించారు. ఈ కారణంగానే సమాఖ్య అనే పదాన్ని కాక యూనియన్ (సంయోగం) అనే మాటను ఉపయోగించి తద్వారా సమాఖ్యప్రభుత్వానికి ఆధారమయిన సూత్రాలను రాజ్యాంగం ద్వారా ఏర్పరచి, కేంద్రప్రభుత్వానికి ప్రత్యేక అధికారాలను కల్పించి అవసరమైనప్పుడు ఏక కేంద్ర వ్యవస్థగా మార్చడానికి ప్రయత్నించారు.

రాజ్యాంగ నిర్మాణసభలో డా॥ అంబేద్కర్ భారతరాజ్యాంగ నిర్మాణం సమాఖ్యతో పోలి ఉన్నప్పటికి 'యూనియన్' అనే పదాన్ని కొన్ని ప్రయోజనాల దృష్ట్యా వాడటం జరిగిందని పేర్కొన్నారు. ఈ ప్రయోజనాలు ముఖ్యంగా రెండు . అవి

1. భారతయునియన్ రాష్ట్రాల ఒప్పందం ద్వారా ఏర్పడిందికాదు.
2. భారతయూనియన్ లోని రాష్ట్రాలకు విడిపోయే స్వాతంత్ర్యం లేదు.

## 1.4 భారతసమాఖ్య లక్షణాలు

భారత రాజ్యవ్యవస్థను ఏర్పాటు చేసిన రాజ్యాంగం సమాఖ్య అనే పదాన్ని ఉపయోగించకపోయినప్పటికి ఒక సమాఖ్యగానే గుర్తింపు పొందింది. అది ఈ క్రింది సమాఖ్య లక్షణాలను కలిగి ఉంది.

**1.4.1 రెండు ప్రభుత్వస్థాయిలు :** భారతసమాఖ్య వ్యవస్థలో తమతమ కార్యనిర్వహణరంగాల్లో స్వయంప్రతిపత్తికల రెండు ప్రభుత్వ స్థాయిలున్నాయి. ఈ రెండు స్థాయిల మధ్య అధికారాలను, విధులను రాజ్యాంగబద్ధంగా పంపిణి చేయడమైంది. దేశభద్రత, విదేశీవ్యవహారాలు, కరెన్సీ, కమ్యూనికేషన్స్ వంటి జాతీయ ప్రాముఖ్యత కల్గిన అంశాలు కేంద్ర ప్రభుత్వానికి చెందుతాయి. ప్రాంతీయ లేదా స్థానిక ప్రాముఖ్యత కల్గిన ప్రజారక్షణ, వ్యవసాయం, ఆరోగ్యం వంటి అంశాలు రాష్ట్రప్రభుత్వానికి చెందుతాయి.

**1.4.2 లిఖిత రాజ్యాంగం :** భారతసమాఖ్య వ్యవస్థకు ప్రాతిపదిక లిఖిత రాజ్యాంగం. భారత రాజ్యాంగం కేంద్ర, రాష్ట్రప్రభుత్వాల అధికారాలు, వ్యవస్థీకరణ నిర్మాణం, విధులను విపులంగా నిర్వచించింది. వాటి అధికార పరిధుల్లో అవి పనిచేసేలా నియంత్రిస్తుంది. భారతలిఖిత రాజ్యాంగంలో ప్రస్తావన (Preamble), 395 నిబంధనలు, 22 భాగాలు 12 షెడ్యూల్సు ఉన్నాయి. ఇది కేంద్ర, రాష్ట్రపరిధులను, పరిమితులను స్పష్టంగా పేర్కొంటుంది. లిఖిత రాజ్యాంగపరిధికి లోబడి కేంద్ర, రాష్ట్రప్రభుత్వ వ్యవస్థలు పని చేయవలసి ఉంది.

**1.4.3 అధికారాల విభజన:** కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల అధికారాలను రాజ్యాంగం వివరించింది. శాసన, కార్యనిర్వహణ రంగాల్లో రెండు ప్రభుత్వాలు స్వయం పాలక వ్యవస్థలుగా ఉండే విధంగా ఈ అధికారవిభజన చేయబడింది. కేంద్ర ప్రభుత్వానికి 97 అంశాలమీద అధికార పరిధిఉంటుంది. కచ్చితంగా చెప్పాలంటే 96 అంశాలు మాత్రమే ఉన్నాయి. ఆయా జాబితాల్లో దేనిలోను పేర్కొనని అంటే జాబితా II లేదా జాబితా III లో పేర్కొనని ఏదయినా ఇతరవిషయం అనేది 97వ అంశంగా ఉంటుంది. వాస్తవానికి ఇది అవశిష్టాదికారం.

రాష్ట్రజాబితాలో 66 అంశాలుంటాయి. ఇవి రాష్ట్రశాసన సభల ప్రత్యేక శాసనాత్మక అధికార పరిధికి లోబడి ఉంటాయి. ఇవి ప్రాంతీయంగా ప్రాముఖ్యంగల అంశాలు ఇందులో ప్రజాఉత్తర్వులు, పోలీసు, ప్రజారోగ్యం వంటి అంశాలుంటాయి.

ఈ రెండు జాబితాలతో పాటు మరొక ఉమ్మడి జాబిత కూడా ఉంది. ఇందులో 47 అంశాలుంటాయి. ఈ అంశాలమీద కేంద్రప్రభుత్వ ఆధిపత్యానికి లోబడి కేంద్ర, రాష్ట్రప్రభుత్వాలకు ఉమ్మడి అధికారపరిధి ఉంటుంది. అవశిష్టాదికారాలు మాత్రం కేంద్రప్రభుత్వ పరిధిలో ఉంటాయి.

**1.4.4 స్వతంత్ర న్యాయశాఖ :** స్వతంత్ర న్యాయశాఖను కలిగి ఉండటం భారతసమాఖ్య ప్రధాన లక్షణం. సుప్రీంకోర్టు దేశంలో అత్యున్నత న్యాయస్థానం. ఇది రాజ్యాంగానికి సంరక్షకుడిగా వ్యవహరిస్తుంది. కేంద్ర, రాష్ట్రప్రభుత్వాలు చేసిన ఏదైన చట్టం గాని, శాసనంగాని రాజ్యాంగాన్ని ఉల్లంఘిస్తే, అది చెల్లదని నిర్ణయించే అధికారం దీనికి ఉంది. కేంద్ర, రాష్ట్రాలమధ్య తలెత్తిన వివాదాలను

రాజ్యాంగ పరిధిలో స్వతంత్ర ప్రతిపత్తితో నెలకొల్పబడిన సుప్రీంకోర్టు పరిష్కరించవలసి ఉంటుంది. కేంద్ర, రాష్ట్రప్రభుత్వాలు, తమతమ పరిధులలో పనిచేసేలా చూస్తుంది. న్యాయశాఖ స్వతంత్ర ప్రతిపత్తిని కాపాడటానికి న్యాయమూర్తులు నిష్పక్షపాతంగా తమ విధులను నిర్వహించటానికి వీలుగా న్యాయమూర్తుల పదవికాలం, జీతభత్యాలు, ఉద్యోగభద్రత వంటి విషయాలలో అవసరమైన ఏర్పాట్లను రాజ్యాంగం కల్పించింది.

**1.4.5 ద్వి శాసన సభ :** భారత సమాఖ్య వ్యవస్థలో శాసనాలను రూపొందించే అంగం పార్లమెంటు. పార్లమెంటులో లోక్‌సభ, రాజ్యసభ అనే రెండు సభలు ఉంటాయి. లోక్‌సభ సార్వజనీన ఓటు హక్కు ప్రాతిపదికగా, ప్రజలచేత ఎన్నుకోబడిన ప్రతినిధులచే ఏర్పాటు చేయబడుతుంది. రాజ్యసభ భారత సమాఖ్యలోని వివిధ రాష్ట్రాలకు ప్రా[illegible]ంది. దీని సభ్యులు ముఖ్యంగా రాష్ట్రవిధాన సభల సభ్యులచే ఎన్నుకోబడతారు.

## 1.5 భారతసమాఖ్య విశిష్టత:

భారత రాజ్యాంగ నిర్మాతలు సాంప్రదాయక సమాఖ్య వ్యవస్థా స్వభావం నుండి [illegible] కొన్ని ఏకీకృత వ్యవస్థా లక్షణాల్ని భారతరాజ్యాంగ వ్యవస్థలో పొందుపరిచారు. వాటిని ఈ క్రింది విధంగా పేర్కొనవచ్చు.

**1.5.1 శక్తివంతమైన కేంద్రప్రభుత్వం:** భారత సమాఖ్య అత్యంత శక్తివంతమైన కేంద్రప్రభుత్వానికి నిలయం. రాష్ట్రప్రభుత్వాలు కొన్ని సందర్భాలలో కేంద్ర అధికారపరిధికి అనుగుణంగా ప్రవర్తించవలసి ఉంటుంది.

**1.5.2 కేంద్ర నియంత్రణ అధికారం :** రాజ్యాంగంలోని 249వ నిబంధన రాష్ట్రజాబితాలోని ఏ అంశంపైనైనా శాసనం చేసే అధికారాన్ని కేంద్రపార్లమెంటుకు కల్పించింది. అయితే ఆవిధంగా చేయటానికి మూడింట రెండు వంతుల మెజారిటీతో రాజ్యసభ (రాష్ట్రాల ప్రతినిది) పార్లమెంటుకు అధికారం యివ్వాలి.

**1.5.3 అఖిల భారత సర్వీసులు :** రాజ్యాంగంలోని 312వ నిబంధన ప్రకారం, కేంద్రానికి రాష్ట్రాలకు ఉమ్మడిగా ఉండే కొత్త అఖిలభారత సర్వీసులను ఏర్పాటు చేసే అధికారం కేంద్రపార్లమెంటుకు ఉంది. అయితే ఈ మేరకు రాజ్యసభ మూడింట రెండు వంతుల మెజారిటీతో ఒక తీర్మానాన్ని ఆమోదించాలి.

**1.5.4 కేంద్రం ఆదేశాలు :** రాజ్యాంగం 256వ నిబంధన ప్రకారం పార్లమెంటు ఆమోదించే శాసనాలకు అనుగుణంగా రాష్ట్రప్రభుత్వం తన కార్యనిర్వాహక అధికారాలను, విధులను చెలాయించాలి. ఈ మేరకు అవసరమైన ఆదేశాలను రాష్ట్రానికి జారీచేసే అధికారం కేంద్రానికి ఉంది. రాజ్యాంగం 257వ నిబంధన కొన్ని సందర్భాల్లో రాష్ట్రాలను కేంద్రప్రభుత్వ ఆధీనంలో ఉంచుతుంది.

**1.5.5 వీటో అధికారం :** రాజ్యాంగం 200, 201 నిబంధనలు శాసన సభ ఆమోదించిన సాధారణ బిల్లులను చట్టం కాకుండా నిలుపుదల (Veto) చేసే అధికారాన్ని గవర్నర్లకు దాఖలు చేసినాయి. రాజ్యాంగం 200 నిబంధనల ప్రకారం శాసన సభ ఆమోదించిన బిల్లులపై గవర్నరు తన ఆమోదముద్ర వేస్తే అది చట్టం అవుతుంది. అయితే గవర్నరు బిల్లులను ఆమోదించటంతో బాటు (ఆర్థిక బిల్లులను తప్పించి) వాటిని తిరస్కరించటానికి లేదా నిలుపుదల చేయటానికి [illegible]కు పంపటానికి కూడ రాజ్యాంగంలో అధికారం కల్పించబడింది.

గవర్నరు ఆమోదముద్ర (assent) వేయటానికి నిరాకరించిన బిల్లులను శాసనసభకు త్రిప్పి పంపుతూ, తన సందేశాన్ని జతపర్చవచ్చు. ఆసందేశంలో ఆయా బిల్లులకు సంబంధించి చేయాలిన మార్పులను చేర్పులను సూచించవచ్చు. ఇట్లు పునఃపరిశీలన నిమిత్తం తిరిగివచ్చిన బిల్లును శాసన సభ చర్చించి సవరించి [illegible] రూపంలో కాని మరల గవర్నరు ఆమోదం కోసం పంపినట్లైతే గవర్నరు 'ఆమోదముద్ర' వేయాల్సిందే తప్ప తిరస్కరించటానికి వీలులేదు.

అదే విధంగా ఏదైనా బిల్లు గవర్నరు అభిప్రాయంతో రాష్ట్రహైకోర్టు రాజ్యాంగ రీత్యా నిర్వర్తించవలసిన విధులకు ఆటంకం కల్గించేదిగా ఉన్నదని భావిస్తే దానిని అతడు రాష్ట్రపతి పరిశీలనకోసం పంపించవచ్చు. ఇట్లా గవర్నరు తన పరిశీలన కోసం పంపిన బిల్లును రాష్ట్రపతి ఆమోదించి పంపితే సమస్యేలేదు. అది చట్టం అవుతుంది. అయితే రాష్ట్రపతి కొన్ని సందర్భాలలో తన ఆమోద ముద్ర వేయకుండా కొన్ని మార్పులను చేర్పులను సూచిస్తూ ఒక సందేశాన్ని జతపరచి గవర్నరుకు త్రిప్పిపంపవచ్చు. అపుడు గవర్నరు రాష్ట్రపతి సందేశం జతపరిచిన ఆ బిల్లును శాసనసభ పున: పరిశీలనకు పంపించవలసి ఉంటుంది. రాష్ట్రపతి సందేశం దృష్ట్యా శాసనసభ ఆబిల్లును పున:పరిశీలించి మార్పులు చేర్పులతో కాని లేదా యధాతథంగా కాని 6 నెలలలోగా గవర్నరుకు పంపినట్లైతే గవర్నరుకు దానిని రాష్ట్రపతి ఆమోదానికి సమర్పిస్తాడు. అంతే తప్ప తాను స్వయంగా నిర్ణయం తీసికొని, ఆమోద ముద్ర వేయజాలడు.

**1.5.6 రాష్ట్రగవర్నర్లు : కేంద్రఅధికారం :** గవర్నర్ రాష్ట్రస్థాయిలో రాజ్యాంగ అధిపతి. రాష్ట్రపాలనకు అధిపత్యం వహిస్తాడు. రాష్ట్రగవర్నర్‌ను కేంద్రమంత్రిమండలి సలహామేరకు రాష్ట్రపతి నియమిస్తాడు. రాష్ట్రపతి అభీష్టం ఉన్నంతవరకే గవర్నర్ పదవిలో కొనసాగుతాడు. తన అభీష్టాన్ని ఉపసంహరించడం ద్వారా రాష్ట్రపతి గవర్నర్‌ను పదవినుండి తొలగించవచ్చు. గవర్నర్లను ఒక రాష్ట్రంనుండి మరొక రాష్ట్రానికి మార్చవచ్చు. వాస్తవంలో రాష్ట్రగవర్నర్ల పదవీకాలం, నియామకం, తొలగింపు కేంద్రప్రభుత్వ ఇష్టా ఇష్టాలపై ఆధారపడి ఉంటుంది. రాష్ట్ర ముఖ్యమంత్రి నియామకం, తొలగింపు, రాష్ట్రంలో రాష్ట్రపతి పాలనకై సిఫార్సు, రాష్ట్ర అసెంబ్లీనిరద్దు చేయడం, రాష్ట్రశాసనసభ ఆమోదించిన బిల్లులను రాష్ట్రపతి ఆమోదానికై రిజర్వుచేయడం వంటి విషయాల్లో గవర్నర్లు కేంద్రప్రభుత్వం ఒత్తిడికిలోనై వ్యవహరించిన అనేక సందర్భాలున్నాయి.

**1.5.7 జాతీయ అత్యవసర పరిస్థితి :** రాజ్యాంగం 352 నిబంధన ప్రకారం, దేశభద్రత నిమిత్తం ఒక ప్రాంతంలో గాని దేశం అంతటా గాని జాతీయ అత్యవసర పరిస్థితిని రాష్ట్రపతి విధించవచ్చు. అప్పడు, రాష్ట్ర అధికారాలు, స్వతంత్ర ప్రతిపత్తి తాత్కాలికంగా కేంద్రప్రభుత్వం స్వీకరిస్తుంది. రాష్ట్రానికి సంబంధించిన శాసనాలన్నిటిని పార్లమెంటు చేస్తుంది. ఆర్థిక పరమైనవనరులను కూ డ కేటాయిస్తుంది.

**1.5.8 రాష్ట్రపతి పాలన :** రాజ్యాంగ నిబంధన 356 ప్రకారం రాష్ట్రాలలో రాష్ట్రపతి పాలనను ప్రవేశపెట్టడంలో కేంద్రప్రభుత్వానికి విశిష్ట అధికారాలు ఉన్నాయి. ఈ నిబంధన ప్రకారం ఏ రాష్ట్రంలో అయినా రాష్ట్ర పాలన రాజ్యాంగ బద్ధంగా నిర్వహించటం సాధ్యం కాదని గవర్నరు నివేదిస్తే, ఆనివేదిక ప్రాతిపదికగా కేంద్రం రాష్ట్రమంత్రి వర్గాన్ని రద్దుచేసి రాష్ట్రపతిపాలన విధించవచ్చు. రాష్ట్రపాలనను ఆసమయంలో గవర్నరు, ఆయన సలహాదారులు నిర్వహిస్తారు. అయితే రాష్ట్రపతిపాలన విధింపుపై గవర్నర్ల నిర్ణయాలు రాజకీయంగా వివాదాస్పదం అవుతున్నాయి. ఈ రాజ్యాంగ నిబంధనను కేంద్రంలో అధికారంలో ఉన్న రాజకీయపార్టీకి అనుకూ లంగా కేంద్రప్రభుత్వం ఉపయోగించిన సందర్భాలు భారత సమాఖ్యలో అనేకం ఉన్నాయి. దానితో కేంద్రానికి, రాష్ట్రాలకు మధ్య సంధాన కర్తలుగా పనిచేయవలసిన గవర్నర్లు ఆచరణలో కేంద్రానికి ఏజంట్లుగా, తాబేదార్లుగా వ్యవహరించే పరిస్థితికి దారి తీస్తోంది. ఈ కారణంగానే గవర్నర్ల వ్యవస్థను రద్దుచేయటం మంచిదనే వాదన ఈ మధ్య ప్రాచుర్యాన్ని పొందుతోంది.

**1.5.9 రాష్ట్రాల గుర్తింపు :** భారతసమాఖ్యకు సంబంధించిన అత్యంత అసాధారణ లక్షణం ఏమిటంటే రాష్ట్రాలగుర్తింపు విషయంలో ఏదీ శాశ్వతం కాకపోవడం. రాజ్యాంగం 3వ నిబంధన ఒక ప్రకారం శాసనం చేయడం ద్వారా కేంద్రం కొత్త రాష్ట్రాన్ని ఏర్పాటు చేయవచ్చు; ఏర్పాటు విస్తీర్ణాన్ని పెంచవచ్చు, తగ్గించవచ్చు, ఏ రాష్ట్రం పేరునైనా మార్చవచ్చు. ఈ నిబంధనను కేంద్రప్రభుత్వం బాగానే వినియోగించుకొంటోంది.

## 1.6 ప్రాంతీయ తత్వం

ఒక రాష్ట్రంలో లేదా ఒక ప్రాంతంలోని ప్రజలు మొత్తం భారతసమాఖ్య పై కాకుండా, ఆ రాష్ట్రం లేదా ప్రాంతం మీదనే మమకారం చూపించడం ప్రాంతీయతత్వం. ఇది ప్రాంతీయ వాదానికి, ఉప ప్రాంతీయ వాదానికి దారితీసి జాతిసమగ్రతకు అనేక సందర్భాలలో అవరోధంగా ఏర్పడుతుంది.

భారతదేశం నుంచి కొన్ని ప్రాంతాలు విడిపోయి స్వతంత్ర రాజ్యాలుగా రాష్ట్రాలుగా ఏర్పడే ఉద్యమాలు, ప్రాంతీయ తత్వం నుంచి అవతరించాయి. తమిళనాడులోని ద్రవిడస్థాన్ ఉద్యమం, పంజాబ్‌లోని ఖలిస్థాన్, ఉద్యమాలు మంచి ఉదాహరణలు.

ప్రాంతీయతత్వం అంతర్ - రాష్ట్ర వివాదాలకు, అంతర్గత రాష్ట్రవివాదాలకు దారితీస్తున్న సందర్భాలు భారతసమాఖ్యలో ఉన్నాయి.ఈ వివాదాలన్నీ ఎక్కువగా భాషాప్రయుక్త రాష్ట్రాల ఏర్పాటు తర్వాత ఆవిర్భవించాయి. కర్నాటక, మహారాష్ట్ర మధ్య సరిహద్దు వివాదం మొదటిరకం; తెలంగాణా, ఆంధ్ర ఉద్యమాలు రెండవరకం. ఈ వివాదాలు ప్రాంతీయ అభిమానాన్ని రేకెత్తించగా, కొన్ని సందర్భాలలో రాష్ట్రప్రభుత్వాలు, మరికొన్ని సందర్భాల్లో రాజకీయ నాయకులు తమ రాజకీయస్వార్థం కోసం వీటిని ఉపయోగించుకొని భారతసమాఖ్య ప్రయోజనాలకు భంగం కల్గిస్తున్నారు.

## 1.7 భారతసమాఖ్య - బహుపార్టీవ్యవస్థ:

భారతసమాఖ్యలో బహుపార్టీవిధానం అమలులో ఉంది. ఈ విధానం వల్ల జాతీయ, రాష్ట్రస్థాయిల్లో ప్రజలలో చైతన్యం అభివృద్ధి చెందింది. రాజకీయ పరిణితి చెందిన ఓటర్లు బలమైన ఏకపార్టీ ప్రభుత్వపాలనకు భిన్నంగా కేంద్రంలోను, రాష్ట్రాలలోను సమిష్టి బాధ్యతతో కూ డిన సంకీర్ణ ప్రభుత్వంవైపు దృష్టిమళ్ళించడం గమనార్హం. గడచిన 5దశబ్దాలలో నిర్వహించిన ఎన్నికల ఫలితాలు అనూహ్యమైన రాజకీయ పరిణామాలకు దారితీశాయి. అనేక సందర్భాలలో ఎన్నికలలో గెలిచిన రాజకీయపార్టీలకు నిర్దిష్టమైన ప్రజాప్రతినిధుల సంఖ్యాబలం లేకపోవడంతో సుస్థిరప్రభుత్వాన్ని ఏర్పరచగలిగే అర్హతను కోల్పోతున్నాయి. ఇలువంటి క్లిష్టపరిస్థితుల్లో కేంద్రంలోను, రాష్ట్రాలలోను విభిన్న జాతీయరాజకీయ పార్టీలు ప్రాంతీయపార్టీలతో పొత్తు ఏర్పరుచుకొని సంకీర్ణ ప్రభుత్వాలను ఏర్పాటు చేస్తున్నాయి.

1967లో కేంద్రంలోను, రాష్ట్రాలలోను అంతవరకూ ఒకే పార్టీ ప్రభుత్వాలను ఏర్పాటు చేయగలిగిన కాంగ్రెస్ పార్టీ తన ఏకఛత్ర రాజకీయ ప్రాబల్యాన్ని (Single Party Domination) కోల్పోవడంతో సంకీర్ణప్రభుత్వం ఏర్పడటానికి మార్గం ఏర్పడింది. కాంగ్రెసేతర పార్టీలు సమైక్యమై సంకీర్ణప్రభుత్వాలను ఏర్పాటు చేయడం ద్వారా వివిధ రాష్ట్రాల్లో తమ ప్రాబల్యాన్ని ప్రదర్శించాయి. ఉదా॥ బీహారు రాష్ట్రంలో అధికారంలో ఉన్న ప్రభుత్వాన్ని కేంద్రప్రభుత్వం తొలగించి రాష్ట్రపతిపాలన విధించడంద్వారా జరిగిన మధ్యంతర ఎన్నికల ఫలితంగా సామ్యవాద భావాలు గల కాంగ్రెసేతర పక్షాలు సమైక్యమై సంకీర్ణప్రభుత్వం ఏర్పడింది. హర్యానా, పంజాబ్, ఉత్తరప్రదేశ్, హిమాచలప్రదేశ్, జమ్మూ - కాశ్మీర్ రాష్ట్రాలలో కాంగ్రెస్ పార్టీలోని అంతర్గత కలహాలవల్ల మధ్యంతర ఎన్నికల ఫలితంగా సంకీర్ణప్రభుత్వాలు అధికారంలోకి వచ్చాయి. 1977లో కేంద్రంలో ఏర్పడిన జనతాసంకీర్ణ ప్రభుత్వ కాలంనుండి నేటివరకు భారతసమాఖ్య సంకీర్ణ రాజకీయాలచే ప్రభావితం చెయ్యబడుతోంది.

## 1.8 భారతసమాఖ్య : అంతర్గత ప్రయోగాలు

కేంద్రప్రభుత్వంగాని, రాష్ట్రప్రభుత్వాలు గానీ సాంఘిక, ఆర్థిక, రాజకీయ, పాలన, సాంస్కృతిక రంగాలలో నూతన ప్రయోగాలు చేపట్టడానికి భారతసమాఖ్య అవకాశం కల్పించింది. ఒక రాష్ట్రం ఒకప్రయోగ పద్ధతిలో సాధించే ప్రగతి ఇతర రాష్ట్రాలకు మార్గదర్శకమవుతుంది. ఆంధ్రప్రదేశ్‌లో గత దశాబ్ధంలో తెలుగుదేశం పార్టీ హయాంలో చేపట్టిన కొన్ని ప్రయోగాలు, ముఖ్యంగా మండలాల పద్ధతి, జన్మభూమి కార్యక్రమం, సింగిల్ విండో పథకం వంటివి ఇతర రాష్ట్రాల ప్రభుత్వాలకు ఆసక్తిని రేకెత్తించాయి. ముఖ్యంగా తెలుగుదేశం పార్టీ అనుసరించిన ప్రచార పద్ధతులు, క్రమశిక్షణా పరమైన ఇతర వ్యవస్థల రాష్ట్ర రాజకీయాలలో ఇతర

రాజకీయ పార్టీలను ఆకర్షించగా 1989 ఎన్నికలనుండి ఆ పార్టీలు వాటిని అనుకరించాయి కూ డా. ఆ విధంగా ఒక రాష్ట్ర ప్రభుత్వం మరియు రాజకీయాల అధ్యయనం ఇతర రాష్ట్రాలకు ఆసక్తిదాయకమైన అంశాలను, అభివృద్ధికి అవసరమైన మార్గదర్శకాలను సూచిస్తుంది.

ప్రొఫెసర్ ఆపిల్‌బీ (Appleby) పేర్కొన్నట్లుగా మనది సహకార సమాఖ్య వ్యవస్థ (Cooperative Federalism). కేంద్ర ప్రభుత్వంపై ఆర్థిక వనరుల వంటి విషయాలలో రాష్ట్రప్రభుత్వాలు ఆధారపడితే, కొన్ని జాతీయ విధానాల అమలులో కేంద్ర ప్రభుత్వం రాష్ట్రప్రభుత్వాల సహకారంపై ఆధారపడవలసిన పరిస్థితి భారత సమాఖ్యలో నెలకొని ఉంది. ఆ విధంగా జాతిపురోగతికి కేంద్రరాష్ట్ర ప్రభుత్వాలు భాగస్వాములుగా పాలు పంచుకోవలసి ఉంటుంది. జాతి పురోభివృద్ధిలో తమ రాష్ట్రం పాత్రను తెలిసికోవటానికి, కేంద్ర రాష్ట్రప్రభుత్వాల మధ్య సహకారాన్ని పెంపొందించటానికి దోహదం చేసే అంశాలను గుర్తించటానికి రాష్ట్రప్రభుత్వం మరియు రాజకీయాల అధ్యయనం తోడ్పడుతుంది. అంతేగాక వివిధ జాతీయ విధానాలు వివిధ రాష్ట్రాలలో అమలౌతున్న తీరును తులనాత్మకంగా అధ్యయనం చేయటానికి, ఆయా విధానాల లక్ష్యాల సాధనలో విభిన్న రాష్ట్రాలు పరస్పరం పోటీపడే తత్వాన్ని అలవరచుకోవటానికి రాష్ట్రరాజకీయాల అధ్యయనం దోహదం చేస్తుంది.

## 1.9 రాష్ట్ర స్థితిగతులు :

భారత సమాఖ్యలో రాష్ట్రప్రభుత్వాలు కేంద్రప్రభుత్వం మాదిరిగానే భారతరాజ్యాంగ పరిధిలో రాష్ట్రస్థాయిలో వ్యవహరిస్తాయి. రాష్ట్రాలు ఒకే రకమైన న్యాయవ్యవస్థ మరియు పాలన, రాజకీయనిర్మాణాన్ని కలిగిఉన్నప్పటికి వాటి పాలన, రాజకీయప్రక్రియలలో సామ్యంతోపాటు పేర్కొనదగిన భిన్నత్వం కన్పిస్తుంది. రాష్ట్రాల మధ్య ప్రజావ్యవస్థల ఉద్వేగభరిత నిర్మాణంలో (Emotional buildup) భిన్నత్వం, అనుబంధాలలో (affiliations) వ్యత్యాసం కన్పిస్తుంది. ఉదాహరణకు కొన్ని రాష్ట్రాలు వామపక్షవిధానాలకు నిలయం కాగా తక్కిన రాష్ట్రాలు పూర్తిగా వాటికి భిన్నం. కొన్ని రాష్ట్రాలలో ఎక్కువ రాజకీయ చైతన్యం కారణంగా ఎక్కువ రాజకీయ భాగస్వామ్యం ఉండగా మరికొన్ని రాష్ట్రాలలో రాజకీయ నిస్తేజం కన్పిస్తుంది. అక్కడ ప్రజలు రాజకీయాల పట్ల నిర్లిప్తత కలిగి ఉంటారు.

భారతసమాఖ్యలో కొన్ని రాష్ట్రాలు సజాతీయ (homogeneous) లక్షణాలు కలిగి ఉంటాయి. కొన్ని రాష్ట్రాలు దానికి భిన్నంగా శాశ్వతమైన ఒత్తిడులతో నలిగిపోతుంటాయి. కొన్ని రాష్ట్రాలలో అధికారపార్టీ, విపక్ష పార్టీల నిర్మాణం, పనితీరు ఒక దానికి ఒకటి ధీటుగా ఉంటాయి. అయితే కొన్ని రాష్ట్రాలలో అధికారపార్టీ ముఠాతగాదాలకు, అంతర్గత విభేదాలకు నిలయం. ఇటువంటి వ్యత్యాసాలను భారతసమాఖ్యలో గమనించడం ద్వారా, అధ్యయనం చేయడం ద్వారా రాష్ట్రాలలోని సామాజిక - ఆర్థిక, పాలన-రాజకీయ ఆవరణాన్ని అర్థం చేసుకోవచ్చు.

భారతసమాఖ్య వ్యవస్థ వాస్తవానికి (73 రాజ్యాంగ సవరణ తర్వాత) మూడంచెల వ్యవవస్థ. ఈ మూడంచెల వ్యవస్థలో 'రాష్ట్రం' కేంద్రానికి స్థానిక ప్రభుత్వానికి మధ్యగల పాలన - రాజకీయవిభాగం. రాష్ట్రప్రభుత్వ పాలన - రాజకీయాలలో, ప్రణాళికీకరణ, ఏకపార్టీ అధిపత్యం వంటి అభికేంద్రక శక్తులు (Centripetal forces) ; అధికార వికేంద్రీకరణ, ప్రాంతీయతత్వం, భాషావాదం వంటి అపకేంద్రక శక్తులు (Centrifugal forces) ప్రభావాన్ని చూపిస్తూ ఉంటాయి. ఈ రెండు రకాల శక్తులు భారతరాష్ట్ర రాజకీయాలలో పోటీతత్వాన్ని, సర్దుబాటు ధోరణులను ప్రవేశపెడుతున్నాయి.

భారత సమాఖ్యలో కేంద్రంలో అధికారాన్ని చేజిక్కించుకొన్న పార్టీ ప్రయోజనాల దృష్ట్యా కేంద్రప్రభుత్వం, రాష్ట్రాలలో అధికారంలోయున్న పార్టీల ప్రయోజనాల దృష్ట్యా రాష్ట్రప్రభుత్వాలు సమైఖ్య లేదా సంఘర్షణాత్మక దృక్పధాలను అనుసరిస్తుంటాయి. కేంద్రపార్టీ ప్రయోజనాల దృష్ట్యా కేంద్రప్రభుత్వం, రాష్ట్రప్రభుత్వాల పట్ల అనుసరిస్తున్న వివక్ష పూరిత విధానాలవల్ల కేంద్రరాష్ట్ర ప్రభుత్వాలమధ్య ఉద్రిక్తతలు ఏర్పడుతున్నాయి అనేది ఒక వాదం. కేంద్రంలోను, రాష్ట్రాలలోను ఒకే పార్టీ పాలించే పరిస్థితి అంతంకావడంతో సమాఖ్యవ్యవసస్థలో కేంద్రం - రాష్ట్రాల మధ్య హక్కులు, బాధ్యతలు నిర్ధారణపై సంఘర్షణలు ప్రారంభమయ్యాయి. రాష్ట్రాలు అధికార వికేంద్రీకరణకు, విస్తృత వనరుల పంపిణీకి కేంద్రప్రభుత్వంపై ఒత్తిడి తెస్తున్నాయి. అధిక వనరులను సమీకరించడంతో రాష్ట్రాలు

చొరవచూపడంలేదని, అధికారవికేంద్రీకరణ నిధులను రాష్ట్రప్రభుత్వాలు సక్రమంగా వినియోగించడం లేదని కేంద్రం భావిస్తుంది. ఈ రెండువాదనల మధ్య సమతుల్యంపై కేంద్ర రాష్ట్రప్రభుత్వాల మనుగడ ఆధారపడి ఉంది.

భారత సమాఖ్యలో రాష్ట్రాలు అంతర్భాగాలు. కేంద్రానికి రాష్ట్రాలకు అవినాభావ సంబంధం ఉంది. రాజ్యాంగచట్టంలో కేంద్రప్రభుత్వానికి ఒక విలక్షణమైన స్థానం ఉంది. అదే విధంగా రాష్ట్రప్రభుత్వాలకు కూ డ ఒక ప్రత్యేక స్థానం ఉంది.

## 1.10 సారాంశం

భారతరాజ్యాంగం భారతదేశాన్ని రాష్ట్రాల యూనియన్‌గా పేర్కొంది. సమాఖ్య అనే పదం వాడకపోయినా/భారత రాజ్యవ్యవస్థలో అటు సమాఖ్యలక్షణాలు, ఇటు ఏక కేంద్రలక్షణాలు ఉన్నాయి. అయితే రాష్ట్రాలకంటే కేంద్రం బలంగా ఉండేటట్లు ఈ సమాఖ్య విధానం రూపొందించబడింది. కేంద్రప్రభుత్వానికి విస్తృతమైన శాసన అధికారం ఉంది. రాష్ట్రాలకు కేంద్రం ఆదేశాలు జారీచేయవచ్చు. రాష్ట్రప్రభుత్వాలకు బాధ్యతలను అప్పగించడంలో, రాష్ట్రప్రభుత్వాలను రద్దు చేయడంలో, రాష్ట్ర గవర్నర్ల నియామకం, తొలగింపుల్లో, అఖిల భారత సర్వీసుల నియామకం, వినియోగం ద్వారా కేంద్రం రాష్ట్రప్రభుత్వాలపై నియంత్రణాధికారాన్ని కలిగి ఉంది. అయినప్పటికి భారతసమాఖ్యలో రాష్ట్రాలు ప్రధాన పాత్రను పోషిస్తాయి. రాష్ట్రప్రభుత్వాలకు పెక్కువిషయాలపై అధికారాలున్నాయి. శాంతిభద్రతల పరిరక్షణ, నీటిపారుదల, విద్య, వైద్యం, సంక్షేమం వంటి బాధ్యతలు రాష్ట్రప్రభుత్వాలు నిర్వహిస్తాయి. ఈ విషయాలన్నింటిలో ఒక్కొక్క రాష్ట్ర ప్రభుత్వం ఒక్కొక్క విధానాన్ని అవలంబిస్తుంది. రాష్ట్రాలన్నింటికి ఒకేరకమైన రాజ్యాంగ నిర్మితులున్నప్పటికి, ఆచరణలో మాత్రం వాటి వ్యవహార శైలిలో భిన్నత్వం స్పష్టంగా కన్పిస్తుంది. రాష్ట్రరాజకీయాలు, జాతీయరాజకీయాలు పరస్పర పోషకాలయినప్పటికి, జాతీయరాజకీయాలను రాష్ట్రరాజకీయాలు సంకీర్ణప్రభుత్వ నేపధ్యంలో అమితంగా ప్రభావితం చేస్తున్నాయి. ఈ సందర్భంలో భారతసమాఖ్యలో రాష్ట్రప్రభుత్వం రాజకీయాల అధ్యయనం అత్యంత ప్రాముఖ్యతను సంతరించుకొంటున్నది.

## 1.11 నమూన ప్రశ్నలు

1) భారతసమాఖ్యలో రాష్ట్రాలరాజ్యాంగ విహిత స్థాయిని గూర్చి వివరించండి.

2) భారతసమాఖ్యలో రాష్ట్రాల పట్ల కేంద్ర అనుకూ ల వ్యతిరేక ధోరణులు వివరింపుము.

### లఘువ్యాస రూప ప్రశ్నలు

1. భారత సమాఖ్య విశిష్టతను వివరించుము
2. రాష్ట్రరాజకీయాలలో ప్రాంతీయతత్వం ప్రభావం ఏవిధంగా ఉంది?
3. భారతసమాఖ్యలో రాష్ట్ర స్థితిగతులను పేర్కొనుము.
4. భారతసమాఖ్యలో బహుపార్టీ వ్యవస్థ స్వభావాన్ని వివరింపుము.

### చదువదగిన గ్రంథాలు


1. S.R.Maheswari : భారతదేశపాలనా శాస్త్రం
2. S.K. Chabra : State Politics in India
3. J.R. Siwach : Dynamics of Indian Government and Politics
4. కె.ఆర్. ఆచార్య (ఇడి) : ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం - రాజకీయాలు


డా.పి.వి.వి. సుబ్రహ్మణ్యం

పాఠం: 2

# ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఆవతరణ - సామాజిక, ఆర్థిక నేపధ్యం

## 2.0 లక్ష్యం:

భారతయూనియన్‌లోని 28 రాష్ట్రాలలో అక్షరక్రమంలో మొట్టమొదటి పెద్ద రాష్ట్రం ఆంధ్రప్రదేశ్. భాషా ప్రాతిపదికపై ఏర్పడిన రాష్ట్రాలలో దీనిని ప్రధానంగా పేర్కొనవచ్చు. ఇంతటి ప్రాధాన్యత కలిగిన ఆంధ్రప్రదేశ్ రాష్ట్రఏర్పాటుకు దోహదం చేసిన కారకాలను, వివిధ ఘట్టాలను ఒప్పందాలను, కమీషన్‌లను, రాష్ట్రసామాజిక, ఆర్థిక నేపధ్యాన్ని వివరించటం ఈ పాఠం యొక్క లక్ష్యం.

## విషయసూచిక:


2.1 ప్రత్యేక ఆంధ్ర రాష్ట్ర భావనకు కారకాలు

2.2 ఆంధ్రమహాజన సభ ఆవిర్భావం (1913)

2.3 ప్రత్యేక ఆంధ్రరాష్ట్ర కాంగ్రెసు కమిటీ ఏర్పాటు (1918)

2.4 శ్రీ బాగ్ ఒప్పందం (1937)

2.5 థార్ కమీషన్ నియామకం (1948)

2.6 జె.వి.పి. నివేదిక (1949)

2.7 ప్రత్యేక ఆంధ్రరాష్ట్రం ఏర్పాటు (1953)

2.8 తెలంగాణా ప్రాంతంలో ఆంధ్రోద్యమం

2.9 ఆంధ్రప్రదేశ్ అవతరణ (1956)

2.10 ఆంధ్రప్రదేశ్ - సామాజిక, ఆర్థిక నేపధ్యం

2.11 సారాంశం

2.12 నమూనా ప్రశ్నలు

2.13 చదువదగిన గ్రంథాలు


## 2.1. ప్రత్యేక ఆంధ్రరాష్ట్ర భావనకు కారకాలు:

స్వతంత్రభారత దేశంలో భాషాప్రాతిపదికపై ఏర్పడిన రాష్ట్రాలలో ఆంధ్రప్రదేశ్‌ను ప్రప్రథమంగా పేర్కొనవచ్చు. వాస్తవానికి భాషాప్రాయుక్తికంగా రాష్ట్రాలను విభజించాలనే ప్రతిపాదనకు నాంది 1894లో బీహార్ రాష్ట్రాన్ని బెంగాల్ నుండి వేరు చేసి ప్రత్యేక రాష్ట్రంగా రూపొందించడానికై శ్రీ మహేశ్ నారాయణచే చేయబడినది. ఆ తరువాతి కాలంలో ఈ వాదనను బాల గంగాధర తిలక్ సమర్థించినాడు.

క్రీ.శ. 1905కు పూర్వం బెంగాల్ రాష్ట్రం చాలా పెద్దదిగాయుండేది. ఇప్పుడు ప్రత్యేక రాష్ట్రాలుగా చెలామణి అవుతున్న ఒరిస్సా, బీహార్, అస్సాం మొదలైన ఈశాన్య ప్రాంత రాష్ట్రాలు దానిలో అంతర్భాగంగాయుండేవి. 1905లో ఆనాటి గవర్నర్ జనరల్ లార్డ్ కర్జన్ పరిపాలనా సౌలభ్యం పేరుతో బెంగాల్ రాష్ట్రాన్ని తూర్పు బెంగాల్, పశ్చిమ బెంగాల్ అని విభజించినాడు. బెంగాల్ విభజన జరగడంతో దేశమంతటా నిరసన ఉద్యమాలు చెలరేగాయి. వంగదేశీయులు చరిత్రాత్మకమైన పోరాటాన్ని చేసి తమ ఐక్యతాస్ఫూర్తిని నిలబెట్టుకున్నారు. 'వందేమాతరం' ఉద్యమానికి ఈ బెంగాల్ విభజనే కారణం. ఆ రోజుల్లో ఇది దేశం మొత్తంమీద జాతీయతా భావాన్ని రగిలించి స్వాతంత్ర్యోద్యమ చరిత్రలో ఒక మరపురాని ఘట్టంగా నిలిచింది. బెంగాల్ విభజన మూలంగా మొట్టమొదటిసారి భాషను జాతీయ

భావాన్ని పటిష్టంచేసే బలిష్టమైన సాధనంగా గుర్తించటం జరిగింది. ఈ ఉద్యమ ప్రభావం తెలుగువారిలో స్వాతంత్ర్య కాంక్షను రగిలించటమే కాక, తెలుగువారందరూ ఒక్కటి అనే భావానికి కూ డా అయురార్పణ చేసింది. బెంగాల్ విభజన ఉద్యమం తీవ్రత 1911 వరకు కొనసాగింది. 1911లో గవర్నర్ జనరల్ లార్డ్ హార్డింగ్ ఉద్యమం వెనుక బెంగాళీ భాష మాట్లాడే ప్రజల మనోభావాలను గౌరవించి బెంగాల్ విభజనను రద్దు చేశాడు. అయితే ఆ మరుసటి సంవత్సరమే ఒరిస్సా, బీహార్, అస్సాంలను బెంగాల్ రాష్ట్రంనుండి వేరుచేసి ప్రత్యేక రాష్ట్రాలుగా ఏర్పాటు చేసినాడు. ఈ క్రొత్త రాష్ట్రాల ఏర్పాటు పూర్తిగా భాషా ప్రాతిపదికపై జరిగింది. ఆ విధంగా ఇది భాషా ప్రాతిపదిక రాష్ట్రాల అవిర్భావానికి నాంది పలికింది. ఇది ఆంధ్ర ఉద్యమానికి ఊతమిచ్చింది.

1953కు పూర్వం ఆంధ్ర ప్రాంతం సంఘటిత మద్రాసు రాష్ట్రంలో ఒక భాగంగాయుండేది. రాష్ట్రరాజధాని మద్రాసు తమిళ ప్రాంతంలో యుండుట, తమిళుల ప్రాంతీయాభిమానం ఆంధ్రప్రాంతం అభివృద్ధిరంగంలో వెనుకబడియుండుటకు కారణమైనది. దానికి తగినట్లుగ 1850-60ల మధ్య గోదావరి, కృష్ణా నదులపై ఆనకట్టలు నిర్మించడంద్వారా కోస్తాజిల్లాలు ఆర్థికాభివృద్ధిని సాధించడం, కందుకూ రి వీరేశలింగం, రఘుపతి వెంకట రత్నం నాయుడు ఆదిగాగల సాంఘిక సంస్కర్తల సంస్కరణోద్యమాలతో ఆంధ్రులలో కల్గిన సాంఘిక చైతన్యం, 1854లో విద్యాభివృద్ధికి సంబంధించి కోర్టు ఆఫ్ డైరెక్టర్లు(Court of Directors) జారీ చేసిన ఆజ్ఞాపత్రం ద్వారా ఆంధ్రప్రాంతంలో ముఖ్యంగా కోస్తా జిల్లాలలో విద్యాలయాలు నెలకొల్పడం, రాజమండ్రి, కాకినాడ, మచిలీపట్నం మొదలైన పట్టణాలలో ఉన్నత విద్యాలయాల ద్వారా ఉన్నత విద్యను వ్యాప్తి చేయడం, వివేకవర్థని, ఆంధ్ర భాషా సంజీవని, పురషార్ధప్రదాయని, కృష్ణాపత్రిక, హిందూ జన సంస్కారిణి మొదలైన పత్రికలను స్థాపించడం ఆంధ్రప్రజలలో ముఖ్యంగా ఆర్థికాభివృద్ధికి కేంద్రాలుగా విలసిల్లుతున్న కోస్తా జిల్లాల ప్రజానీకంలో రాజకీయ చైతన్యం కల్గించడానికి, తద్వారా సంఘటిత మద్రసు రాష్ట్రంలో ఉద్యోగనియామకాలలోను తదితర విషయాలలోను తమకు జరిగిన, జరుగుతున్న అన్యాయాలను తెలుసుకోవటానికి అవకాశం కల్గించినవి. ప్రధానంగా ఈ చైతన్యమే ఆంధ్రులలో ప్రత్యేక రాష్ట్రవాంఛకు, ఉద్యమానికి దారి తీసినది.

1910లో ప్రప్రధమంగా 'దేశాభిమాని' పత్రిక ఆంధ్రులకు ప్రత్యేక రాష్ట్రంకావాలని విజ్ఞప్తి చేసింది. తెలుగువారిలో ఐక్యత కావాలని, కృష్ణా - గోదావరి- గుంటూరు జిల్లాల సమైక్యరాజకీయ సమావేశం జరగాలని, అలాడే ఆంధ్ర జిల్లాలన్నింటిలో సమైక్య సమావేశాలు ఏర్పాటు కావాలని, సంఘటిత మద్రాసు రాష్ట్రంలో ఆంధ్రుల అవసరాలు అర్హస్థానాన్ని పొందటంలేదని ఈ పత్రిక వ్రాసింది. ఆ తరువాత రెండేళ్ళకు గాని ఈ భావానికి ప్రాతిపదిక ఏర్పడలేదు.

## 2.2 ఆంధ్ర మహాజన సభ ఆవిర్భావం (1913)

1912 మేలో నిడదవోలులో జరిగిన గుంటూరు- కృష్ణా జిల్లాల సమావేశంలో ప్రత్యేక ఆంధ్ర రాష్ట్ర సమస్యను చర్చించటం జరిగింది. ఈ సమావేశానికి వేమవరపు రామదాసు పంతులు అధ్యక్షత వహించినారు. అది సందర్భం కాక పోయినప్పటికి అధ్యక్షుడు ప్రత్యేక ఆంధ్ర రాష్ట్ర తీర్మానాన్ని మొత్తం ఆంధ్ర ప్రజలకు సంబంధించిన పెద్ద సమస్య కాబట్టి మొత్తం మద్రసు రాష్ట్రంలోని అన్ని తెలుగు జిల్లాలకు చెందిన ప్రతినిధులతో ఒక మహాసభను ఏర్పాటు చేసి, ఆ సమస్యను ప్రత్యేకంగా చర్చించాలని సభ్యులు సూచించినారు.

నిడదవోలు సమావేశం తరువాత గుంటూరుకు చెందిన ఉన్నవ లక్ష్మీనారాయణ, చల్లా శేషగిరిరావు, జి. గురునాధం, కొండా వెంటప్పయ్య మొదలైన వారు ఆంధ్ర రాష్ట్రం ఏర్పాటుకై కృషి ప్రారంభించినారు. వీరి కృషి ఫలితంగా ఆంధ్ర మహా సభ లేక ఆంధ్రమహాజన సభ ప్రథమ సమావేశం 1913 మే 20న బాపట్లలో మద్రాసు లెజిస్లటివ్ కౌన్సిల్ సభ్యుడు శ్రీ బయ్యా నరసింహం శర్మ అధ్యక్షతన జరిగింది. సమావేశానికి మద్రాసు రాష్ట్రంలోని వివిధ తెలుగు జిల్లాలనుండి 800 వరకు ప్రతినిధులు హాజరైనారు. ఆంధ్ర రాష్ట్రం ఏర్పాటుపై సమావేశంలో ఏకాభిప్రాయం లేనందున, "ప్రత్యేక ఆంధ్రరాష్ట్ర సమస్యపై ప్రజాభిప్రాయాన్ని సేకరించాల"ని ఆ మహాసభ తీర్మానించింది. బాపట్ల మహా సభ ప్రత్యేక రాష్ట్రస్థాపనకు అనుకూ ల, ప్రతికూ ల వర్గాలను స్పష్టం చేసింది. అనుకూ ల వర్గంవారు మరో మహాసభ ఏర్పాటయ్యేలోగా అన్ని ప్రాంతాల ప్రజల మధ్యకు వెళ్ళి ప్రత్యేక రాష్ట్రానికి అనుకూ లంగా ప్రజాభిప్రాయాన్ని మలచుకోవలసిన అవసరాన్ని గుర్తించినారు. ఫలితంగా వివిధ పత్రికలలో, ముఖ్యంగా 'ది హిందూ', కృష్ణపత్రిక, మొదలైన వాటిలో ప్రత్యేక రాష్ట్రంవల్ల కలిగే

రాభనష్టాలను గురించి చర్చ జరిగింది. ఒక వైపు పత్రికల ద్వారా ప్రచారం జరుగుతుండగా, మరో వైపు శ్రీ కొండా వెంకటప్పయ్య నేతృత్వంలో ఒక కమిటి ఏర్పడి డా॥ భోగరాజు పట్టాభి సీతారామయ్య, ముట్నూరి కృష్ణారావు, వల్లూరి సూర్యనారాయణరావు ప్రభృతులు రాయలసీమ, కోస్తా జిల్లాలలో విరివిగా పర్యటించి ప్రత్యేక రాష్ట్ర వాంఛకు అనుగుణంగా ప్రజాభిప్రాయాన్ని సమీకరించటానికి ప్రయత్నించినారు.

మరుసటి సంవత్సరం (ఏప్రిల్ 14) విజయవాడలో న్యాపతి సుబ్బారావు పంతులు అధ్యక్షతన జరిగిన రెండవ ఆంధ్ర మహా సభ 'ఆంధ్ర రాష్ట్రం వాంఛనీయమని' తీర్మానించింది. సమావేశానికి 1670 మంది వరకు ప్రతినిధులు హాజరైనారు. ఇదే సమయంలో ఆంధ్ర ఉద్యమం, ఆంధ్రరాష్ట్రానికి సంబంధించిన గ్రంథాలు అనేకంవచ్చినాయి. 1915లో విశాఖపట్నంలో జరిగిన మూడవ ఆంధ్రమహాసభ "ఆంధ్రరాష్ట్రం నిర్మాణం అవశ్యం అభిలషణీయమని" అభిప్రయపడింది. మే 1916లో కాకినాడలో జరిగిన 4వ ఆంధ్రమహాసభ "ప్రత్యేక ఆంధ్ర రాష్ట్రనిర్మాణం అవశ్యం ఆవశ్యకంగాన, ప్రభుత్వం త్వరగా రాష్ట్ర నిర్మాణం చేయవలసింద"ని కోరుతూ తీర్మానించింది. అదే సమావేశంలో "భాషాప్రాతిపదికపై రాష్ట్రాల పునర్నిర్మాణ సమస్య"ను అఖిలభారత కాంగ్రెసు ముందుంచడానికి నిర్ణయించినారు.

## 2.3 ప్రత్యేక ఆంధ్రరాష్ట్ర కాంగ్రెసు కమిటి ఏర్పాటు (1918)

ప్రత్యేక ఆంధ్రరాష్ట్రం ఏర్పాటుకు ప్రాతిపదికగా 1917 కలకత్తా కాంగ్రెసు మహాసభలో ఆంధ్రకు ప్రత్యేక రాష్ట్రకాంగ్రెసును ఏర్పాటు చేయాలనే తీర్మానాన్ని ప్రతిపాదించడం జరిగింది. అనిబిసెంటు, గాంధి, కొందరు తమళ నాయకులు వ్యతిరేకించినప్పటికి, తిలక్, పట్టాభిల వాదనా పటిమతో తీర్మానం నెగ్గింది. ఫలితంగా న్యాపతి సుబ్బారావు అధ్యక్షుడుగా, కొండా వెంకటప్పయ్య ప్రధాన కార్యదర్శిగా 22 జనవరి 1918న ప్రత్యేక ఆంధ్రరాష్ట్ర కాంగ్రెసు కమిటి ఏర్పాటయింది.

1917 నవంబరులో రాజ్యాంగ సంస్కరణల విషయమై గవర్నరు - జనరల్ తోను, వివిధ రాజకీయ పక్షాల నాయకులతోను చర్చలు సాగించడానికై ఇండియా కార్యదర్శి మాంటేగు ఇండియా వచ్చినపుడు, ప్రత్యేక రాష్ట్రాన్ని కోరుతూ ఆంధ్ర ప్రముఖులు రాయబారం వెళ్ళినారు. 1918లో శ్రీ బయ్యానరసంహాశర్మ ప్రప్రథమంగా ఆంధ్ర రాష్ట్రాన్ని ఏర్పరచాలనే తీర్మానాన్ని కేంద్ర శాసనమండలిలో ప్రవేశ పెట్టినారు. కాని తీర్మానం వీగిపోయింది. మాంటేగు - ఛేమ్స్‌ఫర్డ్ నివేదిక భాషారాష్ట్ర వాంఛ న్యాయమైనదేనని అంగీకరించింది. కాని భాషా ప్రాతిపదికగా దేశ పునర్నిర్మాణం చేయటానికి పరిస్థితులు యింకా పరిపక్వం కాలేదని అభిప్రాయపడింది.

ఆ తరువాత 1920లో గాంధీ భారత రాజకీయ ప్రవేశంతో ఆంధ్రరాష్ట్రనినాదం ఆగి 'స్వరాజ్య సంపాదన' ప్రముఖస్థానాన్ని ఆక్రమించింది. గాంధీ ప్రారంభించిన సహాయ నిరాకరణోద్యమం, తరువాత సంభవించిన రాజకీయ మార్పులు ప్రత్యేక రాష్ట్రనినాదాన్ని ప్రక్కకు నెట్టినవి. అయినప్పటికి ప్రత్యేక రాష్ట్ర ప్రతిపాదనను 1920-37ల మధ్య మద్రాసు శాసనసభలో నాలుగుసార్లు ప్రవేశపెట్టడం జరిగింది. కాని తీర్మానాలు వీగిపోయినవి. అయినప్పటికి ఆంధ్రనాయకులు నిరాశచెందక, తమ ఆందోళనను కొనసాగించినారు. వీరి కృషి ఫలితమే 26 ఏప్రిల్ 1926లో విజయవాడలో ఆంధ్రవిశ్వవిద్యాలయ అవతరణ. భాషా ప్రాతిపదికపై ఏర్పడిన మొదటి విశ్వవిద్యాలయంగా దీనిని పేర్కొనవచ్చు.

1919 చట్టం అమలు జరుగుతున్న తీరును పరిశీలించడానికై బ్రిటీషు ప్రభుత్వం 1928లో సైమన్ కమిషన్‌ను నియమించింది. కాని భారతీయులకు ప్రాతినిధ్యం లేనందున సైమన్ కమీషనును బహిష్కరించుటకు అఖిల భారత కాంగ్రెసు తీర్మానించింది. అయినప్పటికి సైమన్ కమీషన్ రాష్ట్రాల పునర్విభజన సమంజసమేనని అభిప్రాయపడింది. కాని మద్రాసు ప్రభుత్వం తిరస్కరించింది.

1935 భారత ప్రభుత్వ చట్టం క్రింద ఒరిస్సా రాష్ట్రాన్ని, సింధు రాష్ట్రాన్ని ఏర్పాటు చేసిన బ్రిటిష్ ప్రభుత్వం ఆంధ్రుల కోర్కెను నిర్లక్ష్యం చేసింది.

అదే సమయంలో ప్రత్యేక ఆంధ్ర రాష్ట్ర ప్రతిపాదనకు వ్యతిరేకంగా రాయలసీమ నాయకులు ప్రచారం సాగించినారు. తత్ఫలితమే 1934లో రాయలసీమ మహాసభ ఆవిష్కరణ. ప్రత్యేక ఆంధ్ర రాష్ట్రంలో కోస్తా జిల్లాల ప్రాబల్యం అధికంగాయుంటుందనే భయంతో కేశవపిళ్ళె, సి.ఎల్.నరసింహారెడ్డి, కె.సూర్యనారాయణ మొదలైన రాయలసీమ నాయకులు ఆంధ్ర రాష్ట్రం ఏర్పాటును వ్యతిరేకించసాగిరి.

## 2.4 శ్రీబాగ్ ఒప్పందం (1937)

1935 చట్టంద్వారా 1937లో జరిగిన మద్రాసు శాసనమండలుల ఎన్నికలలో ప్రత్యేక రాష్ట్ర ప్రతిపాదన ఒక ప్రధానాంశమయింది. ఎన్నికలలో ప్రత్యేక రాష్ట్రవాదులే అధికా సంఖ్యలో గెలుపొందినారు. రాజాజీ నాయకత్వంలో కాంగ్రెసు మద్రాసు రాష్ట్రంలో ప్రభుత్వాన్ని చేపట్టింది. రాజాజీ మంత్రివర్గంలో కోస్తావారికి ప్రాతినిధ్యమిచ్చి, రాయలసీమవారికి ప్రాతినిధ్యం లేకపోవడం రాయలసీమ నాయకులకు ఆందోళన కల్గించింది. ఇది కోస్తా- రాయలసిమ జిల్లాలవారి మధ్య మరింత అనుమానాలకు తావిచ్చింది. ఆంధ్ర కాంగ్రెసు కమిటీ అధ్యక్షుడు డా॥ పట్టాభి సీతారామయ్య రాయలసీమ జిల్లాలు పర్యటించి రాయలసీమ నాయకుల మద్దతు కోసం ప్రయత్నించినప్పటికి ఫలితం లేకపోయింది.

ఇటువంటి సరిస్థితులలోనే 1937 అక్టోబరులో ఆంధ్రమహాసభ రజతోత్సవ సమావేశం రాయలసీమ నాయకుడైన కోటిరెడ్డి అధ్యక్షతన విజయవాడలో ఏర్పాటయింది. ఈ సమావేశంలో రాయలసీమ నాయకుల సూచననుసరించి, క్రొత్తగా ఏర్పడే ప్రత్యేక ఆంధ్రరాష్ట్రంలో రాయలసీమ వారి హక్కుల పరిరక్షణకు కొన్ని మార్గదర్శక సూత్రాలను నిర్దేశించడానికై ఒక కమిటీని ఏర్పాటుచేసినారు. ఈ కమిటీలో కె. కోటిరెడ్డి, టి.ఎన్ రామకృష్ణారెడ్డి, కొండా వెంకటప్పయ్య, మహబూబ్ ఆలీబేగ్, దాసిరాజు హనుమంతరావు, మల్లిపూడి పళ్ళం రాజు, హెచ్. సీతారామాచారి, జి. హరి సర్వోత్తమరావు, సుబ్బరామరెడ్డి, పట్టిభి సభ్యులు. ఈ కమిటి సభ్యులు 16 నవంబరు 1937న మద్రాసులో శ్రీ కాశీనాధుని నాగేశ్వరరావు నివాస భవనమైన 'శ్రీబాగ్' లో సమావేశమై ఒక అంగీకారానికి వచ్చినారు. ఇదే 'శ్రీబాగ్ ఒప్పందం'గా ప్రసిద్ధికెక్కింది. దీని ప్రకారం

(1) ఆంధ్ర విశ్వవిద్యాలయం పర్యవేక్షణలో రెండు విశ్వవిద్యాలయ కేంద్రాలను ఒకటి విశాఖపట్నంలోను, రెండవది అనంతపురంలోను అభివృద్ధి చేయవలె.

(2) తుంగభద్ర, కృష్ణ, పెన్నానదుల నీటివనరుల వినియోగంలో రాయలసీమ వారికి ప్రాతినిధ్యమీయవలె.

(3) శాసన సభ్యుల నియామకం జిల్లాల ప్రాతిపదికగాయుండవలె.

(4) రాజధాని, హైకోర్టుల ఏర్పాటు విషయంలో రాయలసీమ వారి అభిప్రాయానికి ప్రాధాన్యమీయవలె.

ఈ ఒప్పందం కొంతవరకు కోస్తా- రాయలసీమ జిల్లాల వారి మధ్య సామరస్య వాతావరణం నెలకొనడానికి అవకాశమిచ్చింది.

## 2.5 థార్ కమీషన్ నియామకం (1948)

1946 ఎన్నికల ఫలితంగా మద్రాసులో కాంగ్రెసు ప్రభుత్వం ఏర్పడటంతో ఆంధ్రనాయకుల ప్రత్యేక రాష్ట్రవాంచ తీవ్రరూపం దాల్చింది. కాని ఆశించినఫలితం చేకూ రలేదు. దేశంలోని అగ్రనాయకులుకూ డా ఆశించిన సానుభూతిని చూపలేకపోయినారు. ముందు స్వాతంత్ర్యం, తరువాత రాష్ట్రం అన్నారు. కాని స్వరాజ్యం వచ్చిన తరువాత ప్రత్యేక భాషా రాష్ట్రవాంఛ జాతీయ సమైక్యతకు గొడ్డలి పెట్టని వాదించడం మొదలు పెట్టినారు.

కేబినెట్ మిషన్ ప్రణాళిక ప్రకారం 1946లో భారత రాజ్యాంగాన్ని రూపొందించడానికి డా॥రాజేంద్రప్రసాద్ అధ్యక్షతన రాజ్యాంగ సభ ఏర్పాటయింది. రాజ్యాంగ సభ ఆధ్వర్యాన భాషాప్రయుక్త రాష్ట్రాల ఏర్పాటును గురించి చర్చించి, సూచనలివ్వడానికి 17 జున్ 1948న ఎస్.కె.థార్ అధ్యక్షుడుగా, డా॥పన్నాలాల్, జగత్ నారాయణలాల్ సభ్యులుగా ఒక కమీషన్‌ను నియమించడం జరిగింది. థార్ కమీషన్ సెప్టెంబరులో మద్రాసును సందర్శించింది. కాని ఆ సమయానికి ఆంధ్రరాష్ట్ర అవతరణపై రాయలసీమ నాయకులకు, కోస్తాజిల్లాల నాయకులకు అవగాహన సరిగా లేనందున ఆంధ్రరాష్ట్రం ఏర్పాటుకు రాయలసీమ నాయకుల విముఖులుగాయుండిరి. ఆంధ్ర కాంగ్రెసు కమిటి అధ్యక్షుడు ఎన్.జి. రంగా శ్రీబాగ్ ఒప్పందాన్ని గుర్తించటానికి నిరాకరించటంతో విభేదాలు మరింత తీవ్రమైనాయి. ఈ విభేదాలు థార్ కమీషన్ భాషాప్రాతిపదికగా రాష్ట్రాలను విభజించరాదని సిఫారసు చేయడానికి అవకాశమిచ్చింది.

## 2.6 జె.వి.పి.నివేదిక (1949)

థార్ కమీషన్ నివేదిక కాంగ్రెసు వారిని ఎవరినీ సంతృప్తిపరచలేకపోయింది. తత్ఫలితంగా డిసెంబరు 1948లో జైపూర్‌లో సమావేశమైన కాంగ్రెసు, జవహర్‌లాల్ నెహ్రూ, సర్దార్ వల్లభాయి పటేల్, డా॥ పట్టాభి సభ్యులుగా భాషా రాష్ట్ర సమస్యను పరిశీలించడానికి ఒక కమిటీని నియమించింది. అదే జె.వి.పి. కమిటిగా ప్రసిద్ధికెక్కింది. జె.వి.పి. కమిటి ఏప్రిల్‌లో తన నివేదికను సమర్పించింది. ఈ కమిటి భాషాప్రాతిపదికగా రాష్ట్రాల ఏర్పాటును వాయిదా వేయాలని అభిప్రాయపడింది. కాని ఆంధ్రరాష్ట్రం ఏర్పడటం జరిగితే ఆంధ్రులు మద్రాసుపై తమ హక్కులను వదలుకొని, నిర్వివాద ప్రాంతాలతో ఆంధ్ర రాష్ట్రం ఏర్పాటు చేయవలసియుంటుందని అభిప్రాయపడింది. జె.వి.పి. రిపోర్టును కాంగ్రెసు వర్కింగ్ కమిటి ఏప్రిల్ 4, 1949న అంగీకరించింది. కాని జె.వి.పి. రిపోర్టు ఆంధ్రనాయకులను సంతృప్తిపరచలేక పోయింది. మద్రాసురహిత ఆంధ్రరాష్ట్ర ప్రతిపాదనను ప్రకాశం వ్యతిరేకించినాడు.

జె.వి.పి. రిపోర్టుపై ఆంధ్ర, తమిళనాడు ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీల అభిప్రాయాలను సేకరించి పంపవలసినదిగా కాంగ్రెసు వర్కింగ్ కమిటి మద్రాసు ప్రభుత్వాన్ని నిర్దేశించింది. దాని ఫలితంగా ముఖ్యమంత్రి కుమార స్వామిరాజా అధ్యక్షుడుగా, టి. ప్రకాశం, బెజవాడ గోపాలరెడ్డి, నీలం సంజీవరెడ్డి, కళా వెంకట్రావు, భక్తవత్సలం కృష్ణమాచారి, మాధవ మీనన్ సభ్యులుగా ఒక రాష్ట్రవిభజన కమిటి(Partition committee) ఏర్పాటయింది. కాని రాజధాని మద్రాసు విషయమై సభ్యుల మధ్య ఏకాభిప్రాయం కుదరనందున చివరకు విభిన్నాభిప్రాయాలతో నివేదిక జనవరి 1950లో భారత ప్రభుత్వానికి సమర్పించబడింది. ఇది కేంద్రం ప్రత్యేక రాష్ట్రవిషయమై జాప్యం చేయడానికి అవకాశమిచ్చింది.

## 2.7 ప్రత్యేక ఆంధ్రరాష్ట్రం ఏర్పాటు (1953)

ప్రత్యేక ఆంధ్ర రాష్ట్రం ఏర్పాటు విషయమై, కేంద్రనాయకుల ఉదాసీన వైఖరికి నిరసనగా 1951 ఆగష్టు 16న స్వామి సీతారాం ఆమరణ నిరాహార దీక్షను ప్రారంభించినాడు. కాని పరిస్థితులు చక్కబడలేదు. సెప్టెంబరు 20, 1951న 35 రోజుల నిరాహార దీక్ష అనంతరం వినోబా భావే విజ్ఞప్తితో సీతారామ్ నిరాహార దీక్షను విరమించినాడు. ఆంధ్ర రాష్ట్రాన్ని ఏర్పాటు చేయాలన్న ప్రయత్నాలు విఫలమైనాయి. 1951-52 జనరల్ ఎన్నికలలో కాంగ్రెసు, మద్రాసు శాసనమండలిలో మెజారిటి సీట్లను గెలుపొందలేక పోయింది. అయినప్పటికి రాజాజీ ముఖ్యమంత్రిగా కాంగ్రెసు మద్రాసులో ప్రభుత్వాన్ని ఏర్పరచగలిగింది. కాని ఆంధ్ర రాష్ట్రం ఏర్పాటు జరగలేదు.

కేంద్ర ప్రభుత్వం వైఖరికి ఆంధ్ర ప్రజలు నిరాశకు లోనైరి. ఈ పరిస్థితులలో 19 అక్టోబరు 1952న శ్రీ పొట్టిశ్రీరాములు ఆమరణ నిరాహార దీక్షను ప్రారంభించి, 58 రోజుల దీక్ష అనంతరం 15 డిసెంబరు 1952న ఆత్మాహుతి చేసికొన్నాడు. దానితో ఆంధ్రప్రాంతమంతా అలజడికి లోనైంది. ప్రజలు తీవ్ర ఆందోళన చెందినారు. రైల్వేస్టేషన్లు, వార్తా ప్రసార సాధనాలు, ప్రభుత్వ ఆస్తులను ధ్వంసం చేసినారు. దీనితో 19 డిసెంబరు 1952న మద్రాసును మినహాయించి, నిర్వివాద ప్రాంతాలతో ఆంధ్ర రాష్ట్రం ఏర్పాటు చేయబడునని ప్రధానమంత్రి నెహ్రూ ప్రకటించినాడు. సమస్యలను పరిశీలించేందుకు న్యాయమూర్తి కె.ఎన్. వాంచూను నియమించినారు. వాంఛూ నివేదిక ఆధారంగా కర్నూలు తాత్కాలిక రాజధానిగా, సి.యం. త్రివేది ప్రథమ గవర్నరుగా, ప్రకాశం ముఖ్య మంత్రిగా, సంజీవరెడ్డి ఉప ముఖ్యమంత్రిగ 1953 అక్టోబరు 1న ఆంధ్ర రాష్ట్రం ఆవిర్భవించింది.

## 2.8 తెలంగాణా ప్రాంతంలో ఆంధ్రోద్యమం:

కోస్తా ఆంధ్రలో ఆంధ్ర రాష్ట్ర ఉద్యమం కొనసాగుతున్న కాలంలోనే హైదరాబాదు సంస్థానంలోని ఆంధ్రులు కూ డా సంఘటితం కాసాగారు. ఉమ్మడి మద్రాసు రాష్ట్రంలోని తెలుగు ప్రజలు భాషాసాహిత్యోద్యమాల మూలంగా జాగృతి పొంది, వందేమాతరం ఉద్యమం ద్వారా రాజకీయ చైతన్యాన్ని పొంది ఇతర రాష్ట్రాల వారితో సమానంగా జాతీయ స్వాతంత్రోద్యమంలో పాలుపంచుకున్నారు. అదే సమయంలో జాతీయోద్యమంలో అతర్భాగంగా ప్రత్యేక రాష్ట్ర ప్రతిపత్తికోసం ఆంధ్రోద్యమాన్ని నిర్వహించి ప్రత్యేక ఆంధ్ర రాష్ట్రాన్ని

సాధించుకున్నారు. కాని తెలంగాణా ప్రాంతంలోని తెలుగు ప్రజలు మాత్రం నిజాం నవాబుల పాలన కారణంగా అనేక విధాల వెనుకబడియున్నారు. జాతీయ స్వాతంత్ర్యోద్యమం కాని, దానికి సమాంతరంగా జరిగిన ఆంధ్రోద్యమం కాని వీరిని ప్రభావితులను చేసేసరికి చాల కాలం పట్టింది. నైజాం పాలనలో తెలుగు ప్రజల స్థితి చాల ఆధ్వాన్నంగాయుండేది. రాష్ట్రంలో ఉన్నతోద్యోగాలన్నీ పరదేశీయులకు లేక రాష్ట్రేతరులకే యివ్వబడినాయి. సరైన విద్య, వైద్య సదుపాయాలు కాని, నీటి పారుదల సౌకర్యాలు కాని కల్పించబడలేదు. ప్లేగు, కలరా వంటి అంటువ్యాధులు ఒకవైపు, కరవు కాటకాలు మరోవైపు తరచు రాష్ట్రాన్ని పీడిస్తూయుండేవి. ప్రజా సంక్షేమాన్ని గురించి ప్రభుత్వపరంగా పట్టించుకున్నవారేలేరు.

ఇటువంటి పరిస్థితులలో 20వ శతాబ్దం తొలి దశలో తెలుగు భాషను అభివృద్ధి పరచి, తెలుగు భాష ద్వారా విజ్ఞాన వ్యాప్తిని తద్వారా తెలంగాణా ఆంధ్రులలో రాజకీయ జాగృతిని రగిలించడానికి కొన్ని ప్రయత్నాలు జరిగినాయి. 1930లో జోగిపేటలో సురవరం ప్రతాపరెడ్డి అధ్యక్షతన తెలంగాణా ప్రాంతానికి సంబంధించి 'ఆంధ్రమహాసభ' తొలి సమావేశం నిర్వహించినారు. ఈ మహాసభలో భాగంగా ప్రథమాంధ్ర మహిళా సభకూ డ సమావేశమై స్త్రీల సమస్యలపై చర్చించటం జరిగింది. ఆంధ్ర మహాసభ వార్షిక సమావేశాలను ఏర్పాటు చేయటం ద్వారా తెలంగాణా ఆంధ్రులలో సామాజిక చైతన్యాన్ని తీసికొని రావటానికి కృషిచేసింది. అదే పంథాలో తెలంగాణా ప్రాంతాన్ని జాతీయోద్యమ స్రవంతిలో చేర్చటానికి వీలుగా 1938 జూలై లో బూర్గుల రామకృష్ణారావు కన్వీనర్‌గా 'హైదరాబాదు స్టేట్ కాంగ్రెసు'ను ఏర్పాటు చేసినారు. ఈ నేపథ్యంలో 1947 ఆగష్టు 15న భారతదేశానికి రాజకీయ స్వాతంత్ర్యం రావటం, హైదరాబాదు సంస్థానం ఇండియన్‌లో విలీనం కావటంతో విశాలాంధ్ర ప్రతిపాదనకు ఉత్తేజం కలిగింది.

కోస్తా ఆంధ్రలో ఆంధ్ర రాష్ట్రం ఉద్యమం కొనసాగుతున్న కాలంలోనే హైదరాబాదు సంస్థానంలోని ఆంధ్రులు కూ డా సంఘటితం కాసాగిరి. స్వాతంత్ర్యం రావటం, హైదరాబాదు సంస్థానం ఇండియన్ యూనియన్‌లో విలీనం కావడంతో విశాలాంధ్ర ప్రతిపాదనకు ఉత్తేజం కల్గింది.

విశాలాంధ్ర ఏర్పాటుకు కృషి చేసిన వారిలో అయ్యదేవర కాళేశ్వరరావును ప్రముఖులుగా పేర్కొనవచ్చు. ఆయన విజయవాడ కేంద్రంగా 26 నవంబరు 1949న విశాలాంధ్ర మహాసభను ఏర్పాటు చేసి, మద్రాసు, ఒరిస్సా, మధ్యప్రదేశ్, హైదరాబాదు, మైసూరు రాష్ట్రాలలోని తెలుగు జిల్లాలను సంఘటిత పరచి విశాలాంధ్రను ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేసినాడు. కాని కె.వి. రంగారెడ్డి, డా॥చెన్నారెడ్డి, జె.వి. నరసింగరావు ప్రభృతులు తెలంగాణాలోను, ఎన్.జి.రంగా ఆంధ్రలోను విశాలాంధ్ర ప్రతిపాదనను వ్యతిరేకించినారు. ప్రథమంలో హైదరాబాదు సంస్థానం ముఖ్యమంత్రి శ్రీ బూర్గుల రామకృష్ణారావు విశాలాంధ్ర ప్రతిపాదనను వ్యతిరేకించినప్పటికి, తరువాత కాలంలో తన అభిప్రాయాన్ని మార్చుకొనినాడు. పీపుల్స్ డెమోక్రాటిక్ ఫ్రంట్, కమ్యూనిస్టు పార్టీ, కిసాన్ సభ విశాలాంధ్ర ప్రతిపాదనను బల పరచాయి.

## 2.9 ఆంధ్రప్రదేశ్ అవతరణ (1956)

ఆంధ్రరాష్ట్రం ఏర్పాటు అనంతరం, డిసెంబరు 22, 1953న ప్రధానమంత్రి నెహ్రూ రాష్ట్రాల పునర్విభజను మార్గదర్శక సూత్రాలను రూపొందించడానికి సయ్యద్ ఫజల్ ఆలీ అధ్యక్షుడుగా, హెచ్.ఎన్.కుంజ్రు, కె.ఎం. ఫణిక్కర్‌లు సభ్యులుగా రాష్ట్రాల పునర్నిర్మాణ సంఘాన్ని (ఎస్.ఆర్.సి) ఏర్పాటుచేసినాడు. ఈ కమీషన్ సెప్టెంబరు 30, 1955న తన నివేదికను సమర్పించింది. దాని ప్రకారం ప్రస్తుతం ప్రత్యేక తెలంగాణా రాష్ట్రాన్ని ఏర్పాటు చేయాలని, 1961 జనరల్ ఎన్నికల అనంతరం 2/3వంతు తెలంగాణా రాష్ట్రశాసన సభలోని సభ్యులు అంగీకరించిన యెడల ఆంధ్ర రాష్ట్రంలో ఏకం కావచ్చునని సిఫార్సు చేసింది.

ఈ పరిస్థితులలో హైదరాబాద్ సంస్థానంలో విశాలాంధ్ర మద్దతుదారులు, వ్యతిరేకులు నానాటికి అధికంకాసాగిరి. అందువలన 1955 నవంబరులో కాంగ్రెసు అధిష్టానవర్గం ఢేబర్ అధ్యక్షుడుగా, నెహ్రూ, అజాద్, పంత్‌లు సభ్యులుగా ఒక సబ్ కమిటిని నియమించింది. కాని కమిటి తెలంగాణా సమస్యను పరిష్కరించలేకపోయింది.

1955 జనరల్ ఎన్నికలలో ప్రకాశం మంత్రివర్గం పోయి బెజవాడ గోపాలరెడ్డి ముఖ్యమంత్రి అయినాడు. కొన్ని రక్షణలు తెలంగాణా వారికి కల్పించడం ద్వారా విశాలాంధ్రను ఏర్పాటు చేయాలని గోపాలరెడ్డి సూచించినాడు. ఫలితంగా ధేబర్, గోవింద వల్లభ పంత్‌ల ప్రోద్బలంతో తెలంగాణా నాయకులు 1956 ఫిబ్రవరి 20న ఆంధ్రనాయకులతో 'పెద్దమనుషుల ఒప్పందా'నికి రావటం జరిగింది. ఈ చర్చలలో తెలంగాణా వైపు బూర్గుల రామకృష్ణారావు, డా॥చెన్నారెడ్డి, కె.వి.రంగారెడ్డి, జె.వి. నరసింగరావు ఆంధ్ర నుండి బెజవాడ గోపాలరెడ్డి, అల్లూరి సత్యనారాయణ రాజు, సంజీవరెడ్డి గౌతు లచ్చన్న ప్రభృతులు పాల్గొన్నారు. ఈ ఒప్పందం ప్రకారం

(1) 26 మంది సభ్యులతో తెలంగాణా ప్రాంతీయ మండలిని ఏర్పాటు చేయవలెను. తెలంగాణా పరిపాలన, అభివృద్ధి వ్యవహారాలలో ఈ మండలి అభిప్రాయాలకు ప్రాధాన్యమీయవలెను.

(2) కేబినెట్ మంత్రులు ఆంధ్ర నుండి, తెలంగాణానుండి వరుసగా 60:40 నిష్పత్తిలో యుండవలె.

(3) ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి పదవులలో ఒకటి తెలంగాణా వారికీయవలెను.

(4) ఉద్యోగ నియామకాలలో తెలంగాణావారికి తగినంత ప్రాధాన్యమీయవలెను. ఈ ఒప్పందం ద్వారా ఆంధ్ర, తెలంగాణా నాయకుల మధ్య వైషమ్యాలు పరిష్కరింపబడినాయి.

ఈ ఒప్పందం ఫలితంగా నీలం సంజీవరెడ్డి ముఖ్యమంత్రిగ, హైదరాబాదు ముఖ్య పట్టణంగా నవంబరు 1, 1956న ఆంధ్రప్రదేశ్ అవతరించినది. ఆంధ్రుల చిరకాల వాంఛ నెరవేరినది.

## 2.10 ఆంధ్రప్రదేశ్ - సామాజిక, ఆర్థిక నేపథ్యం:

భారత యూనియన్‌లోని 28 రాష్ట్రాలలో అక్షర క్రమంలో మొట్టమొదటి రాష్ట్రం ఆంధ్రప్రదేశ్. ఇది భారత భూభాగంలో ఆగ్నేయ దిశలో $12^0$ - $14^0$ - $19^0$ - $54^0$ఉత్తర అక్షాంశాల మధ్య, $76^0$ - $50^0$ -$84^0$ - $50^0$ తూర్పు రేఖాంశాల మధ్య ఉంది. దీనికి తూర్పున బంగాళాఖాతం, దక్షిణాన తమిళనాడు రాష్ట్రం, పశ్చిమాన కర్ణాటక, మహారాష్ట్రాలు, ఉత్తరాన ఛత్తీస్‌గడ్, ఒరిస్సా రాష్ట్రాలు సరిహద్దులుగా ఉన్నాయి. చారిత్రక కారణాల వలన రాష్ట్రాన్ని ఆంధ్ర, రాయలసీమ, తెలంగాణ అని మూడు ప్రాంతాలుగా పేర్కొనడం జరుగుతోంది. పరిపాలనా సౌలభ్యం దృష్ట్యా మొత్తం రాష్ట్రాన్ని 23 జిల్లాలుగా విభజించటం జరిగింది. వీటిలో 9 జిల్లాలు ఆంధ్ర ప్రాంతానికి, 10 జిల్లాలు తెలంగాణా ప్రాంతానికి, 4 జిల్లాలు రాయలసీమ ప్రాంతానికి చెంది ఉన్నాయి.

ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ ప్రధాన రాష్ట్రం. జి.డి.పిలో 20శాతం వ్యవసాయరంగం నుంచే వస్తోంది. రాష్ట్ర జనాభాలో 69 శాతం మందికి (2001) వ్యవసాయం రంగం ఉపాధి కల్పిస్తుంది. వ్యవసాయరంగం అభివృద్ధికి, రైతు సంక్షేమానికి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోంది. రాష్ట్ర విస్తీర్ణం 2072 లక్షల చదరపు కిలోమీటర్లు. దేశం మొత్తం విస్తీర్ణం లో ఇది 8.4 శాతం. దీనిలో 974 కిలోమీటర్లు తీర ప్రాంతం. వివిధ రకాల పంటలతో సాగవుతున్న భూమి 1.048 లక్షల చదరపు కిలోమీటర్లు. సంవత్సర సగటు వర్షపాతం 896 మి.మీ వ్యవసాయం, పారిశ్రామిక, సేవారంగాలలో రాష్ట్రం ప్రగతి సాధించడానికి ప్రయత్నించడం ద్వారా పటిష్టమైన ఆర్థిక వ్యవస్థను ఏర్పాటు చేయడానికి కృషి జరుగుతోంది. ప్రస్తుతం దేశం మొత్తంలో మహారాష్ట్ర తర్వాత పెట్టుబడులకు అనువైన రాష్ట్రంగా ఆంధ్రప్రదేశ్ పరిగణింపబడుతోంది.

భారతదేశంలోని ఇతర రాష్ట్రాల మాదిరి, ఆంధ్రప్రదేశ్ సామాజిక వ్యవస్థలో అనేక మతాలు, కులాలు ఉన్నాయి. కుల వ్యవస్థ ప్రభావం అన్ని మతాల వారిలోను ఉంది. అది ఒక్క హిందూ మతానికే పరిమితం కాలేదు. అది వివిధ మతాలలో వివిధ రూపాలలో కనిపిస్తుంది. ఉదాహరణకు ముస్లింలలో షియాలు, సున్నీలు, షేక్‌లు, క్రైస్తవులలో కేథలిక్కులు, ప్రొటెస్టెంట్లు, చర్చివారిగా ఉన్న ఇతర శాఖలు. కుల వ్యవస్థ ఉన్న ఆంధ్రప్రదేశ్ సామాజిక వ్యవస్థలో సాంఘిక, ఆర్థిక మార్పు అనేక ఒత్తిళ్ళకు లోనవడం సహజమే. ఈ సమాజంలో ఉమ్మడి కుటుంబవ్యవస్థ క్షీణించడం ప్రారంభమైనప్పటికి, ఉమ్మడి కుటుంబానికి సంబంధించిన మానసికోద్వేగ (Emotional) కుటుంబ బంధం ఇంకా కొనసాగుతుందనే చెప్పాలి. వీటన్నిటి ప్రభావం రాజకీయ, పాలనా వ్యవస్థపై ఉంటుంది.

ఆంధ్రప్రదేశ్ సామాజిక వ్యవస్థలో గ్రామీణ ప్రజలు పట్టణ ప్రాంతాలకు ఉపాధి అన్వేషణ కోసం వలస వెళ్ళడం ఒక ముఖ్యమైన విషయం. గ్రామీణ ప్రాంత ప్రజల సంఖ్య ఈ కారణంగా తగ్గుముఖం పడుతోంది. ఉదాహరణకు 1981లో 76.7 శాతంగా ఉన్న గ్రామీణ జనాభా 1991లో 73.11 శాతానికి, 2001లో 72.92 శాతానికి తగ్గింది. గ్రామీణ ప్రాంత వలసలు, పారిశ్రామికీకరణ సంస్కృతి వలన పట్టణాల పరిధులు విస్తృతమవడమే గాక అనేక సమస్యలు - గృహవసతి, మురికి వాడలు , నిరుద్యోగం, సాంఘిక, ఆర్థిక నేరాలు - ఉత్పన్నమవుతున్నాయి. మున్సిపల్ కార్పొరేషన్లు, మున్సిపాలిటీలు, పట్టణ అభివృద్ధి సంస్థలు ఈ సమస్యల నిర్మూలనకు కృషి చేయవలసి ఉంది.

2001 జనాభా లెక్కలను బట్టి రాష్ట్రంలో మొత్తం జనాభా 75, 727, 541 మంది ఉన్నారు. ఇందులో 55, 223, 944 మంది గ్రామాలలో ఉండగా, 20. 503, 537 మంది పట్టణాలలో ఉన్నారు. అంటే 72.92 శాతం గ్రామీణ జనాభా అని 27.05 శాతం పట్టణ, నగర జనాభా అని స్పష్టమవుతుంది.

సామాజిక- ఆర్థిక ప్రగతికి విద్య కీలక అంశం. ఆంధ్రప్రదేశ్‌లో అక్షరాస్యత శాతం 61.11 రాష్ట్రంలోని 23 జిల్లాలలో హైదరాబాద్ (తెలంగాణా ప్రాంతం) 79.04% అక్షరాస్యతతో అత్యున్నత స్థానంలో ఉండగా పశ్చిమగోదావరి, కృష్ణా (ఆంధ్ర ప్రాంతం), చిత్తూరు (రాయలసీమ ప్రాంతం) వరుసగా 73.95; 69.91; 67.46 శాతం అక్షరాస్యతను కలిగి ఉన్నాయి. అదే విధంగా అతి తక్కువ శాతం అక్షరాస్యత మెహబూబ్ నగర్ (45.53%) (తెలంగాణా ప్రాంతం), విజయనగరం (ఆంధ్ర ప్రాంతం) (51.82%), మెదక్ (50.24%) (తెలంగాణా) జిల్లాలలో ఉంది.

గ్రామీణ అక్షరాస్యత శాతాన్ని చూస్తే, పశ్చిమగోదావరి మొదటిస్థానంలోను (72.48%), కృష్ణా (65.56%), చిత్తూరు (63.67%) రెండు, మూడు స్థానాల్లో ఉన్నాయి. ఈ సందర్భంలో కూ డ మెహబూబ్ నగర్ (46.86%) అతి తక్కువ శాతంలో ఉంది.

మొత్తం అక్షరాస్యత శాతంలో పురుషుల అక్షరాస్యత శాతం 70.85% కాగా స్త్రీల అక్షరాస్యత శాతం 51.17%. గ్రామీణ స్త్రీ, పురుష అక్షరాస్యత శాతంలో కూ డ అసమానతలు కన్పిస్తాయి. గ్రామీణ స్త్రీ అక్షరాస్యత శాతం 44.36% కాగా గ్రామీణ పురుషుల అక్షరాస్యత శాతం 66.13%. 2001 జనాభా లెక్కల ప్రకారం ఈ విధంగా విద్యారంగంలో అశిల భారత స్థాయి కంటె ఆంధ్రప్రదేశ్ తక్కువ స్థాయిలో ఉన్నట్లు తేలింది.

దారిద్ర్య రేఖ కంటె ఇంకా అట్టడుగు స్థాయిలో 15.42 శాతంకుటుంబాలున్నాయి. సుమారుగా రాష్ట్రంలో 25 లక్షలకుటుంబాలు దారిద్ర్య రేఖకు దిగువున (BPL) ఉన్నాయి. ఉపాధి రంగంలో, రాష్ట్రంలో అనేక స్వయం ఉపాధి పథకాలు అమలు పర్చబడుతున్నాయి. అయినప్పటికి నిరుద్యోగిత పెరుగుతూనే వుంది.

## ఆంధ్రప్రదేశ్‌లో ఉపాధి కల్పనా రంగాలు:

1. వ్యవసాయం
2. పారిశ్రామిక రంగం
3. సేవా రంగం

మహిళలకు, యువతకు ఉపాధి కల్పించడం స్వయం సహాయక గ్రూపుల సిద్ధాంతం.

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం 1998లో విజన్ 2020 డక్యుమెంటు రూపొందించుకొంది. మంచి పరిపాలనను అందించడానికి సుపరిపాలన వ్యవస్థ (Good Governance) ప్రవేశపెట్ట బడింది. రాజకీయ వ్యవస్థ సుపరరిపాలనను అందించడానికి దోహదం చేయ్యాలి.

ఆంధ్రప్రదేశ్ లో అమలు చేస్తున్న సుపరిపాలన నమూనా అన్ని రాష్ట్రాలకు ఆదర్శప్రాయం. ఇది ఇప్పుడు జాతీయ అజెండాగా రూపొందింది.

రాష్ట్ర జనాభాలో సుమారు 50 శాతం మహిళలు వున్నారు. ప్రభుత్వ ఉద్యోగాలు, విద్యాసంస్థలు, స్థానిక సంస్థలలో మహిళలకు 33% రిజర్వేషన్ కల్పించడం జరిగింది. మహిళల ఆర్థిక, సామాజిక, రాజకీయ సాధికారత రాష్ట్రంలో ముఖ్యమైన విషయం.

ఆర్థిక రంగంలో పెట్టుబడులను ఆకర్షించేందుకు ఆంధ్రప్రదేశ్ అనుసరిస్తున్న విధానం.

- మౌలిక సదుపాయాల అభివృద్ధి
- నైపుణ్యంగల నిపుణుల బృందాల రూప కల్పన
- అధికారుల పెత్తనం తగ్గింపు, వ్యవహారాల సరళతరం
- ఆన్ లైన్ క్లియరెన్సులు, అనుమతులు

గడిచిన సుమారు 5 దశాబ్దాలుగా రాష్ట్రం సాధించిన సామాజిక - ఆర్థిక ప్రగతిని పరిశీలిస్తే ప్రకృతి వైపరీత్యం వల్ల, మానవీయ వైపరీత్యాల వల్ల రాష్ట్రం విపరీతంగా నష్టపోతోందని తెలుస్తుంది. అతి వృష్టి, లేదా అనావృష్టి, తరచుగా రాష్ట్రాన్ని తాకుతున్న తుఫానులు, వరదలు కారణంగా రాష్ట్ర రైతాంగం తీవ్రంగా కష్టనష్టాలకు లోనవుతున్నారు. వీటికి తోడు సమ్మెలు, లాకౌట్లు, ఆందోళనలు, ఉద్యమాలు వంటి మానవీయ వైపరీత్యాలవలన కూ డా రాష్ట్రం అతలాకుతలమవుతున్నది.

వీటి కారణంగా అపారమైన ఆస్థి నష్టం, ప్రాణనష్టం సంభవిస్తునాయి. గతంలో చోటుచేసుకున్న తెలంగాణా ఉద్యమం (1969), ప్రత్యేక ఆంధ్ర ఉద్యమం (1972)ల మూలంగా రాష్ట్రాభివృద్ధి చాల వరకు కుంటుపడింది. ఆ నష్టం నుండి తేరు కోకముందే నక్సలైట్ వర్గాలు కొనసాగిస్తున్న సాయుధ పోరాటం రాష్ట్రాభివృద్ధిని మరింత దిగజారుస్తోంది. వీటికి అదనంగా ఇటీవల తెలంగాణా రాష్ట్రసమితి ఆధ్వర్యంలో ప్రత్యేక తెలంగాణా గురించి చేస్తున్న ఆందోళన రాష్ట్రప్రగతికి, సమగ్రతకు గొడ్డలిపెట్టుగా పరిణమిస్తోంది.

## 2.11 సారాంశం

స్వతంత్ర భారతదేశంలో భాషా ప్రాతిపదికపై ఏర్పడిన రాష్ట్రాలలో ఆంధ్రప్రదేశ్ చాల ప్రముఖమైనది. 1953కు పూర్వం ఈ ప్రాంతం సంఘటిత మద్రాసు రాష్ట్రంలో అంతర్భాగంగాయుండేది. కాని కాల క్రమంలో ఈ ప్రాంతాలలో గోదావరి, కృష్ణా నదులపై ఆనకట్టలు నిర్మించటం ద్వారా చేకూ రిన ఆర్థికాభివృద్ధి, సామాజిక, రాజకీయ చైతన్యం ఆంధ్రులలో ప్రత్యేక రాష్ట్రవాంఛకు, ఉద్యమానికి దారి తీసింది. తత్ఫలితంగా ఆంధ్ర మహాసభ లేక ఆంధ్ర మహాజన సభ మొదట సమావేశం 1913 మే 20న బాపట్లలో మద్రాసు లెజిస్లేటివ్ కౌన్సిల్ సభ్యుడు బయ్యా నరసింహం శర్మ అధ్యక్షతన జరిగింది. అదే పంథాలో జనవరి 22, 1918న న్యాపతి సుబ్బారావు అధ్యక్షుడుగా, కొండా రాష్ట్ర కాంగ్రెసు కమిటి ఏర్పాటైంది. ఆ తరువాత 1920లో మహాత్మగాంధీ భారత రాజకీయ రంగంలో ప్రవేశించటంతో ఆంధ్ర రాష్ట్ర నినాదం ఆగి ' స్వరాజ్య సంపాదన' ప్రముఖ స్థానాన్ని ఆక్రమించింది.

ఒక వైపు జాతీయోద్యమంలో పాలుపంచుకుంటూనే ఆంధ్రనాయకులు ఆంధ్రరాష్ట్రం ఏర్పాటుకు కృషి చేసినారు. వీరి కృషి ఫలితమే 26 ఏప్రిల్ 1926లో విజయవాడలో ఆంధ్ర విశ్వవిద్యాలయం ఏర్పాటు. భాషా ప్రాతిపదికపై ఏర్పడిన మొదటి విశ్వవిద్యాలయంగా దీనిని పేర్కొనవచ్చు. ఇదే సమయంలో ప్రత్యేక ఆంధ్ర రాష్ట్ర ఏర్పాటు పై రాయలసీమ నాయకులలో చోటు చేసుకున్న అపోహలను, అనుమానాలను నివృత్తి చేయటానికి 16 నవంబరు 1937న మద్రసులో ' శ్రీబాగ్ ఒప్పందాన్ని' కుదుర్చుకోవటం జరిగింది. ఆ తరువాత కేబినెట్ మిషన్ ప్రణాళిక ప్రాతిపదికగా ఏర్పాటైన రాజ్యాంగ పరిషత్తు భాషా ప్రయుక్త రాష్ట్రాల ఏర్పాటును గురించి చర్చించి, సూచనలివ్వటానికి వీలుగా థార్ కమీషన్ (1948)న ఏర్పాటు చేసింది. థార్ కమీషన్ నివేదిక ఎవరిని సంతృప్తి పరచక పోవటంతో నెహ్రూ, పటేల్, పట్టాభిలు సభ్యులుగా జె.వి.పి. కమిటీ (1949) ఏర్పాటైంది. కాని ఈ కమిటి ఆంధ్ర, తమిళనాడు కాంగ్రెసు నాయకుల మధ్య రాజధాని మద్రాసు విషయమై ఏకాభిప్రాయం కుదరకపోవటంతో ఆంధ్ర రాష్ట్ర సమస్యను పరిష్కరించలేకపోయింది. ఇది కేంద్రం ప్రత్యేక రాష్ట్ర విషయమై జాప్యం చేయటానికి అవకాశం యిచ్చింది. కేంద్రనాయకుల ఉదాశీన వైఖరికి నిరసనగా 1951లో స్వామి సీతారాం ఆ తరువాత 1952లో పొట్టి శ్రీరాములు ఆమరణ దీక్షను ప్రారంభించినారు. చివరకు పొట్టి శ్రీరాములు ఆత్మార్పణతో ప్రధానమంత్రి నెహ్రూ ఆంధ్రరాష్ట్రం ఏర్పాటుమ ప్రకటించినారు. న్యాయమూర్తి వాంఛూ నివేదిక ఆధారంగా కర్నూలు రాజధానిగా 1953 అక్టోబరు 1న ఆంధ్ర రాష్ట్రం ఆవిర్భవించింది. అదే సమయంలో తెలంగాణా ప్రాంతంలోని ఆంధ్రులలో చోటుచేసుకున్న సామాజిక - రాజకీయ చైతన్యం ప్రాతిపదికగా

విశాలాంధ్ర ఉద్యమానికి అవకాశం కల్గింది. ఈ ఉద్యమం ద్వారా చోటు చేసుకున్న వివిధ రాజకీయ పరిణామాల నేపథ్యంలో చివరకు 1956 ఫిబ్రవరి 20న తెలంగాణా - ఆంధ్రనాయకుల మధ్య కుదిరిన పెద్దమనుషుల ఒప్పందం ద్వారా నవంబరు 1, 1956న నీలం సంజీవ రెడ్డి ముఖ్యమంత్రిగ, హైదరాబాదు రాజధానిగా ఆంధ్రప్రదేశ్ అవతరించింది.

## 2.12 నమూనా ప్రశ్నలు

1. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం అవతరణకు దోహదం చేసిన వివిధ పరిస్థితులను విపులీకరించుము.

## లఘు వ్యాస రూప ప్రశ్నలు

1. ప్రత్యేక ఆంధ్రరాష్ట్ర భావనకు దోహదం చేసిన కారణాలను వివరించుము.
2. శ్రీ బాగ్ ఒప్పందాన్ని గురించి వివరించుము.
3. 'పెద్ద మనుషుల ఒప్పందం' లోని ముఖ్యాంశములను విశదీకరించుము.
4. తెలంగాణా ప్రాంతంలో చోటు చేసుకున్న ఆంధ్ర ఉద్యమాన్ని గురించి సంక్షిప్తంగా విశదీకరించుము

## 2.13 చదువదగిన గ్రంథాలు


1. Prof. A.Prasanna Kumar (etal) : Government and Politics in Andhra Pradesh
2. K.V.Narayana Rao : The Emergence of Andhra Pradesh
3. K.R.Acharya (Ed) : ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం - రాజకీయాలు
4. 'తెలుగు' త్రైమాసిక వైజ్ఞానిక పత్రిక, అక్టోబరు - డిసెంబరు 1978.


ఆచార్య ఐ. దోసగిరిరావు

పాఠం. 3

# రాష్ట్ర కార్యనిర్వాహక శాఖ - గవర్నరు

## 11.0 లక్ష్యం:

భారత రాజకీయ చరిత్రలో గవర్నరు వ్యవస్థకు ఎంతో విశిష్టమైన స్థానం ఉంది. రాష్ట్ర పాలనా ప్రక్రియలో ముఖ్యమంత్రి పదివికన్నా ముందు గవర్నరు పదవి ఆవిర్భవించింది అనే విషయం గమనించాలి. బ్రిటీష్ - భారత రాజ్యాంగ చరిత్రలో రాష్ట్ర పరిపాలన గవర్నరు నిర్వహించేవారు. అటువంటి గవర్నరు పదవికి సంబంధించిన సమాచారాన్ని వివరించటమే ఈ పాఠం లక్ష్యం.

**విషయసూచిక:**

3.1. ఆవిర్భావము

3.2. గవర్నరు - నియామకము

3.3. గవర్నరు - అధికారము

3.4.సర్కారియా కమిషన్ - సిఫారసులు

3.5. బొమ్మై - కేసు : సుప్రీమ్‌కోర్టు తీర్పు

3.6. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి గవర్నరుగా పనిచేసినవారి జాబిత

3.7. సారాంశము

3.8. నమూనా ప్రశ్నలు

3.9. చదువదగిన గ్రంథాలు

## 11.1 ఉపోద్ఘాతము :

భారతదేశాన్ని బ్రిటీష్ ఈస్ట్ ఇండియా కంపెనీ పరిపాలించిన తొలి రోజుల్లో ప్రభుత్వ నిర్వహణ కోసం గవర్నరు పదవి ఏర్పాటు చేయబడింది. ఆ రోజుల్లో గవర్నరు చాలా శక్తివంతమైన అధికారి. కాని ఈ రోజుల్లో గవర్నరు పదివికి చెప్పుకోదగిన ప్రాధాన్యత లేదు. దానికి కారణం ప్రస్తుత గవర్నరుకు పెద్దగా వాస్తవ అధికారములు లేకపోవుటయే. 1773లో బ్రిటీష్ పార్లమెంటు జారీచేసిన రెగ్యులేటింగ్ చట్టం గవర్నరు అధికారాలను చట్టబద్ధంగా క్రమబద్ధీకరించింది.. 1858లో జారీచేసిన పార్లమెంటు చట్టం, భారత దేశంలో, ఈస్ట్ ఇండియా కంపెనీ పరిపాలనను రద్దు చేసింది. పార్లమెంటు ప్రత్యక్షముగా పరిపాలన చేపట్టింది. అటు కేంద్రంలోను, ఇటు ప్రెసిడెన్సీలలోను పరిపాలన సమర్ధవంతంగా నిర్వహించడానికి కేంద్రస్థాయిలో గవర్నరు జనరల్‌కు ప్రెసిడెన్సీ స్థాయిలో గవర్నరుకు పటిష్టమైన అధికారాలు కల్పించబడ్డాయి. 1858 నుండి 1947లో భారతదేశానికి స్వాతంత్ర్యం సిద్ధించేవరకు, గవర్నర్లు రాష్ట్రపరిపాలనలో కీలకమైన భూమికను పోషించారు. భారతదేశంలో గవర్నరు పదవి, ఆంగ్లేయుల పాలనలో ఆంగ్లేయుల ద్వారా ఏర్పాటు చేయబడిందనే విషయం మరువరాదు.

1946లో భారతదేశానికి రాజ్యాంగం రచించుటకు రాజ్యాంగ చట్టసభ ఏర్పాటయింది. రాజ్యాంగ చట్టసభలో రాష్ట్రంలో గవర్నరు పదవి ఏర్పాటుపై విస్తృతమైన, ఆశక్తికరమైన చర్చ జరిగింది. అనేక సూచనలు, సలహాలు ఇవ్వబడ్డాయి. వాటన్నింటినీ క్షుణ్ణంగా పరిశీలించిన పిమ్మట గవర్నరు పదవిని రద్దు చేయకుండా, కొన్నిమార్పులతో గవర్నరు పదవిని కొనసాగించాలని నిర్ణయించడమైనది. భారతదేశంలో ఏర్పడబోయే సమాఖ్యప్రభుత్వ విధానంలో రాష్ట్రగవర్నరు అటుకేంద్రానికి, ఇటు రాష్ట్రానికి మధ్య సంధానకర్తగా నామమాత్రపు అధికారిగా కొనసాగుతాడని భావించారు రాజ్యాంగ నిర్మాతలు. అందుకే గవర్నరు ప్రజలద్వారా ఎన్నుకోబడకుండా భారత రాష్ట్రపతి ద్వారా నియమమించబడే విధంగా ఏర్పాటు చేసారు. గవర్నరు పదవి రాజకీయాలకు అతీతంగా ఉండాలని వారు భావించారు.

## 3.2. గవర్నరు - నియామకము:

ఎ) రాజ్యాంగ నిబంధన 153 ప్రకారము భారత సమాఖ్యలో సభ్యత్వం కల ప్రతి రాష్ట్రానికి ఒక గవర్నరు ఉంటాడు.

బి) నిబంధన 154 ప్రకారము రాష్ట్ర ప్రభుత్వము యొక్కకార్యనిర్వాహక అధికారాలను గవర్నరే నిర్వహిస్తాడు. ఆ అధికారాలను రాజ్యాంగం నిర్దేశించిన ప్రకారం గవర్నరు, ప్రత్యక్షముగా లేదా తన క్రింది అధికారుల ద్వారా నిర్వహించాలి. అనగా గవర్నరు రాష్ట్రానికి ముఖ్యకార్యనిర్వాహక అధికారి.

సి) నిబంధన 154 ప్రకారము భారత రాష్ట్రపతి గవర్నరును నియమిస్తాడు.

### 3.2.1. అర్హతలు:

1) భారత పౌరుడై ఉండాలి.
2) 35 సంవత్సరములు నిండినవాడై ఉండాలి.
3) పార్లమెంటులో కాని, రాష్ట్ర శాసనసభలో కాని సభ్యుడై ఉండరాదు
4) ఆదాయం సమకూర్చే ఏ ఇతర పదవిని కలిగి ఉండరాదు.

### 3.2.2. జీత భత్యాలు :

రాజ్యాంగం ప్రకారం గవర్నరు జీతభత్యాలను భారత పార్లమెంటు నిర్ణయిస్తుంది. ఆయన పదవిలో కొనసాగినంతకాలం జీతభత్యాలలో కోతవిధించరాదు.

ప్రస్తుతం గవర్నరు జీతం నెలకు రూ. 36,000. చట్టప్రకారము ఆయనకు ఇతర సౌకర్యములు లభిస్తాయి. రాజ్‌భవన్‌లో సకల సౌకర్యములతో ఉచిత నివాసం కల్పించబడుతుంది. ఈ ఖర్చులన్నీ రాష్ట్ర సంఘటిత నిధి నుంచి ఖర్చు పెడతారు. కాబట్టి ఈ ఖర్చులకు రాష్ట్ర శాసనసభ ఆమోదం అవసరంలేదు.

### 3.2.3. పదవీకాలం:

ఎ) రాజ్యాంగం 156(1) ప్రకారము రాష్ట్రపతికి ఇష్టం ఉన్నంతకాలం గవర్నరు పదవిలో కొనసాగుతారు. గవర్నరు పనితీరు నచ్చకపోతే పదవీకాలం పూర్తి కాకుండానే తొలగించవచ్చును. ఉదాహరణకు 2003 సంవత్సరములో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి గవర్నరుగా నియమించబడి, గవర్నరు పదవిలో కొనసాగుతున్న సూర్జిత్ సింగ్ బర్నాలాను 2-11-2004న తమిళనాడు

గవర్నరుగా బదిలీ చేసారు. కేంద్రంలో N.D.A సంకీర్ణ ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పుడు నియమించబడిన చాలా మంది గవర్నర్లను 22-5-2004న ఏర్పాటైన U.P.A సంకీర్ణ ప్రభుత్వం తొలగించి కొత్త వారిని నియమించింది. 1984లో N.T. రామారావును ముఖ్యమంత్రి పదవినుండి అప్రజాస్వామికంగా తొలగించిన గవర్నర్ రామ్‌లాల్ పదవికి రాజీనామా చేయక తప్పలేదు.

బి) రాజ్యాంగం 156(3) నిబంధన ప్రకారము గవర్నర్ పదవీ కాలం 5 సంవత్సరములు.

సి) రాష్ట్ర హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి సమక్షంలో గవర్నర్ పదవీ ప్రమాణం చేస్తాడు.

## 3.3. గవర్నరు - అధికారాలు

గవర్నరు అధికారాలను 2 రకాలుగా వర్గీకరించవచ్చు. అవి

1. రాజ్యాంగాధికారాలు
2. విచక్షణాధికారములు.

### 3.3.1.రాజ్యాంగాధికారములు:

రాజ్యాంగాధికారములు అనగా రాజ్యాంగ బద్ధంగా నిర్వహించే అధికారములు. రాజ్యాంగం 163(1) ప్రకారము రాష్ట్రగవర్నరు విధుల నిర్వహణలో సూచనలు, సలహాలు అందించటానికి ముఖ్యమంత్రి నేతృత్వంలో ఒక మంత్రి మండలి ఉంటుంది. రాజ్యాంగం నిర్దేశించిన విచక్షణాధికారాల నిర్వహణలో మాత్రం మంత్రిమండలి సూచనలు, సలహాలు పాటించనవసరంలేదు. కనుక రాజ్యాంగం ప్రకారం మంత్రి మండలి సూచనలు, సలహాపై నిర్వహించే అధికారాలేమిటి? రాజ్యాంగాధికారాల నిర్వహణలో గవర్నరు అధికారాలు నామమాత్రమైనవి. అవి మంత్రి మండలి నిర్ణయాలే తప్ప, గవర్నరు స్వంత నిర్ణయాలు కాదని గుర్తుంచుకోవాలి. గవర్నరు రాజ్యాంగాధికారాలను 4 రకాలుగా విభజింప వచ్చును. అవి,

ఎ) కార్యనిర్వాహక అధికారములు (Executive Powers)

బి) శాసన అధికారములు (Legislative Powers)

సి) ఆర్థిక అధికారములు (Financial Powrs)

డి) న్యాయాధికారములు (Judicial Powers)

### ఎ) కార్యనిర్వాహక అధికారములు:

1. రాజ్యాంగం 154(1) ప్రకారము రాష్ట్ర ప్రభుత్వ కార్యనిర్వాహక అధికారములను గవర్నరు నిర్వహిస్తారు.
2. 164(1) నిబంధన ప్రకారము గవర్నరు ముందుగా ముఖ్యమంత్రిని నియమించును.
3. ముఖ్యమంత్రి నియామకం జరిగిన తర్వాత ముఖ్యమంత్రి సలహాపై ఇతర మంత్రులతో ప్రమాణము చేయించును.
4. గవర్నరుకు, ముఖ్యమంత్రిని, ఇతర మంత్రులను మంత్రి పదవులనుండి తొలగించే అధికారము కలదు.
5. గవర్నరు, రాష్ట్రహైకోర్టుకు న్యాయమూర్తులుగా నియమించబడే వారి పేర్లను రాష్ట్రపతికి సిఫారసు చేయును.
6. రాష్ట్రహైకోర్టు ప్రధాన న్యాయమూర్తితో సంప్రదించి జిల్లా జడ్జీలను నియమించును.

7. రాష్ట్ర పబ్లిక్ సర్వీసు కమీషన్‌కు, ఛైర్మన్ మరియు ఇతర సభ్యులను నియమించును.

8. రాష్ట్ర ప్రభుత్వ న్యాయసలహాదారును నియమించును.

9. రాష్ట్రంలోని వివిధ విశ్వవిద్యాలయాలకు వైస్-ఛాన్స్‌లర్‌లను నియమించును.

10. రాష్ట్రంలోని వివిధ విశ్వవిద్యాలయాలకు ఛాన్సలర్‌గా పనిచేయును.

పైన పేర్కొన్న కార్యనిర్వాహక అధికారాల నిర్వహణలో, ముఖ్యమంత్రి నియామకం, తొలగింపు విషయంలో మినహా మిగిలిన అధికారాల విషయంలో ముఖ్యమంత్రి మరియు సంబంధిత శాఖామంత్రి సలహా ప్రకారమే పనిచేస్తారు. వైస్ ఛాన్సలర్ల నియామకం విషయంలో మాత్రం అప్పుడప్పుడూ ముఖ్యమంత్రి సిఫారసు చేసిన వారిని కాకుండా తనకు నచ్చినవారిని నియమించిన సందర్భాలు కూడా ఉన్నాయి.

## బి) శాసన అధికారాలు:

రాష్ట్ర గవర్నరు శాసననిర్మాణ ప్రక్రియలో చాలా ముఖ్యమైన భూమికను నిర్వహిస్తాడు. రాష్ట్ర శాసనసభలో గవర్నరు అంతర్భాగం. రాష్ట్ర శాసనసభ ద్విసభావిధానం కలిగి ఉన్నప్పుడు అది గవర్నరు, విధాన పరిషత్ మరియు విధానసభలను కలిగి ఉంటుంది. ఏక సభావిధానంగా ఉంటే అది గవర్నరు మరియు విధాన సభలతో కూడి ఉన్నాయి.

1. రాజ్యాంగం 174(1) ప్రకారం రాష్ట్ర గవర్నరుకు, విధానసభను (Assembly) మరియు విధాన పరిషత్తును (Legislative council ) సమావేశపరిచే (To Summon) మరియు దీర్ఘకాలం వాయిదా (To Prorogue) వేసే అధికారం కలదు. విధాన సభను రద్దుచేసే అధికారం కూడా కలదు. విధానపరిషత్తు శాశ్వతసభ కనుక రద్దుచేసే అధికారంలేదు.

2. సాధారణ ఎన్నికల అనంతరం జరిగే శాసనసభ సమావేశాలను గవర్నరు ప్రారంభిస్తాడు. ఆ సమావేశంలో గవర్నరు ప్రసంగించి నూతన ప్రభుత్వం యొక్క విధానాల గురించి తెలియ చేయును.

3. వార్షిక బడ్జెట్ సమావేశాన్ని గవర్నరు ప్రారంభించును.

4. రాజ్యాంగం 200 నిభంధన ప్రకారము శాసనసభ (ఉభయసభలు) ఆమోదించిన ప్రతీ బిల్లు విధిగా, గవర్నరు ఆమోదం పొందాలి. గవర్నరు ఆమోదం పొందిన తర్వాత మాత్రమే అది చట్టం (ACT ) అవుతుంది. గవర్నరుకు పంపిన బిల్లును, ఆయన ఆమోదించవచ్చు, తిరస్కరించవచ్చు, లేదా పునఃపరిశీలనకై పంపించవచ్చు లేదా భారత రాష్ట్రపతి పరిశీలనకై రిజర్వ్ చేయవచ్చును.

5. బిల్లును రాష్ట్ర గవర్నరు, శాసనసభ పునఃపరిశీలనకై కొన్ని సూచనలతో కూడిన సందేశాన్ని జతపరచి పంపినపుడు, దానిని శాసనసభ సమీక్షించి, 2వ సారి బిల్లును ఆమోదించి పంపినపుడు, గవర్నరు బిల్లును తప్పక ఆమోదించాలి. తిరస్కరించ వీలులేదు.

6. రాజ్యాంగం 213(1) ప్రకారం, శాసనసభ సమావేశాలు వాయిదా పడినపుడు, రాష్ట్రమంత్రివర్గం, అత్యవసర పరిపాలనా విధుల నిర్వహణ కొరకు అవసరమని భావించిన ఎడల అందుకు అనుగుణంగా గవర్నరు ఆర్డినెన్సు జారీ చేయవచ్చును. ఈ ఆర్డినెన్సుల చట్టబద్ధతను దేశంలోని ఏ న్యాయస్థానంలోను, ఏ కారణంపైనా సవాలు చేయరాదు.

7. గవర్నరు ద్వారా జారీచేయబడిన ఆర్డినెన్సు, శాసనసభ సమావేశమైన 6 వారాలలోపు సభామోదం పొందాలి. లేని ఎడల ఆర్డినెన్సు రద్దు అవుతుంది.

8. రాజ్యాంగం 333(1) ప్రకారం, ఆంగ్లో-ఇండియన్‌లకు రాష్ట్ర శాసనసభలో తగినంత ప్రాతినిధ్యం లేదని భావిస్తే, వారినుంచి ఒకరిని శాసనసభకు నియమించవచ్చును.

9. రాజ్యాంగం 171(5) నిబంధన ప్రకారం, సాహిత్యము, విజ్ఞాన శాస్త్రం, కళలు సహకారోద్యమం, సంఘసేవల్లో లబ్ధప్రతిష్టులైన కొంతమందిని గవర్నరు, విధాన పరిషత్‌కు నామినేట్ చేయవచ్చును.

## సి) ఆర్థిక అధికారములు:

1. రాష్ట్ర ఆర్థికమంత్రి, ఆర్థిక బిల్లును (Money Bill) గవర్నరు అనుమతితో శాసనసభలో ప్రవేశపెట్టాలి.
2. రాష్ట్ర సంఘటిత నిధులనుండి చేసే ఖర్చులకు సంబంధించిన బిల్లులను గవర్నరు సిఫారసుతో మాత్రమే శాసనసభ పరిశీలిస్తుంది.
3. రాష్ట్రంలో అనుకోకుండా ఎదురయ్యే విపత్కర సంక్షోభాలను ఎదుర్కోవటానికి రాష్ట్ర ప్రభుత్వం చేసే ఖర్చుల కోసం రాష్ట్ర గవర్నరు అధీనంలో రాష్ట్ర సంకీర్ణనిధి (Contingency Fund) ఉంటుంది.

## డి) న్యాయాధికారములు:

1. రాజ్యాంగం 161 వ నిబంధన ప్రకారం, న్యాయస్థానం విధించిన శిక్షలపై నేరస్థులు పెట్టుకొన్న విజ్ఞాపనలపై గవర్నరు పరిశీలన జరిపి, నేరస్తులకు క్షమాభిక్ష పెట్టవచ్చు, లేదా శిక్షాకాలాన్ని తగ్గించవచ్చు. కోర్టు విధించిన శిక్షను వేరే శిక్షగా మార్చవచ్చు, శిక్షను తాత్కాలికంగా వాయిదా వేయవచ్చు, అనేకరకాల శిక్షలను ఒకే శిక్షగా మార్చవచ్చు.
2. రాజ్యాంగం 217(1) ప్రకారం, రాష్ట్రపతి రాష్ట్ర హైకోర్టు ప్రధాన న్యాయమూర్తిని, ఇతర న్యాయమూర్తులను నియమించే ముందు గవర్నరు సలహా కోరతారు.
3. రాజ్యాంగం 233 (1) ప్రకారం గవర్నరు, రాష్ట్ర హైకోర్టును సంప్రదించి జిల్లాజడ్జీల నియామకం, పదోన్నతులకు సంబంధించిన ఉత్తర్వులను జారీ చేస్తారు.

## 2. విచక్షణాధికారములు: (Discretionary Powers)

రాష్ట్ర ముఖ్యమంత్రి మరియు మంత్రివర్గం సలహా ప్రకారం నిర్వహించే అధికారాలను రాజ్యాంగాధికారములు అంటారు, వారి సలహాతో ప్రమేయం లేకుండా తాను వ్యక్తిగతంగా, విచక్షణతో తీసుకొనే నిర్ణయాలను విచక్షణాధికారములు అంటారు.

రాజ్యాంగం 163(1) నిబంధన గవర్నరుకు విచక్షణాధికారాలను ఇచ్చింది. గవర్నరు విచక్షణాధికారముల నిర్వహణలో అప్పుడప్పుడూ వివాదాలు, విమర్శలు చోటు చేసుకుంటున్నాయి, గవర్నరు విచక్షణాధికారములకు అవకాశమున్న అంశాలేమిటి?

అవి 1. ముఖ్యమంత్రి నియామకం

2. ముఖ్యమంత్రి తొలగింపు మరియు మంత్రిమండలి రద్దు

3. 356(1) ప్రకారం రాష్ట్రంలో రాష్ట్రపతి పరిపాలన విధింపు

4. రాష్ట్ర అసెంబ్లీని రద్దు పరచుట

**1. ముఖ్యమంత్రి నియామకము :**

రాష్ట్ర శాసనసభకు జరిగిన ఎన్నికలలో ఏదో ఒక రాజకీయపార్టీకి సంపూర్ణమైన మెజారిటీ లభించినప్పుడు, గవర్నరు ఆ పార్టీ ఎన్నుకొన్న శాసనసభాపక్ష నాయకుని ప్రభుత్వం ఏర్పాటు చేయమని ఆహ్వానిస్తాడు. ఇక్కడ ఎలాంటి వివాదాలకు ఆస్కారం ఉండదు. ఏ పార్టీకి స్పష్టమైన మెజారిటీ రాకపోతేనే సమస్య ఉత్పన్నమౌతుంది. ఇక్కడ గవర్నరు విచక్షణకు అవకాశం ఏర్పడుతుంది. భారత పార్లమెంటరీ ప్రజాస్వామ్యంలో, 1952లో ఉమ్మడి మద్రాసు రాష్ట్రంలో జరిగిన ముఖ్యమంత్రి నియామకం, గవర్నరు విచక్షణాధికారానికి సంబంధించి ఒక సాంప్రదాయాన్ని నెలకొల్పింది. 1952లో ఉమ్మడి మద్రాసు రాష్ట్రానికి జరిగిన ఎన్నికలలో అటు కాంగ్రెస్ పార్టీకి కాని, ఇటు టంగుటూరి ప్రకాశం పంతులు నేతృత్వంలోని సంకీర్ణకూటమికి కాని సంపూర్ణమెజారిటీ రాలేదు. ఇలాంటి పరిస్థితుల్లో ఎవరిని ప్రభుత్వం ఏర్పాటు చేయమని ఆహ్వానించాలి? రాజ్యాంగంలో ఇలాంటి పరిస్థితి ఏర్పడితే ఎలాంటి నిర్ణయం తీసుకోవాలి అనేది తెలియచేయలేదు. అప్పట్లో ఆ రాష్ట్రానికి గవర్నరు శ్రీప్రకాష్. గవర్నరు శ్రీప్రకాష్ కాంగ్రెసు పార్టీ శాసనసభా పక్షనాయకుడైన చక్రవర్తుల రాజగోపాలాచారిని ప్రభుత్వం ఏర్పాటు చేయమని ఆహ్వానించాడు. ఏ పార్టీకీ సంపూర్ణ మెజారిటీ రాకపోతే, ఏకైక పెద్ద పార్టీని ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయమని కోరవచ్చును అంటూ తన నిర్ణయాన్ని సమర్థించుకున్నాడు శ్రీప్రకాష్. అప్పటినుండి ఈ సాంప్రదాయాన్ని, శ్రీప్రకాష్ డాక్ట్రిన్ లేదా శ్రీప్రకాష్ ఫార్ములాగా పిలవడం, పాటించడం మొదలైనది. అంటే ఏ పార్టీకీ ఎన్నికలలో స్పష్టమైన మెజారిటీ లభించనపుడు ఏకైక పెద్ద పార్టీకి (Single Largest Party) ముందుగా ప్రభుత్వం ఏర్పాటు చేసే అవకాశం ఇవ్వాలి. అయితే ఈ సాంప్రదాయాన్ని ఆ తర్వాత కొన్ని సందర్భాలలో పాటించడం, కొన్ని సందర్భాలలో ఉల్లంఘించటం కూడా జరిగింది. ఈ రెండు సందర్భాలలోను గవర్నర్ల నిర్ణయాలు కేంద్రంలో అధికారంలో ఉన్న పార్టీకి అనుకూలంగా జరిగినవేనని విమర్శకులంటారు.

**2. ముఖ్యమంత్రి తొలగింపు :**

ముఖ్యమంత్రిని నియమించే అధికారం మరియు తొలగించే అధికారం గవర్నరుకే ఉంది అనే విషయం మరువకూడదు. ఈ రెండూ గవర్నరు విచక్షణాధికారం పరిధిలోనికే వస్తాయి. అయితే ఈ నిర్ణయాలు ఒక్కోసారి వివాదాస్పదంగా మారుతున్నాయి:

భారతావనిలో త్యాగాలకు, విలువలకు, సిద్ధాంతాలకు, ప్రజాసేవకు పేరుగాంచిన రాజకీయతరం కాలం పోయింది, ప్రస్తుత తరం సంపాదనే లక్ష్యంగా రాజకీయాలలోనికి ప్రవేశిస్తున్నారు. ముఠాకొట్లాటలు, పార్టీ ఫిరాయింపులు, వెన్నుపోట్లు రాజకీయాల విలువలను దిగజారుస్తున్నాయి. ఇలాంటి పరిస్థితుల్లో గవర్నరు పాత్ర ముందు నుయ్యి, వెనక గొయ్యిలా తయారయ్యింది. అధికార పార్టీలో ముఖ్యమంత్రి నాయకత్వానికి అసమ్మతి వైరస్ సోకి, పార్టీలో వివాదం తలెత్తి, ముఖ్యమంత్రికి మెజారిటీ లేదని వార్తలు వస్తే గవర్నరు ఏమి చెయ్యాలి ? దీనికి రాజ్యాంగంలో ఉన్న పరిష్కారమేమిటి ?

నిజానికి పైన చెప్పిన రాజకీయ సమస్యకు రాజ్యాంగంలో ఎలాంటి పరిష్కారమూ లేదు. సమయానుకూలంగా గవర్నరు తన విచక్షణను ఉపయోగించి మంచి నిర్ణయం తీసుకోవాలి. కొన్ని కొన్ని రాష్ట్రాలలో గవర్నర్లు కొనినతీసుకొన్న కొన్ని నిర్ణయాలు వివాదాస్పదంగా మారుతున్నాయి.

సాధారణంగా ఏ గవర్నరు కావాలని ప్రజాస్వామ్య బద్ధంగా ప్రజలద్వారా ఎన్నికైన, అధికారపార్టీ ఎన్నుకొన్న ముఖ్యమంత్రిని తనంతట తానుగా తొలగించి వివాదాన్ని సృష్టించుకోడు. అధికార పార్టీలో విభేదాలు వచ్చి అసమ్మతి లేదా పార్టీ ఫిరాయింపుల వలన, ప్రభుత్వం మైనారిటీలో పడినపుడు మాత్రమే గవర్నరు, ముఖ్యమంత్రిని తొలగించే అంశానికి అవకాశం ఏర్పడుతుంది.

అసమ్మతి కార్యకలాపాల వలన లేదా పార్టీ ఫిరాయింపుల వలన ముఖ్యమంత్రికి మెజారిటీ లేదు అనే విషయం తెలుసుకోవటం ఎలా? ఈ అంశానికి సంబంధించి గవర్నర్ల నిర్ణయాలు వేరువేరుగా ఉంటున్నాయి. పార్లమెంటరీ సాంప్రదాయం ప్రకారం ముఖ్యమంత్రికి మెజారిటీ ఉందా లేదా అనే వాస్తవం వివాదాలకు అతీతంగా నిరూపణ కావాలి అంటే అది దిగువ సభలో బలపరీక్ష ద్వారా నిరూపిస్తే ఏ సమస్యా ఉండదు. కాని కొన్ని సందర్భాలలో అలా జరగటంలేదు. అసమ్మతి నాయకుడో, లేదా పార్టీ ఫిరాయింపులకు నాయకత్వం వహించే వ్యక్తో, గవర్నరుకు ముఖ్యమంత్రి పై ఫిర్యాదుచేసి, ఒక సంతకాల విజ్ఞాపన పత్రాన్ని సమర్పించిన వెంటనే, గవర్నరు ఆ విషయాన్ని నిర్ధారించుకోకుండానే ముఖ్యమంత్రిని రాజీనామా చేయమని కోరటం లేదా ముఖ్యమంత్రిని పదవినుండి డిస్మిస్ చేయటం జరుగుచున్నది. ఇది చాలా అన్యాయం, దుస్సాంప్రదాయం, అప్రజాస్వామికం. ఇక్కడే వివాదాలు తలెత్తుతున్నాయి. అందువలన ముఖ్యమంత్రిని తొలగించే విషయంలో గవర్నర్లు ఈ మధ్య ంలో ఈ దిగువ పేర్కొన్న పద్ధతిలో ఏదో ఒక పద్ధతిని అనుసరిస్తూ ముఖ్యమంత్రికి మెజారిటీ ఉందా లేదా అనే విషయాన్ని ని ంస్తున్నారు. ఆ పద్ధతులు ఏమనగా :

1. జాబితా పద్ధతి (List System)
2. హాజరు పద్ధతి (Parade or Role Call System)
3. జాబితా నిరూపణ పద్ధతి (List Verification System)

**1. జాబితా పద్ధతి :** ఈ పద్ధతి ప్రకారం గవర్నరు అసమ్మతివర్గం నాయకుడు లేదా పార్టీ ఫిరాయింపుదారుల నాయకుడు సమర్పించిన జాబితాలోని సభ్యుల సంతకాలను ప్రత్యక్షంగా నిరూపణ చేయకుండానే, ముఖ్యమంత్రికి మెజారిటీ లేదని భావించి, ముఖ్యమంత్రిని శాసనసభలో బలనిరూపణ చేసుకోమని కోరకుండా, అతని ప్రభుత్వాన్ని రద్దుచేసి ముఖ్యమంత్రికి వ్యతిరేక వర్గం ఎన్నుకొన్న నాయకుని ముఖ్యమంత్రిగా నియమించటం జరుగుతోంది.

ఉదాహరణకు 1984 అగస్టులో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి గవర్నరుగా పని చేస్తున్న రామ్‌లాల్, ముఖ్యమంత్రి శ్రీN.T. రామారావుకి వ్యతిరేకంగా మంత్రి మండలి సభ్యుడైన నాదెండ్ల భాస్కరరావు చేసిన ఫిర్యాదుపై స్పందించి, భాస్కరరావు సమర్పించిన జాబితాను పరిగణనలోనికి తీసుకుని వెంటనే N.T రామారావును 16-8-1984న ముఖ్యమంత్రి పదవి నుండి డిస్మిస్ చేసి, నాదెండ్ల భాస్కరరావును ముఖ్యమంత్రిగా నియమించారు. గవర్నరు రామ్‌లాల్, N.T రామారావును మెజారిటీ నిరూపించుకోమని కోరకపోవటం విడ్డూరం. 24గంటలలో తన మెజారిటీని నిరూపించుకుంటానని N.T రామారావు ఎంత ప్రాధేయపడినా గవర్నరు ్నలేదు. అయితే ఆ తర్వాత తన అప్రజాస్వామిక తొందరపాటు నిర్ణయానికి తగిన మూల్యం చెల్లించుకున్నాడు.

**2. హాజరు పద్ధతి :** గవర్నరు రామ్‌లాల్ తీసుకున్న అప్రజాస్వామిక నిర్ణయాన్ని తిప్పికొట్టడానికి, ప్రజానాయకుడు N.T రామారావు నిశ్చయించుకున్నాడు. తనకు మెజారిటీ ఉన్నప్పటికీ, రామ్‌లాల్, నాదెండ్ల భాస్కరరావుల కుట్రవల్ల తానెలా దవి కోల్పోయిందీ కేంద్రప్రభుత్వానికీ మరియు లోకానికీ తెలియచెప్పటానికి, తనను సమర్థించే 160 మంది M.L.A. లతో ాజ్‌భవన్ నుండి రాష్ట్రపతి భవన్‌కు వెళ్ళి, రాష్ట్రపతి జ్ఞాని జైల్ సింగ్ ముందు తన మద్దతుదారులను హాజరు పరచి బలప్రదర్శన ర్వహించాడు. ఆ ప్రదర్శనలో మెజారిటీ సభ్యులను స్వయంగా పరిశీలించిన రాష్ట్రపతి జైల్ సింగ్, N.T రామారావుకే మెజారిటీ ందని సంతృప్తి చెంది, వెంటనే ప్రధాని ఇందిరాగాంధీతో చర్చించి, N.T రామారావును తిరిగి ముఖ్యమంత్రిగా నియమించమని ూచించటం జరిగింది. తత్ఫలితంగా N.T. రామారావు సెప్టెంబరు 16, 1984 న (అంటే పదవి పోగొట్టుకున్న నెలరోజుల ర్వాత) తిరిగి ముఖ్యమంత్రిగా నియమించబడ్డాడు.

**3. జాబితా నిరూపణ పద్ధతి :** ఈ పద్ధతిని అనుసరించడానికి అవకాశం ఏర్పడిన సందర్భం కూడా ఆంధ్రప్రదేశ్‌లో మరియు తెలుగుదేశం ప్రభుత్వహయాంలో జరగడం విశేషం. 1995లో ఆంధ్రప్రదేశ్‌లో N.T రామారావు ముఖ్యమంత్రి. రామారావు 2వ భార్య లక్ష్మీపార్వతికి, 2వ అల్లుడు నారా చంద్రబాబు నాయుడుకి మధ్య పార్టీలో ఆధిపత్యపోరు ప్రారంభమై, చివరకు తెలుగుదేశం పార్టీ చీలికకు దారి తీసింది. అసమ్మతి వర్గానికి నాయకుడైన చంద్రబాబు నాయుడు తనకు మామ, తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపకుడు, ముఖ్యమంత్రి N.T రామారావుపైనే తిరుగుబాటు ప్రకటించాడు. రామారావుకు మెజారిటీ లేదని తనకే మెజారిటీ ఉందని గవర్నరు క్రిష్ణకాంత్‌కు ఒక జాబితా సమర్పించాడు. ఆ జాబితాలోని పేర్లు, సంతకాలు సరైనవో, కాదో సరిచూడమని (Verify) గవర్నరు, అసెంబ్లీ స్పీకర్ యనమలరామకృష్ణుడిని ఆదేశించాడు. జాబితాను పరిశీలించిన స్పీకర్ సంతకాలన్ని సరైనవేనని ధృవపరిచిన తరువాత గవర్నరు N.T రామారావును మెజారిటీ నిరూపించుకోమని కొంత గడువు కూడా ఇచ్చాడు. అయితే రామారావు తన మెజారిటీని నిరూపించకోలేక రాజీనామా సమర్పిస్తూ, అసెంబ్లీని రద్దుచేసి, తాజాగా ఎన్నికలు నిర్వహించమని కోరాడు. గవర్నరు రాజీనామా ఆమోదించాడు కాని, అసెంబ్లీని రద్దుచేయలేదు ఎన్నికలు జరిపించలేదు. ఆ తర్వాత గవర్నరు చంద్రబాబు నాయుడిని, ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయమని కోరాడు. చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రి పదవి చేపట్టి మంత్రి మండలి ఏర్పాటుచేసి కొద్దిరోజులలోనే , అసెంబ్లీలో బలపరీక్ష నెగ్గి ముఖ్యమంత్రిగా కొనసాగారు. ఈ విధముగా జాబితా నిరూపణ పద్ధతి ద్వారా గవర్నరు, ముఖ్యమంత్రిని తొలగించడం జరుగుతుంది.

3. **356వ నిబంధన ప్రకారం రాష్ట్రపతి పాలన విధింపు:** గవర్నరు కేంద్రానికి రాష్ట్రానికి మధ్య సంధానకర్తగా పనిచేయాలి. ఒక వేళ రాష్ట్రంలో అధికార పార్టీలో విభేదాలు ఏర్పడి, ప్రభుత్వం మైనారిటీలోపడి రాజ్యాంగ సంక్షోభం ఏర్పడితే, ఆ విషయాన్ని తెలియ పరుస్తూ గవర్నరు కేంద్ర ప్రభుత్వానికి ఒక నివేదిక పంపాలి. ఆ నివేదిక ఆధారంగా అనివార్యము అని భావిస్తే, కేంద్రం 356(1) నిబంధన ప్రకారం రాష్ట్రమంత్రి వర్గాన్ని రద్దుచేసి రాష్ట్రపతి పాలనను విధిస్తుంది. రాష్ట్రపతిపాలనను గవర్నరు, ఆయన సలహాదారులు నిర్వహిస్తారు. అయితే రాష్ట్రపతిపాలన విధింపుపై గవర్నర్ల నిర్ణయాలు వివాదాస్పదంగా మారుతున్నాయి.

4. **రాష్ట్ర అసెంబ్లీని రద్దుచేయుట :** రాష్ట్రపతి పాలన విధించిన తర్వాత గవర్నరు రాష్ట్ర అసంబ్లీని రద్దు చేయమని సిఫారసు చేయవచ్చు. కొన్ని రాష్ట్రాలలో అసంబ్లీని రద్దుచేసి ఎన్నికలు నిర్వహించారు. కొన్నిరాష్ట్రాలలో మాత్రం అసెంబ్లీని రద్దుచేయకుండా సుప్తచేతనావస్థలో ఉంచి, పరిస్థితి చక్కబడిన తర్వాత తిరిగి ప్రభుత్వం ఏర్పాటు చేసారు. **1972**లో ఆంధ్రప్రదేశ్‌లో ప్రత్యేకాంధ్ర ఉద్యమం ప్రారంభమై తీవ్రరూపం దాల్చింది. పరిస్థితిని చక్కదిద్దటానికి రాష్ట్రంలో **18-01-1973**న రాష్ట్రపతి పాలన విధించారు. అయితే అసెంబ్లీని రద్దుచేయలేదు. **1973**లో పరిస్థితి చక్కబడిన తర్వాత **10-12-1973**న జలగం వెంగళరావు ముఖ్యంత్రిగా మంత్రి మండలి ఏర్పడింది. ఇటీవల బీహార్‌లో **7-05-2005**న రాష్ట్రపతి పాలన విధించి, **23-05-2005**న అసెంబ్లీని రద్దుచేసారు.

### 3.4 సర్కారియా కమిషన్ సిఫారసులు:

గవర్నర్ల పని తీరుపై దేశంలోని రాజకీయ వర్గాలలో సదాభిప్రాయం లేదు. గవర్నర్లు కేంద్రప్రభుత్వ ఏజెంట్లుగా పని చేస్తున్నారని తీవ్రవిమర్శలు బయలు దేరాయి. గవర్నర్ల పనితీరును చక్కదిద్దటానికి అప్పుడప్పుడు కొన్ని సదస్సులు, కమిటీలు ఏర్పాటు చేయటం, అవి కొన్ని మార్గదర్శక సూత్రాలను రూపొందించటం జరుగుతూనే వుంది. అయినప్పటికీ గవర్నర్ల పనితీరులో మాత్రం ఆశించిన మేరకు మార్పురావటంలేదు. **1983** మార్చినెలలో ప్రధాని శ్రీమతి ఇందిరాగాంధీ, రంజిత్‌సింగ్ సర్కారియాతో ఒక కమిషన్‌ను ఏర్పాటు చేసింది. కేంద్ర, రాష్ట్ర సంబంధాలను సమీక్షించి అర్థవంతమైన సిఫారసులను చేయవలసిందిగా కమిషన్‌ను కోరటం జరిగింది. సర్కారియా దేశంలో పర్యటించి కేంద్ర రాష్ట్ర సంబంధాలపై ఒక నివేదికను కూడా కేంద్రానికి సమర్పించాడు. గవర్నరు పదవికి సంబంధించి కమిషన్ చేసిన సిఫారసులలో ముఖ్యమైనవి:

### ఎ). గవర్నరుగా నియమించబడే వ్యక్తికి ఉండవలసిన అర్హతలు :

1. రాజకీయ రంగానికి అతీతంగా ఉండాలి. సామాజిక సేవలో పాల్గొని ప్రసిద్ధి చెంది ఉండాలి.
2. సంబంధిత రాష్ట్రానికి చెందకూడదు.
3. గవర్నరును నియమించేముందు సంబంధిత రాష్ట్ర ముఖ్యమంత్రిని సంప్రదించుట శ్రేయస్కరము.
4. బలమైన కారణం ఉంటే తప్ప గవర్నరు పదవీకాలాన్ని తగ్గించరాదు.

### బి) ముఖ్యమంత్రి నియామకానికి, తొలగింపుకు సంబంధించినవి :

1. శాసనసభలో మెజారిటీ పార్టీ నాయకుని ముఖ్యమంత్రిగా నియమించాలి. ఏ పార్టీకీ స్పష్టమైన మెజారిటీ లభించనప్పుడు, ఏకైక పెద్దపార్టీకి, ఆ తర్వాత సంకీర్ణానికి ప్రభుత్వం ఏర్పాటు చేసే అవకాశం ఇవ్వాలి.
2. శాసనసభలో మెజారిటీ ఉన్న ముఖ్యమంత్రిని ఎట్టి పరిస్థితిలోను పదవి నుంచి తొలగించరాదు.
3. ముఖ్యమంత్రికి మెజారిటీ ఉందా? లేదా? అనేది శాసనసభలోనే తేలాలి. అవసరమైతే బలనిరూపణకు తగిన సమయం ఇవ్వాలి.

### 3.5 బొమ్మైకేసు - సుప్రీమ్‌కోర్టు తీర్పు :

1994లో కేంద్ర ప్రభుత్వం VS బొమ్మై కేసులో సుప్రీంకోర్టు 356 నిబంధన ప్రకారం రాష్ట్రపతి పాలన విధింపుపై ఇచ్చిన తీర్పులోని వివరాలు.

1. న్యాయస్థానానికి రాష్ట్రపతి పాలనను సమీక్షచేసే అధికారం కలదు.
2. రాష్ట్రపతి, రాష్ట్ర పరిపాలనను చక్కదిద్దే చర్యలు, రాష్ట్రపతి పాలన విధింపు తీర్మానాన్ని పార్లమెంటు ఆమోదించిన తర్వాతనే చేపట్టాలి.
3. పార్లమెంటు రాష్ట్రపతి పాలన విధింపును ఆమోదించిన తర్వాత మాత్రమే రాష్ట్ర అసెంబ్లీని రద్దుపరచాలి.
4. రాష్ట్రపతి పాలన విధింపు చెల్లదని కోర్టు భావిస్తే పార్లమెంటు ఆమోదం లభించినప్పటికీ, కోర్టుకు యధాతధస్థితిని ఏర్పాటు చేసే అధికారం కలదు. రద్దయిన మంత్రి మండలిని, అసెంబ్లీని పునరుద్ధరిస్తుంది.

### 3.6. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి గవర్నర్లుగా పనిచేసినవారి జాబితా:

| వరుస నెం : | పేరు | From Year | - | To |
|---|---|---|---|---|
| 1. | సర్వశ్రీ, సి.యం.త్రివేది | 1956 | - | 1957 |
| 2. | సర్వశ్రీ, భీమ్‌సేన్ సచార్ | 1957 | - | 1962 |
| 3. | సర్వశ్రీ, జనరల్ యస్.యమ్. నగేష్ | 1962 | - | 1964 |

| | | | | |
|---|---|---|---|---|
| 4. | సర్వశ్రీ పట్టం. థాను పిళ్ళై | 1964 | - | 1968 |
| 5 | సర్వశ్రీ ఖండూభాయి దేశాయ్ | 1968 | - | 1975 |
| 6. | సర్వశ్రీ జస్టిస్ యస్. ఓబులరెడ్డి | 1975 | - | 1976(Incharge) |
| 7. | సర్వశ్రీ మోహన్ లాల్ సుఖాడియా | 1976(Jan To June) Incharge | | |
| 8. | సర్వశ్రీ ఆర్. డి. భండారి | 1976 | - | 1977 |
| 9. | సర్వశ్రీ జస్టిస్. బి.డి. దివాన్ | 1977 | - | (Incharge) |
| 10. | శ్రీమతి శారదా ముఖర్జీ | 1977 | - | 1978 |
| 11. | సర్వశ్రీ కె.సి. అబ్రహాం | 1978 | - | 1983 |
| 12. | సర్వశ్రీ రామ్‌లాల్. | 1983 | - | 1984 |
| 13. | సర్వశ్రీ డా ॥ శంకర్ దయాళ్‌శర్మ | 1984 | - | 1985 |
| 14. | శ్రీమతి కుముద్ బిన్ జోషి | 1985 | - | 1990 |
| 15. | సర్వశ్రీ కె. కృష్ణకాంత్ | 1990 | - | 1997 |
| 16. | సర్వశ్రీ జి. రామానుజం | 1997 (August to Nov, Incharge) | | |
| 17. | సర్వశ్రీ సి. రంగరాజన్ | 1997 | - | 2003 |
| 18. | సర్వశ్రీ సూర్జిత్ సింగ్ బర్నాలా | 2003 | - | 2004 |
| 19. | సర్వశ్రీ సుశీల్ కుమార్ షిండే | 4-11-2004 నుండి | | |

## 3.7 సారాంశము :

గవర్నరు రాష్ట్రానికి రాజ్యాంగాధినేత. నామ మాత్రపు కార్యనిర్వాహక అధికారి. ముఖ్యమంత్రి మరియు మంత్రిమండలి వాస్తవ కార్యనిర్వాహక అధికారములు నిర్వహించును. ముఖమంత్రిని, ఇతర మంత్రులను నియమించే అధికారము, తొలగించే అధికారము గవర్నరుకు కలదు. గవర్నరుకు రాజ్యాంగాధికారములు విచక్షణాధికారములు కలవు. గవర్నర్ల నిర్ణయాలు అప్పుడప్పుడు వివాదాస్పదంగా మారుతున్నాయి. గవర్నర్లు కేంద్ర ప్రభుత్వ ఏజెంట్లుగా పనిచేస్తున్నారని, ప్రజాస్వామ్య బద్ధంగా ఎన్నికైన రాష్ట్రప్రభుత్వాలను కేంద్రం ఆదేశం మేరకు రద్దుచేస్తున్నారనే విమర్శలు వస్తున్నాయి. గవర్నర్ల పనితీరును చక్కదిద్దటానికి సర్కారియా కమిషన్ అమూల్యమైన సలహాలను నివేదికలో పేర్కొన్నది. గవర్నర్లు రాజకీయాలకు అతీతంగా పని చేస్తే మంచిపేరు తెచ్చుకోగలుగుతారు.

## 3.8 నమూనా ప్రశ్నలు :

1. రాష్ట్ర గవర్నరు అధికారములను వివరింపుము?
2. రాష్ట్ర గవర్నరు పాత్రను విమర్శనాత్మకంగా తెలియచేయుము

**లఘు వ్యాసరూప ప్రశ్నలు :**

1. గవర్నరు నియామకానికి సంబంధించిన అర్హతలు ఏమిటి?
2. గవర్నరు విచక్షణాధికారములను వివరింపుము
3. సర్కారియా కమిషన్ గవర్నరుకు సంబంధించి తెలియచేసిన సూచనలు ఏమి?

**3.9 చదువదగిన గ్రంథాలు :**


1. Text of the Indian Constitution
2. Dr. Durga Das Basu : Introduction to the Constitution of India
3. G.Ram Reddy & B.A.V. Sharma : Government and Politics of Andhra Pradesh.
4. Prof : A.Prasanna Kumar , K. Ravi., Lingamurthy : Government and Politics in Andhra Pradesh.
5. S.R. Maheswari : భారతీయ పాలనా శాస్త్రము
6. K. Pandu Rangam., Dr. V. Krishna Rao Edited by Prof. K.R. Acharya : ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వము - రాజకీయాలు. (తెలుగు అకాడమీ ప్రచురణ)


డా॥ ఎ. వెంకటరావు

పాఠం - 4

# రాష్ట్ర ముఖ్యమంత్రి మరియు మంత్రిమండలి

## 4.0 లక్ష్యం :

పార్లమెంటరీ ప్రజాస్వామ్య వ్యవస్థలో మంత్రిమండలి రాజకీయ అధికారానికి కేంద్ర స్థానంగా చెప్పవచ్చును. అటు దేశ పరిపాలనను నిర్వహించటానికి కేంద్ర మంత్రిమండలిని, ఇటు రాష్ట్ర పరిపాలనను నిర్వహించటానికి రాష్ట్ర మంత్రి మండలిని భారత రాజ్యాంగం ద్వారా ఏర్పాటు చేసారు. రాష్ట్ర స్థాయిలో, రాష్ట్ర మంత్రి మండలికి సంబంధించిన వివిధ అంశాలను తెలియ చేయటమే ఈ పాఠం ప్రధాన లక్ష్యం.

**విషయసూచిక :**


4.1 మంత్రిమండలి - ఆవిర్భావం

4.2 మంత్రిమండలి - వర్గీకరణ

4.3 మంత్రిమండలి - పదవీకాలం - జీతభత్యాలు

4.4 మంత్రిమండలి నిర్మాణం

4.5 ఆంధ్రప్రదేశ్‌లో మంత్రిమండలి నిర్మాణంలో పరిగణనలోనికి తీసుకొనే అంశాలు

4.6 మంత్రిమండలి - మరికొన్ని ముఖ్య అంశాలు

4.7 మంత్రిమండలి - విధులు

4.8 రాష్ట్ర ముఖ్యమంత్రి

4.9 ముఖ్యమంత్రి - మంత్రిమండలితో సంబంధాలు

4.10 రాష్ట్ర ముఖ్యమంత్రుల జాబితా

4.11 సారాంశము

4.12 నమూనా ప్రశ్నలు

4.13 చదువదగిన గ్రంథాలు


## 4.1 మంత్రిమండలి - ఆవిర్భావం :

పార్లమెంటరీ ప్రజాస్వామ్య వ్యవస్థకు మాతృక బ్రిటన్. పార్లమెంటరీ ప్రజాస్వామ్య వ్యవస్థలో వాస్తవిక కార్యనిర్వాహక విధులను నిర్వహించే అతి కీలకమైన భాగమే మంత్రిమండలి. భారతదేశాన్ని బ్రిటీష్ వారు పరిపాలించిన రోజులలో మంత్రిమండలిని ఒక క్రమబద్ధమైన పరిపాలనా భాగంగా అభివృద్ధి పరిచారు. బ్రిటీష్ ఈస్ట్ ఇండియా కంపెనీ భారతదేశాన్ని పరిపాలించిన కాలంలో ప్రెసిడెన్సీ ప్రభుత్వ నిర్వహణ కొరకు గవర్నరుకు సహాయపడేందుకు ఒక సలహా మండలి ఉండేది. దీనినే గవర్నరు కార్యనిర్వాహక మండలి అని పిలిచేవారు. ఈ గవర్నరు కార్యనిర్వాహక మండలి కాలక్రమేపి, రాష్ట్ర మంత్రిమండలిగా రూపు చెందింది. 1950లో రచించిన నూతన రాజ్యాంగం ఈ మంత్రి వర్గ నిర్మాణానికి సంబంధించిన వివిధ అంశాలకు రాజ్యాంగ బద్ధతను చేకూర్చింది.

విధాన నిర్ణయ కల్పన అధికారం కలిగి ఉండటమే మంత్రిమండలి ప్రత్యేకత. మంత్రి మండలి చేసే విధాన నిర్ణయాల ప్రకారమే ప్రజా పరిపాలన నిర్వహించబడుతుంది. భారత రాజ్యాంగంలో సమాఖ్య అనే మాట ఎక్కడా ఉపయోగించనప్పటికీ భారతదేశాన్ని సమాఖ్య వ్యవస్థగా అనేక మంది రాజ్యాంగ నిపుణులు పేర్కొన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల మధ్య రాజ్యాంగం ద్వారా శాసన, కార్యనిర్వాహక, న్యాయ అధికారాలను విభజించుటయే సమాఖ్య ప్రభుత్వ సారాంశం. (Constitutional Division of Legislative, Executive and Judicial Powers between the centre and states is the essence of Federation) భారతదేశంలో కేంద్రంలోను, రాష్ట్రాలలోను పార్లమెంటరీ తరహా ప్రభుత్వాలను ఏర్పాటు చేసారు. భారత రాజ్యాంగం పరిపాలనా వ్యవస్థలో రెండు అధికార కేంద్రాలను నెలకొల్పింది.

కేంద్రంలో రాష్ట్రపతి దేశాధినేత మరియు నామమాత్రపు కార్యనిర్వాహక అధికారి. ప్రధానమంత్రి ప్రభుత్వాధినేత మరియు వాస్తవ కార్యనిర్వాహక అధికారి. ప్రధానమంత్రి, ఆయన మంత్రిమండలి దేశ పరిపాలన, ప్రభుత్వ విధానాలకు సంబంధించిన నిర్ణయాలు చేస్తుంది.

రాష్ట్ర స్థాయిలో రాష్ట్ర గవర్నర్ రాష్ట్రాధినేత మరియు నామమాత్రపు కార్యనిర్వాహక అధికారి. ముఖ్యమంత్రి రాష్ట్ర ప్రభుత్వాధినేత. వాస్తవ కార్యనిర్వాహక అధికారి. రాష్ట్రానికి సంబంధించిన పరిపాలన నిర్వహణ, ప్రభుత్వ విధానాలకు సంబంధించిన నిర్ణయాలను ముఖ్యమంత్రి ఆయన మంత్రిమండలి తీసుకుంటారు.

భారత రాజ్యాంగం **163(1)** నిబంధన ప్రకారం, రాష్ట్ర గవర్నర్ తన విధులను నిర్వహించే క్రమంలో ఆయనకు సూచనలు సలహాలు ఇవ్వటానికి ముఖ్యమంత్రి నాయకత్వంలో ఒక మంత్రి మండలి ఉంటుంది.

భారత రాజ్యాంగం **164 (1 నుండి 5)** నిబంధన ప్రకారం రాష్ట్ర గవర్నరు ముందుగా ముఖ్యమంత్రిని నియమించును. ఆ తర్వాత ముఖ్యమంత్రి సిఫారసు చేసిన వారిని మంత్రులుగా నియమించును.

## 4.2 మంత్రిమండలి - వర్గీకరణ :

మంత్రిమండలి నిర్మాణ బాధ్యత పూర్తిగా ముఖ్యమంత్రిదే. రాష్ట్ర ప్రభుత్వాన్ని సమర్థవంతంగా నడిపించటానికి, ఎన్నికలలో ప్రజలకు చేసిన వాగ్దానాలను శీఘ్రగతిని నెరవేర్చటానికి మంచి జట్టు (TEAM) కావాలి. ఈ జట్టునే మంత్రిమండలి అంటారు. ముఖ్యమంత్రికి విశ్వాసంగా ఉంటూ ఎవరైతే సమర్థవంతంగా పనిచేయగలుగుతారని భావిస్తాడో అట్టి వారిని మంత్రులుగా ఎంపిక చేసుకొని మంత్రిమండలిని నిర్మించుకుంటాడు. మంత్రిమండలి నిర్మాణమే భవిష్యత్ ప్రభుత్వం యొక్క పనితీరుకు దర్పణం. అయితే మంత్రిమండలి సంఖ్య ఎంత ఉండాలి అనేది పెద్ద ప్రశ్న? ఎందుకంటే ఇటీవలి కాలంలో మంత్రిమండలి సంఖ్యను ఒక పద్ధతి లేకుండా విపరీతంగా పెంచేస్తున్నారు. ఎంతో విలువైన ప్రజాధనాన్ని వృథాగా ఖర్చు పెడుతున్నారు. ఇది మంచి సాంప్రదాయం కాదు. నిజం చెప్పాలంటే పార్లమెంటరీ సాంప్రదాయం ప్రకారం శాసనసభ్యులు మంత్రుల నిష్పత్తి 10:1 గా ఉంటే అన్ని విధాలగాను సమతూకంతో బాగుంటుందని రాజనీతి పండితుల అభిప్రాయం. అంటే పది మంది శాసనసభ్యులకు ఒక మంత్రి సరిపోతాడు. ఉదాహరణకు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర శాసనసభ సభ్యుల సంఖ్య **294**, కనుక మంత్రి మండలి సంఖ్య **30** అయితే బాగుంటుంది. సంజీవరెడ్డి రెండు దఫాలు ముఖ్యమంత్రి పదవిలో ఉన్నారు. రెండు దఫాలు కూడా కేవలం **14** మంది మంత్రులతో పరిపాలన నిర్వహించడం విశేషం. ఈ సాంప్రదాయాన్ని తరువాత ముఖ్యమంత్రి పదవిని చేపట్టిన సంజీవయ్య, బ్రహ్మానందరెడ్డి, పి.వి. నరసింహారావు, జలగం వెంగళరావు, మర్రి చెన్నారెడ్డి వరకు చక్కగా పాటించారు. ఎటొచ్చీ టి. అంజయ్య ముఖ్యమంత్రిగా పనిచేసిన కాలంలోనే మంత్రిమండలి సంఖ్యను అనూహ్యంగా **61**కి పెంచేసారు. కొంతమంది విమర్శకులు ఈ మంత్రిమండలిని

వ్యంగ్యంగా "అంజయ్య ఏర్ బస్ మినిస్ట్రీ" అనగా పుష్పక విమానం అని వ్యాఖ్యానించారు. ఈ మధ్య కాలంలో ఉత్తరప్రదేశ్ రాష్ట్రానికి B.J.P. సంకీర్ణ కూటమి ప్రభుత్వానికి ముఖ్యమంత్రిగా పనిచేసిన కళ్యాణసింగ్ 90 మంది సభ్యులతో మంత్రిమండలిని నిర్మించి సరికొత్త రికార్డు సృష్టించాడు. ఇది మాత్రం చాలా విపరీతమైన ధోరణి, ఇటువంటి పోకడలు మంచివి కావు. దీనిపై సర్వత్రా తీవ్ర విమర్శలు వెల్లువెత్తాయి. మనిషికి మితాహారం ఎంత ఆరోగ్యకరమో, అలాగే మంత్రిమండలి సంఖ్య కూడా మితంగా ఉంటే అన్ని విధాలగాను బాగుంటుంది.

మంత్రుల ప్రాధాన్యతను బట్టి మంత్రి మండలిని ఈ క్రింది విధంగా వర్గీకరించవచ్చును.

1) కేబినేట్ మంత్రులు : (CABINET MINISTERS)

2) రాజ్య మంత్రులు : (STATE MINISTERS)

3) ఉప మంత్రులు : (DEPUTY MINISTERS)

వీరు కాకుండా పార్లమెంటరీ కార్యదర్శులు అనే పేరుతో మరో అంచె కూడా ఉంది. (ప్రస్తుతం పార్లమెంటరీ కార్యదర్శులను నియమించుట లేదు).

**1) కేబినెట్ మంత్రులు:** మంత్రి మండలిలో కేబినెట్ మంత్రులు అత్యంత శక్తివంతమైన రాజకీయ వర్గమని చెప్పవచ్చును. ప్రభుత్వపరమైన విధాన నిర్ణయాలు చేసే అధికారం కేబినెట్‌కే ఉంటుంది. సాధారణంగా కేబినేట్ మంత్రుల సంఖ్య పరిమితంగా ఉంటుంది. బాగా సమర్థవంతులైన వారిని మాత్రమే కేబినెట్ మంత్రులుగా నియమించటం జరుగుతుంది. ఆర్థిక, రెవెన్యూ, హోమ్ వంటి కీలకమైన మంత్రిత్వ శాఖలను కేబినెట్ మంత్రులకు కేటాయిస్తారు. వీరు అవసరమైతే స్వతంత్రంగా కూడా నిర్ణయాలు తీసుకొనే అధికారం కలిగి ఉంటారు.

**2) స్టేట్ లేదా రాజ్య మంత్రులు:** రాజ్యమంత్రి ఒక మంత్రిత్వ శాఖను స్వతంత్రంగా నిర్వహించవచ్చును లేదా కేబినెట్ మంత్రికి అనుసంధానంగా పనిచేయవచ్చును. ఇతను కేబినెట్ సమావేశాలకు హాజరు కాడు.

**3) డిప్యూటీ లేదా సహాయ మంత్రి:** ఇతను కేబినెట్ మంత్రికి సహాయకారిగా పని చేస్తాడు. సీనియర్ కేబినెట్ మంత్రికి కొంత పనిభారం తగ్గించటానికి సహాయమంత్రిని నియమిస్తారు. ఇతను కూడా కేబినెట్ సమావేశాలకు హాజరు కాడు.

పార్లమెంటరీ కార్యదర్శులు పేరుకు తగ్గట్టుగానే పార్లమెంటరీ కార్యక్రమాల నిర్వహణలో తోడ్పడతారు. పరిపాలన సంస్కరణల సంఘం ఈ పదవులను రద్దు చేయమని కోరినప్పటికీ కేంద్ర ప్రభుత్వం వీటిని రద్దు చేయలేదు. అయితే 1977 నుండి కేంద్ర ప్రభుత్వంలో పార్లమెంటరీ కార్యదర్శులను నియమించలేదు.

## 4.3 మంత్రిమండలి - పదవీ కాలం - జీత భత్యాలు :

రాజ్యాంగం ప్రకారం మంత్రిమండలి గవర్నరుకు సంతృప్తి ఉన్నంత కాలం అధికారంలో కొనసాగుతుంది అని చెప్పినప్పటికీ ఆచరణలో మాత్రం, శాసనసభ విశ్వాసం పొందినంత కాలం అధికారంలో ఉంటుంది. పార్లమెంటరీ సాంప్రదాయం ప్రకారం మంత్రిమండలి పదవీకాలం దిగువ సభ పదవీ కాలంతో ముడిపడి ఉంటుంది. రాష్ట్ర అసెంబ్లీ పదవీ కాలం 5 సంవత్సరాలు కనుక మంత్రిమండలి పదవీ కాలం కూడా 5 సంవత్సరాలుగా చెప్పుకోవచ్చును. ముఖ్యమంత్రి రాజీనామా చేసినప్పుడు మంత్రిమండలి

కూడా రాజీనామా చేస్తుంది. మధ్యలో రాజ్యాంగ సంక్షోభం ఏర్పడి రాష్ట్రపతి పాలన విధిస్తే, అపుడు కూడా మంత్రిమండలి రద్దవుతుంది. ఆ తర్వాత అసెంబ్లీని మధ్యంతరంగా అంటే 5 సంవత్సరాలు పూర్తికాక మునుపే రద్దు చేస్తే మంత్రిమండలి కూడా రద్దవుతుంది. రాష్ట్రపతి పాలన విధించకుండా, అసెంబ్లీ ఎన్నికలు జరిపినప్పుడు మాత్రమే మంత్రివర్గం రద్దు కాకుండా, కేర్‌టేకర్ ప్రభుత్వంగా కొనసాగుతుంది.

**జీత భత్యాలు :**

మంత్రుల జీతభత్యాలను రాష్ట్ర శాసనసభ నిర్ణయిస్తూ ఉంటుంది. ప్రస్తుతం మంత్రి జీతం నెలకు రూ. 12,000లు. ఇవికాక అలవెన్సులు, ఉచిత వసతి, కారు, టెలిఫోన్ మొదలైన సౌకర్యాలు ఉంటాయి.

## 4.4 మంత్రి వర్గ నిర్మాణం :

బ్రిటన్ దేశంలోని రాజకీయనేత్తను మీ జీవితాశయం ఏమిటని అడిగితే, కేబినెట్ మంత్రి కావాలనేదే తన జీవితాశయం అని చెబుతాడట. బ్రిటన్‌లో కేబినెట్ మంత్రి పదవికి ఎంతటి విలువ ఉందో పై వాక్యం తెలియచేస్తుంది. ఆంధ్రప్రదేశ్‌లో ప్రస్తుతం రాజకీయ అధికారం కోసం రెండు బలమైన కులాలు తీవ్రంగా పోటీపడుతున్న నేపథ్యంలో మంత్రిమండలి నిర్మాణం ముఖ్యమంత్రికి పెద్ద సవాలుగా పరిణమించింది. ప్రస్తుతం భారతదేశంలో రాజకీయ పదవులకు ఉన్న విపరీతమైన మోజును దృష్టిలో పెట్టుకొని పరిశీలిస్తే మంత్రిమండలి నిర్మాణం ముఖ్యమంత్రికి ఒక అగ్ని పరీక్ష. అర్హత ఉన్నా, లేకపోయినా అధికార పార్టీకి చెందిన ప్రతీ శాసనసభ్యుడు మంత్రిపదవి కోరుకునే నేటి తరుణంలో, మంత్రి పదవులు రానివారు ముఠాలు కట్టి అసమ్మతి వర్గంగా ఏర్పడటం, అధిష్టానానికి ఫిర్యాదులు పంపడం, తదితర నిరసన పద్ధతులు సర్వసాధారణంగా తయారయ్యాయి. అందరికీ మంత్రి పదవులు ఇవ్వటం సాధ్యం కాదు కదా! ఇపుడు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రాజకీయ పరిస్థితిని ఒకసారి సమీక్షిద్దాం. భారతదేశంలో రాజకీయాలలో కులం ప్రభావం ప్రధానమైనది అనేది జగమెరిగిన సత్యం. ఈ విషయంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి మినహాయింపు లేనేలేదు. ప్రస్తుతం ఆంధ్రప్రదేశ్‌లో కుల రాజకీయాలు విలయ తాండవం చేస్తున్నాయి. ఇది అన్ని రాజకీయ పార్టీలకు విస్తరించింది. ఆంధ్రప్రదేశ్‌లో ఒక విచిత్రమైన పరిస్థితి ఉంది. అదేమనగా కాంగ్రెస్ పార్టీ ఎన్నికలలో విజయం సాధించి, ఎప్పుడు అధికారంలో వచ్చినా, రెడ్డి కులస్తులే ఎక్కువగా ముఖ్యమంత్రులు కాగలుగుతున్నారు. అలాగే ప్రాంతీయ పార్టీ తెలుగుదేశం అధికారంలోకి వస్తే కమ్మ కులస్థులు మాత్రమే ముఖ్యమంత్రి పదవిని చేపడుతున్నారు. 1956లో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం ఏర్పడిన నాటి నుండి నేటి వరకు రాష్ట్ర రాజకీయ చరిత్రను సమీక్షిస్తే పై వ్యాఖ్యానంలోని మర్మం ఇట్టే అర్థమౌతుంది.

## 4.5 ఆంధ్రప్రదేశ్‌లో మంత్రిమండలి నిర్మాణంలో పరిగణనలోనికి తీసుకునే వివిధ అంశాలు :

**4.5.1.** పెద్ద మనుషుల ఒప్పందం

**4.5.2** ప్రాంతాలవారీగా ప్రాతినిధ్యం

**4.5.3** కులాల వారీగా ప్రాతినిధ్యం

**4.5.4** ఇతర అంశాలు

ఈ పైన పేర్కొన్న అంశాలను వివరంగా పరిశీలించుదాం.

### 4.5.1 పెద్దమనుషుల ఒప్పందం (20-02-1956) :

ఆంధ్రరాష్ట్రానికి చెందిన ప్రముఖ రాజకీయ నాయకులకు హైదరాబాదు రాష్ట్రానికి చెందిన ప్రముఖ రాజకీయ నాయకులకు మధ్య కుదిరిన ఈ ఒప్పందాన్ని, పెద్ద మనుషుల ఒప్పందంగా పిలుస్తున్నారు. ప్రత్యేక రాష్ట్రాలుగా ఉన్న ఆంధ్రరాష్ట్రంలోని ప్రజలు మాట్లాడే భాష, హైదరాబాదు రాష్ట్రంలోని ప్రజలు మాట్లాడే భాష తెలుగే కనుక, భాషా ప్రయుక్త రాష్ట్రాల ఏర్పాటు ననుసరించి, తెలుగుభాష మాట్లాడే ప్రజలందరూ ఒకే ఉమ్మడి రాష్ట్రంగా ఏర్పడాలి అనే నినాదం 1955-56 సంవత్సరాలలో బాగా ప్రచారం చేయబడింది. ఈ ప్రచార ఫలితంగా, ఆంధ్ర మరియు హైదరాబాదు రాష్ట్రాలు ఒకే రాష్ట్రంగా, విశాలాంధ్రగా, ఆంధ్రప్రదేశ్ అనే ఉమ్మడి నూతన రాష్ట్రంగా ఏర్పడటానికి, 20-2-1956వ తేదీన ఢిల్లీలో ఒక సమావేశం ఏర్పాటయ్యింది. ఈ సమావేశంలో ఇరు రాష్ట్రాలకు చెందిన ప్రముఖులు తమ, తమ రాష్ట్రాల ప్రయోజనాలకు సంబంధించిన వివిధ అంశాలను విస్తృతంగా చర్చించిన పిమ్మట, ఇరు రాష్ట్రాల ప్రయోజనాలకు అనుకూలంగా ఒక ఒప్పందాన్ని కుదుర్చుకున్నారు. ఈ ఒప్పందాన్నే పెద్ద మనుషుల ఒప్పందం అని పిలుస్తారు. ఈ ఒప్పందాన్ని కుదుర్చుకున్న ప్రముఖ రాజకీయ నాయకులు ఆంధ్ర రాష్ట్రం నుండి:

1) శ్రీ బెజవాడ గోపాలరెడ్డి - ఆంధ్ర రాష్ట్ర ముఖ్యమంత్రి
2) శ్రీ నీలం సంజీవ రెడ్డి - ఉప ముఖ్యమంత్రి
3) శ్రీ గౌతు లచ్చన్న - కేబినెట్ మంత్రి
4) శ్రీ అల్లూరి సత్యన్నారాయణ రాజు - ఎ.పి. కాంగ్రెస్ కమిటీ ప్రెసిడెంట్

**హైదరాబాదు రాష్ట్రం నుండి :**

1) శ్రీ బూర్గుల రామకృష్ణారావు - హైదరాబాదు రాష్ట్ర ముఖ్యమంత్రి
2) శ్రీ కె.వి. రంగా రెడ్డి - కేబినెట్ మంత్రి
3) శ్రీ మర్రి చెన్నారెడ్డి - కేబినెట్ మంత్రి
4) శ్రీ జె.వి. నరసింగరావు - హైదరాబాదు ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ ప్రెసిడెంట్.

పెద్ద మనుషుల ఒప్పందంలో అనేక ప్రధానమైన అంశాలు ఉన్నప్పటికీ మంత్రిమండలి నిర్మాణానికి చెందిన అంశాలనే మీకు వివరించడం జరుగుతుంది.

**మంత్రిమండలి నిర్మాణానికి చెందిన అంశాలు :-**

1) మంత్రిమండలిలో మంత్రుల నిష్పత్తి, ఆంధ్ర, తెలంగాణా ప్రాంతాల మధ్య 60:40గా ఉండాలి.
2) తెలంగాణా ప్రాంతం నుండి ఒక ముస్లిం తప్పకుండా మంత్రిమండలిలో ఉండాలి.
3) ముఖ్యమంత్రి ఆంధ్ర ప్రాంతానికి చెందిన వాడైతే, ఉప ముఖ్యమంత్రి తెలంగాణా ప్రాంతం వాడై ఉండాలి. ముఖ్యమంత్రి తెలంగాణా ప్రాంతం వాడైతే, ఉపముఖ్యమంత్రి ఆంధ్ర ప్రాంతం వాడై ఉండాలి.
4) హోం, ఆర్థిక, రెవెన్యూ, వాణిజ్యం, పరిశ్రమలు, ప్లానింగ్ అండ్ డెవలప్‌మెంట్ శాఖలలో కనీసం రెండు శాఖలు తప్పకుండా తెలంగాణా వారికి కేటాయించాలి.

### 4.5.2. ప్రాంతాలవారీగా ప్రాతినిధ్యం :

మంత్రిమండలిలో, కోస్తా, రాయలసీమ, తెలంగాణా ప్రాంతాలకు మంత్రి పదవుల పంపిణీ సమతూకంగా ఉండేటట్లు జాగ్రత్త పడాలి. ప్రతిజిల్లాకు తప్పకుండా ఒక మంత్రి పదవి కేటాయించడం సమంజసంగా ఉంటుంది.

### 4.5.3. కులాలవారీగా ప్రాతినిధ్యం :

భారత రాజకీయాలలో ప్రాచీన కాలం నుండి ఈనాటి వరకు కులం ప్రధాన భూమికను నిర్వహిస్తున్నది అనే పరిశీలకుల వ్యాఖ్యానం నూటికి నూరు పాళ్ళు సత్యం. వివిధ రాజకీయ పార్టీల నాయకులు వేదికలెక్కి, కులరహిత సమాజాన్ని నిర్మిస్తామని ఎన్ని ఊకదంపుడు ఉపన్యాసాలు చేసినా కులం ప్రభావం రోజు, రోజుకూ పెరుగుతున్నదే తప్ప తగ్గటం లేదు. ఎన్నికలలో పార్టీ టిక్కెట్ల కేటాయింపు నుంచి మంత్రి పదవుల కేటాయింపు వరకు కులం ప్రాతిపదిక గానే జరుగుతున్నాయి.

భారతదేశంలో కేంద్ర ప్రభుత్వ స్థాయిలో ప్రధానమంత్రి పదవిలో, బ్రాహ్మణులు మాత్రమే 5 సంవత్సరాల పూర్తి పదవీ కాలాన్ని పూర్తి చేయగలుగుతున్నారు. బ్రాహ్మణేతరులెవ్వరూ కనీసం మూడు సంవత్సరాలు పదవీ కాలాన్ని పూర్తి చేసిన దాఖలాలు లేవు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రాజకీయ పరిస్థితిని సమీక్షించిన్నట్లైతే, కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే ఎక్కువగా రెడ్డి కులస్తులే ముఖ్యమంత్రులు కావటం, రెడ్డి కులస్తులకే కీలకమైన మంత్రి పదవులు, అధికార హోదాలు లభిస్తున్నాయి. ప్రాంతీయ పార్టీ తెలుగుదేశం అధికారంలోకి వస్తే కమ్మ కులస్తులు మాత్రమే ముఖ్యమంత్రి పదవిని, కీలకమైన పదవులను, రాజకీయ లబ్ధిని పొందుతున్నారు. మిగిలిన కులాల పరిస్థితి అంతంత మాత్రమే. దేశంలోను, రాష్ట్రంలోను, అధిక శాతం జనాభా కలిగిన వెనుకబడిన తరగతులకు, షెడ్యూల్డు కులాలు, తెగల వారికి అప్రధానమైన ఒకటి, రెండు శాఖలు కేటాయించి బుజ్జగిస్తారు. మంత్రివర్గంలో ప్రధానమైన కులాలకు కనీసం ఒక మంత్రి పదవి లభించేటట్లుగా ప్రతీ ముఖ్యమంత్రి జాగ్రత్త పడుతున్నారు.

### 4.5.4 ఇతర అంశాలు :-

అల్ప సంఖ్యాక వర్గాలకు, స్త్రీలకు, యువకులకు, పార్టీలో నమ్మకస్తులకు అవసరాన్ని బట్టి పదవులు కేటాయించబడుతూ ఉంటాయి.

## 4.6 మంత్రిమండలి - మరికొన్ని అంశాలు :

### 4.6.1. గవర్నరు పేరిట పరిపాలన :

రాజ్యాంగం **166(1)** ప్రకారం రాష్ట్ర ప్రభుత్వ వ్యవహారాలు, గవర్నరు పేరు మీద జరుగుతాయి. అయితే వాస్తవంలో గవర్నరు నామమాత్రపు అధికారి మాత్రమే. ప్రజల ద్వారా ఎన్నికైన ప్రభుత్వం అధికారంలో కొనసాగినంత కాలం ఆయనకు పరిపాలనకు సంబంధించి స్వతంత్ర నిర్ణయాలు చేసే వీలు లేదు. విధాన నిర్ణయాలన్నీ మంత్రి మండలే చేస్తుంది. ముఖ్యమంత్రి నేతృత్వంలోని మంత్రిమండలి పరిపాలన సజావుగా సాగటానికి అవసరమైన నిర్ణయాలు తీసుకుంటూ, రాష్ట్రంలో శాంతి, భద్రతలను కాపాడుతూ రాష్ట్రాన్ని ప్రగతిపథంలోకి నడిపించాలి. రాష్ట్ర పరిపాలనకు సంబంధించి మంత్రిమండలి సమిష్టిగా రాష్ట్ర శాసనసభకు బాధ్యత వహిస్తుంది. పార్లమెంటరీ ప్రజాస్వామ్యంలో కార్యనిర్వాహక శాఖ, శాసనశాఖకు జవాబుదారీగా ఉంటుంది అనేది చాలా ప్రధానమైన సూత్రం.

### 4.6.2. మంత్రి శాసనసభ్యుడై ఉండాలి :-

అధికార పార్టీకి చెంది, శాసనసభలో సభ్యత్వం కలవారికి మాత్రమే మంత్రి పదవి ఇవ్వాలి. అయితే బ్రిటీష్ పార్లమెంటరీ సాంప్రదాయం ప్రకారం శాసన సభ్యత్వం లేనివారిని కూడా మంత్రిగా నియమించవచ్చు.

రాజ్యాంగం 164(4) ప్రకారం శాసనసభ్యత్వం లేని వ్యక్తి మంత్రిగా నియమించబడితే, అతను ఆరు నెలలలోపు శాసనసభ సభ్యత్వం పొందాలి. లేనిచో అతని మంత్రి పదవి రద్దు అవుతుంది. 1991 మే నెలలో రాజీవ్ గాంధీ మరణం తర్వాత, కాంగ్రెస్ పార్టీ పార్లమెంటరీ నాయకుడుగా ఎన్నికైన పి.వి. నరసింహారావు అప్పట్లో పార్లమెంటు ఉభయ సభలలో దేనిలోనూ సభ్యుడు కాదు. అయినప్పటికీ ఆయనను ప్రధానిగా నియమించడం జరిగింది. ఆ తర్వాత 6 నెలల లోపునే నంద్యాల లోక్‌సభ స్థానం నుండి ఎన్నికైన సంగతి మనకు తెలుసు.

### 4.6.3. మంత్రులు ఉభయ సభలకు బాధ్యులే :

శాసనసభలో ఉభయ సభలు ఉన్న చోట, మంత్రి ఏదో ఒక సభలో సభ్యత్వం కలిగి ఉండాలి. తనకు సభ్యత్వం ఉన్న సభలోనే ఓటు వేసే హక్కు ఉంటుంది. తన మంత్రిత్వ శాఖ నిర్వహణకు సంబంధించి ఉభయ సభలకు హాజరై, సభ్యులు అడిగే ప్రశ్నలకు, అనుబంధ ప్రశ్నలకు సమాధానాలు చెబుతూ చర్చలలో పాల్గొంటాడు.

### 4.6.4 సమిష్టి బాధ్యత :-

ప్రభుత్వ నిర్వహణ, పరిపాలనకు సంబంధించి, మంత్రిమండలి సమిష్టిగా వ్యవహరించాలి. విధానపరమైన, పరిపాలనా పరమైన నిర్ణయాలు కేబినెట్ చేసినప్పటికీ, ఆ నిర్ణయాలకు మొత్తం మంత్రిమండలి సభ్యులందరూ కట్టుబడి ఉండాలి. వాటివల్ల ఉత్పన్నమయ్యే తదుపరి పరిణామాలకు అందరూ బాధ్యులే. ఒకవేళ ఏ మంత్రి అయినా ఆ నిర్ణయంతో విభేదిస్తే తన పదవికి రాజీనామా చేసి అప్పుడు బహిరంగంగా విమర్శించాలి. పదవిలో కొనసాగుతూ విమర్శించరాదు. మంత్రి వర్గ నిర్ణయాలు అతి రహస్యంగా ఉంచాలి. అధికారికంగా అనుమతి పొందిన వారు తప్ప, ఇతరులు [illegible] బయటకు వెల్లడి చేయరాదు. 1987 ఫిబ్రవరిలో కేబినెట్‌లో చర్చించిన విషయాలు బహిర్గతం అయ్యాయి అని భావించిన అప్పటి ముఖ్యమంత్రి ఎన్.టి. రామారావు తాను తప్ప మిగిలిన మంత్రిమండలి సభ్యులందరి చేత రాజీనామా చెయ్యించారు. శాసనసభలో ప్రతిపక్షం ప్రభుత్వ పనీతీరుపై దాడి చేస్తూ విమర్శ శాస్త్రాలు సంధించినపుడు, ప్రభుత్వాన్ని ఇరుకున పెట్టడానికి ప్రయత్నించినప్పుడు, మంత్రిమండలి సమిష్టిగా ఆ ప్రయత్నాలను తిప్పి కొట్టాలి. మంత్రిమండలిపై అవిశ్వాస తీర్మానం ప్రతిపాదించిన సందర్భంలో తమ పార్టీ సభ్యులను, సానుభూతి పరులను కూడగట్టుకొని అవిశ్వాస తీర్మానాన్ని ఓడించాలి. తన ప్రభుత్వాన్ని కాపాడుకోవాలి. ఒకవేళ అవిశ్వాస తీర్మానం నెగ్గితే సమిష్టిగా రాజీనామా చెయ్యాలి.

### 4.7. మంత్రిమండలి అధికారాలు :-

1) వాస్తవ కార్యనిర్వాహక అధికారం కలిగినది. రాష్ట్ర పరిపాలన పై నిరవధిక [illegible] అధికారం కలది.

2) రాష్ట్ర మంత్రిమండలి రాష్ట్ర పరిపాలనను నిర్వహిస్తుంది. అందుకు సంబంధించిన నియమ నిబంధనలు, విధానాలు, పథకాలను రూపొందించి, ఉద్యోగి బృంద పాలన ద్వారా వాటిని అమలు పరుస్తూ పర్యవేక్షిస్తుంది.

3) రాష్ట్ర పరిపాలనకు అవసరమైన చట్టాలను [illegible] సంబంధించి ఉమ్మడి జాబితాలోని

అంశాలకు సంబంధించి, అవసరమైన అంశాలపై బిల్లులను రూపొందించి శాసనసభలో ప్రవేశ పెట్టి సభ ఆమోదం పొందేటట్లు చేస్తుంది. సభామోదం పొందిన బిల్లులు, గవర్నరు ఆమోద ముద్ర పొందిన పిమ్మట ప్రభుత్వ చట్టాలుగా పిలవబడతాయి.

4) శాసనసభ ఆమోదించిన తీర్మానాలను అమలు పరచడం.

5) రాష్ట్ర వార్షిక బడ్జెట్టు ఆర్థిక మంత్రి తయారు చేసి ప్రతీ ఆర్థిక సంవత్సరం ముగిసే లోపుగా శాసనసభ ద్వారా ఆమోదింప చేయించుట.

6) రాష్ట్ర వార్షిక ప్రణాళికను తయారు చేస్తుంది.

7) వివిధ దర్యాప్తు సంఘాల నివేదికలను శాసనసభకు నివేదిస్తుంది.

8) రాష్ట్రంలో అత్యున్నత పదవుల నియామకాలకు సంబంధించి గవర్నరుకు సిఫారసు చేయుట.

9) శాసనసభ సమావేశాలు జరగని సమయంలో గవర్నరు చేత అత్యవసర ఉత్తర్వులు (Ordinances) జారీ చేయించుట.

10) ఉద్యోగి బృందం, సర్వీసు నిబంధనలు, వేతన సవరణలు, బదిలీలు, ప్రమోషన్లకు సంబంధించిన నియమ నిబంధనలను రూపొందించి అమలు పరచుట.

11) కేంద్ర శాసనాలను అమలు పరచడం.

12) రాష్ట్రంలో అమలు చేయతలపెట్టిన నీటి పారుదల, విద్యుత్ ప్రాజెక్టులకు, పథకాలకు, కేంద్రం అనుమతి లభించేటట్లు, సంబంధిత మంత్రులు చర్యలు తీసుకోవటం.

13) రాష్ట్రంలో శాంతి భద్రతల పరిస్థితి సమీక్షించి మెరుగైన పాలన అందించుట

14) బలహీన వర్గాలు, షెడ్యూల్డు కులాలు, తెగల వారి ప్రయోజనాలకు పథకాలు రూపొందించి అమలు పరచుట.

15) రాష్ట్రం ఆదాయం, వ్యయం పై మదింపు చేసి, రాష్ట్రం ఆర్థికంగా అభివృద్ధి చెందే మార్గాలను అన్వేషించుట.

16) ప్రకృతి వైపరీత్యాలు సంభవించినపుడు, అంటురోగాలు ప్రబలినప్పుడు, మత కల్లోలాలు, జరిగినప్పుడు ఆ ప్రాంతాలను సందర్శించి, ప్రజలలో ఆత్మ విశ్వాసాన్ని కలిగించి, చేదోడు, వాదోడుగా మిమ్మల్ని ఆదుకోవటానికి మేమున్నామంటూ ధైర్యం చెప్పి, మంత్రుల పర్యవేక్షణలో సత్వర చర్యలు చేపట్టి పరిస్థితిని చక్కదిద్దుట.

17) ప్రపంచంలోను, దేశంలోను, సంభవిస్తున్న మార్పులకు అనుగుణంగా రాష్ట్రంలో ఉపయోగకరమైన మార్పులు చేయుట.

18) అంతర్జాతీయ స్థాయిలో, రాష్ట్రం తరపున పాల్గొని భాగస్వాములు కావటం.

## 4.8 ముఖ్యమంత్రి :-

రాష్ట్ర ముఖ్యమంత్రి, నియామకం, తొలగింపు మొదలైన అంశాల గురించి పాఠం 3లో వివరించడం జరిగింది. ముఖ్యమంత్రి, మంత్రిమండలికి జీవం. పార్లమెంటరీ మరియు కాబినెట్ ప్రభుత్వ విధానంలో ప్రధాన మంత్రి లేదా ముఖ్యమంత్రి (First among equals) సమానులలో మొదటివాడు అని అంటారు. అంటే మంత్రిమండలిలో మంత్రులందరూ (ముఖ్యమంత్రితో సహా) సహచరులే. అయితే ముఖ్యమంత్రి ఈ సహచర మంత్రివర్గ బృందానికి నాయకుడు అనేది ఒక అభిప్రాయం. ఈ అభిప్రాయంలో కొంత నిజం ఉన్నప్పటికీ ప్రస్తుత కేబినెట్ ప్రభుత్వ వ్యవస్థలో, ప్రధానమంత్రి, ముఖ్యమంత్రుల చుట్టూనే రాజకీయ

వ్యవస్థ పరిభ్రమిస్తున్నది. ముఖ్యంగా ముఖ్యమంత్రితోనే రాష్ట్ర మంత్రిమండలి మనుగడ ముడిపడి ఉంది. ముఖ్యమంత్రి లేనిదే మంత్రిమండలి లేదు కదా! గవర్నరు ముందుగా ముఖ్యమంత్రితో పదవీ ప్రమాణం చేయించిన తర్వాత, ముఖ్యమంత్రి సిఫారసు ప్రకారం మంత్రిమండలి సభ్యులను నియమిస్తారు. అసెంబ్లీ ఎన్నికలలో పార్టీ ప్రకటించిన ఎన్నికల ప్రణాళికలోని వాగ్దానాలను విజయవంతంగా, సకాలంలో అమలు పరచడానికి తగిన మంత్రివర్గ సభ్యులను ఎంపిక చేసుకొని ముఖ్యమంత్రి పరిపాలనా పగ్గాలు చేపడతాడు.

ఎవరికి ఏ మంత్రి పదవి ఇవ్వాలి అనేది ముఖ్యమంత్రి ఇష్టం. నిర్ణీత కాల వ్యవధిలో తన మంత్రి మండలి సభ్యుల పనితీరును సమీక్షిస్తూ అవసరమైన మార్పులు చేస్తూ ఉంటాడు. మంత్రులను మార్చడం, వారి శాఖలను మార్చడం, పాత మంత్రులను తొలగించి కొత్త వారిని నియమించడం అంతా ముఖ్యమంత్రి ఇష్టం. (He Shuffles his pack as he likes) ముఖ్యమంత్రి రాష్ట్ర ప్రభుత్వాధినేత. మొత్తం మంత్రిమండలి ముఖ్యమంత్రి నేతృత్వంలో పనిచేయాలి. మంత్రివర్గం సమర్థవంతంగా పనిచేస్తే ఆ ఘనత ముఖ్యమంత్రికే దక్కుతుంది. మంత్రివర్గం సరిగా పనిచేయకపోతే ఆ వైఫల్యం ముఖ్యమంత్రిపై పడుతుంది. కనుక ముఖ్యమంత్రి సమర్థులైన వారినే మంత్రులుగా ఎంచుకోవాలి. ప్రజల ఆశలు, పార్టీ ప్రణాళికను దృష్టిలో పెట్టుకొని, ప్రజాహిత కార్యక్రమాలు, పథకాలు రూపొందించి తగిన ఆర్థిక వనరులను సమకూర్చుకొని తన మంత్రుల ద్వారా విజయవంతంగా అమలు చెయ్యించాలి. కేంద్రంతో సఖ్యతతో పనిచేస్తూ కేంద్ర సహాయం పొందాలి. మంత్రుల పని తీరును సమీక్షిస్తూ, సమన్వయమేర్పర్చాలి. మంత్రులలోను, తన పార్టీ శాసనసభ్యులలోను, పార్టీ శ్రేణులలోను ఉత్తేజాన్ని నింపాలి. మంత్రులకు ధైర్యాన్ని, మనోబలాన్ని కలిగిస్తూ వారిని ముందుకు నడిపించాలి. అసమర్థులను తొలగించి, కొత్త వారితో మంత్రి వర్గాన్ని పునర్నిర్మిస్తూ సమర్థవంతంగా పని చెయ్యించాలి. తాను పనిచేస్తూ ఇతరులు పనిచేసేటట్లు స్ఫూర్తినివ్వాలి. ముఖ్యమంత్రి నీతికి, నిజాయితీకి మారుపేరుగా నిలవాలి. కోట్లాది మంది రాష్ట్ర ప్రజలు నూతన ప్రభుత్వంపై పెట్టుకొన్న ఆశలకు కార్యరూపం ఇస్తూ, ఒక ఆదర్శమైన ప్రభుత్వం, ఒక ఆదర్శమైన ముఖ్యమంత్రిగా ప్రజారంజితంగా పాలిస్తూ, సుపరిపాలనను ప్రజలకు అందించాలి. ముఖ్యమంత్రి అంటే ఇలా ఉండాలి అని నలుగురూ మెచ్చాలి.

## 4.9 ముఖ్యమంత్రికి - మంత్రివర్గంతో గల సంబంధాలు :

ముఖ్యమంత్రికి - మంత్రి మండలితో సత్సంబంధాలు ఉన్నప్పుడే ప్రభుత్వం సమర్థవంతంగా పని చేస్తుంది. మంత్రి మండలి - ముఖ్యమంత్రి సంబంధం పాత్ర - నూనెవంటిది. ముఖ్యమంత్రి లేనిదే మంత్రిమండలి లేదు. ముఖ్యమంత్రి నియామకం తర్వాత మిగిలిన మంత్రులు ముఖ్యమంత్రి సిఫారసు పై నియమించబడతారు. ముఖ్యమంత్రి రాజీనామా చేస్తే మంత్రులంతా రాజీనామా చెయ్యాలి. ఒక్కో సందర్భంలో ముఖ్యమంత్రి రాజీనామా చెయ్యకుండా మంత్రిమండలి సభ్యులందర్నీ రాజీనామా చెయ్యించవచ్చు. మంత్రిమండలి సమిష్టి బాధ్యత అనే సూత్రంపై పని చెయ్యాలి. సమిష్టిగా విజయాన్ని అందుకోవాలి. సమిష్టిగా పరాజయాన్ని స్వీకరించాలి. కలిసి బ్రతకాలి లేదా కలిసి మునగాలి. సమిష్టిగా పని చెయ్యాలి. సమిష్టిగా ప్రతిఫలం స్వీకరించాలి. మంత్రిగా ఉండగా ముఖ్యమంత్రిపై విమర్శలు చేయరాదు. ముఖ్యమంత్రి మిగిలిన మం[illegible]తగా వ్యవహ[illegible] ఎందుకంటే ఈనాటి మంత్రి రేపు ముఖ్యమంత్రి కావచ్చు. అలా జరిగాయి కూడా. అం[illegible] ఆంధ్రప్రదేశ్ రాష్ట్రమే. ఎంతో సమ్మోహన శక్తి, ప్రజాబలం కలిగిన ఎన్.టి. రామారావే, రెండు సార్లు ముఖ్యమంత్రి పదవి నుండి వైదొలగవలసిన పరిస్థితి, తన సహచర కేబినెట్ మంత్రులు మరియు అతి నమ్మకస్తులు అనుకున్నవారి నుండే ఉత్పన్నమైన దంటే, ముఖ్యమంత్రి ఎంత జాగ్రత్త వహించాలో వేరే చెప్పనవసరం లేదు.

1984లో జరిగిన కుట్రను భగ్నం చేసి, నాదెండ్ల భాస్కరరావును గద్దె దింపి, తిరిగి ముఖ్యమంత్రి పదవిని చేపట్టిన ఎన్.టి. రామారావు, 1995లో జరిగిన తిరుగుబాటును తిప్పికొట్టి నారా చంద్రబాబునాయుడిని పదవి నుంచి దించలేక, తానే ముఖ్యమంత్రి పదవికి రాజీనామా చేసాడు. తన ముఖ్యమంత్రి పదవిని తిరిగి రాబెట్టుకోలేక, కలలోనైనా ఊహించని ఈ హఠాత్పరిణామానికి తట్టుకోలేక మనోవేదనతో 1996 జనవరి 18వ తేదీన మరణించాడు.

## 4.10 ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రుల జాబితా :-

| వరుస నెంబరు. | పేరు | నుండి | వరకు |
|---|---|---|---|
| 1. | సర్వశ్రీ నీలం సంజీవరెడ్డి | 01-11-1956 | 16-04-1957 |
| 2. | సర్వశ్రీ నీలం సంజీవరెడ్డి | 17-04-1957 | 10-01-1960 |
| 3. | సర్వశ్రీ దామెదరం సంజీవయ్య | 11-01-1960 | 11-03-1962 |
| 4. | సర్వశ్రీ నీలం సంజీవరెడ్డి | 12-03-1962 | 28-02-1964 |
| 5. | సర్వశ్రీ కాసు బ్రహ్మానందరెడ్డి | 29-02-1964 | 06-03-1967 |
| 6. | సర్వశ్రీ కాసు బ్రహ్మానందరెడ్డి | 07-03-1967 | 18-07-1969 |
| 7. | సర్వశ్రీ కాసు బ్రహ్మానందరెడ్డి | 19-07-1969 | 30-09-1971 |
| 8. | సర్వశ్రీ పి.వి. నరసింహరావు | 30-09-1971 | 20-03-1972 |
| 9. | సర్వశ్రీ పి.వి. నరసింహరావు | 20-03-1972 | 18-01-1973 |
| 10. | రాష్ట్రపతి పాలన | 18-01-1973 | 10-12-1973 |
| 11. | సర్వశ్రీ జలగం వెంగళరావు | 10-12-1973 | 05-03-1978 |
| 12. | సర్వశ్రీ డా॥ మర్రి చెన్నారెడ్డి | 06-03-1978 | 10-10-1980 |
| 13. | సర్వశ్రీ టి. అంజయ్య | 11-10-1980 | 23-02-1982 |
| 14. | సర్వశ్రీ భవనం. వెంకట్రామిరెడ్డి | 24-02-1982 | 20-09-1982 |
| 15. | సర్వశ్రీ కోట్ల విజయ భాస్కర రెడ్డి | 20-09-1982 | 09-01-1983 |
| 16. | సర్వశ్రీ డా॥ నందమూరి తారక రామారావు | 09-01-1983 | 16-08-1984 |
| 17. | సర్వశ్రీ నాదెండ్ల భాస్కరరావు | 16-08-1984 | 16-09-1984 |
| 18. | సర్వశ్రీ డా॥ నందమూరి తారక రామారావు | 16-09-1984 | 1985 |
| 19. | సర్వశ్రీ డా॥ నందమూరి తారక రామారావు | 1985 | 05-12-1989 |
| 20. | సర్వశ్రీ డా॥ మర్రి చెన్నారెడ్డి | 05-12-1989 | 18-12-1990 |
| 21. | సర్వశ్రీ ఎన్. జనార్ధన్ రెడ్డి | 18-12-1990 | 08-10-1992 |
| 22. | సర్వశ్రీ కోట్ల. విజయ భాస్కర రెడ్డి | 09-10-1992 | 12-12-1994 |
| 23. | సర్వశ్రీ డా॥ నందమూరి తారక రామారావు | 12-12-1994 | 1995 |

| | | | |
|---|---|---|---|
| 24. | సర్వశ్రీ నారా చంద్రబాబునాయుడు | 1995 | 13-05-2004 |
| 25. | సర్వశ్రీ డా॥ వై.యస్. రాజశేఖరరెడ్డి | 14-05-2004 to | |

## 4.11 సారాంశము :-

రాష్ట్ర మంత్రిమండలి రాష్ట్ర పరిపాలన, ప్రభుత్వ విధానాలకు సంబంధించిన నిర్ణయాలు చేస్తుంది. పరిపాలనాపరమైన తప్పులు, లోపాలకు అదే బాధ్యత వహించాల్సి ఉంటుంది. మంత్రిమండలి ముఖ్యమంత్రి నాయకత్వంలో పని చేస్తుంది. సమిష్టి బాధ్యత అనే అంశం ప్రాతిపదికగా పని చేస్తుంది. రాష్ట్ర ప్రజల అవసరాలను తీర్చి, రాష్ట్రాన్ని ప్రగతి పథంలో నడిపించేది రాష్ట్ర మంత్రిమండలి. రాష్ట్ర అసెంబ్లీ సభ్యుల విశ్వాసం కోల్పోయిన వెంటనే మంత్రిమండలి రాజీనామా చెయ్యాలి. దీని అర్ధం ఏమనగా మంత్రిమండలి అసెంబ్లీకి జవాబుదారీగా ఉంటుంది. మంత్రిమండలి నిర్మాణ బాధ్యత అంతా ముఖ్యమంత్రిదే. అలాగే మంత్రి పదవుల కేటాయింపు కూడా ముఖ్యమంత్రి ఇష్టానుసారమే జరుగుతుంది.

సమర్ధులైన వ్యక్తులను మంత్రులుగా ఎంపిక చేసుకొని, మంచి పరిపాలనను అందించటానికి ముఖ్యమంత్రి ప్రయత్నించాలి. ప్రజలకు జనరంజకమైన పాలనను అందించాలి. కేంద్రంతో సఖ్యతగా వుంటూ, రాష్ట్రానికి అవసరమైన నిధులు, పథకాలు రాబట్టుకోవాలి. స్వంత పార్టీలో అందరినీ కలుపుకొని, ఇతర రాజకీయ పార్టీలతో చర్చించి మంచి నిర్ణయాలు తీసుకోవాలి. ఆదర్శంగా మెలగాలి.

## 4.12. నమూనా ప్రశ్నలు :-

1) రాష్ట్ర మంత్రిమండలి నిర్మాణం, అధికారాలను తెలియచేయుము.

2) ముఖ్యమంత్రి అధికారాలపై ఒక వ్యాసము వ్రాయుము.

### లఘు వ్యాస రూప ప్రశ్నలు :-

ఎ) మంత్రిమండలి నిర్మాణంలో ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి పరిగణనలోనికి తీసుకునే అంశములు ఏమిటి?

బి) పెద్ద మనుషుల ఒప్పందమును వివరింపుము?

## 4.13 చదువదగిన గ్రంథాలు :


1. Text of the Indian Constitution
2. Prof. G. Ram Reddy and Prof B.A.V. Sharma : State Govt. and Politics of Andhra Pradesh
3. Prof: A. Prasanna Kumar K. Ravi and Lingamurthy : Govt. and Politics in Andhra Pradesh
4. Prof. K.R. Acharya (Ed) : ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వము - రాజకీయాలు


డా॥ ఎ. వెంకటరావు

పాఠం - 5

# ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర శాసనసభ - విధాన పరిషత్

## 5.0 లక్ష్యం :

పార్లమెంటరీ ప్రజాస్వామ్య వ్యవస్థలో శాసనసభ ప్రజలకు ప్రాతినిధ్యం వహించే వేదిక. ప్రజాభిప్రాయాన్ని ప్రతిబింబింప చేసే అతి ప్రధానమైన శాఖ. శాసనసభలో రెండు రకాలు ఉన్నాయి. అవి ఒకటి ద్విసభా విధానం. రెండు ఏక సభా విధానం. భారతదేశంలో కేంద్ర శాసనసభలో ద్విసభా విధానాన్ని బ్రిటీష్ ప్రభుత్వం, 1919లో జారీ చేసిన మాంట్‌ఫర్డ్ సంస్కరణల చట్టం ద్వారా ప్రారంభించింది. 1935లో జారీ చేసిన చట్టం, ఆరు ప్రోవిన్సెస్‌లలో ద్విసభా విధానాన్ని, మిగిలిన ప్రోవిన్సెస్‌లలో ఏకసభా విధానాన్ని ప్రవేశ పెట్టింది. 1950 నుండి అములులోకి వచ్చిన నూతన రాజ్యాంగం ఏ రాష్ట్ర శాసనసభలో ద్విసభా విధానం ఉంటుందో స్పష్టంగా తెలియచేసింది. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం 1-11-1956వ తేదీన ఏర్పాటు చేయబడింది. అయితే శాసనసభలో, ఏకసభా విధానమే ఉండేది. 1958లో విధాన పరిషత్‌ను ఏర్పాటు చేయటంతో ద్విసభా విధానం ప్రారంభమైంది. రాష్ట్రంలో విధాన పరిషత్ 01-06-1985వ తేదీ నుండి రద్దు చేయబడింది. 1958లో విధాన పరిషత్ ఎందుకు ఏర్పాటు చేసారు, తిరిగి 1985లో ఎందుకు రద్దు చేసారు అనే అనేక అంశాలకు సంబంధించిన సమాచారం తెలియచేయటమే ఈ పాఠం లక్ష్యం.

**విషయసూచిక :**


5.1 విధాన పరిషత్ - ఆవిర్భావం

5.2 విధాన పరిషత్ - ఉపయోగాలు

5.3 విధాన పరిషత్ ఏర్పాటుకు సంబంధించిన భారత రాజ్యంగ నిబంధనలు

5.4 విధాన పరిషత్ నిర్మాణానికి సంబంధించిన అంశాలు

5.5 విధాన పరిషత్ - సభా నిర్వాహకులు

5.6 ఆంధ్రప్రదేశ్‌లో విధాన పరిషత్ ఏర్పాటు

5.7 విధాన పరిషత్ అధికారాలు

5.8 విధాన పరిషత్ ఆవశ్యకత

  5.8.1 విధాన పరిషత్ అవసరం అనే వాదన

  5.8.2 విధాన పరిషత్ నిరుపయోగం అనే వాదన

5.9 విధాన పరిషత్ రద్దు

5.10 విధాన పరిషత్ పునరుద్ధరణ ప్రయత్నాలు

5.11 సారాంశము

5.12 నమూనా ప్రశ్నలు

5.13 చదువదగిన గ్రంథాలు

## 5.1 విధాన పరిషత్ - ఆవిర్భావం :

పార్లమెంటరీ ప్రజాస్వామ్యానికి మాతృక బ్రిటన్. బ్రిటీష్ పార్లమెంటరీ విధానంలో, ద్విసభా విధానం అనగా హౌస్ ఆఫ్ లార్డ్స్, హౌస్ ఆఫ్ కామన్స్ అనే రెండు సభల విధానం ఒక సాంప్రదాయం ప్రకారం అభివృద్ధి చెందింది. భారతదేశానికి బ్రిటీష్ వారు వ్యాపారానికై వచ్చినప్పుడు దేశాన్ని మొగలు చక్రవర్తి పరిపాలించేవాడు. మొగలు చక్రవర్తిని పరిపాలన నుంచి తప్పించి, బ్రిటీష్ వాళ్ళు పరిపాలన చేపట్టిన వంద సంవత్సరాల తర్వాత దేశంలో నెమ్మదిగా, ప్రజాస్వామ్య వ్యవస్థకు శ్రీకారం చుట్టారు. 1853లో బ్రిటీష్ పార్లమెంటు జారీ చేసిన చట్టం, భారతదేశంలో శాసన మండలుల వ్యవస్థను ప్రవేశపెట్టింది. 1919లో జారీ చేసిన మాంట్‌ఫర్డు సంస్కరణల చట్టం. కేంద్ర శాసనసభలో (CENTRAL LEGISLATURE) ద్విసభా విధానాన్ని ఏర్పాటు చేసింది. 1935లో జారీ చేసిన చట్టం, ఆరు రాష్ట్ర శాసనసభలలో ద్విసభా విధానాన్ని ఏర్పాటు చేసింది. రాష్ట్ర శాసనసభలో ఎగువ సభను విధాన పరిషత్ అని, దిగువ సభను అసెంబ్లీ లేదా విధాన సభ అని పిలిచేవారు. 1950 నుండి అమలులోనికి వచ్చిన నూతన రాజ్యాంగం కేంద్రంలో ద్విసభా విధానాన్ని కొనసాగించింది. రాష్ట్రాలకు సంబంధించి కొన్ని రాష్ట్రాలలో ద్విసభా విధానాన్ని, మరికొన్ని రాష్ట్రాలలో ఏక సభా విధానాన్ని ఏర్పాటు చేసింది.

## 5.2 విధాన పరిషత్ ఉపయోగాలు :

ద్విసభావిధానం బ్రిటన్‌లో ప్రారంభమైనదని ఇంతకు ముందు తెలియచేయటమైనది. బ్రిటీష్ పార్లమెంటులోని ఎగువ సభను ప్రభువుల సభ అనియు, దిగువసభను సామాన్యుల సభ అని పిలుస్తారు. ప్రభువుల సభ లేదా ఎగువ సభగా పిలిచే ఈ సభలో వంశపారంపర్య హక్కు ద్వారా సభ్యత్వం లభిస్తుంది. సామాన్యుల సభ లేదా దిగువసభ సభ్యులను మాత్రం పార్లమెంటరీ నియోజక వర్గాల నుంచి వోటర్లు ప్రత్యక్షంగా ఎన్నుకొంటారు. సామాన్యుల సభ ఏవైనా తొందరపాటు నిర్ణయాలు చేస్తే వాటిని సరిదిద్దటానికి ఈ ఎగువ సభ ఉపయోగపడుతుంది అనేది బ్రిటీష్ రాజనీతిజ్ఞుల యొక్క అభిప్రాయం. అందుచేతనే ఎగువ సభను పెద్దల సభ అని కూడా అంటారు. భారతదేశంలో ఎన్నికలు ఎన్నో వ్యయ ప్రయాసలతో కూడి ఉన్నటువంటివి. పరిపాలనాదక్షులు, మేధావులు, శక్తి సామర్థ్యాలు కలిగిన నిపుణులు, అనుభవజ్ఞులు ఎన్నికలంటేనే భయపడుతున్నారు. అయితే వీరి సేవలు కూడా దేశానికి, రాష్ట్రానికి చాలా అవసరం. ఇటువంటి వారు శాసనసభలలో ప్రవేశించడానికి వీలుగా ఎగువ సభలను ఏర్పాటు చేసారు. రాష్ట్ర శాసనసభలో ఎగువ సభను విధాన పరిషత్ అనియు, దిగువ సభను అసెంబ్లీ లేక విధానసభ అనియు పిలుస్తారు. ఇప్పుడు విధాన పరిషత్ నిర్మాణం, అధికారాలు తదితర అంశాల గురించి తెలుసుకుందాం.

## 5.3 విధాన పరిషత్ ఏర్పాటుకు సంబంధించిన భాగత రాజ్యాంగ నిబంధనలు :

భారత రాజ్యాంగం 168 (1) మరియు (2) నిబంధన ప్రకారం ప్రతీ రాష్ట్రంలో ఒక శాసనసభ ఉంటుంది. శాసనసభ, ఏకసభా విధానమైతే అది గవర్నరు మరియు విధాన సభగాను, ద్విసభావిధానమైతే అది గవర్నరు, విధాన పరిషత్ మరియు విధాన సభగాను పిలుస్తారు. రాజ్యాంగం 169(1) నిబంధన ప్రకారం రాష్ట్రంలో విధాన పరిషత్ ఉంటే దానిని రద్దు చేయమని, లేకపోతే, ఏర్పాటు చేయమని విధాన సభ ఒక తీర్మానం ఆమోదించి కేంద్రానికి పంపించాలి. విధానసభ పంపించిన తీర్మానానికి అనుగుణంగా కేంద్రం ఒక బిల్లును ప్రవేశ పెట్టాలి. బిల్లు పార్లమెంటు ఆమోదం పొందితే విధాన పరిషత్ రద్దు లేదా ఏర్పాటుకు చట్టం జారీ చేయబడుతుంది. అందువలన విధాన పరిషత్‌ను రద్దు చేయటానికి లేదా ఏర్పాటు చేయటానికి పార్లమెంటుకు అధికారం ఉన్నది అనే అంశం ప్రతీ ఒక్కరు గుర్తు పెట్టుకోవాలి.

## 5.4 విధాన పరిషత్ నిర్మాణానికి సంబంధించిన అంశాలు :

రాజ్యాంగ నిబంధన 171(1) ప్రకారం రాష్ట్ర అసెంబ్లీ సభ్యుల మొత్తం సంఖ్యలో 1/3 వంతు సభ్యులతో "విధాన పరిషత్" ఏర్పాటవుతుంది. అయితే విధాన పరిషత్ సభ్యుల కనీస సంఖ్య 40 కి తగ్గరాదు. విధాన పరిషత్‌లో ప్రాతినిధ్యం దిగువున పేర్కొన్న విధంగా ఉంటుంది.

ఎ) 1/3వంతు సభ్యులను స్థానిక సంస్థల నియోజక వర్గాల నుంచి ఎన్నుకొందురు.

బి) 1/3 వంతు సభ్యులను పట్టభద్రుల నియోజక వర్గాల నుంచి ఎన్నుకొందురు.

సి) 1/12 వంతు సభ్యులను ఉపాధ్యాయ నియోజక వర్గాల నుంచి ఎన్నుకొందురు.

డి) 1/3 వంతు సభ్యులను విధానసభ సభ్యులు ఎన్నుకొందురు.

ఇ) మిగిలిన సభ్యులను, సాహిత్యం, విజ్ఞానం, కళలు, సహకార ఉద్యమం, సామాజిక సేవా రంగాల నుండి లబ్ద ప్రతిష్టులైన వారిని రాష్ట్ర గవర్నరు నామినేట్ చేస్తారు.

### 5.4.1. కాలపరిమితి :

రాజ్యాంగం 172(2) నిబంధన ప్రకారం విధాన పరిషత్ శాశ్వత సభ. రాష్ట్ర గవర్నరుకు ఈ సభను డిసాల్వ్ (రద్దు) చేయుటకు అధికారం లేదు. సభ్యుని పదవీ కాలం 6 సంవత్సరాలు. 1/3 వంతు సభ్యులు ప్రతీ రెండు సంవత్సరాలకు పదవీ విరమణ చేస్తారు. సభ్యులను పరోక్ష పద్ధతిలో ఎన్నుకుంటారు.

### 5.4.2 ఎన్నికకు అర్హత :

ఎ) భారత పౌరుడై ఉండాలి

బి) 30 సంవత్సరాలు వయస్సు నిండి ఉండాలి.

సి) పార్లమెంటు చట్టరీత్యా నిర్ణయించిన ఇతర అర్హతలు కలిగి ఉండాలి.

## 5.5. విధాన పరిషత్ - సభా నిర్వాహకులు :

విధాన పరిషత్ అధ్యక్షుని "చైర్మన్" అంటారు. విధాన పరిషత్ సభ్యులు, తమలో నుండి ఒకరిని చైర్మన్‌గాను, మరొకరిని డిప్యూటీ చైర్మన్‌గాను ఎన్నుకొంటారు. సభా సమావేశాలు చైర్మన్ నిర్వహిస్తూ ఉంటారు. చైర్మన్ లేని సమయంలో డిప్యూటీ చైర్మన్ సమావేశాలు నిర్వహిస్తాడు. విధాన పరిషత్‌ను సమావేశ పరచటం (Summon), దీర్ఘకాలం వాయిదా వేయటం (Prorogue) గవర్నరే చేస్తారు. సభను రద్దు (Dissolve) చేసే అధికారం గవర్నరుకు లేదు.

## 5.6 ఆంధ్రప్రదేశ్‌లో విధాన పరిషత్ ఏర్పాటు :

దేశంలోనే మొదటి భాషా ప్రయుక్త రాష్ట్రంగా నవంబరు 1, 1956న ఏర్పడిన రాష్ట్రం మన ఆంధ్రప్రదేశ్. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం ఏర్పడినప్పుడు శాసనసభలో ఒకే సభ ఉండేది. అదే అసెంబ్లీ. నూతన రాష్ట్ర ముఖ్యమంత్రి శ్రీ నీలం సంజీవరెడ్డి. ఆయన కాలంలోనే 5-12-1956న విధాన పరిషత్‌ను ఏర్పాటు చేయమని, విధాన సభ ఒక తీర్మానాన్ని ఆమోదించి కేంద్రానికి పంపింది.

అప్పట్లో అటు కేంద్రంలోను, ఇటు మన రాష్ట్రంలోను కాంగ్రెసు పార్టీ అధికారంలో ఉంది. అప్పటి ప్రధానమంత్రి పండిట్ జవహర్‌లాల్ నెహ్రూకు, మన ముఖ్యమంత్రి సంజీవరెడ్డి మంచి స్నేహితుడు, మంచి నమ్మకస్తుడు. కనుక రాష్ట్ర అసెంబ్లీ తీర్మానం పంపిన వెంటనే, నెహ్రూజీ సానుకూలంగా స్పందించటం వలన పనులన్నీ చకచకా జరిగిపోయాయి. సెప్టెంబరు, 1957లో పార్లమెంటులో, ఆంధ్రప్రదేశ్‌లో విధాన పరిషత్ ఏర్పాటుకు సంబంధించిన బిల్లు ప్రవేశపెట్టడం, పార్లమెంటు బిల్లును ఆమోదించడం, ఆ తర్వాత రాష్ట్రపతి ఆమోద ముద్ర లభించడంతో, 1-7-1958 నుండి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో రాష్ట్ర శాసనసభలో విధాన పరిషత్ ఏర్పడింది.

అయితే విధాన పరిషత్ ఏర్పాటుపై అప్పట్లో రసవత్తరమైన చర్చలు జరిగాయని, రాజకీయ వర్గాలలో దీనిపై భిన్నాభిప్రాయాలు భిన్న కథనాలు వెలువడ్డాయని అంటారు. కొంతమంది రాజకీయ నాయకులు, ముఖ్యమంత్రి సంజీవరెడ్డిని, విధాన పరిషత్‌ను ఎందుకు ఏర్పాటు చేసారని సూటిగా ప్రశ్నలు వేసారట. సంజీవరెడ్డి మంచి సమర్థుడే కాదు, అనుభవజ్ఞుడు, బహుతెలివైనవాడు, చతురుడు. తనను ఇరుకున పెట్టాలని చూసేవారికి మింగుడు పడే రకం కాదు. అందుకే చాలా తెలివిగా ప్రస్తుతం దేశంలో చాలా రాష్ట్రాలలో విధాన పరిషత్‌లు ఉన్నాయి. కనుక మన రాష్ట్రంలో కూడా ఏర్పాటు చేసామని ముక్తసరిగా సమాధానం చెప్పాడట. అయితే విధాన పరిషత్ ఏర్పాటుకు సంబంధించి సంజీవరెడ్డికి వేరే ఆలోచనలు ఉన్నాయంటారు విమర్శకులు. ముఖ్యంగా కొత్తగా రాష్ట్ర ముఖ్యమంత్రి పదవిని చేపట్టిన సంజీవరెడ్డి తన పట్ల అసమ్మతితో వున్న కొందరు నాయకులను పదవులతో సంతృప్తి పరచి తనకు పార్టీలో ఎదురు లేకుండా చేసుకోవటానికై వేసిన రాజకీయ ఎత్తుగడ ఫలితమే ఈ విధాన పరిషత్ ఏర్పాటని విమర్శకులంటారు. కారణాలు ఏమైనప్పటికీ విధాన పరిషత్ ఏర్పాటుతో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ద్విసభా విధానం 1-7-1958 నుండి అమలులోనికి వచ్చినది.

## 5.7 విధాన పరిషత్ - అధికారాలు :

రాజ్యాంగం ప్రకారం, విధాన పరిషత్తు కంటే, అసెంబ్లీకే అన్ని విషయాలలోను ఎక్కువ అధికారాలు కలవు. విధాన పరిషత్ అధికారాలు చాలా పరిమితమైనవి. అవి ఏమనగా

1. శాసన అధికారాలు
2. కార్యనిర్వాహక అధికారాలు
3. ఆర్థిక అధికారాలు

### 5.7.1 శాసనాధికారాలు :

సాధారణ బిల్లును విధానసభలో లేదా విధాన పరిషత్‌లో ప్రవేశపెట్టవచ్చును. ఆర్థిక బిల్లును మాత్రం విధాన సభలోనే ప్రవేశపెట్టాలి. విధాన పరిషత్‌లో మెజారిటీ ఉంటే తప్ప ఏ ప్రభుత్వం, ముందుగా పబ్లిక్ బిల్లును విధాన పరిషత్‌లో ప్రవేశపెట్టదు. కనుక బిల్లును విధాన సభలో ప్రవేశపెట్టిన తర్వాత, బిల్లు విధానసభ ఆమోదం పొందిన తర్వాత, బిల్లు విధాన పరిషత్ ఆమోదం కోసం పంపబడుతుంది. విధానపరిషత్ బిల్లును యధాతథంగా ఆమోదిస్తే సమస్యే లేదు. బిల్లుకు ఉభయ సభలు ఆమోదం తెల్పడంతో, గవర్నర్ ఆమోదం కోసం పంపబడుతుంది. గవర్నర్ ఆమోదంతో బిల్లు చట్టంగా మారుతుంది.

ఒకవేళ విధాన పరిషత్తు బిల్లును తిరస్కరించినా లేదా బిల్లులో సవరణలు ప్రతిపాదించినా, బిల్లును విధాన సభకు పంపాలి. అలా పంపినపుడు విధాన సభ బిల్లును, యధాతధంగా గాని, సవరణలు ఆమోదించి గాని, విధాన పరిషత్‌కు పంపాలి. విధాన సభ రెండవసారి ఆమోదించి పంపిన బిల్లును విధాన పరిషత్ 30 రోజులలో ఆమోదించి విధాన సభకు పంపాలి. 30 రోజులలోపు బిల్లును విధానపరిషత్ ఆమోదించి పం[illegible]తే, విధానసభ రెండవసారి ఆమోదించిన రూపంలో బిల్లును ఉభయ

సభలు ఆమోదించినట్లుగా భావించి గవర్నరు ఆమోద ముద్ర కోసం పంపబడుతుంది. గవర్నరు ఆమోద ముద్రతో ఆ బిల్లు చట్టం అవుతుంది. ఇదొక పద్ధతి. మరో పద్ధతి కూడా ఉంది. అదేమనగా:

బిల్లును విధానసభ ఆమోదించి, విధాన పరిషత్‌కు పంపినప్పుడు, విధాన పరిషత్ బిల్లుపై ఏ నిర్ణయమూ తీసుకోకుండా మూడు నెలల వరకు జాప్యం చేయవచ్చును. దీనినే నిద్రపోవటం (Sleeping over the bill) అంటారు. మూడు నెలల కాలం ముగిసిన తర్వాత బిల్లుపై విధానపరిషత్ ఏ నిర్ణయమూ తీసుకొనకపోతే, విధాన పరిషత్ బిల్లును తిరస్కరించినట్లు భావించబడుతుంది. కనుక బిల్లును మూడు నెలల వ్యవధి దాటిన తర్వాత విధాన సభ, రెండవసారి ఆమోదించి పంపినట్లైతే, విధాన పరిషత్ దానిని ముప్పది రోజుల లోపుగా ఆమోదించాలి. ముప్పది రోజులలోపు బిల్లును విధాన పరిషత్ ఆమోదించకపోతే, ఆ బిల్లును ఉభయ సభలు ఆమోదించినట్లుగా భావించి గవర్నరు ఆమోదం కోసం పంపుతారు. గవర్నరు ఆమోదం పొందిన తర్వాత బిల్లు, చట్టంగా మారుతుంది. పై విషయాలను బట్టి, బిల్లును విధాన పరిషత్ ఆమోదించక పోయినా అది విధానసభ ఆమోదం పొందితే చట్టంగా మారుతుంది. బిల్లుకు సంబంధించి, విధాన పరిషత్ నాలుగు నెలల కాలం జాప్యం చేయగలదే తప్ప, చట్టం కాకుండా ఆపడానికి అధికారం లేదు. సాధారణ బిల్లుల విషయంలో విధానసభదే అంతిమ నిర్ణయం.

### 5.7.2 కార్యనిర్వాహక అధికారాలు :

అధికార పార్టీకి చెందిన విధాన పరిషత్తు సభ్యులను మంత్రులుగా నియమించవచ్చును. 1982, ఫిబ్రవరి 24వ తేదీన ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా నియమించబడిన భవనం వెంకట్రావ్, అప్పట్లో విధాన పరిషత్ సభ్యుడు కావటం విశేషం. మంత్రి మండలి పనితీరుపై, ప్రజా సమస్యలపై విధాన పరిషత్‌లో సభ్యులు, మంత్రులను ప్రశ్నలు వేసి సమాధానాలు రాబట్టవచ్చును. అవిశ్వాస తీర్మానం ఆమోదించి, మంత్రినికాని, ప్రభుత్వాన్ని కాని అధికారం నుంచి తొలగించే అధికారం విధానపరిషత్‌కు లేదు. మంత్రిమండలి కేవలం అసెంబ్లీకి మాత్రమే జవాబుదారీగా ఉంటుంది.

### 5.7.3 ఆర్థిక అధికారాలు :

ఆర్థిక విషయాలలో విధాన పరిషత్ అధికారాలు మరీ తక్కువ. ఆర్థిక బిల్లును ముందుగా విధాన సభలోనే ప్రవేశ పెట్టాలి. విధాన పరిషత్‌లో ప్రవేశపెట్టరాదు. విధాన సభ ఆమోదించిన ఆర్థిక బిల్లును, విధాన పరిషత్‌కు పంపుతారు. అప్పుడు విధాన పరిషత్ 14 రోజులలోపు బిల్లును సమీక్ష చేసి ఏవైనా సిఫారసులు చేసి విధానసభకు పంపాలి. విధానసభ ఆర్థిక బిల్లులో విధాన పరిషత్ చేసిన కొన్ని లేదా అన్ని సిఫారసులను ఆమోదించవచ్చు లేదా తిరస్కరించవచ్చు. ఈ రెండు సందర్భాలలోను, ఆ బిల్లును విధానసభ ఆమోదించినట్లే. ఒకవేళ 14 రోజుల తర్వాత బిల్లును విధాన సభకు పంపకపోతే, బిల్లును విధానసభ ఆమోదించి విధాన పరిషత్‌కు పంపిన రూపంలోనే, ఉభయ సభలు ఆమోదించినట్లుగా భావించబడుతుంది. దీనిని బట్టి ఆర్థిక బిల్లును విధాన పరిషత్ 14 రోజులపాటు జాప్యం చేయగలదే తప్ప తిరస్కరించలేదు.

పైన వివరించిన సమాచారాన్ని బట్టి శాసన, కార్యనిర్వాహక, ఆర్థిక విషయాలలో విధాన పరిషత్ అధికారాలు చాలా తక్కువ అని తేటతెల్లమవుతుంది. అన్ని విషయాలలోను, విధాన సభదే పై చేయి. అందువలన విధాన పరిషత్ కొనసాగింపు వృధా అనే అభిప్రాయం ప్రారంభమైనది. విధాన పరిషత్ ఉండాలి అని కొంతమంది, రద్దు చేయాలని మరికొంతమంది రాజకీయ నాయకులు వాదులాడుకోవటం మొదలు పెట్టారు.

## 5.8 విధాన పరిషత్ - ఆవశ్యకత :

### 5.8.1 విధాన పరిషత్ అవసరం అనే వాదన :

ప్రస్తుతం దేశంలో నెలకొని వున్న రాజకీయ వాతావరణంలో, లోక్‌సభ లేదా రాష్ట్ర అసెంబ్లీలలో ప్రజా సమస్యల గురించి బిల్లులలోని వివిధ అంశాలను సావధానంగా, కూలంకషంగా చర్చించే ప్రశాంత పరిస్థితులు ఎక్కడా కనిపించటం లేదు. సభా సమావేశాలు చర్చావేదికల్లా కాకుండా, అధికార ప్రతిపక్ష పార్టీల మధ్య యుద్ధ వేదికల వలె తయారవుతున్నాయి. ప్రజా సమస్యలపై చర్చించవలసిన విలువైన సభా సమయం వృధా అయిపోతున్నది. ఇటువంటి పరిస్థితుల్లో బిల్లులను కూలంకషంగా చర్చించి, నిర్ణయాలు తీసుకోవటానికి ఎగువ సభ అవసరం ఎంతైనా ఉన్నది.

2) అసెంబ్లీ సభ్యులను ఎన్నికలలో ఓట్లు వేసి ప్రత్యక్షంగా ఎన్నుకుంటారు. ప్రస్తుతం దేశంలో ఎన్నికలు ఎంత అధ్వాన్నంగా ఉంటున్నాయో మనందరకు తెలుసు. డబ్బు, సారా, కుల బలం, దౌర్జన్యం ఎన్నికల ఫలితాలను ప్రభావితం చేస్తున్నాయి. విలువలకు, సిద్ధాంతాలకు కట్టుబడే నాయకులు ఎన్నికలలో పోటీ చేయాలంటే భయపడుతున్నారు. అలాంటి ఆదర్శవంతమైన నాయకుల సేవలు రాష్ట్ర ప్రజలకు ఉపయోగపడటానికి వీలుగా, వారిని నామినేషన్ పద్ధతి ద్వారా విధాన పరిషత్ సభ్యులుగా నియమిస్తే, ఎన్నో ఉపయోగాలుంటాయి.

3) దిగువ సభ చేసే తొందరపాటు శాసన నిర్మాణాన్ని, విధాన పరిషత్ చక్కదిద్దటానికి వీలు కలుగుతుంది.

4) విధాన పరిషత్‌లో సభ్యత్వం కలిగి ఉండేవారు ప్రముఖంగా వివిధ రంగాలలో లబ్ధ ప్రతిష్టులైనవారు. కనుక అటువంటి వారి అనుభవం, శక్తి సామర్థ్యాలు రాష్ట్రాభివృద్ధికి ఎంతగానో తోడ్పడతాయి.

### 5.8.2 విధాన పరిషత్ నిరుపయోగం అనే వాదన :

1) విధాన పరిషత్‌కు పెద్దగా అధికారాలు లేవు. విధాన సభ ఆమోదించిన బిల్లులను జాప్యం చేయగలదే తప్ప, నిరోధించలేదు కనుక దీనివలన పెద్దగా ప్రయోజనం లేదు.

2) విధాన పరిషత్ సభ్యులు పరోక్ష ఎన్నిక, నామినేషన్ పద్ధతి ద్వారా సభ్యత్వం పొందుతారు. కనుక వారికి ప్రజలతో ప్రత్యక్ష సంబంధాలు ఎక్కువగా ఉండవు. విధాన పరిషత్ సభ్యునికి (M.L.C.) ఉండే అధికారాలు కూడా చాలా తక్కువ.

3) విధాన సభలో సభ్యుల హాజరు చాలా తక్కువగా ఉంటుంది.

4) విధాన పరిషత్ నిర్వహణ రాష్ట్ర ఖజానాపై అదనపు భారము.

## 5.9 విధాన పరిషత్ రద్దు :

ఆంధ్రుల అభిమాన సినిమా హీరో నందమూరి తారక రామారావు చలన చిత్ర రంగం నుంచి రాజకీయ రంగంలోనికి 1982 మార్చి నెలలో ప్రవేశించారు. బ్రహ్మాండమైన సమ్మోహన శక్తి (Charisma) కలిగిన రామారావు తెలుగుదేశం అనే ఒక నూతన ప్రాంతీయ పార్టీని స్థాపించారు. ప్రాంతీయ పార్టీ స్థాపించిన 9 నెలల తర్వాత 1983 జనవరిలో రాష్ట్ర అసెంబ్లీకి జరిగిన ఎన్నికలలో పార్టీని విజయపథంలో నడిపించి, అధికారంలో వున్న కాంగ్రెసు పార్టీని చిత్తు, చిత్తుగా ఓడించి 200 సీట్లు కైవసం చేసుకున్నాడు. రాష్ట్రంలో మొట్టమొదటి కాంగ్రెసేతర ముఖ్యమంత్రిగా 9-1-1983వ తేదీన ముఖ్యమంత్రి పదవిని చేపట్టిన

ప్రజానాయకుడు ఎన్.టి. రామారావు. అధికారం చేపట్టిన రోజు నుండే ఆయన తీసుకున్న నిర్ణయాలన్నీ సంచలనాలే. ఆంధ్రప్రదేశ్‌లో విధాన పరిషత్ రద్దు ఆయన తీసుకున్న సంచలన నిర్ణయాలలో ఒకటి. వాస్తవానికి విధాన పరిషత్‌కు పెద్దగా అధికారాలేమి లేవన్న విషయం రాజకీయం వర్గాలకు బాగా తెలిసిన విషయమే. అయినా రామారావు విధాన పరిషత్‌ను ఎందుకు రద్దు చేయాలని నిర్ణయించారనే విషయానికి కారణం కేవలం, విధాన పరిషత్‌లో అప్పట్లో ప్రతిపక్ష పార్టీగా ఉన్న కాంగ్రెస్ పార్టీకి మెజారిటీ ఉండటమే. కాంగ్రెస్ పార్టీ అంటే సహజంగానే మండిపడే రామారావు, కాంగ్రెసు పార్టీని మరో చావు దెబ్బ తీయాలనే ఉద్దేశంతోనే విధాన పరిషత్ రద్దుకు ఉపక్రమించారు.

### విధాన పరిషత్ రద్దు ప్రక్రియలో ప్రధానమైన ఘట్టాలు :

ఎ) 24-3-1983న, విధాన పరిషత్‌ను రద్దు చేయవలసిందిగా రాష్ట్ర అసెంబ్లీ తీర్మానం ఆమోదించి కేంద్రానికి పంపింది.

బి) కేంద్రం తీర్మానంపై స్పందించక పోవటంతో తిరిగి 2వ సారి 30-4-1985వ తేదీన మరొక తీర్మానం ఆమోదించి కేంద్రానికి పంపింది.

సి) 14-5-1985వ తేదీన పార్లమెంటు, ఆంధ్రప్రదేశ్‌లో విధాన పరిషత్‌ను రద్దు చేస్తూ బిల్లును ఆమోదించింది.

డి) 25-5-1985వ తేదీన బిల్లుకు రాష్ట్రపతి ఆమోద ముద్ర లభించింది.

ఇ) 01-06-1985వ తేదీ నుండి విధాన పరిషత్ రద్దు అమలులోనికి వచ్చింది.

### 5.10 విధాన పరిషత్ పునరుద్ధరణ ప్రయత్నాలు :

1989లో జరిగిన అసెంబ్లీ ఎన్నికలలో తెలుగుదేశం పార్టీని ఓడించి, కాంగ్రెసు పార్టీ తిరిగి అధికారంలోకి వచ్చింది. కాంగ్రెసు పార్టీ అధికారంలోకి రాగానే మళ్ళీ విధాన పరిషత్ పునరుద్ధరణ ప్రయత్నాలు ప్రారంభమయ్యాయి. చెన్నారెడ్డి ముఖ్యమంత్రిగా ఉండగా 23-1-1990వ తేదీన విధాన పరిషత్‌ను పునరుద్ధరించమని రాష్ట్ర అసెంబ్లీ ఒక తీర్మానం ఆమోదించి కేంద్రానికి పంపింది. అయితే కేంద్రం ఆ తీర్మానంపై అనుకూలంగా నిర్ణయం తీసుకోలేదు. 1994లో రాష్ట్ర అసెంబ్లీకి జరిగిన ఎన్నికలలో తెలుగుదేశంపార్టీ, కాంగ్రెసు పార్టీని ఓడించి అధికారం చేపట్టింది. 1994 నుండి 2004 వరకు అధికారంలో ఉన్న తెలుగుదేశం ప్రభుత్వ హయాంలో విధాన పరిషత్‌ను పునరుద్ధరించే ప్రయత్నాలు మరుగున పడిపోయాయి.

2004, ఏప్రిల్, మే నెలల్లో జరిగిన లోక్‌సభ, మరియు అసెంబ్లీ ఎన్నికల్లో, నారా చంద్రబాబు నాయుడి నేతృత్వంలో ఎన్నికల్లో పోటీ చేసిన తెలుగుదేశం ఘోర పరాజయం పాలయ్యింది. కేంద్రంలో కాంగ్రెస్ నాయకత్వంలో U.P.A. అనే సంకీర్ణ ప్రభుత్వం, రాష్ట్రంలో కూడా కాంగ్రెస్ నాయకత్వంలో కాంగ్రెస్, T.R.S. పార్టీలతో సంకీర్ణ ప్రభుత్వం ఏర్పాటయ్యాయి. కాంగ్రెస్ పార్టీ అటు కేంద్రంలోను, ఇటు రాష్ట్రంలోను అధికారం చేపట్టడంతో కాంగ్రెస్ శ్రేణులలో నూతనోత్సాహం ప్రారంభమయ్యింది. కాంగ్రెస్ వాదులు మళ్ళీ విధాన పరిషత్ పునరుద్ధరణ ప్రయత్నాలు మొదలు పెట్టారు. విధాన పరిషత్‌ను పునరుద్ధరించవలసిందిగా అసెంబ్లీ ఒక తీర్మానం కూడా ఆమోదించి కేంద్రానికి పంపించింది. కేంద్ర ప్రభుత్వం కూడా విధానపరిషత్ పునరుద్ధరణకు సానుకూలంగా ఉన్నట్లుగా సంకేతాలు పంపుతున్నది. అతి త్వరలోనే విధాన పరిషత్ పునరుద్ధరణకు పార్లమెంటులో బిల్లు ప్రవేశ పెడతారనే వార్తలు విధాన పరిషత్ ఉండాలని కోరుకునే రాజకీయ వర్గాలలో ప్రమోదం కలిగిస్తున్నాయి.

## 5.11 సారాంశము :

రాష్ట్ర శాసనసభలో ద్విసభా విధానం ఉన్నట్లయితే ఎగువసభను విధాన పరిషత్ అనియు దిగువ సభను విధాన సభ లేదా అసెంబ్లీ అని పిలుస్తారు. భారత రాజ్యాంగం ప్రకారం విధాన పరిషత్‌ను రద్దు చేయమని, లేదా ఏర్పాటు చేయమని, రాష్ట్ర అసెంబ్లీ ఒక తీర్మానాన్ని ఆమోదించి కేంద్రానికి పంపాలి. ఆ ప్రకారం పార్లమెంటు ఒక బిల్లును ఆమోదించాలి. ఆ బిల్లు రాష్ట్రపతి ఆమోదంతో చట్టంగా ఏర్పడిన తర్వాత విధాన పరిషత్ రద్దు కావటం లేదా ఏర్పాటు కావటం జరుగుతుంది. అంటే విధాన పరిషత్‌ను రద్దు చేయటానికి కాని, ఏర్పాటు చేయటానికి కాని పార్లమెంటుకే అధికారం ఉంది అనే విషయం గుర్తుంచుకోవాలి. అధికారపరంగా, రాష్ట్ర అసెంబ్లీకి శాసన, కార్యనిర్వాహక, ఆర్థిక పరమైన అధికారాలు చాలా ఎక్కువగా ఉన్నాయి. రాష్ట్ర విధాన పరిషత్‌కు ఉన్న అధికారాలు అతి తక్కువ. కేవలం అసెంబ్లీ ఆమోదించిన బిల్లులను జాప్యం చేయటం తప్ప బిల్లు శాసనం కాకుండా ఆపలేదు. 1-11-1956 వ తేదీన ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం ఏర్పాటు చేయబడినప్పుడు, రాష్ట్ర శాసనసభలో అసెంబ్లీ మాత్రమే ఉండేది. విధాన పరిషత్ లేదు. 5-12-1956వ తేదీన విధాన పరిషత్‌ను ఏర్పాటు చేయవలసిందిగా, అసెంబ్లీ తీర్మానం చేసి కేంద్ర ప్రభుత్వానికి పంపింది. 1957 సెప్టెంబరు నెలలో పార్లమెంటు, విధాన పరిషత్‌ను ఏర్పాటు చేస్తూ ఒక బిల్లును ఆమోదించింది. 1-7-1958వ తేదీన 90 మంది సభ్యులతో, విధాన పరిషత్ పని చేయటం ప్రారంభించిరది. 1985వ సంవత్సరంలో ఎన్.టి. రామారావు ముఖ్యమంత్రిగా పని చేస్తున్న కాలంలో విధాన పరిషత్‌ను రద్దు చేయమని కోరుతూ, రాష్ట్ర అసెంబ్లీ ఒక తీర్మానాన్ని ఆమోదించి కేంద్ర ప్రభుత్వానికి పంపింది. ఆ తీర్మానం ప్రకారం, విధాన పరిషత్‌ను రద్దు చేస్తూ పార్లమెంటు ఒక బిల్లును ఆమోదించింది. అది చట్టం కావటంతోనే 1-6-1985వ తేదీ నుండి విధాన పరిషత్ రద్దు అమలులోనికి వచ్చింది. 2004, మే నెలలో కాంగ్రెసు నేతృత్వంలో సంకీర్ణ ప్రభుత్వం ఏర్పాటు కావటంతో రాష్ట్రంలో విధాన పరిషత్ పునరుద్ధరణ ప్రయత్నాలు తిరిగి మొదలైనాయి.

## 5.12 నమూనా ప్రశ్నలు :

1) విధాన పరిషత్ నిర్మాణం, అధికారాలను వివరింపుము.

2) ఆంధ్రప్రదేశ్‌లో విధాన పరిషత్ రద్దుకు సంబంధించిన ప్రక్రియను వివరింపుము.

## లఘు రూప ప్రశ్నలు :

1) విధాన పరిషత్ నిర్మాణమును తెలియ చేయుము.

2). శాసనసభలో బిల్లుల ఆమోదానికి సంబంధించి విధాన పరిషత్ భూమికను వివరింపుము.

## 4.13 చదువదగిన గ్రంథాలు :

1. భారత రాజ్యాంగము.

2. ప్రొ. జి. రామిరెడ్డి & బి.ఎ.వి. శర్మ : గవర్నమెంటు అండ్ పాలిటిక్స్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్

3. ప్రొ. కె.ఆర్. ఆచార్య, సంపాదకుడు : ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం - రాజకీయాలు

డా॥ ఎ. వెంకటరావు

పాఠం- 6

# విధాన సభ - మారుతున్న శాసనసభ పాత్ర

## 6.0 లక్ష్యం:

పార్లమెంటరీ ప్రజాస్వామ్య దేశంలో శాసనశాఖకు అతి ముఖ్యమైన స్థానం ఉన్నది. శాసనశాఖకు కార్యనిర్వాహక శాఖ బాధ్యత వహిస్తుంది. శాసనసభ ప్రజల కోర్కెలకు ప్రతిబింబంగా నిలిచి ప్రజల సభగా గణతికెక్కింది. ప్రజల ప్రగతికి తగు శాసనాలు, విధానాలు రూపొందించడం, రాష్ట్రానికి చైతన్యవంతమైన నాయకత్వాన్ని అందించడం దీని ప్రధాన కర్తవ్యం. కేంద్రంలో పార్లమెంటులో గత లోక్‌సభను దిగువ సభగా వ్యవహరించిన రీతిలో రాష్ట్రంలో విధానసభ లేక అసెంబ్లీని దిగువ సభగా గుర్తించడమైనది. కార్యక్రమ నిర్వహణలో, శాసన నిర్మాణంలో, ఆర్థిక వ్యవహారాల్లో , హక్కుల విషయంలో రాష్ట్ర శాసనసభ అధికారాలు, విధులు, పార్లమెంటు అధికారాలు, విధులను పోలి ఉంటాయి. కొన్ని విషయాలలో భారత పార్లమెంటుకు, రాష్ట్ర శాసనసభలకు వ్యత్యాసం కూడా ఉన్నది. విధానసభ నిర్మాణం, అధికారాలు, శాసన ప్రక్రియ, శాసన నిర్మాణంలో దశలు, స్పీకర్ మరియు డిప్యూటీ స్పీకర్‌ల ఎంపిక, అధికారాలు ఉభయ సభల సంబంధాలు మరియు మారుతున్న శాసన సభల పాత్ర గురించి వివరించడం ఈ పాఠం యొక్క ప్రధాన లక్ష్యం.

## విషయసూచిక:


6.1. విధానసభ - పరిచయం
6.2 విధానసభ - నిర్మాణం
6.3 విధానసభ - అధికారాలు
6.4 శాసన నిర్మాణ ప్రక్రియ
6.5 శాసన నిర్మాణంలో దశలు
6.6. స్పీకర్ - డిప్యూటీ స్పీకర్
6.7 స్పీకర్ - అధికారాలు
6.8 ఉభయ సభల సంబంధాలు
6.9 మారుతున్న శాసనసభ పాత్ర
6.10 సారాంశము
6.11 నమూనా ప్రశ్నలు
6.12 చదువదగిన గ్రంథాలు


## 6.1 విధాన సభ - పరిచయం :

కేంద్రంలోని పార్లమెంటులో 'లోక్‌సభ' ను దిగువ సభగా, రాష్ట్ర శాసనశాఖలో "విధానసభ"ను దిగువ సభగా గుర్తించడమైనది. ఇది రాష్ట్ర ప్రజలకు ప్రత్యక్ష ప్రాతినిధ్యం వహించే సభ. రాజ్యాంగ ప్రకరణం 170 ప్రకారం విధాన సభ

60కి తక్కువ కాకుండా, **500**కు మించకుండా ఉండాలి. ప్రతి పది సంవత్సరాలకు సేకరించే జనాభా లెక్కల ఆధారంగా ప్రతీ రాష్ట్ర విధాన సభ స్థానాల సంఖ్యను నిర్ణయించడం జరుగుతుంది. అందుచేతనే ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఏర్పాటు నుండీ విధానసభ స్థానాల సంఖ్య మారుతూ వస్తున్నది. మొదటి విధాన సభలో **293**, రెండో విధాన సభలో **301**, మూడో విధానసభలో **300**, నాలుగు, అయిదు సభల్లో **287**, ఆ తర్వాత ఆరవ విధానసభ మొదలుకొని నేటి వరకూ విధాన సభ స్థానాల సంఖ్య **294**గా ఉన్నది. **1973**లో జరిగిన **31**వ రాజ్యాంగ సవరణను అనుసరించి జనాభా పెరుగుదలతో నిమిత్తం లేకుండా శాసనసభ స్థానాల సంఖ్య **294**గా కొనసాగుతున్నది.

## 6.2 విధానసభ - నిర్మాణం :

విధానసభలో **60**కి తగ్గకుండా **500**కు మించకుండా జనాభాను బట్టి సభ్యులు ఉంటారు. వయోజన ఓటింగు ప్రాతిపదికమీద, ప్రాదేశిక నియోజక వర్గాల నుంచి ప్రత్యక్షంగా సభ్యులు ఎన్నిక అవుతారు. ఓటర్ల ప్రాతిపదికన మొత్తం రాష్ట్రాన్ని నియోజక వర్గాలుగా విభజిస్తారు. ఒక నియోజక వర్గం నుండి ఒక ప్రతినిధి చొప్పున ఎన్నికవుతారు. నియమిత కాలంలో జరిగే సాధారణ ఎన్నికల్లో **18** సం॥లు వయసు నిండిన వయోజన ఓటర్లు ఓటింగ్‌లో పాల్గొని తమతమ నియోజక వర్గాల నుండి ప్రతినిధులను ఎన్నుకుంటారు. శాసనసభ పదవీ కాలం **5** సంవత్సరాలు. **42**వ రాజ్యాంగ సవరణ ఈ పదవీ కాలాన్ని **6** సంవత్సరాలకు పొడిగించింది. కాని **44**వ రాజ్యాంగ సవరణ తిరిగి శాసనసభ కాలపరిమితిని **5** సంవత్సరాలుగా మార్చింది. పదవీ కాలానికి ముందే శాసనసభను గవర్నర్ రద్దు చేయవచ్చు. షెడ్యూల్డు కులాలు, తెగల ప్రయోజనాలను పరిరక్షించే నిమిత్తం నియోజక వర్గాలలో కొన్ని S.C., S.T. కులాలకు ప్రత్యేకంగా కేటాయించడం జరుగుతుంది. 333 రాజ్యాంగ నిబంధనను **అనుసరించి ఆంగ్లో** ఇండియన్‌లకు తగిన ప్రాతినిధ్యం లభించలేదని గవర్నర్ భావిస్తే వారి ప్రతినిధిగా ఒక ఆంగ్లో -ఇండియన్‌ను విధానసభకు నామినేట్ చెయ్యవచ్చు.

173వ రాజ్యాంగ నిబంధననుసరించి విధాన సభ సభ్యుడిగా పోటీ చేసే వ్యక్తి భారతీయుడై ఉండాలి. 25 సం॥ల వయసు నిండి పార్లమెంటు నిర్ణయించే ఇతర అర్హతలు కలిగి ఉండవలెను. 52వ రాజ్యాంగ సవరణ చట్టం ప్రకారం పార్టీ ఫిరాయింపు నిషేధ చట్టం అమలులోకి వచ్చింది. దాని ప్రకారం ఒక రాజకీయ పక్షాన ఎన్నికైన అభ్యర్థి ఆ తర్వాత వేరొక రాజకీయ పార్టీలో చేరినట్లయితే లేదా పార్టీ ఫిరాయించినట్లయితే అతడు తన శాసనసభ్యత్వాన్ని కోల్పోతాడు. రాజ్యాంగ నిబంధన 192 ప్రకారం శాసన సభ్యులుగా కొనసాగడానికి ఒక సభ్యుడు అర్హత కోల్పోయాడా లేదా? అనే అంశాన్ని నిర్ణయించే అధికారం రాష్ట్ర గవర్నర్‌దే. గవర్నర్ నిర్ణయం అంతిమ నిర్ణయం. దానిని న్యాయస్థానంలో సవాలు చేయడానికి వీలులేదు. 174వ రాజ్యాంగ నిబంధన ప్రకారం శాసనసభ ప్రతి సంవత్సరం రెండు పర్యాయములు సమావేశం కావాలి. అయితే ఒక సమావేశం చివరి రోజుకూ, రెండో సమావేశం మొదటి రోజుకూ మధ్య ఆరు నెలల కాలపరిమితి మించరాదు. మొత్తం సభ్యులలో 1/10 వ వంతు సమావేశానికి హాజరైనట్లయితే "కోరం" ఉన్నట్లుగా భావించి సమావేశాలను నిర్వహించడం జరుగుతుంది.

## 6.3 విధానసభ - అధికారాలు

విధానసభ రాష్ట్రంలోని శాసన శాఖలో దిగువ సభగా ప్రజా ప్రతినిధులతో నిండి ఉండి ప్రజాసభగా ప్రాముఖ్యత సంతరించుకున్నది. కార్యక్రమాల నిర్వహణలో, ఆర్థిక వ్యవహారాల్లో, శాసన నిర్మాణంలో రాష్ట్ర శాసనసభ విధానమండలి కంటే అత్యధిక అధికారాలు కల్గి ఉన్నది. రాష్ట్ర శాసనసభకు శాసన నిర్మాణాధికారం, ఆర్థికాధికారాలు, మంత్రిమండలిపై అజమాయిషీ అధికారం మరియు ఇతర అధికారాలు కలవు.

## 6.3.1. శాసన నిర్మాణాధికారం :

రాజ్యాంగ నిబంధన 246 ననుసరించి రాజ్యాంగంలోని 7వ భాగంలో రాష్ట్రజాబితాలోని 66 అంశాలపై రాష్ట్ర శాసనసభ స్వతంత్ర ప్రతిపత్తి లో శాసనాలను రూపొందించే అధికారం కలిగి ఉంటుంది. అయితే ఉమ్మడి జాబితాకు చెందిన 47 అంశాలపై కేంద్ర శాసనాలను అతిక్రమించకుండా శాసనాలను రూపొందించవచ్చు. అన్ని రకాల బిల్లులు అంటే సాధారణ మరియు ఆర్థిక బిల్లులను విధానసభలో ప్రవేశపెడతారు. ద్విసభా విధానం ఉన్నట్లైతే, విధానసభ ఆమోదించిన సాధారణ బిల్లును విధాన పరిషత్తు పరిశీలనకు పంపవలసి యుంటుంది. విధాన పరిషత్తు ఆ బిల్లును 3 నెలలు లోగా పరిశీలించాలి. విధాన పరిషత్తు ఆ బిల్లును ఆమోదిస్తే గవర్నరు సంతకంతో అది చట్టం అవుతుంది. కాని విధాన పరిషత్తు ఆ బిల్లును తిరస్కరించవచ్చు లేదా కొన్ని సవరణలతో తిరిగి విధాన సభకు పంపించవచ్చు. లేదా బిల్లును ఆమోదించకుండా మూడు నెలలపాటు తాత్సారం చేయవచ్చు. ఇటువంటి పరిస్థితిలో విధానసభ బిల్లును మరోసారి ఆమోదించి, విధాన పరిషత్తుకు రెండవసారి పంపవచ్చు. ఈ విధంగా రెండవసారి విధానసభ బిల్లును ఆమోదించునపుడు, విధాన పరిషత్తు చేసిన సవరణలను పరిగణనలోనికి తీసికొనవచ్చు లేదా వాటిని ప్రక్కన బెట్టి తాను అనుకున్న రీతిలో బిల్లును ఆమోదించవచ్చు. అయితే రెండవసారి పరిశీలనకు వచ్చిన బిల్లును విధాన పరిషత్తు ఒక్క నెలలోగా ఆమోదించవలె. ఏ కారణం వలనైనా విధాన పరిషత్తు నెలలోపల ఆమోదించకపోయినా, బిల్లును తిరస్కరించినా ఆ బిల్లు ఉభయసభల ఆమోదం పొందినట్లుగా భావించి గవర్నర్ ఆమోద ముద్రకు పంపిస్తారు. అది ఆ విధంగా చట్టం అవుతుంది.

ఈవిధంగా రాష్ట్రంలో విధానమండలి ఉంటే ఒక బిల్లు చట్టం కావడానికి నాలుగు నెలలు కాలయాపన జరుగుతుంది. ఏ బిల్లు విషయంలోనైనా ఉభయ సభల మధ్య వివాదమేర్పడితే దాన్ని పరిష్కరించడానికి ఉభయసభల సంయుక్త సమావేశాన్ని ఏర్పాటు చేయడం గానీ, గవర్నర్ జోక్యం చేసుకోవడం గానీ జరగదు. శాసనసభ తనదైన శైలిలో బిల్లును ఆమోదించి చట్టం చేస్తుంటే విధానమండలి స్తబ్దంగా చూస్తూ ఊరుకోవాల్సిందే. అంటే సాధారణ లేక ఆర్థిక బిల్లులు చట్టాలుగా తయారు కావాలంటే విధానమండలి ప్రమేయంతో సంబంధం లేకుండా శాసనసభ చట్టాలను తయారు చేయగల అధికారాన్ని కలిగి ఉన్నది. రాష్ట్ర శాసనసభ బిల్లును ఆమోదించిన తరువాత దానిని గవర్నర్ ఆమోద ముద్ర కోసం పంపడం జరుగుతుంది. గవర్నర్ ఆ బిల్లుపై వెంటనే తన ఆమోదం ప్రకటించవచ్చు లేదా ఆమోదం తెలపకుండా వెనక్కి పంపవచ్చు లేదా రాష్ట్రపతి పరిశీలన కోసం బిల్లును నిలిపి ఉంచవచ్చు. రాష్ట్రపతి ఆమోదం కోసం పంపిన బిల్లును రాష్ట్రపతి రాజ్యాంగ నిబంధన 201 ప్రకారం ఆమోదం ప్రకటించవచ్చు లేదా తిరస్కరించవచ్చు. సాధారణ బిల్లు అయితే రాష్ట్రపతి తన సందేశాన్ని జత చేసి శాసనసభ పున: పరిశీలనకు పంపవల్సిందిగా గవర్నర్‌ను కోరవచ్చు. ఈ విధంగా వచ్చిన బిల్లును శాసనసభ 6 నెలలలోపు పున:పరిశీలించి తగిన సవరణలతో ఆమోదించి రాష్ట్రపతి ఆమోదం కోసం గవర్నర్ ద్వారా పంపబడుతుంది. రెండవ దఫా తన ఆమోదం కోసం వచ్చిన బిల్లును రాష్ట్రపతి తప్పక ఆమోదిస్తాడు. కారణం పార్లమెంటరీ ప్రజాస్వామ్య పద్ధతిలో శాసనసభలు ప్రజాభీష్టాన్ని ప్రతిబింబిస్తాయి. కాబట్టి అతడు ఆమోదిస్తాడని మనం విశ్వసించవచ్చు. రాష్ట్రపతి అలాంటి బిల్లును తిరస్కరించగలడా! అనేది రాజ్యాంగంలో విపులీకరించలేదు.

రాష్ట్ర శాసనసభ సమావేశాల్లో లేని కాలంలో అత్యవసరమని భావిస్తే గవర్నర్ ఆర్డినెన్స్‌లను 213 రాజ్యాంగ నిబంధన ప్రకారం జారీ చేయవచ్చు. వీటికి చట్టంతో సమాన విలువ ఉంటుంది. అలా తయారు చేసిన ఆర్డినెన్స్‌లను ఆరు నెలల్లోగా, శాసన సభ సమావేశమైన ఆరు వారాల లోపల సభ ఆమోదం తప్పకుండా పొందాలి. ఆమోదించకపోతే 6నెలల గడువు తరువాత అవి చెల్లవు. అంతేగాక గవర్నర్ వాటిని మధ్యలోనే ఉపసంహరించవచ్చు.

### 6.3.2 ఆర్థికాధికారాలు :

సాధారణ పార్లమెంటరీ సాంప్రదాయం ప్రకారం, ఆర్థిక బిల్లులను రాజ్యాంగ నిబంధన 198 ప్రకారం విధాన సభలోనే ముందు ప్రవేశపెట్టడం జరుగుతుంది. విధాన మండలిలో ఆర్థిక బిల్లును మొదటగా ప్రవేశపెట్టరాదు. ఒకే సభ ఉన్నట్లయితే ఆర్థిక బిల్లును సభ ఆమోదించడం చాలా సులభతరంగా ఉంటుంది. అయితే విధాన మండలి ఉన్నట్లయితే ఆ బిల్లును విధాన సభ ఆమోదించిన తరువాత విధాన మండలి ఆమోదం కోసం పంపుతారు. దానిని 14 రోజుల లోపల విధాన మండలి ఆమోదించి తిరిగి విధాన సభకు పంపించాలి. బిల్లుకు విధాన మండలి సవరణలు ప్రతిపాదించినట్లయితే ఆ సవరణలను విదానసభ ఆమోదించవచ్చు లేదా తిరస్కరించవచ్చు. విధానమండలి ఆర్థిక బిల్లును నిర్ణీత గడువు అంటే 14రోజులలోపు విధానసభకు తిరిగి పంపకపోయినట్లయితే ఆ ఆర్థికబిల్లు విధానమండలి ఆమోదించినట్లుగా భావించి గవర్నర్ ఆమోదముద్ర కోసం పంపడం జరుగుతుంది. గవర్నర్ ఆమోద ముద్రతో ఆర్థిక బిల్లు చట్టంగా రూపు సంతరించుకుంటుంది. ఆర్థిక బిల్లు విషయంలో విధానసభదే పైచేయిగా ఉంటుంది. రాజ్యాంగ నిబంధన 200 ప్రకారం ఒక ఆర్థిక బిల్లును శాసనసభ ఆమోదించి గవర్నర్ ఆమోదం కోసం పంపినట్లయితే ఆ ఆర్థిక బిల్లును గవర్నర్ తప్పక ఆమోదించాల్సి ఉంటుంది, తిరస్కరించ వీలు లేదు.

### 6.3.3. కార్యనిర్వాహక శాఖపై నియంత్రణాధికారం :

రాష్ట్ర శాసనసభ చెలాయించే అధికారాలలో కార్యనిర్వాహక శాఖపై నియంత్రణాధికారం అనేది చాలా కీలకమైనది. రాష్ట్రమంత్రి మండలి శాసనసభకు సమిష్టిగా బాధ్యత వహిస్తుంది. ముఖ్యంగా విధానసభ విశ్వాసం పొందగల్గినంత కాలం మాత్రమే ముఖ్యమంత్రి, అతని మంత్రిమండలి సహచరులు పదవిలో కొనసాగుతారు. విధానసభ సభ్యులు ప్రభుత్వ వ్యవహారాల విషయంలో ప్రశ్నలు, అనుబంధ ప్రశ్నలు, తీర్మానాలు ప్రవేశపెట్టి ప్రభుత్వం నుండి సమాధానాలు, సమాచారాన్ని రాబట్టవచ్చు. అసంతృప్తికర పనితీరు ప్రభుత్వం కనబర్చినచో విధానసభ వివిధ రకాల తీర్మానాలను ఆమోదించి మంత్రులను వ్యక్తిగతంగానే కాక సమిష్టిగా కూడా బాధ్యులను చేసి, అవిశ్వాసం ప్రకటించడం ద్వారా ముఖ్యమంత్రితో సహా మొత్తం మంత్రిమండలిని రాజీనామా చేయించవచ్చు. ఈ విధంగా శాసనసభ కార్యనిర్వాహక సంబంధమైన విధులను నిర్వహిస్తూ, ఆ శాఖను అదుపు చేస్తుంది.

### 6.3.4. ఎన్నిక సంబంధమైన అధికారాలు :-

విధానసభ రాజ్యాంగం నిర్దేశించిన నియమ నిబంధనల ప్రకారం ఎన్నిక సబంధమైన అధికారాలను చెలాయిస్తుంది. రాజ్యాంగ నిబంధన 54(B) ననుసరించి రాష్ట్రపతి ఎన్నికలో విధానసభ సభ్యులు ఓటర్లుగా పాల్గొనాలి. 80(4) రాజ్యాంగ ప్రకరణం ప్రకారం రాజ్యసభకు రాష్ట్రం నుంచి ప్రతినిథులను ఎన్నుకుంటారు. 171(D) రాజ్యాంగ ప్రకరణ ప్రకారం రాష్ట్ర విధాన మండలికి 1/3 వ వంతు సభ్యులను ఎన్నుకుంటారు. 178 నిబంధననుసరించి సభా కార్యకలాపాలను నిర్వహించడానికి స్పీకర్‌ను, డిప్యూటీ స్పీకర్‌ను ఎన్నుకుంటారు.

### 6.3.5. రాజ్యాంగ సవరణ సంబంధమైన విధులు :

రాజ్యాంగ ప్రకరణం 368 ప్రకారం రాజ్యాంగంలోని కొన్ని భాగాలను సవరించాలంటే పార్లమెంటులోని సభ్యులు 2/3వ వంతు మెజారిటీతో ఆ సవరణను ఆమోదించిన తరువాత ఆ సవరణ బిల్లును సగం కన్నా ఎక్కువ రాష్ట్ర శాసనసభలు ఆమోదించాలి కూడా. ఈ విధంగా మన రాష్ట్ర శాసనసభ రాజ్యాంగ సవరణ బిల్లును చర్చించి ఆమోదించే సందర్భంలో రాజ్యాంగ సభలాగా వ్యవహరిస్తుంది. రాష్ట్రాల శాసనసభల ఆమోదం కావాల్సిన రాజ్యాంగ విభాగాలు ఏవంటే రాష్ట్రపతి ఎన్నికకు సంబంధించినవి,

కేంద్ర ప్రభుత్వ అధికార పరిధి, రాష్ట్ర ప్రభుత్వ అధికార పరిధి, కేంద్రపాలిత ప్రాంతాల్లో హైకోర్టు వ్యవస్థకు సంబంధించినవి, పార్లమెంటులో రాష్ట్రాలకు ప్రాతినిధ్యం, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల అధికారాల జాబితాల వగైరాలకు సంబంధించినవి.

## 6.4 శాసన నిర్మాణ ప్రక్రియ :

మన రాజ్యాంగంలో 196 ప్రకరణం నుండి 207 ప్రకరణల వరకు రాష్ట్ర శాసన సభలలో శాసనాలు రూపొందించే ప్రక్రియను, దశలను విపులంగా వివరించడం జరిగింది. ఒక బిల్లుకు ముసాయిదా రూపాన్ని కల్పించి శాసనసభకు చెందిన ఉభయసభల్లో ప్రవేశపెట్టటం మొదలు, వాటి అమోదంతో గవర్నర్ ఆమోద ముద్ర పొందితేగాని ఆ బిల్లు చట్టం కాజాలదు. బిల్లులు సాధారణంగా రెండు రకాలు. అవి 1. సాధారణ బిల్లు, 2. ఆర్థిక బిల్లు.

### 6.4.1. సాధారణ బిల్లు:

సాధారణబిల్లు తిరిగి రెండు రాకాలుగా ఉంటుంది. అవి ప్రభుత్వ బిల్లు మరియు ప్రభుత్వేతర బిల్లు. ఆర్థికేతర లేక ఆర్థిక సంబంధం లేని ఏ బిల్లునైనా సాధారణ బిల్లు అంటారు. ఆ బిల్లును ప్రభుత్వపక్షాన శాసనసభలో ప్రవేశపెడితే అది ప్రభుత్వ బిల్లు అవుతుంది. ప్రభుత్వపక్షాన కాకుండా శాసన సభ్యులు ఇతరు పార్టీకి చెందినవారైనప్పటికి రాష్ట్రప్రయోజనం దృష్ట్యా 'చట్టం' చెయ్యాలనే సంకల్పంతో ఉభయ సభల్లో దేనిలోనైన ప్రవేశపెడితే ఆ బిల్లు ప్రయివేట్ బిల్లు లేదా ప్రభుత్వేతర బిల్లు (అనధికారబిల్లు) అవుతుంది. 196, 197 రాజ్యాంగ నిబంధనలు సాధారణ బిల్లును చట్టం చేసే ప్రక్రియను వివరిస్తున్నాయి. సాధారణ బిల్లును ఉభయసభల్లో ఏదేని ఒక సభలో ప్రవేశపెట్టవచ్చు. రాష్ట్రంలో ఒకే ఒక్క సభ ఉన్నట్లయితే ఆ సభలోనే ప్రవేశపెట్టవచ్చు. ఒక సభ బిల్లును క్షుణ్ణంగా పరిశీలించి ఆమోదించిన తరువాత రెండవ సభకు పంపాలి. రెండవ సభ 3 నెలల వ్యవధిలోపల సవివరంగా పరిశీలించి ఆమోదించినట్టయితే దాన్ని గవర్నరు ఆమోదముద్ర కోసం పంపడం జరుగుతుంది. బిల్లుకు గవర్నరు ఆమోదముద్ర పడటంతో అది చట్టం అవుతుంది.

### 6.4.2. ఆర్థిక బిల్లు :

పార్లమెంటరీ సాంప్రదాయాన్ని అనుసరించి రాజ్యాంగ నిబంధన 198 ప్రకారం ఆర్థిక బిల్లులను రాష్ట్ర విధానసభలోనే ముందుగా ప్రవేశపెట్టవలసి ఉంటుంది. రాజ్యాంగ నిబంధన 199 ప్రకారం ఈ క్రింది పెర్కొన్న విషయాలతో సంబంధమున్న బిల్లులను మాత్రమే ఆర్థిక బిల్లులుగా గుర్తించడం జరుగుతుంది. అవి :

1. క్రొత్తగా పన్ను విధించడం, రద్దు చేయడం, తగ్గించడం లేదా క్రమబద్ధం చేయడం.
2. రాష్ట్ర సంఘటిత నిధి లేదా రాష్ట్ర ఆగంతక నిధికి సంబంధించిన జమా ఖర్చుల బిల్లులు
3. సంఘటిత నిధి నుంచి ఇవ్వబడే ద్రవ్య కేటాయింపులు
4. సంఘటిత నిధికి సంబంధించిన ఖర్చులను ప్రకటించడం లేదా ఖర్చును పెంచడానికి ఉద్దేశించిన బిల్లులు
5. సంఘటిత నిధికి చేరే ఆదాయం లేదా ప్రజాధనానికి సంబంధించిన లెక్కలు కలిగిన బిల్లులు
6. ఋణాల క్రమబద్ధీకరణ మరియు ప్రభుత్వం చేపట్టదలచిన ఆర్థిక బాధ్యతలకు సంబంధించిన బిల్లులు వగైరాలు.

ఒక బిల్లు ఆర్థిక బిల్లు లేదా సాధారణ బిల్లు అనే అంశం విధానసభ స్పీకర్ నిర్ణయించి ధృవీకరణ పత్రాన్ని జత పర్చాలి. ఆర్థిక బిల్లును విధానసభలోనే ముందుగా ప్రవేశపెట్టాలి. దానికి గవర్నర్ సిఫార్సు తప్పనిసరి. ఆర్థిక బిల్లును విధానసభ ఆమోదించిన

తర్వాత రాష్ట్ర విధాన పరిషత్ (లేక) విధాన మండలికి పంపించాలి. విధాన మండలి 14 రోజుల లోపల ఆర్థిక బిల్లును ఆమోదించిగాని, సవరణలతో గాని, తిరస్కరించి గాని తిరిగి విధానసభకు పంపించాలి. అయితే విధానసభ, విధానమండలి ప్రతిపాదించిన సవరణలను ఆమోదించవచ్చు లేదా తిరస్కరించవచ్చు. 14 రోజులలోగా విధాన మండలి ఆర్థిక బిల్లును పైన చెప్పిన విధంగా తిరిగి రాష్ట్ర విధానసభకు పంపించాలి. పంపనిచో ఆ బిల్లును విధానమండలి ఆమోదించినట్లుగా భావించి గవర్నర్ ఆమోదం కోసం పంపించడం జరుగుతుంది. గవర్నర్ ఆర్థిక బిల్లును ఆలస్యం చేయకుండా వెంటనే ఆమోద ముద్ర వేసి పంపించాల్సి ఉంటుంది. ఈ విధంగా ఆర్థిక బిల్లు విషయంలో శాసనసభ అధికారాలు తిరుగులేనివి.

## 6.5. శాసన నిర్మాణంలో దశలు

శాసన నిర్మాణంలో సాధారణంగా బిల్లు చట్టం కావడానికి 7 లేక 8 దశలు ఉంటాయి. కొన్ని బిల్లుల విషయంలో 7 దశలు, మరికొన్ని బిల్లుల విషయంలో 8 దశలు ఉంటాయి. అవి:

### 6.5.1 బిల్లు ప్రవేశపెట్టడం :

ఒక మంత్రిత్వ శాఖ తన అధికార పరిధిలో ఏదైనా చట్టం చేయదలిస్తే మొదట న్యాయమంత్రిత్వ శాఖను సంప్రదించి బిల్లులోని ప్రతిపాదనలను మంత్రి మండలికి నివేదించి ఆమోదం పొందాలి. ఆ తర్వాత న్యాయమంత్రిత్వ శాఖ ముసాయిదా బిల్లును తయారు చేసి, బిల్లు లక్ష్యాలు, దాన్ని ప్రవేశపెట్టడానికి గల కారణాలను వివరించే ఒక ప్రకటనను జత చెయ్యాలి. బిల్లును ఏ సభలో ప్రవేశపెట్టదలిస్తే ఆ సభ యొక్క అధ్యక్షుడికి (స్పీకర్ లేదా ఛైర్మన్) ఒక నెల రోజుల ముందు నోటీసు ఇవ్వాలి. సభాధ్యక్షుడు నిర్ణయించిన తేదీన సంబంధిత మంత్రి సభలో బిల్లు లక్ష్యాలను, దాన్ని ప్రవేశపెట్టడానికి గల కారణాలను వివరించి, ఆ బిల్లును ఆమోదించాల్సిందని విజ్ఞప్తి చేస్తాడు. ఆ తర్వాత సభలో ఓటింగు ద్వారా సభ్యుల ఆమోదం తీసుకొని బిల్లును ఆమోదిస్తారు.

### 6.5.2 ప్రథమ పఠనం :

బిల్లును సభలో ప్రవేశ పెట్టడానికి అనుమతి లభించిన తర్వాత సంబంధిత మంత్రి బిల్లును చదివి బిల్లు చట్టం కావడానికి గల కారణాలను, అవసరాన్ని మరియు దాని ప్రాముఖ్యతను సభకు వివరిస్తాడు. అలాగే బిల్లులోని ముఖ్యాంశాలను కూడా వివరిస్తాడు. స్పీకర్ లేదా ఛైర్మన్ అనుమతితో రాష్ట్ర గెజిట్‌లో ప్రచురిస్తారు.

### 6.5.3 ద్వితీయ పఠనం :

ప్రథమ పఠనం తర్వాత ముద్రించబడిన బిల్లు ప్రతులను శాసనసభ్యులకు పంచుతారు. ఆ తర్వాత సంబంధిత మంత్రి స్పీకర్ అనుమతితో రెండవ పఠనంకు ఉపక్రమిస్తాడు. ఆ దశలో బిల్లులోని అంశాలను వెంటనే పరిశీలించాలని, అందుకోసం ఒక తేదీని నిర్ణయించవచ్చు లేదా బిల్లును నిర్ణాయక కమిటీకి పంపమని కోరవచ్చు లేదా సంయుక్త నిర్ణాయక కమిటీకి నివేదించాలని కోరవచ్చు లేదా బిల్లు గురించి ప్రజాభిప్రాయం తెలుసుకోవాలని ప్రచార సాధనాల ద్వారా ప్రజలకు తెలిసే విధంగా చేయవచ్చు. సాధారణంగా ఈ పద్ధతులలో నిర్ణాయక కమిటీకి బిల్లును పంపే పద్ధతి ఎక్కువగా ఆచరణలో ఉంది. నిర్ణయించిన తేదీన బిల్లుపై సాధారణ చర్చ జరుగుతుంది. సభ్యుల ప్రశ్నలకు, అనుమానాలకు సమాధానం చెప్పడంతో మంత్రి బిల్లుకు సంబంధించి అవసరమైన వివరణలు ఇస్తాడు. అయితే, బిల్లుపై సమగ్రమైన చర్చ జరగడానికి ఈ దశలో వీలుండదు. పైన ఇవ్వబడిన పద్ధతులలో దేన్ని అనుసరించాలో తీర్మానించడం, దానిపై సవరణలు ప్రతిపాదించడం జరుగుతుంది. ఓటింగ్ ద్వారా అత్యధిక సంఖ్యాక సభ్యుల అభిప్రాయాన్ని గౌరవిస్తారు.

### 6.5.4. కమిటీ దశ :

బిల్లులోని అంశాలు న్యాయసంబంధమైన లేదా రాజ్యాంగపరమైన అంశాల విషయంలోగానీ వివాదాస్పదం అయితే బిల్లును నిర్ణాయక కమిటీకి పంపడం తప్పనిసరి అవుతుంది. అలాంటి నిర్ణాయక కమిటీని స్పీకర్ ఏర్పాటు చేస్తాడు. నిర్ణాయక కమిటీ బిల్లును విపులంగా పరిశీలించడం కోసం ఉపసంఘాన్ని కూడా నియమించవచ్చు. ఈ దశలో బిల్లులోని అంశాలను ప్రతివాక్యం, పదాలను కూలంకషంగా పరిశీలన చేయటం జరుగుతుంది. అవసరమైతే నిపుణులను కూడా సంప్రదిస్తారు. అధికార పత్రాలను కూడా పరిశీలించి, కొన్ని సవరణలను ప్రతిపాదిస్తూ నివేదిక రూపంలో సిద్ధం చేసి, నిర్ణయించిన గడువు లోపల స్పీకర్‌కు కమిటీ తన నివేదికను సమర్పిస్తుంది.

### 6.5.5. నివేదిక దశ :

నిర్ణాయక కమిటీ తన నివేదికను స్పీకర్‌కు సమర్పించిన తరువాత మంత్రి విజ్ఞప్తితో స్పీకర్ బిల్లుపై చర్చకు తేదీని నిర్ణయిస్తాడు. మంత్రిబిల్లులోని అంశాలపై చర్చను ప్రారంభిస్తూ సభ్యులను చర్చలోనికి ఆహ్వానిస్తాడు. బిల్లులోని ప్రతి అంశంపై సవివరమైన చర్చ జరుగుతుంది. సభ్యులు సవరణలు ప్రతిపాదించుకోవచ్చు. ప్రతి సవరణపై ఓటింగు జరుగుతుంది. సభ్యులు ఆమోదిస్తే ఆ సవరణలు బిల్లులో అంతర్భాగాలౌతాయి. దీనితో నివేదిక దశ పూర్తయ్యి బిల్లు తృతీయ పఠన దశకు చేరుకుంటుంది.

### 6.5.6. తృతీయ పఠన దశ :

ఈ దశలో మంత్రి బిల్లుకు ఆమోదాన్ని తెలియజేయాలని సభను కోరతాడు. అప్పుడు బిల్లును ఆమోదించాలా వద్దా? అనే విషయంపై వాగ్వివాదం జరుగవచ్చు. తరువాత స్పీకర్ ఆదేశంపై బిల్లుకు ఓటింగ్ జరుపుతారు. మెజారిటీ ఓటును బట్టి బిల్లును ఆమోదించినట్లు ప్రకటించడం జరుగుతుంది.

ఈ దశ తర్వాత శాసనసభ ఆమోదించిన బిల్లును ఆ రాష్ట్రంలో రెండవ సభ ఉంటే విధాన మండలి ఆమోదం కొరకు పంపిస్తారు. ఈ సభలో కూడా బిల్లుపై చర్చ మొదటి సభలో లాగానే జరుగుతుంది. పరిశీలన పూర్తయిన తర్వాత బిల్లును ఆమోదించి గాని, సవరణలతో గాని శాసనసభకు తిరిగి పంపించడం జరుగుతుంది.

### 6.5.7. గవర్నర్ ఆమోదం :

రెండు సభల ఆమోదం పొందిన బిల్లును గవర్నర్ ఆమోదం కొరకు పంపడం జరుగుతుంది. బిల్లుపై గవర్నర్ ఆమోదముద్ర పడటంతో బిల్లు 'చట్టం' అవుతుంది.

### 6.5.8 రాష్ట్రపతి ఆమోదం :

రాజ్యాంగ నిబంధన 200 ప్రకారం గవర్నర్ అభిప్రాయంలో ఆ బిల్లు చట్టమైనట్లయితే అది రాజ్యాంగరీత్యా రాష్ట్ర హైకోర్టు విధులకు అంతరాయం కలిగిస్తుందని భావించినట్లయితే గవర్నర్ రాష్ట్రపతి సమ్మతి కోరవచ్చు. రాజ్యాంగ నిబంధన 201 ప్రకారం ఆర్థికేతరమైన సాధారణ బిల్లును ఆమోదించవచ్చు లేదా తిరస్కరించవచ్చు. లేదా రాష్ట్రపతి అవసరమని భావిస్తే తన సందేశాన్ని జతచేసి రాష్ట్ర శాసనసభ పున: పరిశీలన కోసం పంపాల్సిందని గవర్నర్‌ను కోరవచ్చు. పున: పరిశీలన కోసం వచ్చిన బిల్లును శాసనసభ సవరణలతో గానీ, యధాతథంగా గాని ఆమోదించి గవర్నర్‌కు పంపగా, గవర్నర్ దానిని రాష్ట్రపతికి పంపిస్తాడు. ఈ విధంగా రెండోసారి వచ్చిన బిల్లును రాష్ట్రపతి ఆమోదించాలా? వద్దా? అనేది రాజ్యాంగం స్పష్టం చెయ్యలేదు.

కాని పార్లమెంటరీ సాంప్రదాయం ప్రకారం రెండవ దఫా వచ్చిన బిల్లును రాష్ట్రపతి తప్పక ఆమోదిస్తాడని భావించవచ్చు. రాష్ట్రపతి ఆమోదంతో బిల్లు చట్టంగా మారుతుంది.

## 6.6. స్పీకర్ మరియు డిప్యూటీ స్పీకర్ :

లోక్‌సభలో స్పీకర్, డిప్యూటీ స్పీకర్ పదవులు ఉన్నట్లే రాష్ట్ర స్థాయిలో విధానసభ స్పీకర్, డిప్యూటీ స్పీకర్ పదవులు చాలా ఉన్నతమయినవి మరియు గౌరవప్రదమైనవి. ఈ పదవులు రాజకీయాలకు అతీతమైనవిగా ఉంటాయి. విధానసభ సభ్యులు వారిలో ఒకరిని స్పీకర్‌గాను, మరొకరిని డిప్యూటీ స్పీకర్‌గాను ఎన్నుకుంటారు. ఈ ప్రక్రియ రాజ్యాంగ నిబంధన 178 ప్రకారం విధానసభ కార్యకలాపాల నిర్వహణకు ఉపకరిస్తుంది. ఈ రెండు పదవులకు ఎన్నిక కావడానికి విధాన సభ సభ్యత్వం తప్పనిసరి అవుతుంది. రాజ్యాంగ ప్రకరణం 179 ప్రకారం కొత్త విధానసభ మొదటి సమావేశానికి ముందు మాత్రమే స్పీకర్ పదవి రద్దవుతుంది. ఆయన విధానసభ సాధారణ ఎన్నికల ద్వారా తిరిగి ఎన్నికైతే మరొకసారి స్పీకర్‌గా లేదా డిప్యూటీ స్పీకర్‌గా ఎన్నికకావచ్చు. స్పీకర్‌గా ఎన్నికైన వ్యక్తి శాసనసభ విశ్వాసమున్నంతవరకూ పదవిలో కొనసాగుతాడు. లేదా తన ఇష్టపూర్వకంగా పదవికి రాజీనామా చేయవచ్చు. శాసనసభ సమావేశాల సమయంలో ఏ కారణం చేతనైనా స్పీకర్ సమావేశానికి హాజరు కాలేకపోయినట్లయితే డిప్యూటీ స్పీకర్ సభా కార్యకలాపాలను నిర్వహిస్తారు. ఈ ఇద్దరూ సభకు హాజరు కానట్లయితే స్పీకర్ నిర్ణయించిన పేనల్ జాబితాలో ఏ ఒక్కరయినా సభా కార్యకలాపాలను నిర్వహించవచ్చును.

## 6.7 స్పీకర్ అధికారాలు :

స్పీకర్ పదవి అత్యంత గౌరవప్రదమైనది మరియు చాలా ఉన్నతమైనది. ఈ పదవికి అధికారాల కంటే బాధ్యతలే ఎక్కువ. రాజకీయాలకు అతీతంగా సభా కార్యక్రమాలను నిర్వహిస్తూ నిష్పక్షపాతంగా నడచుకోవాలి. అధికార ప్రతిపక్షాల సభ్యులను సమయోచితంగా ఆకట్టుకుంటూ వారి మన్ననలను పొందే విధంగా నిష్పక్షపాతంగా నిర్ణయాలు తీసుకుంటూ స్థితప్రజ్ఞుడుగా వ్యవహరించాలి. స్పీకర్, గవర్నర్ ప్రకటన ప్రకారం శాసనసభ సమావేశాలకు అధ్యక్షత వహించి సభా కార్యక్రమాలను హుందాగా నిర్వహిస్తాడు. కీలకమైన బడ్జెట్ సమావేశాలను గవర్నర్ ప్రారంభించగా, గవర్నర్ ప్రసంగానికి ధన్యవాద తీర్మానాన్ని ఖరారు చేయడం మొదలుకొని వివిధ తీర్మానాలపై చర్చకు, వివిధ బిల్లులపై పరిశీలనకు కార్యక్రమాన్ని ముందుగానే నిర్ణయించి, ప్రశ్నోత్తరాల సమయాన్ని కేటాయించి సంబంధిత మంత్రులతో సమాధానాలు రాబడతాడు. ప్రజా సమస్యలపై చర్చను అనుమతిస్తాడు. సభా నియమ నిబంధనల ప్రకారం కార్యక్రమాన్ని నిర్వహిస్తూ సభను సజావుగా నడిచేటట్లు చూస్తాడు. సభా కార్యక్రమాల నిర్వహణలో ఏ కారణం వల్లనైనా క్రమశిక్షణ లోపిస్తే స్పీకర్ సభ్యులను క్రమశిక్షణ పాటించే విధంగా చూస్తాడు. సభలో గందరగోళం, కోలాహలం పెరిగి సభా కార్యక్రమాలకు భగ్నం కలిగితే సభను వాయిదా వేస్తాడు. అవసరమనిపిస్తే సభను నిరవధికంగా వాయిదా వేయవచ్చు.

విధానసభ విధుల నిర్వహణకు గాను సభాకమిటీలను ఏర్పాటు చేసి, వాటి పరిధిని, పనితీరును పర్యవేక్షిస్తాడు. ఆ కమిటీలు సకాలంలో తమకు అప్పగించిన బాధ్యతలను పూర్తి చేసి, సభకు నివేదికలను సమర్పించేటట్లు చూస్తాడు. విధానసభ సభ్యులను స్పీకర్ అనుమతి లేనిదే అరెస్టు చేయరాదు. తప్పనిసరి అయితే సంబంధిత అధికారులు సభ్యుని అరెస్టు విషయాన్ని అలాగే విడుదల విషయాన్ని కూడా స్పీకర్‌కు తెలియజేయాలి. సభ్యులు సభలో ఉపయోగించే పదజాలం అభ్యంతరకరంగా ఉంటే వాటిని సభా రికార్డుల కెక్కకుండా తొలగిస్తాడు. ఈ విషయంలో స్పీకర్ అధికారానికి తిరుగులేదు. స్పీకర్ తన అధీనంలో ఉన్న ప్రత్యేక సచివాలయం ద్వారా ప్రభుత్వానికీ, శాసనసభకు మధ్య సయోధ్య ఏర్పాటు చేయగల్గుతాడు. వివిధ మంత్రిత్వ శాఖలకు, కమిటీలకు కావల్సిన సమాచారాన్ని అందజేస్తాడు. ఈ విధంగా స్పీకర్, ప్రభుత్వాన్ని శాసనసభకు బాధ్యత వహించే విధంగా చూస్తాడు.

## 6.8 ఉభయ సభల సంబంధాలు :

ఒక రాష్ట్రంలో విధానసభ మరియు విధాన మండలి రెండింటినీ ఏర్పాటు చేసుకోవచ్చు. కాని అత్యధిక రాష్ట్రాలలో ఏక సభావిధానమే కొనసాగుతోంది. అతి కొద్ది రాష్ట్రాలలో మాత్రమే రెండు సభలు ఉన్నాయి. రాష్ట్ర శాసనసభలో విధానసభ ఒక్కటే ఉన్నంతకాలం అది నిరాటంకంగా తన కార్యకలాపాలను, విధులను నిర్వహించగల్గుతుంది. రెండో సభ ఉన్నట్లయితే శాసన కార్యకలాపాల ప్రక్రియలో కొంత మార్పు చోటు చేసుకుంటుంది. ఎందుచేతనంటే దిగువ సభగా చెప్పబడే విధానసభ అధికారాల విషయంలో విధాన మండలి కంటే శక్తివంతమైనది. ఎగువ సభగా చెప్పబడే విధానమండలి ముఖ్యమైన సభ కాని అధికారాల విషయంలో అంత శక్తివంతమైనది కాదు. ముఖ్యంగా ఆర్థిక విషయాలలో విధానసభకు తిరుగులేదు. ఆర్థిక బిల్లులను ముందుగా విధాన సభలోనే ప్రవేశపెట్టాలి. అది ఆమోదించిన తరువాతే విధానమండలికి పంపాలి. విధానమండలి ఆర్థిక బిల్లు 14 రోజుల గడువు లోపల ఆమోదించినా, ఆమోదించకపోయినా గవర్నర్ ఆమోదం కోసం పంపిస్తారు. గవర్నర్ ఆమోదంతో అది చట్టంగా మారుతుంది. అంతేగాక డిమాండ్ ఫర్ గ్రాంట్స్ బిల్లులపై విధానసభ మాత్రమే ఓటింగ్‌తో అనుమతిస్తుంది. ఆర్థికేతర బిల్లులు అంటే సాధారణ బిల్లుల విషయంలో కూడా విధనసభదే పైచేయిగా ఉంటుంది. బిల్లుల ఆమోదం విషయంలోనే గాక, మంత్రిమండలిపై నియంత్రణ విషయంలో కూడా విధానసభదే పైచేయి. రాజ్యాంగ అధికరణం 164(2) ను అనుసరించి మంత్రి మండలి సమిష్టిగా విధానసభకు బాధ్యత వహిస్తుంది. విధానసభ విశ్వాసం పొందినంత కాలం మాత్రమే మంత్రిమండలి అధికారంలో కొనసాగుతుంది. ఈ అధికారం విధానమండలికి లేదు. ఏ బిల్లు విషయంలోనైనా ఉభయసభల మధ్య వివాదం ఏర్పడితే ఉభయ సభల సంయుక్త సమావేశం మాత్రం ఏర్పాటు చేయడం జరగదు. రాజ్యాంగంలో ఎక్కడా అటువంటి వెసులుబాటు కల్పించబడలేదు. దీనిని బట్టి చూస్తే విధానసభ విధాన మండలి కంటే సభ్యుల సంఖ్య విషయంలోను, ప్రాధాన్యత విషయంలోను పై చేయిగా ఉంటుంది. విధానసభ సభ్యులు ప్రజలచే ప్రత్యక్షంగా ఎన్నుకోబడటం చేత విధానసభ ప్రజలకు ప్రాతినిధ్యం వహించే సంస్థగా ప్రజా సంకల్పాన్ని ప్రతిబింబించే ప్రజాసభగా ఉంటుంది. విధానమండలి సభ్యుల కంటే విధానసభ సభ్యుల సంఖ్య మూడు రెట్లు ఎక్కువగా ఉంటుంది.

## 6.9 మారుతున్న శాసనసభ పాత్ర :

1950లో రాజ్యాంగం అమలుకు వచ్చింది మొదలుకొని నేటి వరకు మన దేశంలో పార్లమెంటరీ ప్రజాస్వామ్య విధానం అనేక ఒడిదుడుకులకు లోనై తనదైన శైలిలో కొనసాగుతూ వస్తున్నది. ఆంధ్రప్రదేశ్‌లో రాష్ట్ర శాసనసభ 1956లో ఏర్పాటై నేటి వరకూ అంటే 49 సం॥ల చరిత్రలో 32 సం॥లు కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉన్నది. మిగిలిన 15 సం॥ల కాలం తెలుగుదేశం పార్టీ అధికారంలో ఉన్నది. 2004 సాధారణ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ విజయం సాధించి అధికారంలో కొనసాగుతున్నది. ఈ మొత్తం కాలంలో శాసనసభ పనితీరును సింహావలోకం చేసుకొన్నట్లయితే శాసనసభ పనితీరు, అది నిర్వహించాల్సిన పాత్ర ఏవిధంగా మారుతున్నదనేది అవగతమౌతుంది. గడచిన 49 సం॥ల కాలంలో అధికార పార్టీ బలంతో పోలిస్తే ప్రతిపక్షం ఎప్పుడూ బలహీనంగా ఉంటూ వచ్చింది. అంతేగాక సంఖ్యాపరంగా బలహీనంగా ఉన్నప్పటికీ ప్రతిపక్షాలలో సభలో ఐక్యత లోపించింది. దానిమూలంగా ప్రతిపక్షాలు వాయిదా తీర్మానాలు, సభాహక్కుల తీర్మానం, అవిశ్వాస తీర్మానం లాంటి తీర్మానాలు ప్రవేశపెట్టినా ఎలాంటి ప్రయోజనం లేదు. దీనితో ప్రతిపక్షాలు శాసనసభలో ఆశించిన విధంగా ప్రజాసమస్యల పరిష్కార విషయంలోగాని, విధానాల రూపకల్పనలోగాని కీలకపాత్ర నిర్వహించలేకపోతున్నాయి. అలాగని ప్రతిపక్షాలు పూర్తిగా ఏ ప్రయోజనం సాధించలేని పక్షాలుగా పరిగణించలేము. తమకు లభించిన ప్రతి అవకాశాన్ని సద్వినియోగ పర్చుకొని ప్రజా సమస్యలను చర్చకు తెస్తున్నాయి. తద్వారా ప్రజల దృష్టికి తీసికొని వస్తున్నాయి.

శాసనసభలో అధికార ప్రతిపక్ష సభ్యులు నిబంధనలు చిత్తశుద్ధితో అనుసరించి, సభా కార్యక్రమాలు సక్రమంగా జరగడానికి దోహదపడాలి. కాని ఉభయ పక్షాలు శాసనసభలో ఘర్షణ ధోరణితో ప్రతి చిన్న విషయంలో నిరసన తెలుపుతూ సభను బహిష్కరించడం లేదా సభలో ధర్నా కార్యక్రమాలకు ఉపక్రమించడం లేదా స్పీకర్ పోడియం వద్ద బైఠాయించడం వంటి పద్ధతులతో సభా కార్యక్రమాలకు అంతరాయం కలిగిస్తున్నారు. అంతేగాక అమూల్యమైన సభా సమయాన్ని ఇలాంటి కార్యక్రమాలతో వృధా చేస్తూ ప్రజా సమస్యలను విస్మరించి పార్టీల ప్రాతిపదికపై సభ్యులు శాసనసభలో వ్యవహరిస్తున్నారు.

శాసనసభా సమావేశాల్లో పరిపాటిగా చర్చించే అంశాలుగా శాంతిభద్రతలు, ధరల పెరుగుదల, నక్సలైట్స్ సమస్య, రైతు సమస్యలు, భూసంస్కరణలు, అవినీతి, ఆశ్రిత పక్షపాతం మొదలైనవి ప్రముఖంగా చెప్పవచ్చును. కాని ఇటీవలి కాలంలో ప్రతిపక్ష పార్టీలు ప్రజా సంక్షేమ సమస్యలపై గాక ప్రతీ అంశాన్నీ పార్టీల ప్రతిష్ట ప్రాతిపదికపై చర్చిస్తూ, ప్రతిపక్ష పార్టీలు అధికార పార్టీని నిందించడానికి, నిందారోపణలు చేయడానికి, అప్రతిష్ట పాలు చేయడానికి మాత్రమే ప్రయత్నిస్తున్నాయి. కొన్ని సందర్భాల్లో సభ్యులు సంయమనాన్ని కోల్పోయి ఉపయోగించకూడని భాష, పద్ధతులను అవలంభిస్తూ సభా నిబంధనలను పాటించుట లేదు.

శాసనసభా సమావేశాలు జరుగుతున్న కాలంలో ప్రతిపక్ష సభ్యులు ముఖ్యమంత్రి లేదా సంబంధిత మంత్రి నుంచి ఒక ప్రత్యేక విషయం గురించి సమాచారాన్ని రాబట్టే ప్రయత్నం చేస్తారు. కాని మంత్రులు సూటిగా సమాచారాన్ని ఇవ్వకుండా సమస్యను ప్రక్కదోవ పట్టించడానికి ప్రయత్నం చేస్తారు. దానితో ప్రతిపక్ష సభ్యులు సంతృప్తి చెందక సభా కార్యక్రమాలకు అంతరాయం కలిగిస్తారు. గత కొద్ది కాలంగా శాసనసభ వ్యవహారాలను పరిశీలించినట్లయితే అధికార పక్షం ప్రతి పక్షాన్ని చిన్నచూ చూస్తూ సరియైన సమాచారాన్ని ఇవ్వకుండా తమ ఆధిపత్యాన్ని ప్రదర్శించుకొంటూ సంఖ్యా బలంతో బిల్లులను ఆమోదిస్తున్నాయి. అంతేగాక సమావేశ కాలంలో ముఖ్యమంత్రితో సహా మంత్రులు సభకు హాజరయ్యి సభాకార్యక్రమాలలో పాల్గొనే విషయంలో శ్రద్ధచూపించటం లేదు. తమశాఖకు సంబంధించిన శాఖలను గురించి వచ్చిన ప్రశ్నలకు సమాధానాలు చెప్పవలసి ఉందనే వాస్తవాన్ని కూడా విస్మరించి వారు పార్టీ కార్యకలాపాలు, ప్రారంభోత్సవాలు, పర్యటనలతో బిజీగా ఉంటూ సభకు హాజరు కావటం లేదు. అలాంటి సందర్భాలల్లో ప్రతి పక్షాలు ముఖ్యమంత్రే సమాధానం చెప్పాలని పట్టుపడుతూ గందరగోళం సృష్టించడం, తద్వారా సభాకాలం వృధా అవటం పరిపాటైంది.

మనరాష్ట్ర శాసనసభ చరిత్రలో సభ్యులు క్రమశిక్షణ నియమాలు ఉల్లంఘించిన సందర్భాలు అనేకం ఉన్నాయి. అనివార్య పరిస్థితుల్లో స్పీకర్ తన అధికారాన్ని ఉపయోగించిన సందర్భాలూ ఉన్నాయి. కారణం ప్రతిపక్ష సభ్యులు రోజువారీ కార్యకలాపాలకు అడుగడుగునా అడ్డుతగలడమే కాకుండా స్పీకర్ హెచ్చరికలను ఖాతరు చేయడం లేదన్నది సభాకార్యక్రమాలు టెలివిజన్ ప్రత్యక్ష ప్రసారాలద్వారా విశదమౌతున్నది. గత రెండు దశాబ్దాలుగా జరిగిన సాధారణ ఎన్నికల్లో రాజకీయపార్టీలు 2/3 వ వంతు మెజారిటీ సాధించి, అధికారాన్ని చేపట్టడం గమనార్హం. దీనితో శాసనసభలో ప్రతిపక్షపార్టీల ప్రమేయం లేకుండానే వారికున్న సంఖ్యాబలంతో బిల్లులను అధికార పార్టీ చట్టాలుగా మారుస్తున్నాయి. దీనితో ప్రతిపక్ష పార్టీల పాత్ర ప్రేక్షక పాత్రగా మారుతున్నది.

రాజకీయ పార్టీలు శాసనసభను పార్టీ ప్రతిష్టకు వేదికగా మార్చుకొని అధికార ప్రతిపక్ష పార్టీలు రెండూ వాగ్యుద్ధంతో సభాకార్యక్రమాలకు అంతరాయం కల్పించడమే కాక అమూల్యమైన సభాసమయాన్ని వృధాచేస్తూ, జనాకర్షక విధానాలు, సమస్యలపైగాని, కీలక అంశాలపైగాని దృష్టిపెట్టటం లేదు. తద్వారా రాష్ట్రప్రధాన అంశాలు, సమస్యలను ప్రక్కన పెట్టి పార్టీప్రతిష్టను పెంచుకోవడానికి అధికార, ప్రతిపక్షపార్టీలు శాసనసభను వేదికగా చేసుకుంటున్నాయి.

కాబట్టి ఎన్నికల అనంతరం రాజకీయ పార్టీలు తమపార్టీ శాసనసభ్యులకు ప్రజాస్వామ్య విలువలపట్ల అవగాహన కల్పించటంతో పాటు ప్రజాసమస్యలను ఏ విధంగా ప్రతిబింబించాలి, శసనసభలో ఏవిధంగా క్రమశిక్షణతో నిబంధనలకు

అనుగుణంగా వ్యవహరించాలి అనే విషయాలలో శిక్షణ ఇవ్వాలి. అంతేగాక తమ పార్టీ కార్యకలాపాలు, సిద్ధాంతాల విషయంలో లక్ష్యశుద్ధి పాటించాలి. తద్వారా శాసనసభ ప్రతిష్టను, ఔన్నత్యాన్ని ఇనుమడింప చెయ్యాలి. కాని శాసనసభలో అల్లరి, గందరగోళం ఆందోళనకర వాతావరణం సృష్టించే సంఘటనలు తరచుగా సంభవిస్తూ ఉండటం విచారకరం. దీనినిబట్టి చూసినట్లయితే శాసనసభ విలువలు, స్థాయి క్రమంగా తగ్గుముఖం పట్టాయని చెప్పడం అతిశయోక్తి కాదు.

## 6.10. సారాంశము :

పార్లమెంటరీ ప్రజాస్వామ్య దేశంలో శాసనసభకు అత్యున్నత స్థానం ఉన్నది. శాసనసభ ప్రజల కోర్కెలను ప్రతిబింబిస్తూ ప్రజలసభగా పరిగణించబడింది. ప్రజాసంక్షేమం మరియు రాష్ట్రాభివృద్ధి దృష్ట్యా చైతన్యవంతమైన నాయకత్వాన్ని అందివ్వటం, మరియు శాసనాలను నిర్మించటం దీని ప్రధాన వృత్తి మరియు ప్రవృత్తి. కార్యక్రమాల నిర్వహణలో, ఆర్థిక వ్యవహారాల్లో శాసన నిర్మాణంలో రాష్ట్రవిధాన సభవిధానమండలి కంటే పైచేయిగా ఉంటూ ఎక్కువ అధికారాలు కల్గిఉంది. అంతేగాక రాష్ట్రవిధాన సభ మంత్రిమండలిపై కూడా నియంత్రణాధికారం కలిగి ఉంది. విధానసభ విశ్వాసంపైనే ముఖ్యమంత్రి, మంత్రిమండలి తమ పదవుల్లో కొనసాగుతారు. విధానసభ రాష్ట్ర శాసన నిర్మాణంలో కీలక పాత్ర నిర్వహిస్తుంది. విధానమండలి కంటే విధానసభ శాసన నిర్మాణంలో అత్యున్నత అధికారాలు కలిగి ఉంటుందనేది జగమెరిగిన సత్యం. విధానసభ కార్యకలాపాలు సక్రమంగా నిర్వహించే బాధ్యత స్పీకర్‌ది. స్పీకర్ పదవి ఉన్నతమైనది మరియు గౌరవ ప్రదమైనది. రాష్ట్రశాసనసభ ప్రతిష్ట, ప్రాభవం స్పీకర్ పై ఆధారపడి ఉంటుంది. ఈయన సభలో స్థితప్రజ్ఞుడుగా, నిష్పక్షపాతిగా, హుందాగా వ్యవహరించాలి. కాని ఇటీవలి కాలంలో మారుతున్న రాజకీయ పరిస్థితుల మూలంగా స్పీకర్ పదవి కొన్ని సందర్భాల్లో విమర్శలకు లోనౌతున్నది. అంతేగాక శాసనసభ్యులు ప్రజాప్రతినిధులుగా కాక పార్టీ ప్రతినిధులుగా సభలో వ్యవహరిస్తూ సభానిబంధనలకు, విలువలకు తిలోదకాలిస్తున్నారు. అంతేకాక శాసనసభ పార్టీప్రతిష్టను పెంచుకొనే ఒక వేదికగా ఉభయ పక్షాలూ ఉపయోగించుకుంటున్నాయి. ప్రజాసంక్షేమాన్ని విస్మరించి శాసన సభ్యులు తమదైన శైలిలో వ్యవహరిస్తూ ప్రజాసమస్యల్ని ప్రతిబింబించడానికి బదులు పార్టీ సిద్ధాంతాల్ని ప్రతిబింబింపచేస్తున్నారు. అమూల్యమైన, పరిమితమైన సభా సమయాన్ని అవసరమైన విషయాలకు, చర్చలకు, ధర్నాలకు వెచ్చిస్తూ సభాప్రతిష్టకు భంగం వాటిల్లే విధంగా సభ్యులు వ్యవహరిస్తున్నారు. మేధావులు, రాజకీయ విశ్లేషకులు శాసనసభస్థాయి దిగజారుతోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

## 6.11. నమూనా ప్రశ్నలు :

1. శాసనసభ నిర్మాణం, అధికారాలు తెలియజేయండి.
2. శాసనసభలో శాసన నిర్మాణ ప్రక్రియను వివరిస్తూ నిర్మాణంలో దశలను గూర్చి తెల్పండి.
3. శాసనసభ స్పీకర్ ఎన్నిక, అధికారాలు గూర్చి వ్రాయండి. (లేదా) శాసనసభలో స్పీకర్ పాత్రను అంచనా వేయండి.
4. ఇటీవలి కాలంలో మారుతున్న శాసన సభ పాత్రను విశ్లేషణాత్మకంగా వివరించండి.
5. ఉభయ సభల సంబంధాలను గూర్చి వ్రాయండి.
6. ఆర్థికబిల్లు, సాధారణబిల్లు అంటే ఏమిటో చెప్పి, ఆర్థిక బిల్లు ఆమోదానికి ప్రత్యేక శాసన ప్రక్రియను వివరించగడి.

## 6.12. చదువదగిన గ్రంథాలు :


1. Prof.K.R.ఆచార్య (Ed) : భారత ప్రభుత్వము -రాజకీయాలు.
2. Prof.K.R.ఆచార్య(Ed) : ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వము - రాజకీయాలు.
3. G.Ram Reddy and B.A.V. Sarma. (Ed): State Government and Politics -Andhra Pradesh.
4. Prof.A.Prasanna Kumar (Etal) : Andhra Pradesh Government and Politics.


డా॥ డి. వెంకటేశ్వరరావు

పాఠం - 7

# కమిటీ వ్యవస్థ

## 7.0 లక్ష్యం :

ఈ పాఠాన్ని చదివిన తరువాత మీరు

ఆంధ్రప్రదేశ్ శాసనసభలో కమిటీల పద్ధతి

* వివిధ రకాలైన కమిటీలు-వాటి నిర్మాణం, స్వభావము

* కమిటీల విధులు- వాటి పనితీరు

* కమిటీ పద్ధతి వల్ల కలిగే ప్రయోజనాలు మొదలైన విషయాలను గురించి సవివరంగా వివరించగలుగుతారు.

## విషయసూచిక


7.1 పరిచయం

7.2 కమిటీల వర్గీకరణ

7.2.1 సభ్యుల అవసరాలకు సంబంధించిన కమిటీలు

7.2.2 సభాకార్యక్రమాలకు సంబంధించిన కమిటీలు

7.2.3 విచారణ కమిటీలు

7.2.4 పరిశీలన కమిటీలు

7.2.5 ఆర్థిక కమిటీలు

7.3 శాసన సంస్థ - సంయుక్త కమిటీలు

7.3.1 విధాన సభ కమిటీలు

7.3.2 విధాన పరిషత్తు కమిటీలు

7.4 వివిధ కమిటీల నిర్మాణము - సభ్యుల ఎంపిక విధానము - పనితీరు

7.5 మన రాష్ట్ర శాసన సభలోని వివిధ ముఖ్యమైన కమిటీలు

7.5.1 నిబంధనల కమిటీ

7.5.2 సభా వ్యవహారాల సంప్రదింపుల కమిటీ

7.5.3 సాధారణ అవసరాలు / వ్యవహారాల కమిటీ

7.5.4 సభా హక్కుల కమిటీ

7.5.5 ప్రభుత్వం వాగ్దానాల కమిటీ

7.5.6 దత్తా శాసనాధికార కమిటీ

7.5.7 అంచనాల కమిటీ

7.5.8 ప్రభుత్వ ఖాతాల కమిటీ

7.5.9 ప్రభుత్వ ఉపక్రమాల కమిటీ

7.5.10 షెడ్యూల్డు కులాలు తెగలు వెనుకబడిన తరగతుల సంక్షేమ కమిటీ

7.5.11 పిటీషన్లు కమిటీ

7.5.12 సదుపాయాల కమిటీ

7.6 శాసన సభ కమిటీల వలన ప్రయోజనలు

7.7 సారాంశము

7.8 నమూనా ప్రశ్నలు

7.9 చదువదగిన గ్రంథాలు

## 7.1 పరిచయం :

పార్లమెంటరీ ప్రభుత్వంలో కార్యనిర్వాహక శాఖపై నియంత్రణ చేయుటకు శాసనసభకు చిన్న చిన్న వ్యవస్థలు ఉంటాయి. ఆ వ్యవస్థలనే కమిటీలని అంటారు. కమిటీల ద్వారా వివిధ నిర్ణయాలు తీసుకోవడం ద్వారా శాసనసభలో పని ఒత్తిడి తగ్గించమే వీటి ముఖ్యుద్దేశ్యం.

పార్లమెంటరీ ప్రభుత్వ విధానంలో కార్యనిర్వాహక శాఖ పార్లమెంటుకు బాధ్యత వహిస్తుంది. కార్యనిర్వాహ్క శాఖ చేసే విధులలో పార్లమెంట్ చేయడం నిర్ణయం జరుగుతుంది. అంగీకారం కూడా జరుగుతుంది. అమలు విధానంలో చూస్తే, పార్లమెంట్ కొనసాగే కాలంలో ఎక్కువగా ఒత్తిడి ఉండడం వలన సభా నిర్వహణ ఎక్కువగా నుండుట, పనితీరు మొదలగు విధానాల వలన కార్యక్రమాలను నిర్వహించుట కష్టతరమైనపని. అందుకే అవి మామలుగా చర్చలు జరుపుతూ ఉంటాయి. అందుకునే ప్రజా వాసన సంస్థలు కొన్ని గ్రూపులుగా విభజించి, కార్యక్రమాలను చేపట్టి విధి నిర్వహించవచ్చును. ఆ గ్రూపులే క్షుణ్ణంగా పరిశీలించి కార్యరూపాన్ని చేపడతారు. కమిటీలు భిన్నంగా ఉండుటవల్ల ప్రతి విషయాన్ని క్షుణ్ణంగా పరిశీలించి న్యాయాన్ని చేకూర్చుడానికి వీలుగా ఉండును. ఆ విధమైన పద్ధతి అవలంభించుటవలన సరైన నిర్ణయాలను తీసుకొనవచ్చును. శాసన సంస్థలు రూపొందించిన విధానాలను కార్య నిర్వాహక శాఖ సక్రమంగా అమలు జరిపేది. లేనిది శాసన సభల కమిటీలు ఉద్భవించినవి. ప్రజాస్వ్యా దేశాలలో పార్లమెంటరీ కమిటీలు ఉద్భవించినవి. ప్రజాస్వామ్యదేశాలలో పార్లమెంటరీ కమిటీలు రెండువిధాలు 1. బ్రిటిష్ పార్లమెంట్ పద్ధతి 2. అమెరికన్ కాంగ్రెస్ పద్ధతి. ఏ పద్ధతిని ఆ ప్రత్యేకతలున్నాయి. ప్రాతినిధ్య ప్రజాస్వామ్యంలో శాసనసభలు ఏదో ఒక విధానాన్ని కొన్ని మార్పులతో అమలు జేస్తున్నారు. ఇండియాలో ఈ కమిటీలు పద్ధతి గూర్చి ప్రత్యేకంగా రాజ్యాంగా చట్టంలో పొందుపరచబడలేదు గాని 1-94వ ప్రకరణం క్రింద పరోక్షంగా సభ్యులకు శాసన సభలలో గల ప్రవిలైజెస్ గూర్చి వివరించడం జరిగింది.

## 7.2 కమిటీల వర్గీకరణ

కేంద్ర పార్లమెంటులో మాదిరిగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర శాసన సభలో కూడా అయిదు రకాల కమిటీలున్నాయి. వాటిని కింద పేర్కొన్న విధంగా వర్గీకరించ్చవచ్చు.

### 7.2.1 సభ్యుల అవసరాలకు సంబంధించిన కమిటీలు

1. సాధారణ అవసరాల కమిటీ
2. వసతి సౌకర్యాల కమిటీ

3. గ్రంథాలయాల కమిటీ
4. వేతనాలు, భత్యాల కమిటీ

### 7.2.2 సభాకార్యక్రమాలకు సంబంధించిన కమిటీ

1. సభ్యుల అనువస్థితిపై కమిటీ
2. సభా కార్యక్రమాలపై సలహాలిచ్చే కమిటీ
3. ప్రైవేట్ సభ్యుల బిల్లులు, తీర్మానాలపై కమిటీ
4. నిబంధనల కమిటీ

### 7.2.3 విచారణ కమిటీలు

1. అర్జీలపై కమిటీ
2. సభా హక్కుల కమిటీ

### 7.2.4 పరిశీలన కమిటీ

1. ప్రభుత్వ వాగ్దానాలపై కమిటీ
2. దత్తశాసనాధికారంపై కమిటీ

### 7.2.5 ఆర్థిక కమిటీలు

1. అంచనాల సంఘం
2. ప్రభుత్వ ఖాతాల సంఘం
3. ప్రభుత్వ ఉపక్రమాల సంఘం

పార్లమెంటరీ కమిటీల నమూనాలోపైన పేర్కొన్న కమిటీలను రాష్ట్ర శాసనసభలో ఏర్పాటు చేసినప్పటికీ ఇవి పూర్వపు మద్రాసు రాష్ట్రం, హైదరాబాదు రాష్ట్రపు సంప్రదాయాలను అనుసరించాయి. 1958 నుంచి 1984 మే 31 వరకు ఆంధ్రప్రదేశ్ ద్విసభా విధానాన్ని అనుసరించిన కాలంలో కమిటీల్లో కింద పేర్కొన్న వర్గీకరణ పద్ధతి ఉండేది.

## 7.3 శాసన సంస్థ - సంయుక్త కమిటీలు

1. అంచనాల కమిటీ
2. ప్రభుత్వ ఖాతాల కమిటీ
3. ప్రభుత్వ ఉపక్రమాల కమిటీ
4. దత్తశాసనాధికార కమిటీ
5. షెడ్యూల్డు కులాల సంక్షేమ కమిటీ
6. షెడ్యూల్డు తెగల సంక్షేమ కమిటీ
7. వెనుకబడిన కులాల సంక్షేమ కమిటీ

8. గ్రంథాలయ కమిటీ
9. సభ్యుల వసతి - సౌకర్యాల కమిటీ .

### 7.3.1 విధాన సభ కమిటీలు

1. సభా వ్యవహారాలపై సలహాలిచ్చే కమిటీ
2. నిబంధనల కమిటీ
3. సభా హక్కులపై కమిటీ
4. ప్రభుత్వ వాగ్దానాలపై కమిటీ
5. అర్జీలపై కమిటీ

### 7.3.2 విధాన పరిషత్తు కమిటీలు

1. సభా వ్యవహారాలపై సలహాలిచ్చే కమిటీ
2. నిబంధనల కమిటీ
3. సభా హక్కుల పై కమిటీ
4. ప్రభుత్వ వాగ్దాలపై కమిటీ
5. అర్జీలపై కమిటీ

## 7.4 వివిధ కమిటీల నిర్మాణము - సభ్యుల ఎంపిక విధానము - పనితీరు

కమిటీలకు సభ్యుల నియామకం ముఖ్యంగా రెండు పద్ధతుల్లో జరుగుతుంది. 1. స్పీకర్ నామ నిర్దేశం చేయడం 2. నైష్పత్తిక ప్రాతినిధ్య పద్ధతిలో ఎన్నిక.

స్పీకర్ హూదారీత్యా సాధారణ అవసరాల కమిటీ, సభా కార్యక్రమాలపై సలహా కమిటీ, నిబంధనల కమిటీకి అధ్యక్షుడుగా వ్యవహరిస్తాడు. ఇతర కమిటీల్లో డిప్యూటీ స్పీకర్‌ను స్పీకర్ నామనిర్దేశం చేయవచ్చు. లేదా నైష్పత్తిక ప్రాతినిధ్య పద్ధతిలో ఛైర్మన్‌గా ఎన్నిక కావచ్చు. మంత్రులు మాత్రం కమిటీల్లో సాధారణ సభ్యులుగా కూడా ఉండటానికి వీల్లేదు. ఏ కమిటీలోని సభ్యుడైనా ఒకానొక పరిస్థితిలో మంత్రి పదవి చేపడితే అతడు శాసనసభా కమిటీల్లో తన సభ్యత్వాన్ని కోల్పోవాల్సి ఉంటుంది.

కమిటీలు తమ సౌకర్యాన్ని బట్టి సమావేశమవుతాయి. శాసనసభా సమావేశ కాలంలో సభాభవనంలో గానీ, స్పీకర్ / ఛైర్మన్ అనుమతితో సభాభవనం వెలుపల రాష్ట్రంలోపల ఎక్కడైనా సమావేశాలను ఏర్పాటు చేసుకోవచ్చు. ప్రతి శాసనసభ్యుడికి ఏదో ఒక కమిటీలో సభ్యత్వం కల్పించే ప్రయత్నం జరుగుతుంది. కొన్ని ప్రముఖ్యం ఉన్న కమిటీల్లో సభ్యుల ఆసక్తి, శక్తి సామర్థ్యాలను గుర్తించడం జరుగుతుంది. ఉదా॥ అంచనాల కమిటీ, ప్రభుత్వఖాతాల కమిటీ లాంటి వాటిల్లో ఆర్థిక విషయాల్లో అవగాహన ఉన్న సభ్యులకు ప్రాముఖ్యం ఉంటుంది. ఇట్లాంటి కమిటీలకు నైష్పత్తిక ప్రాతినిధ్య పద్ధతిలో సభ్యులు ఎన్నికవుతారు. కాబట్టి సభ్యులకే గాకుండా రాజకీయ పార్టీలకు కూడా న్యాయం జరుగుతుంది. ప్రతి కమిటీలో ఇంచుమించు అన్ని పార్టీలకు చెందిన సభ్యులకు సభ్యత్వం లభించినా కమిటీలు పనిచేసే తీరులో పార్టీల ప్రభావం ఉండదు. రాజకీయ పార్టీ భావాలకు అతీతంగా సభ్యులు వ్యవహరిస్తారు. తమ సమక్షంలో ఉన్న సమస్యలను నిరపేక్షంగా పరిశీలించి, నిష్పాక్షికమైన రీతిలో సిఫారసులను నివేదిక రూపంలో అందజేస్తారు.

కమిటీల్లో సభ్యులు ఆయా విషయాల్లో నిపుణులు కారు. కాని, తమ సమక్షంలో ఉన్న సమస్యల పరిశీలనలో వారికి ప్రత్యేక నిపుణుల సలహా సహకారాలను పొందే అవకాశం ఉంటుంది. సంబంధిత మంత్రిత్వ శాఖల సిబ్బంది సహాయాన్ని కూడా వారు అపేక్షించవచ్చు. ఆర్థిక విషయాలకు సంబంధించిన ప్రభుత్వఖాతాల కమిటీ, ప్రభుత్వ ఉపక్రమాల కమిటీ, అవసరమైనప్పుడు కమిటీలు అనధికార (Non - official) నిపుణుల తోడ్పాటును కూడా పొందవచ్చు. ప్రజా వర్గాలకు సంబంధించిన సమస్యలు, కమిటీలు పరిశీలనకు వచ్చినప్పుడు కమిటీలు ఆయా సంబంధిత ప్రజావర్గాల అభిప్రాయాలను తెలుసుకోవడానికి కూడా అవకాశం కల్పించడమవుతుంది. ఈ విధంగా మొత్తం శాసనసభ నిర్వర్తించడానికి కష్టమయ్యే ఎన్నో పనులు కమిటీల ద్వారా సులభంగా నెరవేరుతాయి. కొన్ని సార్లు కమిటీలు కూడా తమ పనిని సులభరితం చేసుకోవడానికి ఉపకమిటీలను ఏర్పాటు చేసుకోవచ్చు. ముఖ్యంగా ఆర్థిక సంబంధమైన వ్యవహారాలను పరిశీలించే అంచనాల కమిటీ, ప్రభుత్వఖాతాల కమిటీ, ప్రభుత్వ ఉపక్రమాల కమిటీలు, ఉపకమిటీలను ఏర్పాటు చేసుకొంటాయి. ఉదా॥ 1975లో అంచనాల కమిటీ 18 ఉపకమిటీలను, ప్రభుత్వఖాతాల కమిటీ 7 ఉపకమిటీలను ఏర్పాటు చేసుకొన్నాయి. ఈ ఉపకమిటీలు ముఖ్యంగా అంచనాల కమిటీకి చెందిన ఉపకమిటీలు, సకాలంలో నివేదికలను తయారు చేసి శాసనసభకు సమర్పించడంలో తోడ్పడ్డాయి.

ఈ సందర్భంలో గమనించాల్సిన మరో ముఖ్య విషయమేమంటే మన ఆంధ్రప్రదేశ్ శాసన సంస్థకు చెందిన కమిటీల్లో అంచనాల కమిటీకి గాని, ప్రభుత్వ ఉపక్రమాల కమిటీకి గాని అధికార సభ్యులే ఛైర్మన్‌లుగా ఉంటూ వచ్చారు. ఒక్క ప్రభుత్వ ఖాతాల కమిటీకి మాత్రమే ప్రతిపక్షానికి చెందిన సభ్యులు ఛైర్మన్‌లుగా వ్యవహరించారు.

ఇంకో ముఖ్య విషయమేమంటే అన్ని శాసనసభా కమిటీలకు కార్యదర్శిగా, శాసన సభా సచివాలయ కార్యదర్శి (Secretary of the Legislature) వ్యవహరిస్తాడు. ఇతడు తన సిబ్బంది సహాయంతో ఆయా కమిటీల సమావేశ కాలాన్ని నిర్ధారిస్తాడు. ఆయా సమావేశాల్లో చర్చనీయాంశాల పట్టకను సంబంధిత కమిటీ ఛైర్మన్‌తో సంప్రదించి సిద్ధం చేస్తాడు. ప్రభుత్వ మంత్రిత్వ శాఖల నుంచి అవసరమైన దస్తావేజు కవిలెకట్టలను తెప్పించి కమిటీల ముందుంచుతాడు. అవసరాన్ని బట్టి సాక్షులను హాజరు పరుస్తాడు. కమిటీలకు ఎదురయ్యే చిక్కులను పరిష్కరిస్తాడు. అవసరాన్ని బట్టి కమిటీల పర్యటన కార్యక్రమాలను రూపొందిస్తాడు. కమిటీల సమావేశాలు జరుగుతూ ఉన్న కాలంలో మినిట్సును సిద్ధం చేస్తాడు. ఆయా కమిటీల కార్యకలాపాలు ముగియడంతో సంబంధిత నివేదికల ముసాయిదాలను తయారు చేసి ఇస్తాడు. ఈ విధంగా శాసనసభా సచివాలయ కార్యదర్శి ఆయా కమిటీలకు కరచరణాది అవయవాల్లాగా బాగా తోడ్పడతాడు.

## 7.5 మన రాష్ట్ర శాసన సభలోని వివిధ ముఖ్యమైన కమిటీలు

### 7.5.1 నిబంధనల కమిటీ

ఈ కమిటీ స్పీకర్ హూదారీత్యా ఛైర్మన్‌గా వ్యవహరిస్తాడు. దీనిలో స్పీకర్ 15 మంది సభ్యులను నియమిస్తాడు. ఈ కమిటీ సభా కార్యక్రమాల నిర్వహణ పద్ధతులను,తీరును గురించి అడపాదడపా సమీక్షిస్తూ సభా వ్యవహారాల సక్రమ నిర్వహణకు గాను సభానిబంధనకు అవసరమైన సవరణలను (మార్పులను, చేర్పులను) సిఫారసు చేస్తుంది. దీని పదవీకాలం ఒక సంవత్సరం మాత్రమే.

### 7.5.2 సభా వ్యవహారాల సంప్రదింపుల కమిటీ :

ఈ కమిటీలో 11 మంది సభ్యులకు మించకుండా సభ్యులుంటారు. శాసన సభా నాయకుడికి కూడా తప్పనిసరిగా సభ్యత్వం ఉంటుంది. స్పీకర్ ఛైర్మన్‌గా వ్యవహరిస్తాడు. సభ సమావేశ కాలంలో చర్చనీయాంశాల పట్టికను, ఒక్కొక్క చర్చనీయాంశానికి

వ్యవధిని కూడా ఈ కమిటీ ఖరారు చేస్తుంది. దీని పదవీ కాలం ఒక సంవత్సరం.

### 7.5.3 సాధారణ అవసరాలు / వ్యవహారాల కమిటీ

ఈ కమిటీ స్పీకర్ అధ్యక్షుడుగా వ్యవహరిస్తాడు. డిప్యూటీ స్పీకర్, స్థాయీ సంఘాల అధ్యక్షులు. సభలో గుర్తింపు పొందిన వర్గాల (గ్రూపుల)నాయకులు, స్పీకర్ నియమించిన ఇతర సభ్యులకు కూడా సభ్యత్వం ఉంటుంది.

సభావ్యవహారాల నిర్వహణను క్రమబద్ధీకరించడం మొదలైన అన్ని అంశాలపై ఈ కమిటీ స్పీకర్‌కు సలహాలిస్తుంది.

### 7.5.4 సభా హక్కుల కమిటీ

ఈ కమిటీలో 15 మంది సభ్యులుంటారు. ఇది ఒక సంయుక్త కమిటీ, విధాన సభ, విధాన పరిషత్తు నుంచి సభ్యులను స్పీకర్ నామినేట్ చేస్తాడు.

స్పీకర్ తన వద్దకు తెచ్చిన సభాహక్కుల తీర్మానాలను పరిశీలించి ఆ తీర్మానాలను ఆ కమిటీకి పంపాల్సిన అవసరం లేదా సభలో చర్చకు పెడతాడు. సభ అభిప్రాయాన్ని బట్టి కమిటీకి పంపడం జరుగుతుంది. కమిటీ సాక్ష్యాధారాల ప్రమాణాన్ని బట్టి సభా హక్కుల ఉల్లంఘన జరిగిందీ లేందీ తేల్చి, నివేదికను స్పీకర్‌కు సమర్పిస్తుంది. నివేదిక ఆధారంగా స్పీకర్ బాధ్యులైన వ్యక్తులపై చట్టరీత్యా చర్యకు ఆదేశిస్తాడు. సభా హక్కులను కాపాడుతాడు.

బాధ్యత గల పౌరులెవ&రైనప్పటికీ శాసనసభను కించపరచేరీతిలో ప్రసంగించినా, పత్రికల్లో లేదా తమ ఇతర రచనల్లో రాసినా సభాహక్కులకు భంగం కలిగినట్లుగా భావించడం జరుగుతుంది. అధికార యంత్రాంగం కూడా శాసన సభ లోపలా వెలుపలా శాసన సభ్యుల పట్ల అమర్యాదగా ప్రవర్తించినా కూడా సభా హక్కులకు భంగం కలిగినట్లుగా భావించడం జరుగుతుంది. కొన్ని పర్యాయాలు మంత్రిమండలి సభ్యులు సభకు తప్పుడు సమాచారం అందిస్తూ సభను మభ్యపెట్టినా కూడా సభా హక్కుల భంగం కలిగించిన వారవుతారు. శాసనసభ ప్రతి సమావేశ కాలంలో తరచు సభా హక్కుల భంగానికి చెందిన సమస్యలను లేవనెత్తడం జరుగుతూ ఉంటుంది. ఇటీవల కాలంలో సభా హక్కుల ఉల్లంఘన పరంగా కౌతుకాన్ని రేకెత్తించిన సంఘటనలో 1984 బడ్జెట్ సమావేశాల్లో ' ఈనాడు' దినపత్రిక వ్యవస్థాపక సంపాదకుడు శ్రీ రామోజీరావు లేవనెత్తిన సమస్య ప్రముఖమైంది. ఆనాటి విధాన పరిషత్తు ఛైర్మన్ శ్రీ సయ్యద్ ముకస్సిర్‌షా శ్రీరామోజీరావు అరెస్టు కోసం వారెంటు జారీ చేయడం జరిగింది. అయితే తేది 20 మార్చి 1984నాడు సుప్రీంకోర్టు 'స్టే' మంజూరు చేయడం , ఆ తరువాత కొద్ది కాలానికి విధాన పరిషత్తు రద్దు కావడం జరిగాయి.

ఇది వరకే పైన వివరించినట్లు యువజన కాంగ్రెస్ కార్యకర్తలు కొందరు విధాన సభలోకి దూసుకెళ్ళిన సంఘటన కూడా సభా హక్కుల ఉల్లంఘనకు సంబంధించిన మరో సమస్య. ఈ సమస్య రాష్ట్ర శాసన సంస్థకు, న్యాయ వ్యవస్థకు మధ్య వివాదానికి దారితీసింది కూడా.

### 7.5.5 ప్రభుత్వ వాగ్దానాలపై కమిటీ

ఈ కమిటీలో 12 మంది సభ్యులుంటారు. వీరిని స్పీకర్ నామినేట్ చేస్తాడు.

ఆయా సందర్భాల్లో వివిధ సమస్యలపై మంత్రులు సభవారికి చేసిన వాగ్దానాలనూ వాటిని ఎంతవరకు నెరవేర్చింది ఈ కమిటీ పరిశీలిస్తుంది. వాగ్దానాలను నెరవేర్చని మంత్రులను సభకు బాధ్యులను చేయడానికి ఈ కమిటీ తోడ్పడుతుంది.

### 7.5.6 దత్త శాసనాధికార కమిటీ

ఈ కమిటీలో 7 గురు సభ్యులుంటారు. డిప్యూటీ స్పీకర్ ఈ కమిటీకి అధ్యక్షుడుగా వ్యవహరిస్తాడు. శాసన సంస్థ రూపొందించిన మౌళిక శాసనాలు / చట్టాలకు లోబడి కార్య నిర్వాహక శాఖ రూపొందించిన శాఖ రూపొందించిన నియమాలు. నిబంధనలు లేదా ఉపనిబంధనలను ఈ కమిటీ పరిశీలిస్తుంది. వాటిల్లో ఏవైనా శాసనసభ మూలచట్టాల ఆశయాలకు విరుద్ధంగా ఉన్నట్లైతే వాటిని సవరించాల్సిందని సిఫారసు చేస్తుంది. సిఫారసులను నివేదిక రూపంలో శాసనసభకు అందజేస్తుంది.

శాసనసభకు చెందిన కమిటీల్లో ఆర్థిక సంబంధమైన కమిటీలు మిక్కిలి శక్తివంతమైనవి. ప్రభుత్వం లేదా కార్యనిర్వాహక శాఖను నియంత్రించడంలో ఇవి విశేషముగా తోడ్పడుతాయి. కమిటీల నిర్మాణం, విధులను కింద పరిశీలించడమైంది.

### 7.5.7 అంచనాల కమిటీ

ఈ కమిటీలో మొత్తం 20 మంది సభ్యులుంటారు. 15 మంది సభ్యులు విధాన సభనుంచి , 5గురు విధాన పరిషత్తు నుంచి నైష్పత్తిక ప్రాతినిధ్య పద్ధతిలో ప్రతి సంవత్సరం ఎన్నికవుతూ ఉంటారు. అంటే, ఈ కమిటీ గడువు కాలం ఒక్క సంవత్సరం మాత్రమే అని స్పష్టం.

ఈ కమిటీ ప్రతి ఏటా అన్ని ప్రభుత్వ శాఖల అంచనాలను పరిశీలించలేదు. స్పీకర్, సంబంధిత మంత్రులు, శాసనసభ్యుల సలహానుబట్టి, కమిటీ సభ్యుల అభిప్రాయాన్ని బట్టి ఏ ప్రభుత్వ శాఖకు సంబంధించిన అంశాలనైనా దృష్టిలో పెట్టుకొని, అవి వదలివేసిన అంశాలను స్వీకరించడం పరిపాటి.

ఏ ప్రభుత్వ శాఖల అంశాలను పరిశీలించాలని కమిటీ నిర్ణయిస్తుందే ఆ ప్రభుత్వ శాఖాధిపతులకు కమిటీ కార్యదర్శి లిఖిత పూర్వకంగా పత్రవ్యవహారం జరిపి ప్రత్యేక నమూనాలో కావాల్సిన సమాచారాన్ని సేకరిస్తాడు. అవసరాన్ని బట్టి సంబంధిత అధికార పత్రాలను, దస్తావేజులను కూడా తెప్పించి ఉంచుతాడు.

ఆయా సందర్భాల పూర్వాపరాలను వివరించడానికి అవసరాన్ని బట్టి ఆర్థిక శాఖకు సంబంధించిన అధికారులను, సంబంధిత మంత్రిత్వ శాఖల అధికారులను, నిపుణులను కూడా సాక్షులుగా కమిటీ సమక్షంలో హాజరుపరచి, వారి వాఙ్మూలాన్ని పరిశీలించవచ్చు. అవసరమని భావించినట్లైతే క్షేత్రపరిశీలన (field study) కూడా జరపవచ్చు. అట్లాంటి సందర్భాల్లో స్పీకర్ పూర్వానుమతి అవసరం. స్పీకర్ ఏకారణం వల్లనైనా అనుమతి నిరాకరిస్తే కమిటీ రాజీనామా సమర్పించే పరిస్థితి ఏర్పడుతుంది. 1961లో ఆనాటి స్పీకర్ అంచనాల కమిటీకి కొన్ని అంశాల పరిశీలన నిమిత్తం పొరుగు రాష్ట్రాలను దర్శించడానికి ముందు అనుమతించినప్పటికీ, ముఖ్యమంత్రి సలహామేరకు తరువాత నిరాకరించేసరికి, ఆ కమిటీ రాజీనామా సమర్పించింది.

అంచనాల కమిటీ తన పని సులభం చేసుకోవడానికి ఉపకమిటీలను ఏర్పాటు చేసుకోవచ్చు.

అంచనాల కమిటీ నిర్వహించే ప్రధాన విధులను కింద పేర్కొనటమైంది

1. ఖర్చులు తగ్గించడానికి ఆయా సంస్థల నిర్మాణంలోనూ, పని విధానంలోనూ పాలన సంబంధమైన విషయాల్లోనూ, సంస్కరణలను సిఫారసు చేస్తుంది.

2. పాలన సామర్థ్యాన్ని మెరుగుపరచడానికి ప్రత్యామ్నాయ పద్ధతులను సూచిస్తుంది.

3. అంచనాలకు అనుగుణంగా ప్రభుత్వ విధానాలకు లోబడి ధనవ్యయం జరుగుతుంది లేనిదీ పరిశీలిస్తుంది.

4. శాసన సభకు అంచనాలు ఏ రూపంలో ఉంటే బాగుంటుందో సలహా యిస్తుంది

అంచనాల కమిటీ తన సిఫారసులను నివేదిక రూపంలో అందజేస్తుంది. ఆ సిఫారసులను ప్రభుత్వం తప్పనిసరిగా పాటించాలన్న నిర్బంధం లేదు. కేవలం 50% సిఫారసులు మాత్రమే అమలు జరుగుతుంటాయని పరిశీలనను బట్టి తెలుస్తుంది. అన్ని సిఫారసులూ అమలు జరిగినా జరక్కపోయినా వాటికి విలువ ఇవ్వడం జరుగుతుంది.

ఈ కమిటీ సమర్పించే నివేదికలపై విడిగా శాసనసభలో చర్చ జరగదు. కమిటీ స[illegible]ద్ధులో జరిగే సమగ్ర చర్చతో సభ్యులు సంతృప్తి చెందుతారు.

## 7.5.8 ప్రభుత్వ ఖాతాల కమిటీ

ఆర్థిక పరమైన శాసనసభాకమిటిల్లో యిది చాలా ముఖ్యమైన కమిటీ. దీనిలో 20 మంది సభ్యులుంటారు. వారిలో 15 మంది విధాన సభకు చెందిన వారు కాగా 5 గురు విధాన పరిషత్తుకు చెందినవారు . వీరి ఎన్నిక నైష్పత్తిక ప్రాతినిధ్య పద్ధతిలో జరుగుతుంది. సభ్యుల పదవీకాలం ఒక సంవత్సరం ఉంటుంది. సభ్యులు చైర్మన్‌ను ఎన్నుకొంటారు. కాని, ప్రతి పక్షపార్టీ నా[illegible] కమిటీకి చైర్మన్[illegible] సంప్రదాయంగా వస్తోంది.

అకౌంటెంట్ జనరల్ ఆడిట్ ని[illegible]వేదికలు, కేటాయింపులకు సంబంధించి[illegible] అందిన తరువాత కమిటీ చైర్మన్ స[illegible] ఏర్పాటు చేస్తా[illegible] ప్రభుత్వ ఖాతాలను పరిశీలి[illegible]చడం అవసరమో నిర్ణయించి కార్యక్రమాన్ని రూ[illegible]ందిస్తాడు.

అకౌంటెంట్ జనరల్ సమర్పించిన ఆడిట్ నివేదికల ఆధారంగా శాసనసభ అనుమతించిన మొత్తాలకు మించి జరిగిన ఖర్చులను గుర్తించి సంబంధిత మంత్రిత్వ శాఖాధిపతులను కమిటీ సంజాయిషీ అపేక్షిస్తుంది.

అధిక వ్యయం జరిగిన అన్ని కేసులనూ శాసనసభ దృష్టికి తీసుకురావడం ఈ కమిటీ నిర్వహించే పనుల్లో ముఖ్యమైంది. ఈ సందర్భంగా ఏ ప్రభుత్వ శాఖాధికారినైనా తమ పక్షానికి రప్పించుకొని వారిని ప్రశ్నించవచ్చు. అవసరమైన అధికార పత్రాలను (Official documents) పరిశీలించవచ్చు. అయితే జరిగిన ఖర్చులను తిరస్కరించడంగానీ, అలా జరిగినదానికీ, ఆయా అధికారులకూ తాఖీదులను జారీ చేసే అధికారం కమిటీకి లేదు. కాని, ప్రభుత్వానికీ, శాసనసభకూ తన అభిప్రాయాలను సలహా రూపంలో తెలియజేస్తుంది. ప్రభుత్వం కూడా కమిటీ చేసిన సిఫారసుల కనుగుణంగా ఏమి చర్య తీసుకొంటే కమిటీకి సమాచారం అందివ్వాల్సి ఉంటుంది. ఒక వేళ కమిటీ నివేదికపై చర్చ తీసుకోవడం ఆలస్యమైతే దానికి సహేతుకంగా సంజాయిషీ చెప్పుకోవాల్సి ఉంటుంది.

ఈ కమిటీ పరిధిలోకి అన్ని ప్రభుత్వ శాఖలు, ప్రభుత్వ రంగ సంస్థలు, ప్రభుత్వ పథకాలు, విశ్వవిద్యాలయాలు మొ॥ వి వస్తాయి. ఖాతాపద్దుల్లో నిల్వలు, ఖాతా పుస్తకాల నిర్వహణలో లోపాలు, తగిన ఓచర్లు లేకుండా డబ్బు చెల్లించడం. ప్రభుత్వ వస్తువులను చౌకగా అమ్మడం. ఇతర లోపాయికారీ వ్యవహారాలు కమిటీ పరిశీలనాంశాలవుతాయి. ఈ కమిటీ నివేదికలు ప్రభుత్వ లోపాలను ఎత్తి చూపినప్పుడు ప్రభుత్వం సంజాయిషీ చెప్పుకోవాల్సివస్తుంది. సాధారణంగా ఈ కమిటీ చేసే సిఫారసులను ప్రభుత్వం అమలు జరిపే ప్రయత్నం చేస్తుంది. వేటినైనా అమలు జరపనట్లైతే దానికి కారణాలను తెలపాల్సిందిగా కమిటీ ప్రభుత్వాన్ని అడగవచ్చు.

### 7.5.9 ప్రభుత్వ ఉపక్రమాల కమిటీ

ఈ కమిటీలో కూడా 20 మంది సభ్యులుంటారు. 15 మంది విధానసభ నుంచి నైష్పత్తిక ప్రాతినిధ్య పద్ధతిలో ఎన్నికైతే 5 గురు విధాన పరిషత్తు నుంచి ఎన్నికవుతారు. సభ్యుల పదవీకాలం ఒక సంవత్సరం మాత్రమే.

రాష్ట్ర ప్రభుత్వ రంగంలో పని చేస్తున్న సంస్థలు వ్యాపార సరళిలో లాభాలార్జించే రీతిలో నడుస్తున్నాయో లేదో ఈ కమిటీ పరిశీలిస్తుంది.

ఆయా సంస్థల నివేదికలను, వాటి అకౌంట్లను పరిశీలించడం ఈ కమిటీ నిర్వహించే ముఖ్యమైన బాధ్యత. ఈ విధి నిర్వహణలో రాష్ట్ర అకౌంటెంట్ జనరల్ ఆడిట్ నివేదికలు కమిటీకి ఉపకరిస్తాయి.

ఇంతవరకు ఆల్విన్ నిస్సాన్, ఎ.పి. స్కూటర్స్, ఎ.పి. మైనింగ్ కార్పొరేషన్, హైదరాబాదు కెమికల్స్ ఎండ్ ఫర్టిలైజర్స్, విద్యుచ్ఛక్తి బోర్డు, రాష్ట్ర పారిశ్రామిక అభివృద్ధి కార్పొరేషన్ మొదలైన రాష్ట్ర ప్రభుత్వ సంస్థలను ఈ కమిటీ పరిశీలించింది.

### 7.5.10 షెడ్యూల్డు కులాలు, తెగలు, వెనకబడ్డ తరగతుల సంక్షేమంపై కమిటీ

ఈ కమిటీలు ఒక్కోదానిలో 9 మంది సభ్యులుంటారు. ఈ కమిటీలు షెడ్యూలు కులాలు, తెగలు వెనుకబడిన తరగతుల సంక్షేమం కోసం నియమింపబడినవి. పదవీకాలం ఒక సంవత్సరం. రాజ్యాంగ 16,335 ప్రకరణాల క్రింద జారీ చేసినట్లు సర్వీసులలో ఉద్యోగాలలో ఈ కులాల, తెగల, వెనుకబడిన తరగతుల ప్రాతినిధ్యం సరిగా ఉన్నదీ లేనిదీ ఈ కమిటీలు పరిశీలిస్తాయి. రాజ్యాంగ రక్షణ వసతులు ఎక్కువగా లభ్యం అయ్యేట్లు చూస్తాయి.

### 7.5.11 పిటిషన్ల కమిటీ :

ఈ కమిటీలో స్పీకర్ చేత నియమించబడిన 16 మంది సభ్యులుంటారు. పిటిషన్లు ఈ కమిటీ పరిశీలిస్తుంది. పిటిషన్లలో కొన్న శాసర సంస్థలకు సిఫారసులు చేస్తుంది. శాసన సభలో డిప్యూటీ స్పీకర్ ఈ కమిటీకి అధ్యక్షులుగా వ్యవహరిస్తారు.

### 5.12 సదుపాయాల కమిటీ :

ఈ కమిటీలో మొత్తం 20 మంది సభ్యులుంటారు. 15 మంది విధాన సభనుండి మిగతా 5 గురిని విధాన మండలి ుండి ఎన్నుకుంటారు. ఈ కమిటీ అధ్యక్షుడిని స్పీకర్ నామినేట్ చేస్తారు.

## 7.6 శాసన సభ కమిటీల వలన ప్రయోజనలు

ప్రొఫెసర్ హెర్మన్ ఫైనర్ చెప్పినట్లు, ఆధునిక రాజ్యాల్లో శాసనసంస్థలు -కమిటీ పద్ధతి ద్వారా మాత్రమే సంతృప్తికరంగా నిర్వహించగలుగుతాయి. భారత పార్లమెంటు తొట్టతొలి స్పీకర్ కీ.శే. జి.వి. మావ్‌లంకర్ వక్కాణించినట్లు పార్లమెంటరీ లేదా శాసనసభా కమిటీల వల్ల కింద పేర్కొన్న ప్రయోజనాలున్నాయి.

1. ప్రజాప్రతినిధులైన శాసనసభ్యులకు దైనందిన వ్యవహారాల్లో ప్రభుత్వం ఎదుర్కొంటూ ఉన్న సమస్యలు అర్థం అయ్యేట్లు చేయడంతో బాటు ప్రభుత్వ పాలనా సంబంధమైన పరిజ్ఞానాన్ని కూడా కలుగజేస్తాయి.

2. ప్రభుత్వం నిరంకుశంగా, ఇష్టం వచ్చినట్లు వ్యవహరించకుండా అవి నియంత్రిస్తాయి.

3. ప్రభుత్వ విధానాలను ప్రభావితం చేసి, అవి ప్రజాభిప్రాయాన్ని మన్నించేట్లు చేయగలుగుతాయి.

4. ప్రభుత్వానికీ, ప్రజలకూ మధ్య సంధానకర్తలుగా వ్యవహరించి సత్సంబంధాలను నెలకొల్పడంలో తోడ్పడతాయి.

## 7.7 సారాంశము

పార్లమెంటరీ ప్రభుత్వంలో కార్యనిర్వాహక శాఖపై నియంత్రణ చేయుటకు శాసనసభకు చిన్న చిన్న వ్యవస్థలు ఉంటాయి. ఆ వ్యవస్థలనే కమిటీలని అంటారు. కమిటీల ద్వారా వివిధ నిర్ణయాలు తీసుకోవడం ద్వారా శాసనసభలో పని ఒత్తిడి తగ్గించమే వీటి ముఖ్యోద్దేశ్యం.

పార్లమెంటరీ ప్రభుత్వ విధానంలో కార్యనిర్వాహక శాఖ పార్లమెంటుకు బాధ్యత వహిస్తుంది. కార్యనిర్వాహక శాఖ చేసే విధులలో పార్లమెంట్ చేయడం నిర్ణయం జరుగుతుంది. అంగీకారం కూడా జరుగుతుంది. అమలు విధానంలో చూస్తే, పార్లమెంట్ కొనసాగే కాలంలో ఎక్కువగా ఒత్తిడి ఉండడం వలన సభా నిర్వహణ ఎక్కువగా నుండుట, పనితీరు మొదలగు విధానాల వలన కార్యక్రమాలను నిర్వహించుట కష్టతరమైనపని. అందుకే అవి మాములుగా చర్చలు జరుపుతూ ఉంటాయి. అందుకునే ప్రజా వాసన సంస్థలు కొన్ని గ్రూపులుగా విభజించి, కార్యక్రమాలను చేపట్టి విధి నిర్వహించవచ్చును. ఆ గ్రూపులే క్షుణ్ణంగా పరిశీలించి కార్యరూపాన్ని చేపడతారు. కమిటీలు భిన్నంగా ఉండుటవల్ల ప్రతి విషయాన్ని క్షుణ్ణంగా పరిశీలించి న్యాయాన్ని చేకూర్చుడానికి వీలుగా ఉండును. ఆ విధమైన పద్ధతి అవలంభించుటవలన సరైన నిర్ణయాలను తీసుకొనవచ్చును. శాసన సంస్థలు రూపొందించిన విధానాలను కార్య నిర్వాహక శాఖ సక్రమంగా అమలు జరిపేది. లేనిది శాసన సభల కమిటీలు ఉద్భవించినవి. ప్రజాస్వా దేశాలలో పార్లమెంటరీ కమిటీలు ఉద్భవించినవి.

## 7.8 నమూనా ప్రశ్నలు

ఈక్రింది ప్రశ్నలకు వ్యాస రూపంలో సమాధానాలను వ్రాయండి.

1. ఆంధ్రప్రదేశ్ శాసన సభ కమిటీ పద్ధతిని వివరించండి

2. కమిటీ పద్ధతి వలన కలిగే ప్రయోజనలును తెలుపుము

3. శాసన సభాకు చెందిన వివిధ కమిటీల నిర్మాణ,విధులను వ్రాయండి.

## లఘుప్రశ్నలు

1. అంచనాల కమిటీ
2. ప్రభుత్వ ఖాతాల కమిటీ
3. ప్రభుత్వ సంస్థల పరిశీలన కమిటీ

## 7.9 చదువదగిన గ్రంథాలు


1. జి. రామి రెడ్డి అండ్ బి.ఎ.వి. శర్మ - రాష్ట్ర ప్రభుత్వము మరియు రాజకీయాలు
2. ఎ. ప్రసన్న కుమార్ మరియు ఇతరులు - ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వము మరియు రాజకీయాలు
3. కె. పాండురంగారావు అండ్ వి. కృష్ణారావు - ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వము మరియు రాజకీయాలు


డా॥ కె. రామచంద్ర మూర్తి

పాఠం - 8

# రాష్ట్ర న్యాయవ్యవస్థ (State Judiciary)

## 8.0 లక్ష్యం :

భారత రాజ్యాంగము స్వతంత్ర ప్రతిపత్తి గల న్యాయవ్యవస్థను రూపొందించింది. కేంద్రంలో సుప్రీం కోర్టువలె రాష్ట్రం స్థాయిలో కూడా శాసనసభ, కార్యనిర్వాహశాఖల వత్తిడులకు లొంగని విధంగా హైకోర్టు మరియు దిగువ న్యాయస్థానాలను రూపొందించింది. రాష్ట్ర న్యాయవ్యవస్థ పనితీరును పరిశీలించుట ఈ పాఠము ప్రధాన లక్ష్యం.

## విషయ సూచిక :


8.1 పరిచయం

8.2 న్యాయమూర్తుల నియామకం

8.3 అర్హతలు

8.4 పదవికాలం

8.5 జీత భత్యాలు

8.6 పదవిస్వీకారం

8.7 న్యాయమూర్తుల తొలగింపు

8.8 స్వతంత్ర ప్రతిపత్తి

8.9 హైకోర్టు అధికారాలు - విధులు మరియు పరిధి.

- 8.9.1 మౌలిక పరిధి
- 8.9.2 అప్పీళ్ళు పరిధి
- 8.9.3 అజమాయిషీ అధికారం
- 8.9.4 రిట్‌ల అధికారం
- 8.9.5 న్యాయ సమీక్ష
- 8.9.6 కోర్టు ఆఫ్ రికార్డు

8.10 రాష్ట్ర హైకోర్టులపై - కేంద్రప్రభుత్వ నియంత్రణ

8.11 జిల్లా న్యాయ వ్యవస్థ - సివిల్ కోర్టులు

- 8.11.1 జిల్లా కోర్టు
- 8.11.2 సబార్డినేట్ కోర్టులు
- 8.11.3 మున్సిఫ్ కోర్టులు
- 8.11.4 జిల్లా న్యాయవ్యవస్థ - క్రిమినల్ కోర్టులు

8.11.5 సెషన్స్ కోర్టులు - అధికార విధులు

8.11.6 మెజిస్ట్రేట్ కోర్టులు

8.11.7 అధికార విధులు

8.12 రాజధాని నగరంలో (దిగువ) న్యాయ వ్యవస్థ

8.13 సారాంశం

8.14 నమూనా ప్రశ్నలు

8.15 చదువదగిన గ్రంథాలు

## 8.1 పరిచయం :

రాష్ట్ర న్యాయవ్యవస్థ ఒక హైకోర్టు మరియు కొన్ని దిగువ కోర్టుల (సబార్డినేట్)తో నిర్మితమైనది. భారత రాజ్యాంగంలోని 214వ నిబంధనమసరించి ప్రతి రాష్ట్రమునకు ఒక హైకోర్టు ఉండాలని తెల్పుచున్నది. అయితే భారత రాజ్యాంగంలోని 231, క్లాజ్ (1) ననుసరించి పార్లమెంట్ ఒక చట్టం ద్వారా రెండు, మూడు రాష్ట్రాలకు కలిపి ఉమ్మడిగా ఒక ఉన్నత న్యాయస్థానంను ఏర్పాటు చేయవచ్చును. లేదా రెండు మూడు చిన్న రాష్ట్రాలకు మరియు ఒక కేంద్రపాలిత ప్రాంతానికి కలిపి ఒక ఉమ్మడి ఉన్నత న్యాయస్థానం(హైకోర్టు)ను ఏర్పాటు చేయవచ్చును. రాష్ట్రంలో అత్యున్నత న్యాయస్థానం హైకోర్టు. దానికి దిగువన ఇతర న్యాయస్థానాలు (సబార్డినేట్ కోర్టులు) రాష్ట్రంలో పని చేస్తాయి. రాష్ట్ర హైకోర్టు సాధారణంగా ఆ రాష్ట్ర రాజధానిలో ఉంటుంది.

## 8.2 న్యాయ మూర్తుల నియామకం :

రాజ్యాంగ నిబంధన 216 ప్రకారం ప్రతి రాష్ట్ర హైకోర్టుకు ఒక ప్రధాన న్యాయమూర్తి మరియు కొంత మంది ఇతర న్యాయమూర్తులుంటారు. ఇతర న్యాయమూర్తుల సంఖ్య భారత రాష్ట్రపతి అభిప్రాయముపై ఆధారపడి ఉన్నది. ప్రస్తుతము మన రాష్ట్ర హైకోర్టులో ఒక ప్రధాన న్యాయమూర్తి, 23 మంది ఇతర న్యాయమూర్తులు కలరు.

217వ రాజ్యాంగ నిబంధనమసరించి హైకోర్టు ప్రధాన న్యాయమూర్తిని, ఇతర న్యాయమూర్తులను భారత రాష్ట్రపతి నియమించడానికి పూర్వం ప్రధాన న్యాయ మూర్తి విషయంలో సుప్రీమ్ కోర్టు ప్రధాన న్యాయమూర్తిని, రాష్ట్ర గవర్నరును ముందు సంప్రదిస్తాడు. సాధారణ న్యాయమూర్తుల విషయంలో రాష్ట్రహైకోర్టు ప్రధాన న్యాయమూర్తిని కూడా సంప్రదిస్తాడు.

223, 224వ నిబంధనలననుసరించి రాష్ట్ర హైకోర్టులో పని వత్తిడినిబట్టి తాత్కాలిక మరియు అదనపు న్యాయమూర్తులను భారత రాష్ట్రపతి నియమించ వచ్చును.

## 8.3 అర్హతలు :

భారత రాజ్యాంగ నిబంధన 217(2) ననుసరించి రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తిగా నియామకం పొందటానికి ఈ దిగువ పేర్కొన్న అర్హతలుండాలి. అవి

1 అతడు భారత పౌరుడై ఉండాలి.

2 62 సంవత్సరాలు నిండనివాడై ఉండాలి

3 భారతదేశం మొత్తంలో ఏ ప్రాంతంలో అయినా న్యాయపదవిని నిర్వహించినవాడై ఉండాలి.

4 ఏదైన హైకోర్టుల్లో వరుసగా 10 సంవత్సరాలు న్యాయవాదిగా అనుభవం గడించినవాడై ఉండాలి.

## 8.4 పదవీకాలం :

రాజ్యాంగములోని 217(1)వ నిబంధననుసరించి హైకోర్టు న్యాయమూర్తుల పదవి విరమణ వయస్సు 62 సంవత్సరాలు. అనారోగ్యకారణాలతో స్వచ్ఛందంగా పదవి విరమణ కాలంనకు ముందే రాజీనామా చేయవచ్చును.

## 8.5 జీత భత్యాలు :

హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి నెలసరి జీతం రూ. 30,000 సాధారణ న్యాయమూర్తి నెలసరి జీతం రూ 26,000 సదరు రాజ్యాంగ నిబంధననుసరించి న్యాయమూర్తులు పదవిలో కొనసాగుతుండగా వారికి జీతభత్యాలు, ఇతర సదుపాయాల్లోను నష్టం కలిగే విధంగా చట్టాలు చేయరాదు. 229వ భారత రాజ్యాంగ నిబంధననుసరించి వారి జీత భత్యాలను భారత సంఘటిత నిధి నుంచి చెల్లించడం జరిగుతుంది. జీత భత్యాలతోపాటు దీర్ఘకాలపు సెలపు వేతనం, పింఛను, ఇతర అలవెన్సులూ, సౌకర్యాలు ఉంటాయి. దేశంలో ఆర్థిక మాంద్యం ఏర్పడినప్పుడు భారత రాజ్యాంగ నిబంధన 360ననుసరించి భారత రాష్ట్రపతి దేశంలో ఆర్థిక అత్యవసర పరిస్థితి ఏర్పడినప్పుడు, న్యాయమూర్తుల జీతాలను తగ్గించవచ్చును.

## 8.6 పదవి స్వీకారము :

భారత రాజ్యాంగ నిబంధన 219 ప్రకారము రాష్ట్ర హైకోర్టుకు నియుక్తిని పొందిన ప్రతి న్యాయమూర్తి రాష్ట్ర గవర్నరు సమక్షంలోగాని, అతను నియమించిన అధికారి సమక్షంలోగాని పదవి స్వీకార ప్రమాణం చేయాల్సి ఉంటుంది.

## 8.7 న్యాయమూర్తుల తొలగింపు :

సుప్రీం కోర్టు న్యాయమూర్తులను తొలగించు పద్ధతిలోనే హైకోర్టు న్యాయమూర్తులను కూడా 124వ భారత రాజ్యాంగ నిబంధన ప్రకారం భారత పార్లమెంట్ ప్రత్యేక తీర్మానం ద్వారా తొలగించవచ్చును. అంటే హైకోర్టు ఏ న్యాయమూర్తి పై చేసిన ఆరోపణలను పార్లమెంటు ఉభయ సభలు విడివిడిగా చర్చించి, ప్రతి సభలో హాజరై ఓటు చేసిన వారిలో 2/3 వంతు మెజార్టితో బాటు, మొత్తం సభ్యుల మెజారిటీతో తొలగింపు తీర్మానాన్ని ఆమోదిస్తేచాలు. ఆ తీర్మాన ఆమోదు పత్రాన్ని ఆధారంగా రాష్ట్రపతి నిందకు గురైన న్యాయమూర్తిని పదవి నుండి తొలగిస్తూ ఆదేశాలు జారీచేస్తారు. ఇది చాలా కష్టతరమైన విషయం. ఈ పద్ధతి ద్వారా ఇప్పటి వరకు మన రాష్ట్రంలో ఏ న్యాయమూర్తిని తొలగించ లేదు.

## 8.8 స్వతంత్ర ప్రతిపత్తి :

సుప్రీం కోర్టువలనే రాష్ట్ర హైకోర్టు స్వతంత్ర ప్రతిపత్తిని కాపాడటానికి రాజ్యాంగం ఈ దిగువ పేర్కొన్న ఏర్పాట్లును చేసింది.

1. భారత రాజ్యాంగ నిబంధన 218 ప్రకారం హైకోర్టు న్యాయమూర్తులను దుష్ప్రవర్తన లేక అసమర్ధత కారణాలపై తొలగించ వచ్చు. అయితే తొలగింపు పద్ధతి అంత సులభమైంది కాదు. పార్లమెంట్‌లో విడివిడిగానే గాక మొత్తంగా కూడా 2/3 మెజార్టీ సభ్యుల ఆమోదం అవసరం.

2. భారత రాజ్యాంగ నిబంధన 221 ప్రకారం న్యాయమూర్తుల జీతభత్యాలు ఇతర అలవెన్సులు, పింఛను మొదలైనవన్నీ రాష్ట్ర సంఘటిత నిధి నుంచి చెల్లించటం జరుగుతుంది.

## 8.9 హైకోర్టు అధికారాలు - విధులు మరియు పరిధి :

రాష్ట్ర హైకోర్టుకు ఈ క్రింది అధికారాలు కలవు.

### 8.9.1 మౌలిక పరిధి :

ప్రస్తుతం మన దేశంలో ఉన్న ఇతర రాష్ట్రాల హైకోర్టుల వలనే మన రాష్ట్ర హైకోర్టు కూడా లెటర్స్ పేటెంట్, సెంట్రల్ ఎండ్ స్టేట్ ఆక్ట్ (Letters Patents, Central and State Acts) చేత నియంత్రతమవుతుంది. ముఖ్యంగా హైకోర్టు సివిల్, క్రిమినల్ ప్రోసిజర్ నిబంధన (కోడ్) చేత నియంత్రణమవుతుంది.

### 8.9.2 అప్పీలు పరిధి :

దిగువ కోర్టులు (జిల్లా సివిల్ కోర్టు, సెషన్స్ కోర్టులు) నుండి వచ్చు సివిల్, క్రిమినల్ కేసుల అప్పీళ్ళు విచారించు అధికారం రాష్ట్ర హైకోర్టుకు కలదు.

### 8.9.3 అజమాయిషీ అధికారం :

భారత రాజ్యాంగ నిబంధన 217 ప్రకారం రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న అన్ని దిగువ న్యాయస్థానాలపై హైకోర్టుకు అజమాయిషీ అధికారం కలదు. దిగువ కోర్టులు లేదా ట్రిబ్యునళ్లలో ఫిర్యాదుదార్లకు అన్యాయం జరుగుతుందన్న అనుమానం ఏర్పడ్డప్పుడు లేదా అవి తమ అధికారాన్ని దుర్వినియోగం చేస్తున్నాయనో భావించినప్పుడు ఆ కోర్టులు లేక ట్రిబ్యునళ్ల నుంచి తమకు అప్పీలు రాకున్నప్పటికీ వాటిల్లో జోక్యం చేసుకొన వచ్చును. అవసరాన్ని బట్టి కేసును పునర్విచారణ చేసి సంబంధిత వ్యక్తులకు న్యాయం చేయవచ్చును. అయితే అడ్మినిస్ట్రేటివ్ ట్రిబ్యునళ్లను హైకోర్టు అజమాయిషీ పరిధి నుంచి మినహాయించారు.

### 8.9.4 రిట్‌ల అధికారం :

భారత రాజ్యాంగం 3వ భాగంలో పేర్కొన్న ప్రాథమిక హక్కుల రక్షణ నిమిత్తమేగాక సాధారణ చట్టపరంగా పౌర హక్కులకు భంగము కలిగినట్లు అయితే ఈ దిగువ పేర్కొన్న రిట్‌లను జారీ చేయవచ్చును. రిట్‌లనగా తప్పనిసరిగా పాటించాల్సిన కోర్టు ఆదేశాలు. ఆ రిట్‌లు ఇవి :

ఎ) హెబియస్ కార్పస్
నిర్భందితుడైన వ్యక్తిని కోర్టులో హాజరు పరచాలని ఆదేశం.

బి) మాండమస్
ఒక అధికారి లేక సంస్థ లేక వ్యవస్థ తమ విధ్యుక్త బాధ్యతను నిర్వర్తించనప్పుడు దాన్ని నిర్వర్తించాల్సిందని చెప్పే ఆదేశం.

సి) ప్రొహిబిషన్
ఒక ఉన్నత న్యాయస్థానం తన క్రింది న్యాయస్థానానికి కేసు విచారణను నిలుపు చేయాల్సిందనే ఆదేశం.

డి) సెర్షియోరరీ

దిగువ కోర్టు చేస్తున్న కేసు విచారణను ఆపించి, దాన్ని వేరు కోర్టుకు బదిలీ చేయడానికి సంబంధించిన ఆదేశం.

ఇ) కో వారంటో

చట్ట రీత్యా అర్హత లేకున్నా పదవిలో అధికారాన్ని చెలాయించడాన్ని నివారించడానికై ఉద్దేశించిన ఆదేశం.

రిట్టులను జారీ చేసే విషయంలో రాష్ట్ర హైకోర్టుకు సుప్రీంకోర్టు కంటే విస్తృతమైన అధికారం ఉన్నదని చెప్పవచ్చు. సుప్రీంకోర్టుకు కేవలం ప్రాథమిక హక్కులకు భంగం కలిగిన కేసులతోనే సదరు రిట్టులను జారీ చేసే అధికారం ఉంది. కాని రాష్ట్ర హైకోర్టు విషయం అట్లా కాదు. ప్రాథమిక హక్కులకు భంగం కలిగిన కేసులలోనే గాక, సాధారణ చట్టాల అమలు మూలంగా కూడా ఒక పేరుని చట్టపరమైన హక్కుకు భంగం కలిగితే హైకోర్టు రిట్‌లను జారీ చేయవచ్చు.

## 8.9.5 న్యాయ సమిక్ష :

భారత రాజ్యాంగము 3వ భాగంలో పేర్కొనబడిన ప్రాథమిక హక్కులకు భగం కలిగే రీతిలో రాష్ట్రశాసన సభ చేసే చట్టాలుగాని, రాష్ట్ర కార్యనిర్వాహక శాఖ జారీ చేసే ఆదేశాలు, ఆర్డినెన్స్‌లుగాని పౌరుని ప్రాథమిక హక్కులను హరించే విధంగా ఉన్నట్లైతే అలాంటి శాసనాలు, ఆదేశాలు లేదా ఆజ్ఞలు చెల్లవని, అవి రాజ్యాంగ విరుద్ధమని చెప్పే అత్యున్నత అధికరాం సుప్రీమ్ కోర్టుతో పాటు హైకోర్టుకు కూడా కలదు అలాంటి అత్యున్నత అధికారన్నే న్యాయ సమీక్షాధికారం (Judicial Review) అందురు.

ఉదాహరణ ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి డాక్టరు వై.యస్. రాజశేఖర్‌రెడ్డి నాయకత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వ 5% రిజర్వేషన్‌న్నూ విద్యా సంస్థల్లో, ఉద్యోగాల్లో ముస్లింలకు కల్పిస్తూ జారీచేసిన జి.ఓ. (ప్రభుత్వ కార్యనిర్వాహక ఆదేశం)ను మన రాష్ట్ర హైకోర్టు చెల్లదని, రాజ్యాంగ విరుద్ధమని తీర్పు ఇచ్చినది. అదే విధంగా యన్.టి.ఆర్. నాయకత్వంలోని తెలుగుదేశం ప్రభుత్వ కాలం నందు కూడా రాష్ట్రంలో గ్రామాధికార్ల పదవుల రద్దు కేసు, రాష్ట్ర ప్రభుత్వోద్యోగుల రటైర్మెంట్ వయోపరిమితిని 58 నుంచి 55కు తగ్గించడం మొదలగునవి ఈ కోవకు చెందినవే.

భారత రాజ్యాంగములోని 226వ నిబంధననుసరించి భారత పౌరు[illegible] వ్యక్తు[illegible]వలన గాని, ప్రభుత్వ చర్యలవలన గాని నష్టం వాటిల్లనప్పుడు ప్రత్యక్షం (Direct) గా హైకోర్టును ఆశ్రయించి న్యాయం పొందవచ్చును.

## 8.9.6 కోర్టు ఆఫ్ రికార్డు :

భారత రాజ్యాంగ నిబంధన 215 ననుసరించి ప్రతి రాష్ట్ర హైకోర్టును కోర్టు ఆఫ్ రికార్డుగా ప్రకటించినది. అనగా హైకోర్టు ఇచ్చిన తీర్పులను రికార్డు చేసి భద్రపరచబడును. మున్ముందు అలాంటి కేసులే దిగువ కోర్టు (సబార్డినేట్)ల్లో కూడా వచ్చినట్లైతే న్యాయవాదులు గతంలో హైకోర్టు ఇచ్చిన తీర్పులను ఉటంకిస్తారు. భారత రాజ్యాంగ నిబంధన 129 ప్రకారం సుప్రీం కోర్టుకు ఏ విధంగా కోర్టు ఆఫ్ రికార్డు అధికారాలు కలిగి ఉన్నాయో అలాంటి అధికారములే రాష్ట్ర హైకోర్టుకు కలవు.

## 8.10 రాష్ట్ర హైకోర్టులపై కేంద్ర ప్రభుత్వ నియంత్రణ :

భారత సమాఖ్య వ్యవస్థలో రాష్ట్ర హైకోర్టులు సుప్రీం కోర్టుతో అనుబంధంగా ఉండి కేంద్ర ప్రభుత్వ నియంత్రణకులోనై ఉన్నాయి. కేంద్ర ప్రభుత్వం రాష్ట్ర హైకోర్టులపై దిగువ [illegible] పద్ధతుల్లో నియంత్రణ చేస్తుంది.

1 భారత రాజ్యాంగ నిబంధన 217 ప్రకారం ప్రధాన న్యాయమూర్తితో సహా ఇతర న్యాయమూర్తుల నియామకం రాష్ట్రపతి చేస్తాడు.

2 ఒక హైకోర్టులో న్యాయమూర్తిగా పని చేస్తూ ఉండే వ్యక్తిని వేరే హైకోర్టుకు కేంద్ర ప్రభుత్వం బదిలీ చేస్తుంది.

3 ఒక ప్రత్యేక పద్ధతిలో పార్లమెంట్ ఆమోదించిన తీర్మానం ఆధారంగా కేంద్రప్రభుత్వం న్యాయమూర్తులను తొలగించే అధికారం ఉంది.

4 భారత రాజ్యాంగ నిబంధన 217(3) ప్రకారం ఏ న్యాయమూర్తి జన్మ తేదీకి సంబంధించి వివాదం ఉత్పన్నమైనట్లైతే, ఆ వివాదాన్ని భారత రాష్ట్రపతి ద్వారా కేంద్ర ప్రభుత్వం పరిష్కరిస్తుంది.

5 పార్లమెంట్ చట్టరీత్యా రాష్ట్ర హైకోర్టు అధికార పరిధిని విస్తరించ వచ్చును.

## 8.11 జిల్లాల్లో న్యాయ వ్యవస్థ - సివిల్ కోర్టులు :

ఆంధ్రప్రదేశ్ ఏర్పాటు కాకపూర్వం ఆంధ్రప్రాంతంలో మద్రాస్ సివిల్ కోర్టుల చట్టం, తెలంగాణా ప్రాంతంలో పూర్వపు (నిజాం) హైదరాబాద్ సివిల్ కోర్టు చట్టాలు అమల్లో ఉండేవి. 1972లో ఆంధ్రప్రదేశ్ సివిల్ కోర్టుల చట్టాన్ని రాష్ట్ర శాసనసభ ఆమోదించగా సమగ్ర ఆంధ్రప్రదేశ్‌కు ఒకే విధమైన పద్ధతిని అనువర్తింప చేసారు.

### 8.11.1 జిల్లా కోర్టు :

ఈ చట్టం ప్రకారం ప్రతి జిల్లాలో ఒక జిల్లా కోర్టు ఉంటుంది. దానికి జిల్లా జడ్జి అధిపతి. జిల్లా పరిధిలో మౌలికాధికారం గల కోర్టు ఇదే. ఈ కోర్టు రూ. 15,000లకు మించని కేసుల్లో మున్సిఫ్ మెజిస్ట్రేట్, సబార్డినేట్ జడ్జీ కోర్టుల నుంచి వచ్చిన అప్పీళ్లను విచారిస్తుంది. ప్రాంతీయ ఇన్సాల్వెన్సి ఆక్టు, భూసేకరణ చట్టం, హిందూ వివాహ చట్టం విషయాల్లో జిల్లా కోర్టుకు మౌలికాధికారం ఉంది. ఆంధ్రప్రాంతంలో ఎస్టేట్స్ అబాలిషన్ ఆక్టు క్రింద విచారించే కేసుల్లో జిల్లా కోర్టు ట్రిబ్యునల్‌గా వ్యవహరిస్తుంది.

ఇవిగాక జిల్లా పరిధిలోని దిగువ కోర్టులపై హైకోర్టు పర్యవేక్షణలో జిల్లా కోర్టు పరిపాలన పరమైన నియంత్రణాధికారాన్ని చెలాయిస్తుంది. దిగువ సిబ్బంది నియామకం, బదిలీలు, తొలగింపు మొదలగు అధికారాలు ఈ కోర్టుకు కలవు.

### 8.11.2 సబార్డినేట్ కోర్టులు :

అదిలాబాద్, మెదక్ జిల్లాలు మినహా ఇంచుమించు అన్ని జిల్లాల్లో సబార్డినేట్ కోర్టులున్నాయి. ఆంధ్రప్రాంతం జిల్లాల్లో సబార్డినేట్ జడ్జీలకు అపరిమితమైన మౌలిక సివిల్ అధికార పరిధి ఉంది. జిల్లాలోని ఇతర స్థలాల్లో ఉండే సబార్డినేట్ జడ్జి కోర్టులు, జిల్లా మున్సిఫ్‌లు జారీ చేసిన డిక్రీలు, ఆదేశాలపై వచ్చే అప్పీళ్లను గూడావిచారిస్తాయి. కాని తెలంగాణా ప్రాంత సబ్ జడ్జీలకు అప్పీళ్లను విచారించే అధికారం లేదు. అయితే, ఆంధ్రప్రదేశ్ బిల్డింగ్ కంట్రోల్ (లీజు, రెంట్, ఖాళీ చేయించడానికి సంబంధించిన) చట్టం 1960 క్రింది వచ్చే కేసుల్లో మాత్రం అప్పీళ్లను తెలంగాణా ప్రాంత సబ్ జడ్జిలు విచారిస్తారు. సబార్డినేట్ జడ్జీలందరూ రూ. 2,000లకు మించని చిన్నచిన్న ఫిర్యాదులను అప్పు ఎగవేత (అప్పు మొత్తం రూ 5,000లకు మించిన సందర్భాల్లో మాత్రమే) కేసులను కూడా విచారిస్తారు.

### 8.11.3 మున్సిఫ కోర్టులు :

జిల్లా మున్సిఫ్ కోర్టు లేదా మున్సిఫ్ మెజిస్ట్రేట్ కోర్టు చాలా చిన్న కోర్టు. ఇది సాధారణంగా తాలూకా స్థాయిలో ఏర్పాటు చేయబడుతుంది. ఈ కోర్టులు రూ. 10,000ల పరిమితి విలువ గల కేసులు విచారించడానికి అధికారం ఉంది. చిన్న కేసుల విషయంలో మాత్రం మున్సిఫ్ అధికారం రూ. 500లకు మించదు.

పౌర కోర్టు (ఙరిఖీరిజి ఏళితిజీశి) అధికార పరిధి ముఖ్యంగా ఈ క్రింది పేర్కొన్న జిల్లాలకు వర్తించదు.

1 తూర్పు గోదావరి

2 పశ్చిమ గోదావరి

3 విశాఖపట్నం

4 శ్రీకాకుళం

ఈ జిల్లాల్లో రెవిన్యూ డివిజనల్ ఆఫీసర్లు, తహసీల్దార్లు (తహసీల్దార్ల పదవి రద్దు చేయబడినది) సివిల్ కోర్టు అధికారం చెలాయిస్తారు.

### 8.11.4 జిల్లా న్యాయవ్యవస్థ - క్రిమినల్ కోర్టులు :

#### సెషన్స్ కోర్టులు :

క్రిమినల్ ప్రొసీజర్ కోడ్ నిబంధనల ప్రకారం ప్రతి రాష్ట్రాన్ని కొన్ని సెషన్స్ విభాగాలుగా విభజించి, ప్రతి సెషన్స్ కోర్టుకు ఒక సెషన్స్ జడ్జి, అదనపు సెషన్స్ జడ్జీలను, అసిస్టెంట్ సెషన్స్ జడ్జీలను నియమించడం, వారికి వారి అధికార పరిధిని నిర్దేశించే పద్ధతి మన దేశంలో ఆచరణలో ఉంది.

మన రాష్ట్రంలో సెషన్స్ జడ్జీల అధికార పరిధి జిల్లా జడ్జీల అధికార పరిధి సమానంగా ఉన్నాయి. జిల్లా జడ్జీలు క్రిమినల్ కేసుల విచారణ సమయంలో సెషన్స్ జడ్జీలుగా వ్యవహరిస్తారు.

### 8.11.5 అధికారాలు - విధులు :

1. ఒక సెషన్స్ జడ్జి తమకు దిగువన మెజిస్ట్రేట్ విచారించిన కేసులను విచారణకు స్వీకరిస్తాడు లేదా దిగువ మెజిస్ట్రేట్లు తామి విచారించిన కేసులపై తీర్పు చెప్పగా, ఆ తీర్పుపై అప్పీళ్లను స్వీకరిస్తాడు.
2. సెషన్స్ జడ్జీలు, అదనపు సెషన్స్ జడ్జీలు చట్ట రీత్యా నేరస్తులను శిక్ష విధిస్తారు. అయితే వీరు నేరస్తులకు మరణశిక్ష విధిస్తే మాత్రం హైకోర్టు ధృవీకరించాల్సి ఉంటుంది.
3. అసిస్టెంట్ సెషన్స్ జడ్జి శిక్షణను 10 సంవత్సరాల వరకు విధించవచ్చును.

### 8.11.6 మెజిస్ట్రేట్ కోర్టులు :

సెషన్స్ కోర్టుల దిగువన ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్, సెకండ్ క్లాస్ మెజిస్ట్రేట్ కోర్టులుంటాయి. ఫస్ట్‌క్లాస్ మెజిస్ట్రేట్‌లో ఒకరిని చీఫ్ జుడిషియల్ మెజిస్ట్రేట్ అని పిలుస్తారు. ఇతని క్రింద ఇతర మెజిస్ట్రేట్‌లు పని చేస్తారు.

### 8.11.7 అధికారాలు - విధులు :

1. చీఫ్ జుడిషియల్ మెజిస్ట్రేట్ నేరస్తునికి ఏ శిక్షనైనా విధించవచ్చును. కాని, జీవిత ఖైదుగానీ, 7సంవత్సరాల పరిమితిగల శిక్షనుగాని, లేదా మరణశిక్షనుగాని విధించజాలడు.

2. ఫస్ట్‌క్లాస్ మెజిస్ట్రేట్‌కు 3 సంవత్సరాల జైలు శిక్షను లేదా రూ. 5,000 జరిమానాను విధించే అధికారం ఉంది.

3. సెకండ్‌క్లాస్ మెజిస్ట్రేట్‌కు ఒక ఏడాది జైలు శిక్ష విధించడంతో పాటు రూ. 1,000ల జరిమానా విధించవచ్చును. జిల్లాల్లో నేరాల సంఖ్యను బట్టి వాటి సత్వర పరిష్కారం కోసం రాష్ట్ర ప్రభుత్వం సెకండ్‌క్లాస్ మెజిస్ట్రేట్ పదవులను ఏర్పాటు చేయవచ్చును.

## 8.12 రాజధాని నగరంలో (దిగువ) న్యాయ వ్యవస్థ :

రాష్ట్ర రాజధాని నగరం హైదరాబాద్‌లో న్యాయవ్యవస్థను 01-04-1958 నుంచి అమలుకు వచ్చే విధంగా పునర్వ్యవస్థీకరించారు. ఈ వ్యవస్థీకరణలో మద్రాస్ నగర పద్ధతిని అనుసరించారు. ఈ చట్టాన్ని అనుసరించి సిటీ సివిల్ కోర్టు, సిటీ క్రిమినల్ కోర్టు కలవు. వీటితో పాటు మెట్రోపాలిటన్ మెజిస్ట్రేటు కోర్టులు మరియు మొబైల్ కోర్టులు కలవు.

## 8.13 సారాంశం :

భారత రాజ్యాంగము సమాఖ్య (Federal System) వ్యవస్థను రూపొందించినది. కేంద్రస్థాయిలో అత్యున్నత న్యాయస్థానమైన సుప్రీం కోర్టు మాదిరిగానే రాష్ట్ర స్థాయిలో కూడా హైకోర్టును ఉన్నత న్యాయస్థానంగా రూపొందించింది. సుప్రీం కోర్టు మాదిరిగానే రాష్ట్ర హైకోర్టు కూడా రిట్లను జారీ చేయుటకు, స్టేలు మంజూరు చేయుటకు అధికారం కలదు. సుప్రీం కోర్టుమాదిరిగానే న్యాయ సమీక్షాధికారం కూడా కలదు. మన రాష్ట్రంలో యన్.టి.ఆర్. నాయకత్వంలో తెలుగుదేశం పాలనా కాలంలో నూటికి 80% ప్రభుత్వ ఆదేశాలు న్యాయసమీక్షాధికారం ద్వారానే రాష్ట్ర హైకోర్టు తీర్పుకు బలైనాయి. రాష్ట్ర స్థాయిలో పౌరుల పౌరహక్కులకు మరియు ప్రాథమిక హక్కులకు సంరక్షకులుగా వ్యవహరించుచున్నది. రాష్ట్ర హైకోర్టు అజమాయిషీలో రాష్ట్రంలోని దిగువ కోర్టులు పనిచేస్తూ, ప్రైవేట్ వ్యక్తుల దౌర్జన్యాల నుండి పౌరుల ధన, మాన, ప్రాణ, ఆస్తిపాస్తులకు రక్షణ కల్పిస్తున్నాయి. రాష్ట్ర హైకోర్టు తన స్వతంత్ర ప్రతిపత్తిని తన నిర్భయమైన నిష్పక్షపాతమైన తీర్పుల ద్వారా తమ ఉనికిని చాటుకొనుచున్నది.

## 8.14 నమూనా ప్రశ్నలు :

1. రాష్ట్ర హైకోర్టు నిర్మాణమును గూర్చి వ్రాయుము.
2. రాష్ట్ర హైకోర్టు అధికారములు - విధులను పేర్కొనుము.
3. రాష్ట్రంలోని దిగువ న్యాయస్థానముల నిర్మాణమును, అధికార విధులను పేర్కొనుము.

### లఘురూప ప్రశ్నలు :

1. న్యాయసమీక్ష అనగానేమి?
2. హైకోర్టు న్యాయపరిధి పేర్కొనుము.

## 8.15 చదువదగిన గ్రంథాలు :


1. Constitutional Law - S. N. Panda
2. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం - రాజకీయాలు - కె. పాండురంగం
3. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం - రాజకీయాలు - డా॥ కె.ఆర్. ఆచార్య (Ed)
4. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం - రాజకీయాలు - యమ్. సత్యనారాయణ రావు


డా. యం. పాండురంగారావు

పాఠం - 9

# రాజకీయ పార్టీలు

## 9.0 లక్ష్యం

ప్రజాస్వామ్యంలో రాజకీయ పక్షాలు తప్పనిసరి మరియు అనివార్యం. రాజకీయ పక్షాలు లేని ప్రజాస్వామ్యం నటులు లేని రంగస్థలం లాంటిది. ప్రజలను చైతన్యవంతులుగా చేయడానికి, ప్రజాప్రతినిధులను ఎంపిక చేసుకోవటంలో సహాయపడటానికి ప్రజా సమస్యలను పరిష్కరించడానికి, ప్రత్యామ్నాయాలను చర్చించడానికి, ప్రజల సమస్యలను, వారికి జరుగుతున్న అన్యాయాలను ప్రభుత్వం దృష్టికి తీసుకురావడానికి రాజకీయ పక్షాలు ముఖ్య సాధనాలు. ప్రాతినిధ్య ప్రజాస్వామ్య మనుగడకు రాజకీయ పక్షాలు చాలా ముఖ్యం. మరోమాటలో చెప్పాలంటే రాజకీయ పక్షాలు ప్రజాస్వామ్యానికి ప్రాణవాయువులాంటివి. రాజకీయ పక్షం అంటే ఏమిటి ? రాజకీయ పక్షానికి, సామాజిక సమూహానికి బేధాన్ని గురించి, రాజకీయ పార్టీల స్వభావం మరియు ఆంధ్రప్రదేశ్‌లోని రాజకీయ పక్షాల గురించి, ప్రజాస్వామ్యంలో రాజకీయ పక్షాల ప్రాముఖ్యం గురించి వివరించడం ఈ పాఠం యొక్క ముఖ్య లక్ష్యం.

**విషయసూచిక :**


9.1 రాజకీయ పార్టీలు - పరిచయం

9.2 రాజకీయ పార్టీ - నిర్వచనాలు

9.3 రాజకీయ పార్టీలు - స్వభావం

9.4 రాజకీయ పార్టీలు - లక్షణాలు

9.5 రాజకీయ పార్టీలు - విధులు

9.6 భారతదేశంలో రాజకీయపార్టీల స్వరూప స్వభావాలు

9.7 ఆంధ్రప్రదేశ్‌లో రాజకీయ పార్టీలు

- 9.7.1. కాంగ్రెస్ పార్టీ
- 9.7.2. భారతీయ జనతా పార్టీ
- 9.7.3. జనతా పార్టీ
- 9.7.4. లోక్‌దళ్
- 9.7.5. కమ్యూనిస్ట్ పార్టీ
- 9.7.6. స్వతంత్ర పార్టీ
- 9.7.7. ప్రజా సోష్టి
- 9.7.8. సోషలిస్ట్ పార్టీ
- 9.7.9. తెలుగుదేశం

9.7.10. తెలంగాణా రాష్ట్రీయ సమితి

9.7.11. మజ్లిస్ పార్టీ

9.8. ముగింపు

9.9. సారాంశము

9.10. నమూనా ప్రశ్నలు

9.11. చదువదగిన గ్రంథాలు

## 9.1. రాజకీయ పార్టీలు - పరిచయం :

ప్రజాస్వామ్య దేశాలలో రాజకీయ పార్టీలు అంతర్లీనంగా ఉండి ముఖ్య భూమికను పోషిస్తున్నాయి. ప్రాతినిధ్య ప్రజాస్వామ్య దేశాలలో అధికారపార్టీ ఎక్కువ శక్తిని కలిగి ఉండి, ప్రతిపక్ష పార్టీలు బలహీనంగాగాని, అధికారపార్టీతో ఇంచుమించు సమాన బలాన్ని గాని కలిగి ఉండి నిర్మాణాత్మకమైన పాత్రను నిర్వహిస్తున్నాయి. నియంతృత్వ ప్రభుత్వంలో అధికారం మొత్తం వ్యక్తి లేదా పార్టీ చేతిలో నిబిడీకృతమై ప్రతిపక్ష పార్టీల ఉనికిని ఉక్కుపాదంతో అణచివేస్తాయి. అయితే ప్రజాస్వామ్య ప్రభుత్వంలో రాజకీయ పార్టీల నిర్మాణం నియంతృత్వ వ్యవస్థకు భిన్నంగా వుంటుంది. ప్రజాస్వామ్యంలో రాజకీయ పార్టీలు వివిధ స్థాయిల్లో ప్రజలచే ఎన్నుకోబడి నియంత్రణ చేయబడతాయి. ఆధునిక కాలంలో వ్యవస్థాగత రాజకీయ పార్టీలు 18వ శతాబ్దం చివరలో ఆవిర్భవించాయి. రాజకీయ అధికారానికి వెలుపల ఉన్నటువంటి కొన్ని వర్గాలు ప్రభుత్వంలో స్థానాన్ని పొంది ప్రభుత్వంపై పట్టు సాధించాలనే ప్రయత్నమే రాజకీయ పార్టీల స్థాపనకు దారి తీసింది. పార్టీ వ్యవస్థ అనేది ఆధునిక ప్రజాస్వామ్య వ్యవస్థకు మూలమై ప్రజాస్వామ్యానికి అస్థి పంజరంలా ఒక నిర్దిష్టమైన ఆకృతిని ఇస్తుంది. రాజకీయ పార్టీలు ఉండటం వలన విస్తృతమైన రాజకీయ భాగస్వామ్యం సాధ్యమౌతుంది. రాజకీయ పార్టీలు లేని ప్రజాస్వామ్యాన్ని ఊహించటం కష్టమౌతుంది. నేటి కాలంలో అన్ని దేశాల రాజకీయ వ్యవస్థలలో రాజకీయ పార్టీలు తమదైన శైలిలో విభిన్నమైన పాత్రను పోషిస్తున్నాయి.

## 9.2. రాజకీయ పార్టీలు - నిర్వచనాలు :

'ఎడ్మండ [illegible] ప్రాయంలో "తమ సమిష్టి కృషి ద్వారా జాతీయ ప్రయోజనాలను పెంపొందింపజేసేందుకు కొన్ని రాజకీయ సూత్రాలపై అంగికార[illegible] కుదుర్చుకొని సమైక్యతగల వ్యక్తుల సముదాయమే రాజకీయ పక్షం.

లార్డ్ బ్రైస్ రాజకీయ[illegible] నిర్వచిస్తూ "జాతీయ శ్రేయస్సును పెంపొందింపజేసేందుకు కొన్ని సిద్ధాంతాల ఆధారంగా ఒక సంఘటిత శక్తిగా రూపొంది, ప్రభుత్వాధికారాన్ని [illegible]పట్టి లేదా చేపట్టడానికి ప్రయత్నిస్తూ తమ సిద్ధాంతాలను, కార్యకలాపాలను సమిష్టి కృషి ద్వారా ఆచరణలో పెట్టడానికి సంకల్పించే ప్రజా సమూహమే రాజకీయ పక్షం" అని వివరించారు.

ఆ విధంగా కొన్ని సిద్ధాంతాలను ప్రాతిపదికగా చేసుకొని, "సమిష్టి ప్రయోజనాలను సాధించడానికి అవసరమైన అధికారాన్ని సముపార్జించడానికి ఒక సముహంగా ఏర్పడిన కొంత మంది వ్యక్తుల సముదాయమే రాజకీయ పక్షంగా" చెప్పవచ్చును. రాజకీయ పార్టీ ముఖ్యంగా ప్రభుత్వాధికారాన్ని చేజిక్కించుకొని తద్వారా విధాన నిర్ణయాలను రూపొందించడం ద్వారా దేశంలోని వివిధ వర్గాల ప్రజల ప్రయోజనాలు సిద్ధింపజేయడానికి నిర్దిష్టమైన ఉనికిని కలిగి ఉంటాయి. రాజకీయ పక్షాలు స్పష్టమైన ఒక ధ్యేయాన్ని కలిగి ఉండి కొన్ని రాజకీయ సిద్ధాంతాలకు, నియమాలకు కట్టుబడి ఒక దేశ రాజకీయ వ్యవస్థలో క్రియాశీలక పాత్రను పోషిస్తున్నాయి.

## 9.3 రాజకీయ పార్టీలు - స్వభావం :

సిగ్మండ్ న్యూమాన్ చెప్పినట్లుగా "ఆధునిక రాజకీయాలకు రాజకీయపార్టీలు జీవ చైతన్యాలు" (Political Parties are the life - lines of modern Politics) సమాజంలో మత వర్గ జాతి విభేదాలు ఉండటం మూలంగా రాజకీయ పార్టీలు ఈ వర్గీకరణ చుట్టూ స్థాపించబడవని రాజకీయ శాస్త్రవేత్తలు తేల్చి చెప్పారు. ఒకటి లేదా కొన్ని వర్గాలలో చోటు చేసుకున్న చారిత్రక అనుభవాల మూలంగా వీరికి రాజకీయ అవగాహన పెరిగిన కారణంగా రాజకీయ పార్టీలన్ను ఏర్పాటు చేయటం జరగవచ్చు. మత, సాంస్కృతిక ఆధిపత్యం ఉన్నటువంటి వర్గాలు కూడా రాజకీయ పార్టీలను స్థాపించటం జరుగుతుంది. ఏ రాజకీయ పార్టీ కార్యకలాపాలైనా చాలా వరకు అందులో ఉండే వర్గాల మీద ఆధారపడి పౌర లక్ష్యాలను సాధించడానికి కృషి చేస్తారు. ప్రభుత్వాల పని తీరు, సామర్థ్యం, వాటి భవిష్యత్తు రాజకీయ పార్టీలపై ఆధారపడి ఉంది. రాజకీయ పార్టీలు లేని ప్రజాస్వామ్యాన్ని ఊహించడం కష్టం. స్వభావం రీత్యా రాజకీయ పార్టీలు రాజ్యాంగేతర సంస్థల క్రిందికి వస్తాయి. అయినప్పటికీ అని రాజ్యాంగ పవిత్రతను గౌరవించి దాని పరిధికి లోబడి ప్రజాస్వామ్య ప్రభుత్వ యంత్రాంగాన్ని క్రియాశీలకం చేస్తుంటాయి. ఈనాడు ఇంచుమించుగా అన్ని రాజకీయ వ్యవస్థల విధాన ప్రక్రియల రూపకల్పనలో రాజకీయ పార్టీలు విభిన్న భూమికలను పోషిస్తున్నాయి.

**9.3.1. రాజకీయ పక్షం, సామాజిక సమూహం ఒకటే కాదు :** కుటుంబం, చర్చి మరియు వ్యాపార సంస్థల వలె రాజకీయ పక్షం సామాజిక సమూహం కాదు. రాజకీయ పార్టీల ముఖ్య లక్ష్యం రాజకీయ శక్తిని సాధించి, ఇతర పార్టీల సహకారంతో సాధించిన శక్తిని కాపాడుకోవటమే. ఈ శక్తిని సాధించడానికి పార్టీలోని సభ్యుల సిద్ధాంత భాగస్వామ్యం అవసరం. ఇతర సామాజిక సంస్థల వలే కాకుండా రాజకీయ పక్షం తన సభ్యులపై ఆధారపడిన రాజకీయ సంస్థ. అందుచేతనే రాజకీయ పక్షం సామాజిక ఆర్థిక అభీష్టాలకు ఆహ్వానం పలుకుతుంది. రాజకీయ పక్షం సమాజంలోని వివిధ వర్గాల సంస్థల ప్రయోజనాలకు ప్రాతినిధ్యం వహిస్తుంది. రాజకీయ పార్టీ అనేక రకాల విధులను నిర్వర్తిస్తుంది. వివిధ వర్గాల అభీష్టాల మొత్తానికి (Aggregation of interests) ప్రాతినిధ్యం వహించడమనే విధి చాలా ముఖ్యమైనదిగా చెబుతారు.

## 9.4. రాజకీయ పార్టీలు - లక్షణాలు :

ప్రపంచంలోని ప్రజాస్వామిక దేశాలలో ఉన్న రాజకీయ పార్టీలను పరిశీలించినట్లయితే వాటిని ప్రత్యేక లక్షణాలుండటం మనం గమనించవచ్చు.

1. రాజకీయ పార్టీలోని సభ్యులు కొన్ని రాజకీయ సిద్ధాంతాలు, సూత్రాలపై ఆధారపడి ఒక వ్యవస్థగా ఏర్పడతారు.
2. పార్టీలోని సభ్యులందరి మధ్య సత్ సంబంధాలు నెలకొని ఉండాలి.
3. పార్టీతో అమితమైన అనుబంధం ఉన్నప్పటికీ నాయకులపై పార్టీ ఆధారపడి వుండరాదు. నాయకులకు, పార్టీకి మధ్య ఖచ్చితమైన వైవిధ్యం ఉండాలి.
4. వీలైనంత వరకూ పార్టీ శాంతియుత ప్రజాస్వామిక పద్ధతులను పాటిస్తూ అధికారాన్ని చేజిక్కించుకొని, పథకాలను ప్రణాళికలను అమలు పర్చి వాటి ప్రత్యేక ప్రతిపత్తిని కాపాడుకుంటూ ఉండాలి.

అయితే మన దేశంలో రాజకీయ పక్షాలు తమ విద్యుక్త ధర్మాలను నిర్వహించడానికి ఒక ఖచ్చితమైన పద్ధతిలో ఏర్పడలేదు. నిజానికి ఖచ్చితమైన రాజకీయ పక్షాల అవతరణ 1952 అనంతరం సాధ్యమైంది. ఆ తర్వాత కాలంలో అనేక రాజకీయ పక్షాలు అవతరించాయి. భారత రాజకీయ పక్షాలను క్షుణ్ణంగా అధ్యయనం చేసినట్లయితే వాటికి మిగతా ఉదారవాద ప్రజాస్వామ్యాల్లోని రాజకీయ పక్షాలతో పోలిక లేని కొన్ని ప్రత్యేక లక్షణాలు కనిపిస్తాయి. అవి.

**9.4.1. సిద్ధాంత ప్రత్యామ్నాయత లేకపోవటం :** భారతదేశంలో రాజకీయ పక్షాలకు వర్తించే ఒక ప్రత్యేక లక్షణం ఏమిటంటే సిద్ధాంతపరమైన వ్యత్యాసాలు వాటి మధ్య ఎక్కువగా లేకపోవటం. 1955 తర్వాత రాజకీయ పక్షాలు భూసంస్కరణలు, జమిందారీల రద్దు, కీలక పరిశ్రమలు, బ్యాంకుల జాతీయకరణ మొదలైన సామ్యవాద విధానాలను అనుసరించడంతో సిద్ధాంతపరంగా రాజకీయ పక్షాల మధ్య క్రమంగా మౌళిక వ్యత్యాసాలు తగ్గిపోవటమే కాకుండా అవి ప్రత్యామ్నాయాలను కూడా చూపించలేకపోతున్నాయి. 1960 సంవత్సరాలలో కాంగ్రెస్‌కు ప్రత్యామ్నాయంగా సామ్యవాద సిద్ధాంతాలకు అనుకూలంగా స్వతంత్ర పార్టీ ఉండేది. అయితే ఈ స్వతంత్ర పార్టీ భూస్వాముల, మాజీ సంస్థానాధీశుల, బడా పెట్టుబడిదారులకు ప్రతినిధిగా పేరుపొంది కాలక్రమంలో అదృశ్యమైంది. నేడు కాంగ్రెస్, సి.పి.ఐ., సి.పి.యం., బి.జె.పి., జనతాదళ్ అన్ని పార్టీలూ సామ్యవాదమే మా లక్ష్యమని చెప్పుకుంటున్నాయి. అయితే సిద్ధాంతపరమైన నిబద్ధతగాని, ప్రత్యామ్నాయం పై ఆసక్తిగాని మన రాజకీయ పార్టీల్లో ఎక్కడా కనపడదు. నూటికి యాభై మంది దారిద్ర్యరేఖకు అడుగు స్థాయిలో నివశించే ఓటర్లను ఆకర్షించడానికి వారి ఓట్ల బలంతో అధికారంలోకి రావటానికి సామ్యవాద మొక్కటే తారక మంత్రంగా అన్ని రాజకీయ పక్షాలు గుర్తించాయి. మన రాజకీయ పక్షాల్లో స్పష్టంగా కనిపించే మరొక అంశం ఓటర్లను ఆకర్షించడానికి నినాదాల్లో, విధానాల్లో, వాగ్దానాలను ప్రకటించటంలో ఒక దానితో మరొకటి తీవ్రంగా పోటీ పడుతున్నాయి. ఈ విధంగా సిద్ధాంత ప్రాముఖ్యం తగ్గిపోయి భారతీయ రాజకీయాల్లో ముఖ్యంగా ఎన్నికల సమయంలో జనాకర్షణ విధానాల ప్రాబల్యం పెరిగిపోయింది.

**9.4.2. సంస్థాగత నిర్మాణం :** భారతదేశంలో అనేక రాజకీయ పక్షాలు ఎన్నికల ముందు అవతరించి ఎన్నికల అనంతరం అంతరిస్తూ ఉంటాయి. ఏదోక రూపంలో కొనసాగుతూ ఎన్నికల ముందు మాత్రమే హఠాత్తుగా మరింత క్రియా శీలకంగా రాజకీయ పక్షాలు పనిచేస్తాయి. అనేక స్థాయిల్లో తాత్కాలిక సంఘాలు, ఉప సంఘాలు, నియమిత సంఘాలు, ఉపాధ్యక్షులు సాధారణ కార్యదర్శులతో రాజకీయ పక్షాలు పని చేస్తాయి. ప్రజలను సభ్యత్వం పేరుతో తమ పార్టీ సభ్యులుగా చేర్చుకోడానికి సభ్యత్వ నమోదు ఉద్యమాలు చేపట్టి పోటీ పడుతుంటాయి.

**9.4.3. అంతర్గత ప్రజాస్వామ్యం :** మన రాజకీయ పక్షాల్లో కనిపించే మరొక విలక్షణమేమిటంటే అంతర్గత ప్రజాస్వామ్యం లేకపోవటం. కేంద్రీకృత ప్రజాస్వామ్యం పేరిట ఉభయ కమ్యూనిస్టు పార్టీల్లో నియంతృత్వం కొనసాగుతూ ఉంటే ప్రజాస్వామ్య పరిరక్షణ, ప్రజాస్వామ్య విలువల కొసం నిరంతరం పాటు పడుతున్నాం అని చెప్పుకొనే మిగతా రాజకీయ పక్షాల్లో కూడా ప్రజాస్వామ్య పోకడలు మచ్చుకు కూడా కనపడవు. పై స్థాయి నుండి క్రింది స్థాయి వరకూ అన్ని స్థాయిలలోనూ, స్థానాలలోనూ అధిష్టానం సూచించిన వ్యక్తులను వివిధ పదవులకు నియమించడం,ఎన్నుకోవటం జరుగుతున్నది. జాతీయస్థాయి పార్టీలయిన కాంగ్రెస్, బి.జె.పి.ల నుండి ప్రాంతీయ పార్టీలయిన తెలుగుదేశం, DMK, AIDMK పార్టీల వరకూ వ్యక్తిగత ఆరాధన, వ్యక్తి ఆధారిత నాయకత్వం, నియంతృత్వం కొనసాగుతూనే ఉన్నాయి.

**9.4.4. జనాకర్షణ నాయకత్వం :** వ్యక్తిగత ఆరాధన, వ్యక్తి ఆధారిత నాయకత్వం అనేది మన దేశంలో స్వాతంత్ర్యోద్యమం నాటి కాలం నుండే కొనసాగుతూనే ఉన్నది. అలాగే మన రాజకీయ పక్షాల విజయం మరియు వైఫల్యం చాలా వరకు వాటి నాయకత్వం చుట్టూ పరిభ్రమిస్తూ వుంటాయి. గాంధీ, నెహ్రూ, ఇందిరాగాంధీ, రాజీవ్‌గాంధీల నుండి నేటి సోనియాగాంధీ వరకూ కాంగ్రెస్ పార్టీకి మంచి వ్యక్తి ఆధారిత నాయకత్వాన్ని ఇవ్వగలిగారు. అదే విధంగా DMK కి కరుణానిధి, అన్నా డి.యం.కె.కి యం.జి. రామచంద్రన్ మరియు జయలలిత, తెలుగుదేశానికి యన్.టి. రామారావు మరియు చంద్రబాబునాయుడు, లోక్‌దళ్‌కు చరణ్ సింగ్ తమ తమ వ్యక్తిగత ప్రాబల్యం, ఆకర్షణ శక్తుల ద్వారా తమ రాజకీయ పక్షాలు భారత రాజకీయాల్లో ప్రముఖ పాత్ర వహించేటట్లు చేయగలిగారు మరియు చేస్తున్నారు. ఇటువంటి నాయకత్వంలేని రాజకీయ పక్షాలు ప్రజల్లో ఆదరణను పొందలేకుండా ఉన్నాయి.

**9.4.5. నిరంతర చీలికలు - కలయికలు :** భారత రాజకీయాల్లో స్పష్టంగా కన్పించే మరొక లక్షణం నిరంతర చీలికలు మరియు కలయికలు. 1969లో కాంగ్రెస్ పార్టీ క్రొత్త కాంగ్రెస్ మరియు సంస్థా కాంగ్రెస్‌గా చీలిపోయింది. 1978లో మళ్ళీ కాంగ్రెస్‌లో చీలికవచ్చి ఇందిరా కాంగ్రెస్ మరియు రెడ్డి కాంగ్రెస్‌గా ఏర్పడ్డాయి. అదే విధంగా భారత కమ్యూనిస్టు పార్టీ 1964లో CPI, CPM గా అవతరించాయి.

1969లో CPM నుంచి CPI (ML) ఏర్పడింది. అలాగే 1980లో CPI నుంచి డాంగే విడిపోయి అఖిల భారత కమ్యూనిష్టు పార్టీ స్థాపించుకొన్నాడు. అలాగే, CPM నుండి MCPI ఏర్పాటు చేయటం జరిగింది. చీలికలు అనేవి జాతీయ పార్టీలకే కాక ప్రాంతీయ పార్టీలకు కూడా సాధారణ లక్షణం అనేది నిరూపితమైనది. DK నుండి DMK ఏర్పడింది. DMK నుండి AIDMK అవతరించింది. అలాగే ఆంధ్రప్రదేశ్‌లో తెలుగుదేశం నుండి 1984లో చీలిపోయి ప్రజాస్వామ్య తెలుగుదేశం అవతరించింది. యన్.టి.ఆర్. మరణానంతరం లక్ష్మీపార్వతి తెలుగు దేశం నుండి విడిపోయి TDP (NTR), హరికృష్ణ తెలుగుదేశంగా అవతరించాయి. అకాళీదళ్ మరియు నేషనల్ కాన్ఫరెన్స్‌లు ఇదే విధంగా చీలికలకు గురైనాయి. చీలికలతో బాటు విలీనాలు కూడా సర్వ సాధారణంగా ఒక అంతర్భాగంగా భారత రాజకీయాల్లో కనిపిస్తున్నాయి.

**9.4.6. ముఠా కలహాలు :** మన దేశంలో అనుచరుల కంటే నాయకులే ఎక్కువగా కనిపిస్తారు. ప్రతి రాజకీయపార్టీలో ముఠాలు కట్టే నాయకులు కనిపిస్తారు. వివిధ రాజకీయ స్థాయిల్లో నాయకులతో బాటు ముఠాలు పనిచేస్తాయి. అయితే ఈ ముఠాలన్నీ పార్టీ అగ్రనాయకుని పట్ల విధేయతను చూపిస్తాయి. ఈ ముఠా కలహాలు కాంగ్రెస్ పార్టీలో ఎక్కువగా కనిపిస్తాయి. ఒక్క కాంగ్రెస్‌లోనే కాదు ఇతర జాతీయ పార్టీల్లో కూడా క్రమేపీ బయల్పడుతున్నాయి. ముఠా తగాదాలకు ప్రాంతీయ పార్టీలు అతీతం కాదు. ఈ ముఠా కలహాల వల్లే తరచూ ముఖ్యమంత్రులను మార్చటం, ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులను మార్చటం జరుగుతుంది.

## 9.5. రాజకీయ పార్టీలు - విధులు :

ఆధునిక ప్రజాస్వామ్య వ్యవస్థలో రాజకీయపార్టీలు వివిధ రకాల విధులు నిర్వర్తిస్తున్నాయి. రాజకీయ పార్టీలు తమ అభ్యర్థుల్ని ఎంపిక చేయటం, వారిని భర్తీ చేయుటయే కాక ప్రజలను రాజకీయాలలో చురుకుగా పాల్గొనేందుకు రాజకీయ చైతన్యాన్ని తీసుకువస్తాయి. అమెరికన్ రచయితల దృష్టిలో రాజకీయ పక్షాలు ఆరు రకాల విధులను నిర్వర్తిస్తాయి. అవి.

1. ప్రజాభిప్రాయాన్ని రూపొందించి ప్రజలను రాజకీయ ప్రక్రియలోను, ప్రభుత్వ ప్రక్రియలోను భాగస్వాముల్ని చేయడాన్కి వారిని చైతన్యవంతులుగా చేస్తాయి.
2. రాజకీయ అంశాల్ని చర్చించి, వాటిని నిర్వచించటం ద్వారా ప్రభుత్వానికి ప్రత్యామ్నాయ విధానాలను సూచిస్తాయి.
3. ఎన్నికల్లో అభ్యర్థుల్ని నిలబెట్టి, వారి ఎన్నికకు కృషి చేయటం ద్వారా వారి వాగ్దానాలను అమలు చేయడానికి ప్రయత్నం చేస్తాయి.
4. విభిన్న ప్రజా ప్రయోజనాలను, సామాజిక సంస్థలను సంకీర్ణపరచటం ద్వారా నిర్ణీత సమయంలో వాటిని అమలు చేయడానికి ప్రయత్నం చేస్తాయి.
5. ప్రభుత్వాన్ని చేపట్టి శాసనసభ, కార్య నిర్వాహక వర్గాలను నిర్వహిస్తూ చెప్పబడిన విధానాలను అమలు చేయడానికి కృషి చేస్తాయి.
6. ప్రతిపక్షంలో ఉన్న రాజకీయ పక్షాలు ప్రభుత్వ విధానాలను సమీక్షించి, వాటి అమలును పర్యవేక్షిస్తూ నిశితంగా విమర్శిస్తూ ప్రభుత్వ లోపాలను ఎత్తి చూపుతాయి.

రాజకీయ పార్టీలు పార్లమెంటరీ ప్రజాస్వామిక వ్యవస్థలో అంతర్భాగాలు. రాజకీయపక్షాలు అధికారం కోసం ప్రయత్నించి రాజకీయ వ్యవస్థ అస్థిరత్వాన్నుండి స్థిరత్వాన్ని తీసుకురావడానికి కృషి చేస్తాయి. ఇవి ప్రభుత్వానికీ, ప్రజలకీ మధ్య వారధిలాగా పనిచేస్తాయి. రాజకీయ పక్షాలు ఓటర్లను శిక్షణ, చొరవ మరియు రాజకీయ కార్యకలాపాలలో పాల్గొనేటట్లు చేసి రాజకీయ సమీకరణ బాధ్యతను చేపడతాయి. అంతేగాక సమాజానికి విలువలతో కూడిన లక్ష్యాలను నిర్ణయిస్తాయి. రాజకీయ పార్టీలు సమాజం ఎదుర్కొంటున్న వివిధ సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకు వచ్చి వాటి పరిష్కారానికి అవిరాళ కృషి చేస్తాయి. ఇవి ప్రభుత్వ విధాన ప్రక్రియలో ప్రాథమిక శక్తిగా పని చేస్తాయి.

వాస్తవానికి రాజకీయ ప్రక్రియ అన్ని దశలలోనూ రాజకీయ పార్టీలు ప్రముఖమైన పాత్రను నిర్వహిస్తాయి.

## 9.6. భారతదేశంలో రాజకీయ పార్టీలు - స్వరూప, స్వభావాలు :

భారత రాజకీయ పక్షాలను స్థూలంగా జాతీయ పక్షాలు మరియు ప్రాంతీయ రాజకీయ పక్షాలుగా వర్గీకరించవచ్చు. కాంగ్రెస్, CPI, CPM, BJP, జనతాదళ్ మొదలైనవి జాతీయ పక్షాలకు ఉదాహరణగా తీసుకోవచ్చు. DMK, తెలుగుదేశం, అకాళీదళ్, అస్సాం గణ పరిషత్, TRS, వంటివి ప్రాంతీయ పక్షాల్లో ముఖ్యమైనవి.

జాతీయ రాజకీయ పక్షం అనగా నాయకత్వ విధానాలు, కార్యక్రమాలు, సంస్థాగత నిర్మాణం, అనుచర వర్గం, ఏదో ఒక ప్రాంతానికి లేదా రాష్ట్రానికి పరిమితం కాకుండా ఎక్కువ రాష్ట్రాలకు వ్యాప్తి చెందినట్లైతే దాన్ని 'జాతీయ రాజకీయ పక్షంగా' చెప్పవచ్చును. నాయకత్వ విధానాలు, సంస్థాగత నిర్మాణం, అనుచర వర్గ ప్రాచుర్యం ఒక రాష్ట్రానికి లేదా ప్రాంతానికి పరిమితమైనట్లయితే అది 'ప్రాంతీయ పార్టీ' అవుతుంది.

జాతీయ రాజకీయ పక్షాలతో బాటు ప్రాంతీయ రాజకీయ పక్షాలు కూడా భారతదేశ రాజకీయాల్లో ప్రముఖ పాత్రను నిర్వహిస్తూ జాతీయ రాజకీయాలను మలుపు తిప్పుతున్నాయి. గత దశాబ్దంన్నర కాలంలో భారతదేశంలో సంకీర్ణ ప్రభుత్వాలు, రాజకీయాలు భారత రాజకీయ వ్యవస్థను, స్థితిని శాసిస్తున్నాయి అంటే ప్రధాన కారణం ప్రాంతీయ పార్టీలేనని చెప్పవచ్చు. ముఖ్యంగా ఆంధ్రప్రదేశ్‌లోని తెలుగుదేశం, TRS లు జాతీయ ప్రభుత్వంలో ముఖ్య భూమికను పోషించడం గమనార్హం. ఆంధ్రప్రదేశ్‌లో పని చేస్తున్న రాజకీయ పక్షాలన్నీ తెలుగుదేశం, TRS, మజ్లిస్ పార్టీలు మినహాయిస్తే - మిగిలినవన్నీ జాతీయ రాజకీయ పక్షాలే.


## 9.7 ఆంధ్రప్రదేశ్ - రాజకీయ పార్టీలు :

**9.7.1.** కాంగ్రెస్ పార్టీ : ఉమ్మడి మద్రాస్ రాష్ట్రంలోని ఆంధ్రప్రాంతానికి ప్రత్యేక కాంగ్రెస్ విభాగం చాలా కాలం వరకూ ఏర్పడలేదు. 1937కు ముందు జస్టిస్ పార్టీ ప్రాబల్యం వల్ల ఆంధ్రప్రాంతంలో కాంగ్రెస్‌కు రాజకీయ పలుకుబడి విశేషంగా లేదు. ఆంధ్రరాష్ట్రం ఏర్పడేంత వరకూ ఆంధ్ర కాంగ్రెస్ రాజకీయాలపై ముగ్గురు నాయకులు పట్టాభి, ప్రకాశం, రంగాల ప్రభావం ఎక్కువగా ఉండేది. ఆంధ్రరాష్ట్ర ఆవిర్భావంతో కృషికార్ లోక్‌పార్టీ, ప్రజాపార్టీలు ఏర్పడటంతో ప్రకాశం ముఖ్యమంత్రిగా కాంగ్రెస్ రాష్ట్రంలో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసింది. కాని 1954లో ప్రకాశం మంత్రివర్గం అధికారాన్ని కోల్పోయింది. 1955లో జరిగిన మధ్యంతర ఎన్నికల వరకూ రాష్ట్రపతి పాలన కొనసాగింది. మధ్యంతర ఎన్నికల్లో కృషికార్ లోక్‌పార్టీ, ప్రజాపార్టీలతో కలసి కాంగ్రెస్ విజయం సాధించి, బెజవాడ గోపాలరెడ్డి ముఖ్యమంత్రిగా కాంగ్రెస్ పార్టీ రాష్ట్రంలో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసింది. ఆంధ్రప్రదేశ్ 1956 నవంబరు 1న ఏర్పడేంత వరకూ అదే మంత్రి వర్గం కొనసాగింది. రాష్ట్ర రాజకీయాలలో కాంగ్రెస్ ప్రాబల్యం ఆంధ్రప్రదేశ్‌లో 1956 నుండి 1983 వరకూ, తిరిగి 1989 నుండి 1994 వరకూ, మరలా 2004 శాసన సభ ఎన్నికల్లో అధిక స్థానాలను సంపాదించి సుమారు 34 సంవత్సరాలుకుపైగా రాష్ట్రంలో అధికార పక్షంగా కొనసాగుతున్నది. 1983 నుండి 1989 వరకూ, మరియు 1994 నుండి 2004 వరకూ ప్రధాన ప్రతిపక్షం పాత్రను కాంగ్రెస్ పార్టీ నిర్వహించింది.

1983 అసెంబ్లీ ఎన్నికల వరకూ ఆంధ్రప్రదేశ్ రాజకీయాలలో ఇతర జాతీయ పక్షాల ప్రత్యామ్నాయం ఏర్పాటు చేయగలమనే విశ్వాసాన్ని ప్రజలకు కలిగించలేకపోయాయి. 1983 వరకూ ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో కాంగ్రెస్ పార్టీకి వ్యతిరేక ప్రత్యామ్నాయం ఏర్పడలేదు. కాంగ్రెస్‌కు ఆంధ్రప్రదేశ్ కంచు కోటలా వ్యవహరించింది. ఒకప్పుడు కాంగ్రెస్‌కు ప్రత్యామ్నాయంగా భావించటం జరిగిన కమ్యూనిస్ట్ పార్టీ అనేక కారణాల వల్ల క్షీణించటంతో కాంగ్రెస్ పార్టీ రాష్ట్రంలో బాగా బలపడింది. స్వతంత్ర పార్టీ, సోషలిస్ట్ పార్టీ, తెలంగాణా ప్రజా సమితి మొదలైనవన్నీ కాంగ్రెస్ నుండి చీలిపోయి వేరు కుంపటి పెట్టిన రాజకీయ వేదికలే. అందువల్ల అవి చాలా వరకూ ప్రభావ వర్గాలుగా పని చేసి రాష్ట్ర రాజకీయాలలో కాంగ్రెస్ పార్టీ ఒక ప్రాబల్య రాజకీయ వ్యవస్థగా, తిరుగులేని శక్తిగా వ్యవహరించగలిగింది. రాష్ట్ర రాజకీయాలలో అనేక మార్లు అధికార పక్షంగా, ప్రతిపక్షంగా కీలకపాత్రను నిర్వహిస్తున్న కాంగ్రెస్ పార్టీ మొదటి నుండి ముఠా రాజకీయాలతో సతమతమౌతూనే వచ్చింది. నేటికి కాంగ్రెస్ రాష్ట్రంలో అధికార పక్షంగా కొనసాగుతున్నప్పటికీ ముఠా రాజకీయాలకు నిలయంగానే ఉన్నది. కాంగ్రెస్ పార్టీలో

ముఠాలు ఏర్పడటాన్ని ఒక ప్రధాన కారణం ఆ పార్టీ సరళీకృత వ్యవస్థా నిర్మాణం. కాంగ్రెస్ అతి విస్తృతమైన ప్రజా బాహుళ్య సంస్థ. ఇందులో విభిన్న సిద్ధాంతాలు, దృక్పథాలున్నవారు, వర్గాలు మొదటినుండీ కొనసాగుతూ తమ సైద్ధాంతిక పరిరక్షణ కోసం ముఠాలను ఏర్పాటు చేయటం, ముఠా రాజకీయాలను ప్రోత్సహించటం, కాంగ్రెస్ వాదులకు సర్వసాధారణమైపోయింది. ఏ ప్రజాస్వామిక వ్యవస్థలోనైనా విభిన్న భావాలు, సిద్ధాంతాలు ఉన్నవారు పని చేయడం సహజం. అదే విధంగా వారి మధ్య బేధాభిప్రాయాలు ఏర్పడటం కూడా ఒక సహజ పరిణామం. అతి విశాల ప్రాతిపదికపై రూపొంది వంద సంవత్సరాలకుపైగా పని చేస్తున్న కాంగ్రెస్ పార్టీలో ఇలాంటి పరిణామాలు సహజంగానే ఉంటాయి.

## రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ నిర్మాణం



పైన పేర్కొన్న వివిధ నిర్మాణ సంస్థలే కాక కాంగ్రెస్ పార్టీకి కొన్ని అనుబంధ సంస్థలు కూడా ఉన్నాయి. అవి : యువజన కాంగ్రెస్, NSUI, సేవాదళ్, మైనారిటీ సెల్, మహిళా విభాగం, INTUC. చాలా కాలం వరకు కాంగ్రెస్ సంస్థకు సంస్థాగత ఎన్నికలు జరగలేదు. పి.వి. నరసింహారావు కాంగ్రెస్ అధ్యక్షులుగా, దేశ ప్రధానిగా ఉన్నప్పుడు కాంగ్రెస్ పార్టీకి అన్ని స్థాయిల్లో ఎన్నికలు జరిపించి సంస్థాగత నిర్మాణ కార్యక్రమాన్ని ప్రజాస్వామికంగా రూపొందించటం జరిగింది.

**9.7.2. భారతీయ జనతా పార్టీ (BJP) :** 1980 లోక్ సభ ఎన్నికల అనంతరం అంతవరకూ జనతాపార్టీలో విలీనమై కొనసాగుతున్న జనసంఘ్, భారతీయ జనతా పార్టీగా అవతరించింది. సకారాత్మక లౌకికవాదాన్ని బి.జె.పి. విశ్వసిస్తున్నది. 'సెక్యులరిజం' అంటే మన చరిత్రను, సాంస్కృతిక వారసత్వాన్ని విస్మరించటం కాదు, అందరికీ న్యాయం, ఒకరిపట్ల సంతుష్టీకరణ విధానాలు చేపట్టకపోవటం అనే సిద్ధాంతానికి BJP కట్టుబడి ఉంది. ఉత్తరాది రాష్ట్రాలలో BJP కి మంచి పట్టు, పలుకుబడి ఉంది. కాని ఆంధ్రప్రదేశ్‌లో మాత్రం BJP ఉనికి నామమాత్రంగానే ఉంది. శాసనసభలో, లోక్‌సభ ఎన్నికల్లో 1985లో తెలుగుదేశంతో పొత్తు పెట్టుకోవటం వల్ల కొంత లబ్ది పొందింది. అలాగే 1994 ఎన్నికల్లో కూడా BJP తెలుగుదేశం పార్టీతో పొత్తు పెట్టుకొని కొంత మేరకు రాష్ట్రంలో లాభపడిందనే చెప్పాలి. 1999 లోక్ సభ, శాసన సభ ఎన్నికల్లో తెలుగుదేశంతో పొత్తు పెట్టుకుని తన ఉనికిని చాటుకున్నది. 2004లో జరిగిన లోక్ సభ, శాసన సభ, ఎన్నికల్లో తెలుగుదేశంతో ఉన్న విబేధాల కారణంగా తన ఉనికిని చాటుకోలేక ఘోరంగా విఫలమైంది. ఒంటరిగా తన ఉనికిని కాపాడుకుంటూ రాష్ట్ర రాజకీయాల్లో గణనీయ పాత్రను నిర్వహించే స్థాయికి ఈ రాజకీయ పక్షం ఇంకా ఎదగలేదు. బంగారు లక్ష్మణ్, వెంకయ్యనాయుడు, బండారు దత్తాత్రేయ, విద్యాసాగరరావు తదితరులు రాష్ట్రంలో చెప్పుకోదగిన BJP నాయకులు.

**9.7.3. జనతా పార్టీ :** 1977లో జాతీయస్థాయిలో ఏర్పడ్డ జనతాపార్టీకి అనుబంధంగా ఆంధ్రప్రదేశ్‌లో కూడా పూర్వ స్వతంత్రపార్టీ, భారతీయ లోక్‌దళ్, జన సంఘ్, సోషలిస్ట్ పార్టీలు కలసి జనతాపార్టీగా రాష్ట్ర స్థాయిలో ఏర్పడింది. 1978 రాష్ట్ర శాసన సభ ఎన్నికల్లో 269 స్థానాల్లో పోటీ చేసి 60 స్థానాలను దక్కించుకుంది. ఆ తర్వాత జాతీయ స్థాయిలో జనతా పార్టీలో ఏర్పడ్డ చీలిక ఆంధ్రప్రదేశ్‌లో కూడా ఆ పార్టీని చీల్చి మరింత బలహీన పర్చింది. దీనితో జనతాపార్టీ రాష్ట్రంలో BJP, జనతాపార్టీ, లోక్‌దళ్ అనే మూడు ముక్కలుగా చీలిపోయింది. రాష్ట్ర శాసన సభ ఎన్నికల్లో ఒంటరిగా పోటీ చేయలేక ఇతర రాజకీయ పక్షాలతో ఫ్రంట్‌ను కట్టి పోటీ చేస్తూ రాష్ట్ర రాజకీయాల్లో నామమాత్రంగా మిగిలిపోయింది.

**9.7.4. లోక్ దళ్ :** 1979లో జనతాపార్టీలో చీలికవచ్చి లోక్‌దళ్ ఏర్పడింది. శాసనసభలోని ప్రతిపక్ష నాయకుడు గౌతు లచ్చన్న నాయకత్వంలో రాష్ట్ర స్థాయిలో లోక్‌దళ్ ఏర్పడింది. 1980 లోక్ సభ ఎన్నికల్లో పోటీ చేసి ఘోరంగా పరాజయం పొందింది. కేంద్రంలో లోక్‌దళ్‌లో వచ్చిన చీలిక రాష్ట్ర లోక్‌దళ్‌పై కూడా ప్రభావం చూపించింది. ప్రారంభం నుంచీ ఇతర లౌకిక ప్రజాస్వామ్య శక్తులతో పొత్తు కలుపుకోడానికి లోక్‌దళ్ ప్రయత్నం చేస్తూ వచ్చింది. లోక్‌దళ్ నాయకుడు గౌతు లచ్చన్న ఒక ఫ్రంట్‌ను ఏర్పరచడానికి ప్రయత్నం చేసినాడు. ప్రోగ్రెసివ్ డెమొక్రాటిక్ ఫ్రంట్ విఫలం అయినాక ఉభయ కమ్యూనిస్ట్ పార్టీలతో సర్దుబాటు చేసుకొని 1983 అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేసి ఘోరంగా విఫలం అయ్యింది. చాలా కాలం మరుగున ఉండిపోయి చివరికి జనతాదళ్‌లో అంతర్భాగం అయినది.

**9.7.5. కమ్యూనిస్ట్ పార్టీ :** ఆంధ్రరాష్ట్రం ఏర్పడక ముందే కమ్యూనిస్ట్ ఉద్యమం ఉమ్మడి మద్రాస్‌లోని తెలుగు ప్రాంతాల్లో కోస్తా జిల్లాల్లో వ్యాప్తి చెందింది. 1950 సంవత్సరంలో కమ్యూనిస్ట్ పార్టీ పశ్చిమగోదావరి, కృష్ణా, గుంటూరు, నల్గొండ, ఖమ్మం, వరంగల్ జిల్లాల్లో కాంగ్రెస్‌కు బలమైన ప్రతిపక్షంగా అవతరించటం వల్ల పై జిల్లాలను 'ఎర్రకోటలు'గా వర్ణించేవారు. అయితే 20 సంవత్సరాల తర్వాత అంటే 1967 తరువాత కమ్యూనిస్ట్ పార్టీ ప్రాబల్యం క్రమంగా తగ్గిపోనారంభించింది. 1952, 1957 సాధారణ ఎన్నికలు ఆంధ్ర ప్రాంతంలో విశాలాంధ్ర ఉద్యమం, తెలంగాణా రైతాంగ పోరాటం కమ్యూనిస్ట్ పార్టీకి చెప్పుకోదగ్గ స్థాయిలో విజయాలు చేకూర్చాయి. 1953లో ఆంధ్రరాష్ట్రం ఏర్పడ్డ తరువాత కొంత కాలం వరకూ కమ్యూనిస్ట్ పార్టీ కాంగ్రెస్ ప్రత్యామ్నాయం కాగలదన్న ఆశాభావం ప్రజల్లో కలిగింది. అయితే జాతీయ స్థాయిలో కమ్యూనిస్ట్ ఉద్యమంలో చీలికలు వల్ల రాష్ట్రంలో కమ్యూనిస్ట్‌ల ప్రాబల్యం క్షీణించింది. 1962లో జరిగిన భారత-చైనా యుద్ధం తరువాత కమ్యూనిస్ట్ పార్టీ రెండుగా చీలిపోయింది. కమ్యూనిస్ట్ పార్టీలో వచ్చిన చీలిక ఆంధ్రప్రదేశ్‌లోని కమ్యూనిస్ట్ ఉద్యమం పై తన ప్రభావాన్ని చూపింది. సుందరయ్య, బసవ పున్నయ్య లాంటి వారు మార్క్సిస్టుపార్టీలో అయితే CPI (M) లో చేరగా చంద్ర రాజేశ్వరరావు,

రావి నారాయణరెడ్డి కమ్యూనిస్ట్ పార్టీ CPI లోనే కొనసాగారు. 1969 మే 1న కమ్యూనిస్ట్ వర్గాల్లో మరో చీలిక వచ్చింది. ఈ క్రొత్త వర్గాన్ని మార్క్సిస్ట్ - లెనినిస్టు (CPI (ML)) గా వ్యవహరించారు. 1955 రాష్ట్ర అసెంబ్లీ మధ్యంతర ఎన్నికల్లో తామే ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తామని ముందుగానే ప్రకటించి ఒంటరిగా పోరాడి ఘోరంగా పరాజయం పొందింది. దీనితో కమ్యూనిస్ట్ నాయకులు పార్లమెంటరీ పంథాను అనుసరించి కమ్యూనిస్ట్ పార్టీలు క్రమంగా ప్రజా ఉద్యమాలకు దూరమై శాసన సభల్లో నామమాత్ర ప్రాతినిధ్యానికి పరిమితమైనారు. 1967 రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల్లో ప్రధాన ప్రతిపక్షంగా ఉభయ కమ్యూనిస్టు పార్టీలు సంఖ్యా బలాన్ని పుంజుకున్నప్పటికీ, 1972 ఎన్నికల్లో ఉభయ కమ్యూనిస్టు పార్టీలు కలసి రాష్ట్ర అసెంబ్లీలో కేవలం 8 స్థానాలనే సంపాదించగలిగాయి. ఆ తర్వాత ఎన్నికల రాజకీయాల్లో శాసన సభలో నామమాత్ర ప్రాతినిధ్యం కోసం అన్ని రకాల అవకాశ వాద భూస్వామ్య ప్రగతి వ్యతిరేక పక్షాలతో పొత్తులు పెట్టుకోవటంతో ఈ వరకు పార్టీలు బలహీనమైనాయి. వ్రేళ్ళపై లెక్కించే స్థానాలను అవి గెలుచుకోవటానికి కారణం ఇతర రాజకీయ పక్షాలు ముఖ్యంగా 1983 నుంచి 1990 దశకం వరకూ ప్రాంతీయ పార్టీ అయిన తెలుగు దేశంతోను, 2004 ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీతోను ఎన్నికల పొత్తులు పెట్టుకోవడం వల్లనే అని మనం గ్రహించాలి.

**9.7.6. స్వతంత్ర పార్టీ :** స్వతంత్రపార్టీని 1959 ఆగస్టులో మినూమసానీ, రాజగోపాలాచారి, ఆచార్య రంగా ప్రారంభించారు స్వతంత్రపార్టీ జాతీయ స్థాయిలో ప్రారంభంకాగానే కృషికార్ లోకపార్టీలో ఉన్న రంగా అనుచరులు చాలా మంది స్వతంత్ర పార్టీలో చేరారు. 1962 ఎన్నికల్లో ప్రధమంగా స్వతంత్రపార్టీ 140 శాసనసభ స్థానాలకు పోటీ చేసి 14 స్థానాలను గెలుచుకుంది. 1967 రాష్ట్ర శాసన సభ ఎన్నికల్లో 29 స్థానాలు గెలుచుకొని ప్రధాన ప్రతిపక్షం అయినది. 1969లో కాంగ్రెస్ చీలిక వచ్చిన అనంతరం స్వతంత్ర పార్టీ వ్యవస్థ కాంగ్రెస్‌తో సంబంధాలు పెట్టుకొని ఎన్నికల ఒడంబడిక చేసుకొంది. 1972 శాసన సభ ఎన్నికల్లో 20 స్థానాలకు పోటీ చేసి కేవలం 2 స్థానాలు మాత్రమే గెలుచుకోగలిగింది. అటు తర్వాత ఆచార్య రంగా నాయకత్వంలో ఈ పార్టీలో ఒక వర్గం శ్రీమతి ఇందిరాగాంధీ నాయకత్వంలోని క్రొత్త కాంగ్రెస్‌లో విలీనం అయినది. స్వతంత్ర పార్టీలోని మిగిలిన వర్గం గౌతు లచ్చన్న నాయకత్వంలో 1975లో భారతీయ లోక్‌దళ్‌లో కలిసిపోయింది.

**9.7.7. ప్రజాపార్టీ :** 1951 నుండి 1977 వరకు రాష్ట్రస్థాయిలో కొనసాగిన రాజకీయ పక్షం ప్రజాపార్టీ అతి తక్కువ అనుచర వర్గం ఉన్నప్పటికీ మొదట MPC తో అటు తర్వాత CNC తో కలసి కొద్దికాలం ప్రజాపార్టీ రాజకీయ ప్రాముఖ్యాన్ని సంపాదించుకొంది. ఆంధ్రరాష్ట్రం ఏర్పడ్డప్పుడు నాటి రాష్ట్ర రాజకీయాల్లో ప్రజాపార్టీ గణనీయమైన పాత్రను నిర్వహించింది. అయితే ఆంధ్రప్రదేశ్ అవతరించిన తరువాత ప్రజాపార్టీ క్రమంగా క్షీణించి చివరకు ఒక వ్యక్తితో అంటే తెన్నేటి విశ్వనాధంతో ముడిపడి కొద్దికాలం కొనసాగింది. 1955లో జరిగిన మధ్యంతర ఎన్నికల్లో ప్రజాపార్టీ కాంగ్రెస్‌తో, KLP తో ఎన్నికల పొత్తును ఏర్పాటు చేసుకుంది. అయితే ఈ ఎన్నికల్లో తెన్నేటి విశ్వనాధం ఓడిపోవటంతో ప్రజాపార్టీ బాగా దెబ్బతింది. KLP కాంగ్రెస్‌లో కలిసిపోయింది. 1977 లో జనతాపార్టీలో విలీనం అయ్యేంత వరకూ ప్రజాపార్టీ నామమాత్రంగా తన మనుగడను కొనసాగించింది.

**9.7.8. సోషలిస్ట్ పార్టీ :** 1948 వరకూ అంటే స్వాతంత్ర్యం వచ్చేంత వరకూ కాంగ్రెస్ సోషలిస్ట్ పార్టీ కాంగ్రెస్‌తో కలసి పని చేసింది. 1948 లో కాంగ్రెస్‌నుంచి బయటకు వచ్చి "సోషలిస్ట్ పార్టీ"గా అవతరించింది. ఆంధ్రరాష్ట్రం ఏర్పడే తరుణంలో 1952 ఎన్నికల్లో కాంగ్రెస్ ఓటమిలో ప్రతిపక్షాలు కొంత ప్రాముఖ్యం చూపించాయి. ఈ ఎన్నికల్లో రాష్ట్రంలోని సోషలిస్ట్ పార్టీతో KMPP విలీనం అయ్యి ప్రజా సోషలిస్ట్ పార్టీగా ఏర్పడింది. ప్రజా సోషలిస్ట్ పార్టీ సమైక్యంగా ఆంధ్ర రాజకీయాల్లో ఎక్కువ కాలం కొనసాగలేదు. 1955-1956లో సోషలిస్ట్ పార్టీలో చీలికలు ఏర్పడి రామ్ మనోహర్ లోహియా ప్రజా సోషలిస్ట్ పార్టీని వదిలి సోషలిస్ట్ పార్టీని ఏర్పాటు చేసారు. రాష్ట్రంలో P.V.G. రాజు నాయకత్వంలో సోషలిస్ట్ పార్టీ లోహియా వర్గంలో చేరారు. సంజీవ రెడ్డి, చెన్నారెడ్డి మధ్య విభేదాలు ఏర్పడటంతో చెన్నారెడ్డి, డెమొక్రాటిక్ పార్టీని సంజీవరెడ్డి వ్యతిరేకముగా ఏర్పాటు చేసారు. P.V.G. రాజు వర్గం చెన్నారెడ్డి పార్టీలో చేరిపోయింది. ఆ పార్టీని సోషలిస్ట్ డెమొక్రాటిక్ పార్టీ అని పిలిచారు. అంతేగాక అసెంబ్లీలో ప్రధాన ప్రతిపక్షంగా సోషలిస్ట్ డెమొక్రాటిక్ పార్టీ పని చేసింది. అయితే ఈ నూతన రాజకీయ పక్షం ఎక్కువ కాలం బతికి బట్ట కట్టలేదు. చెన్నారెడ్డి, P.V.G. రాజు వర్గం కాంగ్రెస్‌లో చేరారు. దీనితో సోషలిస్ట్ ఉద్యమానికి ఆంధ్రప్రదేశ్‌లో తెరపడింది. చివరకు 1977లో సోషలిస్ట్ పార్టీ కార్యకర్తలు జనతాపార్టీలో చేరిపోయారు.

**9.7.9. తెలుగుదేశం పార్టీ :** 1982 మే నెలలో సుప్రసిద్ధ సినిమా నటుడు నందమూరి తారక రామారావు "తెలుగు దేశం" అనే ప్రాంతీయ పార్టీని ఆంధ్రప్రదేశ్‌లో స్థాపించారు. అప్పటి కాంగ్రెస్‌లో ఏర్పడ్డ అవినీతి, అసమర్థత, అసంతృప్తి మొదలైనవాటిని ఆధారం చేసుకొని 1983 రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేసి 290 శాసన సభ స్థానాలుకు పోటీ చేసి అఖండ విజయం సాధించి తెలుగుదేశం అధికారంలోకి వచ్చింది. 1984లో తెలుగుదేశంలో చీలికలు ఏర్పడి అంతవరకూ తెలుగుదేశం ప్రభుత్వంలో ప్రముఖ స్థానంలో ఉన్న నాదెండ్ల భాస్కరరావు, ప్రజాస్వామ్య తెలుగుదేశం అనే పార్టీని స్థాపించారు. అనంతరం ఏర్పడ్డ రాజకీయ పరిణామాల ఫలితంగా NTR తిరిగి ముఖ్యమంత్రి కావటం, ఆయన శాసన సభను రద్దు చేసిన తర్వాత 1985లో జరిగిన ఎన్నికల్లో తిరిగి ఘన విజయాన్ని సాధించి అధికారంలోకి వచ్చింది. 1989లో జరిగిన శాసనసభ ఎన్నికల్లో తెలుగుదేశం పరాజయం పాలై ప్రతిపక్ష స్థానంలో కూర్చోవటం జరిగింది. 1994 లో జరిగిన శాసనసభ ఎన్నికల్లో NTR నాయకత్వంలో తెలుగుదేశం ఘన విజయాన్ని సాధించి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయటం జరిగింది. తదనంతరం జరిగిన పరిణామాల మూలంగా NTR అల్లుడు చంద్రబాబునాయుడు ముఖ్యమంత్రి కావటం, NTR పదవీచ్యుతుడు కావటం ఆ తర్వాత కొద్ది కాలానికి NTR మరణించటం జరిగింది. NTR మరణానంతరం తెలుగుదేశంలో చీలికలు ఏర్పడి NTR భార్య లక్ష్మీపార్వతి ఆధ్వర్యంలో "తెలుగు దేశం (NTR)" గాను, NTR తనయుడు హరికృష్ణ ఆధ్వర్యంలో "అన్న తెలుగుదేశం"గా చీలిపోవటం జరిగింది. అయితే 1999 లో జరిగిన ఎన్నికల్లో చంద్రబాబునాయుడు నాయకత్వంలో తెలుగుదేశం విజయం సాధించి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయడం జరిగింది. ఆ తర్వాత 2004 లో జరిగిన ఎన్నికల్లో అపజయాన్ని పొంది ప్రతిపక్ష పాత్ర నిర్వహిస్తుంది.

కాంగ్రెస్, కమ్యూనిస్టు పార్టీలు తదితర రాజకీయ పక్షాలవలె తెలుగుదేశం కూడా ముఠా తగాదాలకు అతీతంగా లేదు. కాకపోతే ఇది ఒక ప్రాంతీయ పార్టీ కావటం దీనికి జనాకర్షణ కలిగిన యన్.టి. రామారావు నాయకత్వం ఉండటం చేత పార్టీలు తగాదాలు అతి తక్కువ స్థాయిలో బహిర్గతమవుతూ వచ్చాయి. తెలుగుదేశం ఇప్పటికే రెండుసార్లు చీలికకు గురైంది. విధానాల పరంగా సంస్థాగత నిర్మాణం తెలుగుదేశం రాజకీయ సంస్కృతిలో కాంగ్రెస్ పార్టీతో పోలి ఉండటం వల్ల ముఠా తగాదాల ధ్యేయం అధికారంలో వాటా సంపాదించటం సహజమని చెప్పవచ్చు.

**9.7.10. తెలంగాణా రాష్ట్రీయ సమితి (TRS) :** తెలంగాణా రాష్ట్రం సాధనే లక్ష్యంగా ప్రాంతీయ తత్వంలో ఆంధ్రప్రదేశ్‌లో ఏర్పడిన పార్టీ తెలంగాణా రాష్ట్రీయ సమితి. తెలుగు దేశంలో కీలకపాత్ర వహించి, మంత్రిగా పదవీ బాధ్యతలు నిర్వహించిన కె. చంద్రశేఖరరావు నాయకత్వంలో తెలంగాణా రాష్ట్రీయ సమితి 2003వ సంవత్సరంలో స్థాపించబడింది. కాంగ్రెస్ పార్టీ, తెలుగుదేశం పార్టీలు తెలంగాణా అభివృద్ధిలో అన్ని రంగాలలోనూ సవతి ప్రేమ చూపాయని, తెలంగాణా అభివృద్ధి చెందాలంటే ప్రత్యేక తెలంగాణా రాష్ట్రం ఏర్పడాలని ఆశించి TRS అనే పార్టీని ఏర్పాటు చేయటం జరిగింది. దీనికి కె. చంద్రశేఖరరావు అధ్యక్షులు, బి.జె.పి.లో ప్రముఖ నాయకుడిగా, తెలంగాణా టైగర్‌గా పేరొందిన నరేంద్ర TRS లో చేరినారు. 2004 ఏప్రిల్‌లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో రాష్ట్రంలో కాంగ్రెస్‌తో పొత్తు పెట్టుకొని విజయం సాధించి, రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం ఏర్పాటుచేయడానికి సహకరించింది. ప్రభుత్వంలో కూడా TRS భాగస్వామ్యాన్ని కొద్ది కాలం కొనసాగించి, తెలంగాణా రాష్ట్రం ఏర్పాటుకు సంబంధించిన అంశంలో రాష్ట్ర కాంగ్రెస్ నాయకత్వంతో విభేదించి ప్రభుత్వంలో కొనసాగుతున్న TRS మంత్రులు పదవులకు రాజీనామా చేసి, ప్రభుత్వం వెలుపల నుండి మద్దతునిస్తున్నారు. అట్లాగే 2004 లోక్‌సభ ఎన్నికల్లో అధిక స్థానాలు రాష్ట్రం నుండి గెలుచుకొని కేంద్రంలో UPA ప్రభుత్వం కాంగ్రెస్ సారథ్యంలో ఏర్పాటు చేయడానికి మద్దతునిచ్చి, ప్రభుత్వంలో కీలకపాత్ర నిర్వహిస్తున్నది. TRS అధ్యక్షుడు చంద్రశేఖరరావు, ఉపాధ్యక్షుడు నరేంద్రలు కేంద్ర మంత్రులుగా కొనసాగుతున్నారు. కేంద్రంలో UPA ప్రభుత్వ సహకారంతో, రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వ సహకారాలతో ప్రత్యేక తెలంగాణా రాష్ట్రాన్ని ఏర్పాటు చేయడానికి TRS ప్రయత్నిస్తున్నది. 2005 సెప్టెంబరు మున్సిపల్ ఎన్నికల్లో ఏ పార్టీతో పొత్తు పెట్టుకోకుండా ఒంటరిగా పోటీ చేసి తెలంగాణా తగినన్ని స్థానాలు గెల్చుకుని తన ఉనికిని ప్రదర్శించుకున్నది.

**9.7.11. మజ్లిస్ పార్టీ :** ఆంధ్రప్రదేశ్ ఏర్పడిన తరువాత మజ్లిస్ పార్టీ హైదరాబాద్‌కు చెందిన ప్రముఖ న్యాయవాది అబ్దుల్ నవాబ్ ఓవైసీ నాయకత్వంలో ఒక నూతన రాజకీయ పక్షంగా ఆవిర్భవించింది. ఆయన తదనంతరం ఆయన కుమారుడు సుల్తాన్ సలావుద్దీన్ ఓవైసీ పార్టీ నాయకత్వం చేపట్టారు. రాష్ట్ర జనాభాలో ముస్లింలు 9 శాతం ఉన్నారు. పట్టణ జనాభాలో 19 శాతం ముస్లింలు ఉన్నారు. కాగా తెలంగాణాలో వారి శాతం 30 వరకూ ఉన్నది. ఒక్క హైదరాబాద్ నగరంలో ముస్లింలు 40 శాతం ఉన్నారు. ముస్లిం మైనారిటీల అభివృద్ధి కొరకు ఆంధ్రప్రదేశ్‌లో ఒక చిన్న సంస్థగా ప్రారంభమై 1962 నుంచి 2005 వరకూ రాజకీయంగా నిలదొక్కుకొని క్రమంగా పెరుగుతూ వస్తున్న మజ్లిస్‌పార్టీ ముస్లింల ప్రయోజనాల పరిరక్షణ ఏకైక లక్ష్యంగా పెట్టుకొన్నది. ఈ పార్టీ అభివృద్ధికి సలావుద్దీన్ ఓవైసీ నాయకత్వమే కారణం. రాష్ట్ర శాసనసభలోనే కాక లోక్‌సభలో కూడా ముస్లింల వాణి వినిపించడానికి అవకాశం ఏర్పడిందంటే సలావుద్దీన్ అమోఘమైన కృషి అని చెప్పవచ్చు. ముస్లింల హక్కుల కోసం పోరాడే ఈ పార్టీకి ముస్లిం పేద వర్గాల్లో, మురికి వాడల్లో, ముఖ్యంగా హైదరాబాద్ పాత బస్తీలలో చాలా పలుకుబడి వుంది.

**9.7.12. ముగింపు :** రాజకీయ పార్టీలు ప్రజలలో రాజకీయ ప్రక్రియ పట్ల అవగాహన పెంపొందించడమే కాకుండా రాజకీయ అంశాల పట్ల ప్రజల దృష్టిని మరియు ప్రజా సమస్యల పట్ల ప్రభుత్వం దృష్టిని ఆకర్షించే విధంగా కృషి చేస్తాయి. రాజకీయ పక్షాలు లేనిదే ఆధునిక ప్రజాస్వామ్యం మనుగడ ప్రశ్నార్థకం అవుతుంది. రాజకీయ పార్టీలు అనేవి ప్రజలకు మరియు ప్రాతినిధ్య ప్రభుత్వ యంత్రాంగానికి మధ్య సమన్వయాన్ని ఏర్పాటు చేస్తాయి. రాజకీయ పార్టీలు పటిష్టమైన నాయకత్వాన్ని అందించడం ద్వారా దేశ, రాష్ట్ర పాలనా సామర్థ్యాన్ని పటిష్టం చేస్తాయి. రాజకీయ పార్టీలు ప్రజలకు సమాచారాన్ని అందించడం ద్వారా రాజకీయ చైతన్యాన్ని, పరిజ్ఞానాన్ని ప్రజలకు అందించి వారిని రాజకీయ ప్రక్రియలో భాగస్వాముల్ని చేస్తాయి. జాతీయ స్థాయిలో జాతీయ రాజకీయ పక్షాలతో బాటు ప్రాంతీయ రాజకీయ పక్షాలు రాష్ట్ర రాజకీయాలనే కాకుండా జాతీయ రాజకీయాల్ని, జాతీయ ప్రభుత్వాల్ని మలుపు తిప్పుతూ జాతీయ రాజకీయ భావ స్రవంతిలో కీలకపాత్ర నిర్వహిస్తున్నాయి. గత రెండు దశాబ్దాల కాలంగా జాతీయ ప్రభుత్వాల ఏర్పాటులో, మనుగడలో ప్రాంతీయ పార్టీలు కీలక పాత్ర నిర్వహిస్తున్నాయి.

## 9.9. సారాంశము :

ప్రజాస్వామ్యంలో రాజకీయ పార్టీలు అనేవి చాలా ముఖ్యమైనవి. రాజకీయ పార్టీలు లేనిచో ప్రజాస్వామ్య వ్యవస్థకు మనుగడ లేదు. రాజకీయ పార్టీలు లేని ప్రజాస్వామ్యం కర్ణుడు లేని భారతం లాంటిది. లార్డ్ బ్రైస్ చెప్పినట్లుగా కొన్ని సిద్ధాంతాలను విశ్వసించి ప్రభుత్వాధికారాన్ని చేపట్టడానికి కృషి చేస్తూ నమ్మిన సిద్ధాంతాలను సమిష్టి కృషి ద్వారా ఆచరణలో పెట్టడానికి సంకల్పిస్తూ జాతీయ శ్రేయస్సును పెంపొందించేందుకు ప్రయత్నించే ప్రజా సమూహమే రాజకీయ పక్షం. స్వభావ రీత్యా రాజకీయ పార్టీలు రాజ్యాంగేతర సంస్థలుగా పరిగణించినప్పటికీ అవి రాజ్యాంగ పరిధిలో పని చేస్తూ ప్రజాస్వామ్య యంత్రాంగాన్ని రాజ్యాంగ పరిధిలో క్రియాశీలకం చేస్తాయి. ప్రభుత్వ యంత్రాంగాన్ని నడిపిస్తూ ప్రభుత్వ విధానాలు రూపకల్పన చేస్తూ, వాటి అమలును పమీక్షిస్తూ ప్రజా సంక్షేమానికి కృషి చేసేవి రాజకీయ పక్షాలు. వివిధ సిద్ధాంతాల ప్రాతిపదికపై రాజకీయ పార్టీలు ఏర్పడి పని చేస్తున్నప్పటికీ ఒకే రకమైన లక్షణాలను కలిగి ఉన్నాయి. అయితే మన దేశంలోని రాజకీయ పక్షాలు మిగిలిన ఉదారవాద ప్రజాస్వామ్య దేశాల్లోని రాజకీయ పక్షాలతో పోలిస్తే మన దేశ రాజకీయ పక్షాలు ప్రత్యేకమైన లక్షణాలు కలిగి ఉన్నాయి. రాజకీయ పక్షాలు ప్రజాస్వామ్య వ్యవస్థను బలోపేతం చేస్తూ ప్రజలను రాజకీయ చైతన్యం కలిగిన వారిగా తయారు చేస్తూ అధికారం కోసం ఎన్నికల్లో పోటీ చేసి ప్రభుత్వాధికారాన్ని చేపడతాయి. నేటి ఆధునిక సమాజంలో రాజకీయ పార్టీల విశిష్టత, పాత్ర చాలా ఉన్నది. ప్రజాస్వామ్యంలో రాజకీయ పక్షాలు ఒక అంతర్భాగంగా పరిగణించబడుతున్నాయి. ప్రజాస్వామ్య వ్యవస్థకు ఒక ఆకృతినిచ్చి, అస్థి పంజరంలా నిర్మాణాత్మక పాత్రను నిర్వహించేవి రాజకీయ పక్షాలు. రాజకీయ పక్షాలను జాతీయ, ప్రాంతీయ పార్టీలుగా వర్గీకరించవచ్చును. నేటి మన దేశ రాష్ట్ర రాజకీయ పార్టీలను పరిశీలించినట్లయితే జాతీయ స్థాయిలో కూడా ప్రాంతీయ పార్టీలు ప్రముఖ పాత్ర నిర్వహిస్తున్నాయి. జాతీయ ప్రభుత్వం ఏర్పాటు, సుస్థిరత అనేవి నేటి సంకీర్ణ ప్రభుత్వాల దశకంలో ప్రాంతీయ పార్టీలే నిర్ణాయకమైన పాత్ర పోషిస్తూ, నిర్దేశిస్తున్నాయి.

## 9.10. నమూనా ప్రశ్నలు

1. రాజకీయ పక్షమనగానేమిటో నిర్వచించి, వాటి స్వభావాన్ని, లక్షణాల్ని గురించి వివరించండి ?
2. ఆధునిక ప్రజాస్వామ్యంలో రాజకీయ పార్టీలు విధులు తెలియజేస్తూ వాటి పాత్రను గూర్చి వ్రాయండి ?
3. రాజకీయ పక్షాలను వర్గీకరించి, జాతీయ ప్రాంతీయ పార్టీలను గూర్చి వ్రాయండి ?
4. ఆంధ్రప్రదేశ్ తెలుగుదేశం పార్టీ గురించి, జాతీయ రాజకీయాలలో దాని పాత్రను గురించి తెలియపర్చండి ?

## 9.11. చదువదగిన గ్రంథాలు


1. P. Sharan : Political Theory and Institutions.
2. A. Prasanna Kumar (Edited) : Andhra Pradesh Govt. & Politics
3. G. Ram Reddy & BAV Sharma (Editor) : State Govt., and Political - Andhra Pradesı
4. Dr. V. Krishna Rao - K. Panduranga Rao : భారత ప్రభుత్వం - రాజకీయాలు
5. Dr. K.R. Acharya ( Edite) : ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం - రాజకీయాలు.


డా॥ డి. వెంకటేశ్వరరావు

పాఠం - 10

# కులం-రాజకీయ నాయకత్వం

## 10.0 లక్ష్యం

భారత రాజకీయాలలో కులం యొక్క పాత్ర, దాని అధ్యయనం చాలా ప్రాచుర్యం సంతరించుకున్నది. కారణం భారత రాజకీయాలలో నిర్వహించే పాత్ర ప్రముఖమైనది. ప్రపంచంలోని అభివృద్ధి చెందుతున్న రాజకీయ వ్యవస్థలలో జాతీయ, స్థానిక, గ్రామ స్థాయిల్లో కులం నిర్మాణాత్మక పాత్ర నిర్వహిస్తుందనేది నిర్వివాదాంశం. భారతదేశంలో కుల వ్యవస్థ అనేది సాంప్రదాయబద్ధమైనదైనప్పటికీ రాజ్యాంగం అమలులోకి వచ్చినప్పటి నుండీ రిజర్వేషన్లు అమలు చేయటం మరియు కొన్ని కులాలకు, జాతులకు రాజ్యాంగం రక్షణ కల్పించటం ద్వారా కులం అనేది విశాలమైన పరిధిని కలిగి ఉన్నది. భారతదేశంలో కుల వ్యవస్థ రాజకీయాలలో తనదైన పట్టును కలిగి ఉంది. ప్రాంతీయ తత్త్వం, మత తత్త్వం, భాషాతత్త్వంల వలె కుల తత్త్వం కూడా మన దేశ రాజకీయాలకు పునాదులు వేసింది. భారతదేశంలో ఏ ఒక్క రాష్ట్రం కూడా కుల రాజకీయాలకు అతీతం కాదు. అలాగే ఆంధ్రప్రదేశ్ కూడా కుల రాజకీయాలకు భారత రాజకీయ వ్యవస్థలో తనదైన స్థానాన్ని నిలుపుకుంటున్నది. ఈ పాఠంలో ఆంధ్రప్రదేశ్‌లో కులం-రాజకీయాల పాత్ర, స్వాతంత్ర్యానికి ముందు, తర్వాత రాజకీయాలు, తెలుగుదేశం ఆవిర్భావం తర్వాత రాజకీయాలు తదితర అంశాలు చర్చించటమే ముఖ్య లక్ష్యం.

**విషయసూచిక :**


10.1 కులం - రాజకీయ నాయకత్వం - పరిచయం

10.2 ఆంధ్రప్రదేశ్‌లో కులం రాజకీయాలు

10.3 స్వాతంత్ర్యానికి ముందు రాజకీయాలు

10.4 స్వాతంత్ర్యానంతరం రాజకీయాలు

10.5 1980 తర్వాత ఆంధ్రప్రదేశ్ రాజకీయాలు

10.6. ముగింపు

10.7. సారాంశము

10.8. నమూనా ప్రశ్నలు

10.9. చదువదగిన గ్రంథాలు


## 10.1. కులం - రాజకీయ నాయకత్వం - పరిచయం :

భారతదేశం లాంటి అభివృద్ధి చెందుతున్న రాజకీయ వ్యవస్థలలో కులం మరియు రాజకీయ నాయకత్వం అనేవి అత్యంత ప్రాముఖ్యాన్ని సంతరించుకున్నాయి. ప్రాంతీయ, మత, భాషా తత్త్వాల వలె కుల తత్త్వం కూడా సమాన ప్రాతినిధ్యాన్ని కలిగి దేశ రాజకీయ వ్యవస్థలో కీలక పాత్రను పోషిస్తుంది. తద్వారా కుల రాజకీయాలకు ఆర్యం పోసి రాష్ట్ర, దేశ, స్థానిక నాయకత్వానికి పునాదులు వేస్తుంది. మన దేశ లేక రాష్ట్ర రాజకీయాలను పరిశీలిస్తే ఎన్నికలలో కులాలు ఆధారంగా టిక్కెట్లు ఇవ్వటం, తద్వారా రాజకీయ ప్రవర్తనను ప్రభావితం చేయటం అంతేగాక కులం ఆధారంగానే దేశ, రాష్ట్ర మంత్రి వర్గంలో సమీకరణలు చేయటం వంటివి ప్రస్ఫుటంగా విశదమవుతున్నాయి. మరియు

దేశ రాష్ట్ర రాజకీయాలలో కులం మరియు రాజకీయాల పాత్రను తేటతెల్లం చేస్తున్నాయి. ఒక అభ్యర్థికి రాజకీయ పార్టీలు టిక్కెట్ ఇవ్వాలంటే ఆ నియోజకవర్గంలో అభ్యర్థి కులం, ఆధిపత్యం గల కుల గణాంకాలు, ఇతర కులాల మద్దత్తు ఆ అభ్యర్థి తెచ్చుకోగలడా లేదా? అని ఆలోచించి టిక్కెట్ ఇస్తున్నారంటే కారణం రాజకీయాలలో కులం పాత్ర ఏ మేరకు ఉన్నది మరియు నాయకులకు - కులానికి గల సంబంధం ఏమిటి అనేవి అర్థం అవుతున్నాయి.

స్వాతంత్ర్యానికి ముందు బ్రిటీషు పాలన మూలంగా రవాణా, సమాచార, న్యాయ సంబంధమైన మరియు ఉద్యోగి బృంద వ్యవస్థకు సంబంధించి క్రొత్త చట్టాలు, వ్యవస్థలను రూపకల్పన చేయటంతో కుల వ్యవస్థకు ఇండియాలో గట్టి దెబ్బతగిలింది. తదనుగుణంగా సివిల్ మరియు క్రిమినల్ చట్టాలు కుల పంచాయితీలకు మంగళం పాడి చట్టం ముందు అందరూ సమానులే అనే సూత్రాన్ని అమలు జరిపారు. పాశ్చాత్య విద్య మూలంగా సాంప్రదాయబద్ధ జీవన విధానం పోయి ఆధునిక వైపు ప్రజలు మొగ్గు చూపారు. దీనితో కుల వ్యవస్థ క్షీణిస్తూ కుల ఘర్షణలకు బదులుగా వర్గ పోరాటాలు వచ్చాయి. బ్రిటీషు వారు భారతీయ సమాజంలో అనేక సాంఘికసంస్కరణలు తెచ్చినారు. తర్వాతి కాలంలో బ్రిటీషు వారు తమ ఆధిపత్యాన్ని కాపాడుకోడానికి 'విభజించి' పాలించు అనే సూత్రాన్ని అనుసరిస్తూ కుల మతాల ఆధారంగా భారతీయుల్ని విభజించి పాలించటం ప్రారంభించారు. దీనితో జాతీయ, ప్రాంతీయ స్థాయిల్లో కులపరమైన నాయకత్వ చైతన్యం వచ్చి, అగ్రవర్ణాల వారు, మధ్యతరగతి వారు వారి వారి కుల ప్రాతినిధ్యం కోసం వివిధ సంస్థలలో, పార్టీలలో వర్గాలను ఏర్పాటు చేసుకోవటం ప్రారంభించారు.

## 10.2 ఆంధ్రప్రదేశ్ - కుల రాజకీయాలు :

భారత రాజ్యాంగం స్వేచ్ఛ, సమానత్వం, న్యాయము, సౌభ్రాతృత్వమునకు ప్రాధాన్యత నిచ్చి అంటరానితనాన్ని మరియు కుల వివక్షతను నిర్మూలించి, సార్వత్రిక ఓటు హక్కు వంటి వాటికి గ్యారంటీ ఇవ్వటం జరిగింది. మన దేశం లౌకిక, సామాజిక, ప్రజాస్వామ్య దేశంగా గుర్తించబడి కుల మత రాజకీయాలకు అతీతంగా గుర్తించబడినది. కాని ఆచరణలో పరిస్థితులు అందుకు భిన్నంగా ఉన్నాయి. అందుకు కారణం రిజర్వేషన్ల ద్వారా "రక్షణలో వివక్ష" అనే సూత్రాన్ని అనుసరిస్తూ వివిధ సామాజిక వెనుకబడ్డ వర్గాలకు విద్య, ఉద్యోగావకాశాలు కల్పించబడుటయే. తద్వారా కులం అనేది భారత రాజకీయాలలో కేంద్ర బిందువు అయ్యింది. అందుకనే రాజకీయ వ్యవస్థలో ఒక ప్రభుత్వం ఏర్పాటుకు, మంత్రి వర్గం ఏర్పాటుకు, అభ్యర్థుల ఖరారుకు కులం పునాది అవుతున్నది. భారత రాజకీయాలలో కుల రాజకీయాలు ఒక ముఖ్య లక్షణంగా పరిగణించాల్సి వస్తున్నది. కులాల ప్రాధాన్యత పెరిగి కుల సంఘాల పాత్ర అన్ని స్థాయిలలో గణనీయంగా పెరిగింది. మరియొక విషయం ఏమంటే భారతదేశంలో ఏ ఒక్క రాష్ట్రం లేదా ప్రాంతంగాని కుల రాజకీయాలకు అతీతం కాదు. అందుకు ఆంధ్రరాష్ట్రం భిన్నం కాదు.

ఆంధ్ర రాజకీయాలలో కులం పాత్ర అనేది దేశీయ విదేశీ పరిశోధకులకు ఒక ముఖ్య అధ్యయనంగా మారినది. ఈ అంశాన్ని అధ్యయనం చేస్తూ, వివిధ పరిశోధకులు వారి అభిప్రాయాలను వెలిబుచ్చుతూ కులం ఆంధ్ర రాజకీయాలలో ఒక ముఖ్య కారకంగా అభివర్ణించటం జరిగింది. కొందరి అభిప్రాయంలో కులం ఆంధ్ర రాజకీయాలకు కీలకం అని, మరికొందరి అభిప్రాయంలో కులం పాత్ర చెప్పుకోదగినది కాదని చెప్పటం జరిగింది.

## 10.3 స్వాతంత్ర్యానికి ముందు ఆంధ్ర రాజకీయాలు :

స్వాతంత్ర్యానికి ముందు ఆంధ్ర రాజకీయాలలో కులం పాత్ర తక్కువే అయినప్పటికీ ప్రాధాన్యతను కలిగి ఉన్నది. 1947 వరకూ కాంగ్రెస్ పార్టీలో ఆంధ్ర ప్రాంతానికి చెందిన బ్రాహ్మణుల ఆధిపత్యం ఎక్కువగా ఉండేది. యం.యన్. శ్రీనివాస్ చెప్పినట్లుగా మొట్టమొదటిగా రాజకీయ చైతన్యం బ్రాహ్మణులలో వచ్చినది. కాని వారు ఒక దేశీయ సమూహంగా అధికారం కోసం, వారి ప్రభావాన్ని చూపించటం కోసం

పని చేయలేదు. ఆంధ్రప్రదేశ్‌లో బ్రాహ్మణులు అగ్రవర్ణానికి చెందిన వారు కావటం వలన విద్యా ఉద్యోగ రంగాలలో ముందుండే వారు. వీరు ఎప్పుడూ తమ వ్యక్తిత్వాన్ని చాటుకొనే విధంగా ముఖ్యంగా రాజకీయ రంగంలో నాయకత్వం వహించడానికి మొగ్గు చూపే వారు కాని అనుచరులుగా ఉండటానికి ఇష్టపడేవారు కాదు. అందుచేతనే ఆంధ్రా రాజకీయాలలో పరస్పర వైరుధ్యం, వ్యక్తిగత కక్షలు అనేక దశాబ్దాలుగా కొనసాగాయి. ఉదాహరణకు బ్రాహ్మణ కులానికి చెందిన కొండా వెంకటప్పయ్య మరియు పట్టాభి సీతారామయ్యల మధ్య స్పర్ధలు ఆంధ్రా కాంగ్రెస్‌లో వర్గ విభేదాలకు, రాజకీయాలకు చక్కటి తార్కాణం. మహాత్మా గాంధీకి ఇష్ట పాత్రుడు, గౌరవనీయుడు అయిన కొండా వెంకటప్పయ్యకు పట్టాభి సీతారామయ్యకు దూరం పెరగడానికి కారణం వెంకటప్పయ్యను గాంధీజీ చేరదీస్తూ పట్టాభిని ప్రక్కకు పెట్టి వివక్ష చూపుతున్నారనేది పట్టాభి అభిప్రాయం. అలాగే ఆ తర్వాతి కాలంలో పట్టాభి మరియు టంగుటూరి ప్రకాశం మధ్య విభేదాలు కూడా ఆంధ్రరాజకీయాలలో ముఖ్య ఘట్టాలుగా చెప్పవచ్చు. వీరిద్దరి మధ్య విభేదాలను దుగ్గిరాల గోపాలకృష్ణయ్య బహిరంగంగానే విమర్శించటం విశేషం. ఎందుచేతనంటే ఒకే కులానికి చెందిన పట్టాభి, ప్రకాశంలు తమ విభేదాల ద్వారా కీర్తిగడించడానికా ? లేక తమ వర్గం వారికి ప్రయోజనం చేకూర్చడానికా ? ప్రశ్నించుకొనే విధంగా వారు విభేధించారు. ఈ విధంగా కాంగ్రెస్ పార్టీలో బ్రాహ్మణ వర్గంవారు ఆధిపత్యాన్ని కొనసాగిస్తుండగా రాష్ట్రంలో ఇతర సామాజిక వర్గాలవారైన రెడ్డి కులస్తులు, కమ్మ కులస్తులు కమ్యూనిస్టు పార్టీలో చేరినారు. కమ్యూనిస్టు పార్టీ ప్రాభవం క్రమంగా ఆంధ్ర రాజకీయాలలో పెరుగుతూ వస్తుండటంతో ఈ పార్టీలో బ్రాహ్మణేతరులైన రెడ్డి, కమ్మ కులస్తులు ఆధిపత్యాన్ని చెలాయించటం ప్రారంభించారు. **1946** మరియు **1951** మధ్య కాలంలో పట్టాభి, ప్రకాశంల మధ్య నెలకొన్న విభేదాల కారణంగా, వారి అనుచర వర్గం వారి తగాదాల కారణంగా ఆంధ్ర రాజకీయాలలో ముఖ్యంగా కాంగ్రెస్ పార్టీలో బ్రాహ్మణ వర్గం వారి ఆధిపత్యం క్రమంగా తగ్గనారంభించింది. **1946**లో ప్రకాశం ఉమ్మడి మద్రాసు రాష్ట్రానికి ముఖ్యమంత్రిగా ఉండగా పట్టాభి వర్గీయులు ఆయనకు అనేక ఆటంకాలు కల్పించారు. ఇదే అదునుగా బ్రాహ్మణేతరులైన రెడ్డి, కమ్మ, వేలమ కులస్తులు కాంగ్రెస్ పార్టీలో తమ ఆధిపత్యం కోసం ప్రయత్నాలు ప్రారంభించారు. దీనితో రెడ్డి కులస్తులు కాంగ్రెస్‌లోను, కమ్మకులస్తులు కమ్యూనిస్టు పార్టీలోను నాయకత్వాన్ని చేపట్టి వారి ఆధిపత్య పోరుకు పునాదులు వేసారు. బ్రాహ్మణ నాయకత్వం కాంగ్రెస్ పార్టీలో కనుమరుగైన తర్వాత ఆంధ్ర రాజకీయాలలో రెడ్డి - కమ్మ కులస్థుల ఆధిపత్య పోరుతో ఆంధ్ర రాష్ట్రం మరియొక రాజకీయ రణరంగంగా మారిపోయి నూతన అధ్యాయానికి తెరతీసినది.

## 10.4. స్వాతంత్ర్యానంతరం రాజకీయాలు :

స్వాతంత్ర్యానికి ముందు ఆంధ్ర రాజకీయాలలో బ్రాహ్మణుల ఆధిపత్యం ఉండగా స్వాతంత్ర్యానంతరం అంటే **1951** తర్వాత బ్రాహ్మణేతర కులాలు అంటే కమ్మ, రెడ్డి, వేలమ కులాలు ఆధిపత్య పోరుతో ఆంధ్ర రాజకీయాలు అనేక మలుపు తిప్పాయి. బ్రాహ్మణ కులస్థులు విద్యారంగంలోను, రాజకీయ రంగంలోను ఆద్యులుగా తమ ప్రాభవాన్ని ముందు ప్రారంభించినప్పటికీ బ్రాహ్మణేతరుల సంఖ్యతో పోలిస్తే అల్ప సంఖ్యాకులుగా తమ ఆధిపత్యాన్ని ఎక్కువ కాలం కొనసాగించలేకపోయారు. అయితే రెడ్డి కులస్తులు వ్యవసాయపరంగా పట్టు సాధించి ఆ తర్వాత రాజకీయాలలోను మరియు పాలనలోను తమదైన ముద్రను కలిగి ఉన్నారు. కమ్మ కులస్తులు కూడా వ్యవసాయంలో పట్టు ఉన్నప్పటికీ వీరు పారిశ్రామిక వ్యాపార రంగాల్లో అభివృద్ధిని సాధించి సామాజికంగా, ఆర్థికంగా బలమైన వర్గంగా రూపుదిద్దుకున్నారు. ఆంధ్ర రాజకీయాలలో బ్రాహ్మణ కులం తర్వాత రెడ్డి కమ్మ కులస్థులు ఆధిపత్య పోరు సాగించి రాష్ట్రంలో తమదైన ఉనికిని కలిగి ఉన్నారు. అందుచేతనే రాయలసీమను రెడ్డి సీమగా, డెల్టా ప్రాంతాన్ని కమ్మ రాష్ట్రంగా పిలుస్తారు. **1951** తర్వాత బ్రాహ్మణుల ఆధిపత్యం అంతరించడంతో ఆంధ్ర రాజకీయాలలో ఒక వినూత్న మార్పు వచ్చింది. రెడ్డి, కమ్మ, వేలమ కులాల వారు రాష్ట్రంలో ముఖ్యమైన స్థానాన్ని అధిరోహించడం మొదలు పెట్టారు. యన్.జి. రంగా కాంగ్రెస్‌లో కమ్మ కులస్తుల పట్టు కోసం ప్రయత్నించిన ప్రముఖుడు. ఆంధ్ర రాజకీయాలు యన్.జి రంగా ప్రవేశంతో ఊపందుకొని కమ్మవర్గం వారు అధికారానికి చేరువలో ఉండగా **1951** లో వారికి గట్టి దెబ్బ తగిలింది. కారణం అదే సంవత్సరంలో నీలం సంజీవరెడ్డితో యన్.జి. రంగా కాంగ్రెస్ అధ్యక్ష పదవికి పోటీ చేసి ఘోరంగా ఓడిపోవటం జరిగింది. దీనితో రెడ్డి వర్గం వారికి ఆంధ్ర రాజకీయాలలో ఆధిపత్యానికి ప్రారంభ శూచిక అయ్యింది. **1953**లో సంజీవరెడ్డి వర్గానికి చెందిన టంగు[illegible] ఆంధ్ర రాష్ట్ర ముఖ్యమంత్రిగా ఎన్నిక కావడం అన్ని వర్గాలవారూ ఆనందించారు. దీనితో తెలంగాణాలో

రెడ్డి-బ్రాహ్మణ వర్గాలు ఏకమై బలమైన రెడ్డి ఆధిపత్యానికి పునాదులు వేయటం జరిగింది. అంతేగాక రెడ్డి కులస్తులు కాంగ్రెస్ పార్టీకి వెన్నెముకగా రూపుదిద్దుకొని ఆంధ్ర రాజకీయాలలో తమదైన ముద్రను వేసారు.

1956-1971 మధ్య కాలంలో మంత్రి వర్గంలో ఉన్న వివిధ మంత్రుల కులాలను పరిశీలించినట్లయితే రెడ్డి మరియు ఇతర అగ్ర వర్ణాల వారి ఆధిపత్యం కనిపిస్తుంది. 1971వ సంవత్సరం వరకూ రెడ్డి, వేలమ మరియు కమ్మ కులస్తులు 45 నుండి 48 శాతం వరకూ మంత్రి వర్గాలలో స్థానాల్ని పొంది ఉండగా వీరిలో ఒక్క రెడ్డి కులం వారు 28 నుండి 38 శాతం వరకూ స్థానాల్ని పొంది తమ ఆధిపత్యాన్ని కొనసాగిస్తూ వచ్చారు. ఇదే కాలంలో వెనుకబడిన లేక షెడ్యూలు కులాలకు చెందినవారు 25 శాతం మాత్రమే మంత్రి వర్గాల్లో స్థానం పొందడం గమనార్హం. అలాగే జిల్లా పరిషత్ చైర్మన్ విషయానికొస్తే మొత్తం 21 జిల్లా పరిషత్‌లలో 15 రెడ్డి కులానికి చెందిన చైర్మన్‌లు ఉండటం విశేషం. పంచాయితీ సమితి అధ్యక్ష స్థానాలకొస్తే 322కు గాను 145 రెడ్డి కులస్తులే ఉండటం వారి ఆధిపత్యానికి ప్రతీక. అంతేగాక మంత్రి వర్గంలో కూడా రెడ్డి కులస్తులే ప్రాధాన్యత కలిగిన పోర్టిఫోలియోలు కలిగి ఉండటం గమనించదగినది. గ్రామ స్థాయి నుండి జిల్లా స్థాయి వరకూ, జిల్లా స్థాయి నుండి రాష్ట్రస్థాయి వరకూ రెడ్డి-కమ్మ కులస్థులే ఆర్థికంగా, రాజకీయంగా బలమైన వర్గాలుగా ఎదిగారు. గుర్తుంచుకోవాల్సిన విషయం ఏమంటే అసెంబ్లీ, పార్లమెంటుకు ఆంధ్ర రాష్ట్ర సభ్యులలో 1/4 వంతు రెడ్డి కులస్తులుండటం విశేషం. అందుచేతనే రాష్ట్ర, జాతీయ మంత్రి వర్గాలలో వారు ఎక్కువ స్థానాల్ని పొందగలిగేవారు. 1956లో ఆంధ్ర తెలంగాణా ప్రాంతాల్ని ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంగా గుర్తించటంతో మొదటి రెండు దశాబ్దాలూ రెడ్డి కులం వారు ఆధిపత్యం కొనసాగించగా, 1960-62 సంవత్సరాల మధ్య కాలంలో యస్.సి. కులానికి చెందిన దామోదరం సంజీవయ్య, 1971-72 సంవత్సర కాలంలో బ్రాహ్మణ వర్గానికి చెందిన పి.వి. నర్సింహారావులు ముఖ్యమంత్రులుగా కొనసాగటం కష్టమైంది. 1973-1978 సంవత్సరములలో వెలమ కులానికి చెందిన జలగం వెంగళరావు కమ్మ కులస్తుల మద్దత్తుతో ముఖ్యమంత్రిగా కొనసాగారు. ఈ కాలంలోనే కమ్మ కులస్తులు కాంగ్రెస్ పార్టీలో జలగం వెంగళరావు మద్దత్తుతో తమ ఉన్నతికి ప్రముఖంగా ప్రయత్నించటం జరిగింది. అయితే రాష్ట్ర రాజకీయాలలో మర్రి చెన్నారెడ్డి రాకతో, రెడ్డి కులస్థుల ప్రాభవం మళ్ళీ పుంజుకున్నది. అయితే రాయలసీమ, తెలంగాణ మరియు సర్కారు జిల్లాలలో రెడ్డి కులస్తులలో ఐక్యత ఉన్నప్పటికీ రెడ్డి కులానికి చెందిన యువ నాయకులు అదే కులానికి చెందిన సీనియర్ నాయకులపై అసంతృప్తితో ఉన్నారనేది యదార్థం.

## 10.5. 1980 తర్వాత ఆంధ్ర రాజకీయాలు :

1980 తర్వాత ఆంధ్ర రాజకీయాలు వినూత్నంగా మలుపు తిరిగాయి. కారణం సుదీర్ఘ కాంగ్రెస్ పాలనలో వెనుకబడిన తరగతులు మరియు ఇతర వర్గాల వారు నిర్లక్ష్యానికి గురాయ్యారనేది యదార్థం. అలాగే కాపు లేక వెలగ కులస్తులు రాష్ట్ర జనాభాలో అత్యధిక జనాభా అయినప్పటికీ వీరికి కాంగ్రెస్‌లో సరియైన ప్రాతినిధ్యం ఇవ్వబడలేదు. దీనితో వివిధ సామాజిక వర్గాలు, ప్రజలు కాంగ్రెస్‌పాలనలో అసంతృప్తికి లోనై నిర్లక్ష్యానికి గురి కాబడ్డారు. అంతేగాక అతి తక్కువ కాలంలో తరచుగా ముఖ్యమంత్రుల్ని మార్చడం, అవినీతి, ముఠా తగాదాలు వగైరాలు కాంగ్రెస్ పాలనపై అసంతృప్తికి కారణాలు. ఈ నేపధ్యంలో 1980 సంవత్సరములో ప్రముఖ సినీ నటుడు, ఆంధ్రుల ఆరాధ్యదైవం అయిన యన్.టి. రామారావు తెలుగుదేశం అనే ప్రాంతీయ పార్టీని నెలకొల్పడం ఆంధ్రప్రదేశ్‌లోని కమ్మ కులానికి ఊరట కలిగించింది.

ఒక సినిమా నటునిగా ఆంధ్రప్రదేశ్‌లో అన్ని వర్గాల నుండి, అన్ని ప్రాంతాల వారి నుండి అభిమానాన్ని చూరగొనిన వెండితెర వెలుగు యన్.టి. రామారావు పార్టీని స్థాపించటంతో కమ్మకులస్తులతో బాటు ఆంధ్రప్రదేశ్ ప్రజానీకానికి ఊరటగా, బాసటగా ప్రత్యామ్నాయం ఒకటి దొరికినట్లయినది. కాంగ్రెస్ పార్టీలో ఉంటూ రెడ్డి వర్గం వివక్షతకు గురైన నాదెండ్ల భాస్కరరావు, ఉపేంద్రలు కమ్మకులానికి చెందినవారే. యన్.టి. రామారావు రాజకీయ రంగ ప్రవేశంతో వీరు కాంగ్రెస్‌కు రాజీనామా చేసి తెలుగుదేశంలో చేరి రాష్ట్రంలో వివిధ రంగాలలో ప్రముఖంగా ఉన్న కమ్మ వారందరినీ యన్.టి. రామారావుకు మద్దత్తుగా నిలిపారు. ఈనాడు పత్రిక (కమ్మ వర్గానికి చెందిన రామోజీరావుది) కాంగ్రెస్ అవినీతి పాలనను ప్రచారం చేసి ఆంధ్రుల రక్షకుడుగా యన్.టి. రామారావును ప్రచారం చేయటం జరిగింది. దీనితో 1983లో తెలుగుదేశం పార్టీ యన్.టి. రామారావు సారధ్యంలో అధికారాన్ని చేపట్టడం జరిగింది. యన్.టి. రామారావు ముఖ్యమంత్రిగా ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసిన 18 నెలల కాలంలో తెలుగు దేశం పార్టీ స్థాపకుల్లో ఒకరైన నాదెండ్ల భాస్కరరావు అధికారం కొరకు కుట్రపన్ని,

పార్టీని వదలి, కాంగ్రెస్ మద్దత్తుతో 1984 ఆగస్టులో ముఖ్యమంత్రి అయ్యాడు. అపూర్వ ప్రజాభిమానం ఉన్న యన్.టి. రామారావు శాసనసభను రద్దు చేసి అదే సంవత్సరంలో తిరిగి అధికారానికి రావటం జరిగింది. 45 నుండి 50 శాతం జనాభా కలిగిన వెనుకబడిన తరగతి వారి మద్దత్తుతో ఇతర కులాల ప్రాభవం ముఖ్యంగా రెడ్డి కులస్తుల ఆధిపత్యానికి అడ్డుకట్ట వేయటమే యన్.టి. రామారావు ప్రణాళిక. అంతేగాక కరణం మరియు మునసబు పదవుల్ని రద్దు చేసి గ్రామాధికారుల పాలనకు అంకురార్పణ చేయుటంతో బ్రాహ్మణ మరియు ఇతర కులాల ఆధిపత్యం గ్రామస్థాయిలో అంతమయ్యింది. అలాగే పంచాయితీ రాజ్ వ్యవస్థలో 50 శాతం సీట్లు వెనుకబడిన తరగతివారికి కేటాయించటంతో ఆది నుంచి పంచాయితీ రాజ్‌లో ఆధిపత్యం గలిగిన కమ్మ వర్గం వారికి వ్యతిరేక వర్గం అయిన రెడ్డి వర్గాన్ని తగ్గించటం, వెనుకబడిన వర్గం వారి మద్దత్తు తెచ్చుకోవటం జరిగింది. ఆ తర్వాత కాలంలో రామారావు కుటుంబ పాలన, తన కులం, వర్గం వారి ఉన్నతికే తన ప్రభుత్వం పని చేయుటం, ముద్రగడ పద్మనాభం రాజీనామాతో రామారావు ప్రభుత్వం ప్రజలలో వ్యతిరేకతను సంతరించుకున్నది. ఇదే సమయంలో కుల పోరాటాలు, రాజకీయాలు 1988వ సంవత్సరంలో క్రొత్త రూపు దిద్దుకున్నాయి. కారణం కోస్తా జిల్లాల్లో కాపు వర్గానికి చెందిన కాంగ్రెస్ నాయకుడు వంగవీటి మోహన రంగారావును డిసెంబర్ 26వ తేదీ 1988 వ సంవత్సరంలో హత్య చేయటం జరిగింది. దీనితో కాపు కులస్తులు రెచ్చిపోయి కృష్ణాజిల్లాలోని కమ్మవారి ఆస్తులను ధ్వంసం చేయటం జరిగింది. దీనితో ఆంధ్ర రాజకీయాలలో కమ్మ-కాపు వైషమ్యాలు నూతనరూపం దిద్దుకున్నాయి.

1989వ సంవత్సరంలో రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అధికారాన్ని చేపట్టింది. కాని నాలుగు సంవత్సరములలో చెన్నారెడ్డి, జనార్ధనరెడ్డి, విజయభాస్కరరెడ్డిలను ముఖ్యమంత్రులుగా మార్పు చేయటం జరిగింది. అంతేగాక రెడ్డి కుల వర్గాన్ని, వారి అభీష్టాన్ని సంపాదించనందుకు రెడ్డి కులస్తుల ఆగ్రహానికి కాంగ్రెస్ ప్రభుత్వం గురి కావాల్సి వచ్చింది. ఈ కాలంలోనే అనుకూల, వ్యతిరేక కుల వర్గాలు ఏర్పడటం, పత్రికలలోను, కరపత్రాలతోను నిందించుకోవటం, పాలనా యంత్రాంగం కుల ఆధారిత పాలన కొనసాగించటం ఆంధ్రప్రదేశ్‌లో కుల రాజకీయాలకు, వైషమ్యాలకు అద్దం పట్టింది. సిద్ధాంతాలు, సూత్రాలు తుంగలో తొక్కి, అన్ని రాజకీయ పక్షాలు ఎన్నికల్లో కుల రాజకీయాలు చేసాయి. యం.యన్. శ్రీనివాస్ అభిప్రాయంలో కమ్యూనిష్టుపార్టీ తమ అభ్యర్థుల్ని స్థానిక సామాజిక కుల వర్గం నుండి అంటే ఆధిపత్యం గల స్థానిక కుల అభ్యర్థుల్ని ఎంపిక చేయటం జరిగిందని, వారు తెలుగుదేశానికి మద్దతునిస్తారని కారణం వారు యన్.టి. రామారావు కులానికి చెందినవారేనని అభిప్రాయపడ్డారు. దీనిని బట్టి ఆంధ్ర రాష్ట్రంలో కులాల పాత్ర ఏపాటిదో తెలుస్తుంది.

1994 అసెంబ్లీ ఎన్నికల్లో రామారావు సారధ్యంలో తెలుగుదేశం పార్టీ అధికారంలోకి రావటం, ఆ తర్వాత రామారావుగారి అల్లుడు నారా చంద్రబాబునాయుడు మామ గార్ని పదవీచ్యుతుడ్ని చేసి అధికారం చేపట్టడం జరిగింది. 1996 పార్లమెంటు ఎన్నికల్లో యన్.టి.ఆర్. వారసునిగా చంద్రబాబు నిరూపించుకోవటం, యన్.టి.ఆర్. రెండవ భార్య లక్ష్మీపార్వతి యన్.టి.ఆర్. తెలుగుదేశం పార్టీని స్థాపించటం జరిగింది. 1999 సంవత్సరంలో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో చంద్రబాబునాయుడు తిరిగి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసి ముఖ్యమంత్రిగా ఎన్నికయ్యారు. కాని 2004లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో అధికారాన్ని కోల్పోయి, కాంగ్రెస్ పార్టీకి అధికారాన్ని అప్పగించటం జరిగింది. 2004లో వై.యస్. రాజశేఖర్ రెడ్డి నాయకత్వంలో కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసి తిరిగి రెడ్డి కుల రాజ్యానికి నాంది పలికింది. దాదాపు రెండు దశాబ్దాల విరామం తర్వాత కాంగ్రెస్ పార్టీ ప్రతిపక్ష పాత్ర నుండి అధికార పక్షానికి రాగల్గింది. 9 సంవత్సరాల చంద్రబాబు తెలుగుదేశం పాలనలో వెనుకబడిన వర్గాల వారికి, కాపుకులస్తులకు పెద్ద పీట వేయటం జరిగింది. కాని చంద్రబాబు విధానాలు, నియంతృత్వ ధోరణితో పార్టీ వర్గాలు, రైతులు చాలా ఇబ్బందులకు లోను కావల్సి వచ్చింది. ఈ పరిస్థితుల్లో చంద్రబాబు వ్యవసాయ నీటి పారుదల రంగాలను విస్మరించాడంటూ వై.యస్. రాజశేఖర్‌రెడ్డి రాష్ట్రంలో సుదీర్ఘ పాద యాత్ర చేయటం వ్యవసాయ, రైతు, మధ్య తరగతుల వారిని ఆకర్షించింది. అంతేగాక రెడ్డి కులస్తులందరూ రాష్ట్రంలో వారి వారి విభేదాలు మరచిపోయి కాంగ్రెస్ గెలుపుకు కృషి చేసారు. దీనితో ఆంధ్రప్రదేశ్ రాజకీయాలలో రెడ్డి వర్గంవారి ఆధిపత్యం తిరిగి మొదలైందని భావించవచ్చు.

## 10.6. ముగింపు :

ఆంధ్ర రాజకీయాలు ఆసక్తి గొలిపే అధ్యయనానికి బాటలు వేస్తుంది. కారణం గత 50 సంవత్సరాల నుండీ ఆంధ్రప్రదేశ్ రాజకీయాలను నిశితంగా పరిశీలిస్తే అగ్ర కులానికి చెందిన నాయకులే అధికంగా ఉన్నారు. ఆంధ్రప్రదేశ్ ఏర్పడిన నాటి నుండీ అంటే 1956 నుండీ

గణాంకాలు పరిశీలించినట్లయితే 18 మంది ముఖ్యమంత్రులలో ఒకేఒక్కరు షెడ్యూలు కులానికి చెందిన వారు. ఒకరు బ్రాహ్మిణ్, ఒకరు వేలమ, కాగా 10 మంది రెడ్డి కులస్తులు మరియు నలుగురు కమ్మ కులానికి చెందినవారు. అంటే అగ్ర కులానికి చెందిన ధనవంతులు, భూస్వాములు మాత్రమే ముఖ్యమంత్రులు కాగలిగారనేది యదార్థం. అంతేగాక వివిధ మంత్రి వర్గాలలో ముఖ్యమైన పోర్టిఫోలియోలు అధిష్టించింది కూడా ఈ సామాజిక వర్గానికి, కులాలకు చెందినవారే. ఇదే సమయంలో వెనుకబడిన తరగతులు మరియు షెడ్యూలు కులాల వారు క్రమంగా మంత్రి వర్గాలలో వారి వారి ప్రాతినిధ్య నిష్పత్తిని పెంచుకుంటూ వస్తుండటం గమనార్హం. అంతేకాదు పార్టీ అధ్యక్ష పదవులు, ఇతర ముఖ్య స్థానాలు బలహీన వర్గాలకు కేటాయించటం కూడా ఆంధ్ర రాజకీయాలలో గమనించదగిన విషయం. కాంగ్రెస్‌తో బాటు అన్ని రాజకీయ పార్టీలూ బలహీన వర్గాలకు ముఖ్యమైన పదవులు, స్థానాలు కట్టబెట్టడం విదితమే. అంటే అన్ని రాజకీయ పార్టీలూ, రాజకీయంగా తక్కువ ప్రాధాన్యత కలిగిన కులాలను నిర్లక్ష్యం చేస్తే వారు తమ ఆధిపత్యానికి సవాలుగా మారతారని గుర్తించటం జరిగింది. అందుకనే గత దశాబ్దం కాలం ఆంధ్ర రాజకీయాలలో వెనుకబడిన, బలహీన వర్గాలకు చెందిన కులాలవారు ముఖ్య భూమికను పోషించటం గమనించదగ్గ పరిణామం. స్థానిక రాష్ట్ర స్థాయిలో నూతన యువ నాయకత్వం రాజకీయ అధికారంలో ఎక్కువ శాతాన్ని తమ వెనుకబడ్డ తరగతులకు కావాలని వత్తిడి చేయటం కూడా గుర్తించదగిన విషయం. మార్పు అనేది సహజమే అయినా, అది నిర్లిప్తంగా జరిగినా, ఉవ్వెత్తున జరిగినా, సామాజిక రాజకీయ మార్పు ప్రస్తుత వ్యవస్థలో తప్పనిసరి.

## 10.7. సారాంశము :

ఈ పాఠ్యాంశంలో ఆంధ్రప్రదేశ్ కుల రాజకీయాలు, నాయత్వం అనే అంశాన్ని అనేక భాగాలుగా విభజించి విపులంగా చర్చించటం జరిగింది. భారత రాజకీయాలలో ఆంధ్రప్రదేశ్ రాజకీయాలు చాలా ముఖ్యమైనవి. భారతదేశంలో ఏ ఒక్క రాష్ట్రం కూడా కుల రాజకీయాలకు అతీతం కాదనేది జగద్విదితమే. ప్రతి రాజకీయ వ్యవస్థలోనూ కులం మరియు రాజకీయ నాయకత్వం అనేవి కీలక పాత్ర పోషిస్తాయి. రాష్ట్ర రాజకీయాలలో కులాలు ఆధారంగా పార్టీ టిక్కెట్లు, మంత్రి వర్గంలో స్థానం కల్పించటం, తద్వారా ఎన్నికలను, ఓటర్లను ప్రభావితం చేయటం, సామాజికంగా వెనుకబడిన తరగతుల వారిని కులం పేరుతో ఆకర్షించటం అనేవి సహజ కార్యకలాపాలుగా మారాయి. స్వాతంత్ర్యానికి ముందు రాష్ట్ర రాజకీయాలలో బ్రాహ్మణ వర్గం వారు ఆధిపత్యాన్ని చెలాయించగా స్వాతంత్ర్యానంతరం రెడ్డి-కమ్మ కుల వర్గాలు ఆధిపత్యం కోసం రాష్ట్రాన్ని ఒక ఆట స్థలంగా మార్చుకున్నారు. దానితో రెండు వర్గాల మధ్య ఆధిపత్య పోరులో బలహీన లేక వెనుకబడిన వర్గాల మద్దత్తు కోసం వివిధ రకాల విధానాలు, పద్ధతులతో ముందుకెళుతున్నాయి. ఏది ఏమైనప్పటికీ రాష్ట్రంలో ఇంత వరకూ ఆధిపత్యం చెలాయించిన నాయకులు అందరూ అగ్ర వర్ణాలకు ముఖ్యంగా రెడ్డి-కమ్మ కులాలకు చెందినవారే. నిజానికి ఈ రెండు కులాలు సంఖ్యా పరంగా అల్ప సంఖ్యాకులైనప్పటికీ అధిక సంఖ్యాకులైన బలహీన, వెనుకబడిన తరగతి వారి మద్దత్తును పొందటంతో తమ నాయకత్వాన్ని, ఆధిపత్యాన్ని గత అర్థ శతాబ్దంగా నిలుపుకోగల్గుతున్నారు. ఆంధ్రప్రదేశ్ రాజకీయాలు అంటే రెడ్డి-కమ్మ కులాల రాజకీయాలుగా ప్రాచుర్యం పొందాయి అనటంలో అతిశయోక్తికాదు.

## 10.8. నమూనా ప్రశ్నలు

1. ఆంధ్రప్రదేశ్ రాజకీయాలలో కులం పాత్ర అంచనా వెయ్యండి ?
2. స్వాతంత్ర్యానంతరం ఆంధ్రప్రదేశ్‌లో నాయకత్వ పోరును గూర్చి విపులంగా చర్చించండి ?
3. "ఆంధ్రప్రదేశ్ రాజకీయాలు రెడ్డి-కమ్మ కులాల రాజకీయాలే" చర్చించండి.
4. "ప్రజాస్వామ్యంలో కుల రాజకీయాలు సహజం" - దీనిని ఆంధ్రప్రదేశ్‌కు అన్వయించండి. ?

## 10.9. చదువదగిన గ్రంథాలు


1. Prof. A. Prasanna Kumar (Editor) : Andhra Pradesh Government and Politics
2. J.C. Johari : Indian Politics
3. G. Ram Reddy and B.A.V. Sharma : State Govt. and Politics
4. Dr. K.R. ఆచార్య : ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం - రాజకీయాలు


డా॥ డి. వెంకటేశ్వరరావు

పాఠం - 11

# ప్రభావ వర్గాలు
# (Pressure Groups)

## 11.0 లక్ష్యం :

ప్రభావ వర్గాలు లేదా వత్తిడి వర్గాలు అనగానేమి, వాటి లక్షణాలను, లక్ష్యాలను, అవి ఎలా పనిచేస్తాయి. తమ లక్ష్యసాధనకు అవి అనుసరిస్తున్న పద్ధతులను, వాటి ప్రాధాన్యత గురించి వివరించడము.

## విషయక్రమం :


11.1 పరిచయం
11.2 ప్రభావ వర్గాలు - అర్థము
11.3 ప్రభావ వర్గ లక్షణాలు
11.4 ప్రభావ వర్గాలు - రాజకీయ పార్టీల మధ్య వ్యత్యాసాలు
11.5 ప్రభావ వర్గాలు - వివిధ రకాలు
11.6 ప్రభుత్వ విధానాలు - ప్రభావ వర్గాలు
11.7 ప్రభావ వర్గాల విధులు
11.8 ప్రభావ వర్గాలు తమ లక్ష్య సాధనంలో అనుసరించు పద్ధతులు
- 11.8.1 లాబియింగ్
- 11.8.2 సమ్మె
- 11.8.3 బంద్
- 11.8.4 ఘూరావ్
- 11.8.5 రాజ్యాంగేతర పద్ధతులు
- 11.8.6 ఉపన్యాసాలు, గోష్ఠులు, చర్చలు

11.9 ప్రభావ వర్గాల ప్రాధాన్యము
- 11.9.1 సమతౌల్యం కాపాడుట
- 11.9.2 ఎన్నికల్లో ప్రభావ వర్గాల కీలక పాత్ర వహించుట
- 11.9.3 శాసన సభల్లో ప్రభావ వర్గాల ప్రభావము
- 11.9.4 విధాన నిర్ణేతలపై ప్రభావ వర్గాల ప్రభావము
- 11.9.5 ప్రజాభిప్రాయ రూపకల్పనలో ప్రభావ వర్గాల ప్రభావము
- 11.9.6 ప్రజలను చైతన్య పరచడం

11.10 సారాంశము
11.11 నమూనా ప్రశ్నలు
11.12 చదువవలసిన గ్రంథాలు

## 11.1 పరిచయం :

ఆధునిక ప్రజాస్వామ్య రాజ్యాల్లో ప్రభావ వర్గాలు (Pressure Groups) ప్రభుత్వ విధాన రూపకల్పన, అమల్లో ప్రముఖ పాత్రవహించగా, నియంతృత్వ రాజ్యాలల్లో వాటిక స్థానమేలేదు. ప్రభావ వర్గాలు వివిధ సమూహాల (Groups) ఆసక్తులను వ్యక్తీకరించి వాటి ప్రయోజనాలకు అనుగుణంగా ప్రభుత్వ నిర్ణయాలను విధానాలను రూపొందించటలో ప్రభుత్వంపై తీవ్రమైన వత్తిడి తీసుకొనస్తాయి.

ఆర్థర్ బెంట్లీ (Arthur Bentley) " ది ప్రొసస్ ఆఫ్ గవర్నమెంట్" (The Process of Government) అనే గ్రంధములో (1908) ప్రభావ వర్గాల అధ్యయనానికి రాజు నీతిశాస్త్రం నందు శ్రీకారం చుట్టారు. ఆయన అనంతరం చార్లస్ హసన్, ఎరల్ లాధమ్, గాబ్రియల్ ఆల్మండ్ మొదలగు వారు పశ్చిమ రాజ్యాల్లో ప్రభావ వర్గాలు ఏ విధంగా ఉధ్భవించినవి, ఎలాంటి కర్తవ్యాలను అవి నిర్వహిస్తున్నాయి మొదలగు అంశాలపై కూలంకషంగా అధ్యయనం చేసిన వారిలో ముఖ్యులు.

## 11.2 ప్రభావ వర్గాలు - అర్ధము :

ప్రభావ వర్గం అనగా ప్రభుత్వం ద్వారాగానీ ఇతరత్రాగాన్ని రాజకీయ మార్పు తీసుకురావటానికి ప్రయత్నించే రాజకీయ పార్టీయేతర సంస్థ. ప్రభావ వర్గాలు రాజకేయేతర సంస్థలు లేదా వర్గాలు అయినప్పటికీ అవి రాజకీయాలతో సంబంధం కలిగి ప్రభుత్వ విధానాలనూ, పద్ధతులనూ మార్చటానికి ప్రయత్నిస్తాయి. చట్టాలను, పాలనా వ్యవస్థను తమ ప్రయోజనాల కనుగుణంగా ప్రభావితం చేస్తాయి. ఇవి సమాజంలోని వివిధ ప్రత్యేక ఆసక్తులు కలిగి ఉన్న సమాహాలకు ప్రాతినిద్యం వహిస్తాయి. ఉదా. రైతులు, వ్యాపారస్థులు, కార్మికులు, ప్రభుత్వ ఉద్యోగులు, మహిళలు మొదలగు వారు. వీటి ప్రధాన ధ్యేయము తాము ప్రాతినిధ్యం వహిస్తున్న సమూహాల (Group) కోరికలను లేదా ప్రయోజనాలను వ్యక్తీకరించి వాటి ప్రయోజనాల సాధన కోసం శాసనసభ, ఉద్యోగుల బృందాలపై తగిన విధంగా వత్తిడి తీసుకొచ్చి, తమ సమూహాల ప్రయోజనాలను పొందుటకై ప్రయత్నించటం, అందులో విజయాన్ని సాధించటం. హిచ్‌నర్ మరియు హార్బల్ట్ ప్రభావ వర్గములను ఈ విధంగా నిర్వచించినాడు. "ఓ కొద్ది మంది వ్యక్తులు సమిష్టి ప్రయోజనముల కొరకు రాజకీయ ప్రక్రియ ద్వారా ప్రభుత్వ విధానమును ప్రభావితము చేయగలుగుతారో వారే ప్రభావ వర్గాలు".

## 11.3 ప్రభావ వర్గాల లక్షణాలు :

ప్రబావ వర్గాలకు ఈ క్రింది లక్షణాలు కలిగి ఉంటాయి. అవి.

1 ప్రభావ వర్గాల ప్రాబల్యము ఆయా రాజ్యాల - స్వభావము, పని తీరుపై ఆధారపడి ఉంటుంది. కావున ప్రతి ప్రభావ వర్గానికీ ఒక నిర్దిష్ట ప్రయోజనం ఉంటుంది. దానిని సాధించటానికే అది ఏర్పడుతుంది.

2 ప్రభావ వర్గం రాజకీయేతర సంస్థగా రూపొందుతుంది. అది ఏ ఒక్క రాజకీయ పక్షంతో ప్రత్యక్షంగా సంబంధం లేకుండా, దానికి అనుబంధ సంస్థగా పని చేయకుండా తన సభ్యుల ప్రయోజనాల సాధనకే కృషి చేస్తుంది.

3 ప్రభావ వర్గానికి ఒక నిర్దిష్టమైన రాజకీయ ప్రణాళికగాని, కార్యక్రమం అంటూ ఏదీ ఉండదు. ఒక్క మాటలో చెప్పాలంటే రాజకీయేతర కార్యక్రమాల్లో పాల్గొనే సంస్థగా ప్రభావ వర్గాన్ని భావించ వచ్చును.

4 ప్రభావ వర్గం సాధారణంగా రాజకీయ ప్రక్రియలో ప్రత్యక్షంగా పాల్గోనదు. అయితే తన ప్రయోజనాలను పరిరక్షస్తారనుకొన్న అభ్యర్ధులకు కొన్ని సందర్భాల్లో ఎన్నికల్లో సహాయ సహకారాలను అందిస్తాయి.

5 తమ సభ్యుల ప్రయోజనాలకై ప్రభుత్వ విధానాలను, నిర్ణయాలను ప్రభావితం చేయటానికి నిరంతరం కృషి చేస్తాయి.

6 ప్రభావ వర్గాలకు ప్రత్యేకమైన రాజకియ నిబద్ధత అంటూ ఏదీ లేదు. వ్యాపార వర్గాలు అన్ని పార్టీల పట్ల ఆసక్తి చూపిస్తారు. ఎందుకనగా ఏ రాజకీయ పక్షం అధికారంలోకి వచ్చినప్పటికీ తమ ఆస్తులు మాత్రం భద్రంఘా ఉండాలన్నిది వారి ధ్యేయం. అయితే అధికార పక్షం పట్ల ఇతర రాజకీయ పక్షాల కంటే ఎక్కువ మొగ్గు చూపిస్తాయి.

7 ప్రభావ వర్గాలు తమ లక్ష్య సాధనకై రాజ్యాంగేతర పద్ధతులను అవలంబించుటానికి కూడా వెనుకాడవు.

## 11.4 ప్రభావ వర్గాలు - రాజకీయ పార్టీల మధ్య వ్యత్యాసం:

1 ప్రభావ వర్గాల ప్రధాన ధ్యేయము రాజకీయధికారమును చేజిక్కించుకొనుట కాదు. తమ సమూహాల ప్రయోజనాలను సాధించటము క్కాగా, రాజకీయ పార్టిలకు రాజ్యాధికారము చేజిక్కించుటకై పోటీ పడతాయి.

2 ప్రభావ వర్గాల ప్రయోజనాలను కాపాడుటలో ప్రభుత్వం చేయు తప్పుఒప్పులను గూర్చి ప్రజలకు వివరించగా, జాతీయ విధానాలపై ప్రభుత్వం అవలంబిస్తున్న నిర్లప్త వైఖరిని గురించి రాజకీయ పార్టిలు ప్రజలకు విశదీకరించును.

3 రాజకీయ పార్టీలు అధికారము కొరకై ఎన్నికల్లో పోటీపడతాయి ఆ పోటీలో అత్యధిక స్థానాలు పొందిన పార్టి ప్రభుత్వంను ఏర్పరచగా, అల్పస్థానాలు పొందిన పార్టిలు ప్రతిపక్ష స్థానంలో కూర్చుంటాయి. వత్తిడి వర్గాలు ఎన్నికల్లో పోటీ చేయవు. అయితే వివిధ రాజకీయ పార్టీల్లోని తమ సానుభూతి పరులు లేదా ప్రతి నిధుల ద్వారా ప్రభుత్వంపై వత్తిడి తెచ్చి తమకు అనుకూలమైన ప్రభుత్వ విధాన రూపకల్పనకు కృషి చేస్తాయి.

4 రాజకీయ పక్షాలు క్రీయాత్మక రాజకీయాల్లో మునిగి తేలుతూంటాయి. వత్తిడి వర్గాలు క్రియాత్మక రాజకీయాలపై ఎక్కువ ఆశక్తిని చూపవు కాకపోతే పరోక్షంగా అన్ని పార్టీలపట్ల ఆసక్తిని చపించవచ్చు.

## 11.5 ప్రభావ వర్గాలు - వివిధ రకాలు :

ప్రభావ వర్గాల స్వభావము, అవి నిర్వహించు కర్తవ్యములను అనుసరించి వివిధ వర్గములుగా ఈ క్రింది విధంగా విభజింప వచ్చును అవి.

1 ఆర్థిక ప్రయోజనంగల వర్గాలు

2 ప్రజా సేవకు సంబంధించిన వర్గాలు

3 వృత్తి సంఘాలు

4 సంస్థాపరమైన ప్రయోజన వర్గాలు

భారత దేశంలో మౌలికంగా ప్రభావ వర్గాలను నాలుగు తరగతులుగా వర్గీకరించ వచ్చును. అవి.

1 ప్రతేక ప్రయోజన వర్గాలు

2 మత వర్గాలు

3 కుల, భాష, ప్రాంతీయ వర్గాలు

4 సాధారణ ప్రయోజన ప్రభావ వర్గాలు

ఉదాహరణకు వ్యాపార, కార్మిక, వ్యవసాయ, స్వచ్ఛంద సేవా వర్గాలుగా చెప్పవచ్చు. రాష్ట్ర వ్యాపార, వాణిజ్య సమాఖ్య, రాష్ట్ర ఉత్పత్తిదారుల సంఘము మొదలగు వ్యాపార వర్గాలు కాక, కార్మిక రంగంలో ఆల్ ఇండియా ట్రేడ్ యూనియన్ కాంగ్రెస్ (AITUC) ఇండియన్ ట్రేడ్ యూనియన్ కాంగ్రెస్(INTUC), మజ్దూర్ యూనియన్ మొదలయినవి ఉన్నాయి.వ్యవసాయ రంగంలో ఆల్ ఇండియా కిసాన్ సభ (AIKS), భారత కిసాన్ యూనియన్, వివిధ నక్సలైట్ వర్గాల రైతు కూలీ సంఘాలు కన్పిస్తాయి. ఆలాగే సమాజ సేవకు సంబంధించినటువంటి సంస్థల్లో రోటరీ క్లబ్, లయన్స్ క్లబ్, రెడ్ క్రాస్ సంస్థలు మొదలగు ఉన్నాయి. అంతే కాకుండా కులపరంగా, తెగల పరంగా, విద్యార్థుల పరంగా ఏర్పడే సంఘాలు ప్రభావ వర్గాలు మనకు కన్పిస్తాయి.

## 11.6 ప్రభుత్వ విధానాలు - ప్రభావ వర్గాలు :

1 ప్రభావ వర్గాల ప్రధాన ధ్యేయం ప్రభుత్వ విధానాన్ని (Public Policy) తమ తమ ప్రత్యేక ప్రయోజనాలకు అనుగుణంగా రూపొందించు కొనుటకు కృషి చేయటం, ఈ లక్ష్య సాధనలో ప్రభావ వర్గాలు విధాన నిర్ణేతలపై వివిధ పద్ధతుల్లో వత్తిడి తీసుకురావటానికి ప్రయత్నిస్తాయి. మంత్రులు, ఉన్నత ప్రభుత్వాధికారులు, శాసనసభ్యులు మొదలైనవారిని తరచూ కలసుకొంటూ తమతమ సమస్యలను వారికి నివేదించి ప్రభుత్వ విధానం తమ ప్రయోజనాల అనుగుణంగా ఉండేటట్లు చూడటానికి ప్రయత్నిస్తాయి: ఉదాహరణకు వ్యాపార వాణిజ్య సమాఖ్య ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకొని వచ్చుట.

2 ప్రభావ వర్గాలు విధాన కల్పన ప్రక్రియ (Policy Making) లో కీలక పాత్ర నిర్వహిస్తాయి. ఈ సందర్భంలో ప్రభుత్వాధికారులకు అవసరమైన సమాచారాన్ని అందిస్తాయి. విధాన ప్రతిపాదనల స్వభావ, పరిణామాలను గురించి కూడా కొన్ని సూచనలు ప్రభావ వర్గాలు ప్రభుత్వానికి ఇస్తాయి. ఉదాహరణకు కార్మిక, వాణిజ్య, వ్యవసాయ రంగాలకు చెందిన ప్రభావ వర్గాలు ప్రభుత్వ విధాన అభ్యర్థినలకు ప్రధాన మూలకాలుగా భావించవచ్చు.

3 వివిధ ప్రభావ వర్గాల వివాదస్పద అభ్యర్థనలు కొన్ని సందర్భాల్లో ప్రభుత్వాన్ని ఇబ్బంది పరిస్థితిలో ఉంచుతాయి. బాగ వ్యవస్థీకృతమైన (Well Organised Group) చురుగ్గా వ్యవహరించి ప్రభుత్వ విధానాలను ఎక్కువగా ప్రభావితం చేస్తాయి. పరిమిత సంఖ్యలో ఉన్నా, వ్యవస్థీకృతం కాని ప్రభావ వర్గాలు తమ ప్రభావాన్ని ఎక్కువగా చూపించ లేక పోవచ్చు. ఉదాహరణకు వ్యవసాయదారుల సంఖ్య అత్యధికంగా ఉన్నప్పటికి మన రాష్ట్రంలో మిల్లర్ల సంఘం బియ్యంలెవీ విషయంలో ప్రభుత్వ విధానాన్ని రైతు సంఘాల కంటే అధికంగా ప్రభావితం చేయుకలుగుతున్నది. అలాగే హోటళ్ల వినియోగదారుల కంటే హోటల్ యజమానుల సంఖ్య చాలా తక్కువ అయినప్పటికీ పదార్థాల ధరల విషయంలో హోటల్ యజమానులు తమ మాట నెగ్గించుకొంటున్నారు.

## 11.7 ప్రభావ వర్గముల విధులు :

1 అభివృద్ధికి ఏజంటువలె ఈ సంఘముల్లు వ్యవహరించును. వారు తమ బాధ్యతలను సక్రమైన పద్ధతిలో నిర్వహించుటకు సాధ్యమైనంత వరకు ప్రయత్నించెదరు.

2 ప్రజలకు ప్రభుత్వానికి మధ్య సంధాన కర్తగా వ్యవహరించును.

3 సమాజంలోని ప్రజలకు రాజకీయ విజ్ఞానాన్ని కల్గిస్తాయి.

4 ఇవి రాజకీయ నాయకుణ్ణి పోషించును.

5 సమాజములో సాంఘిక సమానత్వాన్ని, సమగ్రతను పెంపొందించును.

6 ప్రభావ వర్గాలు రాజకీయ వ్యవస్థలోని ప్రజల మధ్య సహకారాన్ని పెంపొందిస్తాయి.

7 రాకజీయ నిర్ణయాలు, పథకాలు రూపొందించు సమయంలో ప్రభావ వర్గాలు ప్రజల యొక్క అభిప్రాయాలను, అవసరములను పరిపాలనకులకు తెలియచేస్తారు.

## 11.8 ప్రభావ వర్గాలు తమ లక్ష్యసాధనలో అనుసరించు పద్ధతులు:

ప్రభుత్వము ఏదైనా ప్రభావ సంఘాలకు వ్యతిరేకంగా ఎలాంటి శాసనమును తయారు చేసిన లేక సంఘము యొక్క సమస్యలను పరిష్కరించు కొనుటకు ప్రభావ సంఘాలు కొన్ని పద్ధతులను ఎన్ను కొంటాయి. అవి.

1. లాబియింగ్ (Labbying) 2. సమ్మె (Strike) 3. బంద్ (Bandh) 4. ఘెరావ్ (Gherao)

### 11.8.1 లాబియింగ్ :

ప్రభైఆవ వర్గాలు తమ వర్గ ప్రయోజనాల గురించి నిరంతం వివరిస్తూ తరచూ శాసన సభ్యులను కలసుకుంటూ వారి మద్ధతును పొందటానికి ప్రయత్నిస్తాయి. దీనినే అమెరికాలో "లాభియింగ్" అంటారు. లాబీయింగ్ అంటే శాసన సభ్యులకు, ప్రభుత్వానికి, ప్రభుత్వంలోని ఉన్నతోద్యోగులకు తమ కోర్కెలను, ప్రయోజనాలను తెలియజేసి వారిని తమ ప్రయోజనాలకు అనుగుణంగా ప్రభావితం చేసి వారిని తమ ప్రయోజనాలకు అనుగుణంగా ప్రభావితం చేయటం ఉదాహరణ. శాసన సభ్యులకు ఉత్తరాలు, టెలిగ్రాం పంపుట, తరచుగా కలుసుకోవటం ద్వారా వారిపై వివిధ ప్రభావ వర్గాలు వత్తిడితీసుకు రావటానికి ప్రయత్నిస్తాయి.

### 11.8.2 సమ్మె :

ఇది డిమాండ్స్‌ను ఒప్పించడానికి జరుపబడే ఒక నిరసన ప్రక్రియ.అనగా పనిని ఆపివేసి తమ కోర్కెను తీర్చమని అడిగే ప్రక్రియ ఇది ప్రభావ వర్గము యొక్క సూటి ప్రక్రియ. ఒక్క మాటలో చెప్పాలంటే విధి నిర్వహణను ఆపడమే. ఇది గాంధేయ వాద పద్ధతిలో పూర్తిగా హింసాయుతంగా రూపుదాల్చును. లెఫ్టిస్టులు, సిండికలిస్టులు దీనిని సాధారణంగా వాడుతారు.

### 11.8.3 బంద్ :

ఇది సమ్మెకన్నా చాల తీవ్రమైనది. సాధారణంగా బంద్ జరిగే రోజు ఆఫీసులు, షాపులు, మార్కెట్స్, రవాణా, విద్యా సంస్థలు మొదలయినవి నిలిపి వెయబడును. అయితే కొన్నింటికి బంద్ నుంచి మినహాయింపు ఇస్తారు. ఉదాహరణకు నీటి సరఫరాసాసుపత్రులు, విద్యుచ్ఛక్తి మొదలకునవి. ఈ బంద్‌లను విద్యార్థి సంఘాలు, కార్మిక, ఇతర సంఘాలు, రాజకీయ పార్టీలు మొదలగునవి నిర్వహిస్తాయి. బంద్ అనేది గాంధేయ వాద సిద్ధాంతములపై ఆధారపడినప్పటికి ఇటీవల కాలంలో దీనిలో హింసాత్మక పద్ధతులు చోటు చేసుకొన్నాయి.

### 11.8.4 ఘూరావ్ :

ఇది ప్రభావ వర్గముల యొక్క ముఖ్య ఆయుధము. ఇది పికెటింగ్‌లకు, సమ్మెలకు వ్యతిరేకమైనది. సమస్యలు తీవ్రతరమైనప్పుడు, ఆ సమస్యను తీర్చడంలో ప్రభుత్వము విఫలమైనప్పుడు ప్రభుత్వ అధికారులను, ప్రజా ప్రతినిధులను వారి

విధినిర్వహణకు ఆటంకము కల్గించి, వారిని అక్కడి నుండి కదలకుండా చుట్టుముట్టెదరు. దీనినే ఘెరావ్ అందురు. ఈ ఘెరావ్ ఒక్క రోజులో కొన్ని గంటలు మాత్రమే జరుగును. ఈ పద్ధతిని పశ్చిమ బెంగాల్‌లోని వత్తిడి వర్గాలు ఎక్కువగా ఉపయోగిస్తున్నారు.

### 11.8.5 రాజ్యాంగేతర పద్ధతులు :

కొన్ని సందర్భాలలో ప్రభుత్వం తమ ఆస్తులను విస్మరించినప్పుడు ప్రభావ వర్గాలు వ్యతిరేక ప్రదర్శనలతో పాటు ఘర్షణలు, కొట్లాటలు మొదలగున్నవి రాజ్యాంగేతర పద్ధతులను అనుసరించి ప్రభుత్వాన్ని ప్రభావితం చేయటానికి ప్రయత్నిస్తాయి.

### 11.8.6 ఉపన్యాసాలు, గోష్టులు :

తమ ప్రయోజనాలను విస్తృత ప్రచారం కల్పించటానికి ప్రభావ వర్గాలు ఉపన్యాసాలు, గోష్టి సదస్సులు, గ్రంధాలు, పత్రికా ప్రకటనలు మొదలగు వాటిని సాధనాలుగా ఉపయోగిస్తాయి.

## 11.9 ప్రభావ వర్గాల ప్రాధాన్యం :

ప్రజాస్వామ్య రాజ్యాల్లో ప్రభావ వర్గాల ప్రాధాన్యం నానాటికి పెరుగుతున్నది. ముఖ్యంగా భారతీయ బహుళ సమాజంతో భాష, మత, ప్రాంత, సమాజిక, సాంస్కృతిక వైవిధ్యాలతో పాటు ఆర్థిక, సమాజిక రంగాలలో ప్రభుత్వం జోక్యం అవుతున్న కొద్దీ ప్రభావ వర్గాల ప్రాధాన్యం పెరు గుతూ ఉంటుంది.

### 11.9.1 సమతౌల్యంను కాపుడుట :

ప్రజాస్వామ్య వ్యవస్థలో రాజ్య ప్రయోజనాలకు, వర్గ ప్రయోజనాలకు మధ్య సమతౌల్యం సాధించటానికి ప్రభావ వర్గాలు కొంతమేరకు ఉపయోగిపడతాయి. విభిన్న ప్రయోజనాల వ్యక్తీకరణకు అవకాశం కల్గించే ప్రజాస్వామిక వ్యవస్థలో ఏదో ఒక ప్రయోజనానికి ప్రాతినిధ్యం వహించే ఒక వర్గం బలపడకుండా దాని ప్రాబల్యాన్ని తటస్థీరింటానికి ఇతర ప్రభావ వర్గాలు పని చేస్తాయి. వ్యాపారులు, పారిశ్రామిక వేత్తలు, రైతు కూలి సంఘాలు, కార్మికులు, మహిళలు తమతమ వర్గ ప్రయోజనాల సాఫల్యంపై అను నిత్యం కృషి చేయడం వల్ల ఏ ఒక్క వర్గ ప్రయోజనానికీ ఆధిపత్యం ఏర్పడదు.

### 11.9.2 ఎన్నికల్లో ప్రభావ వర్గాలు కీలక పాత్రవహించుట :

ఎన్నికల్లో ప్రభావ వర్గాలు ప్రముఖ పాత్రవహిస్తాయి. కీన్స్ అభిప్రాయం ప్రకారం ప్రబావ వర్గములు పార్టీలకు వెనుక నుండి మద్దతు ప్రకటించి, తగిన సదుపాయములను మరియు అభ్యర్థుల ఎంపిక, వారికి మద్దతు ప్రకటించుటలో ప్రధాన భూమికను నర్వహిస్తాయి. వీరికి అందుబాటులో ఉండే ఓటర్లు, వీరు సూచించి పార్టీలకు, నాయకులకు ఓట్లు వేస్తారు. " ఏ అభ్యర్థి అయితే ప్రభావ వర్గముల ప్రభావము, మద్దతు సహాయంతో ఎన్నికల్లో గెలుస్తాడో ఆ అభ్యర్థి తన తలను, హృదయమును వారికి తాకట్టు పెట్టవలసినదే". కొన్ని పర్యాయములు పార్టీలో, ప్రభుత్వ వ్యవహారాలలో పలుకుబడి ఉన్న నాయకులు, మంత్రులు ప్రభావ వర్గముల ప్రభావములకు లోనై వ్యవహరించడం భారత [illegible] ప్రధాన లక్షణము

### 11.9.3 శాసన సభల్లో ప్రభావ వర్గాల ప్రభావము :

ఎన్నికల్లో ప్రభావ వర్గాల మద్దతుతో గెలుపొందిన అభ్యర్థులు, శాసన సభల్లో శాసనముల తయారీలో ఈ వర్గాల ప్రయోజనాలకు భంగము కలుగని రీతోలో వారి ఆశయాలకు, అభిరుచులకు అనుగుణంగా ప్రవర్తిస్తారు. ఇండియా, ఇటలీ, ఫ్రాన్స్

మరియు అమెరికాలలో ఈ ప్రభావము ఎక్కువగా కనబడుతుంది. ప్రాతినిధ్య ప్రజాస్వామ్యంలో ప్రభావ వర్గముల పాత్ర గణనీయంగా పెరుగుచున్నది.

### 11.9.4 విధాన నిర్ణేతలపై ప్రభావ వర్గాల ప్రభావము:

ప్రభావ వర్గాలు విధాన నిర్ణేతలకు తగిన సమాచారాన్ని అందిస్తాయి. తద్వారా విధాన నిర్ణేతలు ఒక నిర్ణయం తీసుకోవటం సాధ్యమైతుంది. పార్టీ ప్రణాళికలో పేర్కొనని ప్రయోజనాలను వ్యక్తీకరించటం ద్వారా ప్రభావ వర్గాలు ఆయా రాజకీయ పక్షాల సహకారాన్ని కూడా తమ ప్రయోజన సాధనలో సంపాదించుకోగల్గుతాయి.

ప్రభావ వర్గములు డిపార్టుమెంట్ కమిటీల ద్వారా కూడా కార్యనిర్వాహక వర్గములు చాలా ఎక్కువగా అధ్యక్షుడు మరియు రాష్ట్ర గవర్నర్లను ప్రభావిత పరుస్తాయి.

### 11.9.5 ప్రజాభిప్రాయ రూపకల్పనలో ప్రభాప వర్గాల ప్రభావము :

అన్ని రాజ్య వ్యవస్థల్లో ప్రజాభిప్రాయమును ప్రభావ వర్గం రూపకల్పన చేస్తాయి. బ్రిటిష్, అమెరికన్, ఫ్రెంచి లేదా ఇండియాల్లో కొంత వరకు ప్రజాభిప్రాయమును రూపకల్పన చేసి ప్రజల వాయిస్‌గా ప్రభుత్వానికి వినిపిస్తారు. బిల్స అభిప్రాయంలో మూడు విధములైన పద్ధతుల ద్వారా ప్రజల మనస్సులను ఆకర్షించే విధంగా చేయగలుగుతారు. అవి

1 సమస్యలను శాంతి యుతంగా, హేతుబద్ధంగా ప్రజలకు నివేదిస్తారు. వీటిని వార్తా పత్రికలు, రిపోర్టులు, కరపత్రములు, మీటింగులు, చర్చలు మొదలైన వాటి ద్వారా ప్రజలకు తెలియ చేస్తారు.

2 సాధారణంగా ప్రజలకున్న భయాలను, అసహ్యమును ప్రేమ, ఉద్యోగాలు మొదలగు వాటిని వీరు తమకు అనుకూలంగా మార్చుకొనుటకు ప్రయత్నం చేస్తారు.

3 ఈ సమస్యలన్నింటిన యుక్తిగా ప్రచారం ద్వారా ప్రజలను ఆకర్షిస్తారు. వ్యవస్తీకృతం చేయబడిన ఈ వర్గాలు ఓటర్లును ప్రభావిత పరచి, వారి ప్రభావం ప్రభుత్వంపై పడునట్లు చేస్తారు.

### 11.9.6. ప్రజలను చైతన్య పరచడం :

ముఖ్యంగా ఎన్నికలకు ఎన్నికలకు మధ్య ప్రభావ వర్గాలు ప్రజాస్వామ్యాన్ని చైతన్యవంతం చేస్తాయి. ప్రభావ వర్గాలు నానాటికీ విస్తృతమవుతున్న ప్రభుత్వ కార్యకలాపాలవల్ల ఏర్పడే ప్రమాదాల నుంచి పౌరులను వారి హక్కులను పరిరక్షించటానికి ఉపకరిస్తాయి. ఈ విధంగా మన దేశంలో ముఖ్యంగా మన రాష్ట్రంలో ప్రభావ వర్గాలు రాజకీయం ప్రక్రియలో ప్రత్యక్షంగా, పరోక్షంగా చురుకుగా పాల్గొంటూ ఒక వైపు ప్రభుత్వానికి తమమత ప్రయోజనాలను తెలియజేస్తూ మరొక వైపు ప్రజలను కూడా చైతన్యవంతుల్ని చేస్తాయి.

## 11.10 సారాంశం :

ప్రజ్వామ్య రాజ్యాల్లో ప్రభావ వర్గాల లేదా వత్తిడి వర్గాలు ప్రభుత్వ విధాన రూపకల్పనల్లో, వాటి అమలులో కీలక పాత్రవహిస్తాయి. పైన ఉదహరింపబడిన వివిధ పద్ధతుల ద్వారా ప్రభావ వర్గాలు ప్రత్యక్షంగా రాజకీయాలలోనికి ప్రవేశించకుండా తమ ప్రయోజనాలను కాపాడు కొనుటకై అనేక ప్రయత్నాలు చేసి ప్రభుత్వమును ప్రభావిత పరచి ప్రభుత్వ విధానాలను తమకు

అనుకూలంగా మార్చుకొనుటకు కృషి చేస్తాయి. ఇవి ప్రజాస్వామ్యాన్ని చైతన్య వంతం చేయటంలో తమ వంతు కర్తవ్యాన్ని నిర్వహిస్తూంటాయి.

## 11.11 నమూనా ప్రశ్నలు :

1 ప్రభావ వర్గాలు అనగానేమి? అవి ఎందుకు ఏర్పడతాయి?

2 ప్రజాస్వామ్య రాజకీయ వ్యవస్థల్లో ప్రభావ వర్గాలు ఏ విధంగా పనిచేస్తాయి?

3 ప్రభావ వర్గాలు తమ ప్రయోజనాలను సాధించుకొనుటకు అనుసరించు పద్ధతులను తెల్పుము.

4 ప్రభావ వర్గాల ప్రధాన్యతను పేర్కొనుము.

## లఘు రూప ప్రశ్నలు :

1 ప్రభావ వర్గాల లక్షణాలను తెల్పుము.

2 ప్రభావ వర్గాలకు, రాజకీయ పార్టీల మధ్య వ్యత్యాసంను తెల్పుము.

3 ప్రభావ వర్గాలోని వివిధ రకాలను వివరింపుము.

## 11.12 చదువదగిన గ్రంథాలు :


| | | | |
|---|---|---|---|
| 1 | Gabriel Almond | : | The Politics of Developing Areas. |
| 2 | Jean Blondl | : | An Introduction to Conmparative Government. |
| 3 | F G Castles | : | Pressure Groups and Political Culture. |


డా. యం. పాండురంగారావు

పాఠం - 12

# రాజకీయ భాగస్వామ్యం, ఎన్నికలు మరియు ఓటింగ్ ప్రవర్తన

12.0 లక్ష్యం :

ఈ పాఠాన్ని చదివిన తరువాత మీరు

- ❑ రాజకీయ భాగస్వామ్యం
- ❑ ఆంధ్రప్రదేశ్‌లో జరిగిన శాసనసభ ఎన్నికలు
- ❑ ఎన్నికల ప్రాముఖ్యత
- ❑ ఓటర్ల ప్రవర్తన
- ❑ ఓటర్లను ప్రభావితం చేసే వివిధ రకాలైన అంశాలు, మొదలగు విషయాలను గురించి వివరణాత్మకంగా వివరించ గలుగుతారు.

## విషయ సూచిక


12.1 పరిచయం

12.2 రాజకీయ భాగస్వామ్యం

12.3 ఎన్నికల ప్రాముఖ్యం

12.4 రాష్ట్ర శాసనసభ ఎన్నికలు

12.4.1 1952 శాసనసభ ఎన్నికలు

12.4.2 1955 మధ్యాంతర శాసనసభ ఎన్నికలు

12.4.3 1962 శాసనసభ ఎన్నికలు

12.4.4 1967 శాసనసభ ఎన్నికలు

12.4.5 1972 శాసనసభ ఎన్నికలు

12.4.6 1978 శాసనసభ ఎన్నికలు

12.4.7 1983 శాసనసభ ఎన్నికలు

12.4.8 1985 శాసనసభ మధ్యాంతర ఎన్నికలు

12.4.9 1989 శాసనసభ ఎన్నికలు

12.4.10 1994 శాసనసభ ఎన్నికలు

12.4.11 1999 శాసనసభ ఎన్నికలు

12.4.12 2004 శాసనసభ ఎన్నికలు

12.5 ఓటింగ్ ప్రవర్తన

12.6 రాజకీయ అంశాల్లు

12.6.1 సిద్ధాంతం

12.6.2 పార్టీ

12.6.3 అభ్యర్థి

12.7 రాజకీయేతర అంశా..

12.7.1 కుటుంబం
12.7.2 కులం
12.7.3 మతం మరియు జాతి
12.7.4 భాష
12.7.5 ప్రాంతం
12.8 ఆర్థిక అంశాలు
12.9 ఇతర అంశాలు
12.10 సారాంశం
12.11 నమూనా ప్రశ్నలు
12.12 చదువదగిన గ్రంథాలు


**12.1 పరిచయం :**

ప్రజాస్వామ్య ప్రభుత్వంలో పౌరులు వ్యక్తిగతంగా ఉండాలంటే ప్రత్యేకమైన భాగస్వామ్య చర్యలు అవసరం. ప్రజాస్వామ్యంలో సిద్ధాంతపరంగా రాజకీయ నాయకత్వపు ఎంపిక విషయంలో మొత్తం పౌరులకు అవకాశం ఉంటుంది. చాలా మంది పౌరులు రాజకీయ భాగస్వామ్యంలో పౌరులు ఓటింగ్ ద్వారా పాల్గొనటం జరుగుతుంది. కొంతమంది ప్రత్యేక అభ్యర్థుల ఎన్నికల ప్రచారంలోను లేక అభ్యర్థులను ఎంపిక చేయటంలోను పాల్గొనవచ్చును. పౌరులకు అందుబాటులో వున్న భాగస్వామ్యం యిది ఒక్కటి కాదు. వాస్తవంగా పౌర భాగస్వామ్యం రాజకీయ సంస్కృతిని నెలకొల్పిన సూత్రాలచే అధికంగా ప్రభావితమవుతుంది. ఈ సూత్రాలు, పౌరుల విధులు, వారి ప్రవర్తనపై పరిమితులను నిర్దేశిస్తాయి. భాగస్వామ్యంలో అనేక విషయాలుంటాయి. వీటిలో భిన్నత్వము ఉన్నప్పటికీ అన్ని రకాల భాగస్వామ్యంలో కార్యాచరణ ఉంటుంది. అందువలన అది నిర్ణయ రూపకల్పనలో ప్రమేయం కల్గి ఉంటుంది. భాగస్వామ్యం అనేది హేతుబద్ధమైనదని పేర్కొనవచ్చు.

ఎన్నికలు ప్రజాస్వామ్య వ్యవస్థలకు గీటురాళ్ళు. నాయకత్వంపై విశ్వాసం ప్రదర్శించడానికి కొత్త నాయకత్వాన్ని బలపరచటానికి రాజకీయ మార్పులకు ఎన్నికలు సంకేతాలు. నియమిత కాలానికి ప్రజలు విధాన నిర్ణేతలను నిర్ణయిస్తారు. ప్రజాభిప్రాయ ప్రకటనకు ఎన్నికలు సాధనాలు. ఎన్నికల్లో పాల్గొని ఓటు చేయటం ద్వారా ప్రజలు రాజకీయ భాగస్వామ్యాన్ని అనుభవిస్తారు. రాజకీయ అధికార లబ్ధికి పోటీపడే వారికి ఎన్నికలు అవకాశం కల్పిస్తాయి. అంతేకాకుండా ఎన్నికలు ప్రజాభిప్రాయ వ్యక్తీకరణకు ఒక అమూల్యమైన సాధనం. అధికారంలో ఉన్న పార్టీ విధాన ప్రభుత్వ నిర్వహణలపై తీర్పు చెప్పటానికి ప్రజలకు ఎన్నికలు చక్కటి అవకాశం. భారతీయ జీవన స్రవంతిలో ఎన్నికలు ముఖ్యమైన చోటును చేసుకొన్నాయి. భిన్నత్వంలో ఏకత్వ భావన ప్రదర్శితమౌతున్న మన దేశంలో ఎన్నికలు వ్యవస్థీకృతం చెంది ఓటర్ల పరిపూర్ణతకు నిదర్శనంగా నిలుస్తున్నాయి.

రాజకీయ వ్యవస్థ విస్తృత అవగాహనకు ఎన్నికలను, ఎన్నికలలో వోటింగ్ ప్రవర్తనము తెలుసుకోవడం అవసం. అయితే దేశ రాజకీయ ఉష్ణోగ్రతను కొలిచే ప్రమాణం ఎన్నికలే కనుక వాటి స్థూల, సూక్ష్మ అధ్యయనం కూడా అవసరం. దీనివల్ల భారత రాజకీయ వ్యవస్థ అసాధారణ స్వభావాన్ని లోతుగా తెలుసుకోవడానికి వీలవుతుంది. అంతేకాక భారత దేశంలోను వివిధ రాష్ట్రాలలోను విధాననిర్ణేతల ఎంపికలో ఏ రాజకీయ, రాజకీయేతర అంశాలు ప్రధాన పాత్ర వహిస్తున్నాయో తెలుసుకోవడానికి వీలువుతుంది. విధాన నిర్ణేతల ఎంపికలో ఏ అదృశ్య హస్తాలు ఉన్నాయో, ఏ తంత్రాన్ని అవలంబించారో, రాజకీయంగా ఏ బేరసారాలు సాగాయో, లాంచన ప్రాయమైన వర్గాలు, లాంచన ప్రాయం కాని వర్గాలు ఏ పాత్రను నిర్వహించాయో వివరంగా తెలుస్తుంది.

## 12.2 రాజకీయ భాగస్వామ్యం

ప్రజాస్వామ్య ప్రభుత్వంలో పౌరులు వ్యక్తిగతంగా ఉండాలంటే ప్రత్యేకమైన భాగస్వామ్య చర్యలు అవసరం. ప్రజాస్వామ్యంలో సిద్ధాంతపరంగా రాజకీయ నాయకత్వపు ఎంపిక విషయంలో మొత్తం పౌరులకు అవకాశం ఉంటుంది. చాలా మంది పౌరులు రాజకీయ భాగస్వామ్యంలో పౌరులు ఓటింగ్ ద్వారా పాల్గొనటం జరుగుతుంది. కొంతమంది ప్రత్యేక అభ్యర్థుల ఎన్నికల ప్రచారంలోను లేక అభ్యర్థులను ఎంపిక చేయటంలోను పాల్గొనవచ్చును. పౌరులకు అందుబాటులో వున్న భాగస్వామ్యం యిది ఒక్కటి కాదు. వాస్తవంగా పౌర భాగస్వామ్యం రాజకీయ సంస్కృతిని నెలకొల్పిన సూత్రాలచే అధికంగా ప్రభావితమవుతుంది. ఈ సూత్రాలు, పౌరుల విధులు, వారి ప్రవర్తనపై పరిమితులను నిర్దేశిస్తాయి. చాలా ప్రజాస్వామ్యంలో గల రాజ్యాంగాలు ప్రాథమిక హక్కులను చేర్చగా కమ్యూనిస్టు దేశాలు పౌరుల విధులను పేర్కొనటం ఆ రాజ్యాంగాల ముఖ్య లక్షణంగా ఉంది అనేక దేశాల్లో పౌరులు అనుభవించే ఓటింగ్ హక్కుతోపాటు, కొన్ని దేశాలు తప్పనిసరిగా ఓటు చేసే పద్దతిని ప్రవేశపెట్టినాయి.

భాగస్వామ్యంలో అనేక విషయాలుంటాయి. వీటిలో భిన్నత్వము ఉన్నప్పటికీ అన్ని రకాల భాగస్వామ్యంలో కార్యాచరణ ఉంటుంది. అందువలన అది నిర్ణయ రూపకల్పనలో ప్రమేయం కల్గి ఉంటుంది. భాగస్వామ్యం అనేది హేతుబద్ధమైనదని పేర్కొనవచ్చు. దీనిలో ప్రత్యామ్నాయ కార్యకలాపాల పరిశీలన ఉంటుంది. ఈ ప్రత్యామ్నాయం ఎంపిక ఉపయోగాన్నిస్తుంది. ఈ పరిధిని యితర వ్యక్తీకరణల కంటే భిన్నంగా వుంటాయి.

భాగస్వామ్య సాధనాలు, స్థాయిలు(Means and level participation) ప్రజాస్వామ్యదేశాలు పౌరసత్వానికి సంబంధించిన సాంస్కృతిక సూత్రాలను అధ్యయనం చేస్తే, యీ సూత్రాలు వ్యవస్థను అంగీకరించటానికి, ఓటింగ్ కంటే భాగస్వామ్యానికి సంబంధించిన చురుకైన రూపాలకు తక్కువ ప్రాధాన్యత యిస్తున్నట్లు తెలుస్తుంది. రాజకీయ కార్యకలాపాలను, రాజకీయ నిర్ణయాల్లో ఉన్నతమైనవిగా లేక తక్కువ స్థాయిలైన ప్రమేయంగా చెప్పవచ్చును. ఈ వ్యత్యాసం వాస్తవమైన లేక ఆర్థిక, మానసిక, భౌతిక, వ్యక్తికి సంబంధించిన ప్రయత్నం ప్రతిపదికగా ఉంటుంది. చట్టాలను నైతికంగా అనుసరించడం, దేశరక్షణ, ఓటింగ్‌లో పాల్గొనటం మొదలగునవి తక్కువ ప్రమేయం గల భాగస్వామ్యంగా చెప్పవచ్చును. ఉన్నతస్థాయి ప్రమేయం గల భాగస్వామ్యం రకాల్లో ప్రచారం చేయటం, ఉత్తరాలు వ్రాయటం, రాజకీయ ప్రదర్శనలో ప్రమేయం కల్పించుకోవటం, మొదలగునవి ఉంటాయి. పౌరసత్వానికి సంబంధించిన సూత్రాల్లో పౌర ప్రవర్తనపై పరిమితులకు సంబంధించిన నిర్దేశాలు ఉంటాయి. అధిక సంఖ్యాక ప్రజలు, కొన్ని రకాల కార్యకలాపాలను అవి పూర్తిగా వివేకవంతమైనవి అయినప్పటికీ, ప్రభుత్వోద్యోగులను ప్రభావితం చేయటంలో అనంగీకరాయోగ్యమైన సాధనాలుగా భావిస్తారు. చాలా సమాజాలలో లంచం ఇవ్వటం అనంగీకారమైన ప్రభావితం చేసే సాధనంగా భావించబడుతుంది.

## 12.3 ఎన్నికల ప్రాముఖ్యం

ఎన్నికలు రాష్ట్ర రాజకీయాల్లో మూడు రకాలుగా ప్రముఖ్యం వహిస్తాయి.ఒకటి ప్రభుత్వ విధానాన్ని అవి ప్రభావితం చేస్తాయి. ఆధీనంలో ఉన్న రాజకీయ పక్షం అనుసరిస్తున్న విధానాలు, వాటి అమలుపై ప్రజలు తమ తీర్పును ఇవ్వటానికి ఎన్నికలు ఉపయోగపడతాయి. అలాగే అన్య రాజకీయ పక్షాలు కూడా తమ తమ పార్టీ ప్రణాళికల ద్వారా ప్రజానిర్ణయం ఆమోదం కోసం ఎన్నికల్లో ప్రయత్నిస్తాయి. అందువల్ల వివిధ రాజకీయ పక్షాలు సూచించే ప్రత్యామ్నాయ విధానాలు, కార్యక్రమాలు పరిశీలించి తమ నిర్ణయం ఇవ్వటానికి ప్రజలకు ఎన్నికలు మంచి అవకాశాన్ని కల్పిస్తాయి.

వివిధ రాజకీయ సమస్యల నిర్మాణం, నాయకత్వం, ప్రభుత్వ నిర్వహణ మొదలైన అంశాలన్నీ ఎన్నికల సమయంలో చర్చనీయాంశాలౌతాయి. వాటిపై వివిధ రాజకీయ పక్షాలు, పత్రికలు, ప్రజా వేదికలు వ్యక్తం చేసే అభిప్రాయాలు ఎన్నికల్లో ప్రజా నిర్ణయాన్ని ప్రభావితం చేస్తాయి. ఇంతకు ముందు లేని తీవ్రతతో పై అంశాలన్నీ ఎన్నికల సమయంలో చర్చనీయాంశాలౌతాయి. అందువల్ల ప్రభుత్వ నిర్వహణ, అధికార పక్షం సామర్థ్యంపై ప్రజాభిప్రాయం వ్యక్తీకరణకు ఎన్నికలు ఒక సువర్ణావకాశం.

## 12.4 రాష్ట్ర శాసనసభ ఎన్నికలు

ఎన్నికలు ప్రజాస్వామ్య వ్యవస్థలకు గీటురాళ్ళు. నాయకత్వంపై విశ్వాసం ప్రదర్శించడానికి కొత్త నాయకత్వాన్ని బలపరచటానికి రాజకీయ మార్పులకు ఎన్నికలు సంకేతాలు. నియమిత కాలానికి ప్రజలు విధాన నిర్ణేతలను నిర్ణయిస్తారు. ప్రజాభిప్రాయ ప్రకటనకు ఎన్నికలు సాధనాలు. ఎన్నికల్లో పాల్గొని ఓటు చేయటం ద్వారా ప్రజలు రాజకీయ భాగస్వామ్యాన్ని అనుభవిస్తారు. రాజకీయ అధికార లబ్ధికి పోటీపడే వారికి ఎన్నికలు అవకాశం కల్పిస్తాయి. అంతేకాకుండా ఎన్నికలు ప్రజాభిప్రాయ వ్యక్తీకరణకు ఒక అమూల్యమైన సాధనం. అధికారంలో ఉన్న పార్టీ విధాన ప్రభుత్వ నిర్వహణలపై తీర్పు చెప్పటానికి ప్రజలకు ఎన్నికలు చక్కటి అవకాశం. భారతీయ జీవన స్రవంతిలో ఎన్నికలు ముఖ్యమైన చోటును చేసుకొన్నాయి. భిన్నత్వంలో ఏకత్వ భావన ప్రదర్శితమౌతున్న మన దేశంలో ఎన్నికలు వ్యవస్థీకృతం చెంది ఓటర్ల పరిపూర్ణతకు నిదర్శనంగా నిలుస్తున్నాయి. ప్రతి ఎన్నికల్లోను ఓటు హక్కు పొందినవారి సంఖ్య అధికారమౌతూ పోటీచేసే వారి సంఖ్య పెరుగుతూ రాజకీయాధికార పోటీ ప్రాధాన్యతను సంతరించుకొంది.

### 12.4.1 1952 శాసనసభ ఎన్నికలు

1952లో జరిగిన సార్వత్రిక ఎన్నికలలో ( ఉమ్మడి మద్రాస్ రాష్ట్రం) ఆంధ్రప్రదేశ్‌కు చెందిన ప్రజలు కాంగ్రెసును ఆదరించలేదు. తెలంగాణా ప్రాంతంలో కాంగ్రెసు 98 స్థానాలకు పోటీ చేసి 44 స్థానాలు మాత్రమే గెలుచుకోకల్గింది. ఆంధ్ర ప్రాంతంలో కాంగ్రెసు పార్టీ 133 స్థానాలకు పోటీ చేసి కేవలం 40 స్థానాలు మాత్రమే పొందగల్గింది. కాని మద్రాస్ ప్రాంతంలో కాంగ్రెసు పార్టీ ఎక్కువ స్థానాలలో విజయం సాధించటచేత 1952 ఎన్నికలు తరువాత కాంగ్రెసు పార్టీ అధికారములోకి వచ్చింది. కే.యల్.పి పార్టీ 61 స్థానాలకు పోటీచేసి కేవలం 15 స్థానాలలో మాత్రమే గెలువగల్గింది. 78 స్థానాలలో పోటీచేసిన కె.యం.పి.పి 20 స్థానాలతో సరిపెటుకోవాలసి వచ్చింది. ఈ ఎన్నికలో బాగా లబ్ధి పొందినది కమ్యూనిస్టు పార్టీ ఈ పార్టీ 63 స్థానాలకు పోటీ చేసి 41 స్థానాలలో విజయం సాధించింది.

### 12.4.2 1955 మధ్యాంతర శాసనసభ ఎన్నికలు

ఆంధ్రరాష్ట్రమేర్పడిన తరవాత శాసన సభకు జరిగిన మధ్యంతర ఎన్నికల్లో (1955) కాంగ్రెసు 142 స్థానాలకు పోటీచేసి 119 స్థానాలు గెలుచుకొని ఆధిక్యత సంపాదించుకొంది. ఈ ఎన్నికల్లో కమ్యూనిస్టులు 165 స్థానాలకు పోటీచేసి 31.31శాతం ఓట్లను పొందినా 15 స్థానాలు మాత్రమే గెలువగల్గింది. ఆంధ్రప్రదేశ్ ఏర్పడేనాటికి 297 శాసన సభ స్థానాల్లో 168 స్థానాలు కాంగ్రెసు వారివి. 1957 లో తెలంగాణా ప్రాంతంలో జరిగిన శాసనసభ ఎన్నికల్లో 105 స్థానాలకు పోటీచేసి 68 స్థానాలు గెలుచుకొంది. దీంతో ఆంధ్రప్రదేశ్ శాసనసభలో కాంగ్రెసు పార్టీ మెజారిటీ 301 స్థానాల్లో 216 స్థానాలు సంపాదించుకోగల్గింది.

### 12.4.3 1962 శాసనసభ ఎన్నికలు

రాష్ట్ర శాసన సభకు జరిగిన మూడో సాధారణ ఎన్నికలలో (1962) కాంగ్రెసు పార్టీ 294 సీట్లకు పోటీచేసి 47.25 ఓట్ల శాతంతో 175 స్థానాలను కైవసం చేసుకొంది. 136 స్థానాలలో పోటీచేసి కమ్యూనిస్టు పార్టీ 20% ఓట్లతో 51 స్థానాలలో విజయం సాధించింది. స్వతంత్ర పార్టీ 141 స్థానాలలో పోటీచేసి కేవలం 19 స్థానాలను మాత్రమే పొందగల్గింది. ఈ ఎన్నికలో 50మంది ఇండిపెండెంట్లు గెలవటం విశేషము.

### 12.4.4 1967 శాసనసభ ఎన్నికలు

1967 ఎఎన్నికల్లో దేశంలో కాంగ్రెసు బలం తగ్గినా ఆంధ్రప్రదేశ్‌లో కాంగ్రెసె మెజారిటీని పొందగల్గింది. 287 శాసన సభ స్థానాల్లో 165 స్థానాలను గెలుచుకోగల్గింది. 88 స్థానిలకు పోటీచేసి స్వతంత్ర పార్టీ 29 స్థానాలను గెలుచుకొని మరో 29 స్థానాల్లో ధరావతును కోల్పోయింది. మొదటి సారిగా భారతీయ జనసంఘం ఎన్నికల్లో మూడు స్థానాలను గెలుచుకోగల్గింది. 103 స్థానాలకు

పోటీ చేసిన భారత కమ్యూనిస్టు పార్టీ 10 స్థానాలను 82 స్థానాలకు పోటీ చేసిన మార్క్సిస్టు కమ్యూనిస్టు పార్టీ తొమ్మిది స్థానాలు మాత్రమే గెలుచుకోగలిగారు. పోటీ చేసిన 395 మంది స్వతంత్ర అభ్యర్థులు 64 స్థానాల్లో గెలువగల్గారు.

### 12.4.5 1972 శాసనసభ ఎన్నికలు

1972లో జరిగిన రాష్ట్ర శాసన సభలో జరిగిన ఎన్నికలలో కాంగ్రెసు పార్టీ 270 స్థానాలకు పోటీచేసి 202 సీట్లను గెలుసుకొంది. మొట్టమొదటి సారిగా 17 అసెంబ్లీ స్థానాలను కాంగ్రెసు పార్టీ పోటీ లేకుండా ఏకగ్రీవంగా గెలవగలిగింది. 20 స్థానాలలో పోటీ చేసిన స్వతంత్ర పార్టీ, 56 స్థానాలలో పోటీచేసిన జనసంఘ పార్టీలు 1 స్థానాన్ని కూడా గెలించుకోలేకపోయాయి. 32 స్థానాలలో పోటీచేసిన మార్క్సిస్టు కమ్యూనిస్టు పార్టీ ఒక స్థానాన్ని మాత్రమే గెలువగల్గింది. 59 స్థానాల్లో పోటీచేసిన భారత కమ్యూనిస్టు పార్టీ 7 స్థానాలను సంపాదించుకోగల్గింది. 482 మంది స్వతంత్ర అభ్యర్థులు పోటీచేయాగా 53 మంది మాత్రమే విజయం సాధించారు.

### 12.4.6 1978 శాసనసభ ఎన్నికలు

1978 ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీ ఎన్నికల్లో కొన్ని ప్రత్యేక సరిస్థితుల్లో జరిగాయి. కేంద్రంలో 1971 లోక్ సభ ఎన్నికల్లో జనతాపార్టీ గెలుపొంది కాంగ్రెస్ ఘోర పరరాజయాన్ని పొందింది. ఆంధ్రలో అనేకమంది కాంగ్రెస్ నాయకులు జనతాలో చేరి పనిచేయడం ప్రారంభించారు. భారత జాతీయ కాంగ్రెస్ 1978 ప్రారంభంలో ఇందిరా కాంగ్రెస్ గాను బ్రహ్మానంద రెడ్డి కాంగ్రెసు గాను చీలిపోయాయి. ఆంధ్రప్రదేశ్‌లో జలగం వెంగళరావు నాయకత్వంలో ఉన్న మంత్రివర్గం కాంగ్రెస్(ఐ)లో చేరకుండా జాతీయ కాంగ్రాస్‌లోనే ఉండిపోయింది. ఈ ఎన్నికలలో 289 స్థానాలకు పోటీ చేసిన ఇందిరా కాంగ్రెసు 175 స్థానాలను గెలుచుకోగల్గింది. 258 స్థానాల్లో పోటీ చేసిన జాతీయ కాంగ్రెసు 30 స్థానాలను 269 స్థానాలకు పోటీ చేసిన జనతా 60 స్థానాలు సంపాదించుకొన్నాయి. 30 స్థానాల్లో పోటీ చేసిన భారత కమ్యూనిస్టుపార్టీ ఆరు స్థానాల్లో విజయం పొందింది. 22 స్థానాల్లో పోటీకి నిలిచిన మార్క్సిస్టు కమ్యూనిస్టుపార్టీ ఎనిమిది స్థానాల్లో విజయం సంపాదించుకొంది. 635 మంది స్వతంత్ర అభ్యర్థులుగా పోటీ చేస్తే వారిలో కేవలం 12 మంది మాత్రమే గెలవగల్గారు.

### 12.4.7 1983 శాసనసభ ఎన్నికలు

1983లో జరిగిన అసెంబ్లీ ఎన్నికలకు అనేక విధాలైన ప్రాముఖ్యత ఉంది. కాంగ్రెస్ పార్టీ గుత్తాధిపత్యానికి యన్.టి రామారావు స్థాపించిన ప్రాంతీయ పార్టీ, తెలుగు దేశం పార్టీ గండికోటి అధికారాన్ని చెజికించుకొని ఆంధ్రప్రదేశ్ రాజకీయ చరిత్రలో ఒక రిక్డాను సృషించింది. 294 స్థానాలకు పోటీ చేసిన ఇందిరా కాంగ్రెస్ 60 స్థానాలను మాత్రమే గెల్చుకొని ప్రప్రధమంగా ప్రధాన ప్రతిపక్ష స్థానానికి దిగజారింది. 289 స్థానాలకు పోటీచేసిన తెలుగుదేశం 197 స్థానాలను గెల్చుకొని ఆంధ్రప్రదేశ్‌లో ప్రప్రధమంగా కాంగ్రేసేతర ప్రభుత్వాన్ని ఏర్పాటుచేసింది. తెలుగు దేశం మద్దతులో స్థానాలకు పోటీచేసిన రాష్ట్రీయ సంజయ్ విచారమంచ్ నాలుగు స్థానాలను గెల్చుకుంది. 81 స్థానాలకు పోటీచేసిన భారతీయ జనతాపార్టీ కేవలం మూడు స్థానాలను మాత్రమే గెల్చుకుంది. సి.పి.ఐ నాలుగు, సి.పి.ఐ. (ఎమ్) ఐదు, జనతాపార్టీకి ఒక స్థానం లభించగా, లోక్‌దళ్ రిపబ్లికన్ పార్టీలకు ఒక్క స్థానం కూడా లభించలేదు. ఈ ఎన్నికలలో ఉభయకమ్యూనిస్టు పార్టీ లు కలిసి పోటీచేసిన ఫలితం నామమాత్రమే. రాష్ట్ర రాజకీయాల్లో 1983 ఎన్నికలు ఒక మైలురాయి. అవి రాష్ట్ర రాజకీయ పరిణామాల్లో ఒక నూతన దశకు నాంది పలికాయి. అంతవరకు కాంగ్రెస్ కంచుకోటగా ప్రసిద్ధి చెందిన ఆంధ్ర ప్రదేశ్ తెలుగు దేశం వశమైంది.

### 12.4.8 1985 శాసనసభ మధ్యాంతర ఎన్నికలు

1984లో టి.డి.పి.లో చీలికవచ్చింది. ఒక నెల రోజులు ఎన్.టి. రామారావు పదవీచ్యుతులైనారు. నాదెండ్ల భాస్కరరావు ముఖ్యమంత్రి అయ్యారు. ప్రజాబలంతో తిరిగి ఎన్.టి.రామారావు ముఖ్యమంత్రి అయ్యారు. తరవాత 1984 నవంబర్‌లో జరిగిన

లోక్‌సభ ఎన్నికల్లో టి.డి.పి. 30 స్థానాల్లో గెలుపొందింది. లోక్‌సభలోని ప్రధాన ప్రతిపక్ష విభాగం అయింది. అసెంబ్లీని రద్దుచేయించిన అనంతరం 1985లో జరిగిన శాసనసభ ఎన్నికల్లో మిత్ర పక్షాలతో సీట్లు సర్దుబాటు చేసుకొని తిరిగి తెలుగు అఖండ విజయాన్ని సాధించింది. ఈ ఎన్నికల్లో కాంగ్రెస్ - ఐ బలం మరింత తగ్గిపోయింది. టి.డి.పి.తో పాటు దాని మిత్ర పక్షాలు కూడా ఈ ఎన్నికల్లో తమ బలాన్ని కొద్దిగ పెంచుకోగలిగాయి.

ఈ ఎన్నికల్లో మొత్తం 294శాసనసభ స్థానాల్లో టి.డి.పి. 202, కాంగ్రెస్ (ఐ) 49, బి.జె.పి. 8, జనతా పార్టీ 3, సి.పి.ఐ 11, సి.పి.ఎమ్ 11, ఇతరులు 10 గెలుపొందారు.

మిత్ర పక్షాలైన భారతీయ జనతా పార్టీ, సి.పి.ఐ, సి.పి.ఎమ్, జనతా పార్టీలతో తెలుగుదేశం ఎన్నికల పొత్తు కుదుర్చుకొని సీట్లను సర్దుబాటు చేసుకొంది. 1984 ఆగస్ట్ సంక్షోభంలో తనతోబాటు ఉండి " ప్రజాస్వామ్య పునరుద్ధరణ" కు కృషిచేసిన మిత్ర పక్షాలకు కొన్ని స్థానాలను కేటాయించగా మిత్ర పక్షాలు 45 స్థానాలకు పోటీ చేసి 34 గెలుచుకొన్నాయి. సి.పి.ఐ 5 నుంచి 11కు. సి.పి.ఎమ్ 4 నుంచి 11కు, బి.జె.పి.4 నుంచి 8కి, జనతా పార్టీ 1 నుంచి 3కు, తమ శాసనసభా బలాన్ని గత ఎన్నికల కంటే పెంచుకొన్నాయి. వీటితోపాటు తెలుగుదేశం బలపరిచిన ఇద్దరు స్వతంత్ర అభ్యర్థులు కూడా గెలిచారు.

### 12.4.9 1989 శాసనసభ ఎన్నికలు

1989లో రాష్ట్రంలో అసెంబ్లీ ఎన్నికలు జరిగాయి. ఈ ఎన్నికలు రాష్ట్రరాజకీయ చరిత్రలో మరో మలుపును తీసుకొన్నాయి. 1983లో రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన తొలి కాంగ్రెసేతర ప్రభుత్వం (తెలుగుదేశం) తిరిగి అధికారాన్ని కోల్పోయి ప్రతిపక్షంలో కూర్చుంది. రాష్ట్ర ప్రజలు తెలుగు దేశం పాలనను తిరస్కరించి మళ్ళీ కాంగ్రెస్ -ఐ కే పట్టం కట్టారు. ఈ ఎన్నికలలో కాంగ్రెసు పార్టీ 45.33% ఓట్లను పొంది 180 స్థానాలను చెజిక్కించుకొంది. తెలుగుదేశం దాని మిత్ర పక్షాలు కలిసి 42.25% ఓట్లను సాంపందించుకొని కేవలం 73 స్థానాలతో సరిపెట్టుకోవాలసివచ్చిది. ఈ ఎన్నికలలో సి.పి.ఐ, సి.పి.ఐ.(ఎమ్), బి.జె.పి. జనతాదళ్‌లు 6,8,5,1 స్థానాలను గెలుచుకొన్నాయి. తెలుగు దేశం యొక్క బలం 202 నుండి 73కు పడిపోయింది. 1983 నుంచి 1989 వరకు అధికారంలో ఉండి రాష్ట్రంలో కేంద్ర రాజకీయాల్లో సంచలనం సృష్టించిన తెలుగుదేశం 1989 అసెంబ్లీ ఎన్నికల్లో ఘోర పరాజయాన్ని చవిచూచింది. 7 సంవత్సరాల అనంతరం తిరిగి కాంగ్రెస్ పీటమెక్కింది.

### 12.4.10 1994 శాసనసభ ఎన్నికలు

1994లో జరిగిన రాష్ట్రశాసన సభ ఎన్నికలో తెలుగుదేశం పార్టీ అఖండ విజయాన్ని సాధించి 5 సంవత్సరాలు తరువాత అధికారని పొందగల్గింది. ఈ ఎన్నికలో కాంగ్రెసు పార్టీ ఎవ్వరు ఊహించని ఘోర పరాజయాని చవిచూచింది. తెలుగు దేశం పార్టీ రాష్ట్ర రాజకీయ చరిత్రలో ఎక్కువ సీట్లను గెలుచుకొన్నాది. ఈ ఎన్నికలో తెలుగుదేశం పార్టీ 251 స్థానాలలో పోటీ చేసి 44.79% ఓట్లను పొంది 219 స్థానాలలో విజయ కేతనం ఎగురవేసింది. దాని మిత్ర పక్షాలైన సి.పి.ఐ, సి.పి.ఎమ్ లు 21,16 సీట్లలో పోటీచేసి 19,15 స్థానాలలో విజయాని సాధించాయి. కాంగ్రెసు పార్టీ 292 స్థానాలలో పోటీచేసి 33.56% ఓట్లతో కేవలం 26 స్థానాలను మాత్రమే గెలుచుకొగల్గింది. కాంగ్రెసు పార్టీ శాసన సభలో ప్రతిపక్ష హోదను కూడా కోల్పోయింది.

### 12.4.11 1999 శాసనసభ ఎన్నికలు

1995లో తెలుగు దేశం పార్టీ రెండుగా చీలి చంద్రబాబునాయుడు ముఖ్యమంత్రి అయినారు. ఆ తరువాత 1999లో రాష్ట్ర శాసన సభకు ఎన్నికలు జరిగినాయి. ఈ ఎన్నికలలో తెలుగుదేశం పార్టీ తన పాత మిత్రలైన సి.పి.ఐ, సి.పి.ఎమ్ పార్టీలతో పొత్తును విడనాడి బి.జె.పి తో పొత్తుపెట్టుకొని ఎన్నికలలో పోటీచేసినది. తెలుగుదేశం (ఎన్.టి.యర్) తెలుగుదేశం ( అన్న ) సి.పి.ఐ, సి.పి.ఎమ్. బి.ఎస్.పి. మొదలైన పార్టీలుకూడా ఈ ఎన్నికలో పోటీ చేసిన్తాయి. కాంగ్రెసు పార్టీ ఒంటరిగానే పోటీకి దిగింది.

ఈ అసెంబ్లీ ఎన్నికలలో తెలుగుదేశం పార్టీ 270 స్థానాలలో పోటీ చేసి 46% ఓట్లతో 179స్థానాలను గెలుచుకొని తిరిగి అధికారని పొందింది. దాని మిత్ర పక్షామైన బి.జె.పి 24 స్థానాలలో పోటీ చేసి 3% ఓట్లతో 12 స్థానాలను గెలుచుకొంది. కాంగ్రెసు పార్టీ 292 స్థానాలకు పోటీ చేసి 43% ఓట్లతో 91 స్థానాలలో విజయం పొందింది. టి.డి.పి. అన్న, టి.డి.పి ఎన్.టి.యర్ పార్టీలు కానీసం ఒకస్థానైన గెలుచుకొలేకపాయాయి. ఘన చరిత్ర గల సి.పి.ఐ పార్టీ కూడా ఈ ఎన్నికలో ఒకసీటును కూడా గెలిచుకొలేకపావటం విశేషముగా చెప్పవచ్చు. సి.పి.ఐ మాత్రము రెండు స్థానాలతో మాత్రము సరిపెట్టుకొవాలసివచ్చింది.

### 12.4.12 2004 శాసనసభ ఎన్నికలు

2004లో జరిగిన రాష్ట్ర శాసన సభ ఎన్నికలో కాంగ్రెసు పార్టీ 10 సంవత్సరాల తరువాత తెలుగు దేశం పార్టీనుండి అధికారని పొందగల్గింది. ఈ ఎన్నికలో కాంగ్రెసు పార్టీ టి.ఆర్.ఎస్, సి.పి.ఐ, సి.పి.ఐ.ఎమ్ పార్టీలతో పోత్తును కుదృుకోగా, టి.డి.పి, బి.జె.పి పార్టీలు కలసి పోటీచేసాయి. కాంగ్రెసు పార్టీ 230 స్థానాలలో పోటీ చేసి 38.2% ఓట్లను పోంది 180 సీట్లలో విజయం సాధించింది. ఈ ఎన్నికలో ప్రప్రధముగా టి.ఆర్.యస్. 6.6% ఓట్లతో 26 సీట్లను గెలుచుకొంది. సి.పి.ఐ, సి.పి.ఐ.ఎమ్ లు 6,9 స్థానాలో విజయం సాధించగా తెలుగుదేశం పార్టీ 264 సీట్లలో పోటీచేసి 37% ఓట్లతో కేవలం 47 స్థానాలను మాత్రమే గెలుచుకొగల్గింది. గత శాసనసభలో 12 స్థానాలు కలిగిన బి.జె.పి రెండు స్థానాలలో మాత్రమే విజయాన్ని సాధించింది.

## 12.5 ఓటింగ్ ప్రవర్తన

రాజకీయ వ్యవస్థ విస్తృత అవగాహనకు ఎన్నికలను, ఎన్నికలలో వోటింగ్ ప్రవర్తనెము తెలుసుకోవడం అవసం. అయితే దేశ రాజకీయ ఉష్ణోగ్రతను కొలిచే ప్రమాణం ఎన్నికలే కనుక వాటి స్థూల, సూక్ష్మ అధ్యయనం కూడా అవసరం. దీనివల్ల భారత రాజకీయ వ్యవస్థ అసాధారణ స్వభావాన్ని లోతుగా తెలుసుకోవడానికి వీలవుతుంది. అంతేకాక భారత దేశంలోను వివిధ రాష్ట్రాలలోను విధాననిర్ణేతల ఎంపికలో ఏ రాజకీయ, రాజకీయేతర అంశాలు ప్రధాన పాత్ర వహిస్తున్నాయో తెలుసుకోవడానికి వీలువుతుంది. విధాన నిర్ణేతల ఎంపికలో ఏ అదృశ్య హస్తాలు ఉన్నాయో, ఏ తంత్రాన్ని అవలంబించారో, రాజకీయంగా ఏ బేరసారాలు [illegible], లాంఛన ప్రాయమైన వర్గాలు, లాంచన ప్రాయం కాని వర్గాలు ఏ పాత్రను నిర్వహించాయో వివరంగా తెలుస్తుంది.

[illegible] వోటింగ్ ప్రవర్తనల అధ్యయనం వలన రాజకీయ సమాజికీకరణ క్రమాన్ని అవగాహన చేసుకోవడానికి సహాయ పడుతుంది. శి[illegible] ప్రజలకు సంబంధించిన ఒక విలువగా ప్రజాస్వామ్య అంతరంగీకరణను పరిశీలించడానికి సహాయపడుతుంది. విప్లవాత్మక స్వభావంగల బ్యాలట్‌పెట్టె నిజమైన ప్రభావాన్ని అర్థంచేసుకోవడానికి సహాయపడుతుంది. నియోజకుల విధానాలు ఎంతవరకు పూర్వం [illegible] కొనసాగుతున్నాయా, విడిపోతున్నాయా అనే అంశం మీద అవగాహనకు తోడ్పుడుతుంది.

ఈ ప్రయోజనాలేకాక, ఎన్నికలు, వోటింగ్ ప్రవర్తనల అధ్యయనం వల్ల సిద్ధాంతిక దర్శనాలను, ఎన్నికల వాగ్దానాలను పత్రాలను, రాజకీయపార్టీల కార్యక్రమాలను, వోటర్ల ప్రేరేపక, ప్రవర్తనా పూర్వక స్పందనలమీద వాటి ప్రభావాన్ని తెలుసుకోవడానికి వీలవుతుంది.

అంతేకాక, ప్రభుత్వ న్యాయసమ్మతత్వాన్ని, రాజకీయ పార్టీలను విశ్లేషించటానికి ఈ అధ్యయనం ఉపకరిస్తుంది. ప్రజల రాజకీయ ప్రయోజకత్వాన్ని, ప్రజాసార్వభౌమాధికారాన్ని ఎంతవరకు రూఢి చేసుకుంటున్నారో తెలుసుకోవడానికి ఈ అధ్యయనం పనికి వస్తుంది. అంతేకాక రాజకీపరిణామంలో వోటింగు ప్రవర్తనను పరిశీలించడం వల్ల దానిలోని ఆధునికతను లేదా ఆదిమతత్వాన్ని కొలవడానికి వీలవుతుంది. తాత్వికంగా మానవుడు వివేకి అనీ, కానీ రాజకీయంగా, ఆర్థికంగా అవివేకి అని ఎక్కువ మంది నమ్ముతారు. కనుక అనేక రకాలైన ప్రభావాలు, అతనిమీద భిన్న పరిమాణాల్లో భిన్న కాలాల్లో పరిస్థితిని బట్టిపని చేస్తుంటాయి.

అయితే ఓటింగు హక్కు వినియోగంలో వ్యక్తి మీద పని చేసే అంశాలు స్థూలంగా రెండు వర్గాలుగా విభజింపవచ్చు.

1 రాజకీయ అంశాలు 2. రాజకీయేతర అంశాలు

వోటింగు ప్రవర్తన

రాజకీయ అంశాలు

రాజకీయేతర అంశాలు

సిద్ధాంతం తరగతి

పార్టీతో సంబంధాలు

అభ్యర్థి

సాంఘిక అంశాలు

ఆర్థిక అంశాలు

ఇతర అంశాలు

ఆదాయం భూకమతాల యాజమాన్యం

వయస్సు

వయస్సు విద్య లింగము గ్రామీణ పట్టణ నివాసం

కుటుంబ బంధుత్వం కులం భాష ప్రాంతీయత

రాజకీయ అంశాలను మరల 3 రకాలుగా వర్గీకరించవచ్చు. అవి॥

1. సిద్ధాంతం, సమస్యలు, తరగతి
2. పార్టీతో సంబంధాలు
3. అభ్యర్థి

రాజకీయేతర అంశాలు ప్రధానంగా, సాంఘిక, ఆర్థిక, సాంస్కృతిక సమస్యలకు సంబంధినవి అవి.

- కుటుంబం
- బంధుత్వం / రక్త సంబంధం
- కులం
- భాష
- ప్రాంతీయత. ఉపప్రాంతీయత
- నాయకత్వ ఆకర్షణ
- చిహ్నం
- వయస్సు, విద్య, గ్రామీణ పట్టణ నివాసం, భూకమతాల యాజమాన్యం లింగం
- నాయకత్వ ఆకర్షణ
- చిహ్నం
- వయస్సు, విద్య, గ్రామీణ పట్టణ నివాసం, భూకమతాల యాజమాన్యం లింగం

మొదలగునవి సాంఘీక అంశాలు

ఓటింగు ప్రవర్తనకు నిర్ణాయకాలుగా ఈ అంశాలు ఎలా పనిచేస్తాయో తెలుసుకుందాం

## 12.6 రాజకీయ అంశాలు

### 12.6.1 . సిద్ధాంతం

రాజకీయ పార్టీల మద్దతుకు ఓటర్లను సమీకరించడానికి పార్టీ సిద్ధాంతం కార్యక్రమాలు. సమస్యలకు సూచించే పరిష్కారం అనేవి ప్రధాన అంశాలు. సర్ ఆంథోని డౌన్స్ ప్రజాస్వామ్యానికి ఆర్థిక వ్యాఖ్యానం చేస్తూ రాజకీయ పార్టీలను ఉత్పత్తి దారులతోను పౌరులను వినియోగదారులతోను, పోల్చాడు. ఆర్థిక వాణిజ్యసంస్థలు అనేక పేర్లమీద వినియోగదార్లను వారికనుకూలంగా ఆకర్షించుకోవడానికి వస్తువులను ఉత్పత్తి చేస్తాయి. అట్లాగే వినియోగదారులైన పౌరులను కూడా చౌకగా, ఎక్కువ లాభకరంగా ఉండే పార్టీల వస్తువులను, ఉత్పత్తులను కనుక్కొంటారు. ఈ పోలికే ల్ల పార్టీలు ఓటర్ల వినియోగానికి సిద్ధాంతాలను రూపొందిస్తాయని తెలుస్తుంది. ప్రపంచంలో బాగా అభివృద్ధిచెందిన దేశాలలో అంటే రాజకీయ చైతన్యం ఎక్కువగా ఉన్న దేశాలలో పౌరులు తమంత తామే ఏ ప్రభావం లేకుండా ఓటింగు హక్కును వినియోగిస్తుంటారు. కానీ అభివృద్ధి చెం[illegible] దేశాలలో ఇది వాస్తవం కాదు.

భారతదేశంలో సిద్ధాంతం, వర్గ చైతన్యం ఓటింగు ప్రవర్తన మీద చాలా స్వల్పంగా ప్రభావం చూపుతాయి. కాంగ్రెసు పార్టీ నినాదాలైన సామ్యవాదం, ప్రజాస్వామ్యం, సమైక్యత, అఖండత, సుస్థిరత్వం, అలీన విధానం మొ॥లగు అంశాల ప్రభావం ఓటర్లపై గుణనీయంగా ఉంది. అట్లాగే సి. పి. ఐ. సి.పి.యస్.ల వామపక్ష సిద్ధాంతం కూడా కొన్ని వర్గాల వోటింగు ప్రవర్తన మీద కొంతమేరకు ప్రభావం చూపుతుంది. వర్గ చైతన్యానికి, కార్మిక వర్గ సమైక్యతకు, రైతు ఉద్య[illegible]కు, ఉద్యోగిసంఘాల ఉద్యమానికి, పెట్టుబడిదారీ విధాన నిర్మూలనకు అనుపస్థిత భూస్వామ్య వ్యవస్థ నిర్మూలనకు (అబ్‌సెంటి లాండ్‌లార్డిజమ్) యాజమాన్యంలో కార్మికుల భాగస్వామ్యానికి, సామ్రాజ్యవాద వ్యతిరేకతకు. వలస విధాన వ్యతిరేకతకు, జాతి విచక్షణకు, జాతి దురభిమానానిక , అపార్థీడ్‌కు వ్యతిరేకతకు వారిచ్చే ప్రాధాన్యతవల్ల వోటింగు ప్రవర్తన ప్రభావితమవుతుంది. దీనికి ఉదాహరణకు పశ్చిమ బెంగాల్, త్రిపుర, కేరళ, ఇంకా భారతదేశంలో కొన్ని రాష్ట్రాలలో ఉన్న పారిశ్రామిక కార్మికుల ప్రాబల్యం ఉన్న ప్రదేశాలు. అట్లాగే మితవాద పార్టీలయిన బిజెపి వంటి పార్టీలు కూడ జాతీయత, దేశభక్తి, భారతసంస్కృతి, ప్రాచ్యతత్వం, భారతీయ మర్యాద, నాగరికత, అలీన విధానంద్వారా అగ్రరాజ్యాలకు సమానమైన దూరంలో ఉండడం, అధికార భాషగా హిందీకి ప్రాధాన్యత మొదలగునవి స్ఫుటంగా మాట్లాడగలిగిన వర్గాలను వృత్తి ఉద్యోగాలు అవలంబించే వారిని, సాంఘిక క్రమానుగతశ్రేణి వ్యవస్థలో ఉన్నతస్థానాలకు చెందిన వర్గాలవారికి ఈ సిద్ధాంతాల ద్వారా ప్రభావితం చేసాయి.

జనతాపార్టీ దాని ముతాలు కూడా ప్రత్యామ్నాయ సిద్ధాంతాల రూపంలో నిజమైన అలీన విధానం, గాంధేయ సామాజిక పంథాలో ప్రణాళికారచన, ఆర్థిక, రాజకీయ వికేంద్రీకరణ, గృహ, చిన్న తరహా పరిశ్రమలకు ప్రధాన్యత న్యాయవ్యవస్థ స్వాతంత్ర్యం మొ॥ ఆశయాలను పేర్కొన్నాయి.

అయితే సైద్ధాంతిక, వర్గ చైతన్య ప్రభావ పరిమాణం ఒక్కటే ఓటింగు ప్రవర్తనకు నిర్ణాయక అంశం అని అనుకోరాదు.

### 12.6.2 పార్టీ

పార్టీ గుర్తింపు, రాజకీయ పక్షపాతం కూడా ఓటింగు ప్రవర్తనను ప్రభావితం చేస్తాయి. భారతదేశంలో సాధారణంగా ప్రజలు ఎన్నో కారణాల వల్ల తమను తాము ఏదో ఒక పార్టీకి చెందినవారుగా భావించుకుంటారు. ఉదా- మహాత్మాగాంధీ, నెహ్రూ, పటేల్‌ల నాయకత్వంలో కాంగ్రెస్ స్వాతంత్రం సంపాదించింది. కనుక తమను తాము కాంగ్రెస్ పార్టీకి చెందినవారుగా ప్రజలు భావించుకుంటారు. అల్లాగే డాంగే, చంద్ర రాజేశ్వరరావు మొ॥ స్వాతంత్ర యోధులు నాయకత్వం వహించిన పార్టీ కనుక వోటర్లు సిపిఐని బలపరుస్తారు. అట్లాగే పి. సుందరయ్య, నంబూద్రిప్రసాద్, జ్యోతిబసు వంటి వారివల్ల సిపిఐ(యమ్)ను బలపరుస్తారు. వారు

విప్లవాత్మక సాంఘిక ఆర్థిక మార్పులను కంకణం కట్టుకోవడం కూడా వారిని బలపచడానికి కారణం. ఎన్.టి. రామారావు , చంద్రబాబు నాయుడు ప్రభృతుల నాయకత్వ సామర్థ్యం పట్ల విశ్వాసంగల రాష్ట్ర ప్రజలు తెలుగు దేశం పార్టీని బలపరిచారు. కనుక పార్టీ గుర్తింపువల్ల ఓటింగు ప్రవర్తన ప్రభావితమవుతున్నది.

**12.6.3 అభ్యర్థి**

భారత రాజకీయసంస్కృతిలో అభ్యర్థి వ్యక్తిత్వ అంశం అనేది పార్టీ సిద్ధాంతంతో పోల్చితే ప్రసిద్ధమయిన నిర్ణాయక అంశమే ఒక పార్టీ చిహ్నం మీద పోటీ చేస్తున్న అభ్యర్థికి ప్రజలతో ఉన్న సాన్నిహిత్యం వ్యవహార సంబంధ బాంధవ్యాలు, ప్రజలకు దగ్గరరగా నివాసం, అనే అంశాలు అతనికి అనుకూలంగా మద్దతును సమీకరించడానికి పనికి వచ్చే అంశాలు. అవికాక మానసిక అనుబంధతత్వం, వ్యక్తిగతమయిన, లాంచనప్రాయం కాని వ్యవహార, సమాచార సంబంధ మార్గాలు వంటి అభ్యర్థి ఉపయోగించే అనేక రకా తంత్రాలు ఓటింగుసరళిని ప్రభావితం చేస్తాయి. రాజకీయ పరిమాణంలో సిద్ధాంతం, పార్టీ పూర్తిగా పనిచేయవని దీని అర్థ కాదు. అన్ని అంశాలు అంటే సిద్ధాంతం అభ్యర్థి పార్టీతో సంబంధాలు కలిపి మద్దతునిర్మాణంలో పనిచేస్తాయి. అయితే ఈ మూడింటిలో అభ్యర్థి వ్యక్తిత్వ సంబంధబాంధవ్యాలకే ఓటర్ల మద్దతు తద్వారా గెలుపును పొందటానికి ఎక్కువ ప్రాముఖ్యత ఉందని చెప్పవచ్చు. దీనికి ఉదాహరణగా ఏ పార్టీ చిహ్నం లేకుండా ఎన్నికవుతున్న స్వతంత్ర అభ్యర్థులను చెప్పుకోవచ్చు. అంటే వ్యక్తి వ్యక్తిగతమూర్తిమత్వం, నియోజక వర్గం మీద అతని పట్టు, అతని రాజకీయనేపధ్యం గతంలో అతడు చేసిన ప్రజాసేవ, అతనిలో ఉదాత్తగుణాలు వంటివి ఓటింగు ప్రవర్తనను నిర్ణయించడంలో బలీయమైన అంశాలుగా చెప్పవచ్చు.

**6.7 రాజకీయేతర అంశాలు**

**12.7.1 కుటుంబ**

కుటుంబ ప్రాథమిక సంస్థ. కుటుంబ సభ్యులందరిని సన్నిహితం చేసి వారి విలువలకు రూపం యిచ్చే సంస్థ. అదే రాజకీయ సామాజికీకరణకు మౌలిక ప్రతినిధిగా భావించబడుతుంది. భారతదేశంలో సాధారణవిషయాల్లోనయినా, రాజకీయ సమస్యలలోనయినా కుటుంబంలోని నిర్ణయాలకు కుటుంబ పెద్ద మార్గదర్శకుడు.

కనుక రాజకీయ పరిధిలో కుటుంబ ఓటింగు ప్రవర్తనను రాజకీయ ఎంపికను కుటుంబపెద్ద నిర్ణయిస్తాడు. దానిన ఆ కుటుంబ సభ్యులు సాధారణంగా పాటించడం జరుగుతుంది. కనుక కుటుంబం మొత్తం ఒకే రకంగా ఒకరికే లేదా ఎంపిక చేసిన వారికే ఓటుచేసే సరళి (బ్లాక్ ఓటింగ్ పాటర్న్) అనేది భారతదేశంలో నియోజకుల ప్రవర్తన ప్రముఖ లక్షణం.

**12.7.2 కులం**

కులం అనేది సామాజిక అంశం. హిందూసమాజం జాతి లేక వర్ణం అనే ప్రాతిపదిక మీద విభజింపబడింది. ప్రాచీనకాలంలో ధర్మాలను బట్టి వర్ణ విభజన జరిగినా, కాలక్రమంలో దానికి ఆరోపిత లక్షణం వేళ్ళూనింది. ప్రొఫెసర్ సర్‌సికర్ భారత రాజకీయాలు రూపంలో లౌకికమని, వస్తుత: కులప్రధానమని అన్నాడు. కులం అనేది ప్రజలను ఒక సంయుక్త అంగంగా సాంఘిక, ఆర్థిక, రాజకీయ ప్రయోజనాల కోసం జతపరచే శక్తి రాజకీయీకరణ, ఆధునికీకరణ, ప్రజాస్వామ్యకరణ పెరుగుతున్న కొలదీ కులం అనే అంశం సామాజిక సంబంధాలలో ప్రాధాన్యతను పోగొట్టుకుంది. ఒకప్పుడు ఉన్నత కు... ...గా వెనుకబడిన లేక అస్పృశ్యులతో కలిసి తిరగడం న్యూనతగా భావించేవారు. అయితే ఆ తేడాలు నిర్ణయాలు ... ...ది ప్రజల ప్రగతి పూర్వక పరిణామ ఫలితమే కాక రాజకీయ ఆధునికీకరణ ఫలితం కూడా. ఏమయినా కులం ఇప్పుడు మారిన రూపంలో సంప్రదాయవైఖరిని రాజకీయ కారణాలవల్ల ఆధునికప్రగతిశీల వైఖరిని అవలంబించింది. కనుక కులం తన సామాజిమైన సంకెళ్ళను ఛేదించుకొని ఆధునిక విలువలు సంతరించుకోవడానికి రాజకీయల ప్రభావమే కారణం. ఒకవైపు పైపైకి ఆధునికీకరకణ వల్ల బాహ్యసంబంధ బాంధవ్యాలలో లోగడ ఉన్న పట్టింపులు లేకపోయినా, అంతరంగాలలో 'కులం' అనే అంశం ప్రతివ్యక్తినీ

ప్రభావితంచేస్తూనే ఉన్నది. దీని ప్రభావం నుంచి ఏవ్యక్తి సులభంగా తప్పించుకోలేడు. కనుక రాజకీయమైన అభ్యర్థుల ఎంపికలో కూడా ఓటింగు ప్రవర్తనను ప్రభావితం చేసే అంశాలలో ఇదొక అంశం అని చెప్పవచ్చు. అట్లాగే కులం అనేది ఎన్నికలక్రమాన్ని ప్రభావితం చేయడంలో నిర్ణాయక పాత్రను నిర్వహిస్తుంది. ఉదాహరణకు ఎన్నికల సమయంలో అభ్యర్థుల భర్తీ, వోట్లను పొందేందుకై కులం మద్దతును సమీకరించడం, నియోజకుల గెలుపులో కులం ముసుగును వినియోగించడం కులం రాజకీయాలు పరస్పరం ప్రభావితం అవుతున్నాయి. ప్రొఫెసర్ రజనీకొఠారీ చెప్పినట్లు భారత రాజకీయాలు కులతత్వ గతమయ్యాయి. కులం రాజకీయాకరణ పొందింది!!

అయితే వామపక్షాలతో సహా దాదాపు అన్ని రాజకీయ పార్టీలు వామపక్షాలలోత సహా ఎన్నికల ప్రచారంలో కులాన్ని ఉపయోగించుకోవడాన్ని ఖండిస్తాయి. కానీ ఆ పార్టీలు వాస్తవంగా రాజకీయ అవసరాల కోసం, గెలుపుకోసం 'కులం' అనే అంశాన్ని ఎక్కువగా వినియోగించుకుంటాయి.

**12.7.3 మతం మరియు జాతి**

భారతీయ సమాజాన్ని విభజిస్తున్న మరొక అంశం మతం మరియు జాతి భారతీయ సమాజంలో హిందువులు, ముస్లిములు, సిక్కులు, క్రైస్తవులు, బౌద్ధులు ఉన్నారు. దీనినే సాంఘిక బహుత్వం అనడం పరిపాటి. స్వాతంత్రానికి పూర్వం కూడా మత ప్రాతిపదిక మీదనే ఎన్నిక జరిగింది. కొన్ని మతాలకు ప్రత్యేక నియోజక వర్గాలుండేవి. ఇదే ముస్లిం జాతీయతకు, దాంతోపాటు భారతజాతీయత పెరిగి చివరికి దేశవిభజనతో అంతమయింది. స్వాతంత్ర్యానంతరం రాజ్యాంగం లౌకికపునాదులను ఏర్పాటుచేసినా కూడా మతపరమయిన రాజకీయాలుగాని మతపరమైన పక్షపాతాలుగాని భారతదేశంలో అంతరించలేదు. పైగా పార్టీలకు అనుకూలంగాకాని, వ్యతిరేకంగా గాని మతవర్గీయుల సున్నితభావాలను ప్రేరేపించడం పరిపాటి అయింది. అంతేకాక మతవర్గాల నుంచి మద్దతును సమీకరించడం కోసం ఆ మతవార్గనికి చెందిన అభ్యర్థినే పోటికి నిలబెట్టడం వంటి అంశాలు వోటింగు ఎంపిక మీద మతం ఎంత విశేషమైన ప్రభావాన్ని చూపుతుందో స్పష్టం చేస్తుంది. సాధారణంగా అల్పసంఖ్యాక వర్గం సంఖ్యాధిపత్యమున్న మత వర్గపు దాడులనుంచి తమను రక్షించుకోవడం కోసం అధికారంలో ఉన్న పార్టీకి మద్దతునిస్తుంది. అయితే లౌకిక పార్టీకి, మతపరమైన పార్టీకి మధ్య అభ్యర్థిని ఎంపిక చేసుకోవలసివచ్చినపుడు మతపరమైన గుర్తింపువల్ల, విద్యుక్తధర్మాలవల్ల ఏవర్గమైనా తమ మతానికే ప్రాధాన్యతనిస్తుంది. ఈ కారణాల వల్ల మతపార్టీలు రాజకీయరంగంలో నిలపడమేకాక కొంత మేరకు రాజకీయమైన పలుబడినికూడా సంపాదించాయి. ఉదా॥ ఆంధ్రప్రదేశ్‌లో బి.జె.పి పార్టీ, ఎమ్.ఐ.ఎమ్ పార్టీలు మత మూలసంప్రదాయతత్వం మీద ఆధారపడ్డాయి.

**12.7.4 భాష**

ఓటింగు ప్రవర్తనను ప్రభావితంచేసే సాంఘిక అంశాలలో భాష మరొకటి. మతం తరువాత భాష అనే అంశం జాతీయచైతన్య పరిణామంలో ప్రముఖస్థానాన్ని పొందుతుంది. భాషావాదం భాషాపరమైన పరిగణనలు 1956లో భారత రాజకీయ పటాన్ని తిరిగి గీసేట్లుచేసాయి. 1960లో బొంబాయి విభజన 1966 పంజాబ్ విభజన, 1967లో డియంకెఆవిర్భావం అనేవి ఆయా రాష్ట్రాలేర్పడడానికి భాష ఎంత బలమైనశక్తిగా పనిచేసిందో స్పష్టం చేసాయి. భాషాపరమైన, జాతీయతాశక్తికి 18 భాషలకిచ్చిన గుర్తింపు కూడా ఒక ఉదాహరణ. ఇప్పటికి కొన్ని భాషలను మాట్లాడే ప్రజలు వారి భాషల గుర్తింపుకోసం చేసే ఆందోళనల వల్ల భాషతో మనిషికి ఎంత అనుబంధముంటుందో తెలుస్తుంది. ఒకభాష మాట్లాడే ప్రజలు ఆభాష పరంగానే గుర్తింపు పొందాలనుకోవడం వల్ల 'భాష' అనే అంశానికి అంత శక్తి లభించింది.

ముస్లిములు, 'ఉర్దు' భాషకు రక్షణ కావాలని దానిని భారతదేశపు రెండో అధికార భాషగా చేయాలని అడగడం దీనికి ఉదాహరణ.

అంతేకాక, రాష్ట్ర విధాన సభలకు, స్థానిక సంస్థలకు జరిగే ఎన్నికలలో, ఓటర్ల మీద భాష చాలా నిర్ణాయక పాత్రను నిర్వహిస్తుంది. 1983లో ఆంధ్రప్రదేశ్‌లో తెలుగుదేశం పార్టీ ఆవిర్భావం కేవలం తెలుగు భాషావిమానానికి, దాని ప్రస్తుతికి నిర్వచనం. అలాగే యం.ఐ.యం పార్టీకి భాష పరంగా ముస్లింలు మద్దతు నియటం జరుగుతుంది.

### 12.7.5 ప్రాంతం

ప్రాంతీయతా చైతన్యం, ఉపప్రాంతయతత్వం అనే అంశాలు కూడా నియోజకుల ఓటింగు ప్రవర్తనను ప్రభావితం చేస్తాయి. ప్రాంతీయ, ఉపప్రాంతీయ ఆందోళనలు, వాటిననుసరించి ఆవిర్భవించిన ప్రాంతీయ పార్టీలు ప్రాంతీయ గుర్తింపుకోసం పెరుగుతున్న వ్యక్తీకరణలే. ప్రాంతీయపార్టీల ఆవిర్భావం వాటికి ప్రజలు ఇస్తున్న రాజకీయ మద్దతును వాటికి జనంలో పెరుగుతున్న పలుకుబడి అన్వయించవచ్చు. ప్రాంతీయతకు, ఉప ప్రాంతీయతకు ఉన్న భావాత్మకమైన ఆకర్షణ మీదనే ప్రాంతీయ పార్టీలు కొనసాగుతున్నాయి. ఉదా: తెలుగుదేశం, తెలంగాణా ప్రాంతీయ సమితి, యం.ఐ.యం, యం.బి.టి, రాజకీయ అధికారాన్ని చేజిక్కించుకోవడానికి మానసికమైన ప్రాంతీయ అనుబంధాలను పటిష్టంగా ఉపయోగించుకున్నాయి. కనుక ప్రాంతీయత వోటింగు వైఖరిని నిర్ణయించడంలో ఒక విలువైన నిర్ణాయకం.

### 12.8 ఆర్థిక అంశాలు

నియోజకుల ఆదాయం, భూమి యాజమాన్యం అనే ఆర్థిక అంశాలు ఓటింగు ప్రవర్తనను నిర్ణయించడంలో మౌలికమైనవి. భారతదేశంలో 1960 మంచి నియోజకుల ప్రవర్తనమీద జరిగిన అనుభవ అధ్యయనాలు ఆదాయం, భూమియాజమాన్యం అనేవి ఓటర్ల ఎంపికమీద విశేషమైన ప్రభావాన్ని చూపుతాయని తెలిపాయి. ఆదాయం అధికమవుతున్న కొలదీ, వ్యక్తిగతయాజమాన్యం క్రింద భూమి అధికమవుతున్న కొలదీ అంత అధికంగా పౌరుల మద్దతు దక్షిణ పార్టీలకే ఉంటున్నది. దానికీ విరుద్ధంగా స్వల్పాదాయవర్గాలు, భూమి లేని లేదా స్వల్పభూమి ఉన్న పౌరులు కేంద్రీయ వామపక్ష వైఖరి ఉన్న రాజకీయ పక్షాల మద్దతు వైపే మొగ్గు చూపుతున్నారు.

### 12.9 ఇతర అంశాలు

పైన తెలిపిన అంశాలు కాక పౌరుల వయస్సు, విద్య, గ్రామీణ / పట్టణ నివాసం అనేవి వారి ఓటింగు ప్రవర్తనను నిర్ణయిస్తాయి. భారతదేశంలో జరిగిన కొన్ని అధ్యయనాలు వయస్సుకు సంబంధించిన ప్రభావం ఓటింగు మీద చాలా స్వల్పమని తేల్చాము. మరికొన్ని అధ్యయనాలు ఓటింగు ప్రవర్తనమీద ఓటింగు ప్రవర్తనమీద వయస్సు ముఖ్యమైన ప్రభావాన్ని చూపుతుందని వెల్లడించాయి. సాధారణంగా వయోవృద్ధులు యధాతథ, సంప్రదాయ దక్షిణపార్టీలకు మద్దతునియ్యడం జరుగుతుంది. కానీ యువకులకు భిన్నాభిప్రాయాలను అవలంబించే వైఖరి ఉంటుంది. వయస్సు పెరుగుతున్న కొలదీ దక్షణ పార్టీలవైపు మొగ్గు ఎక్కువవుతుందని, చిన్న వయస్సులో మొగ్గు వామపక్ష పార్టీల వైపే ఉంటుందన్నది నిరూపితమయింది. దీనిని బట్టి వయస్సుకు వోటింగు ప్రవర్తనకు సంబంధం ఉందని తెలుస్తుంది.

విద్య అనేది ఓటింగు ప్రవర్తనను ప్రభావితంచేసే మరొక అంశం. ఉన్నత విద్యావంతులయిన వారికి ప్రజావ్యవహారాలు, రాజకీయ వ్యవహారాలమీద ఎక్కువ పరిజ్ఞానముంటుంది. కనుక వారు మిగిలినవారికంటే స్ఫుటంగా మాట్లాడగలరు. కనుక విద్యావంతులయిన వారు హేతువునుపయోగించి ఒక పార్టీకి మద్దతును గాని, నిరాకరణను గాని నిర్ణయించుకుంటారు. విద్యావంతులయిన ఈరకమైన వోటర్లసంఖ్య భారత దేశంలో తక్కువే అయినా, నియోజకుల పలుకుబడిని విస్తరించడంలో రాజకీయ విలువలకు రూపు దిద్దడంలో వారి ప్రభావాన్ని కాదనలేము. అనుభవప్రాతిపదిక మీద జరిపిన కొన్ని అధ్యయనాలు ఓటింగుమీద విద్యాప్రభావాన్ని వెల్లడించాయి. విద్య పెరిగినకొద్దీ ప్రగతిశీలక పార్టీలకు వారి మద్దతు కూడా పెరుగుతుందని ఆ అధ్యయనాలు తెలిపాయి.

ఇక స్త్రీ పురుష విభేదం గ్రామీణ / పట్టణ నివాసాలనేవి కూడ ఓటింగు ప్రవర్తనను నిర్ణయిస్తాయి. 1977, అయిదో లోక్‌సభ ఎన్నికల మీద 1983, 1985 రాష్ట్ర విధాన సభల ఎన్నికలమీద జరిపిన కొన్ని అధ్యయనాలు స్త్రీలు కాంగ్రెస్ (ఐ) కి, టి.డి.పి. గట్టి మద్దతు ఇచ్చారని తెలిపాయి. స్త్రీలు ప్రతి నియోజకరగణంలో దాదాపు సగం మంది ఉంటారు. కనుక అనేక పరిగణనల మీద వారి ఎంపికయే ప్రధానంగా నిర్ణయ మవుతుంది. కనుక స్త్రీ పురుష విబేధం అనే విలువైన అంశం కూడా ఓటింగి ప్రవర్తనను ప్రభావితం చేస్తుందనడంలో సందేహంలేదు.

అట్లాగే గ్రామీణ / పట్టణ వర్గీకరణ కూడా ఓటింగు ప్రవర్తనను ప్రభావితం చేసే అంశాలలో ప్రత్యేకంగా పేర్కొన దగింది. రాజకీయ సమస్యలను, రాజకీయ క్రమాలను బాగా తెలుసుకునే సౌకర్యం అవకాశం ఉన్నందువల్ల పట్టణ ప్రజలు ప్రతిపక్షాలకే మద్దతునిస్తారు. అయితే గ్రామీణ ప్రజలకు అసౌకర్యం లేదు కనుక నానారకాల ప్రయోజనాలకు గుర్తైనారు అధికార రాజకీయ పార్టీకే మద్దతు యిస్తుంటారు. సాధారణంగా అధికార రాజకీయ పక్షం గ్రామీణ ప్రాంతాలనుంచే తనకు కావలసిన పెద్ద మొత్తంలో అంటే అత్యధిక భాగం వోట్లను సంపాదించుకుంటుంది. ఆంధ్రప్రదేశ్‌లో ఇటీవల జరిగిన స్థానిక సంస్థల ఎన్నికలలో కాంగ్రెస్ ప్రతిపక్షంగా పురపాలక / నగరపాలక సంస్థల ఎన్నికలలో తన స్థానాన్ని పటిష్టం చేసుకుంది. అయితే తెలుగుదేశం పార్టీ గ్రామీణ ప్రాంతాలలో పెద్దయెత్తున విజయం సాధించింది. మండల ఎన్నికలు కూడా ఈ అంశాన్నే పునరుద్ఘాటించాయి.

### 12.10 సారాంశం

ప్రజాస్వామ్య ప్రభుత్వంలో పౌరులు వ్యక్తిగతంగా ఉండాలంటే ప్రత్యేకమైన భాగస్వామ్య చర్యలు అవసరం. ప్రజాస్వామ్యంలో సిద్ధాంతపరంగా రాజకీయ నాయకత్వపు ఎంపిక విషయంలో మొత్తం పౌరులకు అవకాశం ఉంటుంది. చాలా మంది పౌరులు రాజకీయ భాగస్వామ్యంలో పౌరులు ఓటింగ్ ద్వారా పాల్గొనటం జరుగుతుంది. కొంతమంది ప్రత్యేక అభ్యర్థుల ఎన్నికల ప్రచారంలోను లేక అభ్యర్థులను ఎంపిక చేయటంలోను పాల్గొనవచ్చును. పౌరులకు అందుబాటులో వున్న భాగస్వామ్యం యిది ఒక్కటి కాదు. వాస్తవంగా పౌర భాగస్వామ్యం రాజకీయ సంస్కృతిని నెలకొల్పిన సూత్రాలచే అధికంగా ప్రభావితమవుతుంది. ఈ సూత్రాలు, పౌరుల విధులు, వారి ప్రవర్తనపై పరిమితులను నిర్దేశిస్తాయి. భాగస్వామ్యంలో అనేక విషయాలుంటాయి. వీటిలో భిన్నత్వము ఉన్నప్పటికీ అన్ని రకాల భాగస్వామ్యంలో కార్యాచరణ ఉంటుంది. అందువలన అది నిర్ణయ రూపకల్పనలో ప్రమేయం కల్గి ఉంటుంది. భాగస్వామ్యం అనేది హేతుబద్ధమైనదని పేర్కొనవచ్చు.

ఎన్నికలు ప్రజాస్వామ్య వ్యవస్థలకు గీటురాళ్ళు. నాయకత్వంపై విశ్వాసం ప్రదర్శించడానికి కొత్త నాయకత్వాన్ని బలపరచటానికి రాజకీయ మార్పులకు ఎన్నికలు సంకేతాలు. నియమిత కాలానికి ప్రజలు విధాన నిర్ణేతలను నిర్ణయిస్తారు. ప్రజాభిప్రాయ ప్రకటనకు ఎన్నికలు సాధనాలు. ఎన్నికల్లో పాల్గొని ఓటు చేయటం ద్వారా ప్రజలు రాజకీయ భాగస్వామ్యాన్ని అనుభవిస్తారు. రాజకీయ అధికార లబ్ధికి పోటీపడే వారికి ఎన్నికలు అవకాశం కల్పిస్తాయి. అంతేకాకుండా ఎన్నికలు ప్రజాభిప్రాయ వ్యక్తీకరణకు ఒక అమూల్యమైన సాధనం. అధికారంలో ఉన్న పార్టీ విధాన ప్రభుత్వ నిర్వహణలపై తీర్పు చెప్పటానికి ప్రజలకు ఎన్నికలు చక్కటి అవకాశం. భారతీయ జీవన స్రవంతిలో ఎన్నికలు ముఖ్యమైన చోటును చేసుకొన్నాయి. భిన్నత్వంలో ఏకత్వ భావన ప్రదర్శితమౌతున్న మన దేశంలో ఎన్నికలు వ్యవస్థీకృతం చెంది ఓటర్ల పరిపూర్ణతకు నిదర్శనంగా నిలుస్తున్నాయి.

రాజకీయ వ్యవస్థ విస్తృత అవగాహనకు ఎన్నికలను, ఎన్నికలలో వోటింగ్ ప్రవర్తనము తెలుసుకోవడం అవసం. అయితే దేశ రాజకీయ ఉష్ణోగ్రతను కొలిచే ప్రమాణం ఎన్నికలే కనుక వాటి స్థూల, సూక్ష్మ అధ్యయనం కూడా అవసరం. దీనివల్ల భారత రాజకీయ వ్యవస్థ అసాధారణ స్వభావాన్ని లోతుగా తెలుసుకోవడానికి వీలవుతుంది. అంతేకాక భారత దేశంలోను వివిధ రాష్ట్రాలలోను విధాననిర్ణేతల ఎంపికలో ఏ రాజకీయ, రాజకీయేతర అంశాలు ప్రధాన పాత్ర వహిస్తున్నాయో తెలుసుకోవడానికి

వీలువుతుంది. విధాన నిర్ణేతల ఎంపికలో ఏ అదృశ్య హస్తాలు ఉన్నాయో, ఏ తంత్రాన్ని అవలంబించారో, రాజకీయంగా ఏ బేరసారాలు సాగియో, లాంచవ ప్రాయమైన వర్గాలు, లాంచవ ప్రాయం కాని వర్గాలు ఏ పాత్రను నిర్వహించాయో వివరంగా తెలుస్తుంది.

**12.11 మాదిరి ప్రశ్నలు**

**వ్యాసరూప ప్రశ్నలు**

1. 2004 సంవత్సరము వరకు ఆంధ్రప్రదేశ్లో శాసనసభకు జరిగిన వివిధ ఎన్నికల గురించి విశ్లేషణ చేయండి
2. ఓటింగ్ ప్రవర్తనను నిర్ణయించె అంశాలను చర్చియించండి.
3. " రాజకీయ భాగస్వామ్యమనగా'నేమి వివరించండి.

**లఘుప్రశ్నలు**

1. ఎన్నికల ప్రాముఖ్యత
2. ఎన్నికలలో కులం పాత్ర
3. తెలుగు దేశం పార్టీ

**12.12 చదువదగిన గ్రంథాలు**

1. ఇక్బాల్ నరేన్ - భారతదేశంలో రాష్ట్ర రాజకీయాలు
2. జి. రాం రెడ్డి అండ్ బి.ఎ.వి. శర్మ - ఆంధ్రప్రదేశ్ రాష్ట్రప్రభుత్వ మరియు రాజకీయాలు
3. డి. సూరం నాయుడు అండ్ కె. రామచంద్రమూర్తి - భారతదేశ రాజకీయ వ్యవస్థ
4. ఎ. ప్రసన్న కుమార్ అండ్ అదర్స్ - ఆంధ్రప్రదేశ్ రాష్ట్రప్రభుత్వ మరియు రాజకీయాలు

డా॥ కె. రామచంద్రమూర్తి

# 13. ప్రాంతీయవాదం: తెలంగాణా ఉద్యమం

## Regionalism : Telangana Movement

### 13.0 లక్ష్యం :

భారత రాజకీయాల్లో ప్రాంతీయవాదం అనేక రాష్ట్రాలకు విస్తరించింది. ప్రాంతీయవాదం ఫలితంగా అనేక ఉద్యమాలు ఆవిర్భవించి, వ్యాప్తి చెందాయి. ఆంధ్రప్రదేశ్‌లో ప్రత్యేక తెలంగాణా, ప్రత్యేకాంధ్ర ఉద్యమాలు ప్రాంతీయ వాదం ఫలితంగా ఏర్పడ్డవే. ప్రాంతీయ వాదంకు ముఖ్యకారణం సామాజిక, ఆర్థిక, రాజకీయ కారకాలు. ప్రాంతీయవాదంను, ఆంధ్రప్రదేశ్‌లో ప్రత్యేక తెలంగాణా ఉద్యమం పూర్వాపరాలను వివరించడం ఈ పాఠం యొక్క లక్ష్యం.

### విషయసూచిక :


13.1 ప్రాంతీయవాదం

13.2 ప్రాంతీయవాద శక్తులు

13.2.1 సమాఖ్య వ్యతిరేక శక్తిగా ప్రాంతీయవాదం

13.2.2 సమాఖ్య అనుకూల శక్తిగా ప్రాంతీయవాదం

13.3 తెలంగాణా ఉద్యమం - పరిచయం

13.4 తెలంగాణా ఉద్యమం - చారిత్రక నేపథ్యం

13.4.1 ఫజల్ ఆలీ కమిషన్

13.4.2 పెద్ద మనుషుల ఒప్పందం

13.5 తెలంగాణా ఉద్యమ కారకాలు

13.5.1 రాజకీయసమస్య

13.5.2 ఆర్థికసమస్య

13.5.3 పాలనాసమస్య

13.5.4 సామాజికసమస్య

13.6 తెలంగాణా ఉద్యమం - ఆవిర్భావం - వ్యాప్తి

13.6.1 ఆవిర్భావం

13.6.2 అఖిలపక్ష ఒప్పందం

13.6.3 ఉద్యమ వ్యాప్తి

13.6.4 ముఖ్యమంత్రి హామి

13.6.5 కేంద్ర ప్రభుత్వ వైఖరి
13.6.6 సుప్రీంకోర్టు తీర్పు
13.6.7 తెలంగాణా ప్రజా సమితి
13.6.8 ప్రధాని అష్టసూత్ర పథకం
13.6.9 ప్రభుత్వ నిషేధాజ్ఞలు
13.6.10 రాజకీయ ప్రతిపాదనలు
13.6.11 ముఖ్యమంత్రి రాజీనామా
13.6.12 శాసనసభా సమావేశాలు
13.7 తెలంగాణా ఉద్యమం - పరిసమాప్తి
13.8 సారాంశము
13.9 నమూనా ప్రశ్నలు
13.10 చదువదగిన గ్రంథాలు

## 13.1 ప్రాంతీయవాదం :

ఒక రాష్ట్రంలోని లేదా ఒక ప్రాంతంలోని ప్రజల భావోద్వేగంతో ఆ రాష్ట్రం లేదా ప్రాంతం పై మితిమీరిన మమకారం చూపడం ప్రాంతీయవాదం. డ్యుకాసెక్ (Duchacek) ప్రాంతీయ వాదంను "ప్రాదేశిక తాదాత్మ్యం" (Territorial Identity) అని పేర్కొంటారు. ప్రాంతీయవాదంకు భారతదేశంలో స్వాతంత్రోద్యమ కాలం[illegible]రింపు ఉంది. ప్రాంతీయవాదం[illegible] మూలం బ్రిటిష్ కేంద్రీకృత పాలన. బ్రిటిష్ వారి పాలనా కాలంలో పాలనను భారతదేశంలో[illegible]మూల ప్రాంతాలకు [illegible]డం వలన ప్రాంతీయంగా అభివృద్ధి [illegible] ప్రాంతీయవాద [illegible] చేసాయి.

## 13.2 ప్రాంతీయవాద శక్తులు :

భారతదేశంలో ప్రాంతీయవాద శక్తులను రెండు రకాలుగా విశ్లేషించవలసి ఉంటుంది. అవి 1. సమాఖ్య వ్యతిరేక శక్తి, 2. సమాఖ్య అనుకూలశక్తి.

### 13.2.1 సమాఖ్య వ్యతిరేక శక్తిగా ప్రాంతీయవాదం :

కొన్ని ప్రాంతాలు భారతదేశం నుండి విడిపోయి ప్రత్యేక్య రాజ్యాలుగా ఏర్పడాలన్న వేర్పాటు వాదం. ఉదా- తమిళనాడులోని ద్రవిడ స్థాన్ ఉద్యమం. పంజాబ్‌లోని ఖలిస్థాన్ ఉద్యమం. సమాఖ్య వ్యతిరేకశక్తిగా ప్రాంతీయ వాదం పరిగణింపబడే సందర్భాలలో ప్రాంతీయ వాదాన్ని అధికారాన్ని చేజిక్కించు కోవాలని చూసే అపకేంద్రక శక్తుల (Centripetal force) పరిధిలో విశ్లేషించాలి. ఇది సంపూర్ణ రాజకీయ అధికార సందర్భాన్ని కలిగి ఉండి ప్రజల భావోద్వేగాలను రెచ్చగొడుతుంది.

### 13.2.2 సమాఖ్య అనుకూల శక్తిగా ప్రాంతీయ వాదం:

స్వాతంత్ర్యానికి పూర్వం, స్వాతంత్ర్యానంతరం భారతదేశంలో అనేక సందర్భాలలో ప్రాంతీయ వివాదాలకు లేదా ఐక్యతకు భాష లేదా సాంఘిక స్థితి లేదా కులం సామాజిక, సాంస్కృతిక కారకాలుగా ఉన్నాయి. ఈ కారకాలన్ని ఆర్థిక దృక్కోణాన్ని

సంతరించుకున్నాయి. భాషా సంఘాలు, కుల సంఘాలు, మత సంఘాలు ప్రాంతీయ ఐక్యతను పెంపొందించాయి. ఈ సంఘాలవి కొంతమంది జాతీయ గణాలుగా కూడ పరిగణించారు. ఇవి ప్రాంతీయ పునర్వ్యవస్థీకరణకు సంబంధించి రాజకీయ సార్థకతను సంపాదించుకున్నాయి. స్వాతంత్ర్యానంతరం భారత సమాఖ్య వ్యవస్థలో వివిధ ప్రాంతాల, వర్గాల ప్రజల అధికారయుత కోరికలు విధాన నిర్ణేతలను ప్రాంతీయ వాదంకు గుర్తింపు నివ్వవలసిన అవసరాన్ని సూచించాయి. దీనికి కారణం సమాఖ్య వ్యవస్థకు సంబంధించిన సిద్ధాంతం కొంతమేరకు "ప్రాదేశిక తాదాత్మ్యం" కు గుర్తింపు నివ్వడం. అయితే ఈ సిద్ధాంతం కొన్ని పరిమితులకు జాతీయ సమగ్రత, ప్రాంతీయ మూర్తిమత్వ పెరుగుదల, నియంత్రణ, న్యాయ, చట్టబద్ధ నియంత్రణ - లోబడి ప్రాంతీయ వాదంను గుర్తిస్తుంది.

కులం, భాష, అల్పసంఖ్యాక వర్గం, ఆర్థిక స్థితిగతులు, ఉప సంస్కృతులు, విభిన్న సాంఘిక శక్తులు ప్రాంతీయ వాదంకు జీవం పోసే కొన్ని ముఖ్యమైన శక్తులు. ప్రాంతీయ వాదంకు జీవం పోసే ఈ శక్తులను బైండర్ (Binder) "స్థిరమైన ఉప సంస్కృతులు" గా వర్ణించాడు. ఒక్క మాటలో చెప్పాలంటే రాష్ట్ర రాజకీయాలలో ప్రాంతీయ వాదం సామాజిక, ఆర్థిక, రాజకీయ కారణాల వల్ల, ప్రాంతాలమధ్య అభివృద్ధి పరమైన వ్యత్యాసాలవల్ల అభివృద్ధి చెందుతుంది. ఇది సమాఖ్య అనుకూలశక్తి గానే పరిగణింపబడుతుంది. ఇటువంటి ప్రాంతీయ వాదంకు ఉదాహరణ ఆంధ్రప్రదేశ్‌లోని ప్రత్యేక తెలంగాణా ఉద్యమం.

## 13.3 తెలంగాణా ఉద్యమం - పరిచయం :

సమకాలీన భారతీయ సమాజంలో ప్రాంతీయ వాదంను వివరించడానికి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో తెలంగాణా ఉద్యమం (1969) నుంచి ఉదాహరణ. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం పెద్ద మనుషుల ఒప్పందం (1956) ను సక్రమంగా అమలు చేయడం లేదనే మానసిక అసంతృప్తితో తెలంగాణా ప్రాంత ప్రజల భావోద్వేగ స్ఫోటనగా తెలంగాణా ఉద్యమాన్ని పరిగణించవచ్చు. మొదట తెలంగాణా ఉద్యమం ఆ ప్రాంత పరిరక్షణలను (Safe Guards) అమలు చెయ్యాలనే మధ్యతరగతి వర్గం ప్రజల చర్యగా మొదలైంది. త్వరలో అది ఆంధ్ర వ్యతిరేక ప్రత్యేక తెలంగాణా ఉద్యమంగా రూపుదిద్దుకొంది. వాస్తవానికి ఇది ప్రాంతీయ నాయకులచే నడపబడిన అల్ప సంఖ్యాక వర్గ ప్రజా ఉద్యమం. రాష్ట్ర రాజకీయ నాయకత్వం, అన్ని ప్రతిపక్ష పార్టీలు జనవరి 19,1969 అఖిల పక్ష సమావేశంలో తీర్మానించినట్లు తెలంగాణా పరిరక్షణల అమలులో లోటుపాట్లు ఉన్నాయన్నది వాస్తవం. అయితే జరిగిన విషయాలను దృష్టిలో ఉంచుకొని వెనుక బడిన తెలంగాణా ప్రాంత అభివృద్ధికి ఈ ఉద్యమం ఒక నూతన మార్గాన్ని అన్వేషించడానికి దోహదం చేసింది.

## 13.4 తెలంగాణా ఉద్యమం - చారిత్రక నేపధ్యం :

ఆంధ్రప్రదేశ్ తొలి భాషా ప్రయుక్త రాష్ట్రం. 1953లో ఆంధ్రరాష్ట్రంగా ఏర్పడిన ప్రాంతం, హైదరాబాద్ రాష్ట్రంలోని తెలంగాణా ప్రాంతం కలిపి 1956, నవంబరు 1న ఆంధ్రప్రదేశ్ ఏర్పాటు చేయబడింది. తెలుగు భాష మాట్లాడే వారందరూ ఒక రాష్ట్రంలో ఉండటానికి, ఒకే పాలనా సౌలభ్యం ఏర్పరచుకోవడానికి ఇది దోహదం చేసింది. దీనికి ప్రాతిపదిక 'పెద్ద మనుషుల ఒప్పందం'.

### 13.4.1 ఫజల్ ఆలీ కమిషన్ :

ఫజల్ ఆలీ కమిషన్ (1953-55) భాషా ప్రయుక్త రాష్ట్రాల పునర్వ్యవస్థీ కరణకు సంబంధించింది. ఈ కమిషన్ తన నివేదికలో విశాలాంధ్రను ఏర్పాటు చేయడం వలన కలిగే ప్రయోజనాలను, ఆ విధంగానే ప్రత్యేక తెలంగాణా రాష్ట్ర ఏర్పాటుకు అనుకూల వాదనలను క్షుణ్ణంగా పరిశీలించి తన నిర్ణయాన్ని సిఫార్సు రూపంలో ఇట్లా తెలియచేసింది:

" ప్రత్యేక తెలంగాణా రాష్ట్రాన్ని ఏర్పాటు చెయ్యాలి. అయితే ఆంధ్ర రాష్ట్రంతో ఏకం కావడానికి 1952లో ఎన్నికైన తెలంగాణా రాష్ట్ర శాసన సభ్యులు 2/3 మెజారిటీతో తీర్మానిస్తే విశాలాంధ్రను ఏర్పాటు చేసుకోవచ్చు".

ఈ నివేదిక తెలంగాణా ప్రాంతీయ వాదాన్ని బలపరించింది.

**13.4.1 పెద్ద మనుషుల ఒప్పందం (1956) :**

ఆంధ్రప్రదేశ్ అవతరణకు, తెలంగాణా ప్రాంతంలో ఉన్న భయాందోళనలను తొలగించే నిమిత్తం ఉభయ ప్రాంతాల (ఆంధ్ర, తెలంగాణా) నాయకులు ఒక ఒప్పందాన్ని కుదుర్చుకొన్నారు. ఈ ఒప్పందం ప్రకారం పాలన సాగితే ప్రాంతీయ అసమానతలు తొలగుతాయని భావించారు.

**ఒప్పందంలోని అంశాలు ఇట్లా ఉన్నాయి -**

1. రాష్ట్రానికి సంబంధించిన కేంద్ర, సాధారణ పరిపాలన వ్యయం ఆంధ్ర, తెలంగాణా నిష్పత్తి ప్రకారం భరించాలి. తెలంగాణా మిగులు, ఆ ప్రాంతపు అభివృద్ధికి కేటాయించాలి. అయిదేళ్ళ దాకా ఈ ఏర్పాటు ఉండాలి. అటు తరవాత, తెలంగాణా శాసనసభ్యుల కోరికపై మరో అయిదేళ్ళు పొడిగించవచ్చు.
2. శాసనసభలో తెలంగాణా సభ్యులు ఎట్లా నిర్ణయిస్తే అట్లా మధ్యనిషేదం అమలు జరగాలి.
3. తెలంగాణాలో ఉన్న విద్యా సౌకార్యాలు తెలంగాణా వారికి లభింపజేసి ఇంకా అభివృద్ధి చేయాలి. లేకపోతే మొత్తం రాష్ట్రంలో సాంకేతిక విద్యతో సహా అన్ని విద్యాలయాల్లోనూ మూడో వంతు తెలంగాణా విద్యార్థులకు కేటాయించాలి.
4. ఏకీకరణ కారణంగా కొన్ని ఉద్యోగాలను తగ్గించాల్సివస్తే నిష్పత్తి ప్రకారం తగ్గించాలి.

   ముందు రాబోయే ఉద్యోగాలు ఉభయ ప్రాంతాల జనాభా ప్రాతిపదిక మీద ఉండాలి.
6. అయిదేళ్ల పాటు తెలంగాణాలో ఉంటున్న పరిపాలనా న్యాయ శాఖల్లో ఉర్దూ భాషకు ఉన్న స్థానం కొనసాగాలి. తరువాత ప్రాంతీయ మండలి ఈ అంశం సమీక్షించి సవరించవచ్చు. ఉద్యోగాల్లో చేర్చుకోనే ముందు తెలుగు వచ్చి తీగాలన్న నిబంధన ఉండరాదు. చేరిన రెండేళ్లలోగా తెలుగు నేర్చుకోవాలని నియమం ఉండవచ్చు.
7. తెలంగాణా నిష్పత్తి ప్రకారం నిర్ణయించిన ఉద్యోగాల్లో ప్రవేశించడానికి అభ్యర్థులకు ఆ ప్రాంతంలో 12 సంవత్సరాల నివాసం ఉండాలి.
8. తెలంగాణా ప్రాంతంలో వ్యవసాయ భూముల అమ్మకం ప్రాంతీయ మండలి ఆధీనంలో ఉండాలి.
9. తెలంగాణా సర్వతోముఖాభివృద్ధి సాధించడానికి ఒక ప్రాంతీయ మండలి ఉండాలి.
10. ప్రాంతీయ మండలిలో 20 మంది సభ్యులు ఉండాలి. తెలంగాణా 9 జిల్లాలకు ప్రతినిధులుగా 9గురు శాసనసభ్యులను శాసనసభ ఎన్నుకోవాలి. శాసనసభలో తెలంగాణా సభ్యులు పార్లమెంటు నుంచి గాని శాసనసభ నుంచి గాని 6గురిని ఎన్నుకోవాలి. శాసన సభ్యులు కాని 5గురుని కూడా శాసన సభ తెలంగాణా సభ్యులు ఎన్నుకోవాలి. తెలంగాణా ప్రాంతం మంత్రులందురు ప్రాంతీయ మండలి సభ్యులుగా ఉండాలి. ముఖ్యమంత్రిగాని, ఉపముఖ్యమంత్రిగాని ఎవరు తెలంగాణా వారు అయితే వారు ప్రాంతీయ మండలి అధ్యక్షులుగా ఉంటారు. ఇతర కేబినెట్ మంత్రుల్ని కూడా ప్రాంతీయ మండలి సమావేశానికి ఆహ్వానించవచ్చు.
11. ప్రాంతీయ మండలి చట్టబద్ధమైన సంస్థగా ఉంటుంది. ప్రణాళికా రచన, అభివృద్ధి వ్యవహారాలు, నీటిపారుదల ఇతర వ్యవసాయ పథకాలు, పారిశ్రామిక అభివృద్ధి తెలంగాణా ఉద్యోగాలు ప్రాంతీయ మండలి పరిశీలించి నిర్ణయాలు తీసుకొంటుంది. రాష్ట్రప్రభుత్వానికి, మండలికి మధ్య అభిప్రాయభేదం వచ్చిన పరిస్థితులలో అంతిమ నిర్ణయం కోసం భారత ప్రభుతానికి నివేదించాలి.

ఈ ఏర్పాటు మధ్యలో మరో ఒప్పందం లేని పక్షంలో 10 సంవత్సరాల తరువాత సమీక్ష చేయడం జరుగుతుంది.

12. మంత్రివర్గంలో ఆంధ్ర ప్రాంతం నుంచి 60% తెలంగాణా ప్రాంతం నుంచి 40% ఉండాలి. తెలంగాణా భాగంలో ఒక ముస్లిం కూడా ఉండాలి.

13. ముఖ్యమంత్రి ఆంధ్ర ప్రాంతం వాడయితే ఉపముఖ్యమంత్రి తెలంగాణా వ్యక్తి అయిఉండాలి. ముఖ్యమంత్రి తెలంగాణా మనిషి అయితే ఉపముఖ్యమంత్రి ఆంధ్రప్రాంతం వాడిగా ఉండాలి. హోం, ఫైనాన్స్, రెవెన్యూ, ప్లానింగ్, డవలప్‌మెంట్, వాణిజ్య పరిశ్రమల శాఖలలో కనీసం రెండైనా తెలంగాణా వారికివ్వాలి.

14. 1972 సంవత్సరాంతం వరకూ తెలంగాణాకు ప్రత్యేకంగా ప్రదేశ్ కాంగ్రెస్ సంఘం ఉండాలని హైదరాబాదు ప్రదేశ్ కాంగ్రెస్ అధ్యక్షుడు కోరుతున్నాడు. దీనికి ఆంధ్రప్రదేశ్ అధ్యక్షునికి అభ్యంతరం లేదు.

ఈ ఒప్పందంలోని అంశాలను ఆంధ్ర ప్రదేశ్ ప్రభుత్వం సక్రమంగా అమలు చేయడం లేదనే అసంతృప్తితో తెలంగాణా ప్రాంత ప్రజల మానసికోద్వేగానికి సంబంధించిన భావస్ఫోటనగా తెలంగాణా ఉద్యమం మొదలైంది.

## 13.5 తెలంగాణా ఉద్యమ కారకాలు:

తెలంగాణా ఉద్యమ కారకాలుగా 4 సమస్యలను పేర్కొనవచ్చు. ఇవి 1. రాజకీయ సమస్య 2. ఆర్థిక సమస్య 3. పాలనా సమస్య 4. సామాజిక సమస్య.

### 13.5.1 రాజకీయసమస్య :

ఆంధ్రప్రదేశ్ ఏర్పడినప్పటి నుంచి రాష్ట్ర స్థాయి రాజకీయ నాయకత్వంలో తెలంగాణా ప్రాంత రాజకీయ నాయకులకు ఎప్పుడూ సముచితమైన స్థానం ఇవ్వలేదనే ఆరోపణ ఒక రాజకీయ సమస్యగా రూపొందింది. పెద్ద మనుషుల ఒప్పందం ప్రకారం ముఖ్యమంత్రి, ఉపముఖ్యమంత్రి పదవులు ఒకరి తర్వాత ఒకరికి ఆంధ్ర మరియు తెలంగాణా ప్రాంతనాయకులకు ఇవ్వాలి. అయితే ఆంధ్రప్రదేశ్ ఏర్పడినప్పటి నుండి 1971 వరకు తెలంగాణాకు చెందిన ఏ నాయకుడు ముఖ్యమంత్రి కాలేదు. రాష్ట్రముఖ్యమంత్రి పదవి కోస్తే ఆంధ్రకు కాని, రాయలసీమ ప్రాంతానికి కాని ఇవ్వబడింది. మార్చి 1967 - ఆగష్టు 1969 మధ్య తప్పించి తెలంగాణా మంత్రులు ఎప్పుడూ కేబినెట్‌లో రెండవ స్థాయిలోనే ఉన్నారు. ముఖ్యమంత్రి కాదగిన కె.వి. రంగారెడ్డి మొదటి నుంచీ రెండవ స్థానంలో ఉండిపోయి, ఆంధ్రప్రాంతానికి చెందిన సంజీవయ్య ముఖ్యమంత్రి అయినప్పుడు ఉపముఖ్యమంత్రిగా నియమింపబడ్డాడు. సంజీవ రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్న కాలంలో ఉపముఖ్యమంత్రి పదవిని అదనపు పెరుగుదలగా భావించి దాన్ని నిర్లక్ష్యం చేశారని తెలంగాణా ప్రాంత నాయకులు భావించారు. 1969 లో తెలంగాణా ఉద్యమ కాలంలో ఉపముఖ్యమంత్రి పదవిని పునరుద్ధరించారు.

మంత్రి వర్గశాఖల కేటాయింపుకు సంబంధించి పెద్ద మనుషుల ఒప్పందం ప్రకారం 6 అంశాలను - అంతరంగిక (Home) శాఖ, ఆర్థిక శాఖ, రెవిన్యూశాఖ, వాణిజ్యం పరిశ్రమలు శాఖ, ప్రణాళికలు, అభివృద్ధి శాఖలు - తెలంగాణా నాయకులకు కేటాయించాలని, అయితే 2 అంశాలకు సంబంధించి మాత్రమే ఒప్పందాన్ని గౌరవించడం జరిగిందని నాయకులు అసంతృప్తి చెందారు. రాష్ట్ర మంత్రిమండలి ఏర్పాటుకు సంబంధించి ఎక్కువ తెలంగాణా జిల్లాలకు (ఒక్క హైదరాబాద్ జిల్లాకు తప్పించి) 1964 వరకు ప్రాతినిధ్యం యివ్వలేదనే అసంతృప్తి కూడా ఉండేది. అదే విధంగా, ప్రముఖ స్థానాలైన స్పీకర్ పదవి, విధాన మండలి అధ్యక్ష పదవి, ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్ష పదవి వంటివి ఆంధ్రా ప్రాంతానికి చెందగా, రెండవ స్థాయికి చెందిన ఉపశాసన సభాపతి, వైస్ - చైర్మన్ వంటి పదవులు తెలంగాణా నాయకులకు ఇవ్వబడ్డాయి. ఈ కారణంగా వారు రెండవ తరగతి పౌరులుగా భావించుకొనేవారు. ఈ విధమైన భావాలు కల కాంగ్రెస్ నాయకులు ప్రత్యేక తెలంగాణా ఉద్యమం వల్ల లబ్ది పొందవచ్చని భావించారు. తెలంగాణాలో రాజకీయ నాయకత్వ అభివృద్ధికి దోహదం చేసే అవకాశం కల్పించబడలేదని, సమైక్య ఆంధ్రప్రదేశ్ పాలనలో తెలంగాణా వారికి రాజకీయ అధికారంలో సరైన వాటా ఇవ్వలేదనే సాధారణ భావన తెలంగాణా రాజకీయ నాయకుల్లో పాతుకు పోయింది. ఇటువంటి రాజకీయ శిష్టులు నైరాస్యానికి లోనైన భావనను అభివృద్ధి చేసుకోవడం, వారి ఆంధ్ర వ్యతిరేక ప్రవర్తనకు, ప్రత్యేక తెలంగాణా ఉద్యమానికి ఒక ముఖ్యకారణం అయ్యింది.

**13.5.2 ఆర్థిక సమస్య :**

ఆర్థిక సమస్య ముఖ్యంగా తెలంగాణా మిగులు నిధులకు సంబంధించింది. తెలంగాణా మిగులు నిధులను తెలంగాణా ప్రాంత అభివృద్ధికి సక్రమంగా వినియోగించలేదని తెలంగాణా వారు భావించారు. ఖచ్చితమైన తెలంగాణా మిగులు నిధులకు సంబంధించి ఏకాభిప్రాయంలేదు.

ఆంధ్రప్రదేశ్ అవతరణ తర్వాత రాష్ట్ర ఆర్థిక శాఖ (2 సంవత్సరాల స్వల్పకాలానికి, చెన్నారెడ్డి హయాంలో తప్పించి) ఆంధ్ర నాయకుల అధీనంలో ఉందని అది మిగులు నిధులను ఎప్పుడూ పేర్కొనలేదని తెలంగాణా నాయకులు భావించారు. తెలంగాణా ప్రాంతీయ కమిటీ సూచించే వరకు ఈ మిగులు నిధులు అంశం వెలుగులోకిరాలేదు. ఈ అంశం రాజకీయ సన్నివేశాన్ని అగ్నిపర్వతంలా ప్రభావితం చేసి ఆంధ్ర నాయకత్వంలో ఉన్న నమ్మకాన్ని వమ్ముచేసింది.

అప్పటి భారత కంప్ట్రోలర్ మరియు ఆడిటర్ జనరల్ కుమార్ లలిత్ తెలంగాణా మిగులు నిధులు 34.10 కోట్లు రూపాయలుగా నిర్ధారించారు. తెలంగాణా ప్రాంతీయ కమిటీ వీటి మొత్తం 107.13 కోట్లు అని వాదించింది. కాబట్టి కుమార్ లలిత్ నివేదక తెలంగాణా ఉద్యమనాయకులకు అమోదయోగ్యం కాలేదు. తరువాత అష్టసూత్ర పథకానికి అనుగుణంగా ప్రధాన మంత్రి తెలంగాణా మిగులు నిధులను నిర్ధారించడానికి భార్గవ కమిటీని నియమించారు. భార్గవ కమిటీ ఆ నిల్వ మొత్తాన్ని 2834.31 లక్షల రూపాయలుగా పేర్కొంది. కేంద్రప్రభుత్వం భార్గవ కమిటీ నివేదికను ఆమోదించడమే కాక, 10 సంవత్సరాల కాలం నుండి మిగులు నిధులను తెలంగాణా ప్రాంత అభివృద్ధికి వెచ్చించక పోవడం వల్ల అభివృద్ధి కొంతమేర కుంటు పడిందని అభిప్రాయపడింది. కాబట్టి నాల్గవ ప్రణాళికా కాలంలో తెలంగాణా ప్రాంత అభివృద్ధిని త్వరిత గతిన చేపట్టేందుకు మామూలుగా కేటాయించే నిధులకు తోడు, అదనంగా ఏప్రిల్ 1969 నుండి నాల్గవ ప్రణాళికా అంతం వరకు 45 కోట్ల రూపాయలను తెలంగాణా అభివృద్ధికి ఖర్చుగా కేటాయించమని రాష్ట్ర ప్రభుత్వానికి సలహా ఇచ్చింది.

**13.5.3 పాలానా సమస్య :**

తెలంగాణా ప్రజలను బాధకు గురిచేసిన మరొక సమస్య పబ్లిక్ ఎంప్లాయిమెంట్ చట్టం, 1957 ను ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఉల్లంఘించడం గాను, మరియు తెలంగాణా ప్రాంతంలో ముల్కీలకు కేటాయించిన ఉద్యోగాలను నాన్ - ముల్కీలతో భర్తీ చేయడం గాను పేర్కొనవచ్చు. ప్రభుత్వ ఉద్యోగాల గురించి పార్లమెంట్ 1957లో చేసిన చట్టం ప్రకారం 15 సంవత్సరాల నివాసార్హతను (ముల్కీ) బట్టి తెలంగాణా ప్రాంతీయులకే తెలంగాణాలో తాహసిల్దార్ హోదా వరకూ అన్ని ఉద్యోగాలూ ఇవ్వాలని శాసనం ఉండేది. దీన్ని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఉల్లంఘించిందని, దానికి ముఖ్యకారణం ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం ఏర్పడిన తర్వాత ముఖ్య కార్యదర్శులు, రాష్ట్ర ప్రభుత్వ కార్యాలయ అధిపతులు, ప్రభుత్వ మండలుల, బోర్డుల అధినేతలు అందరూ ఆంధ్రప్రాంతానికి చెందిన వారేనని తెలంగాణా ఉద్యోగులు భావించారు. దీనికి తోడు ఆంధ్రప్రాంత చట్టాలను ప్రభుత్వం తెలంగాణా ప్రాంతంలో ప్రవేశపెట్టిందని, ఉద్యోగులకు సంబంధించి జిల్లా కార్యాలయాల్లో, పాఠశాలల్లో ఆంధ్రప్రాంతంతో సరిసమానంగా నియమనిబంధనలను అమలు చేయడంలో జాప్యం జరిగిందని కూడ వారు భావించారు. ఆంధ్ర తెలంగాణా ప్రాంతాల ఉద్యోగస్తులను ఒక త్రాటిపై తెచ్చేందుకు, వారి హోదా, వేతనస్కేలు, ఉద్యోగధర్మాలు, నిర్దేశించిన విద్యార్హతలకు, సంబంధిత పదవీ బాధ్యతలు మొదలైన వాటిని పరిగణనలోకి తీసుకోవలసి ఉన్నప్పటికి ఏ శాఖలో కూడ వాటిని సమిష్టిగా పరిగణనలోకి తీసుకోలేదు. ఆ మేరకు తెలంగాణా ఉద్యోగులకు నష్టం కల్గిందని భావించారు. తెలంగాణా ఉద్యోగులు ఉద్యమించడం ద్వారా మాత్రమే జరుగుతున్న అన్యాయాలను అరికట్టుకోవచ్చని, తమకు పదోన్నతులకు అవకాశం వస్తుందనే భావించారు. ఎప్పుడూ తెలంగాణా, ఆంధ్రప్రాంత ఉద్యోగుల మధ్య మానసికంగా పొత్తుకుదరలేదు. తెలంగాణా నాన్ గెజిటెడ్ ఉద్యోగులు ఆంధ్రా ఉన్నతోద్యోగుల వలన తమకు అన్యాయం జరుగుతుందన్న తిరస్కార భావన కల్గి ఉండేవారు. ఈ రెండు ప్రాంతాలకు రెండు యూనియన్లు ఉండటం దీనికి నిదర్శనంగా చెప్పవచ్చు.

### 13.5.4 సామాజిక సమన్వ :

1956లో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం హైదరాబాద్ రాజధానిగా ఏర్పాటు చేయబడింది. ఆంధ్రప్రాంతంలోని కార్యలయాలన్నీ హైదరాబాద్‌కు తరలించబడ్డాయి. ఆంధ్రప్రదేశ్ హైకోర్టు కూడ హైదరాబాద్ నుండి పని చేయడం ప్రారంభించింది. తెలంగాణా జిల్లాల నుండి ప్రజలు ఎప్పటి లాగానే రాష్ట్ర రజధాని హైదరాబాద్‌కు తరలిపోయేవారు, కాని అసాధారణంగా జరిగిన పరిణామం ఏమిటంటే ఆంధ్రప్రాంత ప్రజలు కూడ హైదరాబాద్‌కు తరలిపోవడం. ముఖ్యంగా కోస్తా జిల్లాలైన తూర్పు, పశ్చిమ గోదావరి, కృష్ణా, గుంటూరుకు చెందిన ప్రజలు ఎక్కువ సంఖ్యలో తరలి పోవడం. ఇది 1960 దశకంలో మరీ ఎక్కువైంది. వారిలో అనేక వర్గాల ప్రజలున్నారు. ఉదాహరణకు న్యాయవాదులు, వ్యాపారవేత్తలు, వ్యవసాయ ఆదివాసీలు.

పెద్ద మనుషుల ఒప్పందంలో సంతకాలు చేసినవారు ఆంధ్రప్రదేశ్ అవతరణ తర్వాత ఆంధ్ర న్యాయవాదులు తెలంగాణా న్యాయవాదులకు పోటీగా తయారవుతారని ఊహించి, ఆంధ్రప్రదేశ్ హైకోర్టు బెంచిని ఒక దాన్ని గుంటూరులో ఏర్పాటు చేయాలని సూచించారు. కాని చివరికి వచ్చేసరికి మొత్తం హైకోర్టు హైదరాబాద్‌లో ఏర్పాటు చేయాలని ఒప్పుకున్నారు. దాని పర్యవసానంగా ఆంధ్రకు చెందిన అనేక మంది న్యాయవాదులు హైదరాబాద్ సిటీకి తరలి వచ్చి ప్రాక్టీస్ పెట్టుకున్నారు. హైదరాబాద్ న్యాయవాదులు ఇంగ్లీషులో ధారాళంగా వాదించలేక పోవడం కారణంగా ఆంధ్రా న్యాయవాదుల నుంచి వచ్చే పోటీని చాలాతీవ్రంగా పరిగణించేవారు.

అనేక మంది ఆంధ్రా వ్యాపార వేత్తలు హైదరాబాద్ నగరానికి వచ్చి అక్కడ సినీపరిశ్రమలోను, రెస్టారెంట్లు, లాడ్జీలు, పరిశ్రమలు, ఇతర వ్యాపార కార్యకలాపాలలో బాగా పెట్టుబడులు పెట్టారు. కొంత మంది ద్రాక్ష తోటల పెంపకంలో పెట్టుబడి పెట్టి సంపన్నులయ్యారు. కొంత మంది స్థానికులకు కూడ వీరు మార్గ దర్శకులయ్యారు. కొంతమంది ఆంధ్రవాసులు నగరంలోను, చుట్టు పక్కల ప్రాంతాల్లోను ఇళ్ళ స్థలాలు కొన్నారు. చాలా నిర్మాణ కార్యక్రమాలు పెరిగాయి. స్థలాలు ధరలు విపరీతంగా పెరిగాయి. చిక్కడ పల్లి, అశోక్ నగర్ వంటి ప్రాంతాలు 1956 వరకు తక్కువ జనసాంద్రతతో ఉండేవి. అటువంటి ప్రాంతాలు వ్యాపార కేంద్రాలయ్యాయి. ఇక్కడి కొత్త వ్యాపారస్తులు ప్రభుత్వ కార్యాలయాలతో సన్నిహిత సంబంధాలు కల్గి ఉండి వారి పనులను చాలా తేలికగా చేయించుకోగలిగే వారని తెలంగాణా ప్రజలు భావించేవారు. వీరు చేసే ఆరోపణ ఏమిటంటే ఒక్కోక్కసారి ఆంధ్ర అధికారులు తక్కువ మొత్తాలతో టెండర్లు వేసినప్పటికి తెలంగాణా ప్రజలకు కాంట్రాక్టులు ఇచ్చేవారు కాదని. ఇటువంటి ఆరోపణలను నిర్ధారించడం కష్టం అయినప్పటికి, అవి ఇక్కడి ప్రజలలో అపోహలను రేకెత్తించాయి. ఈ ప్రాంతంలో విభిన్న చోట్ల ఆంధ్రాప్రాంత వాసులు ఎంతెంత పెట్టుబడులు పెట్టారనేది ఖచ్చితంగా లేదు. అయినప్పటికి స్థానికులు మాత్రం ఆ పెట్టుబడి 50-100 కోట్లు రూపాయల మధ్య ఉంటుందని చెప్పేవారు. హైదరాబాద్ స్థానిక వ్యాపారులు, చాలామంది తెలుగువారు కాని వ్యాపారులు ఆంధ్రాప్రాంతం నుంచి వచ్చిన ప్రజలతో పోటీని తీవ్రంగా భావించేవారు. (తెలంగాణా ఉద్యమానికి అటువంటి వారు ఆర్థిక సహాయం చేశారనే ఆరోపణ కూడ ఉంది).

మరికొన్ని ఇతర కారణాల వల్ల కూడ హైదరాబాద్ రాజధానీ నగరం పెరిగింది. 3 వంతులలో 2 వంతుల కేంద్ర ప్రభుత్వ పెట్టుబడులు ఆంధ్రప్రదేశ్‌లోని ప్రభుత్వ రంగ సంస్థలలో హైదరాబాద్ దాని పరిసర ప్రాంతాల్లో పెట్టబడ్డాయి. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ కోరిక మేరకు, హైదరాబాద్ కేంద్రంగా కొత్త దక్షిణ - మధ్య రైల్వే జోన్ ఏర్పాటు చెయ్యబడింది. పరిశ్రమల పెరుగుదలతో ఆంధ్రప్రాంతం నుండి వలసలు కూడా పెరిగాయి. స్థానిక లాండ్ లార్డ్స్, వృత్తి ఉద్యోగులు, మరియు తెలంగాణా మధ్య తరగతి వర్గాల ప్రజలు కొత్తగా వచ్చిన వారి పై అసూయ భావాన్ని పెంచుకున్నారు. కోస్తా ఆంధ్రుల సాంస్కృతిక ఔన్నత్యం కూడ తెలంగాణా ప్రాంత ప్రజల్లో ద్వేషభావాన్ని రెచ్చ గొట్టింది.

కోస్తా ఆంధ్రుల సాంస్కృతిక ఔన్నత్యానికి ముఖ్యంగా రెండు కారణలు పేర్కొంటారు. అవి

1. తెలంగాణా ప్రాంతాంలో హైస్కూలు, కాలేజి విద్య ఉర్దూ మీడియంలో ఉండేది. దాని పర్యావసానంగా కోస్తా ఆంధ్ర జిల్లాలోని ప్రజల కంటె ఇంగ్లీషులో వారు ధారాళంగా మాట్లాడ లేకపోయేవారు. ఆంధ్రాజిల్లాల్లోని ప్రజలు ఉన్నత ప్రమాణాలు కల్గినవిగా భావించబడే మద్రాసు, ఆంధ్రా యూనివర్సిటీలలో విద్య నభ్యసించడం ఒక ముఖ్య కారణం.

2. తెలంగాణా ప్రజలతో పోలిస్తే ఆంధ్రాప్రాంతంలో తెలుగు మాట్లాడేవారు ఇతర జాతీయ భాషల్లోని మాటలను తక్కువగా వాడటం. దీనివల్ల వారు మాట్లాడే భాష, దాని మాండలికం సాంస్కృతికంగా ఔన్నత్యం కల్గి ఉండేవిగా భావించేవారు.

తెలంగాణాకు వచ్చే ఆంధ్ర ఆధికారులు సాంస్కృతిక ఔన్నత్య భావం కల్గిఉండి ఈ ప్రాంత సాంస్కృతిక పునరుద్ధరణకు వచ్చిన ఆధికారులుగా భావించు కొనేవారని తెలంగాణా ప్రజల ఆరోపణ.

ఈవిధంగా రాజకీయ, ఆర్థిక, పాలనా సామాజిక సమస్యలు తెలంగాణా ప్రాంత ప్రజల మానసిక స్థితిని ప్రభావం చేసి ఆంధ్రావ్యతిరేక ప్రవర్తనకు, తెలంగాణా ఉద్యమానికి దారితీసింది.

## 13.6 తెలంగాణా ఉద్యమం: - ఆవిర్భావం - వ్యాప్తి :

1956 లో ఆంధ్రప్రదేశ్ అవతరించినప్పటి నుండి తెలంగాణా ప్రాంత ప్రజలకు ఉద్యోగావకాశాలు సన్నగిల్లాయని, ప్రమోషన్లలో అన్యాయాలు జరిగాయని, ఆర్థికంగా దోపిడి జరిగిందని, రాజకీయ ఆధిపత్యం పెరిగిందనే భావనలు తెలంగాణా ప్రజల్లో ఈర్ష్యా, ద్వేషాలకు కారణాలయ్యాయి. ముల్కీ నిబంధనల గడువు 1969 సంవత్సరంలో పొడిగించవలసిన అవసరం, ఉస్మానియా విశ్వవిద్యాలయం విద్యార్థుల ఆందోళన, తెలంగాణా జిల్లాల్లో రగులు కొన్న రక్షణల ఉద్యమం, దానికి ఉద్యోగుల రాజకీయ నాయకుల మద్దతు తెలంగాణా ఉద్యమ ఆవిర్భావానికి, వ్యాప్తికి దోహదం చేశాయి.

### 13.6.1 ఆవిర్భావం :

తెలంగాణా ఉద్యమం 1969 జనవరి మొదటి వారంలో ఖమ్మం జిల్లాలో మొదలైంది. హైదరాబాద్ లో ఉస్మానియా విశ్వవిద్యాలయ సంఘాధ్యక్షుడు జనవరి 14 న తెలంగాణా రక్షణల నినాదం ఇచ్చాడు. దీనితో ప్రధాన కార్యదర్శి నాయకత్వంలో విద్యార్థి వర్గం 'ప్రత్యేక తెలంగాణా' నినాదం ఇస్తూ జనవరి 16న ఊరేగింపు జరిపింది. ఇది పోలీస్ లాఠీచార్జికి దారితీసింది. ఈ దశలో తెలంగాణా ఉద్యమానికి నాయకత్వంలేదు ఆది విద్యార్థుల చేతుల్లో ఉండేది.

### 13.6.2 అఖిలపక్ష ఒప్పందం :

విద్యార్థి వర్గం ఇచ్చిన ప్రత్యేక తెలంగాణా నినాదాన్ని వ్యతిరేకిస్తూ ముఖ్యమంత్రి బ్రహ్మానంద రెడ్డి, స్వామీ రామానందతీర్థ ప్రకటనలు చేశారు. ముఖ్యమంత్రి జనవరి 18, 1969న " అఖిల పక్ష నాయకుల సమావేశం" ఏర్పాటు చేశారు. ఈ సమావేశం రాష్ట్ర విభజనను ఖండిస్తూ, సమైఖ్య ఆంధ్రప్రదేశ్ లో గత 12 సంవత్సరాలుగా తెలంగాణా రక్షణల అమలులో కొన్ని లోపాలున్నాయని భావించి వాటిని సరిదిద్దే ప్రయత్నం చేస్తూ ఒక తీర్మానం చేసింది. దీనినే అఖిల పక్ష ఒప్పందం అంటారు.

అఖిల పక్ష ఒప్పందంలోని ముఖ్య అంశాలు:

1) తెలంగాణా ప్రాంతీయులకు కేటాయించిన ఉద్యోగాలలో నియమింపబడిన ఆంధ్రప్రాంత ఉద్యోగులను వారి ప్రాంతానికి వెంటనే బదిలీ చేయడం

2) ఆంధ్రప్రాంత వాసుల బదిలీలతో తెలంగాణా ప్రాంతాలలో ఏర్పడిన ఖాళీలను అర్హులయిన తెలంగాణా అభ్యర్థుల నియామకంతో భర్తీ చేయడం. ఒక వేళ అర్హులయిన అభ్యర్థులు లేకుంటే, అటువంటి అభ్యర్థులు దొరికే వరకు ఆ ఉద్యోగాలను ఖాళీగా ఉంచడం.

3) తెలంగాణా మిగులు నిధులను తెలంగాణా ప్రాంత అభివృద్ధికి సంపూర్ణంగా వినియోగించడం.

4) తెలంగాణా ప్రాంతంలో విద్యావకాశాలను అభివృద్ధి చేయడం.

అఖిల పక్ష ఒప్పందంలోని అంశాలు మితవాద తెలంగాణా నాయకులను సంతృప్తి పరిచాయి. అవి తెలంగాణా ఉద్యమాన్ని

ప్రజాఉద్యమం కాకుండా కొంత మేరకు నివారించ గలిగాయి. ఈ ఒప్పందానికి అనుగుణంగా తెలంగాణా ప్రాంతవాసులు కాని ఉద్యోగులకు రాష్ట్ర ప్రభుత్వం బదిలీల ఉత్తర్వులను జారీచేసింది. రాష్ట్ర ప్రభుత్వ చర్యలు ఉద్యమకారులకు నమ్మదగినవిగా అన్పించాయి. రెండు రోజుల తర్వాత విద్యార్థులు ఆందోళన విరమించారు. తెలంగాణా ప్రాంతంలో తాత్కాలికంగా శాంతి పరిరక్షింపబడింది.

**13.6.3 ఉద్యమ వ్యాప్తి :**

రాష్ట్ర ప్రభుత్వ బదిలీల పై ఆంధ్రా ప్రాంతానికి తిరిగి వచ్చిన ఉద్యోగుల కష్టాలను గమనించిన ఆంధ్రప్రాంత విద్యార్థులు, ఉద్యోగులు, ఉద్యమించారు. ఇది తెలంగాణాలో అశాంతిని రేకెత్తించింది. ఈ రెండు ప్రాంతాలలో పరిస్థితులు చేజారి, శాంతి భద్రతల పరిరక్షణకు రక్షణ దళాలను దింపవలసిన పరిస్థితి ఏర్పడింది. దీనికి తోడు, ఫిబ్రవరి4, 1969న వెలువడిన హైకోర్టు తీర్పు పబ్లిక్ ఏంప్లాయిమెంట్ (నివాసార్హత) చట్టం, 1957 మూడవ సెక్షన్ - ముల్కీ నిబంధనకు సంబంధించింది - కొట్టి వేయడంతో తెలంగాణా ప్రాంతంలో పరిస్థితి మరీ విషమించింది.

**13.6.4 ముఖ్యమంత్రి హా[illegible] :**

తెలంగాణా ప్ర[illegible] మనోభావాలను సంతృప్తి [illegible]రిచేందుకు ఉద్యమాన్ని శాంతింప చేసేందుకు ముఖ్యమంత్రి తెల[illegible] ప్రాంత అభివృద్ధికి దోహదం [illegible] హామీలను [illegible]. అవి -

1) తెలంగాణా ప్రణాళిక [illegible], అభివృద్ధికి సత్వర చర్యలు తీసుకొనే నిమిత్తం తెలంగాణా మంత్రులతో [illegible] కమిటీ ఏర్పాటు.

2) తెలంగాణా ప్రాంత అభివృద్ధి పథకాల అమలుకు, ఉద్యోగావకాశాలను కల్పించడానికి 2,000 నాన్-గెజిటెడ్ ఉద్యోగాలు ఏర్పాటు.

3) తెలంగాణాలో ఉన్న 9 జిల్లాలకు 9 కోట్ల రూపాయిలు కేటాయించడంతో పాటు, గ్రామీణ విద్యుద్దీకరణకు, నీటి సరఫరాకు, రోడ్లుకు, పాఠశాల భవనాలకు, ఇతర ప్రభుత్వ సేవలకు ప్రణాళికా నిధులతో పాటు ఆదనపు నిధుల [illegible]

4) తెలంగాణా మిగులు నిధులను నిర్ధారించ[illegible] [illegible]టెంట్ జనరల్ నియ[illegible]కం.

**13.6.5 కేంద్ర ప్రభుత్వ వైఖరి :**

కేంద్ర ప్రభుత్వం తెలంగాణా ఉద్యమం పరిస్థి[illegible] [illegible] వైఖరిని గమనిస్తూ ఉంది. ప్రత్యేక తెలంగాణా ఉద్యమాన్ని సమర్ధించలేదు. ప్రధాన మంత్రి ప్రత్యేక్య తెలంగాణా కోర్కెను నిరసిస్తూ, అంతరంగిక శాఖ కార్యదర్శి[illegible] మరియు ఆర్థిక అభివృద్ధి సాధనకు సంబంధించిన మార్గాలను అన్వేషించేందుకు ఆంధ్రప్రదేశ్ పంపుతున్నట్లు ప్రకటించారు. అయినప్పటికి ఉద్యమ పరిస్థితిలో మార్పు లేదు, అది కొనసాగింది.

**13.6.6 సుప్రీంకోర్టు తీర్పు :**

తెలంగాణా ఉద్యమం ఆరంభకాలంలో, తెలంగాణా వారికి కేటాయించిన ఉద్యోగాల్లో ఉన్న ఆంధ్రా ఉద్యోగులను ఆంధ్ర ప్రాంతానికి బదిలీ చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం జనవరి 21, 1969న జారీ చేసిన ఎంప్లాయిమెంట్ ఆర్డర్ చెల్లదని సుప్రీంకోర్టు కొట్టేసింది. ఈ విధంగా సుప్రీంకోర్టు పబ్లిక్ ఎంప్లాయిమెంట్ (నివాసార్హత) చట్టం, 1957పై తీర్పు నివ్వడంతో తెలంగాణా ఉద్యమం హింసాత్మకంగా మారింది.

**13.6.7 తెలంగాణా ప్రజా సమితి :**

తెలంగాణా ఉద్యమ తొలిదశలో ఫిబ్రవరి 1969న హైదరాబాద్‌లో స్థానిక న్యాయవాది మదన్ మోహన్ ఆధ్వర్యంలో "తెలంగాణా ప్రజాసభ" వ్యవస్థీకరింపబడింది. ఇది మార్చి మొదటి వారంలో ప్రత్యేక తెలంగాణా ఉద్యమ సభను నిర్వహించింది. తరువాత ఈ [illegible] తెలంగాణా ప్రజాసమితి కింద మారింది. ఇది ఉస్మానియా విశ్వ విద్యాలయ సంఘం ఏక్షన్ కమిటీ సన్నిహిత సహకారంతో ఉద్యమాన్ని నడిపింది.

ముల్కీ నింబంధనల అమలుకు తెలంగాణా ప్రజా నమితి నిర్వహించిన ఆందోళన తెలంగాణా ప్రజలు, ప్రభుత్వోద్యోగులు, విద్యార్థి సంఘాల మద్దతును సంపాదించింది. అనేక మంది తెలంగాణా శాసన సభ్యులు తెలంగాణా ప్రజా సమితిని సమర్ధించారు. మే 1969లో చెన్నారెడ్డి బాహాటంగా తెలంగాణా ప్రజా సమితిని సమర్ధించి, దాని అధ్యక్షునిగా ఎన్నిక కావడంతో ఇది ఒక బలమైన ప్రాంతీయ రాజకీయ పార్టీగా రూపుదిద్దుకొంది. ఆయన నాయకత్వంలో తెలంగాణా ప్రజా సమితి తెలంగాణాలో వేర్పాటు ఆందోళనను ఉధృతం చేసింది. బంద్‌లు, సత్యాగ్రహాలు, సమ్మెలు, హింసాత్మక చర్యలు వంటివి తీవ్రస్థాయిలో ప్రత్యేక తెలంగాణా ఉద్యమంలో చోటు చేసుకున్నాయి. స్థానిక ప్రాంతీయ సమస్యలపై దృష్టిని నిలిపి రాష్ట్రంలో ఒక ప్రాంతానికి చెందిన రాజకీయ పక్షంగా అవతరించి ఒక సంవత్సర కాలం తన ఉనికిని ప్రజ్వలింప చేసి తెలంగాణ వేర్పాటు ఉద్యమానికి పరిష్కారం కేంద్రప్రభుత్వం సూచించడంతో కాంగ్రెస్‌లో విలీనం అయింది.

**13.6.8 ప్రధాని అష్ట సూత్ర పథకం :**

తెలంగాణా ప్రత్యేక ఉద్యమం కొనసాగుతుండగా ప్రధానమంత్రి అన్ని ప్రతిపక్ష పార్టీలతోను, రాష్ట్రనాయకులతోను, అన్ని వర్గాల ప్రజలతోను చెర్చించిన తర్వాత తెలంగాణా సమస్యకు పరిష్కారంగా అష్టసూత్ర పథకాన్ని ప్రకటించారు.. ఈ పథకంలోని అంశాలు తెలంగాణా మిగులు నిధులు, ప్రణాళిక, అభివృద్ధి ఉద్యోగాలకు సంబంధించినవి. దానికి అనుగుణంగా 2 కమిటీలు నియమించారు. అవి- 1. వాంఛూ కమిటీ, 2. భార్గవ కమిటీ. వీటిలో వాంఛూ కమిటీ తెలంగాణా ప్రజల ఉద్యోగావకాశాల పరిరక్షణకు సంబంధించింది కాగా, భార్గవ కమిటీ తెలంగాణా మిగులు నిధుల నిర్ధారణ, వాటి సద్వినియోగంకు సంబంధించింది. ప్రధాని చర్యలు ఉద్యమ నాయకులను సంతృప్తి పరచలేదు.

**13.6.8 ప్రభుత్వ నిషేధాజ్ఞాలు :**

ప్రత్యేక తెలంగాణా ఉద్యమం ఇంకా తీవ్రంగా వ్యాప్తి చెందింది. రాష్ట్ర ప్రభుత్వం ప్రివెంటివ్ డిటెన్షన్ చట్టాన్ని అమలు చేసి ఉన్నత తెలంగాణా ప్రజా సమితి నాయకులను నిర్బంధించింది. తెలంగాణా ప్రజా సమితి కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొంటూ, ప్రత్యేక్య తెలంగాణా ఉద్యమాన్ని నడపిస్తున్నారని ప్రముఖ కాంగ్రెస్ నాయకులైన మంత్రి చెన్నారెడ్డి, కె.వి.రంగారెడ్డి, అచ్యుత రెడ్డిలను ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ కాంగ్రెస్ ప్రాథమిక సభ్యత్వం నుండి బహిష్కరించింది. వారు బాహాటంగా ప్రత్యేక తెలంగాణాకు మద్దతు నివ్వడంతో ఉద్యమ పరిస్థితి తీవ్రస్థాయికి చేరింది. సాధారణ జీవనం స్తంభించింది. తెలంగాణా నాన్-గెజిటెడ్ ఉద్యోగులు 'నియమం-పని' సూత్రాన్ని పాటించాలని జూన్ 1,1969న నిర్ణయించారు. రాష్ట్ర ప్రభుత్వం అత్యవసర సర్వీసుల్లో కఠినమైన నిషేధాజ్ఞలు విధించింది. జూన్ 10నుండి సమ్మె చేయాలని నిర్ణయించారు. శాంతి భద్రతల పరిస్థితి క్షీణించింది.

**13.6.10 రాజకీయ ప్రతిపాదనలు :**

మొదట ప్రధాన మంత్రి, తరావత కేంద్ర హోంమంత్రి వై.బి. చవాన్ తెలంగాణా సమస్య పరిష్కారానికి మార్గం అన్వేషించేందుకు జూన్ మొదటి వారంలో హైదరాబాద్ వచ్చారు. [illegible] వచ్చినట్లు హోంమంత్రి పేర్కొన్నారు. ఇప్పటికి కేంద్ర ప్రభుత్వం ముందున్న సవాళ్ళు రెండు - 1. తెలంగాణా సమస్య పరిష్కారం 2. రాష్ట్ర నాయకత్వ [illegible]

[illegible] ముందు తెలంగాణా నాయకులు 3 విషయాలను ప్రతిపాదించారు. అవి -

1. [illegible]ంచారెడ్డి మంత్రి వర్గాన్ని బర్తరఫ్ చేయడం.

2. రాష్ట్రంలో రాష్ట్రపతి పాలనను ప్రవేశపెట్టడం.

3. ప్రజల ప్రత్యేక తెలంగాణా కోర్కెను నిర్ధారించడానికి 'రిఫరెండమ్'.

కేంద్ర నాయకుని కలిసిన వారిలో నగర మేయర్, ఉపాధ్యాయ ప్రతినిధి, ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ నాయకులలో ఒకరైన కాకాని వెంకట రత్నం, కొండా లక్ష్మణ్‌బాపూజీ, నిజామాబాద్ ప్రతినిధి వర్గం ఉన్నారు. వీరిలో కాకాని వెంకటరత్నం ప్రత్యేక వాదాన్ని 'మైనారిటీ గ్రూపు' వాదంగా పేర్కొని 133 మంది అఖిల భారత కాంగ్రెస్ కమిటీ సభ్యులకు 40 మంది, 74 మంది తెలంగాణా కాంగ్రెస్ విధాన సభ సభ్యులకు (M.L.As) 21 మంది, 20 మంది రాష్ట్ర విధాన పరిషత్ సభ్యులకు 8 మంది మాత్రమే ప్రత్యేక తెలంగాణాను సమర్థిస్తున్నారని పేర్కొన్నారు. నిజామాబాద్ జిల్లా కాంగ్రెస్ పతినిధి వర్గం ఒకవేళ ప్రత్యేక రాష్ట్రం ఏర్పాటు చేస్తే తమ జిల్లాను మహారాష్ట్రతో కలపమని అభ్యర్థించినట్లు చెప్పారు. అదే విధంగా ఖమ్మం జిల్లా ప్రతినిధి వర్గం ఆంధ్రప్రాంతంతో కలిసి ఉండటానికి సుముఖత తెలియచేసింది. జంట నగరాల ముస్లిం ప్రతినిధి వర్గం హైదరాబాద్ నగరాన్ని కేంద్ర పాలిత ప్రాంతంగా చెయ్యాలని ప్రతిపాదించింది. కొండా లక్ష్మణ్ బాపూజీ ఆంధ్రప్రదేశ్ సమగ్రతను సమర్థించాడు. ఒక వేళ తెలంగాణా ప్రజల రక్షణలను పరిరక్షించడానికి ఏమార్గం లేనట్లయితే తాను ప్రత్యేక తెలంగాణాకు వ్యతిరేకిని కానని పేర్కొన్నాడు. తెలంగాణా ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ ఏర్పాటు చేయవలసిన అవసరాన్ని నొక్కి చెప్పాడు.

కేంద్రనాయకుడు అన్ని వర్గాల విజ్ఞాపనలను విన్న తర్వాత జటిలమైన తెలంగాణా సమస్య జాగ్రత్తగా పరిష్కరింప బడుతుందని హామీ ఇచ్చారు. ఆయన సాధారణ పరిస్థితులను పునరుద్ధరించ వలసిందిగా అన్ని పక్షా[illegible]న్ని విరమించవలసిందిగా నాన్-గెజిటెడ్ ఉద్యోగులకు విజ్ఞప్తి చేశారు.

**13.6.11 ముఖ్యమంత్రి రాజీనామా :**

ఉద్యమకారుల అంతిమ లక్ష్యం తానేనని భావించిన ముఖ్యమంత్రి బ్రహ్మా[illegible] 27.1969న కాంగ్రెస్ పార్లమెంటరీ బోర్డుకు తన రాజీనామా సమర్పించారు. జూలై 6న కాంగ్రెస్ లెజిస్లేచర్ పార్టీ ఏకగ్రీవ తీర్మానాన్ని ఆమోదిస్తూ బ్రహ్మానంద రెడ్డి నాయకత్వంలో సంపూర్ణ విశ్వాసాన్ని ప్రకటించింది. జూలై 19న మంత్రి వర్గ పునర్నిర్మాణం జరిగింది. జె.వి.నర్సింగ రావు ఉపముఖ్య మంత్రిగా నియమింపబడ్డారు. ఈ విధంగా తెలంగాణా నాయకత్వానికి సంబంధించి ఒక సమస్య పరిష్కరింపబడింది.

**13.6.12 శాసనసభా సమావేశాలు :**

తెలంగాణా ఉద్యమం జరుగుతుండగా శాసనసభా సమావేశాలు 1969 ఆగస్టు 14 నుండి సెప్టెంబరు 23 వరకూ జరిగాయి. తెలంగాణా సమస్యను నాలుగురోజుల పాటు శాసనసభ చర్చించింది. ఉభయ సభలలోను ప్రత్యేక తెలంగాణా కావాలని కోరినవారు యునైటెడ్ ఫ్రంట్‌గా ఏర్పడ్డారు. 1969 సెప్టెంబరు 21న తిరిగి కళాశాలలకు హాజరు కావాలని విద్యార్థులు నిర్ణయం తీసుకున్నారు. అప్పటితో ఉద్యమం సన్నగిల్లింది.

## 13.7. తెలంగాణా ఉద్యమం పరిసమాప్తి :

తెలంగాణా ప్రజా సమితిలో అభిప్రాయ భేదాలు వచ్చాయి. ప్రజాసమితి [illegible]ంగ సభలకు పరిమితమైంది. ఉద్యమం పట్ల అందరికీ ఆసక్తి సన్నగిల్లింది. 1970లో తెలంగాణా ప్రజాసమితి [illegible] రూపొందింది. 1971లో లోక్‌సభకు మధ్యంతర ఎన్నికలు వచ్చాయి. అప్పుడు ప్రజా సమితి నాయకుడు చెన్నా రెడ్డిని ఢిల్లీ పిలిపించి ప్రధానమంత్రి శ్రీమతి ఇందిరా గాంధీ చర్చలు జరిపారు. ఆమె కొన్ని ప్రతిపాదనలు చేశారు.

ఆమె చేసిన ప్రతిపాదనలలో ముఖ్యమైనవి

1) తెలంగాణా ప్రజాసమితి ఎన్నికలలో పోటీ చేయరాదు.

2) అష్ట సూత్ర పథకానికి 1977 వరకు వ్యవధినివ్వాలి

3) తెలంగాణాలో ఎన్నికైన శాసనసభ్యులలో మూడింట రెండు వంతుల మంది కోరితే 1977లో ప్రత్యేక రాష్ట్ర ఏర్పాటు.

ఈ ప్రతిపాదనలను చెన్నా రెడ్డి ప్రజాసమితి ముందుంచారు. ప్రజాసమితి వాటిని తిరస్కరించింది. ప్రత్యేక రాష్ట్రం ఏర్పాటును నినాదంగా ఎన్నికలలో పోటీ చేసింది 14 స్థానాలకు అభ్యర్థులను నిలబెట్టి 10 స్థానాలు గెలుచుకుంది. దేశవ్యాప్తంగా శ్రీమతి ఇందిరా గాంధీకి లోక్ సభలో అత్యధిక స్థానాలు వచ్చాయి. అటువంటి పరిస్థితులలో తెలంగాణా ప్రజాసమితి 10 స్థానాలతో లోక్ సభలో కొంత కాలం ప్రత్యేక పార్టీగా వ్యవహరించినప్పటికి, ప్రత్యేక తెలంగాణా రాష్ట్రం కోసం కీలకమైన పాత్ర నిర్వహించ లేకపోయింది. ప్రత్యేక పార్టీగా కొనసాగటమా, కాంగ్రెస్‌లో విలీనం కావటమా అనేది చర్చనీయాంశం అయింది. ప్రధాన మంత్రి ఇందిరా గాంధి ప్రజాసమితి నాయకుడు చెన్నా రెడ్డి చర్చల ఫలితంగా కొన్ని అంశాల పై అవగాహన కొచ్చారు. అవి-

1) తెలంగాణాకు ప్రత్యేక బడ్జెట్

2) ముల్కీ నిబంధనల కొనసాగింపు

3) ప్రాంతీయ సంఘం కొనసాగింపు

4) తెలంగాణాకు ప్రత్యేక కాంగ్రెస్ కమిటీ

5) ముఖ్యమంత్రి, బ్రహ్మానంద రెడ్డి రాజీనామా

6) తెలంగాణా నాయకుడు ముఖ్యమంత్రి

తెలంగాణాకు ప్రత్యేక కాంగ్రెస్ కమిటీని ఏర్పాటు చెయ్యాలన్న ప్రతిపాదన తప్పించి మిగిలినవి ఆచరణలోకి వచ్చాయి.

బ్రహ్మానంద రెడ్డి ముఖ్యమంత్రి పదవి నుండి వైదొలగారు. 1971 సెప్టెంబరు 18న తెలంగాణా ప్రజాసమితి కాంగ్రెస్‌లో విలీనం కావాలని తీర్మానించింది. తెలంగాణా ప్రజాసమితి కాంగ్రెస్‌లో విలీనం అయిన తర్వాత ప్రత్యేక తెలంగాణా సమస్య అడుగున పడిపోయింది.

## 13.8 సారాంశము :

1956లో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం ఏర్పడింది. అప్పటి నుంచి ఆంధ్ర, తెలంగాణా ప్రాంత ప్రజల మనో భావాలలో ఐక్యత భావన రూపుదిద్దు కొంటుందని 1958 సంవత్సరంలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం భావించింది. 10 సంవత్సరాల కాలం తర్వాత "తెలంగాణా రక్షణల" దినోత్సవం తెలంగాణా నాన్-గెజిటెడ్ అధికారుల సంఘం అధ్వర్యంలో నిర్విహింపబడిన సమావేశంలో ప్రముఖ హైదరాబాద్ ట్రేడ్ యూనియన్ నాయకుడు బి.యస్.మహదేవ్ సింగ్ మాట్లాడుతూ " విశాలాంధ్ర అవతరణనాడు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం వాగ్దానాలను మరచినట్లయితే తెలంగాణా ప్రజలు ప్రత్యేక రాష్ట్ర సాధన కోసం ఉద్యమించడం తప్పని సరి" అని ఉద్ఘాటించారు. ఆరు నెలల తర్వాత తెలంగాణా విద్యార్థులు ప్రతేక రాష్ట్ర సాధన కోసం ఉద్యమించారు.

1969 జనవరిలో మొదలయిన తెలంగాణా రక్షణల ఉద్యమం విద్యర్థి నాయకుల నుండి రాజకీయ నాయకుల చేతిలోకి మారి ప్రత్యేక తెలంగాణా ఉద్యమంగా రూపుదిద్దుకొంది. తెలంగాణా ప్రజా సమితి ఆధ్వర్యంలో తెలంగాణా ప్రత్యేక ఉద్యమం వ్యాప్తి చెందింది. అది తెలంగాణా ప్రాంత ప్రజలకు ఆంధ్రప్రాంత ప్రజలపై, ఆంధ్రప్రాంత ప్రజలకు తెలంగాణా ప్రాంత ప్రజలపై ద్వేష భావాన్ని రేకెత్తించింది.

తెలంగాణా ఉద్యమం జనవరి 1969 నుండి సెప్టెంబరు 21 వరకు ముమ్మరంగా సాగింది. ఆ తర్వాత కాలంలో అది రాజకీయ సమస్యగా మాత్రమే కొనసాగింది. 1971 సెప్టెంబర్‌లో ముఖ్యమంత్రి బ్రహ్మానంద రెడ్డి రాజీనామా, అనంతరం తెలంగాణా ప్రజా సమితి కాంగ్రెస్‌లో విలీనం కావడంతో ప్రత్యేక తెలంగాణా సమస్య మరుగున పడిపోయింది.

తెలంగాణా ఉద్యమం కారణంగా ఒక ప్రాంతీయ పార్టీ- తెలంగాణా ప్రజాసమితి - ఏర్పడింది. కేంద్ర ప్రభుత్వం రాష్ట్రపాలనా సమస్యలో జోక్యం చేసుకొని తెలంగాణా ప్రాంత అభివృద్ధికి కొన్ని పథకాలను ప్రకటించింది. ఒక్క స్వతంత్ర పార్టీ తప్పించి అన్ని రాజకీయ పక్షాలు రాష్ట్ర సమైఖ్యతకే నిలిచాయి. అధికార అంచనాలను బట్టి 96 సార్లు కాల్పులు జరిగాయి. 53 మంది చనిపోయారు. కేంద్రప్రభుత్వ ఆస్తులకు 12.04 లక్షలు, రోడ్డు రావాణా సంస్థకు 28.31 లక్షలు, ఇతర శాఖలకు 3.20 లక్షలు, వ్యక్తిగత ఆస్తులకు 18.81 లక్షలు నష్టం వాటిల్లింది. ఈ ఉద్యమం కారణంగా పోలీసు బందో బస్తు నిమిత్తం 1,37,37,900 రూపాయలు ఖర్చు అయింది. ఒక విద్యా సంవత్సరం నష్టం అయింది. ప్రభుత్వం, ప్రజలు అనేక ఇబ్బందులకు లోనయ్యారు.

ప్రత్యేక తెలంగాణా ఉద్యమం ఫలితంగా ఆంధ్రలో వేర్పాటు ధోరణి ప్రబలింది. అది ప్రత్యేక ఆంధ్ర ఉద్యమానికి దోహదం చేసింది. ఈ రెండు ఉద్యమాలు ప్రాంతీయ వాదాన్ని ప్రతిఫలించాయి.

## 13.9 నమూనా ప్రశ్నలు :

1. ఆంధ్ర ప్రదేశ్‌లో ప్రత్యేక తెలంగాణా ఉద్యమం పూర్వాపరాలను వివరించండి.
2. ప్రత్యేక తెలంగాణా ఉద్యమం పై ఒక వ్యాసం వ్రాయుము.
3. తెలంగాణా ఉద్యమం కారకాలను విశ్లేషింపుము.

లఘువ్యాసరూప ప్రశ్నలు

1. ప్రాంతీయ వాదంను వివరింపుము
2. తెలంగాణా ఉద్యమ చారిత్రక నేపధ్యం పేర్కొనుము.
3. "తెలంగాణా ఉద్యమం ఒక ఆర్థిక సమస్య" వివరింపుము.
4. తెలంగాణా ఉద్యమంలో తెలంగాణా ప్రజాసమితి పాత్ర వివరింపుము.

## 13.10 చదవదగిన గ్రంథాలు :


1. G.Ram Reddy & B.A.V. Sharma : Ragionalism in India (A Study of Telangana)
2. K.V.Narayana Rao : Telangana, A Study of the Regional Committees in India
3. K.V.Narayana Rao : The Emergency of Andhra Pradesh
4. కె.ఆర్. ఆచార్య (సం) : ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం - రాజకీయాలు


డా॥ పి.వి.వి. సుబ్రహ్మణ్యం

పాఠం-14

# ఆంధ్ర ఉద్యమం

# (ANDHRA MOVEMENT)

## 14.0 లక్ష్యం :

1956 సంవత్సరంలో ఆంధ్రా, తెలంగాణా ప్రాంతాలు విలీనమై ఆంధ్రప్రదేశ్ ఏర్పడింది. అప్పటి నుండి గమనిస్తే ప్రత్యేక తెలంగాణా ఉద్యమం (1969), ప్రత్యేక ఆంధ్ర ఉద్యమం (1972) ప్రాంతీయవాదంకు ప్రతీకలు. ప్రత్యేక తెలంగాణా ఉద్యమంకు ప్రతి చర్యగా ఆంధ్ర ఉద్యమం ఆవిర్భవించి వ్యాప్తి చెందింది. ఆంధ్ర ఉద్యమం పూర్వపరాలను వివరించడం ఈ పాఠం యొక్క ముఖ్య లక్ష్యం.

## విషయసూచిక :


**14.1** ఆంధ్ర ఉద్యమం -పరిచయం

**14.2** ఆంధ్ర ఉద్యమం - కారకాలు

- **14.2.1** ముల్కీ నిబంధన
- **14.2.2** ముల్కీ నిబంధన - హైకోర్టు తీర్పు
- **14.2.3** ముఖ్యమంత్రి ప్రకటన
- **14.2.4** సుప్రీం కోర్టు తీర్పు

**14.3** ఆంధ్ర ఉద్యమ వ్యాప్తి

- **14.3.1** నిబంధనారహిత ఆంధ్రప్రదేశ్
- **14.3.2** ఆంధ్ర ప్రజాపరిషత్
- **14.3.3** పంచసూత్ర పథకం
- **14.3.4** ఆంధ్ర ఉద్యమంలో విద్యార్థులు, న్యాయవాదులు, ఉద్యోగులు
- **14.3.5** ఆంధ్ర మహాసభ సమావేశం
- **14.3.6** కాంగ్రెస్ సమావేశం
- **14.3.7** కమ్యూనిస్టుల ఊరేగింపు
- **14.3.8** ఆంధ్ర కాంగ్రెస్ కార్యాచరణ సమితి
- **14.3.9** ముఖ్యమంత్రి రాజీనామా
- **14.3.10** ప్రధానమంత్రి ప్రకటన
- **14.3.11** జై ఆంధ్ర పార్టీ

**14.4** ఆంధ్ర ఉద్యమ పరిసమాప్తి

**14.4.1** ఆరు సూత్రాల పథకం

**14.5** సారాంశము

**14.6** నమూనా ప్రశ్నలు

**14.7** చదువదగిన గ్రంథాలు

## 14.1 ఆంధ్ర ఉద్యమం -పరిచయం :

తెలంగాణా ప్రాంతంలో 1969లో జరిగిన తెలంగాణా ఉద్యమం ఫలితంగా ఆంధ్ర ప్రాంతంలో వేర్పాటు ధోరణి ప్రబలింది. 1956 నుండి సమైఖ్య ఆంధ్రప్రదేశ్‌లో తెలంగాణా ప్రాంతంలో ఉద్యోగ నియామకాలకు సంబంధించి ముల్కీ నిబంధనలు ఉండేవి. దీని ఫలితంగా ఆంధ్ర ప్రాంత ప్రజలు తెలంగాణా ప్రాంతంలోని ప్రభుత్వోద్యోగాల్లో చేరేందుకు వీలుపడేది కాదు. తెలంగాణాలో తగిన అర్హతలు గల అభ్యర్ధులు లేకపోవడం వలన, యదార్థం కాని ముల్కీ సర్టిఫికెట్టుల ఆధారంగా అనేక మంది ఆంధ్ర ప్రాంత ప్రజలను వివిధ ఉద్యోగాల్లో పనిచేస్తున్న ఆంధ్ర ప్రాంత ఉద్యోగులను తిరిగి పంపాలనేది తెలంగాణా ఉద్యమం ఒక ఆశయం. కాబట్టి తెలంగాణా ప్రాంతానికి చెందిన 6000 మంది ఉద్యోగాల్లో పనిచేస్తున్న ఆంధ్ర ప్రాంతీయుల్ని తిరిగి పంపనట్లయితే ప్రత్యక్ష చర్యకు పూనుకుంటామని తెలంగాణా నాన్ - గెజిటెడ్ ఉద్యోగులు ప్రభుత్వాన్ని హెచ్చరించారు. 1969 జనవరి 18,19న అప్పటి ముఖ్యమంత్రి కాసు బ్రహ్మానంద రెడ్డి రాష్ట్ర అఖిల పక్ష నాయకుల సమావేశాన్ని ఏర్పాటు చేసారు. ఈ సమావేశంలో ముఖ్యంగా పరిశీలనకు వచ్చిన అంశం తెలంగాణా ప్రాంతంలోని ఆంధ్ర ప్రాంత ఉద్యోగులను వెనక్కి పంపించడం. దానికనుగుణంగా తెలంగాణా ఉద్యమాన్ని అదుపుచేసేందుకు ఆంధ్ర ఉద్యోగులను 1969 ఫిబ్రవరి 28వ తేదీకి తిరిగి పంపివేయడం జరుగుతుందని ప్రభుత్వం ప్రకటించింది. ఈ సమయంలో ఆంధ్ర ప్రజలు తీవ్రమైన మానసిక ఉద్రిక్తతతో ఉన్నారు. అదే సమయంలో నల్గొండలోని ఒక ఆంధ్ర ఉద్యోగిని (డిప్యూటీ సర్వేయర్) తెలంగాణా ఉద్యమకారులు అగ్నికి ఆహుతి చేసారని వదంతి వ్యాపించింది. దీనితో ఆంధ్ర ప్రాంతంలో పోటీ ఉద్యమం ప్రారంభమైంది.

ప్రత్యేక ఆంధ్ర ఉద్యమం 10 నెలల పాటు తీవ్రస్థాయిలో కొనసాగింది. విద్యార్థులు, ఉద్యోగులు, రాజకీయ నాయకులు ఒక్కటై ఉద్యమాన్ని నిర్వహించారు. ముఖ్యమంత్రి పి.వి.నరసింహారావు రాజీనామాతో రాష్ట్రంలో అధ్యక్ష పాలన ఏర్పడింది. కేంద్ర ప్రభుత్వం ఆరు సూత్రాల పథకం ప్రకటించడంతో రాష్ట్రంలో ప్రశాంత పరిస్థితి ఏర్పడింది.

## 14.1 ఆంధ్ర ఉద్యమం - కారకాలు :

ఆంధ్రప్రదేశ్ లో 1964లో సంజీవరెడ్డి ముఖ్యమంత్రి పదవికి రాజీనామా చేసారు. సంజీవరెడ్డి స్థానంలో శ్రీ కాసు బ్రహ్మానందరెడ్డి ముఖ్యమంత్రి అయ్యారు. 1969-1971 లో తెలంగాణా ఉద్యమం కారణంగా బ్రహ్మానందరెడ్డి ముఖ్యమంత్రి పదవి నుండి తప్పుకున్నారు. అప్పుడు బ్రహ్మానందరెడ్డి స్థానంలో తెలంగాణా ప్రాంతానికి చెందిన పి.వి.నరసింహారావు ముఖ్యమంత్రి కాగా, ఆంధ్రప్రాంతానికి చెందిన బి.వి.సుబ్బారెడ్డి ఉపముఖ్యమంత్రి పదవి పొందారు.

పి.వి.నరసింహారావు ముఖ్యమంత్రిగా ఉన్న కాలంలో ప్రత్యేక ఆంధ్ర రాష్ట్రం కావాలని తెలంగాణా ప్రాంతం నుండి విడిపోవాలని ఆంధ్ర ప్రాంత ప్రజలు ఉద్యమించారు. ఈ ఉద్యమానికి ముఖ్య కారణం 'ముల్కీ' నిబంధనలు.

### 14.2.1 ముల్కీ నిబంధన :

ఆసఫ్ జాహిలా పాలనా కాలంలో హైదరాబాదు సంస్థానానికి బయట ఉన్న ముస్లిమ్‌లు, నిజాంను మొఘల్ చక్రవర్తి వారసునిగా భావించి, ప్రస్తుత తెలంగాణా ప్రాంతానికి వలస వచ్చారు. వారిలో అనేక మంది వర్తక, వ్యాపారాల్లో స్థిరపడగా, కొంతమంది ప్రభుత్వ ఉద్యోగాలు సంపాదించుకున్నారు. హైదరాబాదు సంస్థానంలో జాగిర్దారీ వ్యవస్థ అమలులో ఉండటం వలన తగినంత ఆర్థికాభివృద్ధి

జరగలేదు. అందువల్ల హైదరాబాదు సంస్థానం వెలుపల నుంచి వలస వచ్చిన వారిలో, విద్యావంతులకు ఉద్యోగాలు ఎక్కువగా లభించేవి.

మొదటి సాలార్‌జంగ్ ప్రధానమంత్రిగా ఉన్న కాలంలో, ఆయన ప్రభుత్వ వ్యవస్థను పటిష్టం చేయడం కోసం ఇతర ప్రాంతం నుంచి వచ్చిన సమర్ధులైన వారిని ప్రభుత్వోద్యోగులుగా నియమించారు. అందువల్ల వలన వచ్చిన వారి నియామకాలకు వ్యతిరేకంగా స్థానికులు నిజాంకు వినతి పత్రం సమర్పించుకున్నారు. ఈ విధంగా హైదరాబాదులో 'ముల్కీ' అవతరించింది. ముల్క్ అనగా ఉర్దూ భాషలో "దేశం" అని అర్థం, ముల్కీ అనగా దేశీయుడు.

1888లో మొదటిసారిగా ఉద్యోగ నియామకాలకు సంబంధించి 'ముల్కీ' ప్రస్తావన వచ్చింది. దాని ప్రకారం నిజాం సంస్థానంలోని ఉద్యోగాలు అర్హత మేరకు దేశీయులకే (ముల్కీలకే) ఇవ్వాలని, విదేశీయులు ప్రభుత్వ ఉద్యోగాలు పొందాలంటే ప్రధానమంత్రి (వజీర్) ప్రత్యేక అనుమతి అవసరమని ప్రకటించారు. స్థానికులకు ఉద్యోగాలు కరువైనందువల్ల 1919లోనే ముల్కీ ఉద్యమం బలపడింది. నిజాం రాష్ట్రంలో ఉద్యోగం చెయ్యాలంటే, ఇక్కడ 15 సంవత్సరాలు నివసించి ఉండాలనేది ముల్కీ నిబంధన. స్వాతంత్ర్యానంతరం కూడా నైజాం (హైదరాబాదు) రాష్ట్రంలో ఈ నిబంధన అమల్లో ఉంది. అది సరిగ్గా అమలు కావడం లేదని, అందువల్ల దాన్ని సక్రమంగా అమలు చేసి హైదరాబాదు రాష్ట్ర వాసులకే ఉద్యోగాలు ఇవ్వాలని కోరుతూ 1952లో తిరిగి ముల్కీ ఉద్యమం వ్యాపించింది. ఈ ముల్కీ ఉద్యమం ఫజల్ ఆలీ కమిషన్ ముందు ప్రత్యేక తెలంగాణా రూపం దాల్చింది. వెనుకటి హైదరాబాదు రాష్ట్రంలోని మహారాష్ట్రులు, కన్నడిగులు తాము కొత్త రాష్ట్రంలో చేరుతూ రక్షణలు కావాలని కోరలేదు. భాషా ప్రయుక్త రాష్ట్రాలు ఏర్పడ్డాకా మహారాష్ట్రులు, కన్నడిగులు వలసపోతూ ఈ ముల్కీ నిబధనను వదిలివేయగా, తెలంగాణా ప్రాంతం వారు తమ ప్రయోజనాలకు ఉపయోగించుకున్నారు.

ఈ విధంగా 1956లో ఆంధ్రప్రదేశ్ ఏర్పడినప్పుడు తెలంగాణా ప్రాంతంలో ముల్కీ నిబంధనలు ఉండేవి.

### 14.2.2 ముల్కీ నిబంధనలు - హైకోర్టు తీర్పు :

ముల్కీ నిబంధనల ప్రకారం స్థానికంగా 15 సంవత్సరాలు స్థిర నివాసమున్నవారికే పబ్లిక్ ఎంప్లాయిమెంట్ (స్థిర నివాసార్హత) చట్టం 1957 ప్రకారం తెలంగాణా ప్రాంత ఉద్యోగులు ఆంధ్రప్రదేశ్ హైకోర్టులో రిట్ పిటిషన్ వేసారు. 1972 ఫిబ్రవరి 14వ తేదీన ఆంధ్రప్రదేశ్ హైకోర్టు అయిదుగురు న్యాయమూర్తులతో కూడిన ధర్మాసనం 4-1 మెజారిటీతో తీర్పునిచ్చింది. అది ఆంధ్రప్రదేశ్ ఏర్పాటు తర్వాత ముల్కీ నిబంధనలు చెల్లవని తీర్పిచ్చింది.

### 14.2.3 ముఖ్యమంత్రి ప్రకటన :

ముల్కీ నిబంధనలకు సంబంధించిన హైకోర్టు తీర్పు తెలంగాణా ప్రజలకు దిగ్భ్రాంతిని కల్గించింది. తెలంగాణా ప్రజలను సంతృప్తి పరచేందుకు, హైకోర్టు తీర్పుపై సుప్రీమ్ కోర్టులో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం అప్పీలు చేస్తుందని ముఖ్యమంత్రి పి.వి.నరసింహారావు ప్రకటించారు. అంతేగాక, ప్రభుత్వ ఉద్యోగాలను ప్రాంతాల వారిగా సర్దుబాటు చేయగలమని, ఉద్యోగావకాశాల విషయంలో తెలంగాణా ప్రజల న్యాయబద్ధమైన ప్రయోజనాల్ని కాపాడేందుకు తగిన చర్యలు తీసుకుంటామని ముఖ్యమంత్రి ప్రకటించారు. హైకోర్టు తీర్పు తెలంగాణా ప్రజలను కలవరపెట్టకుండా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం సుప్రీమ్ కోర్టుకు అప్పీలు చేసింది.

### 14.2.4 సుప్రీమ్ కోర్టు తీర్పు :

1972 అక్టోబరు 3న సుప్రీమ్‌కోర్టు ముల్కీ నిబంధనలకు కాలం చెల్లలేదని, అవి అమల్లో ఉంటాయని తీర్పునిచ్చింది. ఈ తీర్పు ఆంధ్రప్రాంత ప్రజల మనుస్సులో సంక్షోభాన్ని సృష్టించింది. తమ స్వంత రాజధాని హైదరాబాదు నగరంలో తమను రెండవ తరగతి పౌరులుగా పరిగణిస్తున్నారని ఆంధ్రప్రాంత ప్రజలు భావించారు. మానసికోద్వేగంతో తెలంగాణా ప్రాంతం నుండి విడిపోయి ప్రత్యేక ఆంధ్ర రాష్ట్రం ఏర్పాటు చేసుకోవాలని ఉద్యమం ప్రారంభించారు.

## 14.3 ఆంధ్ర ఉద్యమ వ్యాప్తి :

తెలంగాణా ఉద్యమానికి ప్రతి చర్యగా ఆంధ్ర ఉద్యమం ఆవిర్భవించి, వ్యాప్తి చెందింది. పది నెలలపాటు ఈ ఉద్యమానికి విశేష ప్రజాదరణ లభించింది. ఈ ఉద్యమం వ్యాప్తికి దోహదం చేసిన అంశాలు :

### 14.3.1 నిబంధనారహిత ఆంధ్రప్రదేశ్ :

**1972** నవంబరు **12**న గుంటూరులో ఆంధ్రప్రదేశ్ మహాసభ జరిగింది. ఈ సభలో శాసనసభ్యులు సి.వి.కె.రావు, ఎ.శ్రీరాములు, సోషలిస్ట్ డెమొక్రటిక్ ఫ్రంట్ నాయకుడు యన్. శ్రీనివాసులు రెడ్డి పాల్గొన్నారు. ఈ సభ నిశ్శంకర వెంకటరత్నం అధ్యక్షతన జరిగింది. వీరంతా ఏవిధమైన నిబంధనలు లేని ఆంధ్రప్రదేశ్ కావాలని తీర్మానించారు.

నవంబరు **18,19**వ తేదీలలో జరిగిన మహాసభలలో పాత కాంగ్రెసు, స్వతంత్ర పార్టీ, సోషలిస్టు, జనసంఘ్ నాయకులు, స్వతంత్ర అభ్యర్థులు పాల్గొన్నారు. నవంబరు చివరికి నిబంధనారహిత ఆంధ్రప్రదేశ్ నిర్మాణానికి ప్రభుత్వం అంగీకరించకపోతే ప్రత్యేక రాష్ట్ర సాధనకు కృషి చేస్తామని ఈ సభలు నిర్ణయించాయి.

### 14.3.2 ఆంధ్ర ప్రజా పరిషత్ :

**1972** నవంబరు **12**న ఆంధ్ర బంద్‌కు ముందు గౌతులచ్చన్న [illegible] ఆంధ్ర ప్రజా పరిషత్ ఏర్పడింది. ఆంధ్ర బంద్‌ను ఆంధ్ర ప్రజా పరిషత్ నాయకులు, వెంకటేశ్వర విశ్వ విద్యాలయ నాయకులు బలపరిచారు. బంద్ సంపూర్ణంగా జరిగింది. ఒంగోలు, ఆదోని, తెనాలి పట్టణాలల్లో కాల్పులు జరిగాయి. తెనాలిలో **23** మంది, ఒంగోలులో ముగ్గురు, ఆదోనిలో ఒకరు చనిపోయినట్లు వార్తలొచ్చాయి. ఈ వార్త ఆంధ్ర ప్రజల కోపాన్ని ప్రజ్వలింపచేసింది. నాన్-గెజిటెడ్ ఉద్యోగులు సమ్మె చేసారు. న్యాయవాదులు కోర్టులు బహిష్కరించారు. రాష్ట్ర ప్రభుత్వం ఉన్న సి.ఆర్.పి.కి తోడు సైన్యాన్ని పిలిచింది. ప్రధాని రాష్ట్ర విభజనను సమర్థించలేదు. సమైఖ్య ఆంధ్రప్రదేశ్ కోసం ఒక పంచసూత్ర పథకాన్ని ప్రకటించారు.

### 14.3.3 పంచసూత్ర పథకం:

ముల్కీ నిబంధనల అమలుకు సంబంధించి ఆంధ్ర, తెలంగాణా ప్రాంత ప్రజల్లో నెలకొన్న భావోద్రిక్తతను గమనించిన కేంద్రప్రభుత్వం ఒక రాజీ మార్గాన్ని అనుసరించాలని ప్రయత్నించి పంచసూత్ర పథకాన్ని ప్రకటించింది. అది -

1) తెలంగాణా ప్రాంతంలోని నాన్ - గెజిటెడ్ ఉద్యోగాలకు, నాల్గవ శ్రేణి ఉద్యోగాలకు, తహసిల్దారు, సివిల్ అసిస్టెంటు సర్జన్, జూనియర్ ఇంజనీర్లకు ముల్కీ నిబంధనలోని నివాసార్హత వర్తిస్తుంది. సచివాలయంలో, శాఖాధిపతుల కార్యాలయాల్లో, ప్రతి మూడు ఖాళీలల్లో రెండవ దానికి ముల్కీనిబంధన వర్తిస్తుంది.

2) పై నిబంధనలు జంటనగరాలలో **1977** వరకు, తెలంగాణా ప్రాంతంలో **1980** వరకు అమలు జరుగుతాయి.

3) మొదటి లేదా రెండవ గెజిటెడ్ గ్రేడ్ వరకు ప్రమోషన్‌కు సంబంధించిన సర్వీసులను ప్రాం[illegible]కరణ చేస్తారు.

4) తెలంగాణా ప్రాంతం వారికి సాంకేతిక [illegible] వచ్చే సదుపాయాలలో నివాసార్హత [illegible]

5) జంట [illegible]లో [illegible] చేస్తారు.

[illegible] డిసెంబరు 2[illegible]న పార్లమెంటు ముల్కీ బిల్లును ఆమోదించింది. తక్షణమే ముల్కీ నిబంధనలను రద్దు చేయాలని కోరుతున్న ఆంధ్ర ప్రజలకు పైచర్య దిగ్భ్రాంతిని [illegible]. [illegible] ప్రత్యేక రాష్ట్రం ఏర్పాటయితేనే తమ ప్రతిష్ఠ, గౌరవం [illegible] ప్రజలు భావించారు. ప్రత్యేక ఆం[illegible] కోసం ఉద్యమాన్ని తీవ్రతరం చేసారు.

**14.3.4 ఆంధ్ర ఉద్యమంలో ... న్యాయవాదులు, ఉ...**

ఆంధ్ర, వెంకటేశ్వర ... 1972 నవంబరు 23న ... తరువాత విజయవాడలో ... సమావేశమయ్యారు. 1972 డిసెంబరు 5వ తేదీకి ప్రత్యేక ఆంధ్ర రాష్ట్ర ప్రకటన జరగకపోతే ... జరపాలని తీర్మానించారు.

న్యాయవాదాలు 1972 నవంబరు 30న రాజమండ్రిలో సమావేశమయ్యారు. వారు ప్రధాని సూచించిన పంచసూత్ర పథకాన్ని నిరసించారు. కోర్టులకు హాజరుకారాదని తీర్మానించారు. డిశంబరు 7న మళ్ళీ న్యాయవాదులు విజయవాడలో సమావేశమయ్యారు. జంటనగరాలను కేంద్రపాలిత ప్రాంతంగా ప్రకటించి, ఆంధ్రా, తెలంగాణా ప్రాంతాలను వేరు చేసి ప్రత్యేక ఆంధ్ర రాష్ట్రాన్ని ఏర్పాటు చేయాలన్నారు.

ప్రభుత్వ నాన్-గెజిటెడ్ ఉద్యోగులు 1972 డిశంబరు ... నుండి సమ్మెకు పిలుపునిచ్చారు. మొత్తం 3 లక్షల మంది సమ్మెలో పాల్గొన్నారు. వారు మూడు నినాదాలు ఇచ్చారు. అవి-

1) తెలంగాణా ప్రాంతీయ సంఘం రద్దు, (2) తెలంగాణా, ఆంధ్రులకు ఉన్న ప్రత్యేక బడ్జెట్ విధానం రద్దు,

(3) ఉద్యోగుల మధ్య తేడా నిర్మూలించడం.

డిశంబరు 12 నుండి జూనియర్ ఇంజనీర్లు కూడా సమ్మెలో పాల్గొన్నారు.

**14.3.5 ఆంధ్ర మహాసభ సమావేశం :**

1972 డిశంబరు 10,11 తేదీల్లో విజయవాడలో ఆంధ్ర మహాసభ జరిగింది. ఈ సభకు న్యాయవాదులు, డాక్టర్లు, రైతులు, ప్రభుత్వ ఉద్యోగులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, యువకులు, అన్ని వర్గాల వారు హాజరయ్యారు. ఈ మహాసభలో తెన్నేటి విశ్వనాథం, గౌతులచ్చన్న, జొన్నలగడ్డ రామలింగయ్య (సోషలిస్టు), త్రిపురనేని శివప్రసాదరావు (డి.యం.కె), యస్. శ్రీనివాసులరెడ్డి, ఎ. శ్రీరాములు, జూపూడి యజ్ఞనారాయణ (జనసంఘ్), ముఖ్య పాత్ర పోషించారు. ప్రతి వక్త "ప్రత్యేకాంధ్ర సాధనే నా లక్ష్యం" అంటూ ప్రమాణాలు చేసారు. ప్రత్యేక ఆంధ్ర రాష్ట్రం కోరుతూ సభ తీర్మానించింది. కేంద్ర ప్రభుత్వానికి చెల్లించవలసిన పన్నులు జనవరి 1, 1973 నుంచి చెల్లించకూడదని, ధాన్యం లెవీ ఇవ్వరాదని, రైళ్ళను, రోడ్డు రవాణా శాఖ బస్సులను ఉదయం 10 గంటల నుంచి 11 గంటల వరకు నిలుపు చెయ్యాలని సభ ఉద్యమకారులను కోరింది.

**14.3.6 కాంగ్రెస్ సమావేశం :**

ఆంధ్ర ప్రాంతానికి చెందిన కాంగ్రెస్ సమావేశం విజయవాడలో 1972 డిశంబరు 17న జరిగింది. ఆ సభకు 64 మంది శాసనసభ్యులు, 170 మంది పంచాయితీ అధ్యక్షులు, 11 మంది జిల్లా పరిషత్ అధ్యక్షులు హాజరయ్యారు. కాకాని వెంకట రత్నం వీరిని ఆంధ్ర ఉద్యమానికి నడిపారు. ప్రత్యేకాంధ్ర రాష్ట్రానికి అనుకూలంగా ఈ కాంగ్రెస్ నాయకుల సమావేశం తీర్మానించింది. 9 మంది ఆంధ్ర ప్రాంత మంత్రులు తమ రాజీనామా పత్రాలను కాంగ్రెసు అధ్యక్షునికి పంపారు.

**14.3.7 కమ్యూనిస్టుల ఊరేగింపు :**

1972 డిశంబరు 24న కమ్యూనిస్టులు విజయవాడలో సమైఖ్యతకై ఊరేగింపు జరిపారు. ఊరేగింపులో ముఖ్యమంత్రి పి.వి.నరసింహారావు, మండలి కృష్ణారావు తదితరులు పాల్గొంటారని తెలిసి ఉద్యమకారులు వారిని అక్కడకు చేరనివ్వలేదు. కమ్యూనిస్టులు జరుపుతున్న ఊరేగింపును ఆటంకపరచిన ప్రజలపై కాల్పులు జరిగాయి. ఆంధ్ర ఉద్యమానికి నాయకత్వం వహిస్తున్న కాకాని వెంకటరత్నం అదే రాత్రి గుండెపోటుతో మరణించారు.

**14.3.8 ఆంధ్ర కాంగ్రెస్ కార్యాచరణ సమితి :**

ఆంధ్ర కాంగ్రెస్ వేర్పాటు నాయకులు 1972 డిశెంబరు 31న తిరుపతిలో సమావేశమయ్యారు. ఈ సమావేశానికి 132 మంది ఆంధ్ర కాంగ్రెస్ శాసనసభ్యులు, 11 మంది పార్లమెంటు సభ్యులు, జిల్లా పరిషత్ అధ్యక్షులు హాజరయ్యారు. డిప్యూటీ ముఖ్యమంత్రి పదవికి రాజీనామా చేసిన బి.వి. సుబ్బారెడ్డి ఈ సమావేశానికి అధ్యక్షత వహించారు. ప్రభుత్వానికి పన్నులు కట్టవద్దని, నిషేధాజ్ఞల్ని ఉల్లంఘిస్తూ రాష్ట్ర ప్రభుత్వ పరిపాలనను స్తంభింపచేయాలని ఈ సమావేశం ప్రజలకు పిలుపునిచ్చింది. ఈ సమావేశపు నిర్ణయాలను అమలు చేసేందుకు సుబ్బారెడ్డి అధ్యక్షతన ఆంధ్ర కాంగ్రెస్ కార్యాచరణ సమితి ఏర్పాటు చెయ్యబడింది. ఈ కార్యాచరణ కమిటీలో రాజీనామా చేసిన మంత్రుల్లో 6గురిని సభ్యులుగా నియమించారు.

**14.3.9 ముఖ్యమంత్రి రాజీనామా :**

1973 జనవరి 11న రాష్ట్ర కాంగ్రెస్ వర్గాన్ని రద్దు చేసి, ఉన్నతాధికార సంఘాన్ని నియమించారు. ముఖ్యమంత్రి పి.వి. నరసింహారావు జనవరి 17న రాజీనామా చేసారు. కాంగ్రెస్ ఉన్నతాధికార సంఘం అధ్యక్ష పాలనను రాష్ట్రంలో ప్రవేశపెట్టాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరింది. జనవరి 18న రాష్ట్రంలో అధ్యక్ష పాలన ప్రవేశ పెట్టి హెచ్.సి. సరీన్‌ను రాష్ట్ర ప్రభుత్వ సలహాదారుగా నియమించారు. ఆదేరోజు పోలీసులకు, ఉద్యమకారులకు మధ్య అనేక చోట్ల ఘర్షణలు జరిగాయి. కాల్పులలో అనేక మంది మరణించారు. ఆంధ్ర అంతా ప్రజా జీవనం స్తంభించింది. దాని పర్యవసానంగా కేంద్ర ప్రభుత్వ కార్యాలయాలు మూతపడ్డాయి. జనవరి 19-26 మధ్య అనేక హింసాత్మక సంఘటనలు చోటు చేసుకున్నాయి.

జనసంఘ్ నాయకులు వాజ్‌పేయ్ ఫిబ్రవరి 1న, డి.యం.కె., నాయకుడు జి. విశ్వనాథం 6న విజయవాడ బహిరంగ సభల్లో ప్రసంగించారు. వారిద్దరూ ప్రత్యేక ఆంధ్ర ఉద్యమాన్ని బలపరిచారు.

**14.3.10 ప్రధానమంత్రి ప్రకటన :**

1973 ఫిబ్రవరి 27న ప్రధాన మంత్రి ఇందిరా గాంధీ పార్లమెంటులో ప్రకటన చేస్తూ, ప్రశాంత వాతావరణంలో మాత్రమే ఆంధ్ర సమస్యకు పరిష్కారం వీలవుతుందన్నారు. కేంద్రం అంధ్ర సమస్యను అన్ని కోణాలలో పరిశీలిస్తుందన్నారు. జనసంఘ్ రాష్ట్ర పునర్వ్యవస్థీకరణ సంఘాన్ని ఏర్పాటు చేయాలని సూచించింది. ప్రధాని అ సూచన త్రోసిపుచ్చారు.

**14.3.11 జై ఆంధ్ర పార్టీ :**

1973 మార్చి 4న విజయవాడ న్యాయవాదుల సంఘం, వైద్యుల సంఘం సమావేశంలో జై ఆంధ్ర పార్టీ ఏర్పాటుకు తీర్మానించారు. జై ఆంధ్ర నినాదాన్నిచ్చారు. కానీ, జై ఆంధ్రపార్టీ ఏర్పాటు కాలేదు. నెమ్మదిగా ఉద్యమం వెనుకబడింది.

మార్చి 16న ఉపాధ్యాయులు పాఠశాలలకు హాజరుకావాలని తీర్మానించగా 19న కళాశాలల అధ్యాపకులు సమ్మె విరమించారు. మార్చి 23న ప్రభుత్వ ఉద్యోగుల కార్యాచరణ సమితి సమ్మె విరమించాలని నిర్ణయించింది. 108 రోజుల అనంతరం సమ్మె విరమిస్తున్నట్లు ప్రకటించింది. అసిస్టెంటు సర్జన్లు, జూనియర్ ఇంజనీర్లు మార్చి 14న, నర్సులు మార్చి 31న సమ్మె విరమణకు నిశ్చయించారు. మార్చి 28న న్యాయవాది సంఘాల ప్రతినిధులు సమావేశమై (136 రోజుల అనంతరం) కోర్టుల బహిష్కరణ విరమించ నిశ్చయించారు.

## 14.4 ఆంధ్ర ఉద్యమ పరిసమాప్తి :

ఆంధ్ర ఉద్యమానికి విశేషమైన ప్రజాదరణ లభించింది. కానీ సరైన నాయకత్వం లేకపోవడంతో పురోభివృద్ధి సాధించలేక పోయింది. ఉద్యమకాలంలో ఉద్యోగులు ముల్కీ నిబంధనల పై హైకోర్టులో అనేక పిటిషన్‌లు దాఖలు చేసారు. హైకోర్టు 1973 ఫిబ్రవరి 16న ఒక తీర్పునివ్వడంతో ఉద్యమం మెలిక తిరిగింది. ఉద్యమానికి ప్రజల మద్దతు కూడా తగ్గిపోయింది. ప్రజల్లో వచ్చిన మార్పు గమనించిన కేంద్ర ప్రభుత్వం ఆంధ్ర, తెలంగాణా ప్రాంత నాయకులతో చర్చలు జరిపి " ఆరు సూత్రాల పధాకాన్ని" రూపొందించింది.

**14.4.1 ఆరు సూత్రాల పథకం :**

కేంద్రం ఆంధ్ర, తెలంగాణా ప్రాంతాల మధ్య సయోధ్యకు రూపొందించిన ఆరు సూత్రాల పథకం ఈ విధంగా ఉంది.

1) ముల్కీ నిబంధనల్ని, తెలంగాణా ప్రాంతీయ కమిటీని రద్దు చేయడం.

2) నాన్-గెజిటెడ్ ఉద్యోగాలకు, అసిస్టెంటు సర్జన్ ఉద్యోగాలలో స్థానిక అభ్యర్థులకు ప్రాధాన్యతనివ్వడం.

3) ప్రభుత్వోద్యోగుల సమస్యల్ని పరిష్కరించేందుకు ఒక ఉన్నతాధికార న్యాయ సంఘాన్ని నియమించడం

4) రాష్ట్రస్థాయి ప్రణాళికా బోర్డు వేయడంతోపాటు వివిధ వెనుకబడిన ప్రాంతాలకు ఉప సంఘాల్ని నియమించడం.

5) విద్యా సౌకర్యాల్ని కల్పించేందుకు హైదరాబాద్‌లో ఒక కేంద్రీయ విశ్వవిద్యాలయాన్ని స్థాపించడం.

6) పైన చెప్పిన అయిదు సూత్రాల్ని అమలు చేసేందుకు రాజ్యాంగాన్ని సవరించడం.

ఆంధ్ర కాంగ్రెసు కార్యాచరణ కమిటీ 1973 అక్టోబరు 1న ఆరు సూత్రాల పథకాన్ని ఆమోదించి, ఆంధ్ర ఉద్యమాన్ని విరమించింది. ఈ ఆరు సూత్రాల పథకాన్ని చట్టబద్ధం చేస్తూ 1973 డిశంబరు 18న 33వ రాజ్యాంగ సవరణ బిల్లును కేంద్ర ప్రభుత్వం ఆమోదించింది. ఆరు సూత్రాల పథకాన్ని ఆంగీకరించడంతోపాటు ముల్కీ నిబంధనల్ని, తెలంగాణా ప్రాంతీయ సంఘాన్ని రద్దు చేసారు. 1973 డిశంబరు 10న రాష్ట్రంలో రాష్ట్రపతి పాలనను రద్దు చేసారు. జలగం వెంగళరావు ముఖ్యమంత్రిగా ఆంధ్ర ప్రదేశ్‌లో ప్రజా ప్రభుత్వం ఏర్పాటయి సుస్థిరత చోటు చేసుకుంది.

## 14.5 సారాంశము :

ఆంధ్రప్రదేశ్ అవతరించడానికి దోహదపడిన పెద్ద మనుషుల ఒప్పందాన్ని ఆంధ్ర నాయకులు ఉల్లంఘించారని తెలంగాణా ప్రజలు భావించడం వల్ల తెలంగాణా ఉద్యమం తలెత్తింది. దానికి ప్రతి చర్యగా ఆంధ్ర ఉద్యమం ఆవిర్భవించి, వ్యాప్తి చెందింది. ప్రత్యేక ఆంధ్ర ఉద్యమం పది నెలలపాటు కొనసాగింది. విద్యార్థులు, ఉద్యోగులు, న్యాయవాదులు, రాజకీయ నాయకులు ఈ ఉద్యమాన్ని నడిపారు. ఈ ఉద్యమం కారణంగా ముఖ్యమంత్రి రాజీనామా చేసారు. రాష్ట్రంలో రాష్ట్రపతిపాలన ప్రవేశపెట్టడం జరిగింది. ఈ ఉద్యమం కారణంగా ముల్కీ నిబంధనలు, తెలంగాణా ప్రాంతీయ సంఘం రద్దు చేయబడ్డాయి. క్రొత్త ప్రాంతీయ రాజకీయపార్టీ ఏర్పడబోయి ఆగింది. కేంద్ర ప్రభుత్వం ఆంధ్ర, తెలంగాణా ప్రాంతాల సమైక్యతకు ఆరు సూత్రాల పథకాన్ని రూపొందించింది. ఆ పథకాన్ని ఆంధ్ర కార్యాచరణ సమితి ఆమోదించడంతో పూర్తిగా ఆంధ్ర ఉద్యమం విరమించబడింది.

## 14.6 నమూనా ప్రశ్నలు :

**అ) వ్యాసరూప ప్రశ్నలు :**

1. ఆంధ్ర ఉద్యమ ఆవిర్భావం, వ్యాప్తి పై ఒక వ్యాసము వ్రాయుము.
2. ఆంధ్ర ఉద్యమం ప్రాంతీయ వాదంకు ఒక ప్రతీక -వ్యాఖ్యానించుము.

**ఆ) లఘురూప ప్రశ్నలు :**

1. ఆంధ్ర ఉద్యమ కారకాలు పేర్కొనుము.
2. పంచ సూత్ర పథకాన్ని వివరింపుము.
3. ఆరు సూత్రాల పథకం ప్రాముఖ్యతను వివరింపుము.

## 14.7 చదువదగిన గ్రంథాలు :

1. పి. రఘునాధరావు - ఆధుసిక ఆంధ్రప్రదేశ్ చరిత్ర
2. తెలుగు అకాడమీ (ఇన్నయ్య) - ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం - రాజకీయాలు
3. Prasanna Kumar A.(Etal) - Andhra Pradesh Government and Politics

డా.పి.వి.వి. సుబ్రహ్మణ్యం

పాఠం-15

# పంచాయితీరాజ్ - 1

# ఆంధ్రప్రదేశ్‌లో పంచాయితీరాజ్ సంస్థలు

## 15.0 లక్ష్యం :

ఆధునిక భారతదేశంలో స్థానిక ప్రభుత్వాలు కీలకమైన పాత్ర వహిస్తున్నాయి. ప్రజాస్వామ్య ప్రయోజనాలు ప్రజలందరికి అందుబాటులోకి తెచ్చేందుకు స్థానిక ప్రభుత్వాలు తోడ్పడతాయి. దేశంలోని వివిధ ప్రాంతాలలో గల స్థానిక పరిపాలనా వ్యవహారాలను సమర్ధవంతంగా నిర్వహించేందుకు తోడ్పడే సంస్థలే స్థానిక ప్రభుత్వాలు. స్థానిక ప్రభుత్వాలను ప్రధానంగా రెండుగా విభజించవచ్చు. ఒకటి గ్రామీణ స్థానిక ప్రభుత్వాలు. రెండు పట్టణ స్థానిక ప్రభుత్వాలు. గ్రామీణ స్థానిక ప్రభుత్వాలను పంచాయితీరాజ్ సంస్థలుగా పేర్కొనడం జరిగింది. గ్రామీం స్థానిక ప్రభుత్వాలైన పంచాయితీరాజ్ సంస్థలు గ్రామ, మండల/సమితి జిల్లా స్థాయిలలో ఏర్పడతాయి. వీటిలో ప్రజలు ఎన్నుకొన్న ప్రతినిధులు సభ్యులుగా ఉంటారు. అవి నిర్ణీతకాలం పాటు కొనసాగుతాయి. రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక చట్టాల ద్వారా వాటిని నెలకొల్పుతుంది. వీటికి పరిమిత పాలనా అధికారం ఇవ్వడం జరుగుతుంది. ఇటీవల కాలంలో పంచాయితీరాజ్ సంస్థల పాత్ర పాలనలో చాలా ప్రాధాన్యత కలిగిఉండటం వలన ఆంధ్రప్రదేశ్‌లో పంచాయితీరాజ్ సంస్థల ఆవిర్భావం, లక్ష్యాలు, నిర్మాణం, విధులు, అధికారాలు, వనరులు, రాష్ట్ర ప్రభుత్వ నియంత్రణ విశ్లేషణాత్మకంగా వివరించడమే ఈ పాఠం యొక్క లక్ష్యం.

## విషయసూచిక :


15.1 ఆంధ్రప్రదేశ్‌లో పంచాయితీరాజ్ సంస్థల ఆవిర్భావం

15.2 లక్ష్యాలు

15.3 లక్షణాలు

- 15.3.1 నిర్మాణం
- 15.3.2 ఎన్నికవిధానం
- 15.3.3 పదవీకాలం
- 15.3.4 ఆధికారములు - విధులు
- 15.3.5 అధికార యంత్రాంగం
- 15.3.6 పంచాయితీరాజ్ సంస్థలు - రాష్ట్ర ప్రభుత్వం

15.4 ఆంధ్రప్రదేశ్‌లో పంచాయితీరాజ్ వ్యవస్థ

- 15.4.1 గ్రామసభ
- 15.4.2 గ్రామపంచాయితి
  - 15.4.2.1 గ్రామపంచాయితి విధులు
  - 15.4.2.2 గ్రామపంచాయితీ ఆదాయ మార్గాలు

**15.4.3 మండల ప్రజాపరిషత్**

**15.4.3.1 మండల పరిషత్ అభివృద్ధి అధికారి**

**15.4.3.2 మండల పరిషత్ విధులు**

**15.4.3.3 మండల పరిషత్ ఆదాయ మార్గాలు**

**15.4.4 జిల్లా పరిషత్**

**15.4.4.1 జిల్లా పరిషత్ ఛైర్మన్ అధికారాలు**

**15.4.4.2 జిల్లా పరిషత్ స్థాయీ సంఘాలు**

**15.4.4.3 ముఖ్య కార్యనిర్వహణాధికారి**

**15.4.4.4 జిల్లా పరిషత్ అధికారాలు - విధులు**

**15.4.4.5 జిల్లా పరిషత్ ఆదాయ మార్గాలు**

**15.4.5 పంచాయితీరాజ్ లో కలక్టరు పాత్ర**

**15.4.6 పంచాయితీరాజ్ సంస్థల పై రాష్ట్ర ప్రభుత్వ నియంత్రణ**

**15.5 సారాంశము**

**15.6 నమూనా ప్రశ్నలు**

**15.7 చదువవదగిన గ్రంథాలు**

## 15.1 ఆంధ్రప్రదేశ్‌లో పంచాయితీరాజ్ సంస్థల ఆవిర్భావం :

భారతదేశానికి స్వాతంత్ర్యం వచ్చిన తరువాత గ్రామీణ ప్రాంతాలను సత్వరమే అభివృద్ధి పరిచే ఉద్దేశ్యంతో 1952 నుండి దేశంలో సమాజాభివృద్ధి పథకాలు ప్రారంభించబడినాయి. మొదటిదశలో దేశంలో 55 బ్లాకులలో ఈ పథకాలు ప్రయోగాత్మకంగా ప్రవేశపెట్టబడినాయి. అందులో ఆంధ్ర రాష్ట్రం కూడా ఉన్నది. విద్య, ఆరోగ్యం, ప్రజాసంక్షేమం, వ్యవసాయం వంటి అంశాలు ఈ పథకాలలో చేర్చబడాయి. అభివృద్ధి పథకాలని అమలు పరచడానికి మధ్యస్థ యూనిట్‌గా బ్లాక్‌లు స్థాపించబడ్డాయి. ఆయితే ఎన్నికైన ప్రజాప్రతినిధుల నియంత్రణ లేకపోవడం, ఈ కార్యక్రమాలలో ప్రజలు ఎక్కువ సంఖ్యలో పాల్గొనకపోవడం వల్ల ఈ పథకాలు తగినంత ఫలితాలు ఇవ్వలేకపోయినాయి. కేంద్ర ప్రభుత్వం 1957లో బల్వంతరాయ్ మెహతా అధ్యక్షతన ఒక కమిటీని నియమించింది. ఈ కమిటీ మూడు అంచెల పంచాయితీరాజ్ వ్యవస్థ స్థాపనను సిఫార్సు చేసింది. ఈ కమిటీ ఉద్దేశ్యంలో ఈ కొత్త వ్యవస్థలు అభివృద్ధిని వేగిరపరచడమే కాకుండా అభివృద్ధి ప్రకియలో ప్రజలు పాల్గొనడానికి అవకాశాలు కల్పించాలని భావించింది.

ఆంధ్రప్రదేశ్ లో స్థానిక సంస్థల చరిత్ర సుదీర్ఘమైనది. అవిభక్త మద్రాసు రాష్ట్రంల ఒకప్పుడు అంతర్భాగంగా ఉన్న నేటి ఆంధ్రప్రదేశ్ లోని ఆంధ్ర, రాయలసీమ ప్రాంతాలు, స్థానిక సంస్థలు ఎన్నో దశాబ్దాల క్రిందనే ఏర్పాటు అయినాయి. అవిభక్త హైదరాబాద్ సంస్థానంలో ఒకప్పుడు అంతర్భాగంగా ఉన్న తెలంగాణా ప్రాంతాలలో ఫ్యూడల్ వ్యవస్థ కారణంగా స్థానిక సంస్థలకు గట్టి పునాదులు ఏర్పడలేదు. 1956 సం॥లో ఆంధ్రప్రదేశ్ ఏర్పడిన తరువాతనే స్థానిక సంస్థలు రాష్ట్రమంతటా ప్రజాస్వామిక పద్ధతిలో నెలకొన్నాయి. ఆ విధంగా ఆంధ్రప్రదేశ్ ఏర్పడిన తరువాత రెండు గ్రామ పంచాయితీ చట్టాలు అమలులో ఉండినాయి. ఒకటి హైదరాబాద్ గ్రామ పంచాయితీల చట్టం (1956), రెండవది మద్రాసు గ్రామ పంచాయితీల చట్టం (1950). మొదటిది తెలంగాణా ప్రాంతం లోను, రెండవది ఆంధ్రా, రాయలసీమ ప్రాంతాలలోను అమలు జరపబడ్డాయి. బల్వంత్‌రాయ్ మెహతా కమిటీ ఆధారంగా ఆంధ్రప్రదేశ్‌లో 1956 నవంబరు

1న మూడు అంచెల పంచాయితీరాజ్ వ్యవస్థ ప్రవేశపెట్టబడింది. ఆంధ్రప్రదేశ్‌లో ఏర్పాటు చేయబడిన పంచాయితీరాజ్ వ్యవస్థలో గ్రామపంచాయితీ (క్రిందిస్థాయి) మొదటిస్థాయి, పంచాయితీ సమితి (మధ్యస్థాయి) రెండవస్థాయి, జిల్లా పరిషత్ (పైస్థాయి) మూడవ స్థాయిగా విభజించడం జరిగింది. 1964లో పై రెండు చట్టాలను ఆంధ్రప్రదేశ్ లెజిస్లేచర్ తొలగించి సమగ్రమైన గ్రామపంచాయితీ చట్టాన్ని ప్రవేశపెట్టింది. దీనినే ఆంధ్రప్రదేశ్ గ్రామపంచాయితీల చట్టం అని వ్యవహరించుచున్నారు. ఈ చట్టానికి 1986, 1994లలో కొన్ని ప్రధానమైన మార్పులు చేసిరి.

1986 సం॥లో తెలుగుదేశం పార్టీ అధికారంలోనికి వచ్చిన తరువాత పంచాయితీరాజ్ సంస్థలలో పలు సంస్కరణలు చేపట్టింది. పంచాయితీ సమితిలలో ఉన్న లోపాలు తొలగించడం కోసం పంచాయితీ సమితులలో కొన్ని మార్పులు చేసింది. సమితి పరిధి విస్తృతంగా (పెద్దదిగా) ఉండటం, సమితి కేంద్రస్థానం పౌరులకు దూరంగా ఉండడం వంటి కారణాలతో, పాలనా సౌలభ్యంకోసం 1986 సం॥లో ఆంధ్రప్రదేశ్ మండల ప్రజాపరిషత్, జిల్లా ప్రజాపరిషత్, జిల్లా అభివృద్ధి సమీక్షా మండలి చట్టాన్ని తీసుకొని వచ్చింది. ఈ చట్టం ప్రకారం పంచాయితీ సమితులు స్థానే ప్రతి రెవిన్యూ మండలానికి ఒక మండల ప్రజాపరిషత్‌ను ఏరాపటు చేసింది. జిల్లా ప్రజా పరిషత్ అని పేరు మార్చింది. స్థానిక ప్రభుత్వాలకు సంబంధించి కేంద్రప్రభుత్వం 1992లో 73వ రాజ్యాంగ సవరణను తీసుకొని వచ్చింది. ఈ చట్టాన్ని అనుసరించి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం 1994లో ముఖ్యంగా పంచయితీరాజ్ సంస్థలకు సంబంధించి ఒక నూతన చట్టాన్ని చేసింది.

1994 చట్టం అమలు కాకముందు రాష్ట్రంలో పంచాయితీరాజ్ సంస్థల అభివృద్ధికి బల్వంతరాయ్ మెహతా కమిటీ, ఆశోక్ మెహతా కమిటీ, 73వ రాజ్యాంగ సవరణల చట్టంతోపాటుగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్రస్థాయిలో పంచాయితీరాజ్ సంస్థల అభివృద్ధి కోసం 1963లో ఎం.పి.పాయ్ కమిటీ, 1965లో ఎన్.రామచంద్రారెడ్డి కమిటీ, 1968లో యం.టి.రాజు కమిటీ, 1969లో వెంగళరావు కమిటీ, 1981లో నరసింహం కమిటీ, 1994లో బి.పి.ఆర్. విఠల్ కమిటీలు అనేక సూచనలు చేసాయి.

**15.2 లక్ష్యాలు :**

పంచాయితీరాజ్ సంస్థలను వికేంద్రీకరణ మరియు అభివృద్ధి కార్యక్రమాలను చేపట్టడం కోసం ఏర్పాటు చేసారు. పంచాయితీరాజ్ సంస్థ యొక్క లక్ష్యాలు ఈ క్రింది విధంగా ఉన్నాయి.

1) స్థానిక మానవశక్తి, ఇతర వనరుల సంపూర్ణ వినియోగం.

2) భౌతిక వనరుల సంపత్తిని పంచాయితీరాజ్ పరిపూర్ణంగా ఉపయోగించుకోవడం.

3) వ్యవసాయకోత్పత్తిని పెంపొందించడం.

4) గ్రామీణ పరిశ్రమాభివృద్ధి.

5) సహకార సంఘాల స్థాపన.

6) గ్రామీణ సముదాయంలోని బలహీన వర్గాలకు ఆర్థిక సహాయాన్ని చేకూర్చడం.

7) ఉత్సుకతను, అధికారాన్ని అభివృద్ధి కోసం విస్తరింప చేయడం.

8) ఐచ్ఛిక సంస్థల పాత్ర నిర్వహణను ప్రోత్సహించడం.

9) స్వసముదాయంలో సంసక్తతను, స్వయం సహాయతను పెంపొందించడం.

## 15.3 ఆంధ్రప్రదేశ్‌లో పంచాయితీరాజ్ వ్యవస్థ లక్షణాలు :

ఆంధ్రప్రదేశ్‌లో పంచాయితీరాజ్ సంస్థలను మనం సంపూర్ణంగా అవగాహన చేసుకోవాలంటే ఈ సంస్థల లక్షణాలను సంక్షిప్తంగా పరిశీలిద్దాం.

... కు అనుగుణంగా 1959లో మూడంచెల పంచాయితీరాజ్ వ్యవస్థ ఏర్పాటు అయ్యింది. మూడ ... పంచ... రాజ్ వ్యవస్థ ఆంధ్ర... యితీరాజ్ లక్షణాల్లో ముఖ్యమైనదిగా చెప్పవచ్చు. 1986లో ఆంధ్రప్రదేశ్ మండల ప్రజాప రిషత్, జిల్లా ... పరిషత్, జిల్లా అభివృద్ధి మండలి చట్టం తయారు ... 1987 ... లోనికి వచ్చింది. ఈ చట్టం ద్వారా పంచాయితీ సమితుల స్థానే ప్రతి రెవిన్యూ మండలానికి ఒక మండల ప్రజా పరిషత్ ఏర్పడినది. స్థానిక ప్రభుత్వాలకు సంబంధించి కేంద్ర ప్రభుత్వం 73వ రాజ్యాంగ సవరణ చేసింది. ఈ చట్టాన్ని అనుసరించి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం 1994లో నూతన ఆంధ్రప్రదేశ్ పంచాయితీరాజ్ చట్టాన్ని చేసింది.

**15.3.1 నిర్మాణం :**

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన మూడంచెల పంచాయితీ వ్యవస్థలో దిగువ స్థాయిలో ఉండేది గ్రామ పంచాయితీ. ఆంధ్రప్రదేశ్‌లో 29,000 పైగా గ్రామాలకు కలిపి సుమారు 20,000 గ్రామపంచాయితీలు ఉన్నాయి. మొదటి దశలో గ్రామ పంచాయితీలను ఏర్పాటు చేయు అధికారం పంచాయితీరాజ్ కమీషనర్‌కు ఉండేది. ప్రస్తుతం ఈ అధికారం కలక్టరుకు ఈయబడింది. సాధారణంగా 500 జనాభా కలిగిన ఒక రెవిన్యూ గ్రామం గాని లేదా ఒకటి కన్నా ఎక్కువ రెవిన్యూ గ్రామాలను గాని లేదా ఒక రెవిన్యూ గ్రామంలోని కొంత భాగాన్ని గాని గ్రామ పంచాయితీగా ఏర్పాటు చేయవచ్చు. గ్రామ పంచాయితీ ఏర్పాటు కోసం ప్రతి గ్రామాన్ని 5నుండి 19 వార్డుల వరకు విభజించడం జరుగుతుంది. ఒక్కొక్క వార్డు నుండి ఒక్కొక్క సభ్యుడ్ని ప్రత్యక్ష ఎన్నిక విధానంలో వయోజన ఓటింగ్ విధానం ద్వారా ఎన్నుకోవడం జరుగుతుంది. గ్రామ సర్పంచ్‌ను 18సం॥గల వయోజన ఓటర్లు అందరూ ప్రత్యక్ష ఓటింగ్ విధానంలో ఎన్నుకొంటారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం 1994లో చేసిన చట్టం ద్వారా గ్రామ పంచాయితీ వార్డు సభ్యులు తమలో ఒకరిని ఉపసర్పంచ్‌గా ఎన్నుకొంటారు.

1959లో ఏర్పాటు చేసిన పంచాయితీరాజ్ సంస్థలలో మధ్యస్తస్థాయిలో పంచాయితీ సమితులు ఉండేవి. సమితి పరిధి విస్తృతంగా ఉండడం, పాలనా సౌలభ్యం లేకపోవడం వల్ల తెలుగుదేశం ప్రభుత్వం రాష్ట్రంలోని 330 సమితుల స్థానే 1104 మండల ప్రజాపరిషత్‌లను ఏర్పాటు చేసింది.

మూడంచెల పంచాయితీరాజ్ విధానంలో అత్యున్నతస్థాయిగా జిల్లాను యూనిట్‌గా తీసుకొని జిల్లా పరిషత్‌ను ఏర్పాటు చేసింది. జిల్లా పరిషత్‌కు సంబంధించి 1986 వరకు శాసనసభ్యులు, సమితి అధ్యక్షులు జిల్లా పరిషత్ చైర్మన్‌ను ఎన్నుకొనేవారు. 1986లో తెలుగుదేశం జిల్లా పరిషత్ చైర్మన్‌కు ప్రత్యక్ష ఎన్నికలు నిర్వహించింది. 1994 చట్టం ప్రకారం జిల్లాను అనేక ప్రాదేశిక నియోజక వర్గాలుగా ...

**15.3.2 ఎన్నిక విధానం :**

ప్రస్తుతం ఆంధ్రప్రదేశ్‌లో మూడంచెల పంచాయితీరాజ్ విధానంలో పరోక్ష ఎన్నిక విధానమునకు అధిక ప్రాధాన్యత ఇవ్వడం జరిగింది. గ్రామ పంచాయి... లో సర్పంచ్‌ను ప్రత్యక్ష ఎన్నిక ద్వారా, మండల పరిషత్‌కు మండలాన్ని ప్రాదేశిక నియోజక వర్గాల ద్వారా విభజించి ఒక్కొక్క మండల ప్రాదేశిక నియోజక వర్గం నుంచి ఒక్కొక్క సభ్యుడ్ని ఓటర్లు ఎన్నుకుంటారు. ఎన్నికైన ప్రాదేశిక సభ్యులందరూ కలసి మండల పరిషత్ అధ్యక్షుణ్ని, ఉపాధ్యక్షుడిని ఎన్నుకోవడం జరుగుతుంది. అదేవిధంగా జిల్లాను జిల్లా ప్రాదేశిక నియోజక వర్గాలుగా విభజించి ఒక్కొక్క నియోజక వర్గానికి ఒక్కొక్క సభ్యుడిని ఎన్నుకోవడం జరుగుతుంది. ఈ జిల్లా ప్రాదేశిక నియోజక వర్గ సభ్యులు అందరూ కలసి తమలో ఒకరిని జిల్లా పరిషత్ అధ్యక్షునిగా, మరొకరిని ఉపాధ్యక్షునిగా ఎన్నుకోవడం జరుగుతుంది. మండల పరిషత్, జిల్లా పరిషత్‌లకు 1987 నుంచి పార్టీ ప్రాతిపదికన ఎన్నికలు జరుగుతున్నాయి.

**15.3.3. పదవీకాలం :**

గ్రామ పంచాయితీ సర్పంచ్, మండల పరిషత్ అధ్యక్షుడు, జిల్లా పరిషత్ చైర్మన్ వీరు అందరికీ పదవీకాలం 5 సం॥లు. మండల పరిషత్, జిల్లా పరిషత్ అధ్యక్షులు పరోక్ష విధానం ద్వారా ఎన్నిక అవుతారు. కావున వారిని 2 సంవత్సరములు లోపు వారిపై అవిశ్వాస తీర్మానం పెట్టుటకు వీలులేదు. 2 సం॥ల తరువాత అవిశ్వాసము ద్వారా తొలగించవచ్చు.

**15.3.4 అధికారములు - విధులు :**

మూడు అంచెల పంచాయితీరాజ్ వ్యవస్థలో ఒక్కొక్కస్థాయి ఒక్కొక్క విధమైన కార్యక్రమములు నిర్వహించును. గ్రామ పంచాయితీ గ్రామ స్థాయిలో (దిగువ స్థాయిలో) ఆర్థిక వనరులు స్వల్పం కావున చిన్నచిన్న పనులు నిర్వహించును. ఉదా॥ మంచినీటి సౌకర్యం, రోడ్లు వేయుట, వీధిదీపాలు మొ॥వి నిర్వహించుట.

మధ్యస్థస్థాయిలో ఉన్న మండల పరిషత్‌లు వివిధ అభివృద్ధి కార్యక్రమాలు నిర్వహించును. అవి కార్యనిర్వాహక వ్యవస్థ వ్యవసాయ అభివృద్ధి, సహకారం, కుటీర పరిశ్రమలు, సాంఘిక, స్త్రీ సంక్షేమం మొ॥ అభివృద్ధి కార్యక్రమాలు నిర్వహించును.

జిల్లా పరిషత్, మండల పరిషత్ విధి నిర్వహణను, అభివృద్ధి కార్యక్రమాల పనితీరును పరిశీలించును. అభివృద్ధి కార్యక్రమాల అమలులో వివిధ మండలాల మధ్య సమన్వయం ఏర్పాటు చేయడం, వివిధ అభివృద్ధి పథకాల అమలు పై కేంద్ర రాష్ట్ర ప్రభుత్వములు ఇచ్చు గ్రాంట్లను మండల పరిషత్‌లు, గ్రామ పంచాయితీలకు అందజేసి, వాటికి రాష్ట్ర ప్రభుత్వానికి మధ్య వారధిగా ఉండును.

**15.3.5 అధికార యంత్రాంగం :**

పంచాయితీరాజ్ సంస్థలు సమర్థంగా పనిచేయుటకు మంచి అధికార యంత్రాంగం అవసరం. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం గ్రామ పంచాయితీ స్థాయిలో కార్యనిర్వహణ అధికారిని నియమించింది. తరువాత కాలంలో గ్రామ సచివాలయ కార్యదర్శి వ్యవస్థను ఏర్పాటు చేసింది. కార్యనిర్వహణాధికారి గ్రామపాలనా వ్యవహారాలలో సర్పంచ్‌కి సహాయపడును. మండలస్థాయిలో మండల పరిషత్ అభివృద్ధి అధికారి (M.P.D.O) గుమస్తాలు, ఒక అసిస్టెంటు ఇంజనీరు, వి.డి.ఓ. విలేజ్ డెవలప్‌మెంట్ అధికారి అనేక మంది సాంకేతిక ఇతర ఉద్యోగుల సహాయంతో మండల పరిషత్ అభివృద్ధి కార్యక్రమాలు నిర్వహిస్తారు.

జిల్లా పరిషత్‌కు "ప్రధాన కార్యనిర్వాహణ అధికారి" ముఖ్యఅధికారిగా నియమింపబడతారు. ప్రస్తుతం ముఖ్యకార్యనిర్వహణాధికారిగా పిలుచుచున్నారు. ఇతనికి విధి నిర్వహణలో అనేకమంది [illegible] ఉద్యోగులు సహాయపడతారు.

**15.3.6 పంచాయితీరాజ్ సంస్థలు - రాష్ట్ర ప్రభుత్వం :**

పంచాయితీరాజ్ సంస్థలు రాష్ట్ర ప్రభుత్వంచే ఏర్పాటు చేయబడును. వాటి అధికారం, విధులను రాష్ట్ర ప్రభుత్వం చట్టరీత్యా నిర్ణయించును. ఈ సంస్థల పదవీకాలం, ఎన్నికలు, అవసరం అయిన ఆర్థిక వనరులను గ్రాంట్లు, ఋణాల రూపంలో ఇచ్చును. చట్టబద్ధంగా వ్యవహరించకపోతే ఈ సంస్థల పై చర్య తీసుకొను అధికారం రాష్ట్ర ప్రభుత్వానికి కలదు.

## 15.4 ఆంధ్రప్రదేశ్‌లో పంచాయితీరాజ్ వ్యవస్థ :

బల్వంతరాయ్ మెహతా సిఫార్సు మేరకు మూడంచెల పంచాయితీరాజ్ వ్యవస్థ రాజస్థాన్‌తోపాటు ఆంధ్రప్రదేశ్‌లో ప్రవేశపెట్టబడింది.

| | |
|---|---|
| జిల్లా పరిషత్ | (జిల్లాస్థాయి) |
| మండల పరిషత్ | (బ్లాకుస్థాయి) |
| గ్రామ పంచాయితి | (గ్రామస్థాయి) |

**15.4.1 గ్రామసభ :**

ఆంధ్రప్రదేశ్‌లోని పంచాయితీరాజ్ సంస్థల మౌలికస్వరూపం గూర్చి చర్చిద్దాం. ఆంధ్రప్రదేశ్‌లో ప్రతి గ్రామ పంచాయితీలోను గ్రామసభ ఉంటుంది. గ్రామంలోని వయోజన ఓటర్లు అందరూ గ్రామసభలో సభ్యులుగా ఉంటారు. గ్రామసభ సమావేశాలకు సర్పంచ్ అధ్యక్షత వహిస్తారు. ఇది సం॥కి 2 సార్లు సమావేశమవుతుంది. గ్రామసభ ఏర్పాటు వలన గ్రామ ప్రజలు సమిష్టిగా తమ అవసరాలకు అనుగుణంగా విధానాలను, కార్యక్రమాలను ఏర్పాటుచేసుకుంటారు. ఈ సమావేశంలో సర్పంచ్ గ్రామపంచాయితీ చేపట్టిన కార్యక్రమాలను,

భవిష్యత్తు ప్రణాళికలను గ్రామసభలో చర్చించే అవకాశం ఉంది. అంతేకాకుండా పంచాయితీ ఆర్థిక స్థితిగతులను మెరుగుపరచడానికి మార్గాలు, విధించాల్సిన పన్నులను ప్రతిపాదించడం, పాలనలో సలహాలు ఇచ్చే అధికారం గ్రామసభకు కలదు. అయితే ఆచరణలో గ్రామసభల పనితీరు ఆంధ్రప్రదేశ్‌లో సంతృప్తికరంగా లేదని విమర్శకుల అభిప్రాయం.

**15.4.2 గ్రామపంచాయితి :**

ఆంధ్రప్రదేశ్‌లో సుమారు 20,000 వరకు గ్రామపంచాయితీలు ఉన్నాయి. ప్రతి గ్రామానికి లేదా కొన్ని గ్రామాలకు కలసి ఒక గ్రామ పంచాయితి ఉంటుంది. గ్రామ పంచాయితి ఎన్నికల కోసం గ్రామాన్ని కొన్ని వార్డులుగా విభజించడం జరుగుతుంది. గ్రామ జనాభాను దృష్టిలో ఉంచుకొని గ్రామ పంచాయితి సభ్యుల సంఖ్య 5 వార్డుల నుండి 21 వార్డుల వరకు ఉంటుంది. ప్రతి గ్రామ పంచాయితీకి గ్రామీణ ఓటర్లచే ప్రత్యక్షంగా ఎన్నుకోబడిన సర్పంచ్ ఉంటారు. సర్పంచ్‌తో పాటు పంచాయితీ సభ్యులను ఓటర్లు ఎన్నుకుంటారు. గ్రామ పంచాయితీ సభ్యులు తమలో ఒకరిని ఉపసర్పంచ్‌గా ఎన్నుకుంటారు. గ్రామ పంచాయితీ ఎన్నికలలో కొన్ని వార్డులను స్త్రీలకు, షెడ్యూలు కులాలు, తెగల వారికి రిజర్వు చేయబడతాయి (ప్రత్యేకంగా కేటాయించబడతాయి). గ్రామ పంచాయితీ సభ్యుల పదవీకాలం 5 సం॥లు.

**15.4.2.1 గ్రామపంచాయితీ విధులు :**

గ్రామ పంచాయితీ ఆ గ్రామంలోని రోడ్ల నిర్మాణం, వీధిదీపాల ఏర్పాటు, మంచినీటి సరఫరా, మురుగునీట సౌకర్యం ఏర్పాటు, అంటువ్యాధుల నిర్మూలన, శ్మశానవాటిక ఏర్పాటు మొదలైన కరణీయ విధులతోపాటు గ్రంధాలయాల ఏర్పాటు, నూతన సేద్య పద్ధతుల ప్రచారం, సమాజాభివృద్ధి పథకాల అమలు, ఉద్యానవనాల ఏర్పాటు వంటి ఐచ్ఛిక విధులు కూడా నిర్వహిస్తుంది.

**15.4.2.2 గ్రామ పంచాయితీ ఆదాయ మార్గాలు :**

గ్రామ పంచాయితీకి ప్రధాన ఆదాయ మార్గాలు మండల పరిషత్ ఇచ్చే నిధులు, విరాళాలు ముఖ్యమైనవి. వీటితోపాటు ఇంటిపన్ను సుంకాలు, ఫీజులు, ప్రభుత్వ గ్రాంట్లు, వృత్తిపన్ను, గ్రామ పరిధిలో ఆస్తి మార్పిడి పై విధించే సుంకం (రిజిస్ట్రేషన్ ద్వారా) మొ॥వి ప్రధానమైనవి.

**15.4.3 మండల ప్రజా పరిషత్ :**

ప్రతి మండలానికి ఒక మండల పరిషత్ ఉంటుంది. 1987 కి ముందు పంచాయితీ సమితులు ఉండేవి. తెలుగుదేశం ప్రభుత్వం 330 పంచాయితీ సమితులను రద్దు చేసి 1104 మండలాలను ఏర్పాటు చేసింది. 1986 ఆంధ్రప్రదేశ్ మండల ప్రజా పరిషత్, జిల్లా ప్రజాపరిషత్, జిల్లా అభివృద్ధి సంక్షేమ మండలి చట్టం ద్వారా మండల పరిధిలో గ్రామ పంచాయితీ సర్పంచులు అందరూ పదవిరీత్యా మండల ప్రజాపరిషత్‌లో సభ్యులుగా ఉంటారు. ఆ ప్రాంతానికి చెందిన శాసనసభ్యులు, పార్లమెంటు సభ్యులు కూడా మండల పరిషత్‌లో సభ్యులు కూడా మండల పరిషత్‌లో సభ్యులుగా ఉంటారు. (1989లో మండల ప్రజాపరిషత్ అనే వ్యవస్థలో "ప్రజా" పదాన్ని తొలగించారు)

మైనార్టీలు, స్త్రీలు ఎన్నిక కాకపోయినట్లు అయితే వారిని కోఆప్ట్ చేసుకోవడం జరుగుతుంది. షెడ్యూల్డు కులాలు, తెగల వారికి, మహిళలకు కొన్ని సీట్లు రిజర్వు చేయబడతాయి. 1994 ఆంధ్రప్రదేశ్ పంచాయితీ రాజ్ చట్టం ప్రతి మండలాన్ని కొన్ని ప్రాదేశిక నియోజక వర్గాలుగా విభజించింది. ఓటర్లు మండల ప్రాదేశిక నియోజక వర్గ సభ్యులను ఎన్నుకుంటే (MPTC Member) వారు మండల అధ్యక్షుడిని ఎన్నుకుంటారు. పదవీకాలం 5సం॥లు. మండల పరిషత్ అధ్యక్షుణ్ని పరోక్షంగా ఎన్నుకొంటారు కావున అవిశ్వాస తీర్మానం ద్వారా అతనిని పదవి నుంచి తొలగించవచ్చును. అయితే అధ్యక్షుడుగా ఎన్నికైన మొదటి రెండు సంవత్సరాలు అవిశ్వాస తీర్మానాన్ని ప్రవేశపెట్టుటకు వీలులేదు. మండల పరిషత్ ప్రతి 3 నెలలకు ఒక పర్యాయము సమావేశము జరపవలెను.

**15.4.3.1 మండల పరిషత్ అభివృద్ధి అధికారి :**

మండల పరిషత్ స్థాయిలో ఉన్న ప్రధాన కార్యనిర్వహణాధికారి మండల పరిషత్ అభివృద్ధి అధికారి (MPDO). ఇతనిని రాష్ట్ర ప్రభుత్వం నియమిస్తుంది. ఇతడు మండల పరిషత్ సమావేశాలకు తేదీలను నిర్ణయించి మండల అధ్యక్షునికి అవసరమైన సహాయ, సహకారాలను అందిస్తాడు. వార్షిక బడ్జెట్ తయారు చేస్తాడు. మండల పరిధిలో వివిధ అభివృద్ధి పథకాలను అమలు చేస్తాడు. మండల పరిధిలో పనిచేసే వివిధ అధికారుల మధ్య, కార్యక్రమాల మధ్య సమన్వయాన్ని ఏర్పాటు చేస్తాడు. రాష్ట్ర ప్రభుత్వానికి మండల పరిషత్‌కు సంధానకర్తగా వ్యవహరిస్తాడు.

**15.4.3.2 మండల పరిషత్ విధులు :**

మండల పరిషత్ విస్తృతమైన విధులు నిర్వర్తిస్తుంది. సమాజాభివృద్ధి నిమిత్తం అవసరమైన వివిధ చర్యలు చేపట్టడం. వ్యవసాయ ఉత్పత్తులను అధికంగా ఉత్పత్తి చేయుటకుగాను అవసరమైన చర్యలు చేపట్టడం, విద్య, సాంఘిక సంక్షేమం, సమాజాభివృద్ధి, పశుపోషణ, ఆరోగ్యం వంటి ప్రధానమైన విధులతోపాటు గ్రామ పంచాయితీల వార్షిక బడ్జెట్లను ఆమోదించడం, చిన్నతరహా కుటీర పరిశ్రమలను ప్రోత్సహించడం, పేదరిక, అస్పృశ్యత వంటి సామాజిక అంతరాలను నిర్మూలించడం మొదలైనవి ప్రధానమైన విధులు.

**15.4.3.3 మండల పరిషత్ ఆదాయ మార్గాలు :**

మండల పరిషత్‌కు వచ్చే ఆదాయం దాని నిధికి జమ చేయబడుతుంది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిర్దేశించిన అభివృద్ధి పథకాల అమలు నిమిత్తం అందజేసే నిధులు, గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి ఉద్దేశించి రూపొందించిన పథకాల అమలుకు ప్రభుత్వం సమకూర్చిన నిధులు, భూమిశిస్తులో వాటా, చారిత్రక ప్రాధాన్యత గల కట్టడాల సందర్శనకు వచ్చే యాత్రికుల మరియు వినోదపు పన్నుపై వచ్చే ఆదాయం, రోజ్‌గార్ పథకం ద్వారా వచ్చే ఆదాయం, గ్రామ పంచాయితీలు వార్షికంగా అందజేసే మొత్తం, ప్రజలు ఇచ్చే విరాళాలు మండల పరిషత్‌కు ప్రధాన ఆదాయ మార్గాలు.

**15.4.4 జిల్లా పరిషత్ :**

ప్రతి జిల్లాకు ఒక జిల్లా పరిషత్ ఉంటుంది. ఇది జిల్లా స్థాయిలో గ్రామీణ ప్రాంత ప్రజలకు ప్రాతినిధ్యం వహిస్తుంది. జిల్లా పరిషత్‌ను 1959 చట్టం ప్రకారం సమితి అధ్యక్షులు, శాసన, పార్లమెంట్లు సభ్యులు జిల్లా పరిషత్ అధ్యక్షుణ్ని ఎన్నుకొనేవారు. 1987 చట్టం ప్రకారం జిల్లాలోని గ్రామీణ ఓటర్లు నేరుగా జిల్లా పరిషత్ అధ్యక్షుణ్ని ఎన్నుకున్నారు. 1994 నూతన పంచాయితీరాజ్ చట్టం ప్రకారం జిల్లాను జిల్లా ప్రాదేశిక నియోజక వర్గాలుగా విభజిస్తారు. అంటే ప్రతి మండలాన్ని ఒక జిల్లా ప్రాదేశిక నియోజక వర్గంగా ఏర్పాటు చేస్తారు. ప్రతి జిల్లా ప్రాదేశిక నియోజక వర్గం నుంచి ఓటర్లు ఒక సభ్యుణ్ని జిల్లా పరిషత్‌కు ఎన్నుకుంటారు. వారు తమలో ఒకరిని జిల్లా పరిషత్ చైర్మన్‌గా ఎన్నుకుంటారు. ( ఈ ఎన్నికలు పార్టీ ప్రాతిపదికపై పరోక్షంగా జరుగుతాయి). జిల్లాకు చెందిన రాష్ట్ర శాసనభకు ఎన్నికైన సభ్యులు, పార్లమెంటు సభ్యులు వీరు జిల్లా పరిషత్ సమావేశంలో పాల్గొనవచ్చును. అయితే వారికి ఓటు హక్కు ఉండదు. ఎన్నికైన సభ్యులు అల్పసంఖ్యాక వర్గములకు చెందిన ఇద్దరు వ్యక్తులను కోఆప్ట్ చేసుకుంటారు.

**15.4.4.1 జిల్లా పరిషత్ చైర్మన్ అధికారాలు :**

జిల్లా పరిషత్ ఛైర్మన్ సమావేశానికి అధ్యక్షత వహిస్తారు. జిల్లా పరిషత్ గాని, స్టాండింగ్ కమిటీలు (స్థాయి కమిటీలు) గాని ఆమోదించిన తీర్మానాలను అమలు చేస్తాడు. ప్రభుత్వానికి జిల్లా పరిషత్‌కు మధ్య వారధిగా ఉండును. పరిషత్ పాలనా రికార్డులు అతనికి అందుబాటులో ఉంటాయి. జిల్లా సెలక్షన్ కమిటీ ఎంపిక చేసిన జాబితాల నుంచి జిల్లా కేడరు ఉద్యోగులను నియమించే అధికారం ఛైర్మన్‌కు ఉంది.

**15.4.4.2 జిల్లా పరిషత్ స్థాయీ సంఘాలు :**

జిల్లా పరిషత్ లో 6 స్థాయీ సంఘాలు ఉంటాయి. ప్రతి స్థాయీ సంఘం ఒక విషయాన్ని పర్యవేక్షిస్తుంది. ఈ స్థాయీ సంఘాలు ఈ క్రింది విధంగా ఉన్నాయి.

1. **అభివృద్ధి స్థాయీ సంఘం** - ఈ సంఘం వ్యవసాయం, పశుగణాభివృద్ధి, గ్రామీణ పరిశ్రమలు, గ్రామీణ గృహ నిర్మాణం మొదలైన విషయాలు నిర్వహిస్తుంది.
2. **విద్యా స్థాయీ సంఘం** - ఈ స్థాయీ సంఘం మాధ్యమిక విద్యతో పాటు ప్రజా ఆరోగ్యం, సంక్షోభ నివారణ మొదలైన విషయాలను నిర్వహిస్తుంది.
3. **సాంఘిక సంక్షేమ స్థాయీ సంఘం** - షెడ్యూల్డ్ కులాలు, తెగల, బలహీన వర్గాల సంక్షేమం ఈ స్థాయీ సంఘం ప్రధాన అంశాలు.
4. **స్త్రీ సంక్షేమ స్థాయీ సంఘం** - స్త్రీలు, శిశువుల సంక్షేమానికి సంబంధించిన అన్ని అంశాలను నిర్వహిస్తుంది.
5. **పనుల స్థాయీ సంఘం** - గ్రామీణ ప్రాంతాలలో రవాణా సౌకర్యాల విస్తరణ, త్రాగునీటి సరఫరా, విద్యుచ్ఛక్తి, నీటి పారుదల మొదలైన అంశాలను నిర్వహిస్తుంది.
6. **విత్తస్థాయీ సంఘం** - విత్తం, పన్నుల విధింపు, వసూలుకు సంబంధించిన అంశాలను నిర్వహిస్తుంది.

జిల్లా పరిషత్తు అధ్యక్షుడు ఈ ఆరు స్థాయీ సంఘాల అధ్యక్షుడుగా వ్యవహరిస్తాడు. జిల్లా కలెక్టరు ఈ స్థాయీ సంఘాలలో సభ్యుడు. జిల్లా పరిషత్తు అధ్యక్షుడు పరిషత్తు సమావేశాలకు హాజరు కానప్పుడు వాటికి జిల్లా కలెక్టరు అధ్యక్షత వహిస్తాడు. ఈ సంఘాలలో కొన్ని స్థానాలు బలహీన వర్గాలకు, స్త్రీలకు కేటాయించబడ్డాయి. ఈ స్థాయీ సంఘాల సమావేశాలలో జిల్లాస్థాయి అధికారులు పాల్గొనవచ్చును. జిల్లా పరిషత్తు పాలనలో స్థాయీ సంఘాలకు కీలక పాత్ర ఉంది. ఈ సంఘాలు జిల్లా ప్రజా పరిషత్తు నిర్వహించే అన్ని కార్యక్రమాలపై నిర్ణయాలు చేస్తాయి. అనేక విషయాలలో వాటి నిర్ణయాలు అంతిమమైనవి.

**15.4.4.3 ముఖ్య కార్యనిర్వహణాధికారి (Chief Executive Officer) CEO :**

1994 నూతన పంచాయితీరాజ్ చట్టం ప్రకారం ప్రతిజిల్లాకు ఒక ముఖ్య కార్యనిర్వహణాధికారిని రాష్ట్ర ప్రభుత్వం నియమించును. ఇతని సర్వీసు నియమ నిబంధనలు, జీత భత్యాలు, సెలవు, క్రమశిక్షణకు సంబంధించిన వ్యవహారములు అన్నియు రాష్ట్ర నిబంధనలను అనుసరించి ఉండును. జిల్లా పరిషత్ సమావేశాలకు హాజరు అగును.

**15.4.4.4 జిల్లా పరిషత్ అధికారాలు - విధులు :**

జిల్లాలోని మండల పరిషత్‌ల బడ్జెట్లను పరిశీలించి ఆమోదించుట, పంచాయితీరాజ్ సంస్థల కార్యకలాపాలకు సంబంధించి గణాంకాలు ప్రకటించడం, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలచే జిల్లాకు కేటాయించిన నిధులు జిల్లాలోని మండల పరిషత్‌ల మధ్య విభజన చేయుట. జిల్లాలోని మండలములకు మొత్తం జిల్లా అంతటికి సంబంధించిన ప్రణాళికలు అన్నింటిని పరీక్షించి జిల్లా మొత్తానికి ప్రణాళికలు సిద్ధం చేయుట, మండల పరిషత్ కార్యకలాపములను పర్యవేక్షించుట, పూర్వపు బోర్డు అధికారాల నిర్వహణ, ధర్మాదాయ సంస్థల నిర్వహణ, సెకండరీ విద్య, వృత్తి విద్యలు, పారిశ్రామిక విద్యకు సంబంధించి పాఠశాలలు (స్కూల్సు) ఏర్పాటుకు చర్యలు తీసుకొనుట మొదలైన వాటిని జిల్లాపరిషత్ నిర్వహించే అధికారాలు, విధులుగా పేర్కొనవచ్చును. జిల్లా పరిషత్‌కు 10 లక్షల రూపాయల వరకు పథకాలను ఆమోదించే అధికారం ఇవ్వడం జరిగింది.

**15.4.4.5 జిల్లా పరిషత్ ఆదాయ మార్గాలు :**

జిల్లా పరిషత్‌లు తమ ఆదాయంలో 90 శాతాన్ని రాష్ట్ర ప్రభుత్వం విధించే పన్నులలో తమకు లభించే వాటా నుంచి, ప్రభుత్వం మంజూరు చేసే వివిధ రకాల సహాయక గ్రాంట్ల నుంచి పొందుతాయి. కుటీర, గ్రామీణ, చిన్న తరహా మొదలగు పరిశ్రమల అభివృద్ధి నిమిత్తం అఖిల భారత సంస్థల నుండి గ్రాంట్ల రూపంలో లభించు నిధులు, జిల్లా పరిషత్‌చే నిర్వహించబడు ట్రస్టుల నుండి వచ్చే ఆదాయం, ప్రజల నుండి వచ్చే విరాళాలు, జనాభా లెక్కల ప్రకారం వ్యక్తి ఒక్కింటికి రెండు రూపాయల వంతున ప్రభుత్వం ప్రతి సంవత్సరము జిల్లా పరిషత్‌కు గ్రాంటు రూపంలో ఇస్తుంది.

**15.4.5 పంచాయతీరాజ్‌లో కలక్టరు పాత్ర :**

గ్రామీణాభివృద్ధి కొరకు, గ్రామీణ స్వపరిపాలన కొరకు ఏర్పాటు చేయబడిన పంచాయితీరాజ్ వ్యవస్థతో జిల్లా కలక్టరుకు అవినాభావ సంబంధం ఉన్నది. పంచాయితీరాజ్ సంస్థలు నిర్వహించు వివిధ సమాజాభివృద్ధి, సహకారం, ఆరోగ్యం, విద్య, సంక్షేమం మొ॥ ఎన్నో విషయములలో కలక్టరుకు సంబంధం కలదు.

ఆంధ్రప్రదేశ్‌లో గ్రామ పంచాయితీల చట్టాన్ని అనుసరించి కలక్టరుకు గ్రామపంచాయితీలపై నియంత్రణ, పర్యవేక్షణా అధికారాలు ఉంటాయి. గ్రామ పంచాయితీలు చట్ట వ్యతిరేకంగా, రాజ్యాంగ వ్యతిరేకంగా, ప్రజా భద్రతకు ముప్పు కల్పించే విధంగా తీర్మానాలు ఉన్నట్లయితే వాటిని రద్దు చేసే అధికారం కలక్టరుకు కలదు. మండల, జిల్లా పరిషత్‌ల కార్యకలాపాలను పరిశీలించి పర్యవేక్షించే అధికారం జిల్లా కలక్టరుకు కలదు.

**15.4.6 పంచాయితీరాజ్ సంస్థలపై రాష్ట్ర ప్రభుత్వ నియంత్రణ :**

ఆంధ్రప్రదేశ్‌లో పంచాయితీరాజ్ సంస్థల కార్యకలాపాలు నియంత్రించడంలో రాష్ట్ర ప్రభుత్వానికి విస్తృతమైన అధికారాలు కలవు.

పంచాయితీరాజ్ సంస్థలు తమ విధులను సమర్ధవంతంగా నిర్వహించకపోయినప్పుడు లేదా అధికార దుర్వినియోగానికి పాల్పడినప్పుడు ప్రభుత్వం వాటిని రద్దు చేయవచ్చు. చట్టానికి అనుగుణంగా లేని పంచాయితీరాజ్ సంస్థల తీర్మానాలను రద్దు చేయవచ్చును. రాష్ట్ర ప్రభుత్వం పంచాయితీరాజ్ సంస్థల నుండి వార్షిక నివేదికలను పొందుతుంది. పంచాయితీరాజ్ సంస్థల కార్యకలాపాలను పర్యవేక్షిస్తుంది. అంతేకాకుండా అవసరమయితే తనిఖీ చేస్తుంది. అధికార దుర్వినియోగానికి పాల్పడిన అధికారులను, అనధికారులను విచారణ జరిపి వారి అధికారాలు తగ్గించడం లేదా తొలగించే అధికారం రాష్ట్ర ప్రభుత్వానికి ఉంది. పైన పేర్కొన్న కారణాల వల్ల ఆంధ్రప్రదేశ్‌లో పంచాయితీరాజ్ సంస్థలు పరిమితమైన పాలనా స్వేచ్ఛను, విచక్షణాధికారాలను అనుభవించగలుగుతున్నాయి.

## 15.5 సారాంశము :

ఆంధ్రప్రదేశ్‌లో పంచాయితీరాజ్ వ్యవస్థ దాదాపు 46 సం॥ల నుంచి పనిచేస్తుంది. ఈ సుదీర్ఘకాలంలో పంచాయితీరాజ్ వ్యవస్థలో అనేక మార్పులు వచ్చాయి. ఈ సంస్థలు రాష్ట్రంలో గ్రామీణ ప్రాంతాలలో సామాజిక ఆర్థికాభివృద్ధిని సాధించే రాజకీయ పాలనా సంస్థలుగా రూపొందించబడినప్పటికి, 73వ రాజ్యాంగ సవరణ ద్వారా 29 అంశాలపై అధికారాలు ప్రకటించినప్పటికి, స్వార్థ రాజకీయాలు, పక్షపాతం, సక్రమమైన ఉద్యోగిస్వామ్యం లేకపోవడం వల్ల నిర్వహణలో విఫలమైనప్పటికి మండల వ్యవస్థ ఏర్పాటు తరువాత గ్రామీణ స్థానిక ప్రభుత్వాలలో కొంత ప్రగతి సాధించినట్లుగా చెప్పవచ్చు. వీటికి తగిన అధికారం, పాలనా స్వేచ్ఛ, ఆర్థిక పరిపుష్టి ఇచ్చినట్లు అయితే భారతదేశంలో గ్రామీణాభివృద్ధి జరుగుతుంది అని చెప్పవచ్చు.

## 15.6 నమూనా ప్రశ్నలు :

1) ఆంధ్రప్రదేశ్ పంచాయితీరాజ్ సంస్థల పై ఒక వ్యాసము వ్రాయుము.

2) జిల్లా పరిషత్ నిర్మాణము వివరించుము.

3) మండల పరిషత్

## 15.7 చదువదిగిన గ్రంథాలు :


1) లోకల్ గవర్నమెంట్ ఇన్ ఇండియా - యస్.ఆర్. మహేశ్వరి

2) ఆంధ్రప్రదేశ్ గవర్నమెంట్ అండ్ పాలిటిక్స్ - ఎ. ప్రసన్నకుమార్ & అదర్స్

3) గవర్నమెంట్ అండ్ పాలిటిక్స్ ఇన్ ఆంధ్రప్రదేశ్ - జి. రామిరెడ్డి & అదర్స్

4) 1994 ఆంధ్రప్రదేశ్ పంచాయితీరాజ్ చట్టం


డా.బి.వి.వి. బాలకృష్ణ

పాఠం-16

# ఆంధ్రప్రదేశ్ పంచాయితీరాజ్ వ్యవస్థలో వచ్చిన మార్పులు

## 16.0 లక్ష్యము :

ఆంధ్రప్రదేశ్ లో పంచాయితీ రాజ్ సంస్థల ప్రాధాన్యతను గురించి ఈ భాగం వివరిస్తుంది.

ఈ పాఠం చదివిన అనంతరం ఈ క్రింది విషయాలు మీరు తెలుసుకొనగలరు.

అ) ఆంధ్రప్రదేశ్ పంచాయితీ వ్యవస్థలో వచ్చిన మార్పులు

ఆ) ఆంధ్రప్రదేశ్ లో ప్రస్తుతం ఉన్న గ్రామ సచివాలయ వ్యవస్థ

ఇ) ఆంధ్రప్రదేశ్ పంచాయితీ రాజ్ వ్యవస్థపై మహిళల - రాజకీయ పార్టీల ప్రభావం

## విషయసూచిక :

16.1 పరిచయము

16.2 73వ రాజ్యాంగ సవరణ

16.3 1994 నూతన పంచాయితీ రాజ్ చట్టం

16.4 గ్రామ సచివాలయ వ్యవస్థ

16.5 ఆంధ్రప్రదేశ్ పంచాయితీరాజ్ వ్యవస్థ-మహిళలు

16.6 పంచాయితీరాజ్ సంస్థలు-రాజకీయ పార్టీలు

16.7 ఆంధ్రప్రదేశ్ పంచాయితీరాజ్ ఎదుర్కొనే సమస్యలు

16.8 పంచాయితీరాజ్ సంస్థల అభివృద్ధికి కొన్ని సూచనలు

16.9 సారాంశము

16.10 నమూనా ప్రశ్నలు

16.11 చదువదగిన గ్రంథాలు

## 16.1 పరిచయము :

గ్రామీణ ప్రాంతాలను మెరుగు పరచే ఉద్దేశ్యంతో 1952 నుండి దేశంలో సమాజాభివృద్ధికి పథకాలు ప్రవేశ పెట్టబడ్డాయి. అవి ఆశించిన విధంగా పనిచేయకపోవటం వల్ల 1959లో పంచాయితీరాజ్ వ్యవస్థను ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఏర్పాటు చేసింది. 1959, 1964, 1981, 1986లలో పంచాయితీరాజ్ వ్యవస్థలో అనేక మార్పులు చోటుచేసుకున్నాయి. 1993 భారత ప్రభుత్వం 73వ రాజ్యాంగ సవరణ ద్వారా పంచాయితీరాజ్ సంస్థలు ఆంధ్రప్రదేశ్లో చైతన్యవంతం అయినాయి. 73వ రాజ్యాంగ సవరణద్వారా 1994 ఆంధ్రప్రదేశ్ పంచాయితీరాజ్ చట్టం చేయబడింది. ఆంధ్రప్రదేశ్ పంచాయితీరాజ్ వ్యవస్థలో ఇటీవల వచ్చిన మార్పులను పరిగణించే ముందు 73వ రాజ్యాంగ సవరణను సమీక్షించుదాం.

## 16.2 73వ రాజ్యాంగ సవరణ :

పంచాయితీరాజ్ వ్యవస్థలో తగిన మర్పులు, చేర్పులు చేసేందుకు సంబంధించిన 73వ రాజ్యాంగ సవరణ బిల్లును కేంద్ర పార్లమెంటు అంగీకరించటం జరిగింది. (పార్లమెంటు ఆమోదించిన ఆ బిల్లు యొక్క సారాంశాన్ని సంక్షిప్తంగా తెలుసుకొనుట ఎంతైనా అవసరము). పార్లమెంటు అంగీకారంతో ఆ బిల్లుకు రాజ్యాంగ హోదా లభ్యం కావటమేకాక పంచాయితీరాజ్ సంస్థలు సమర్ధవంతంగాను, స్వతంత్రంగాను పనిచేసే దానికి వీలు ఏర్పడింది. 1992, డిశంబరు 22న లోక్‌సభ ఆమోదం పొందిన తరువాత, ఆ బిల్లును రాజ్యసభ ఆమోదంకోసం మరుసటి దినమే నివేదించటం హర్షించదగిన విషయం.

పై బిల్లులో పొందుపరచబడిన వివరాలు, "సంయుక్త పార్లమెంటరీ సంఘం" (జె.పి.సి) సమర్పించిన నివేదిక ప్రాతిపదికపై జరిగింది. జె.పి.సి. లో 30 మంది సభ్యులను వివిధ పార్టీలకు చెందినవారు మరియు పార్లమెంటు ఉభయ సభలకు చెందినవారుగా చూసి నియమించినారు. కేంద్ర పార్లమెంటులోని ఉభయసభలు 1991 సం॥ డిశంబరులో ప్రవేశపెట్టబడిన పంచాయితీరాజ్ సవరణ బిల్లును తిరస్కరించిన మీదట, సంయుక్త పార్లమెంటరీ సంఘం ఏర్పాటు చేసినారు. భిన్న పార్టీలకు చెందిన ప్రముఖులు, విద్యావేత్తలు, జె.పి.సి. చేసిన అధ్యయనంలో వెల్లడైన వివిధాంశాలను పురస్కరించుకొని పార్లమెంటులో జరిగిన చర్చల ఫలితంగా మరొకసారి పంచాయితీరాజ్ సంస్థల విషయమై ప్రత్యేకించి రాజ్యాంగ సవరణ అవసరమని గుర్తించినందున, 1992 లో 73వ రాజ్యాంగ సవరణ జరిగింది. దీనికి అనుగుణంగా 1994 ఆంధ్రప్రదేశ్ పంచాయితీరాజ్ చట్టం చేయబడింది.

### 73వ రాజ్యాంగ సవరణలోని ప్రధానాంశాలు :

పంచాయితీరాజ్ సంస్థల విషయమై కొన్ని కీలకాంశాలను గుర్తించి, వాటిని ఆశించిన విధంగా మార్పు చేయ తలపెట్టినారు. అవి -

1. రాష్ట్ర స్థాయిలో శాసనసభ ఎలాంటి అధికారాలను కలిగి ఉంటుందో అలాంటి రీతిలో ప్రతి గ్రామంలోని గ్రామ సభ కూడా కలిగివుండే విధంగా చూడాలి. గ్రామసభ సంవత్సరానికి రెండు సార్లు తప్పనిసరిగా సమావేశం అవ్వాలి.
2. ప్రతి రాష్ట్రంలోను ఒకరీతిలో ఉండేలా గ్రామస్థాయిలో పంచాయితీలను, పైభాగాన జిల్లా స్థాయి అయిన జిల్లాపరిషత్ మధ్యే మార్గంలో పంచాయితీ సమితులను ఏర్పాటు చేయాలి. ఇంతకు పూర్వమున్న వైవిధ్యాలను రూపుమాపి ఏకీకృత లేదా ఒకేవిధమైన పాలనా యంత్రాంగాలు అన్ని రాష్ట్రాలలో ఉండేటట్లు చూచుట. అయితే [illegible] లక్షలకు మించని (లోగా) జనాభా కలిగిన రాష్ట్రాలు ఏవైనా గ్రామ పంచాయితీలు, జిల్లా పరిషత్‌లకు మధ్యన కల పంచాయితీ సమితులను ఉంచుకోవచ్చు [illegible] చేయవచ్చు. (దేశం మొత్తానికి అన్ని రాష్ట్రాలలోను ఒకేవిధమైన మూడంచెల పంచాయితీరాజ్ వ్యవస్థను ఏర్పాటు చేయాలి).
3. ప్రత్యక్ష ఎన్నిక సూత్ర ప్రాతిపదికన ఎన్నిక కాబడిన అభ్యర్థులతో పంచాయితీరాజ్ సంస్థ నిర్మాణం జరగాలి. సమితి/మండల అధ్యక్షున్ని, జిల్లా పరిషత్ అధ్యక్షున్ని పరోక్ష ఎన్నిక ద్వారా ఎన్నుకోవాలి. గ్రామ పంచాయితీల అధ్యక్షులను ఏ పద్ధతి ద్వారా ఎన్నుకోవాలన్న విషయంలో రాష్ట్ర ప్రభుత్వాల ఇష్టానికి వదిలివేసినారు. (వీలైనంత వరకు ప్రత్యక్ష పద్ధతిలోనే ఎన్నుకోవాలి).
4. నిర్దేశించిన శాతంలో రిజర్వేషన్ సూత్రాన్ని అనుసరించవలెను. ఈ సవరణ ప్రకారం 1/3 వంతు స్థానాలను మహిళలకు అన్ని స్థాయిలలోనూ రిజర్వు చేస్తారు షెడ్యూల్డు తెగల వారు మరియు వెనుకబడిన తరగతులకు కొన్ని సీట్లను రిజర్వు చేస్తారు. వీటి శాతం ఎంత అనేది రాష్ట్ర ప్రభుత్వాలు నిర్ణయిస్తాయి.
5. పంచాయితీరాజ్ సంస్థల పదవీకాలాన్ని సవరించారు. అన్ని రాష్ట్రాలలోనూ ఒకేవిధంగా 5 సం॥లకొకసారి ఎన్నికలు జరపాలి.

6. రాష్ట్రపతి శాసనసభలో తీర్మానించిన విధంగా పన్నులు ఎంత శాతం వసూలు చేయాలి మరియు వివిధ రకాలైన పన్నుల మొత్తాన్ని ఆచరణలో నిర్ణయించవలసి వుంది.
7. పన్నుల విధానాలను గురించి ప్రస్తావించటం.
8. భారత రాజ్యాంగంలోని ఎనిమిదవ షెడ్యూల్‌లో చెప్పిన దాని ప్రకారం సామాజిక న్యాయాన్ని సాధించవలసిన బాధ్యత పంచాయితీరాజ్ సంస్థలను అప్పగించడమైనది.
9. కీ॥శే॥ రాజీవ్‌గాంధీ చేత నూతనంగా ప్రవేశపెట్టబడిన జవహర్ రోజ్‌గార్ యోజన పథకం ప్రకారం కేంద్ర ప్రభుత్వం నేరుగా పంచాయితీరాజ్ సంస్థలకు నిధులను సమకూర్చుతుంది.
10. గ్రామీణాభివృద్ధి నిమిత్తం అనేక అభివృద్ధి పథకాలను పంచాయితీరాజ్ సంస్థలు చేపట్టి నిర్వహించుట.
11. గ్రామీణ ప్రాంతాల అభివృద్ధి నిమిత్తం 8వ పంచవర్ష ప్రణాళిక కాలంలో 30,000 కోట్ల రూపాయల మొత్తాన్ని కేటాయించుట జరిగింది.
12. 73వ రాజ్యాంగ్ సవరణ యొక్క మౌలిక లక్ష్యం అధికారాన్ని ప్రజలకు బదలాయించటంగా పేర్కొనటం జరిగింది.
13. రాబోయే కాలంలో దేశం సంక్షేమ మార్గంలో పయనింపచేయడానికి ఉన్నత ప్రమాణాలతో కూడిన రాజకీయ నాయకులను తయారు చేయటానికి గాను పంచాయితీరాజ్ సంస్థలు ప్రాథమిక సంస్థలుగా పనిచేయాలని పేర్కొనటం జరిగింది.
14. పంచాయితీరాజ్ సంస్థలను హేతుబద్ధంగాను, అధికారికంగాను, సమర్ధవంతంగా పనిచేసేటట్లు చూచుట.
15. భారత రాజ్యాంగంలోని 40వ నిబంధనలో పేర్కొనిన ఆదేశిక నియమాలను ఆచరణలో అమలు పరచటానికి సంసిద్ధంగా ఉండాలని 73వ రాజ్యాంగ సవరణలో పేర్కొనటం జరిగింది.
16. పంచాయితీరాజ్ వ్యవస్థలో క్రమపద్ధతిలో ఎన్నికల నిర్వహణ జరపటానికి ప్రతి రాష్ట్ర ప్రభుత్వం ఒక పంచాయితీరాజ్ [illegible]కల సంఘాన్ని ఏర్పాటు చేసుకోవాలి. (ప్రతి రాష్ట్రంలోని స్థానిక సంస్థల ఎన్నికలు ఈ ఎన్నికలసంఘం ఆధ్వర్యంలో [illegible]ి).
17. [illegible]ాష్ట్రం పంచాయితీరాజ్ ఆర్థిక విషయాలు పరిశీలించటానికి ఒక ఫైనాన్స్ కమీషన్ ఏర్పాటు చేయాలి.

**రాజ్యాంగంలోని 11వ షెడ్యూలు ప్రకారం గ్రామ పంచాయితీ చేపట్టే కార్యక్రమాలు :**

**(I) సౌకర్యాల అభివృద్ధి కార్యక్రమాలు :**

1. గ్రామీణ గృహ నిర్మాణం.
2. రహదార్లు, వంతెనలు.
3. గ్రామీణ విద్యుదీకరణ.
4. ఆర్థికాభివృద్ధి కార్యక్రమాలు.
5. చేపల పెంపకం.
6. చిన్న తరహా పరిశ్రములు
7. ఖాదీ, గ్రామీణ కుటీర పరిశ్రమలు.
8. ప్రజా పంపిణీ వ్యవస్థ.
9. దారిద్ర్య నిర్మూలన కర్యక్రమాలు.

**(IV) సామాజికా భివృద్ధి కార్యక్రమాలు :**

17. మాతా, శిశు సంక్షేమం.
18. వెనుకబడిన జాతుల అభివృద్ధి.
19. వికలాంగుల సంక్షేమం.
20. సాంస్కృతిక కార్యక్రమాలు.
21. సంతలు-మార్కెట్లు.

**(V) పర్యావరణాభివృద్ధి కార్యక్రమాలు :**

22. సామాజిక అటవీ సంపద.
23. ఇంధనం- పశుగ్రాసం.
24. సాంప్రదాయేతర వనరులు.
25. సామాజికపరమైన ఆస్తుల పరిరక్షణ.

**(II) వ్యవసాయాభివృద్ధి కార్యక్రమాలు :**

10. వ్యవసాయ విస్తరణ.
11. భూమి అభివృద్ధి.
12. చిన్నతరహా నీటిపారుదల.

**(III) విద్యాభివృద్ధి కార్యక్రమాలు :**

13. ప్రాథమిక, ఉన్నత పాఠశాలలు
14. వృత్తి విద్య
15. వయోజన, అనియత విద్య
16. గ్రంథాలయాలు.

**(VI) ఆరోగ్యాభివృద్ధి కార్యక్రమాలు :**

26. మంచినీరు.
27. పారిశుద్ధ్యం
28. కుటుంబ సంక్షేమం.
29. వైద్య సదుపాయం.

## 16.3 1994 నూతన పంచాయితీరాజ్ చట్టం :

73వ రాజ్యాంగ సవరణ స్ఫూర్తితో ఆంధ్రప్రదేశ్ లోని కాంగ్రెస్ ప్రభుత్వం 1994 నూతన చట్టం చేసింది. ఈ లోపుగా తెలుగు దేశం పార్టీ అధికారంలోనికి వచ్చిన తరువాత స్వల్ప మార్పుతో ఈ చట్టం అమలులోనికి తీసుకొనివచ్చింది.

**ఈ చట్టంలోని ప్రధాన అంశాలు :**

ఈ చట్టం ద్వారా మూడు అంచెల పంచాయితీ రాజ్య వ్యవస్థను అనగా గ్రామ స్థాయిలో పంచాయితీలు, మధ్యస్థాయిలో మండల ప్రజా పరిషత్తులు, జిల్లా స్థాయిలో జిల్లా ప్రజా పరిషత్తులు కొనసాగించారు.

**గ్రామసభ :**

గ్రామసభను చైతన్యవంతంచేయాలని ఈ చట్టం ఆశించినది, గ్రామస్థాయిలో గ్రామ సభను ఏర్పాటు చేయటానికి వీలు కల్పించినది. గ్రామంలో నమోదు అయిన ఓటర్లు అందరూ గ్రామ సభలో సభ్యులుగా ఉంటారు. గ్రామ సభ గ్రామపంచాయితీ కార్యక్రమాలను పర్యవేక్షించి వాటిని అమలు జరపటంలో గ్రామపంచాయితీకి సూచనలు ఇస్తుంది. ఇది సం॥కి 2 సార్లు సమావేశం అవుతుంది. సర్పంచ్ దీనికి అధ్యక్షత వహిస్తాడు.

**ప్రాదేశిక నియోజకవర్గాలు :**

ఈ కొత్త చట్టం ద్వారా పంచాయితీ సంస్థలు మూడు స్థాయిలలోను వాటి సభ్యులే ఎన్నిక అయ్యే విధానానికి శ్రీకారం చుట్టింది. గ్రామ స్థాయిలో గ్రామాన్ని వార్డుల క్రింద, మండలస్థాయిలోను, జిల్లా పరిషత్తు స్థాయిలోను ప్రాదేశిక నియోజకవర్గాలను ఏర్పరిచి వాటి నుంచి సభ్యులను ఎన్నుకోవటానికి శాసనంలో నిర్దేశాలను రూపొందించారు. జిల్లా ప్రాదేశిక నియోజకవర్గాల నుంచి ఎన్నికైన సభ్యులు జిల్లా పరిషత్ అధ్యక్షుణ్ణి, మండల ప్రాదేశిక సభ్యులు మండల అధ్యక్షుణ్ణి ఎన్నుకుంటారు. అయితే గ్రామ స్థాయిలో పంచాయితీ సర్పంచ్ ప్రత్యక్షంగా ఎన్నుకోబడతాడు.

**రిజర్వేషన్లు :**

ఈ మూడంచెల పంచాయితీలలో షెడ్యూల్డు కులాలు, షెడ్యూల్డు తెగలు, వెనుకబడిన తరగతుల వారికి, స్త్రీలకు రిజర్వేషన్ సౌకర్యాలు కల్పించారు. ఈ చట్టంలో చేసిన మార్పుల ద్వారా 18 శాతం షెడ్యూల్డు కులాలకు, 8 శాతం షెడ్యూల్డు తెగలకు, 34 శాతం వెనుకబడిన తరగతులకు, 33 1/3 శాతం సీట్లను స్త్రీలకు కేటాయించారు. ఈ మార్పులవల్ల భూస్వాములు, ధనిక వర్గాల ప్రాబల్యం

తగ్గి పేదలు, బలహీనవర్గాలు, స్త్రీలు సమాజంలో తమ పాత్రను అధికంగా నెరవేర్చటానికి అవకాశం లభించింది.

**అనర్హతలు :**

ఈ చట్టం కొన్ని ముఖ్యమైన అనర్హతలను కూడా పేర్కొన్నది. ఇద్దరి కంటే ఎక్కువ పిల్లలు గలవారు ఈ సంస్థలలో ఏ సంస్థయందు అయినా సభ్యులుగా ఎన్నికకావడానికిగాని, సభ్యులుగా కొనసాగటానికి అనర్హులు. (ఈ చట్టం అమలులోకి వచ్చిన ఒక సంవత్సరం తరువాత) శిక్ష పడిన నేరస్థులు కూడా ఈ ఎన్నికలలో పోటీ చేయడానికి అనర్హులు. నాయకులైన వారు తమకుతాముగ చిన్న కుటుంబం అనే విధానాన్ని ఆచరించి ప్రజలకు తెలియజెప్పటానికి వీలుగా ఉండాలన్నది ఈ నిర్దేశపు భావం.

**ఇతర సభ్యులు :**

ప్రతి స్థాయిలో అంటే మండల పరిషత్‌లోను, జిల్లా పరిషత్‌లోను ఇద్దరు అల్పసంఖ్యాకులను కోఆప్ట్ చేసుకుంటారు.

రాష్ట్ర శాసనసభ్యులు కేంద్ర పార్లమెంటు సభ్యులు తమతమ నియోజకవర్గాలు ఏఏ మండల జిల్లాల్లో భాగాలుగా ఉంటయో ఆ మండల పరిషత్తులు, జిల్లా పరిషత్తులలో పదవిరీత్యా సభ్యులుగా ఉంటూ వాటి సమావేశాలలో పాల్గొని ఓటింగ్ హక్కు కలిగి ఉంటారు. ఈ ఏర్పాటు వల్ల పంచాయితీరాజ్ సంస్థలకు రాష్ట్ర జాతీయ స్థాయిలో ఉన్న శాసనసభ, పార్లమెంటు సభలలోను వాటి కార్యకలాపాలతోను సంబంధం కలుగుతుంది.

మండల పరిషత్ సమావేశాలలో కలక్టరు, మండల పరిషత్ పరిధిలో ఉన్న గ్రామాల సర్పంచ్‌లు, ఆ మండలం నుంచి ఎన్నికైన జిల్లా పరిషత్ సభ్యుడు శాశ్వత ఆహ్వాన సభ్యులుగా సమావేశ కార్యకలాపాల్లో పాల్గొనవచ్చు. కాని వారికి ఓటువేసే హక్కు లేదు. జిల్లా పరిషత్ సమావేశాలలో కూడా శాశ్వత ఆహ్వాన సభ్యులు పాల్గొనటానికి అవకాశం ఉంది. జిల్లా సహకార విక్రయ సంఘపు అధ్యక్షుడు, జిల్లా గ్రంథాలయ సంస్థ అధ్యక్షుడు, జిల్లా సహకార కేంద్ర బ్యాంకు అధ్యక్షుడు, జిల్లా కలెక్టరు, జిల్లాలోని మండల పరిషత్తుల అధ్యక్షులు శాశ్వత ఆహ్వాన సభ్యులుగా ఉంటూరు. వీరు జిల్లా పరిషత్ కార్యకలాపాల్లో పాల్గొనవచ్చు. కాని వారికి ఓటు వేసే హక్కులేదు. పంచాయితీరాజ్ సంస్థలు ప్రతి శ్రేణియందు నేరుగా ఎన్నికైన సభ్యులు ఉండటం వల్లవారు ప్రజలకు జవాబుదారి వహించాలి.

**ప్రత్యేక ఏర్పాట్లు :**

1. పంచాయితీరాజ్ వ్యవస్థలకు నిర్ణీత కాలంలో ఎన్నికల నిర్వహణకు ప్రత్యేక ఎన్నికల కమీషన్.
2. ఈ వ్యవస్థల ఆర్థిక పరిస్థితులను సమీక్షించటానికి ప్రత్యేక కమీషన్‌ను ఏర్పాటు చేసింది.
3. జిల్లా పరిషత్ అభివృద్ధి అధికారి హోదా మార్చి జిల్లా ముఖ్య కార్యనిర్వాహణాధికారిగా మార్పు చేసింది.
4. జిల్లా పరిషత్ స్థాయి సంఘాలలో రెండింటిని స్త్రీలకు కేటాయించింది.
5. 11వ షెడ్యూలులోని అంశాలపై పూర్తి అధికారాన్ని ఈ సంస్థలకు ఇచ్చింది. మొత్తం 29 అంశాలపై ఈ సంస్థలకు అధికారం ఇచ్చింది.
6. గ్రామ స్థాయిలో సర్పంచ్ మరియు వార్డు మెంబర్లు పార్టీ రహితంగాను, మండల పరిషత్ ప్రాదేశిక నియోజక సభ్యులు, జిల్లా ప్రాదేశిక నియోజకవర్గ సభ్యులు పార్టీ ప్రాతిపదికన ఎన్నికలు జరపాలని నిర్ణయించింది.

## 16.4 గ్రామ సచివాలయ వ్యవస్థ:

"గ్రామ స్వరాజ్యమే భారతదేశ సౌభాగ్యం" అని మహాత్మాగాంధీ పేర్కొన్నారు. స్వర్ణాంధ్రప్రదేశ్ లక్ష్యంగా విజన్ - 2020 ప్రాతిపదికగా పలురంగాలలో సంస్కరణల పర్వానికి నాంది పలికిన ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం భారతదేశ చరిత్రలోనే మొదటిసారిగా గ్రామ

సచివాలయ వ్యవస్థకు రంగాన్ని సిద్ధం చేసింది. గ్రామ సచివాలయ వ్యవస్థ 2001 జనవరి ఒకటవ తేదీ నుంచి ఆవిర్భవించింది.

రాష్ట్ర వ్యాప్తంగా మారుమూల గ్రామాలలో సైతం ప్రజల ముంగిట పాలన అందించడానికి ఉద్దేశించిన ఈ వినూత్న వ్యవస్థలో భాగంగా ప్రతి గ్రామంలో ఇక గ్రామ కార్యదర్శి పాలనా అధికారిగా బాధ్యతలను నిర్వహిస్తారు. గ్రామీణుల అవసరాలకు అనుగుణంగా స్థానికంగానే వనరులను సమీకరించి, ప్రాధాన్యతలను నిర్ణయించి ఎన్నికైన ప్రజా ప్రతినిధుల సారథ్యంలో సమగ్ర అభివృద్ధిని సాధించాలన్న మహత్తర ఆశయంతో, మహోన్నత లక్ష్యంతో ఈ గ్రామ సచివాలయ వ్యవస్థ రూపుదిద్దుకుంది.

ప్రజలకు పాలన ఎంతో చేరువగా ఉండడమే కాకుండా ప్రజలు సేవలను ఎంతో సులభంగా పొందగలిగే గ్రామాలలో నిజమైన సౌభాగ్యం విలసిల్లుతుంది. ఆ దిశగా గ్రమ సచివాలయ వ్యవస్థ ఫలితాలను అందించాలన్నదే ప్రభుత్వ ధ్యేయం. గ్రామ సచివాలయాల ద్వారా ఒకే చూరు కింద గ్రామీణులకు సకల సేవలు అందించాలన్న లక్ష్యంతో తీర్చిదిద్దిన నూతన విధానంలో భాగంగా ప్రతి గ్రామంలో ఒక గ్రామ కార్యదర్శి పాలనా యంత్రాంగ ప్రతినిధిగా, ప్రజా ప్రతినిధిగా ఎన్నికైన సర్పంచ్‌కి సర్వవిధాల సహకరిస్తాడు.

ఆంధ్రప్రదేశ్‌లో గ్రామ కార్యదర్శుల నియామకానికి వీలు కల్పిస్తూ ప్రభుత్వం డిసెంబర్ 12వ తేదీన ఉత్తర్వులు (జి.ఓ.ఎం.ఎస్.నెం. 369, సం. 2001) జారీ చేసింది. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న 21, 943 గ్రామ పంచాయతీల్లో 1319 నోటిఫైడ్ గ్రామ పంచాయతీలు ఉన్నాయి. నోటిఫైడ్ గ్రామ పంచాయతీలకు మాత్రామే ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్లు ఉన్నారు. మిగిలిన 20, 624 పంచాయతీలకు ఇప్పటి వరకు పూర్తికాలపు ప్రభుత్వ ఉద్యోగి ఎవరూ లేరు.

**పంచాయతీ కార్యదర్శి విధులు :**

1. పంచాయతీ కార్యదర్శి విధిగా తాను పనిచేసే పంచాయతీ పరిధిలోనే నివాసం ఉండాలి. ఈ నిబంధునకు విరుద్ధంగా వ్యవహరించే వారిని ఉద్యోగం నుంచి తొలగించడానికి చర్యలు తీసుకుంటారు.
2. గ్రామ పంచాయితీలో సబార్డినేట్‌గా ఉండే గ్రామ కార్యదర్శి సర్పంచ్/గ్రామ పంచాయతీ ఆధీనంలో విధులు నిర్వహించాలి

**పంచాయతీ పాలనకు సంబంధించిన విధులు :**

1. సర్పంచ్ ఆదేశాలకు లోబడి గ్రామ పంచాయతీ సమావేశాన్ని ఏర్పాటు చేయాలి.
2. గ్రామ పంచాయతీ, ఇతర కమిటీ సమావేశాలకు హాజరు కావాలి.
3. గ్రామ పంచాయతీ సమావేశం, ఇతర కమిటీ సమవేశాలు ఆమోదించి తీర్మానాలను అమలు చేయాలి.
4. ప్రభుత్వ పంచాయతీ ఆస్తులు, భూములను సంరక్షించాలి. గ్రామ చావిడీలు సక్రమంగా ఉండేటట్లు చర్యలు తీసుకోవాలి.
5. ప్రభుత్వ పంచాయతీ భూములు, భవనాల ఆక్రమణ, నష్టం, అక్రమ వినియోగానికి సంబంధించి సంబంధిత అధికారులకు నివేదించాలి.
6. గ్రామ పంచాయతీ రిజిష్టర్‌లను సక్రమంగా నిర్వహిస్తూ పంచాయతీ పన్నులను వసూలు చేయాలి.

**సాధారణ పరిపాలనకు సంబంధించిన విధులు:**

1. ప్రభుత్వ పక్షాన రుసుములు, పన్నులు వసూలు చెయ్యాలి. గ్రామ రికార్డులను, గ్రామ అక్కౌంట్‌లను నిర్వహించాలి.
2. సర్వే రాళ్ళ తనిఖీతో సహా పంటల అజమాయిషీ
3. కుల, ఆదాయ, నివాస, ఇతర సర్టిఫికెట్ల జారీకి వీలుగా ప్రాథమిక నివేదికలు తయారు చెయ్యాలి.
4. గ్రామంలో పరిశుభ్రతకు చర్యలు తీసుకోవాలి.

5. గ్రామ పంచాయతీ విధుల నిర్వహణకు అవసరమైన సహాయాన్ని అందజేయాలి.
6. వరదలు, తుఫాను, ప్రమాదాలు సంభవించినపుడు ప్రభుత్వ అధికారులు చేపట్టే సహాయ చర్యలకు సహకారం అందించాలి. నివారణ, సహాయ, పునరావాస చర్యలు చేపట్టాలి.
7. గ్రామ స్థాయిలో ఆంధ్రప్రదేశ్ ట్రాన్స్‌మిషన్ కార్పొరేషన్ చేసే పనులకు సహకారం అందించాలి.
8. కనీస వేతనాల చట్టం, 1948 కింద సంబంధిత అథారిటీ ఆదేశాల మేరకు 'ఇన్‌స్పెక్టర్'. గా వ్యవహరించాలి.
9. సంబంధిత చట్టం, నిబంధనలకు అనుగుణంగా జనన, మరణ రిజిష్టర్‌ను నిర్వహించాలి.
10. సంబంధిత చట్టం, నిబంధనలకు అనుగుణంగా వివాహాల అధికారి బాధ్యతలు నిర్వర్తించాలి. నిబంధనల ప్రకారం వివాహాల రిజిష్టర్‌ను నిర్వహించాలి.

**అన్ని ప్రభుత్వ విభాగాలకు సహాయం :**

1. రెవెన్యూ రికవరి చట్టం అమలులోను, ఆస్తుల వివరాల సేకరణలో సహాయం అందించాలి.
2. లీగల్ నోటీసులను, సమన్లను సంబంధిత వ్యక్తులకు అందించడంలో సహాయం.
3. చేపట్టే చర్యల గురించి 'టాంటాం' లేదా ఇతర పద్ధతుల ద్వారా ప్రజలకు తెలియజేయడం.
4. రుణాల సేకరణలో సహకారం.
5. పంచనామా చేయడంలో, సొంతదారులు లేని ఆస్తుల రికవరిలో సహాయం.
6. ప్రభుత్వం స్వాధీనం చేసుకున్న ఆస్తులను భద్రంగా ఉంచడం.
7. ఎన్నికల విధుల నిర్వహణ.

**పోలీసు విధులు :**

1. హత్యలు, ఆత్మహత్యలు, అసహజ మరణాలు, శాంతికి విఘాతం కలిగించే ఘటనలకు సంబంధించి పోలీసు శాఖకు తక్షణమే సమాచారం అందించాలి.
2. అపరిచితులు, అనుమానాస్పదంగా గ్రామంలో తిరుగుతున్న వారిని గురించి పోలీసులకు సమాచారం అందించాలి.
3. ఏదైనా ఎయిర్ క్రాఫ్ట్‌కి ప్రమాదం సంభవించినప్పుడు ఆ సమాచారాన్ని దగ్గరలోని పోలీసు స్టేషన్‌కు అందించాలి.
4. రుణాల పంపిణీ రికవరీలో గ్రామ సభకు లబ్ధిదారుల గుర్తింపులో సహకారం.

**సామాజిక సంక్షేమం, అభివృద్ధి :**

1. వృద్ధులకు పెన్షన్ చెల్లించే పనిలో సహకారం.
2. అంటురోగాలకు సంబంధించి నివేదించడం.
3. అభివృద్ధి కార్యక్రమాల అమలుకు సంబంధించిన వివరాలను తయారుచేయడం
4. పేదరికం దిగువన ఉన్న కుటుంబ యజమానుల ముసాయిదా జాబితాను తయారు చెయ్యాలి. అతి తక్కువ ఆదాయం నుంచి ఆపైన ఆదాయం లభిస్తున్న వారి వరుసలో కుటుంబ యజమానుల పేర్లను రూపొందించాలి.
5. గ్రామ అవసరాలను గుర్తించి, గ్రామ ప్రణాళికను రూపొందించడంలో సహకరించాలి.

6. పొదుపు అలవాట్ల ద్వారా స్వయం సహాయక గ్రూపులను మహిళలు ఏర్పాటు చేసుకునే విధంగా వారిని ప్రోత్సహించడం. శిక్షణా కార్యక్రమాల ద్వారా స్వయం సహాయక గ్రూపులలో ఉత్తమ గ్రూపు యాజమాన్య పద్ధతులను ప్రోత్సహించడం.
7. మండల పరిషత్తు అధ్యక్షుడు, మండల అభివృద్ధి అధికారి, జిల్లా కలెక్టర్ ఏర్పాటు చేసే సిబ్బంది సమావేశాలకు హాజరు కావటం.
8. పనిలో పై అధికారులకు సహకారం అందించాలి.
9. బలహీన వర్గాల గృహ నిర్మాణ కార్యక్రమం అమలుకు అవసరమైన సహాయం అందజేయాలి.
10. మహిళలు, పిల్లల పై జరిగే అకృత్యాలకు సంబంధించి సూపర్‌వైజర్‌కు వెంటనే నివేదించి, 24 గంటల్లో తగిన చర్య తీసుకోవాలి.
11. మలేరియా, కలరా వంటి అంటువ్యాధులకు సంబంధించి సమీపంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తెలియజెయ్యాలి.
12. గ్రామంలో మలేరియా నిరోధక స్ప్రే చేసినట్లు ధృవీకరించాలి.
13. సమీకృత శిశు అభివృద్ధి పథకం అమలు చేస్తున్న వారికి సహకారం అందించడం.
14. ఏఏ ప్రాంతాలలో మొక్కలను పెంచాలో వివరాలు సేకరించాలి. మొక్కల సంరక్షణ చేపట్టే వారిని ప్రోత్సహించాలి.
15. షెడ్యూల్డు కులాలు, షెడ్యూల్డు తెగల వారిపై జరిగే అకృత్యాల పై నివేదికలు రూపొందించాలి.
16. ఐ.టి.డి.ఏ. సమావేశాలకు హాజరు కావాలి. మైక్రో ప్రణాళికను రూపొందించి, అమలులో సహకరించాలి.
17. అంటరానితనం నిర్మూలనకు కృషి చెయ్యాలి, షెడ్యూల్డు కులాల వారికి దేవాలయాలలో ప్రవేశం కల్పించడంలో, రెండు గ్లాసుల విధానం రూపుమాపడంలో, పబ్లిక్ నీటి వనరులను ఉపయోగించుకోవడానికి ఎస్.సి.లకు అవకాశం కల్పించడంలో సహకారం అందించాలి.
18. విద్యార్థుల నమోదులో విద్యాశాఖకు సహకారం అందించాలి.
19. అక్షరాస్యత తరగతుల నిర్వహణకు సహకారం అందించాలి.

**పంచాయితీ కార్యదర్శి నిర్వహించవలసిన ఇతర పనులు :**

1. పంట విస్తీర్ణం: పంట భీమా పథకం అమలుకు అవసరమైన పంట విస్తీర్ణం వివరాల సేకరణలో సహకారం అందించాలి.
2. వ్యవసాయ శాఖ అధికారులు తమ శాఖ కార్యక్రమాల అమలులో చేపట్టే చర్యలకు సహకారం అందించాలి.
3. పంటల సంయుక్త పరిశీలన.
4. వ్యవసాయ వివరాలను రూపొందించడం.
5. గ్రామంలో సమాచార బోర్డులు, బ్లాక్ బోర్డులు, ఇతర ఆస్తుల సంరక్షణ, అవి సక్రమంగా ఉండేటట్టు చూడడం.
6. విత్తనాలు, ఎరువులు, పురుగు మందుల బ్లాక్ మార్కెట్ గురించి సంబంధిత అధికారులకు సమాచారం అందించాలి.
7. నేత కార్మికుల పూర్తి వివరాలు, వారి ఆర్థిక స్థాయి గురుంచి వివరాలు తయారు చేయాలి.
8. చేనేత కార్మికులకు డిపెండెన్సీ సర్టిఫికెట్‌లు జారీ చెయ్యాలి.

**సమన్వయానికి సంబంధించిన విధులు :**

1. వేర్వేరు సంస్థల మధ్య సమన్వయకర్తగా వ్యవహరించాలి.
2. వివిధ పథకాల లబ్దిదారుల జాబితాను రూపొందించాలి. జన్మభూమి, నీరు - మీరు, వాటర్‌షెడ్ కార్యక్రమాలు, సంయుక్త అటవీ యాజమాన్యం, సామాజిక అడవుల పెంపకం మొదలైన కార్యక్రమాలలో ప్రజలు పాల్గొనేటట్లు చూడాలి.
3. ఉపాధ్యాయులు, ఇతర ప్రభుత్వ అధికారులతో అనుసంధానకర్తగా వ్యవహరించాలి.
4. కమ్యూనిటీ పనుల విషయంలో గ్రామస్థులతో గ్రూపు చర్చలు నిర్వహించాలి.
5. గ్రామస్థాయిలో అన్ని ప్రభుత్వ విభాగాల ఉద్యోగుల మధ్య సమన్వయం సాధించాలి.
6. పచ్చదనం- పరిశుభ్రం, మొక్కల పెంపకం కార్యక్రామాలలో ప్రజలు శ్రద్ధగా పాల్గొనేటట్లు చేయడం.

**ఇతరపనులు:**

1. ప్రభుత్వం, జిల్లా యంత్రాంగం అప్పగించే ఇతర విధులన్నిటినీ నిర్వహించాలి.

పైన పేర్కొన్న విధులు అన్నీ గ్రామ కార్యదర్శి నిర్వహించవలసి ఉన్నది. అయినప్పటికి గ్రామ సచివాలయ ఉద్యోగులకు సరి అయిన శిక్షణ లేక తగిన ఫలితాలు సాధించలేక పోతున్నది.

కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత గ్రామ సచివాలయ వ్యవస్థ పనితీరు పై ఒక కమిటీ వేసింది. ఈ సచివాలయ వ్యవస్థ తగినంత ఫలితాలు ఇవ్వలేని కారణంగా మరలా గ్రామాధికారి వ్యవస్థను ఏర్పాటు చేయటానికి ఆలోచన చేస్తుంది.

## 16.5 ఆంధ్రప్రదేశ్‌లో పంచాయితీ వ్యవస్థ-మహిళలు :

మహిళలు పురుషులతో పాటు భాగస్వామ్యం పంచుకొని ఉంటే అభివృద్ధి కార్యక్రమాలు వేగంగా జరుగుతాయి. అధికార, అర్థిక ప్రతిపత్తి రెండూ ఉంటేనే దేశాభివృద్ధికి మహిళ తోడ్పడగలదు. దేశ జనాభాలో సగంగా ఉన్న మహిళ రాజకీయాలలో చురుకైన పాత్ర వహిస్తే నాయకత్వంలో గుణాత్మకమైన మార్పు వస్తుంది. బల్వంతరాయ్ మెహతా కమిటీ తన సిఫార్సులలో ఇద్దరు మహిళలను పంచాయితీలకు మరియు పంచాయితీ సమితులకు కోఆప్ట్ చేసుకోవాలని కోరింది. 1964 చట్టం నుండి గ్రామ పంచాయితీ స్థాయి జనాభాను బట్టి రిజర్వేషన్లు ఇచ్చింది. మెహతా సిఫార్సుల మేరకు ఆంధ్రప్రదేశ్ పంచాయితీ రాజ్ సంస్థలలో మహిళలను కోఆప్టు చేసుకొనేవారు. అశోక్‌మెహతా కమిటి మండల పంచాయితీలలో ప్రత్యేకంగా మహిళా కమిటీలు, స్త్రీ శిశు సంక్షేమ కార్యక్రమాలను అది నిర్వహించాలని కోరింది. ఆంధ్రప్రదేశ్‌లో నరిసింహం కమిటి బ్లాక్ స్థాయిలో 5 శాతం సర్పంచ్ పదవులను మహిళలకు ఇవ్వాలని సిఫార్సు చేసింది.

ఆంధ్రప్రదేశ్‌లో మొదటిసారిగా 1986లో శ్రీ ఎన్.టి.రామారావు గ్రామ మండల ప్రజా పరిషత్, జిల్లా ప్రజాపరిషత్ అధ్యక్ష స్థానాలలో 9శాతం రిజర్వేషన్ కల్పించారు. దీని ఫలితంగా శ్రీకాకుళం, నిజామాబాద్ జిల్లా పరిషత్ అధ్యక్షస్థానాలకు మరియు 96 మండల ప్రజాపరిషత్ అధ్యక్ష స్థానాలకు మహిళలు ఎన్నికైనారు. వీరు 1987 నుండి 1992 వరకు అధికారంలో కొనసాగారు.

73వ రాజ్యాంగ సవరణ ద్వారా స్థానిక సంస్థలలో మహిళలు అధికారాన్ని చేపట్టగలిగారు. 1994 ఆంధ్రప్రదేశ్ పంచాయితీరాజ్ చట్టం ద్వారా 1/3 సీట్లను మూడు అంచెలలోను మహిళలకు రిజర్వేషన్లు కల్పించారు. 1995 మరియు 2001లలో 33.3% మంది మహిళలు ఎన్నికయ్యారు. ఆంధ్రప్రదేశ్‌లో ప్రస్తుతం సుమారుగా మహిళా సభ్యుల సంఖ్య ఈ క్రింద పేర్కొనబడింది.

| | | |
|---|---|---|
| మొత్తం గ్రామ పంచాయితీలు | : | 21,943 |
| మొత్తం పంచాయితీ వార్డు మెంబర్లు | : | 2,20,538 |
| మొత్తం మహిళా వార్డు మెంబర్లు | | 74,513 |
| మొత్తం మహిళా సర్పంచ్‌లు | : | 4,776 |
| మొత్తం మహిళా ఎం.పి.టిసి.లు | : | 6,846 |
| మొత్తం మహిళా మండలాధ్యక్షులు | : | 361 |
| మొత్తం మహిళా జెడ్.పి.టి.సి.లు | : | 361 |
| మొత్తం మహిళా జిల్లా పరిషత్ అధ్యక్షులు | : | 7 |

ప్రస్తుతం ఆంధ్రప్రదేశ్‌లో మహిళలు అభివృద్ధి చెందటానికి కలిగిన వ్యవస్థ పంచాయితీరాజ్ వ్యవస్థ. అయితే మహిళలు అధికారం లోకి వచ్చినప్పటికి తగినంత సాధికారతను ఈ రంగంలో పొందలేదు.

## 16.6 పంచాయితీరాజ్ సంస్థలు - రాజకీయ పార్టీలు :

### పంచాయితీరాజ్ సంస్థలు - రాజకీయ పార్టీలకు మధ్యగల సంబంధాలు :

పంచాయితీరాజ్ సంస్థలకు రాజకీయ పార్టీల విజయానికి ఎంతవరకు సంబంధాలు ఉన్నాయనే విషయాన్ని గురించి ఆలోచిస్తే, ఆచరణలో రాజకీయ పార్టీలు పంచాయితీరాజ్ సంస్థల విజయానికి ఉపకరించగలవా లేదా అన్న విషయం తెలుసుకోవటం అవసరం. రాజకీయ పార్టీలు మన దేశంలో అనేకం ఉన్నాయి. ఇవన్నీ ఒకే సిద్ధాంతం కలిగి ఉండవు. వీటిలో కొన్ని జాతియ పార్టీలు, కొన్ని ప్రాంతీయ పార్టీలు. ఇవి ప్రజలలో రాజకీయ చైతన్యాన్ని పెంచి పాలకుల యొక్క నియంతృత్వ పోకడలను అరికట్టుటకు తోడ్పడతాయి. ఇవి పార్లమెంటరీ తరహా ప్రజాస్వామ్య వ్యవస్థ విజయానికి, ప్రభుత్వాంగాలైన శాసన, కార్య నిర్వాహక శాఖల మధ్య సమన్వయాన్ని, సాయరస్యాన్ని సాధించడానికి, అలాగే ప్రభుత్వానికి ప్రజలకు మధ్య వారధివలె పనిచేస్తాయి.

భారత దేశంలో పంచాయితీరాజ్ సంస్థలు సక్రమంగా పనిచేయటానికి పార్టీలు ఉపకరిస్తాయా లేదా అన్న అంశానికి సంబంధించిన పరస్పర భిన్నాభిప్రాయాలున్నాయి. అవి:

1. అనేక మంది అధికార, అనధికార ఉద్యోగులు, సంస్థలు పంచాయితీరాజ్ సంస్థల నుండి రాజకీయ పార్టీలను వేరుచేయుట తప్పనిసరి అని పేర్కొన్నారు. వీరి అభిప్రాయం ప్రకారం రాజకీయ పార్టీలతో పంచాయితీరాజ్ సంస్థలకు సంబంధం ఉంటే గ్రామ ప్రాంతాలలోని ప్రజలలో విభేదాలు ఎక్కువై, సహకారం, సామరస్యం నశించి ప్రగతికి అడ్డంకి ఏర్పడుతుంది. ఈ అభిప్రాయాన్ని సర్వోదయ సిద్ధాంతకర్తలు, సానుభూతిపరులు అంగీకరించిరి.

2. కొంతమంది ప్రముఖుల అభిప్రాయం ప్రకారం ప్రజాస్వామ్య తరహా పాలనా వ్యవస్థలో రాజకీయ పార్టీల నిషేధం ఇబ్బందులతో కూడుకున్నది. అంతేకాక అవాస్తవికంగా కూడా ఉంటుంది. పంచాయితీరాజ్ స్థాపన యొక్క మౌలిక లక్ష్యం నెరవేరాలంటే రాజకీయ పార్టీలు తప్పనిసరిగా ఉండాలి. ఎక్కడ అధికారముంటుందో అక్కడ రాజకీయ పార్టీలు తప్పనిసరి. రాజకీయ పార్టీలు లేని పంచాయితీరాజ్ సంస్థలు మొండెంలేని మానవ శరీరాలుగా భావించవచ్చు.

భారతదేశంలోని గ్రామీణ ప్రాంతాలలో తప్పనిసరిగా వర్గవైషమ్యాలు, అంటరానితనం, కులసంబంధమైన విభేదాలు మరియు అచార సాంప్రదాయాలను పాటించడం మనం చూస్తున్నాం. పేదరికం, నిరుద్యోగం, నిరక్షరాస్యత మరియు రవాణా సౌకర్యాలు లేనందువల్ల, శాస్త్ర సాంకేతిక రంగాలలో సాధించిన అభివృద్ధి ఫలితాలను అనుభవించ లేకపోవటం వలన, రాజకీయ పాలనా రంగాలలో ఏ విధమైన ప్రవేశము లేనందువల్ల గ్రామీణ ప్రాంతాలలో నివశిస్తున్న ప్రజలకు పట్టణప్రాంతాలలో నివశిస్తున్న ప్రజలకు మధ్య స్పష్టమైన తేడా ఉంది. స్వేచ్ఛ, సమానత్వ సిద్ధాంతాల ప్రాతిపదికను కలిగి, ప్రజల మనోభీష్టానికి అనుగుణంగా పాలనా కార్యక్రమాలను నిర్వహించే ప్రజాస్వామ్య

వ్యవస్థ విజయానికి రాజకీయపార్టీలు చాలా అవసరం. రాజకీయ పార్టీలు స్థానిక ప్రజలలో అనాదిగా ఉన్న సంకుచిత దురభిప్రాయాలను తొలగించి వారికి వివిధ సిద్ధాంతాల ఆవశ్యకతను, చట్ట ప్రాధాన్యతను, పంచాయితీరాజ్ సంస్థల స్థాపనా లక్ష్యాలను వివరించి వారిలో రాజకీయ చైతన్యాన్ని పెంపొందించటానికి కృషి చేస్తాయని వీనర్ పేర్కొన్నాడు.

పంచాయితీరాజ్ సంస్థలకు జరిగే ఎన్నికలలో రాజకీయ పార్టీలు పాల్గొనటానికి అవకాశమివ్వరాదు. "భారత జాతీయ కాంగ్రెసు కమిటీ" ఒక ప్రత్యేక తీర్మానంలో రాజకీయ పార్టీలు పంచాయితీలకు జరిగే ఎన్నికలలో పాల్గొనకూడదని పేర్కొనడం జరిగింది. అయినప్పటికి ఆచరణలో దీనికి భిన్నంగా జరిగింది. గ్రామాలలో నివసించు ప్రజానీకం ఎలాంటి రాజకీయ పార్టీలతో పొత్తు పెట్టుకోకుండా చూడాలి. పార్టీ రహిత ప్రాతిపదికన ఎన్నికలు జరిగితే ఎలాంటి అనివార్య సంఘటనలు జరగకకుండా చూడవచ్చు. ప్రధాని మరియు అనేకమంది ఇతర మంత్రులు చేసే ప్రసంగాలు, వివిధ పార్టీల ఎన్నిక ప్రణాళికలు క్షుణ్ణంగా పరిశీలించి చూస్తే పంచాయితీరాజ్ సంస్థల పాలకవర్గాన్ని ఎన్నుకోవటంలో పార్టీలు ప్రముఖపాత్ర వహిస్తున్నాయని భావించవచ్చు.

ఆంధ్రప్రదేశ్‌లో 1959 నుండి 1981 ఎన్నికల వరకు పంచాయితీ రాజ్ సంస్థలలో పార్టీ రహిత ఎన్నికలు జరిగినాయి. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం 1987 ఎన్నికలలో మండల అధ్యక్షులు మరియు జిల్లా పరిషత్ అధ్యక్షుల ఎన్నికలను పార్టీ ప్రాతిపదికన నిర్వహించింది. ఈ ఎన్నికలలో పార్టీ గుర్తుల పైనే మండల, జిల్లా పరిషత్ అధ్యక్షులు ఎన్నికయ్యారు. 1995, 2001 ఎన్నికలలో మండల ప్రాదేశిక నియోజక వర్గ సభ్యులు, జిల్లా ప్రాదేశిక నియోజకవర్గ సభ్యుల ఎన్నికలు పార్టీ ప్రాతిపదికపైనే జరిగాయి. గ్రామ స్థాయిలోని సర్పంచ్‌లు, వార్డు మెంబర్ల ఎన్నికలు పార్టీ రహితంగా జరిగినాయి.

## 16.7 సమస్యలు :

రాష్ట్రాలకు ఎక్కువ అధికారాలుండాలనే రాష్ట్ర ప్రభుత్వం పంచాయితీలు, మండల పరిషత్తులు, జిల్లా పరిషత్తులు, మునిసిపాలిటీ తదితర స్థానిక సంస్థలకు అధికారాలను అప్పగించడానికి ఇష్టపడటంలేదు. 73వ రాజ్యాంగ సవరణ ఆధారంగా కొద్ది మార్పులతో చట్టం చేసి, అమలు చేసిన రాష్ట్ర ప్రభుత్వం స్థానిక సంస్థలకు తగినన్ని అధికారాలు, ఆర్థిక వనరులు ఇవ్వలేదు. గత 5 సం॥లలో పంచాయితీలకు రాష్ట్ర ప్రభుత్వం సుమారు 80కోట్లు బకాయిపడింది. పంచాయితీరాజ్ వ్యవస్థ 1986 చట్టంలో కొన్ని మార్పులు చేయడం, మరల 1994లో చేసిన మార్పుల మూలంగా పంచాయితీరాజ్ వ్యవస్థ మార్పులకు అనుగుణంగా బలపడలేదు. ఉదాహరణకు గ్రామ స్థాయిలో సర్పంచ్ పార్టీ రహితంగా ఎన్నిక కావడం, అదే గ్రామం నుండి లేదా ప్రక్క గ్రామంతో కలిసి ఎన్నిక కాబడిన మండల పరిషత్ ప్రాదేశిక సభ్యుడు ఎన్నిక కావడం అధికారంలో వైరుధ్య మూలంగా గ్రామాలలో మండల ప్రాదేశిక సభ్యులలో నిరాశ, నిర్లిప్తత ఏర్పడింది. వారి అధికారాలను చాలాకాలం వరకు విశదీకరించలేకపోవడం వల్ల గ్రామాల్లో పోటీ తత్వం ఏర్పడింది. మండల ప్రజాపరిషత్, జిల్లా ప్రాదేశిక నియోజకవర్గ సభ్యుల విధుల, అధికారాల విషయంలో అస్పష్టత ఏర్పడింది.

పంచాయితీరాజ్ వ్యవస్థలో రాజకీయపార్టీలు పాల్గొనటంవల్ల కూడా కొన్ని కొత్త సమస్యలు ఏర్పడుతున్నాయి. పార్టీ రాజకీయాల వలన గ్రామీణ వాతావరణం కలుషితం అవుతుందని, ఇటువంటి తరుణంలో పంచాయితీరాజ్ వ్యవస్థలో పార్టీ రాజకీయాలను ప్రవేశపెట్టడం ఆరోగ్యకరం కాదని జయప్రకాష్ నారాయణ్ వంటి సర్వోదయ నాయకులు పార్టీ రహిత ప్రజాస్వామ్యం అనే ఆదర్శవంతమైన సూత్రాన్ని ప్రచారంలోకి తెచ్చారు. కాని దీనితో కొందరు ఏకీభవించలేదు. వారి వాదన ప్రకారం ప్రజాస్వామ్య వ్యవస్థలోని రాజకీయ పార్టీలను పంచాయతీరాజ్ సంస్థల నుండి దూరంగా ఉంచడం కష్టమే కాకుండా అవాస్తవికం కూడా. వైనర్ చెప్పినట్లు అధికారం ఉన్నచోట రాజకీయాలు ఉంటాయి. రాజకీయాలు పంచాయితీ రాజ్య లక్ష్యానికి భంగం కలిగిస్తున్నాయి. ఫలితంగా మండల అధ్యక్షుణ్ణి, జిల్లా పరిషత్ అధ్యక్షున్ని మార్చటం కోసం చేసే ప్రయత్నాలు, అధికార పార్టీ శాసనసభ్యులు తరచు పంచాయతీరాజ్ సంస్థలలో జోక్యం మొదలగునవి పంచాయతీరాజ్ సంస్థలను నిర్వహిస్తున్నాయి. రిజర్వేషన్లు పెంచినప్పటికి వాటిలో వాస్తవికత కొరవడింది. వెనుకబడిన జనాభా లెక్కలు లేక 'లాటరీ' పద్ధతి అనుసరించడం జరిగింది. లోకసత్తా స్థానిక సంస్థ అధికారం కోసం కోటి సంతకాల ఉద్యమం చేపట్టి ప్రభుత్వం దృష్టికి తెచ్చింది.

## 16.8 పంచాయితీరాజ్ సంస్థల అభివృద్ధికి కొన్ని సూచనలు :

1. ప్రజాస్వామ్య వికేంద్రీకరణ స్పష్టంగా జరగాలి. అంటే ఈ సంస్థలకు తగినన్ని అధికారాలు ఇవ్వాలి. 11వ షెడ్యూలులోని 29 అంశాల పై పంచాయతీలకు ఆధికారాన్ని ధాఖలు పరచాలి.
2. ఈ సంస్థల సభ్యులకు తగిన శిక్షణ ఇవ్వాలి. నాయకులు కూడా చిత్తశుద్ధితో శిక్షణ పొందాలి.
3. ఆర్థిక సంఘం కేటాయించిన మొత్తం నిధులు రాష్ట్ర ప్రభుత్వం పంచాయితీ సంస్థలకు ఇవ్వాలి.
4. డి.ఆర్.డి.ఎ. నిధులు పంచాయితీల ద్వారా వ్యయంకావాలి.
5. శాసనసభ్యులు, పార్లమెంటు సభ్యుల జోక్యం తగ్గాలి.
6. మండల ప్రాదేశిక సభ్యులు జిల్లా ప్రాదేశిక సభ్యుల అధికారాలు, విధులు స్పష్టపరచాలి.
7. గ్రామ స్వరాజ్యాన్ని ఏర్పరచాలనే లక్ష్యం రాష్ట్ర ప్రభుత్వానికి ఉండాలి.

73వ రాజ్యాంగ సవరణ ఆశయాలను సాధించాలంటే రాష్ట్ర ప్రభుత్వం చిత్తశుద్ధితో అధికారాలను వికేంద్రీకరించి తగిన ఆర్థిక వనరులను సమకూర్చినపుడు క్రిందస్థాయి ప్రజాతంత్ర వ్యవస్థ విజయవంతం అవుతుంది.

## 16.9 సారాంశము :

ఆంధ్రప్రదేశ్‌లో మొదటిదశలోనే మూడు అంచెల పంచాయితీ రాజ్‌వ్యవస్థ ప్రవేశపెట్టబడినప్పటికీ తగినంత ఫలితాలు సాధించలేకపోయినప్పటికీ పంచాయితీరాజ్ సంస్థలు గ్రామీణాభివృద్ధి కోసం కృషి చేస్తూనే ఉన్నాయి. 73వ రాజ్యాంగ సవరణ ద్వారా 1994 నూతన పంచాయితీ రాజ్ చట్టం రావడం వలన ఆంధ్రప్రదేశ్ గ్రామీణ రాజకీయ వ్యవస్థలో నూతన నాయకత్వం ఆవిర్భవించింది. మహిళలు ఇప్పుడిప్పుడే పంచాయితీరాజ్ సంస్థల ద్వారా చైతన్యవంతులు అవుతున్నారు, రాజకీయ పార్టీలు పంచాయితీరాజ్ వ్యవస్థలో భాగస్వామ్యం కావడం వల్ల కొన్ని సందర్భాలలో శాసనసభ్యుల పార్లమెంటు అనుచిత జోక్యం మనకి కనిపిస్తోంది. గ్రామ సచివాలయ వ్యవస్థ ప్రవేశపెట్టినప్పటికీ దానికి సరిఅయిన పునాదులు వేయకపోవడం వల్ల ఫలితాలు అంతంతమాత్రంగానే ఉన్నాయి. పంచాయితీరాజ్ సంస్థలకు తగినన్ని అధికారాలు నిధులు ఇవ్వవలసిన అవసరం ఎంతైనా ఉంది. అప్పుడే దిగువ స్థాయిలో పంచాయితీరాజ్ సంస్థల ద్వారా ప్రజాస్వామ్యం ప్రజ్వరిల్లుతుంది.

## 16.10 నమూనా ప్రశ్నలు :

1. 73వ రాజ్యాంగ సవరణపై ఒక వ్యాసము వ్రాయుము.
2. 1994 ఆంధ్రప్రదేశ్ పంచాయితీరాజ్ చట్టం గురించి వివరింపుము.
3. ఆంధ్రప్రదేశ్ గ్రామ సచివాలయము వ్యవస్థ నిర్మాణం, పనితీరును విశ్లేషింపుము.

## 16.11 చదువదగిన గ్రంథాలు :

1. యస్.ఆర్.మహేశ్వరి - లోకల్ గవర్నమెంట్ ఇన్ ఇండియా
2. 73 రాజ్యాంగ సవరణ చట్టం
3. 1994 ఆంధ్రప్రదేశ్ పంచాయితీరాజ్ చట్టం

డా.బి.వి.వి. బాలకృష్ణ

# పాఠం - 17

# ఆంధ్రప్రదేశ్‌లో రైతాంగ మరియు ఇతర నిరసనోద్యమాలు

**17.0 లక్ష్యం :**

ఆశించిన ఆశయాలు అమలు జరగని సందర్భంలో ఆశయాల సాధనకు సమాజంలోని వివిధ వర్గాలకు చెందిన ప్రజలు ఉద్యమిస్తారు. నిరసనల వెల్లువలు ఆవిర్భవిస్తాయి. ఆశయాల సాధనకు ఉద్యమించేవారి కోర్కెలను అవగాహన పరచుకోవటం చాలా ఆవశ్యక విషయం. ఈ పాఠంలో ఆంధ్రప్రదేశ్‌లో జరిగిన రైతాంగ ఉద్యమాలు మరియు ఇతర నిరసనోద్యమాలను అధ్యయనం చేయడం ప్రధానమైన లక్ష్యం.

## విషయసూచిక


17.1 పరిచయం
17.2 జమీందారీ ఆవిర్భావం
17.3 రైతు ఉద్యమాలు
17.4 ఆంధ్రప్రదేశ్‌లో రైతాంగ ఉద్యమాలు
17.4.1 వామపక్ష ప్రేరిత ఉద్యమాలు
17.4.2 వామపక్షేతర ఉద్యమాలు
17.4.3 స్వతంత్ర్య రైతాంగ ఉద్యమాలు
17.5 విశాఖ స్టీల్ ప్లాంట్ ఆందోళన
17.6 వెనుకబడిన తరగతుల ఉద్యమం
17.6.1 మురళీధరరావు కమీషన్
17.7 రిజర్వేషన్ వ్యతిరేక ఉద్యమం
17.8 మండల్ కమీషన్
17.9 దళిత ఉద్యమాలు
17.10 విద్యార్థి - యువత ఉద్యమాలు
17.11 మహిళా సారా వ్యతిరేక ఉద్యమం
17.12 సారాంశం
17.13 నమూనా ప్రశ్నలు
17.14 చదువదగిన గ్రంథాలు


**17.1 పరిచయం :**

నిరసన ఉద్యమాలలో సాధారణంగా మనకు కనిపించేది సామూహిక చర్య. ఈ సామూహిక చర్య కొంతకాలం కొనసాగినట్లయితే అది ఉద్యమరూపం ధరిస్తుంది. ఈ సామూహిక చర్య ప్రక్రియా పరంగా వ్యవస్థాపితం కాకపోవచ్చు. కాని అది జనసామాన్యంలో ఆసక్తిని, జాగృతిని కలిగించేటట్లు ఉండాలి. భావనాపరంగా ఆలోచిస్తే, నిరసన ఉద్యమం మార్పుకోసం, ప్రస్తుత

వ్యవస్థ కొంతవరకూ మార్పును తీసుకురావడానికి లేదా పూర్తి మార్పును తీసుకురావటానికి జరిగే ప్రయత్నమని చెప్పవచ్చు. ఎమ్.ఎస్. ఎ. రావు అభిప్రాయంలో " సాంఘిక మార్పులు ఉద్యమంలో ఒక భాగంలో వచ్చినవి. అటు తర్వాత అవి సమాజంపై కలిగించే ప్రభావం మనం గమనించాలి". రైతాంగ మరియు నిరసన ఉద్యమాల అధ్యయనంలో ముఖ్యంగా గమనించవలసినవి : 1. అవి ఎట్లా ప్రారంభమైనాయి. 2. వాటి నిర్మాణాత్మక పరిస్థితులు, 3. ఏ ఆశయాలు, లక్ష్యాలు వాటిని పోత్సహించాలి. 4. వాటిని ప్రారంభించటానికి దారి తీసిన పరిస్థితులు మరియు నిరసన ఉద్యమాలు సమాజంపై కలిగించే ప్రభావము.

**17.2 జమీందారీ ఆవిర్భావం :**

బ్రిటీష్ వారు వ్యవసాయ సంబంధాలలో విప్లవాత్మకమైన మార్పులు తీసుకొచ్చారు. 1764 బక్సార్ వద్ద జరిగిన యుద్ధంలో ఓడిపోయిన ఢిల్లీ పాదుషాను లార్డ్‌క్లైవ్ బెదిరించి సర్కారు జిల్లాలలో శిస్తులు, పన్నులు వసూలు చేసే దివానీ దివానీ హక్కులు బ్రిటీష్ కంపెనికి సంక్రమించేలా సంధి పత్రం మీద సంతకం చేయించాడు. 1766లో బ్రిటీష్ సైన్యాధిపతి కల్నర్ ఫోర్ట్ ఫ్రెంచివారిని ఓడించి బందరు పై అధికారాన్ని చెలాయిస్తూ, హైదరాబాదు నవాబును తనవైపు తిప్పుకొన్నాడు. సర్కారు జిల్లాల మీద ఆంగ్లేయుల అధికారం 1770లో ఆరంభమైంది. బ్రిటీష్‌వారు పన్నులు వసూలుచేసే హక్కులను ఏయేటికాయేడు వేలం వేసేవారు. దీనినే ఇజారా మొత్తాలనేవారు. ఇజారా మొత్తాలు పెరిగిన కొద్దీ రైతుల శిస్తు భారం పెరిగింది.

బ్రిటీష్‌వారు ప్రవేశపెట్టిన రెవిన్యూ పద్ధతి వల్ల పంటభూములపై గ్రామ సంఘాలకు పూర్వం నుంచి ఉన్న హక్కులన్నీ తొలగిపోయాయి. వ్యక్తిగతమైన భూస్వామ్యాన్ని ప్రవేశపెట్టారు. గ్రామ సంఘాలనుంచి పూర్వపు రాజులకు రెవెన్యూలను వసూలు చేసి పెట్టేవారనే కమీషన్ పద్ధతుల మీద ఒక రకం భూస్వాములుగా బ్రిటీష్‌వారు తయారు చేశారు. ఈ భూస్వాములు సాలీనా కొంత మొత్తం బ్రిటీష్ అధికారులకు చెల్లించేవారు. కాని ఈ భూస్వాములనుంచి రెవిన్యూ కింద ఒకే మొత్తాన్ని వసూలు చేయడం నష్టమని గుర్తించడంతో కొంత కాలానికి బ్రిటీష్ పాలకులు కొత్త పద్ధతులను ప్రవేశ పెట్టారు. వీనినే రైత్వారీ సెటిల్ మెంట్ పద్ధతులన్నారు. అంతకు ముందు రెవిన్యూ అనేది గ్రామం మొత్తం మీద వసూలు జరిగేది. కాని ఈ రైత్వారీ పద్ధతివల్ల వ్యక్తిగతమైన రెవిన్యూ వసూలు మొదలయింది. దీనితో ప్రజా సంస్థలయిన గ్రామ పంచాయితీల పలుకుబడి తగ్గింది. పంటలు పండినా, పండకపోయినా, భూమిని సాగుచేసినా, చెయ్యకపోయినా సాలీనా రొక్కంగా కొంత మొత్తం చెల్లించి తీరాలనే పద్ధతి అమలులోకి వచ్చింది. దీనివల్ల భూముల అమ్మకాలు, తనఖాలు, వేలం పాటలు పెరిగిపోయాయి. తగాదాల పరిష్కారానికి గ్రామ పంచాయితీలకు బదులు కోర్టులనేవి అమలులోకి వచ్చేసరికి గ్రామ సమష్టి జీవనం దెబ్బతిన్నది. వ్యక్తి జీవితంలో కొత్త అవసరాలు, కొత్త విలువలు ఏర్పడ్డాయి. " అమ్మకం " అనేది లక్ష్యంగా " మార్కెట్"లో వస్తువుల తయారీకి ఉపయోగపడే పంటలు పండించే పద్ధతి ప్రారంభమైంది. వ్యవసాయక, పారిశ్రామిక సంబంధాలలో మార్పులు వచ్చాయి. రాకపోకల సౌకర్యాలు, వార్తా సౌకర్యాలు పెరిగాయి. ఒక విధంగా చెప్పాలంటే వ్యవసాయంలో వాణిజ్యం విప్లవం మొదలయింది.

**17.3 రైతుల ఉద్యమాలు :**

వ్యక్తుల యాజమాన్యం కింద ఉండే కమతాల విస్తీర్ణాలలో తేడాలు చిన్న రైతులను, పెద్ద రైతులను సృష్టించాయి. క్రమేణా చిన్న రైతులు కౌలుదారులుగా మారడం జరిగింది. విదేశాలలో యంత్రాలనుపయోగించి చేసిన సరుకుల ప్రాబల్యంవల్ల గ్రామీణ పరిశ్రమలు దెబ్బతిని వృత్తి వర్గాలు చితికిపోయాయి. అవృత్తులవారు కూడ వ్యవసాయంపై ఆధారపడటంతో వ్యవసాయ కూలీ సమస్యలు, కౌలుదారీ సమస్యలు జన జీవనాన్ని చుట్టు ముట్టాయి. వ్యవసాయానికి చాలని పొలం, అదీ అక్కడొక చెక్క, ఇక్కడొక ముక్కగా ఉన్నా వ్యయప్రయాసాలను లెక్కచెయ్యకుండా రైతులు వ్యవసాయం చేస్తున్నారు. ఆధునిక వ్యవసాయ పద్ధతులను అనుసరించడం శక్తికి మించిన పని అవడంతో వ్యవసాయ పద్ధతిలో ఆధునీకరణ లేక పోవడంతో రైతు బీదగానే మిగిలిపోతున్నాడు. జమీందార్లు భూస్వాములు, ఇజారా దార్లు, వడ్డీ వ్యాపార్ల కింద మధ్య రైతులు నలిగి పోయారు. ఉత్తర సర్కారుల్లోను, నెల్లూరు,

చిత్తూరు, జిల్లాలలోను గల జమీందార్లు ప్రభువులయ్యారు. అడవులు, చెరువులు, బంజర్లు వారి స్వాధీనంలోకి వచ్చాయి. శిస్తులకోసం రైతుల నిర్బంధాలు ఎక్కువయ్యాయి.

**1811-41** మధ్య కాలంలో కరువులవల్ల లక్షలాది ప్రజలు మరణించారు. కృష్ణా, గోదావరిజిల్లాల్లో రైతులు పొలాలను పాడుపెట్టడంతో వ్యవసాయ ఆదాయం లేకుండా పోయింది. ప్రజలు రామ దండులుగా ఏర్పడి ప్రచారం చేశారు. ప్రజలు ఆకులు, దుంపలు, కాయలు, తింటూ మజ్జిగ తాగుతూ బ్రతికారు. దీనితో జమీందార్ల ఆదాయం పూర్తిగా తగ్గడం - తద్వారా కంపెనీ ప్రభుత్వ ఆదాయం కూడా తగ్గింది. దీనిని మనం ఒక అపూర్వమైన మార్పుగా చెప్పుకోవచ్చు. కంపెనీ, ప్రభుత్వ వైఖరిలోను, జమీందారీ వైఖరిలోను మార్పులు తీసుకొని వచ్చింది. భూముల సారాన్ని బట్టి శిస్తులు వసూలు చేయడానికి అంగీకరించడమే కాకుండ కృష్ణ, గోదావరి ఆనకట్టలు నిర్మించడానికి కూడ ప్రభుత్వం వారు పూనుకొన్నారు.

స్వాతంత్ర్యానికి ముందునుంచి ఆంధ్రప్రదేశ్‌లో రైతు పోరాటాలు జరుగుతూనే ఉన్నాయి. ఆంధ్రదేశంలో **40%** భూభాగానికి పైగా జమీందార్లు, జాగీర్దార్లు, దేశముఖ్‌ల కింద ఉండేది. వీరు రైతులపై అధిక శిస్తులు విధించి, వెట్టిచాకిరీ చేయించుకొని, రైతులను, కూలీలను ఆర్థికంగా, సాంఘికంగా అణచివేశారు. దీనికి ప్రతిచర్యగా పలు ప్రాంతాలలో రైతులు తిరుగుబాటు చేశారు. అయితే రైతు సంఘాలు ఏర్పడడంతో అంతకు పూర్వం కన్న నిర్మాణాత్మకమైన పద్ధతిలో రైతుపోరాటాలు జరిగాయని చెప్పవచ్చు.

రైతు పోరాటాలు ఆంధ్రప్రదేశ్‌లో 18వ శతాబ్దంలోనే మొదలయ్యాయి. కాని ఆంధ్ర రైతాంగం 1920-21లో జరిగిన మహాత్మాగాంధీ సహాయనిరాకరణోద్యమంలో చేరడంతో జాతీయోద్యమంలో భాగంగా పరిగణ పొందింది. ఈమలుపుతో రైతాంగంలో రాజకీయ చైతన్యం కలిగిందని చెప్పుకోవచ్చు. 1923 నాటికల్లా గుంటూరు, కృష్ణ ఉభయ గోదావరుల్లో రైతు సంఘాలు ఏర్పడ్డాయి. అయితే 1928లో రాష్ట్రరైతు సంఘానికి పునాది వేయబడింది. రైతు సంఘం సభ్యులు జమీందారీ దోపిడీలకు వ్యతిరేకంగా పోరాటాలు సాగించారు. స్వాతంత్ర్యానంతరం రైతులలో రాజకీయ చైతన్యం పెరగటం వలన రైతాంగ ఉద్యమాల తీవ్రత, చురుకుతనం పెరిగాయి.

## 17.4 ఆంధ్రప్రదేశ్‌లో రైతాంగ ఉద్యమాలు :

స్వతంత్ర భారతదేశంలోని ప్రభుత్వ విధానాల్లో చాలా మార్పులు వచ్చాయి. గతంలో పరిపాలించిన వలస పాలకులు తమ స్వార్థ ప్రయోజనాల కోసం గ్రామీణ రైతాంగాన్ని పీడించారు. స్వరాజ్యంలో ప్రభుత్వం ప్రజా సంక్షేమ కార్యక్రమాలను చేపట్టింది. అధిక ఉత్పత్తులను సాధించటం, నూతన సాగు పద్ధతులను రూపొందించటం, భారీ నీటిపారుదల సౌకర్యాలను వృద్ధి చేయటం గ్రామీణ ప్రాంతాల్లో విద్యావకాశాలను విస్తరింపచేయుటం, వైద్య సదుపాయాలు కల్పించటం, స్థానిక సంస్థల పరిపాలనను ప్రవేశపెట్టడం ద్వారా ప్రజలలో రాజకీయ చైతన్యాన్ని పెంపొందించటం, సాగుకు యోగ్యమైన భూమి విస్తీర్ణం పెంపొందించటం, మార్కెట్లు విస్తరింపచేయటం, అధిక దిగుబడినిచ్చే వంగడాలను ప్రయోగాల ద్వారా తయారు చేయటం ద్వారా, తద్వారా ఉత్పత్తులను పెంపొందించటం లాంటి అనేక గ్రామీణ పునర్నిర్మాణ కార్యక్రమాలను వివిధ పంచవర్ష ప్రణాళికలలో లక్ష్యాలుగా పెట్టుకొని పనిచేయుటం జరిగింది.

అయితే వాస్తవానికి ఇవన్నీ అమలులో ఉన్నావా' అనుకున్న ఫలితాలు వస్తున్నవా? అనేది ప్రధానమైన ప్రశ్న. స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత భూసంస్కరణలు అమలు జరపాలనేది పాలకుల లక్ష్యం అయినప్పటికీ చిత్తశుద్ధితో అమలు జరపలేక పోతున్నారు. భూమి కేవలం కొందరి చేతిలోనే కేంద్రీకృతమయింది. దీనివల్ల అధిక శాతం ప్రజానీకం వ్యవసాయం చేయటానికి తగినంత భూమిలేక కౌలుదారులుగా, వ్యవసాయ కూలీలుగా మారాల్సి వచ్చింది. దీనితోపాటు కొన్ని కులాలకు చెందిన ప్రజలు సామాజికంగా, ఆర్థికంగా బలంగా ఉన్నవారి దోపిడికి గురవుతున్నారు. వీరు చేసే పనికి సరైన వేతనాలు పొందలేక పోతున్నారు.

మార్కెట్టు విషయాన్ని చూసినపుడు జిల్లా కేంద్రంలో మార్కెట్లు కేంద్రీకరించబడి ఉన్నవి. తగిన రవాణా సౌకర్యాలు అందుబాటులో లేనందువల్ల గ్రామీణ రైతాంగం తాము పండించిన పంటను మార్కెట్టుకు చేరవేయలేక గ్రామాలలోని షావుకారులకు తక్కువ ధరలకు అమ్ముకుంటున్నారు. ఒకవేళ అనేక వ్యయప్రయాసలకోర్చి మార్కెటుకు తెచ్చినప్పటికీ దళారీల దోపిడి మాత్రం తప్పడం లేదు. విద్యుత్ సరఫరా, నీటి పారుదల సౌకర్యాలు చాలినంతగా అభివృద్ధి చెందక పోవటంతో రైతులు వర్షాలమీద ఆధారపడి బ్రతకాల్సి వస్తున్నది. ఈ విధంగా గ్రామీణ రైతాంగం అనేక ఇబ్బందులను ఎదుర్కొంచున్నది. మరొకవైపు ఈనాడు ప్రజానీకంలో రాజకీయ చైతన్యం కూడా పెరిగింది. తమ జీవితాలను మెరుగు పరుచుకోవటానికి రైతాంగం ముందుకొస్తున్నది. అసంతృప్తి ఆధారంగా దేశంలోని వివిధ సంస్థలు రైతాంగాన్ని సంఘటిత పరచి ఉద్యమాలు నడుపుతున్నాయి. వీటిని మూడు రకాలుగా విభజించవచ్చు.

### 17.4.1 వామపక్ష ప్రేరిత ఉద్యమాలు :

ప్రధానంగా వామపక్ష ప్రేరిత ఉద్యమాల్లో 1969లో జరిగిన శ్రీకాకుళం, నక్సల్ బరీ ఉద్యమాలను పేర్కొనవచ్చును. ఈ ఉద్యమాలు హింసాయుత పద్ధతులతో సుమారు మూడు సంవత్సరాలపాటు సాగాయి. హింస ప్రజ్వరిల్లడానికి నాడు ఉన్న సామాజిక పీడన తీవ్రస్థాయిలో ఉండటమే ప్రధాన కారణమని భావించవచ్చు. ఈ రైతాంగ ఉద్యమాలు చాలా ముఖ్యమైన సమస్యల్ని పరిష్కరించటానికి తోడ్పడినవి. అపరిష్కృతమైన భూమి సమస్య, జోతేదారుల, షావుకారుల, వడ్డీవ్యాపారం దోపిడి, అటవీ, ఎక్సైజ్ అధికారుల లంచగొండి తనం, స్థానిక భూస్వాముల నిరంకుశత్వం లాంటి అనేక సమస్యలను ఈ ఉద్యమాలు వెలుగులోకి తెచ్చాయి. ఈ ఉద్యమాలు తాత్కాలికంగా అణచివేయబడినప్పటికీ ప్రభుత్వం గ్రామీణ అభివృద్ధి పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించే విధంగా చేశాయి.

సి.పి.ఐ., సి.పి.ఎం వామపక్ష రాజకీయ పార్టీలకు అనుబంధంగా రైతుకూలీ సంఘాలు ఏర్పడి రైతాంగ సమస్యల్ని వెలుగులోకి తెచ్చాయి. రైతుల, వ్యవసాయ కూలీల సమస్యల మీద స్థానికంగా, అఖిలభారత స్థాయిలోనూ అనేక ఉద్యమాలు నడుస్తున్నాయి. వామపక్ష రైతాంగ సంఘాలు చేపట్టిన ప్రధాన సమస్యలు : 1. భూ సంస్కరణల అమలు 2. పండించే పంటలకు గిట్టుబాటు ధరలు 3. చిన్నకారు, సన్నకారు రైతుల అప్పులు రద్దు చేయటం 4. వ్యవసాయ కూలీలకు సరియైన వేతనం 5. ఇరిగేషన్, వరద నిరోధక చర్యలు తీసుకోవటం 6. విద్యుత్ సరఫరా మొదలైనవి. వీటితోపాటు ప్రజలను సామాజిక ఆర్థిక దోపిడీ నుండి కాపాడటం వంటి లక్ష్యాలు ఉద్యమాలకు బలం చేకూర్చాయి. ఈ ఉద్యమాలలో రైతాంగ సమస్యలను ప్రస్ఫుటం చేయటం కోసం ప్రదర్శనలు, ఊరేగింపులు, హర్తాళ్ బహిరంగ సభలు ఉద్యమ ఆందోళన రూపాలుగా ముందుకు వచ్చాయి.

### 17.4.2 వామపక్షేతర ఉద్యమాలు :

ఈనాడు భారతదేశంలో ఉన్న దాదాపు అన్ని రాజకీయ పర్టీలకు అనుబంధంగా రైతు సంఘాలున్నాయి. బి.జె.పి.కి ' భారతీయ కిసాన్ సంఘం ', టి.డి.పి.కి ' తెలుగు రైతు ', ఉభయ కమ్యూనిస్& పార్టీలకు రైతు సంఘాలు ఉన్నాయి. ఈ రైతు సంఘాలు ఎక్కువగా మధ్య తరగతి రైతాంగం ఎదుర్కొంటున్న సమస్యల మీద దృష్టిని కేంద్రీకరిస్తున్నాయి. రైతు పండించిన పంటకు గిట్టుబాటుధరలు, నీటి పారుదల, విద్యుచ్ఛక్తి, మార్కెట్ల విస్తర్ణ, అప్పుల మాపీ లాంటి అంశాలమీద ఉద్యమాలు నడుపుతున్నవి. ఈ సంఘాలు నిర్వహించే ఉద్యమాలలో ఆయా పార్టీల కార్యకర్తలే ఎక్కువగా పాల్గొంటున్నట్లుగా తెలుస్తుంది. ' భారతీయ కిసాన్ సంఘ్ ' రైతాంగ సమస్యలపై ఎక్కువగా దృష్టిని కేంద్రీకరిస్తుంది. అయితే ఈ రైతు సంఘాలు చాలా వరకు వ్యవసాయ రంగంలో పనిచేసే కూలీల వేతనాల విషయంలో శ్రద్ధ తీసుకోవటం లేదేమో అనిపిస్తుంది.

### 17.4.3 స్వతంత్ర రైతాంగ ఉద్యమాలు :

వ్యవసాయంలో పెట్టుబడిదారీ ధోరణులు పెరుగుతున్న కొద్దీ రైతుల కోసం పోరాడే స్వతంత్ర రైతాంగ సంఘాలు ఆవిర్భవించాయి. ఈ సంఘాలు ఏర్పడటానికి ప్రధానమైన కారణాలు కొన్ని ఇక్కడ పేర్కొంటున్నాము. వ్యవసాయంలో పెట్టుబడులు అధికంగా పెట్టవలసి రావటం, వ్యవసాయ దారుడు పండించిన పంటలకు గిట్టుబాటు ధరలు లేకపోవటం, ప్రకృతి బీభత్సాలు ఏర్పడినపుడు రైతును ఆదుకునేందుకు భీమా తదితర పథకాలు లేకపోవటం, విద్యుచ్ఛక్తి కొరతవల్ల రైతులు సకాలంలో వ్యవసాయ పనులు చేసుకోలేక పోవడం వంటి వాటితోపాటు వాణిజ్య పంటలకు అధిక పెట్టుబడులు పెట్టవలసి రావడం, చివరికి ఆ పంటల ధరలు స్థిరంగా ఉండక రైత్యాంగం చాలా నష్టాలకు గురికావడం వంటి వన్నీ ఈ సంఘాల ఆవిర్భావానికి కారణమయ్యాయి. ఈ సంఘాలలో ఒకటి తమిళనాడులో నారాయణస్వామి నాయుడు నాయకత్వంలో " తమిళనాడు వ్యవసాయ దారుల సంఘం ". ఈ సంఘం 1974 నుంచి 1982 వరకు విద్యుత్ బకాయీల లోరీ ఛార్జీలు, కాల్పులు జరిగాయి. ఉద్యమంలో సుమారు 35 మంది మరణించారు. కర్నాటకలో, రుద్రప్ప నాయకత్వంలో కర్నాటక రాజ్య రైతు సంఘం, మహారాష్ట్రంలో శరద్‌జోషి నాయకత్వంలో షేత్‌కారి సంఘటన, గుజరాత్‌లో ఖేదర్ సమాజ్, పంజాబ్‌లో ఖేత్‌కారీ జమిందారీ యూనియన్ మొదలైన రైతు సంఘాలు 1980-81లలో ఏర్పడినవి. పశ్చిమ ఉత్తర ప్రదేశ్‌లో మహేందర్ సింగ్ తికాయత్ నాయకత్వంలో భారతీయ కిసాన్ యూనియన్ ఏర్పడింది.

పైన పేర్కొన్న స్వతంత్ర రైతు సంఘాలన్నీ కూడా విద్యుత్ సరఫరా పెంచాలని, విద్యుత్ ఛార్జీలు తగ్గించాలని, పంటలకు గిట్టుబాటు ధరలు కల్పించాలని, అప్పుల బారినుండి రైతాంగాన్ని విముక్తి చేయాలని డిమాండ్ చేశాయి. పార్టీలనుంచి ప్రేరణ పొందిన రైతు సంఘాలు భూసంస్కరణలు అమలు జరగాలని గట్టిగా కోరుతున్నవి. వ్యవసాయ కార్మికులకు న్యాయమైన వేతనాలు ఇవ్వాలని కోరుతున్నారు. షెడ్యూల్డ్ కులాలు, జాతుల మీద జరుగుతున్న భూస్వామ్య ధనిక రైతుల దాడులను ఎదిరిస్తున్నారు. పల్లెప్రాంతాలలోని సన్నకారు రైతులను, కూలీలను సంఘటిత పరచటానికి కృషి చేస్తున్నారు.

స్వతంత్ర రైతాంగ సంఘాలు భూసంస్కరణలను గురించి మాట్లాడటం లేదు. ఈ సంఘాలు అటు పంటలకు గిట్టుబాటు ధరలు, మార్కెట్ల విస్తరణ గురించే ఎక్కువగా అడుగుతున్నాయి. వ్యవసాయ కూలీల వేతనాలను గురించి ఈ ఉద్యమకారులు పట్టించుకోవటం లేదు. పట్టణాలూ, పల్లెల మధ్య పెరుగుతున్న వ్యత్యాసానికి వ్యతిరేకంగా వీరు ఆందోళన చేస్తున్నారు. సన్నకారు, చిన్నకారు రైతులను సంఘటిత పరచి తమ సంఘాల బలాన్ని పెంచుకొని రాజకీయ ప్రయోజనాలు పొందటానికి కూడా వీరు కృషి చేస్తున్నట్లు ఈ మధ్యకాలంలో జరిగిన సంఘటనలు విశదపరుస్తున్నాయి.

ఈ వైవిధ్యాలు ఎట్లా ఉన్నప్పటికీ ఆధునిక కాలంలో రైతాంగ ఉద్యమాలు ప్రభుత్వ దృష్టికి ఆకర్షిసుతన్నది. కొంతవరకు ఈ ఉద్యమాల ఫలితంగా రైతుల సంక్షేమం కోసం ప్రభుత్వాలు కృషిచేయ్యవలసి వస్తున్నది. దానితోపాటు గ్రామీణాభ్యున్నతి కార్యకలాపాలుకూడా ఉధృతమయ్యాయి. అందువల్ల భారత రైతాంగ సమాజంలో ప్రస్ఫుటం అయ్యే ఈ ఉద్యమాల వెనుక ఆయా రైతాంగ వర్గాల సమస్యలు ఉన్నాయని వాటిని వ్యక్తీకరించటానికి వివిధ పార్టీలు, సంఘాలు ఉద్యమిస్తున్నాయని గ్రామీణ విషయాల విధాన రచయితలు గమనించాలి.

**17.5 విశాఖ స్టీల్ ప్లాంట్ ఆందోళన :**

ప్రజలలో రగులుకుంటున్న అసంతృప్తి ఉద్యమ రూపం దాలిస్తే కేంద్రప్రభుత్వం దిగిరాక తప్పదని విశాఖ ఉక్కు ఆందోళన నిరూపించింది. ఆంధ్రుల చైతన్యస్థాయికి ప్రతీకగా నిలిచే ఉక్కు ఆందోళన రాష్ట్ర చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోయింది.

ఉక్కు ఆందోళనని ప్రారంభంలో ప్రజలే నడిపారు. ప్రజలలో వచ్చిన చైతన్యం ఆందోళన రూపం దాల్చిన తరువాతనే రాజకీయ నాయకులు రంగప్రవేశం చేశారని ఆనాటి ఉక్కు ఉద్య చరిత్రను పరిశీలిస్తే స్పష్టపడుతుంది. 1966వ సంవత్సరంలో ఉక్కు ఆందోళన ఊపందుకుంది. ఆ ఏడాది అక్టోబర్, నవంబర్ నెలల్లో సాగిన ఆందోళన యావత్ ఆంధ్రప్రాంతాన్ని ప్రభావితం

చేసింది. ఆందోళనలో ప్రతిచోటా విద్యార్థుల పాత్ర ఎక్కువగా ఉంది. ఉక్కు ఆందోళన ఊపందుకున్న 1966 సంవత్సరంతో నేటి పరిస్థితులను పరిశీలిస్తే ఆనాటి ప్రజల చైతన్యస్థాయి అర్థమవుతుంది.

భారీ పరిశ్రమల కేటాయింపులతో ఆంధ్రప్రాంతం నిర్లక్ష్యానికి గురవుతుండడంతో అప్పటికీ ఆంధ్రులలో అసంతృప్తి రగులుకున్నది. ఈ నేపథ్యంలో రేవు వసతి అవసరమైన ఉక్కు కర్మాగారాన్ని విశాఖపట్నంలో నిర్మించాలని ఆంగ్లో అమెరికన్ కన్సార్టియం వారు చేసిన సిఫారసులు ప్రజలలో ఆశలను చిగురింప చేసాయి.

రాజకీయ కారణాలపై విశాఖ ఉక్కు ఫ్యాక్టరీని నెలకొల్పడం లేదని తెలియ రావడంతో అప్పటివరకు ఆంధ్రులలో పెరుగుతూ వస్తున్న అసంతృప్తి ఒకసారిగా రగులుకొంది. ప్రజలంతా చైతన్యవంతులై ముందుకు కదిలి ఆందోళనలు జరపసాగారు. " విశాఖ ఉక్కు హక్కు " అన్న నినాదంతో ప్రారంభమైన ఆందోళన యావత్ రాష్ట్రాన్ని ప్రభావితం చేసింది. విశాఖ ఉక్కు కర్మాగారం కోసం యావత్ రాష్ట్రం ప్రతిస్పందిస్తుండడంతో 1966 సంవత్సరం అక్టోబర్ నెలలో గుంటూరు గాంధీ మిషన్‌కు చెందిన టి. అమృతరావు విశాఖపట్నం వచ్చి జిల్లా కలెక్టరు కార్యాలయం వద్ద నిరవధిక నిరాహార దీక్ష ప్రారంభించారు. విద్యార్థులు సైతం ముందుకు రావడంతో అప్పటి వరకు అంటీ ముట్టనట్టుగా వ్యవహరిస్తున్న రాజకీయ పార్టీలు కూడా కదిలాయి. ఆందోళన తీవ్రరూపం దాల్చింది. ఎగిసిపడుతున్న ఆందోళన జ్వాలలను అదుపు చేయడం అప్పటి రాజకీయ నాయకులకు సైతం కష్ట సాధ్యమయింది. రాజకీయ పార్టీలన్నీ కలిసి అఖిలపక్ష కమిటీగా ఏర్పడ్డాయి. ప్రముఖ నాయకులు తెన్నేటి విశ్వనాథం, ఎం. వి. భద్రం, పైడితల్లి నాయుడు, వెంకటప్పయ్యనాయుడు, టి.ఎస్.ఎన్. రాజు తదితరులతో కమిటీ ఏర్పడింది. స్థానిక టర్నర్ చౌల్ట్రీల్ కమిటీ కార్యాలయం ఏర్పాటు అయింది. 1966 నవంబరు 1వ తేదీన అఖిలపక్ష కమిటి సంపూర్ణ బంద్‌కు పిలుపు నివ్వడంతో చరిత్రలో నిలిచిపోయేలా చేసిన సంఘటన బంద్‌రోజున జరిగింది. ఆగ్రహంతో ఎగిసిపడుతున్న ప్రజలను చూసి అప్పటి జిల్లా కలెక్టరు అబిద్‌హుస్సేన్ నగరంలో 144 సెక్షన్ విధించారు. అయినా ప్రజలు చలించకుండా ముందుకు కదిలారు. బంద్ నిర్వహిస్తున్న ప్రజాసమూహం వేలంపేటలోని పోస్టాఫీసుకు చేరినపుడు అక్కడ ఉన్న సాయుధ రిజర్వు పోలీసులతో గొడవ జరగడంతో పోలీసులు తుపాకులు ఎక్కుపెట్టి కాల్పులు జరిపారు. ఈ దుర్ఘటనలో తొమ్మిది మంది సంఘటనాస్థలంలోనే మృతి చెందగా పలువురు గాయపడ్డారు. ఈ విషయం క్షణాలమీద నగరమంతా వ్యాపించింది. ఆవేశంతో కదం తొక్కుతున్న ప్రజలను అదుపు చేయడానికి బహిరంగ సభ జరపాలని, తెన్నేటి విశ్వనాధం నిర్ణయించి అదేరోజు సాయంత్రం మున్సిపల్ స్టేడియంలో సభ జరిపారు. నగరంలో సభకు అనిపతించారు. ఆనాటి బహిరంగ సభకు అశేష ప్రజానీకం హాజరయ్యారు. సభలోనే అఖిలపక్ష కమిటీ నిరవధిక సంపూర్ణ బందెకు పిలుపు ఇచ్చింది. విశాఖ కాల్పుల సంఘటన తెలిసి హైద్రాబాద్, విజయవాడ పట్టణాల్లో కూడా ఆందోళన ఊపందుకుంది. రాష్ట్రవ్యాప్తంగా బంద్ జరిగింది, రైళ్ళు, బస్సుల రాకపోకలు నిలిచపోయాయి. ప్రభుత్వం, ప్రయివేటి కార్యాలయాలు, పరిశ్రమలు పనిచేయలేదు.

పోలీసు కాల్పుల్లో మరణించినవారి మృతుదేహాలను వారి కుటుంబాలకు అప్పగించడానికి సైతం ప్రభుత్వం జంకింది. అప్పటి ముఖ్యమంత్రి బ్రహ్మానందరెడ్డి ఒక పథకం ప్రకారం వ్యవహరించారు. అయిదవ తేదీన మృతదేహాలను బంధువులకు అప్పగించి అంత్యక్రియలకు హాజరవడానికి నాయకులంతా స్మశానానికి వెళ్ళిన సమయంలో బ్రహ్మానందరెడ్డి ప్రత్యేక విమానంలో విశాఖ వచ్చారు. నిరహారదీక్ష చేస్తున్న అమృతరావు దీక్ష విరమింపజేశారు. ఈ విషయం తెలిసి ప్రజలు మరింత చైతన్య వంతులై " విశాఖ ఉక్కు ఆంధ్రుల హక్కు " అన్న తమ నినాదాన్ని యావత్ భారదేశానికి చాటి చెప్పడంతో ప్రభుత్వానికి దిగిరాక తప్పలేదు.

**17.6 వెనుకబడిన తరగతుల ఉద్యమం :**

ఆంధ్రరాష్ట్రం, ఉమ్మడి మద్రాస్ రాష్ట్రంలో కలిసి ఉన్నప్పుడు అప్పటి ప్రభుత్వం వెనుకబడిన తరగతుల వారికి కొన్ని ప్రత్యేక సదుపాయాలు కల్పించింది. ఆంధ్రరాష్ట్రం కొంత భాగం ఉమ్మడి రాష్ట్రంలో 1953 సెప్టెంబర్ 30 వరకు కలిసి ఉంది.

మద్రాస్ ప్రభుత్వం 1724 నుంచి స్వాతంత్ర్యం వచ్చేవరకు సీట్లను కులమతాల పరంగా కేటాయించే విధానాన్ని అమలు చేసింది. తరువాత వెనుకబడిన తరగతుల వారి డిమాండు మేరకు ఆ విధానాన్ని సవరించి కొనసాగించింది.

1953లో ప్రత్యేక ఆంధ్రరాష్ట్రం ఏర్పడింది. మద్రాస్ రాష్ట్ర విధానాన్నే కొద్ది మార్పులతో ఆంధ్ర ప్రభుత్వం కొద్దికాలం కొనసాగించింది. హైద్రాబాదు రాష్ట్ర ప్రభుత్వంలో కూడా వెనుకబడిన తరగతుల వారికి రిజర్వేషన్‌లు కల్పించబడ్డాయి. రెండు ప్రత్యేక విధానాలు ఆంధ్రప్రదేశ్ ఏర్పడే వరకు కొనసాగాయి. 1956 నవంబర్ 1న ఆంధ్రప్రదేశ్ ఏర్పడిన తరువాత ఆంధ్రప్రదేశ్ వెనుకబడిన తరగతులవారి కోసం రెండు ప్రత్యేక జాబితాలను తయారు చేసింది. 86 కులాలతో ఒక జాబితాను ఆంధ్రప్రాంతానికి మరొక జాబితాను తెలంగాణా ప్రాంతానికి వర్తింపజేసింది.

రిజర్వేషన్‌లకు సంబంధించి కేంద్రప్రభుత్వం 1953లో కాకాసాహెబ్ కలేల్కర్ కమీషన్‌ను నియమించింది. కమీషన్ సమర్పించిన నివేదిక ఆధారంగా కేంద్ర ప్రభుత్వం ఎలాంటి విధానాన్నీ వెంటనే ప్రకటించక పోయినప్పటికి స్థానిక స్థితిగతులనుబట్టి వెనుకబడిన తరగతుల జాబితాను తయారు చేసుకోవాలని 1961లో రాష్ట్ర ప్రభుత్వాలకు సూచించింది.

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం 139 కులాలను వెనుకబడిన తరగతులుగా గుర్తిస్తూ వారికి 25 శాతం రిజర్వేషన్ ముఖ్యంగా మెడికల్ కాలేజీలలో కల్పిస్తున్నట్టుగా 1963 సెప్టెంబర్ 21న ఉత్తర్వు జారీచేసింది. ప్రభుత్వం ప్రకటించిన కులం ప్రాతిపదిక రిజర్వేషన్ ప్రభుత్వ ఉత్తర్వును కొందరు హైకోర్టులో సవాల్ చేశారు. ఈ ఉత్తర్వు చెల్లదని సుఖదేవ్ గవర్నమెంట్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ కేసులో హైకోర్టు తీర్పునిచ్చింది. ఉత్తర్వు కులప్రాతిపదికగా ఉందని ప్రభుత్వం వెనుకబడిన తరగతులులను నిర్ధారించడానికి నిర్దిష్టమైన పద్ధతిని పాటించలేదని కోర్టు అభిప్రాయ పడింది. వెనుకబడిన తరగతులను ఆర్థిక ప్రాతిపదికపైనే నిర్ధారించాలన్న ఉద్దేశ్యంతో రాష్ట్ర ప్రభుత్వం మరో ఉత్తర్వు జారీ చేసింది.

ఈ రిజర్వేషన్‌లను మొదట విడతగా పది సంవత్సరాలు అమలు చేయాలని, సెప్టెంబర్ 27, 1970 నుంచి సెప్టెంబర్ 23, 1980 వరకు అమలు చేసి, ఆ తర్వాత సమీక్షించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. దీనిని కూడా హైకోర్టులో కొంతమంది సవాలు చేశారు. ఉత్తర్వు చెల్లదని హైకోర్టు తీర్పు చెప్పింది. ప్రభుత్వం హైకోర్టు తీర్పుపై సుప్రీంకోర్టుకు అప్పీలు దాఖలు చేయగా హైకోర్టు తీర్పును తిరస్కరించింది. ప్రభుత్వ ఉత్తర్వు రాజ్యాంగ బద్ధమేనని సుప్రీంకోర్టు తీర్పు చెప్పింది. ప్రభుత్వం నేటికీ ఆ ఉత్తర్వునే అమలు చేస్తున్నది.

### 17.6.1 మురళీధరరావు కమీషన్ :

మైనారిటీలను వెనుకబడిన తరగతుల జాబితాలో చేర్చాలో లేదో పరిశీలించడానికి, వెనుకబడిన తరగతుల వారి అభివృద్ధిని సమీక్షించడానికి ప్రభుత్వం ఏకసభ్య సంఘాన్ని నియమించింది. దీనికి మురళీధరరావును అధ్యక్షునిగా నియమిస్తూ జనవరి 12, 1982 ఉత్తర్వు జారీ చేసింది. ఈ సంఘం 1982 జనవరి 27న బాధ్యతలు చేపట్టింది. సమాచారాన్ని సేకరించడానికి ప్రశ్నావళిని రూపొందించింది. సామాజిక విద్య, ఉద్యోగ, రాజకీయ, ఆర్థిక విషయాలకు సంబంధించిన సంబంధించిన సమాచారాన్ని అందించాలని ప్రజలను, ప్రభుత్వ శాఖలను కోరింది. 622 మంది ప్రత్యేక సాక్షుల నుంచి ప్రశ్నావళి ద్వారా సమాచారాన్ని రాబట్టింది. సుమారు 40 ప్రభుత్వ శాఖలను పరిశీలించింది. ప్రభుత్వ ఆధిపత్యంలోని పదకొండు ముఖ్యసంస్థలలో అమలు చేస్తున్న రిజర్వేషన్ విధానాన్ని పరిశీలించండి. తమిళనాడు, మహారాష్ట్ర కర్నాటక రాష్ట్రాల్ని కూడా పరిశీలించి 1982 సెప్టెంబరు 25న ప్రభుత్వానికి నివేదిక సమర్పించింది.

షెడ్యూల్డ్, కులాలు, తెగలవారికి జనాభా నిష్పత్తి ఆధారంగా రిజర్వేషన్ సౌకర్యం కల్పిస్తున్నారు. దీనిని సుప్రీంకోర్టు కూడా బలపరిచింది. వెనుకబడిన తరగతులవారికి కూడా జనాభా నిష్పత్తి నిర్ధారణ చర్యలు చేపట్టింది. ఆ విషయంలో మండల్ కమీషన్

సూత్రాన్ని ఆదర్శంగా తీసుకుంది. జనాభా లెక్కలను కులాల ప్రాతిపదిక సేకరించకపోవడంవల్ల వెనుకబడిన తరగతుల జనాభా కులాల, తెగల జనాభాను తీసుకొని దానికి మత వర్గాలను కలిపి జనాభాలోవారు 29.09% అని నిర్ణయించింది. ఉన్నత కులాలవారు, బ్రాహ్మణులు, మరాఠీలు, రాజపుత్రులు, జాట్‌లు, వైశ్యులు కలిపి 17.58% ఉన్నారు. వీరిని జనాభాలో 18% గా గుర్తించి మొత్తం కలుపగా ( 18 + 29.09) 47.09% వీరిని 48%గా కమీషన్ పరిగణనలోనికి తీసుకుంది. ఈ మొత్తం 100% నుంచి తీసివేయగా మిగిలినవారు (100-48%) 52% వెనుకబడిన తరగతులుగా తేల్చింది. అదే నిష్పత్తిలో రిజర్వేషన్ కల్పించడంలో చట్టపరమైన ప్రతిబంధకాల దృష్ట్యా , ఉద్యోగ నియమకాలలో కొన్ని శాఖలలో అనుభవాల దృష్ట్యా సుమారు 8% ఓపెన్ లిస్టులో వీరు నియమితులు అవుతున్నట్లు కమీషన్ భావించి, అదిపోగా మొత్తం 44% రిజర్వేషన్ కల్పించాలని సూచించింది.

వెనుకబడిన తరగతుల నాయకులు ఏకసభ్య సంఘం నివేదిక అమలు విషయంలో ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చే ప్రయత్నంలో భాగంగా అన్ని కులాలను సంఘటిత పరచి ఒక వేదికపైకి తీసుకురావాలన్న ఉద్దేశ్యంతో తిరుపతిలో 1986 జూలైలో ఒక మహాసభను ఏర్పాటు చేశారు. ఇదే సందర్భంలో అప్పటి ముఖ్యమంత్రి మంత్రి వర్గ సభ్యులతో చర్చించి మురళీధరరావు కమిటీ నివేదికను కొద్ది మార్పులతో అమలు చేయాలని నిర్ణయించారు.

1986 జులై 5న పబ్లిక్ గార్డెన్‌లో జరిగిన పెద్ద బహిరంగ సభలో అప్పటి ముఖ్యమంత్రి ఎన్.టి. రామారావు 44% ప్రభుత్వ ఉద్యోగాలను, విద్యాసంస్థలలోని సీట్లను వెనుకబబడిన తరగతుల వారికి కేటాయిస్తున్నట్లు ప్రకటించారు. ఈ విధానం రూ. 12000 లోపు వార్షిక ఆదాయం ఉన్న కుటుంబాలకే వర్తిస్తుందనే కొత్త నిబంధనను విధించారు. రాబోయే గ్రామ పంచాయితీలలో, జిల్లా పరిషత్‌లలో, మున్సిపాలిటీలలో ఎన్నిక చేయబడే పోస్టలలో కూడా 20% సీట్లను కేటాయిస్తున్నట్లు ప్రకటించారు.

### 17.7 రిజర్వేషన్ వ్యతిరేక ఉద్యమం :

పెంచిన రిజర్వేషన్ల అమలు ఉత్తర్వును ప్రభుత్వం ఉపసంహరించుకోకపోతే ఆందోళన తప్పదని 'అగ్రకులాల' విద్యార్థులు హెచ్చరించారు. ప్రభుత్వం కొత్త రిజర్వేషన్ విధానాన్ని అమలు చేయటంతోపాటు రిజర్వేషన్ అమలు కాని వర్గాల సమస్యను పరిశీలిస్తామని ముఖ్యమంత్రి ప్రకటించారు. ఈ ప్రకటన విద్యార్థి వర్గాలను ప్రభావితం చేయలేకపోయింది. విద్యార్థులు ఉద్యమం ఒకటే మార్గం అని నిర్ణయించుకొని వివిధ విశ్వవిద్యాలయాలలో, వివిధ పేర్లతో ఉద్యమ సంఘాలను ఏర్పరచుకున్నారు. వీటన్నిటిని విలీనం చేస్తూ 1986 జులై 26న అనంతపురంలో నిర్ణయం తీసుకున్నారు. ఉద్యమం రాష్ట్రం నలుమూలలకు వ్యాప్తి చెందింది. ఈ సమయంలో ఇద్దరు ఇంజనీరింగ్ విద్యార్థులు ప్రభుత్వ ఉత్తర్వును సవాలు చేస్తూ హైకోర్టులరో పిటీషన్‌ను దాఖలు చేసారు. ప్రభుత్వ ఉత్తర్వులు తాత్కాలికంగా నిలుపుదలకు చేస్తూ హైకోర్టు విచారణను వాయిదా వేసింది.

ఉద్యమం అనుకోని మలుపు తిరగటంతో ప్రభుత్వం ప్రతిష్టకు పోయి విధానాన్ని వెనుకకు తీసుకోలేని పరిస్థితులలో రాష్ట్ర హైకోర్టు ప్రభుత్వ ఉత్తర్వు చెల్లదని తుది తీర్పును వెల్లడించింది. వెనుకబడిన తరగతు విద్యార్థులు ప్రభుత్వ విధానానికి మద్దతుగా సంఘాలు ఏర్పాటు చేసుకున్నప్పటికి ఈ నిర్ణయం రాజ్యాంగ విరుద్ధమని 1986, సెప్టెంబరు 5న కోర్టు తీర్పు చెప్పనది. ఈ తీర్పులోని ముఖ్యాంశాలు.

1. మురళీధరరావు కమీషన్ తన పరిధికి మించి సూచనలు చేసింది. ఇది విచారణ కమీషన్ చట్టం 1952కు విరుద్ధం.

2 వెనుకబడిన తగతుల జనాభా నిర్ధారణ (52%) ఏక పక్ష నిర్ణయంగాను, అసత్యంగాను, ఉన్నట్లు కోర్టు భావించింది. కోర్టు ముందున్న లెక్కల ప్రకారం వెనుకబడిన తరగతుల జనాభా 35.5% మాత్రమే.

3. బాలాజీ మరియు మైసూరు రాష్ట్ర ప్రభుత్వం కేసులో సుప్రీంకోర్టు తీర్పుకు అనుగుణంగా రిజర్వేషన్ మొత్తం 50%నికి మించరాదు. ప్రభుత్వ ఉత్తర్వు ఈ సూత్రానికి విరుద్ధంగా ఉంది.

4. ఆదాయ పరిమితి కోరదగినదే అయినప్పటికీ చట్టరీత్యా ఆమోదయోగ్యం కాదు.

5. కులం ఒక్కటే రిజర్వేషన్ విధానానికి ప్రాతిపదిక కాకూడదు. ఈ చర్య రాజ్యాంగంలోని 15 (1), 16 (2) ప్రకరణాలకు విరుద్ధం. పై తీర్పువల్ల అప్పటికే అమలు జరుగుతున్న ఆగస్ట్ 21, 1929 ఉత్తర్వు రద్దుకాదని హైకోర్టు పేర్కొంది.

ఈ తీర్పు మీద విద్యార్థి వర్గాలు ఆశ్చర్యం వ్యక్తం చేశాయి. ఒక వర్గం ప్రభుత్వం ఓటమి అంగీకరించి రాజీనామా చేయాలని కోరగా మరొక వర్గం సుప్రీంకోర్టుకు అప్పీలు చేయాలని కోరింది. ఇరు వర్గాల వారికి ప్రభుత్వం కొన్ని సదుపాయాలు కల్పించి వారిని శాంతింప చేసింది. ప్రస్తుతం 1990 సెప్టెంబర్ 23 వరకు ఇప్పుడు సదుపాయాలు వెనుకబడిన తరగతులవారికి అమలులో ఉంటాయి.

**17.8 మండల్ కమీషన్ :**

వెనుకబడిన తరగతుల అభివృద్ధి కోసం కేంద్ర ప్రభుత్వం నియమించిన మండల కమీషన్ సిఫార్సులను కూడా ఇక్కడ ప్రస్తావించడం అవసరం. కేంద్రంలో జనతా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత 1978, డిసెంబర్‌లో వెనుకబడిన తరగతుల అభివృద్ధికి ఒక కమీషన్ నియమించాలని భావించింది. తత్ఫలితంగా 1979, జనవరి 1న ఒక నోటీసును జారీచేస్తూ బి.పి మండల్ అధ్యక్షతన ఒక కమీషన్‌ను ఏర్పాటు చేసింది. కమీషన్ తన నివేదికను 1980 డిసెంబర్‌లో ప్రభుత్వానికి సమర్పించింది. కమీషన్ తన నివేదికలో ఈ క్రింది సిఫార్సులు చేసింది.

1. ప్రభుత్వ శాఖలలో ఏర్పడే ఖాళీలను 27% వెనుకబడిన తరగతులవారికి కేటాయించాలని (ఎస్.సి.కి, ఎస్. టి లకు ఇప్పుడు ఇస్తున్న రిజర్వేషన్ 22.5%. ఈ పరిధి నుంచి మినహాయించింది) వెనుకబడిన వారి జనాభా 52% ఉన్నప్పటికీ సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పులను దృష్టిలో ఉంచుకొని ఇలా ( ఈ రిజర్వేషన్‌ల మొత్తం 50% మింకూడదు. అనే నిబంధన) ఈ సిఫార్సు చేసింది.
2. ఓపెన్ మెరిట్ ప్రాతిపదికపై ఎంపికయ్యే వెనుకబడిన తరగతుల వారికి ఈ రిజర్వేషన్ విధానం కిందకు తీసుకొని రాకూడదు.
3. ప్రమోషన్ విషయంలో కూడా ఈ రిజర్వేషన్ అమలు చేయాలి.
4. భర్తీకాని ఖాళీల విషయంలో " క్యారీ ఫార్వర్డ్ " పద్ధతిని పాటించాలి.
5. ఎస్.సి., ఎస్.టి లకు ఖాళీల భర్తీ విషయంలో అమలు చేస్తున్న " రోస్టర్ " పద్ధతిని ప్రతికేటగిరి పోస్టులలో అమలు చేయాలి.
6. ఈ రిజర్వేషన్ విధానాన్ని కేంద్ర ప్రభుత్వం, రాష్ట్ర ప్రభుత్వ శాఖలలోను, కార్పొరేషన్‌లలోను ఏర్పడే ఖాళీలన్నింటికి వర్తింపచేయాలి.
7. ప్రభుత్వం నుండి ఆర్థిక సహాయం పొందుతున్న ప్రైవేట్ శాఖలలో ఏర్పడే ఖాళీల భర్తీ విషయంలో కూడా ఈ విషయాన్ని పాటించాలి.
8. అన్ని విశ్వ విద్యాలయాలలోను, అనుబంధ కళాశాలల్లోను ఈ విధానాన్ని అమలు చేయాలి
9. పై సూచనలను తగిన విధంగా అమలు చేయటానికి ప్రభుత్వం ఒక సమగ్ర చట్టాన్ని తీసుకురావాలి.

**17.8 దళిత ఉద్యమాలు :**

భారతదేశంలో నెలకొన్న వర్ణ వ్యవస్థ ఈ నాటిదికాదు. ఆరంభంలో అది కేవలం సామాజిక అవసరాల పరిపూర్తికోసం వృత్తి నైపుణ్యాన్ని పెంచటానికి ఏర్పడినప్పటికీ కాలక్రమంలో సంకుచితత్వం పెరిగి కొందరిని అంటరాని వారుగా వెలివేసి మరికొందరిని

శూద్రులంటూ చులకన భావంతో చూసి వారి సామాజిక హక్కులను హరించింది. చిట్టచివరికి దేశమే అన్యాక్రాంతం కావటానికి సంకుచిత కులతత్వం కారణమని కొందరు భావిస్తున్నారు.

స్వాతంత్ర్యానంతరం దళిత వర్గాల్లో సత్వర పురోభివృద్ధిని సాధించటానికి రాజ్యాంగ నిర్మాతలు సమానత్వంతోపాటు, ప్రత్యేక సౌకర్యాలు (రిజర్వేషన్లు) కల్పించారు. హరిజన, గిరిజన వర్గాల్లో అవి ఆశలు చిగురింపచేశాయి. వారిలో సాంస్కృతిక చైతన్యం, రాజకీయ జాగృతి, ఆర్థిక మెరుగుదల పట్ల ఆసక్తి కలిగించాయి. ఈ పరిస్థితి కొన్ని ఉద్యమాలకు దారితీయటమే కాకుండా భారతీయ సమాజంలో ఇంతవరకు తరుగులేని ఆధిపత్యం చెలాయించిన వర్గాల ఉన్నత కులాల ఈర్ష్యకు దారితీసి కొన్ని ప్రాంతాల్లో సంఘర్షణలను సృష్టించింది. ఆంధ్రప్రదేశ్‌లో కంచికచెర్ల, పదిరికుప్పం, కారంచేడు, నీరుకొండ, చుండూరు, సంఘటనలు ఈ కోవకు చెందినవే.

సవర్ణ సిందూ భూస్వాముల దౌర్జన్యకాండలో బలి అవుతున్న దళిత వర్గాలు తమ తమ హక్కులను, కాపాడుకోవటానికి సంఘటితం అవుతున్నాయి. స్వాతంత్ర్యం సిద్ధించి నాలుగు దశాబ్దాలు దాటినప్పటికీ పౌరులందరికీ సామాజిక, ఆర్థిక, రాజకీయ న్యాయం చేకూర్చటానికి అంతస్థులు అవకాశంతో సమానత్వం కల్పించటానికి రాజ్యాంగం రూపొంది అమలు అవుతున్నప్పటికీ ఆసేతు హిమాచలం అంతటా హరిజనులు, ఆదివాసులు, దోపిడీకి, హింసాకాండకూ అత్యాచారాలకు గురి అవుతూ ఉన్నారు. నేటికీ గ్రామీణ ప్రాంతాల్లో హరిజనులు, ఆదివాసులు సాంఘికంగా, ఆర్థికంగా బలహీనంగా ఉన్నారు. పల్లెల్లో అగ్రకులాలు పెత్తందార్లు సామాజికంగా ఆర్థికంగా వెనుకబడిఉన్న దళిత జనాన్ని అణచిపెట్టే ప్రయత్నాలను నిరోధించడానికి రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలు చిత్త శుద్ధితో ప్రయత్నం చేయటం లేదు. ఫలితంగా వెనుకబడిన వర్గాలు, దళితులు, ఆదివాసుల నిరసనోద్యమాలు ముమ్మరం అవుతున్నాయి.

దళితులపై జరుగుతున్న అత్యాచారాలను అందరూ ఖండించాలి. నేరస్థులను కఠినంగా శిక్షించాలని ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావాలి. ఏవోకొన్ని ఉపశమన చర్యలను అప్పటి కప్పుడు చేపట్టడం, విచారణ సంఘాన్ని నియమించటం, బాధితులకు పరిహారం చెల్లించటంతో సరిపోదు. కారంచేడు, చుండూరు దురంతాల గురించి ఇప్పటికీ న్యాయస్థానాల్లో విచారణ జరుగుతూనే ఉంది. అది ఇంకా ఒక దశాబ్దం కొనసాగినప్పటికీ ఆశ్చర్యపడనవసరంలేదు. ఈ కారణాలవల్లనే దళిత వర్గాల్లో చైతన్యం ఏర్పడి, వారు సంఘటితం అవుతున్నారు. ఆంధ్రప్రదేశ్ దళిత మహాసభ ఆధ్వర్యంలో దళితులు ఉద్యమిస్తున్నారు.

ఈనాడు సామ్యవాద రీతి సమసమాజం వర్ధిల్లుతున్నట్లుగాను, భూస్వామ్యం నశించినట్లుగాను అభిప్రాయ పడటానికి దళితులు సిద్ధంగా లేరు. భూస్వామ్య వ్యవస్థ అవశేషాలు ఇప్పటికీ చెక్కుచెదరకుండా కొనసాగుతుండటంవల్ల సామాజికంగా, ఆర్థికంగా దీనస్థితిలో ఉన్న దళితులు సంఘటితం అవుతున్నారు. రాజకీయ పక్షాలు తమ సంకుచిత దృక్పథం వదులుకోనంతకాలం దళితుల సమస్యపై సంఘటితమైన పోరాటం సాధ్యంకాదు. ఓటు బ్యాంకు రాజకీయ అసలు సమస్యను వెనుకకు నెడుతున్నాయి.

**17.10 విద్యార్థి - యువత ఉద్యమాలు :**

విద్యార్థులు లేవదీసిన ఉద్యమాలకు అనేక దేశాలలో ప్రభుత్వాలే తలక్రిందులైన దాఖలాలున్నాయి. అందుకే ఎక్కడైనా విద్యార్థులు పెద్ద ఎత్తున ఆందోళన చేస్తున్నారంటే ప్రభుత్వం గుండెలలో రైళ్ళు పరుగెట్టడం ప్రారంభిస్తాయి. కొన్ని సందర్భాలలో అత్యల్ప విషయాలు కూడా పెద్ద పెద్ద ఉద్యమాలకు ఆజ్యం పోస్తాయి.

మన దేశానికి స్వాతంత్ర్యం రాకపూర్వం విద్యార్థులు చిత్త శుద్ధితో బానిస వాద్యభ్యాసానికి స్వస్తిచెప్పి దేశ వ్యాప్తంగా పాఠశాలలను, కళాశాలలను బహిష్కరించి జాతీయోద్యమంలో పాల్గొన్నారు. ఈ స్వాతంత్ర్య సంగ్రామ మహాగ్ని గుండంలో ఎందరో విద్యార్థులు సమిధలై చివరకు స్వాతంత్ర్యాన్ని సంపాదించుకున్నారు.

ఈనాటి విద్యార్థులు విద్యావిధానం, పరీక్షలు, బోధనా పద్ధతులు, స్కూళ్లు, కాలేజీలలో వసతి కొరత, క్యాంపస్ హాస్టళ్ల వ్యవహారాలు, బస్సు సౌకర్యాలు తదితర సమస్యలు పరిష్కరించాలని కోరుతూ సమ్మె చేయటం రివాజైపోయింది. దాంతో పరిస్థితిని అదుపులో ఉంచేందుకు పోలీసులు రంగప్రవేశం చేయటం లాఠీచార్జీ, బాష్ప వాయువుల ప్రయోగం, కాల్పులు, అరెస్టులు, స్కూళ్లు కాలేజీల మూసివేత రాజకీయ నాయకుల జోక్యం వెంట వెంటనే జరిగి పోతాయి.

ప్రస్తుతం మనరాష్ట్రంలో వివిధ రాజకీయ పార్టీలకు చెందిన విద్యార్థి సంఘాలు అనేకం ఉన్నాయి. వేర్వేరు విద్యార్థి సంఘాలలోని విద్యార్థుల మధ్య ఘర్షణలు కూడా స్కూళ్ళు, కాలేజీల బహిష్కరణకు దారి తీస్తున్నాయి.

ఆంధ్రప్రదేశ్ అవతరించిన తరువాత 1967-72లో విశాఖ పట్టణంలో ఉక్కు కర్మాగారం స్థాపించాలని ఆందోళన చేశారు. 1968లో ఉస్మానియా విశ్వవిద్యాలయంలో స్వతంత్ర ప్రతిపత్తి కోసం - సమ్మె చేశారు. 1969లో ప్రత్యేక తెలంగాణా సాధనకు, 1972లో ప్రత్యేక ఆంధ్రరాష్ట్రం కోసం ఆందోళనలు జరిగాయి. వీటిలో ఉక్కు కర్మాగారం, విశ్వవిద్యాలయం స్వతంత్ర ప్రతిపత్తి విషయంలో ప్రభుత్వ ఉదాసీనతకు నిరసనగా విద్యార్థులు ఆందోళన చేశారు. మిగిలినవి తెలంగాణా, ఆంధ్ర విభేదాలు, నాయకులు వేసిన ఎత్తుగడలు, అప్పట్లో ప్రజలకు కలిగిన ముమానాలు కలిసి ఉద్యమాలకు దారి తీశాయి. ఇటువంటి ఉద్యమాల వల్లనే ఉక్కు కర్మాగారం దక్కినా మిగిలిన వాటివల్ల విద్యార్థులు ఒక విద్యా సంవత్సరం నష్టపోయారు. కొన్ని సందర్భాలలో రాజకీయ నాయకులు తమ పదవులను పదిలపరచుకునేందుకు అధికారంలో ఉండేందుకు తమను పావులుగా వాడుకున్నారని విద్యార్థులకు బోధపడింది.

ఇటీవల కాలంలో ప్రభుత్వం రిజర్వేషన్ల శాతం పెంచినందుకు నిరసనగా విద్యార్థులు చేసిన ఆందోళన చెప్పుకోదగ్గది. ఈ రిజర్వేషన్ల వ్యవహారం కులభేదం లేకుండా ఒకటిగా ఉన్న విద్యార్థిలో కాని రెండు వర్గాలుగా విభజించేంతగా తయారయ్యింది. పెద్దలతోపాటు విద్యార్థులలో కూడా కులభేదాలను, ఈర్ష్యద్వేషాలను సృష్టించింది. ఒక వర్గం రిజర్వేషన్ల శాతాన్ని పెంచటాన్ని ప్రతిభకు ఉరివేయటంగా చిత్రించి, ఆందోళనలు చేయగా, మరొక వర్గం బడుగు వర్గాల అభ్యున్నతికి పెంచిన రిజర్వేషన్లను అమలు పరచాలని ఆందోళనలను రేపింది. తమ తమ కోర్కెల సాధనకోసం రెండు వర్గాలు విద్యార్థులు, బంద్‌లు, ఘెరావ్, రాస్తారోకో, జైల్‌భరోలు నిర్వహించారు.

### 17.11 మహిళా సారా వ్యతిరేక ఉద్యమం :-

మద్యపాన నిషేధం గురించి ఇటీవల ఆంధ్రప్రదేశ్‌లో స్త్రీలు ఉద్యమం లేవదీశారు. సారా విక్రయాన్ని, వేలం పాటలను ప్రభుత్వం నిషేధించాలని వారు ఆందోళన చేశారు. " అక్షరజ్యోతి" పేరిట రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన వయోజన విద్యా కార్యక్రమం, సారా వ్యతిరేక ఉద్యమానికి నాంది పలకడం గణనీయ పరిణామం. విద్యాగంధంతో ప్రజలలో చైతన్యం పరిమళించగలదని నిరూపణ అయింది. " అక్షర జ్యోతి " కార్యక్రమం క్రింది ఓ పాఠ్యగ్రంథంలో, కూలీచేసి సంపాదించిన నాలుగు రాళ్లను సారాపై తగలేస్తున్న తన భర్తను చూపి స్థానిక మహిళల నందరినీ కూడాగట్టి, గ్రామంలోని సారాదుకాణాన్ని మూతవేయించిన ఓ సీతమ్మ కథ పాఠ్యాంశంగా ఉంది. ఈ పాఠం నుండి ఉత్తేజం పొందిన నెల్లూరు జిల్లా దూబగుంట గ్రామ మహిళలు సారా దుకాణాన్ని మూసివేయించారు. అనతి కాలంలోనే రాష్ట్రం నలుమూలలా ఎందరో సీతమ్మలు ఆవిర్భవించారు. ఫలితంగా రాష్ట్రంలో మద్యనిషేదం కోరుతూ ప్రదర్శనలు, సభలు, పికెటింగ్‌లు, సెమినార్‌లు, ధర్నాలు, పాదయాత్రలు, సరిహద్దులను దాటి ప్రపంచానికే మార్గదర్శకమైంది. సారా వ్యతిరేక ఉద్యమం విస్తరించిన కొద్దీ రాజకీయ పార్టీలు ఉద్యమానికి మద్దతు ఇచ్చాయి.

సారా వ్యతిరేక పోరాటాన్ని బాధ్యతగా తీసుకొన్నానని నిర్వహించిన " మద్యపాన వ్యతిరేకోద్యమ ఐక్య నివేదిక " మద్య రహిత సమాజ స్థాపన కోసం కృషి చేయాలని రాష్ట్ర ప్రజలకు పిలుపు నిచ్చింది. మద్యపాన వ్యతిరేకోద్యమ సంఘాల మహిళా ప్రతినిధులు - ప్రగతిశీల మహిళా సంఘంకు చెందిన వి. సంధ్య, ఆంధ్రప్రదేశ్ మహిళా సమాఖ్యకు చెందిన ఎస్. సుగుణ శేషమ్మ,

ఆంధ్రప్రదేశ్ మహిళా సంఘానికి చెందిన మల్లు స్వరాజ్యం, మోటూరి ఉదయం, మహిళా సాంస్కృతిక సంఘానికి చెందిన ప్రమీల ఆంధ్రప్రదేశ్ మద్యపాననిషేధ సమితి అధ్యక్షులు బి.సి హెచ్ రంగారెడ్డి మొదలగువారు ఉద్యమాన్ని నిడిపించారు.

మహిళల సారావ్యతిరేకోద్యమాన్ని ఒక క్రమంలో నడిపించటంలో, దీనికి ఒక జెండాను, ప్రజాభిప్రాయానిగైకొని ఏర్పాటు చేయటంలో ఒకే జెండా క్రింద ఈ ఉద్యమాన్ని శక్తి మంతంగా నడిపించటంతో విశేష ప్రచారం అందించటంలో " ఈనాడు " దిన పత్రిక సంపాదకులు ప్రధాన పాత్ర నిర్వహింఆరు. ఇదో సామాజికోద్యమం. మద్దతు నివ్వటం అందరి కర్తవ్యం. సారా వ్యతిరేకోద్యమాన్ని సామాజిక సర్వతో ముఖోభివృద్ధి కోసం జరుగుతున్న పోరాటంగా భావించి వావిలాల జిల్లాల వారీగా రాష్ట్రాన్ని సుడిగాలిలా చుట్టివచ్చి ఒక ఊపుతెచ్చారు.

" మా గ్రామానికి మత్తు పానీయాలు వద్దు " అంటూ రాష్ట్రంలో అనేక పంచాయితీలు పరంపరంగా ప్రభుత్వానికి తీర్మానాలు పంపాయి. వందల గ్రామాలు సారాను స్వచ్ఛందంగా బహిష్కరించాయి.

మద్యనిషేధంపై కేంద్ర ప్రభుత్వం 1963లోనే టేక్‌చంద్ కమిటీని నియమించింది. పాలన యంత్రాగాన్ని పటిష్ఠంచేసి, నిషేధాన్ని సక్రమంగా అమలు పరచటం, దొంగసారాను అరికట్టడం, ప్రత్యామ్నాయ వనరులను ఏర్పాటు ఏసుకోవటం, తదితర విషయాలను కమిటి కూలంకషంగా పరిశీలించి ఎన్నో విలువైన సిఫార్సులు చేసింది. మద్యనిషేదంలో అధికారులు నిర్వహించగల పాత్రపై సుస్పష్టమైన సూచనలు చేసింది. పాలన యంత్రాంగం దృఢ చిత్తంతో వ్యవహరిస్తే మద్య నిషేధాన్ని అమలు పరచటం అసాధ్యం కాదని తేటతెల్లం చేసింది. చట్టాన్ని ఉల్లంఘించిన వారిని ఎన్నికల్లో పోటీకి అనర్హులుగా ప్రకటించాలని ప్రభుత్వానికి విన్నవించుకుంది. సదరు వ్యక్తి అప్పటికీ పదవిలో ఉంటే, దాన్ని వదులుకోవాలని ప్రజలకు విశదపర్చాలని, అందుకొక జాతీయ విధానం చేపట్టాలని కూడా సభ్యులు సలహాఇచ్చారు. నివేదికను ప్రభుత్వం ఆనవాయితీ తప్పకుండా అటకెక్కించింది.

స్వాతంత్ర్యానికి ముందు 1939లో మద్రాస్‌లో రాజాజీ ప్రభుత్వం ఏర్పడినపుడు చిత్తూరు, సేలం జిల్లాల్లో మద్యనిషేదం విధించారు. స్వాతంత్ర్యం వచ్చాక రాష్ట్ర ప్రభుత్వం మద్యనిషేదం విధించి 1969 దాకా అమలు చేసింది. అయితే దొంగసారా వ్యాపారం ప్రబలడం ఇత్యాది కారణాల వల్ల అనివార్య పరిస్థితుల్లో 1969లో నిషేధాన్ని ఎత్తివేశారు. ఇప్పటికీ గుజరాత్‌లో పూర్తి నిషేదం, తమిళనాడులో పాక్షిక నిషేదం ఉంది.

ఏప్రిల్ 15, 1993న రాష్ట్ర ముఖ్యమంత్రి కోట్ల విజయ భాస్కరరెడ్డి ఆ ఏడాది అక్టోబర్ 1వ తేదీ నుంచి సారాను పూర్తిగా నిషేధిస్తున్నట్లు ప్రకటించారు. నెల్లూరు జిల్లాలో తక్షణమే సారాను నిషేధిస్తున్నట్లు తెలిపారు. తమ ప్రభుత్వ అంతిమ లక్ష్యం సంపూర్ణ మద్యపాన నిషేదమేనని స్పష్టం చేశారు. ఈ లక్ష్య సాధనలో భాగంగా దేశంలో తయారయ్యే విదేశీ మద్యం (ఐ.ఎం.ఎఫ్.ఐ). పంపిణీ టోకు వ్యాపారాన్ని ప్రభుత్వం స్వాధీనం చేసుకుంటుందని ముఖ్యమంత్రి వెల్లడించారు.

**17.12 సారాంశం :**

నిరసన ఉద్యమాలలో సాధారణంగా మనకు కనిపించేది సామూహిక చర్య. ఈ సామూహిక చర్య కొంతకాలం కొనసాగినట్లయితే అది ఉద్యమరూపం ధరిస్తుంది. ఈ సామూహిక చర్య ప్రక్రియా పరంగా వ్యవస్థాపితం కాకపోవచ్చు. కాని అది జనసామాన్యంలో ఆసక్తిని, జాగృతిని కలిగించేటట్లు ఉండాలి. భావనాపరంగా ఆలోచిస్తే, నిరసన ఉద్యమం మార్పుకోసం, ప్రస్తుత వ్యవస్థ కొంతవరకూ మార్పును తీసుకురావడానికి లేదా పూర్తి మార్పును తీసుకురావటానికి జరిగే ప్రయత్నమని చెప్పవచ్చు.

ఎమ్.ఎస్. ఎ. రావు అభిప్రాయంలో " సాంఘిక మార్పులు ఉద్యమంలో ఒక భాగంలో వచ్చినవి. అటు తర్వాత అవి సమాజంపై కలిగించే ప్రభావం మనం గమనించాలి". రైతాంగ మరియు నిరసన ఉద్యమాల అధ్యయనంలో ముఖ్యంగా గమనించవలసినవి : 1. అవి ఎట్లా ప్రారంభమైనాయి. 2. వాటి నిర్మాణాత్మక పరిస్థితులు, 3. ఏ ఆశయాలు, లక్ష్యాలు వాటిని పోత్సహించాలి. 4. వాటిని ప్రారంభించటానికి దారి తీసిన పరిస్థితులు మరియు నిరసన ఉద్యమాలు సమాజంపై కలిగించే ప్రభావము.

రైతు పోరాటాలు ఆంధ్రప్రదేశ్‌లో 18వ శతాబ్దంలోనే మొదలయ్యాయి. కాని ఆంధ్ర రైతాంగం 1920-21లో జరిగిన మహాత్మాగాంధీ సహాయనిరాకరణోద్యమంలో చేరడంతో జాతీయోద్యమంలో భాగంగా పరిగణ పొందింది. ఈమలుపుతో రైతాంగంలో రాజకీయ చైతన్యం కలిగిందని చెప్పుకోవచ్చు. 1923 నాటికల్లా గుంటూరు, కృష్ణ ఉభయ గోదావరుల్లో రైతు సంఘాలు ఏర్పడ్డాయి. అయితే 1928లో రాష్ట్రరైతు సంఘానికి పునాది వేయబడింది. రైతు సంఘం సభ్యులు జమీందారీ దోపిడీలకు వ్యతిరేకంగా పోరాటాలు సాగించారు. స్వాతంత్ర్యానంతరం రైతులలో రాజకీయ చైతన్యం పెరగటం వలన రైతాంగ ఉద్యమాల తీవ్రత, చురుకుతనం పెరిగాయి.

ఆంధ్రప్రదేశ్‌లో ఎన్నో నిరసనోద్యమాలు జరిగాయి, జరుగుచున్నాయి. కొన్ని సందర్భాల్లో ప్రభుత్వం తాత్కాలిక ఉపశమనాన్ని కల్పించగా అనేక సందర్భాలలో పరిష్కారాలు సాధ్యం కాలేదు. ప్రభుత్వం ప్రజా సంస్థల బాధ్యతను పరిష్టంగా అమలు పరచడానికి అవసరమైన జాగృతి ప్రజల్లో ఉన్నంతకాలం ఈ నిరసనోద్యమాలు జరుగుతునే ఉంటాయి. పాలక వర్గ స్పందనను బట్టి అవి సామాన్యంగా, తీవ్రంగా రూపాంతరము చెందుతాయి. ప్రభుత్వపు అనాలోచిత, పాక్షిక ప్రయోజన హ్రస్వదృష్టితో కూడిన చర్యలు నిరసనోద్యమాలకు నాంది పలుకుతాయి.

### 17.13 మాదిరి ప్రశ్నలు :

**వ్యాస రూప ప్రశ్నలు**

1. ఆంధ్రప్రదేశ్‌లో జరిగిన రైతు ఉద్యమాలను విశ్లేషించండి.
2. నిరసనోద్యమాల వ్యాప్తికి గల కారణాలను పరిశీలించండి.
3. వెనుకబడిన తరగతుల ఉద్యమాల వ్యాప్తికి దోహదం చేసిన అంశాలను చర్చించండి.
4. ఆంధ్రప్రదేశ్‌లో జరిగిన వామపక్ష రైతాంగ ఉద్యమాలను వివరించండి.

**లఘు ప్రశ్నలు**

1. విశాఖ స్టీల్ ప్లాంట్ ఉద్యమాలు
2. మండల్ కమీషన్
3. సారా వ్యతిరేక ఉద్యమము
4. దళిత ఉద్యమాలు

### 17.14 చదువదగిన గ్రంథాలు :

1. ఎస్. చౌదరి : భారతదేశంలో రైతాంగ ఉద్యమాలు
2. దాస్ & అరవింద్ : రైతుల అశాంతి - సామాజిక ఆర్థిక మార్పు
3. ఎ. ఆర్ దేశాయ్ : భారతదేశంలో రైతు పోరాటాలు
4. లేసిక్ : భారతదేశంలో నిరసనోద్యమాలు
5. ఆర్. మహేంద్ర రెడ్డి : ఆంధ్రప్రదేశ్‌లో నిరసనోద్యమాలు

డా. కె. రామచంద్ర మూర్తి

**(DAPOL 32)**

# B.A. DEGREE EXAMINATION, MAY 2011.

(Examination at the end of Final Year)

Part II — Political Science

Paper IV — GOVERNMENT AND POLITICS OF ANDHRA PRADESH

Time : Three hours

Maximum : 100 marks

## SECTION A — (2 × 15 = 30 marks)

Answer any TWO of the following.

1. Write an essay on Panchayati Raj system in Andhra Pradesh.

   ఆంధ్రప్రదేశ్ రాష్ట్రములోని పంచాయితీ రాజ్ వ్యవస్థపై ఒక వ్యాసం వ్రాయుము.

2. Discuss the factors that led to the formation of the state of Andhra Pradesh.

   ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఆవిర్భావానికి దారితీసిన పరిస్థితులను గూర్చి చర్చించుము.

3. Discuss the position of a Governor.

   రాష్ట్ర గవర్నరు యొక్క స్థానమును గూర్చి చర్చించుము.

4. Explain the charging role of legislature.

   మారుతున్న శాసనసభ యొక్క పాత్రను గూర్చి విశ్లేషించుము.

5. Examine the functions and powers of the Chief Minister.

   ముఖ్యమంత్రి అధికారములను, విధులను పరిశీలించుము.

## SECTION B — (3 × 10 = 30 marks)

Answer any THREE of the following.

6. Discuss the cau[illegible] the outbreak of JAI Andhra Agitation.

   జై ఆంధ్ర ఉద్యమానికి గల కారణాలను చర్చించుము.

7. Discuss the tribal movements in Andhra Pradesh.

   ఆంధ్రప్రదేశ్‌లో గిరిజన ఉద్యమాలను గూర్చి చర్చించుము.

8. Write about the structure and functions of Highcourt in Andhra Pradesh.

   ఆంధ్రప్రదేశ్‌లో హైకోర్టు నిర్మాణము మరియు విధులను గూర్చి వ్రాయుము.

9. Discuss the role of pressure groups in the formulation of public policy.

   ప్రభుత్వ విధానాల రూపకల్పనలో 'ప్రభావ వర్గాల' పాత్రను గూర్చి చర్చించుము.

10. Describe the committee system in state legislature.

రాష్ట్ర శాసనసభలో కమిటీ విధానము గూర్చి వివరించుము.

11. Describe the Telangana movement in state politics.

రాష్ట్ర రాజకీయాలలో తెలంగాణా ఉద్యమము గూర్చి వివరించుము.

12. Describe about the voting behaviour in State Politics.

రాష్ట్రరాజకీయాలలో 'ఓటింగ్ ప్రవర్తన' ను గూర్చి విశదీకరించుము.

SECTION C — (3 × 5 = 15 marks)

Answer any THREE of the following.

13. (a) Rajiv Pallebata.

రాజీవ్ పల్లెబాట.

(b) Mandal system.

మండల వ్యవస్థ.

(c) Peasants movements in Andhra Pradesh.

ఆంధ్రప్రదేశ్‌లోని కృషక ఉద్యమములు.

(d) Regional parties.

ప్రాంతీయ పార్టీలు.

(e) Lokayukta.

లోకాయుక్త.

(f) Sarkaria commission.

సర్కారియా కమీషన్.

(g) Gentlemen's Agreement.

పెద్దమనుష్యుల ఒప్పందము.

SECTION D — (25 marks)

14. (a) Answer the following in 1 or 2 sentences : (10 × 2 = 20)

(i) Lok adalat.

లోక్ అదాలత్.

(ii) Habeas corpus.

బందీ ప్రత్యక్ష.

(iii) Article 356.

356 వ అధికరణ.

(iv) Elections.

ఎన్నికలు.

(v) Opposition parties.

ప్రతిపక్ష పార్టీలు.

(vi) Telangana Rashtriya Samithi.

తెలంగాణా రాష్ట్రీయ సమితి.

(vii) Question hour.

ప్రశ్నోత్తరాల సమయము.

(viii) Sri Potti Sreeramulu.

శ్రీ పొట్టి శ్రీరాములు.

(ix) State Legislature.

రాష్ట్ర శాసనసభ.

(x) Founder of Telugu Desam Party.

తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపకుడు.

(b) Answer the following in 1 or 2 words : (5 × 1 = 5)

(i) The date and year of the formation of Andhra Pradesh.

ఆంధ్రప్రదేశ్ అవతరించిన తేదీ మరియు సంవత్సరము.

(ii) Sri Pucchalapalli Sundarayya.

శ్రీ పుచ్చలపల్లి సుందరయ్య.

(iii) The first Governor of Andhra Pradesh.

ఆంధ్రప్రదేశ్ మొదటి గవర్నరు.

(iv) The present Chief Minister of Andhra Pradesh.

ఆంధ్రప్రదేశ్ ప్రస్తుత ముఖ్యమంత్రి.

(v) The first legislative state in India.

భారతదేశంలో మొదటి భాషా ప్రయుక్త రాష్ట్రము.

(DAPOL 32)

B.A. DEGREE EXAMINATION, DECEMBER 2010.

(Examination at the end of Final Year)

Part II — Political Science

Paper IV — GOVERNMENT AND POLITICS OF ANDHRA PRADESH

Time : Three hours | Maximum : 100 marks

SECTION A — (2 × 15 = 30 marks)

Answer any TWO of the following.

1. Write an essay on politics of subsidy in Andhra Pradesh.
   ఆంధ్రప్రదేశ్‌లోని సబ్సిడి రాజకీయాలపై ఒక వ్యాసం వ్రాయుము.

2. Critically analyse the role of left parties in Andhra Pradesh.
   ఆంధ్రప్రదేశ్‌లో వామ పక్షాల పాత్రను విశ్లేషించుము.

3. Examine the factors that were responsible for the formation of Andhra Pradesh.
   ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం ఏర్పాటుకు దారితీసిన అంశాలను పరిశీలింపుము.

4. Describe the powers and functions of chief minister.
   ముఖ్యమంత్రి అధికారాలు, విధులను వర్ణింపుము.

5. Assess the working of Panchayati Raj system in Andhra Pradesh.
   ఆంధ్రప్రదేశ్‌లో పంచాయతీ రాజ్ వ్యవస్థ పనితీరును మదింపుచేయుము.

SECTION B — (3 × 10 = 30 marks)

Answer any THREE of the following.

6. Analyse the role of Governor in State Politics.
   రాష్ట్ర రాజకీయాలలో గవర్నరు పాత్రను విశ్లేషించుము.

7. Examine the powers and functions of High Court.
   హైకోర్టు యొక్క అధికారాలు, విధులను పరిశీలింపుము.

8. Write a note on peasant movements in Andhra Pradesh.
   ఆంధ్రప్రదేశ్‌లో రైతాంగ ఉద్యమాలపై ఒక నోటు వ్రాయుము.

9. Examine the socio-economic framework of Andhra Pradesh.
   ఆంధ్రప్రదేశ్‌లోని సాంఘిక-ఆర్థిక పరిస్థితులను పరిశీలింపుము.

10. Discuss the nature of regional politics in Andhra Pradesh.

ఆంధ్రప్రదేశ్‌లోని ప్రాంతీయ రాజకీయాల స్వభావాన్ని చర్చించుము.

11. Analyse the influence of pressure groups on state Government of Andhra Pradesh.

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రప్రభుత్వంపై ఒత్తిడి వర్గాల ప్రభావాన్ని విశ్లేషించుము.

12. Explain the purpose of Legislative committees.

శాసనసభ కమిటీల ప్రయోజనాలను వివరింపుము.

SECTION C — (3 × 5 = 15 marks)

Answer any THREE of the following.

13. (a) Sri Bagh Pact.

శ్రీ బాగ్ ఒప్పందం.

(b) Dhar Commission.

ధార్ కమీషను.

(c) Tribal movement.

గిరిజన ఉద్యమాలు.

(d) Council of ministers.

మంత్రి మండలి.

(e) National political parties.

జాతీయ రాజకీయ పార్టీలు.

(f) Separate Telangana movement.

ప్రత్యేక తెలంగాణా ఉద్యమం.

(g) Elections.

ఎన్నికలు.

SECTION D — (25 marks)

14. (a) Answer the following in 1 or 2 sentences : (10 × 2 = 20)

(i) Caste politics.

కుల రాజకీయాలు.

(ii) Faction politics.

ముఠా రాజకీయాలు.

(iii) Speaker.

స్పీకరు.

(iv) Jai Andhra Agitation.

జై ఆంధ్ర ఉద్యమం.

(v) Regional parties.

ప్రాంతీయ పార్టీలు.

(vi) Zilla Parishad.

జిల్లా పరిషత్తు.

(vii) Telangana Rashtra Samithi.

తెలంగాణా రాష్ట్ర సమితి.

(viii) Andhra Kesari.

ఆంధ్ర కేసరి.

(ix) District Collector.

జిల్లా కలెక్టరు.

(x) President Rule.

రాష్ట్రపతి పాలన.

(b) Answer the following in 1 or 2 sentences : (5 × 1 = 5)

(i) When was the Panchayati Raj System? Introduced in Andhra Pradesh.

ఆంధ్రప్రదేశ్‌లో పంచాయితీరాజ్ వ్యవస్థ ఎప్పుడు ప్రారంభించబడింది?

(ii) Who is the president of Telugu Desam Party?

తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు ఎవరు?

(iii) Who is Damodaram Sanjeevaiah?

దామోదరం సంజీవయ్య ఎవరు?

(iv) Who is the Governor of Andhra Pradesh?

ఆంధ్రప్రదేశ్ గవర్నరు ఎవరు?

(v) For which agitation the Mulki rules were responsible?

ఏ ఉద్యమానికి ముల్కీ నిబంధనలు కారణమైనవి?

(కత్తిరించి పంపవలెను)

## అధ్యాపకుల, విద్యార్థుల సలహాలు, సూచనలు :

అధ్యాపకులు, విద్యార్థులు ఈ స్టడీ మెటీరియల్‌కు సంబంధించిన సలహాలు, సూచనలు, ముద్రణ దోషాలు తెలియపరచినచో పునర్ముద్రణలో తగు చర్యలు తీసుకొనగలము. తెలియపరచవలసిన చిరునామా : **డిప్యూటీ డైరెక్టర్, దూరవిద్యా కేంద్రం, ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం, నాగార్జున నగర్ – 522 510.**

| Course | Year | Paper No. & Title |
|---|---|---|
| B.A. | IIIrd Year | Paper - IV C. : Government and Politics of Andhra Pradesh |

(కత్తిరించి పంపవలెను)

(కత్తిరించి పంపవలెను)